# పోతనామాత్య విరచిత భాగవత దశమస్కంధ పూర్వభాగం - శ్రీ కృష్ణలీలా తరంగిణీ - తులనాత్మక పరిశీలన

(Pothanaamaatya Virachita Bhagavata Dasamaskandha Purva Bhagam - Sri Krishna Leela Tarangini - Tulanatmaka Parisilana)


పరిశోధకుడు

**భమిడిపాటి శ్రీరామ సుబ్రహ్మణ్యం,** ఎం.ఎ. (సంస్కృతం), ఎం.ఎ. (తెలుగు)

పర్యవేక్షకులు :

**ఆచార్య మన్నవ సత్యనారాయణ**

విశ్రాంతాచార్యులు

తెలుగు & ప్రాచ్యభాషా విభాగం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం


**పిహెచ్.డి. పట్టం కోసం తెలుగు ప్రాచ్య భాషా విభాగం ద్వారా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం**


**జనవరి 2015**

# వాఙ్మూలము

"పోతనామాత్య విరచిత భాగవత దశమస్కంధ పూర్వభాగం - శ్రీ కృష్ణలీలా తరంగిణీ - తులనాత్మక పరిశీలన" అనే ఈ సిద్ధాంత వ్యాసం నేను స్వయంగా వ్రాశానని, దీనిని ఏ ఇతర పట్టం కొరకు గాని, డిప్లొమా కొరకు గాని మరియు ఇతర బిరుదులు కొరకు ఇంతకు ముందు ఏ విశ్వవిద్యాలయానికి గాని, ఏ ఇతర సంస్థలకు గాని సమర్పించి ఉండలేదని ఇందుమూలంగా తెలియజేస్తున్నాను.

**భమిడిపాటి శ్రీరామ సుబ్రహ్మణ్యం**
పరిశోధకుడు

# ధ్రువీకరణ

ఈ సిద్ధాంత వ్యాసం శ్రీ భమిడిపాటి శ్రీరామ సుబ్రహ్మణ్యం నా పర్యవేక్షణలో రచించాడని, ఈ పరిశోధన అతని స్వయంకృషి అని ధ్రువీకరిస్తున్నాను.

**ఆచార్య మన్నవ సత్యనారాయణ**
పర్యవేక్షకులు



# కృష్ణం వందే జగద్గురుమ్

# కృతజ్ఞతలు

నాకు చిన్నతనం నుండి సంగీత సాహిత్యాల పట్ల ఏదో తెలియని అభిమానం. కాలం అనుకూలించి గుంటూరు కె.వి.కె. సంస్కృత కళాశాలలో బి.ఎ.ఓ.ఎల్. పూర్తి చేశాను. తరువాత ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూరవిద్యాకేంద్రం ద్వారా తెలుగు భాషా సాహిత్యాలు ప్రధానంగా యం.ఎ. తెలుగు కోర్సును పూర్తిచేశాను. ఇంతటితో సాహిత్యంపట్ల నాకున్న మక్కువ తీరలేదు. ఏదో తపన ప్రారంభమయింది. సమయానికి నా సహాధ్యాయి చుండూరు పవన్ కుమార్ తాను సంస్కృతంలో పిహెచ్.డి. చేస్తున్నట్లు, నన్నుకూడా పిహెచ్.డి. డిగ్రీ కొరకు పరిశోధన చేయమని సలహా ఇచ్చాడు. ఏలూరులోని డా॥ మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణగారు నాకెంతో ఆప్తులు. వారు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు & ప్రాచ్య భాషా విభాగంలో పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీ పొందినట్లు చెప్పి నన్ను కూడా అదే దిశలో కృషిచేయవలసినదిగా ప్రోత్సహించారు. దీనితో నాలోని తపనకు ఒక మార్గం దొరికినట్లు అనిపించింది. డా॥ యం.వి.ఎస్. సత్యనారాయణ గారు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం తెలుగు & ప్రాచ్య భాషా విభాగంలో ఆచార్య మన్నవ సత్యనారాయణగారు ఉన్నట్లు, తమకు వారే పర్యవేక్షకులుగా వ్యవహరించినట్లు నాతో చెప్పారు. అవసరమైతే మిమ్మల్ని ఒకసారి వారికి పరిచయం చేస్తానని చెప్పారు. దానితో నేను పిహెచ్.డి. డిగ్రీ కొరకు పరిశోధనార్థం విశ్వ విద్యాలయానికి దరఖాస్తు చేయడం, నాకు సీటు రావడం ఇలా నా పరిశోధనకు అంకురారోపణ జరిగింది.

నాకు పరిశోధనచేసే అవకాశాన్ని కలిగించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధికారులకు నా ధన్యవాదాలు. నాకు పిహెచ్.డి. చేయమని సలహా ఇచ్చిన మిత్రుడు చుండూరు పవన్ కుమార్‌కు, నా పరిశోధనకు పర్యవేక్షకుని సూచించి, నా పరిశోధన కొనసాగడానికి మార్గాన్ని సుగమం చేసి నాకు అండదండలుగా నిలిచిన డా॥ యం.వి.ఎస్. సత్యనారాయణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

నాకు పరిశోధనాంశాన్ని సూచించి, నా పరిశోధన ఏ విధమైన ఒడిదుడుకులు లేకుండా సాఫీగా కొనసాగడానికి, సకాలంలో పరిశోధనను పూర్తి చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించడానికి, సహకరించిన నా పర్యవేక్షకులు శ్రీ ఆచార్య మన్నవ సత్యనారాయణ గారికి ధన్యవాదాలు. సలహాకొరకు గురువు గారి వద్దకు వెళ్ళినప్పుడు నాయందు మంచి ప్రేమానురాగాలు పంచిన మా గురువుగారి తల్లిగారు శ్రీమతి జయమ్మ గారికి నా ప్రత్యేక నమస్కారములు.

అదేవిధంగా నాకు సహకరించిన తెలుగు & ప్రాచ్యభాషా విభాగంలోని ఆచార్యులు ఆచార్య పి. వరప్రసాదమూర్తి గారికి, ఆచార్య జి.వై. ప్రభావతీ దేవిగారికి, ఆచార్య కె. సత్యనారాయణ గారికి, డా॥ ఎన్.వి. కృష్ణారావు గారికి మరియు శాఖా సమన్వయ కర్త అయిన డా॥ ఇ. మాధవి గారికి నా కృతజ్ఞతలు.

నా బాల్యం నుండి విద్యపట్ల నాకు ఆసక్తి కలగడానికి, నాకు విద్యాబుద్ధులు నేర్పి, నేను విద్యారంగంలో చురుకుగా ముందుకు సాగడానికి వాత్సల్య పూరిత సహకారాన్ని అందించిన మా తొలి గురువులు హరి అన్నయ శాస్త్రి గారికి నా సవినయ నమః కుసుమాలు.

నాకు సంగీతాన్ని నేర్పి, నన్ను ఆ కళలో ప్రోత్సాహించిన సహృదయులు, సాధుజీవి, మాన్యులు నల్లపాటి కుటుంబరావు గురువుగారికి నా పాదాభివందనాలు.

నా పరిశోధనకు సంబంధించిన విషయ సేకరణలోను, విషయ వివరణలోను నాకు అండగా నిలిచి, ఎంతో సహనంతో సహకరించి, నా పరిశోధన కొనసాగడానికి ప్రధాన కారకులైన మాన్యులు భారతం శ్రీమన్నారాయణ గారికి ప్రత్యేక కృతజ్ఞతాంజలులు.

ప్రజా బాహుళ్యంలోకి పోతన పద్యాలు, తీర్థుల తరంగాలు చొచ్చుకు వెళ్ళడానికి కారకులైన మల్లాది సూరిబాబుగారు, వారి కుమారులు శ్రీరాం ప్రసాద్, రవి కుమార్ గార్లకు, పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మగారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. వీరు పోతన పద్యాలు, తీర్థుల తరంగాల ప్రత్యేకను, అవి ప్రజాబాహుళ్యంలోనికి చొచ్చుకొని వెళ్ళడానికి గల కారణాలను నాకు సోదాహరణంగా వివరించారు. ఈ విషయమై వీరితో నేను ముఖాముఖి నిర్వహించాను.

నాకు పరిశోధనలో సహకరించిన డా॥ ముళ్ళపూడి జయసీతారామ శాస్త్రిగారికి, డా॥ దోర్భల ప్రభాకరశర్మ గారికి, డా॥ ధూళిపాళ రామకృష్ణ గారికి, యం.ఎస్.కె. కుమార్ గారికి, బండారు పుల్లారావు గారికి, వి. సూరపరాజు గారికి నా ధన్యవాదాలు.

నేను మా పర్యవేక్షకులను కలవడానికి ఎప్పుడు వెళ్ళాలన్నా తన విలువైన సమయాన్ని వెచ్చించి, నన్ను తన వాహనంపై తీసుకొనివెళ్ళి నాతోపాటే ఉండి నాకు బహిఃప్రాణంగా సహకరించిన ఆత్మీయ మిత్రుడు చెన్నా వెంకట కృష్ణ ప్రసాద్‌కు నా హార్దిక ధన్యవాదాలు.

నా జన్మకారకులైన తల్లిదండ్రులు నాంచారమ్మ, సీతారామశాస్త్రి గార్లకు, నన్ను వెన్నంటి ప్రోత్సహిస్తున్న నా సోదరుడు సూర్యనారాయణ మూర్తికి, నా పురోభివృద్ధికి అహర్నిశలు పాటుపడిన నా మాతామహి బాల సౌభాగ్యమ్మకు నా భక్తి పూర్వక నమస్సులు.

నా సిద్ధాంత వ్యాసాన్ని డి.టి.పి. చేసి చక్కగా సకాలంలో నాకందచేసి సహకరించిన శ్రీమతి సరితకు, జయశ్రీ గ్రాఫిక్స్ అధినేత, మిత్రుడు రూపేష్‌కు నా కృతజ్ఞతలు.

ఈ పిహెచ్.డి. పరిశోధనకు సహకరించిన గౌతమీ గ్రంథాలయం, రాజమండ్రి, సెంట్రల్ లైబ్రరరీ, తిరుపతి వారికి నా కృతజ్ఞతలు. అట్లే డా॥ యం.వి.ఎస్. సత్యనారాయణగారి ఇంట్లో పుస్తకశాల మరియు యం.ఎస్.కె. కుమార్ గారి పుస్తకశాలలోని గ్రంథాలు వినియోగించుకోవడానికి సహకరించినందుకు వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఇంకా నా పరిశోధనకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరికి పేరు పేరునా నా ధన్యవాదాలు. పైన ప్రస్తావించిన వారందరి సహాయ సహకారాలను నేను ఎన్నటికీ మరువలేను.

# విషయసూచిక

## మొదటి ప్రకరణము

పేజీలు

### ఋషిత్రయము


| | | |
|---|---|---|
| 1.1) | ప్రస్తావన | 1-2 |
| 1.2) | కృష్ణం వందే జగద్గురుమ్ | 2-4 |
| 1.3) | వ్యాస మహర్షి | 4-12 |
| 1.4) | పోతనామాత్యుడు | 12-21 |
| 1.5) | నారాయణ తీర్థులు | 21-32 |


## రెండవ ప్రకరణము

### కథాసారాంశం


| | | |
|---|---|---|
| 2.1) | శ్రీ కృష్ణావిర్భావ ఘట్టము | 33-39 |
| 2.2) | పూతన, శకటాసుర, తృణావర్తుల సంహారము | 40-42 |
| 2.3) | నామకరణం | 42-43 |
| 2.4) | గోపికలు కృష్ణుని దుడుకు చేతలను గూర్చి యశోదకు చెప్పుట | 43-46 |
| 2.5) | మృద్భక్షణ - విశ్వరూపం | 46-47 |
| 2.6) | యమలార్జున భంజనం | 47-49 |
| 2.7) | అఘాసుర వృత్తాంతం | 49-51 |
| 2.8) | బ్రహ్మ గోవత్సములు, గోపబాలకులను అంతర్ధానం చేయుట | 51-53 |
| 2.9) | ధేనుకాసుర వధ | 54-55 |
| 2.10) | కాళియ మర్దనం | 56-58 |
| 2.11) | కృష్ణుడు దావాగ్నిని మ్రింగి గో, గోపాలకులను కాపాడుట | 58-60 |
| 2.12) | ముని భార్యలు అన్నము తీసుకుని శ్రీకృష్ణుని వద్దకు వచ్చుట | 60-63 |
| 2.13) | గోవర్ధన గిరిధారి | 63-67 |
| 2.14) | శారదరాత్రి గానమొనర్చు కృష్ణుని వద్దకు గోపికలు వచ్చుట | 67-72 |
| 2.15) | గోపికా గీతాలు | 72-78 |
| 2.16) | రాసక్రీడ | 79-86 |
| 2.17) | శ్రీకృష్ణ అదృశ్యం, గోపికా విలాపములు, కృష్ణ దర్శనం | 87-95 |
| 2.18) | అక్రూరుడు | 95-104 |
| 2.19) | శ్రీకృష్ణుడు రజకుని సంహరించి, సాలివానిని, సుదాముని అనుగ్రహించుట | 104-107 |
| 2.20) | శ్రీ కృష్ణుడు కుబ్జను సౌందర్యవతి గావించుట | 107-110 |
| 2.21) | ధనుర్భంగము, కువలయాపీడ, చాణూర, ముష్టికుల హననము | 110-111 |
| 2.22) | కంస వధ | 112-113 |
| 2.23) | కృష్ణుడు ఉద్ధవుని గోపకాంతల చెంతకు పంపుట | 113-121 |

2.24) సాందీపని వృత్తాంతం 121-123
2.25) జరాసంధ, కాలయవనుల వృత్తాంతం, ముచకుంద స్తుతి 123-126
2.26) రుక్మిణీ కల్యాణం 126-134


## మూడవ ప్రకరణము

### అద్వైతము


ఉపోద్ఘాతము 136-140
3.1) శ్రీకృష్ణావతార ఘట్టము 140-153
3.2) యశోదానందం 153-154
3.3) వైష్ణవ తేజస్సు 154-156
3.4) మృద్భక్షణ వృత్తాంతం 156-158
3.5) యమళార్జున భంజనం 158-162
3.6) గోపాలనం 162-166
3.7) బ్రహ్మ గోవత్సములను మాయం చేయుట 166-173
3.8) కాళియమర్దనం 173-176
3.9) యజ్ఞపత్నులు కృష్ణుని స్తుతించుట 176-178
3.10) దేవేంద్రుడు కృష్ణుని నుతించుట 178-183
3.11) శారద రాత్రి 184-185
3.12) రాస మహోత్సవం 185-192
3.13) రాధ - రాధిక 192-194
3.14) అక్రూరుని స్తుతి 194-195
3.15) ఉద్ధవుడు 196-198
3.16) రుక్మిణీ కల్యాణం 198-203


## నాలుగవ ప్రకరణము

### కవితాంశాలు


4.1) దశమస్కంధం, పూర్వభాగం, పోతన భాగవత స్వరూపం 204
4.2) తీర్థకృత శ్రీ కృష్ణ లీలాతరంగిణీ స్వరూపం 205-207
4.3) పోతన భాగవత స్వరూపము 207-208
4.4) పోతన-భాగవతానువాదము 208-211
4.5) శ్రీ కృష్ణ లీలాతరంగిణీ-తీర్థులవారు పరిహరించిన ఘట్టములు 211-215
4.6) శ్రీమద్భాగవతము పరిచయము 215-217
4.7) శ్రీకృష్ణావిర్భావ ఘట్టము 217-240
4.8) శ్రీకృష్ణుని శైశవము 240-270

4.9) విరహ గోపికా 270-276
4.10) రాసక్రీడాభి వర్ణనము 277-281
4.11) రాధిక-రాధ 281-282
4.12) అక్రూరుడు 282-285
4.13) మధురలో పురకాంతలు 285-286
4.14) పోతన గారు చేసిన వర్ణనలు 286-288
4.15) చాణూర మల్లులు 288-289
4.16) ధనుర్భంగము 289-290
4.17) ముచకుంద స్తుతి 291-292
4.18) రుక్మిణీ కల్యాణం 292-308

**ఐదవ ప్రకరణము**

**ప్రజాబాహుళ్యంలో పోతన పద్యాలు తీర్థుల తరంగాలు**

**5. (ఎ) ప్రజల నాలుకలపై పోతన పద్యాలు**

5.ఎ.1) వర్ణనలు 310-311
5.ఎ.2) పాత్ర పోషణ 311-312
5.ఎ.3) రస పోషణ 312-313
5.ఎ.4) వ్యంగ్య రచన 313
5.ఎ.5) పోతన భావము 314
5.ఎ.6) పోతన ఆత్మీయత 314-315
5.ఎ.7) భాగవతము-భక్తి 315-323

**5. (బి) ప్రజాబాహుళ్యంలో తీర్థుల తరంగాలు** 324-329

**అనుబంధము -1 ముఖాముఖీ** 330-335

**అనుబంధము -2 చిత్రానుబంధం** 336-340

**ఆధార గ్రంథాలు** 341-343

# ఋషి త్రయము

## ప్రస్తావన

వేదవ్యాసకృతమైన మహాభాగవతం ఆంధ్రదేశంలో విస్తృతమైన వ్యాప్తికి కారణమైనవారు పోతన, నారాయణ తీర్థులు. పోతనగారు భాగవతాన్ని తెలుగులో అందంగా తీర్చిదిద్దగా, తీర్థుల వారు దశమ స్కంధంలో కృష్ణ జననం మొదలు రుక్మిణీ కల్యాణం వరకు గల కథా భాగాలను యక్షగాన రూపంలో 12 తరంగాలుగా విభజించి సంస్కృత గ్రంథం రచించారు.

పోతన సహజకవి. సమగ్ర సాహిత్య సముద్ర నిరంతర స్నాత. కవిత్వంతో పాటు రామభక్తి నిండార పండినవాడు. సంస్కృతాంధ్ర భాషలలో సమానమైన కవిత్వాన్ని నడిపింపగలిగినవాడు. భక్తి వేదాంతాలను తరచి చూచినవాడు. రెంటినీ సమన్వయపరచుకున్న నిష్కళంక హృదయుడు.

తీర్థులవారు కూడా పై లక్షణాలన్నీ కలవాడే. విశేషించి వ్యాస భాగవతం అన్నా, దానిలో ప్రతిపాదింపబడిన అద్వైత సిద్ధాంతమన్నా అమితమైన ప్రీతి కలవాడు. దానికి కారణం ఆయన జీవితంలో అధిక భాగం యోగిగా గడపడమే. సంసారిగా ఆయనకు ఎక్కువ ఆసక్తి లేదు. అవసరము కలుగలేదు.

పోతనగారు అలా కాకుండా నిజదారసుతోదర పోషణార్థం హాలికుడై, సహజ ప్రతిభతో సంపాదించిన భక్తి వేదాంత మార్గాలను ప్రోది చేసుకుంటూ ఆ రెండింటినీ తన కవిత్వం మూసలో పోత పోసి ఆత్మానందంతో పాటు ఆంధ్రుల అందరి ఆనందానికి కారణభూతుడైనారు.

ఆత్మానందాన్ని ఆస్వాదించడం తద్వారా బ్రహ్మానందానుభూతిని పొందడమే లక్ష్యంగా పెట్టుకున్నారు తీర్థుల వారు.

పోతన గారికి రామాయణ, భారత, భాగవత, పురాణ ఇతిహాస గ్రంథాల పరిచయం ఎక్కువ. భగవత్ గాధలను రసరమ్య భరితంగా వివరించడానికి కంకణధారి అయినారు. పర్యవసానంగా ఆంధ్ర మహాభాగవతం తెలుగు వారికి గొప్ప వరంగా సిద్ధించింది.

తీర్థుల వారికి ఉపనిషత్ విజ్ఞానంపై మక్కువ, ఆధికారికత ఎక్కువ. ఆ సంస్కారంతో పౌరాణిక కథా వాఙ్మయం నుండి అవసరమైనంతగానే కథాఘట్టాలను స్వీకరించి ప్రతి ఘట్టంలోను యీ ఉపనిషత్ తత్త్వ నిరూపణం చేయడం అభిరుచిగా అభ్యాసంగా అవలంబించారు.

తీర్థుల వారికి మరొక ప్రత్యేక లక్షణం కూడా ఉంది. భక్తి, వేదాంతాల ప్రచారాన్ని లక్ష్యంగా పెట్టుకొని జనరంజకంగా సాగే తరంగాలను రచించారు. సంగీత నాట్యగతులను బాల్యం నుండి అభ్యసించి ఉండటం చేత తదనుగుణమైన పదవిన్యాసాన్ని చొప్పిస్తూ సభారంజకంగా ఉండే యక్షగాన ప్రక్రియ రూపంలో శ్రీకృష్ణ లీలా తరంగిణీ గ్రంథాన్ని అందించారు. పోతన గారిది ప్రాబంధిక శైలి. తీర్థుల వారిది యక్షగాన ప్రక్రియాశైలి.

ఇలా యీ ఇరువురు సూర్యచంద్రుల వలె ఆంధ్ర సాహిత్యాకాశంలో విరాజమానులై ఆంధ్రజాతికే నిత్య స్మరణీయులై గర్వకారణులై విలసిల్లి ఆరాధింపబడుతున్నారు.

వీరిరువురి రచనలను కూలంకషంగా పరిశీలన చేసి వాటి సామ్య వైషమ్యాలను ఆంధ్ర పాఠకలోకానికి అందించడం సముచితంగా ఉంటుందని భావించి నేను "పోతనామాత్య విరచిత భాగవత దశమ స్కంధ పూర్వ భాగం – శ్రీకృష్ణ లీలా తరంగిణీ – తులనాత్మక పరిశీలన" అనే సిద్ధాంత వ్యాసం రూపొందించి తదనుగుణంగా కృషి చేశాను.

## కృష్ణం వందే జగద్గురుమ్

శ్రీ కృష్ణుని బాల్యమంతా అనేక లీలలతో నిండి చదివిన వారికి, విన్నవారికి ఆనందాతిశయాన్ని కలిగిస్తాయి. రుక్మిణీ వివాహం వరకు గల కృష్ణ కథంతా ఒక ఎత్తు. ఆ తరువాత ఆయన ప్రదర్శించిన జీవనశైలి అంతా ఒక ఎత్తు.

ఆయనకు యోగేశ్వరేశ్వరుడు అని పేరు. గోపికలతో ఆయన చేసిన విహారమంతా యోగమాయను ప్రదర్శించుటయే. (యోగమాయాముపాశ్రితః). ఇక్కడ యోగశబ్దానికి పతంజలి మహర్షి యోగసూత్ర గ్రంథంలో చెప్పిన యోగము అర్థము కాదు. (యోగః చిత్తవృత్తి నిరోధః) సర్వజ్ఞత్వం, సర్వశక్తిమత్వం, సర్వవ్యాపకత్వం కలిగిన పరిపూర్ణ ఆత్మయొక్క శక్తి ప్రదర్శనయే యోగము.

గోపికా విహరణ సమయమున ఆయన ప్రదర్శించింది కృపారూపమైన యోగము. దీనిలో వంచన కూడా మిళితమై ఉంటుంది. గోపికలు చిత్తనిరోధాది నిశ్శ్రేయస సాధనశూన్యులు. వారి యందు భగవానుడు ప్రదర్శించిన కృపయే యోగమాయ. అఘటిత ఘటనా సమర్థమైన శక్తియే యోగమాయ. గోపికలను పిలుచుటకు ఆయన వాయించిన మురళీ వాదం యోగమాయ. యోగములకు, అయోగములకు అన్వయించు ప్రీతిపూర్వకమైన లీలయే యోగమాయ. అనగా ప్రేమప్రవృత్తి. అదియే సర్వభూతముల యందును సమాన ఆదరభావము.

ఇట్టి యోగమునకు ఈశ్వరుడు కృష్ణుడు. ప్రపంచానికి ఆధ్యాత్మ తత్త్వాన్ని అర్జునుని నెపంగా చేసుకొని ఉపదేశించాడాయన. అక్కడ యోగము జీవాత్మ, పరమాత్మ సంయోగము. కర్మ, భక్తి, జ్ఞాన సాధనల ద్వారా అట్టి యోగాన్ని మానవుడు సాధించాలని ఆయన బోధించాడు.

**కర్మ :** ఇది నిష్కామరూపంలో ఉండాలని, ఫలితంపై ఆశ లేకుండా కర్తవ్యధర్మంగా ఆయా జాతుల వారందరూ వేద విహిత ధర్మాలను ఆచరించాలనేది యీ సిద్ధాంతము యొక్క సారాంశము.

**భక్తి :** భగవంతుని యందు పరమప్రేమ రూపమైనదే భక్తి. లోకవ్యక్తులపైన, వస్తువులపైన మమకారాన్ని త్యజించి లేదా తగ్గించి ఆ ప్రేమ భగవంతుని పైకి కేంద్రీకరించి ఆయన ఆజ్ఞాపిస్తున్నట్లుగా ఆయనకు యిది మాత్రమే ఇష్టమని ఇది యిష్టము కానిదని మనము కేవలము ఆయన చెప్పుచేతలలో నడుచుకొనే దాసులమని భావించుకుంటూ లోక వ్యవహారము నందు ప్రవర్తించడం యీ సిద్ధాంతము యొక్క సారాంశము.

**జ్ఞానము :** ప్రపంచమంతా భ్రాంతిజనకమని, వ్యావహారిక సత్యస్వరూపమని, పారమార్థిక దృష్టితో ఇదంతా మిథ్య అని ప్రతిక్షణం హెచ్చరికతో మనస్సుకు పట్టించుకొని పరమాత్మ స్వరూపాన్ని మన యందు ఆరోపించుకొని స్వచ్ఛ హృదయంతో ప్రవర్తించడమే యీ సిద్ధాంత సారము.

వీటిని మూడింటిని కలిపి యోగము అని పేరును నిర్ణయించారు శాస్త్రవేత్తలు. దీనిని బోధించిన వాడు యోగేశ్వరేశ్వరుడు, యోగ గురుడు అయిన శ్రీకృష్ణుడు. ఈ యోగము ప్రపంచమునందలి మానవులందరికీ అనుసరణీయము కాబట్టి దీనిని బోధించిన కృష్ణుడు జగద్గురువుగా రూపొందాడు.

ఈ సిద్ధాంతమునే శంకర రామానుజ మధ్వాది ధర్మప్రబోధకులు స్వీకరించి చిన్న చిన్న భేదాలతో తమ తమ శిష్యులకు ఉపదేశించారు. శాంకర సిద్ధాంత వాదులు జ్ఞాన ప్రదానంగాను, రామానుజ సిద్ధాంతము వారు భక్తి ప్రధానంగాను ఈ యోగాన్ని శిష్యులకు బోధించారు. మాధ్వులు కూడా భక్తికే ప్రాధాన్యమిచ్చారు.

ఆధునికులలో వివేకానందాదులు కర్మమార్గాన్ని ప్రచారం చేశారు. అలా అని వారికి భక్తి, జ్ఞాన మార్గాలతో విరోధం లేదు. బాపూజీ కర్మయోగిగా ప్రపంచంలో పేరుప్రతిష్ఠలు పొందాడు. వివేకానందుని గురువు రామకృష్ణులు భక్తిమార్గానికి ప్రాధాన్యమిచ్చాడు. రమణమహర్షి కేవల జ్ఞానవాది.

ప్రస్తుతాంశంలో పోతన, నారాయణ తీర్థుల మార్గాన్ని పరిశీలిస్తే పోతన భక్తిమార్గానికి, తీర్థులు జ్ఞాన మార్గానికి చెందిన వ్యక్తులుగా స్థూలంగా కనబడుతుంది. కానీ పరిశీలింపగా పోతన ఆయా భక్తుల నోట ఎన్నో జ్ఞాన విషయాలను కర్మ విషయాలను కూడా పలికించాడు.

*చేతులారంగ శివుని పూజింపడేని*
*నోరు నొవ్వంగ హరికీర్తినుడువడేని*
*దయయు సత్యంబులోనుగా దలపడేని*
*కలుగనేటికి తల్లుల కడుపు చేటు -1*

ప్రతి మానవుడు శివుడిని పూజించాలని, విష్ణువును కీర్తించాలని, దయాసత్యం కలిగి ఉండాలని లోకానికి ఉద్ఘాటించారు పోతన. దీనిలో మొదటి రెండు పాదాలలో భక్తిమార్గాన్ని, మూడవ పాదంలో కర్మమార్గాన్ని (ధర్మయుక్తమైన కర్మ) ప్రబోధించడం చూస్తాము. ఈ విధంగా కాయక, వాచిక, మనస్సులనెడి త్రికరణాల చేత మనం చేయవలసిన పనులను నిర్దేశించారు పోతన.

*ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై*
*ఎవ్వని యందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం*
*బెవ్వడనాదిమధ్యలయుడెవ్వడు సర్వముతానెయైన వా*
*డెవ్వడు వాని నాత్మ భవునీశ్వరునే శరణంబు వేడెదన్. -2*

---

1. *పోతన భాగవతం, 1 : 14 : పుట-6*
2. *పోతన భాగవతం, 8 : 73 : పుట-171, 172*

ఈ పద్యంలో జ్ఞానమార్గము మరియు భక్తిలో ప్రధానమైన శరణాగతి కనిపిస్తాయి. అలాగే తీర్థుల వారు భగవంతుని సగుణ నిర్గుణ రూపతత్త్వాన్ని రెండు రీతులుగాను ప్రదర్శించడం స్పష్టము. ఈ విషయము ప్రతి కీర్తనలోను స్పష్టమవుతుంది. బ్రహ్మాది దేవతలు శ్రీమన్నారాయణుని స్తుతిస్తూ..

*శ్లో॥ క్షీరాబ్ధిమధ్య భుజగేంద్రమహాసనాయ*
*దేవాయ నాభికమలోదిత పద్మజాయ*
*యోగీంద్రభావ్య గగనామల నిత్యబోధ*
*భూమాభిధాయ పురుషాయ నమః పరస్మై ॥ -1*

క్షీరసముద్రం మధ్యలో శేషపర్యంకంపై శయనించి, నాభి కమలం మీద బ్రహ్మను చూచి, సనకాది యోగులకు ఉపాసింపతగిన, నిత్య జ్ఞానానంద స్వరూపుడైన పరమ పురుషుడు శ్రీమన్నారాయణుని స్తుతించారని భావము. ఇక్కడ భక్తి, జ్ఞానముల సమ్మేళనం కనబడుతుంది.

శ్రీకృష్ణుడు చెప్పిన యోగం వ్యాస హృదయంలో ఆవిష్కరింపబడగా అనంతర కాలంలో పోతన, తీర్థుల వారి రూపంలో కళ్ళకు కట్టినట్లు సాక్షాత్కరింపబడింది. ఈ విధంగా అనేక మహాప్రవక్తలకు, సామాజిక వాదులకు, రాజకీయ దురంధరులకు ఆదర్శప్రాయమైనదిగా, అనుసరణీయమైనదిగా ఉండటం వలన శ్రీకృష్ణుడు జగద్గురువు అనడంలో ఎట్టి సందేహము లేదు. కావుననే ఆయన నిత్యవందనీయుడు.

## వ్యాస మహర్షి

శ్రీకృష్ణుడు, కృష్ణద్వైపాయనుడు (వ్యాసమహర్షి), శంకరాచార్యులు వీరు ముగ్గురూ జగద్గురువులుగా ప్రసిద్ధి పొందారు. వీరిలో వ్యాసమహర్షి తన సాహిత్యంతో ప్రపంచానికే జ్ఞానదీపిక అయ్యారు. మానవ జీవిత పరమార్థాన్ని ప్రజలందరికీ అందించాలనే ఉత్కృష్టమైన ఆశయంతో అనంతమైన వాఙ్మయాన్ని సృష్టించి మహనీయులైనారు. ఆయన నాలుగు ముఖాలు లేనటువంటి బ్రహ్మ. రెండు చేతులున్న విష్ణువు. మూడవ కన్ను లేనటువంటి శివుడు అని పెద్దలు నిర్వచించారు.

*"అచతుర్వదనో బ్రహ్మాద్విబాహురపరో హరిః*
*అఫాలలోచనః శంభుర్భగవాన్ బాదరాయణః" 'చాటువు' -2*

వ్యాసుల వారు భారతీయ సాహితీ జగత్తులో ఉత్తమ స్థానాన్ని పొందిన కవిశేఖరుడు. అటువంటి ఉత్కృష్ట స్థానము వేరొక కవికి ఆపాదించలేము. శంకర భగవత్పాదులు తమ బ్రహ్మసూత్ర భాష్యంలో

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణలీలాతరంగిణి, 1 : 26 : పుట-36*
2. *మాడభూషి జ్యోతి కుమారి, వ్యాస భగవానుడు, మహాభారతము, 1 : పుట-2*

*“అపాంతర తనుర్నామ వేదాచార్యః*
*పురాణర్షిః విష్ణునియోగాత్ కలిద్వాప*
*రయోః సంధౌ కృష్ణ ద్వైపాయనః*
*సంబభూవ ఇతిస్మరన్తి...”* *-1*

వ్యాస భగవానుడు సనాతనమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని దానిలోని అనుభూతిని, వేదాలలోని అర్థబాహుళ్యాన్ని పాఠకునికి సూటిగా అందించారు. కనుకనే ఆయన తలపునకు రాగానే మూర్తీభవించిన భారతీయ సంస్కృతి, మానవీయత గుర్తుకు వస్తాయి.

వ్యాసులవారు చైతన్యాన్ని జాగృతపర్చడానికి ఆత్మతత్త్వాన్ని ప్రతిపాదించారు. ఉత్కృష్టమైన భక్తి చేతనే జ్ఞానం సులభ సాధ్యమవుతుందని చెప్పారు.

**వ్యాసజననము :** చేది రాజ్యానికి ఉపరిచరవసువు ధర్మప్రభువు. ఆయన తన తపోమహిమ చేత ఇంద్రుని నుండి జయంతి మాల, స్ఫటిక మణి నిర్మితమైన విమానము, ఒక వంశదండము బహుమానంగా పొందాడు. పవిత్ర నదీమతల్లి శుక్తిమతి, కోలాహల పర్వత కుమార్తె అయిన గిరికను ప్రేమవివాహం చేసుకున్నాడు.

ఒకనాడు ఉపరిచరుడు వేటకు వెళ్ళాడు. అక్కడ మన్మథావస్థకు గురి అయ్యాడు. వెంటనే వీర్యస్ఖలనం జరిగింది. అతడు తన వీర్యం వృథా కాకూడదని తలచి దానిని ఒక ఆకు దొన్నెలో నింపి ఒక గ్రద్ద ద్వారా భార్యకు చేర్పించడానికి దానిని ఆదేశించాడు. వీర్యం ఉన్న ఆ దొన్నెను చూసి మరొక గ్రద్ద ఆ దొన్నెను మాంసఖండంగా భావించి దానిని ఢీకొన్నది. ఆ రెండింటి మధ్య జరిగిన పోరాటంలో రాజు వీర్యం యమునానదిలో పడిపోయింది.

బ్రహ్మశాపం చేత చేపరూపం పొందిన అద్రిక అనే అప్సరస ఆ వీర్యం ఆరగించింది. పదవ మాసంలో అది జాలర్ల వలలో చిక్కింది. వారు దానిని చీల్చగా ఒక బాలుడు, బాలిక బయటపడ్డారు. వెంటనే చేప రూపంలో ఉన్న అద్రికకు శాపవిమోచనం కలిగింది. పల్లెవాళ్ళు వారిద్దరినీ దాశరాజుకు సమర్పించారు. ఆ పిల్లవాడు మత్స్యుడు అనే పేరుతో పెరగసాగాడు. ఆ పిల్ల దేహం నుండి చేప వాసన రావడంతో ఆమె మత్స్యగంధి అయింది. ఆమెకే మరొక పేరు సత్యవతి.

కాలం గడుస్తూ ఉండగా ఆమె తండ్రి అనుమతితో యమునానదిలో పడవ నడుపుతూ ప్రయాణికులను ఆవలి ఒడ్డుకు దాటించేది. ఒక రోజు తీర్థయాత్రలు చేస్తున్న పరాశర మహర్షి అక్కడకు వచ్చాడు. ఆమె సౌందర్యాన్ని చూసి ముగ్ధుడయ్యాడు. వెంటనే మోహం ఆవరించింది. ఆయన తన మనోరథాన్ని ఆమెకు తెలియజేశాడు. “నేను కన్యను. తండ్రి చాటు బిడ్డను. నాపై సర్వాధికారాలు నా తండ్రికే ఉన్నాయి. పైగా ఈ అకార్యం చేత నా కన్యత్వానికి భంగం కలుగుతుంది. నా బంధువుల ఎదుట నేను దూషితురాలనవుతాను”

*1. శంకరాచార్యులు, బ్రహ్మసూత్ర భాష్యం, 3 : 3 : 32 : పుట-484*

అని ఆమె పలికింది. పరాశరుడు "నీకు కన్యాత్వం దూషితం కాకుండా వరమిస్తున్నాను. భయం వదలి వరం కోరుకో"మన్నాడు.

ఆమె తన దేహం సుగంధ పరిమళాలు వెదజల్లాలని కోరుకుంది. అది మొదలుకొని ఆమె శరీరం నుండి యోజన దూరం వరకు సుగంధం వ్యాప్తి చెందింది. కనుకనే ఆమె యోజన గంధి అయింది. వారిరువురికి సంగమం జరిగిన పిమ్మట మరుక్షణంలో ఒక పిల్లవాడు ఉద్భవించాడు.

*"పరాశరేణ" సంయుక్తా సద్యోగర్భం సుషావసా*
*జజ్ఞేచ యమునా ద్వీపే పారాశర్యః సవీర్యవాన్" -1*

అతడే రాశీభూతంగా ఉన్న వేదాలను విభజించడం చేత వేదవ్యాసుడయ్యాడు. పరాశరుని కుమారుడు కనుక పారాశర్యుడు అని పిలువబడ్డాడు. పరాశరుని చేత చీకటిగా చేయబడ్డ ద్వీపంలో జన్మించాడు కనుక కృష్ణ ద్వైపాయనుడయ్యాడు.

*"బ్రహ్మణోబ్రాహ్మణానాం చ తథానుగ్రహ కాంక్షయా*
*వివ్యాసివేదాన్ యస్మాత్ సతస్మాద్వ్యాసస్మృతః" -2*
*"ఏవం ద్వైపాయనోజజ్ఞే సత్యవత్యాం పరాశరాత్*
*న్యస్తో ద్వీపే సయద్బాలస్తస్మాద్ ద్వైపాయనః స్మృతః" -3*

శ్రీ మహావిష్ణువు నాభికమలం నుండి ఉద్భవించినవాడు బ్రహ్మ. బ్రహ్మ మానసపుత్రుడు వశిష్ఠుడు. అతని కుమారుడు శక్తి. శక్తి కుమారుడు పరాశరుడు. ఆయన కుమారుడు వ్యాసుడు. వ్యాసునకు పరమ భాగవతోత్తముడు శుకమహర్షి జన్మించాడు. ఇది వ్యాసుని వంశపరంపర.

*"వ్యాసం వశిష్ఠనప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్ ।*
*పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥" 'చాటువు' -4*

**వ్యాస వాఙ్మయము :** వేదవ్యాసుని వాఙ్మయంలో మొట్టమొదటివి వేదాలుగా చెప్పవచ్చును. అతడు వేదమును నాలుగు విభాగములుగా చేశాడు.

1. **ఋగ్వేదము** : దేవతలను స్తుతిస్తూ ప్రార్థనా రూపంలో మంత్రాలు ఇందులో ఉన్నాయి.
2. **యజుర్వేదము** : ఇది యజ్ఞయాగాది క్రతువులను తెలుపుతుంది.

---

*1. వ్యాసుడు, సంస్కృత భారతం ఆది పర్వం, 63 : 84 : పుట-137*
*2. వ్యాసుడు, సంస్కృత భారతం అంశావతరణ పర్వం, 63వ అధ్యాయం పుట-137*
*3. వ్యాసుడు, సంస్కృత భారతం ఆది పర్వం, 63వ అధ్యాయం పుట-137*
*4. ప్రతివాద భయంకర , మహాభారతము-వ్యాస భగవానుడు, 1 : పుట-2*

**3. సామవేదం** : దీనిలో దేవతలను ప్రసన్నం చేసుకొనే మంత్రాలు లభిస్తాయి.

**4. అథర్వణ వేదం :** అస్త్ర, శస్త్రాలను, లౌకిక విద్యలను అందించేది అథర్వణము.

ఇలా నాలుగు వేదాలను విభజించి తన నలుగురు శిష్యులకు అప్పగించాడు వ్యాసమహర్షి.

*"ఋగ్వేదస్యచ తం 'పైలం' జగ్రాహ సమహాద్యుతిః*
*యజుర్వేద ప్రవక్తారం 'వైశంపాయన' మేవ చ*
*'జైమినిం' సామవేదస్య గ్రాహకం సోకన్వపద్యత*
*తథై వాధ్వరవేదస్య 'సుమన్తుం' ఋషిసత్తమమ్" -1*

## బ్రహ్మ సూత్రములు :

ఇవి మంత్రరూపంగా, సూత్రరూపంగా రచింపబడిన ఆధ్యాత్మిక జ్ఞాన పేటికలు. వ్యాస మహర్షి బ్రహ్మసూత్రాలలో శ్రుతి హృదయాన్ని ఆవిష్కరించాడు. శంకరాచార్యులు బ్రహ్మసూత్రాలకు 'శారీరక భాష్యం' రచించారు. బ్రహ్మసూత్రాలను వ్యాసుడు రచించడానికి కారణం కపిల మహర్షి రచించిన 'సాంఖ్య దర్శనం' ఖండించడానికే. సాంఖ్యదర్శనం మూలకారణమైన ప్రకృతికి వేరు కారణం లేదు. కనుక ప్రకృతియే ప్రధానం అని వివరించింది.

*"తతః ప్రకృతేః" -2*

*"మూలే మూలాభావాదమూలం ॥ -3*

*దీనికి వ్యాసులవారు "జన్మాద్యస్యయతః" -4*

ఈ ప్రపంచానికి సృష్టి, స్థితి, లయములు దేని నుండి కలుగుతుందో అదే బ్రహ్మమని ఖండించాడు.

*"నా పౌరుషేయత్వాత్ నిత్యత్వమంకురాదివత్" -5*

వేదములు అపౌరుషేయములు కనుక వాటికి నిత్యత్వం లేదు అని సాంఖ్యం చెప్పింది.

*"సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్" -6*

వేదాంతములన్నింటి యందు బ్రహ్మమే జగత్కారణమని ఉపదేశింపబడింది అని చెప్పారు వ్యాసులు.

---

1. *వేదవ్యాసుడు, మహాభారతం, పుట-20*
2. *విజ్ఞానభిక్షు, సాంఖ్య ప్రవచన భాష్యం 65 : పుట-26*
3. *విజ్ఞానభిక్షు, సాంఖ్య ప్రవచన భాష్యం 67 : పుట-27*
4. *నోరి శ్రీనాథ వెంకట సోమయాజులు, బ్రహ్మసూత్ర దర్శనం, జన్మాద్యధికరణం, 2 : పుట-12*
5. *విజ్ఞానభిక్షు, సాంఖ్య ప్రవచన భాష్యం 48 : పుట-128*
6. *వ్యాసమహర్షి, బ్రహ్మసూత్రములు 2-పుట-1*

ఈ విధంగా బ్రహ్మసూత్రములు వ్యాసుని యొక్క సర్వజ్ఞతకు తార్కాణంగా నిలిచాయి. శంకర భగవత్పాదులు బ్రహ్మ సూత్రములకు భాష్యం వ్రాస్తూ కాపిలసాంఖ్యము వేద విరుద్ధము కావున దానిని నమ్మరాదని వ్రాశారు.

**పురాణములు :**

*మద్వయం భద్వయం చైవబ్రత్రయం వ చతుష్టయం*

*అనాపలింగకూస్కాని పురాణానిపృథక్ పృథక్ -1*

అని పురాణములు 18 విధములు

| | | |
|---|---|---|
| మద్వయం | : | మత్స్య, మార్కండేయ పురాణములు |
| భద్వయం | : | భాగవత, భవిష్యత్ పురాణములు |
| బ్రత్రయం | : | బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త పురాణములు |
| వచతుష్టయం | : | వరాహ, వామన, వాయు, విష్ణు పురాణములు |
| అ | : | అగ్ని పురాణం |
| నా | : | నారద పురాణం |
| ప | : | పద్మ పురాణం |
| లిం | : | లింగ పురాణం |
| గ | : | గరుడ పురాణం |
| కూ | : | కూర్మ పురాణం |
| స్కా | : | స్కాంద పురాణం |

ఈ పురాణాలను వ్యాసమహర్షి లక్ష శ్లోకాలలో రచించాడు. ఈ పురాణము లక్షణములు ఐదు విధములు.

*"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ*

*వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్॥ -2*

సర్గ, ప్రతిసర్గ, వంశ, మన్వంతర, వంశానుచరితములని ఐదు విధములు.

వ్యాసమహర్షి ప్రసిద్ధి చెందిన రాజుల కథలను పురాణాలుగా మలిచి వాటిలో తాత్త్వికతను జోడించాడు. కనుకనే అవి యీనాటికీ అందరికీ ఆరాధనీయములైనవి. వీటిలోని కథలలో వాస్తవికత కనిపించకుండా అతిశయోక్తులతో నిండి ఉన్నప్పటికీ వ్యాసుడు కథాకథనాన్ని ఆకర్షణీయంగా మలచడం చేత అవి జనరంజకంగాను, సవ్యంగాను చిత్రింపబడ్డాయి.

---

*1. వ్యాసమహర్షి, పద్మమహాపురాణము, విజ్ఞాపన, పుట VI*

*2. అమరసింహుడు, అమరకోశం, 1 : 162 : పుట-43*

ఈ అష్టాదశ పురాణములతో పాటు చెప్పబడినవి ఉపపురాణాలు. ఇవి వ్యాసకృతమా కాదా అన్నది పరిశీలించవలసి ఉంది.

విష్ణుపురాణాన్ని బట్టి వేదవ్యాసుడు పురాణాన్ని నిర్మించి తన శిష్యుడు లోమహర్షునకు చెప్పాడు. లోమ హర్షణుడు తన శిష్యులైన అకృతవ్రణ, సావర్ణి, వైశంపాయనులకు చెప్పాడు. వారు ఆ పురాణాన్ని మూడు సంహితలుగా వ్యాపింపజేశారు. తరువాత శిష్యపరంపరలో ఆ మూడూ అష్టాదశ పురాణాలుగా, ఉపపురాణాలుగా విస్తరింపబడ్డాయి.

**మహాభారతము :** వ్యాసుని వలన మహాభారతానికి, భారతం వలన వ్యాసునకు అఖండమైన కీర్తి లభించింది. ఇది లక్ష శ్లోకముల గ్రంథము. భారతం వ్యాసుని ఆత్మకథ. వ్యాసమహర్షి చెబుతూ ఉంటే దీనిని లిఖించిన వాడు సాక్షాత్తు గణపతి. వ్యాసుడు చెప్పిన క్లిష్టమైన శ్లోకాలను అర్థం చేసుకుంటూ గణపతి వీటిని వ్రాశాడు. వ్యాస భారతంలో సంక్లిష్టంగా ఉన్న శ్లోకాలు యీనాటికీ 'వ్యాసఘట్టాలుగా' పిలువబడుతున్నాయి.

మహాభారతంలో ఆశ్చర్యకరమైనది 18 సంఖ్య. దీనిలో 18 పర్వాలు, 18 అధ్యాయాల భగవద్గీత, 18 రోజులు జరిగిన భారతయుద్ధం మరియు 18 అక్షౌహిణల సైన్యం ఉన్నాయి.

*'అంకానాం వామతో గతిః' -1* అనే సూత్రం చేత 'య'కారం 1 సంఖ్యను, 'జ' కారం 8 సంఖ్యను సూచిస్తున్నాయి. కనుకనే 18 పర్వాలు కల భారతానికి జయము అన్నపేరు రూఢమైనది.

వ్యాసమహర్షి భారతాన్ని విజ్ఞాన సర్వస్వంగా పేర్కొన్నాడు.

*ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ*
*యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్ -2*

ఈ గ్రంథంలో ఉన్నవే అన్ని చోట్ల ఉన్నాయి. దీనిలో లేనిది మరొక చోట లేదు అని భావం.

నన్నయ్య భట్టారకుడు కూడా మహాభారత ప్రాశస్త్యాన్ని యీ విధంగా చెప్పాడు.

*సీసం॥ ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని యధ్యాత్మ విదులు వేదాంతమనియు*
*నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని కవి వృషభులు మహాకావ్యమనియు*
*లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని యైతి హాసికులితిహాసమనియు*
*బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చయంబని మహిగొనియాడు చుండ*

*ఆ॥వె॥ వివిధ వేదతత్త్వ వేది వేదవ్యాసు డాదిముని పరాశరాత్మజుండు*
*విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండ చేసె భారతంబు -3*

---

*1. తెలుగుభాషా సమితి, విజ్ఞానసర్వస్వం, 6వ సంపుటం పుట-210*

*2. వ్యాసమహర్షి, సం.భా.స్వ.ప. 5 : 45 : పుట-1352*

*3. నన్నయ్య, శ్రీ మదాంధ్ర మహాభారతం, 1 : 32 : పుట-24*

వ్యాసమహర్షి భారతంలో అక్కడక్కడ కొన్ని గ్రంథగ్రంథుల్ని కూర్చాడు. ఎనిమిదివేల ఎనిమిది వందల శ్లోకాలు మిక్కిలి కఠినంగా ఉంటాయి. వాటి అర్థం నాకు తెలుసు. శుకునికి కూడా తెలుసు. సంజయునికి తెలియునో లేదో యీ విషయంలో సందేహం వుంది అని వ్యాసులే స్వయంగా చెప్పారు

"అష్టౌశ్లోక సహస్రాణి అష్టౌశ్లోక శతానిచ
అహంవేద్మి శుకోవేత్తి సంజయోవేత్తివానవా" *-1*

వ్యాసమహర్షి తాను రచించిన భారతాన్ని మొదట తన కుమారుడైన శుకునిచే చదివించాడు. తరువాత తన శిష్యులతో లోకంలో వ్యాప్తి చేయించాడు. వ్యాసమహర్షి పరమ దయామయుడు. కనుకనే మానవ సమాజం మీద దయ కలిగి మహాభారతాన్ని రచించాడు.

**శ్రీ మద్భాగవతము :** సరస్వతీ నదీ తీరాన చింతతో కూర్చున్న వ్యాసుని వద్దకు నారదుడు వచ్చాడు.

ఉత్పలమాల :

*ధాతవు! భారత శ్రుతి విధాతవు । వేదపదార్థ జాతవి*
*జ్ఞాతవు । కామముఖ్యరిపుషట్కవిజేతవు । బ్రహ్మతత్వని*
*ర్ణేతవు । యోగినేతవు । వినీతుడ వీవు చలించి చెల్లరే ।*
*కాతరుకై వడిన్ వగవ కారణమేమి? పరాశరాత్మజా ! -2*

పరాశరనందనా! నీవు బ్రహ్మవు. పంచమవేదమైన భారతాన్ని రచించావు. వేదముల తాత్పర్యాన్ని తెలుసుకున్న వాడవు. కామక్రోధాధి అరిషడ్వర్గాలను జయించినవాడవు. యోగాగ్రేసరుడవు. వినయ సంపన్నుడవు. ఇటువంటి నీవు విచారించడానికి కారణం ఏమిటి? ఆశ్చర్యంగా ఉంది అని నారదుడు వ్యాసునితో పలికాడు.

*అస్త్యేవమే సర్వమిదం త్వయోక్తం, తథాపినాత్మాపరితుష్యతేమే ।*
*తన్మూలమవ్యక్తమగాధబోధం, పృచ్ఛామహేత్వాత్మ భవాత్మభూతం ॥ -3*

నీవు చెప్పినదంతా యథార్థమే. అయినా నా శరీరం నా మనస్సు ప్రసన్నంగా లేవు. దేవర్షీ! నాకు కలిగిన అప్రసన్నతకు కారణం చెప్పవలసిందిగా వ్యాసుడు నారదుని కోరాడు.

ఇక్కడ ఆలోచింపతగిన విషయం ఒకటి ఉంది. పై వ్యాస నారదుల సంభాషణలో వ్యాసుడు భారతాన్ని ధర్మ ప్రధానంగా రచించి కృష్ణుని కథను వర్ణించడం మానివేయడం చేత మానసిక వికలతను పొందాడని చెప్పబడింది కదా! వ్యాసుడు నిజంగానే శ్రీకృష్ణుని (హరి) కథను ఆ వర్ణనలను చేయలేదా! ఆ పక్షంలో హరివంశ

---

*1. వ్యాసమహర్షి, సం.భా.ఆదిపర్వం, 1 : 87 : పుట-7*

*2. పోతన భాగవతం, 1 : 89 : పుట-35*

*3. వ్యాసమహర్షి, భాగవతం 1 : 5 : 5 : పుట-68*

రచన ఎవరిది? లోకంలో హరివంశం భారత గ్రంథానికి ఖిల పర్వంగా ప్రసిద్ధి పొంది ఉన్నది కదా. అది పాతికవేల శ్లోకాలలో రచింపబడటం, "హరివంశావధి భారతమ్" అని పండితులచే వ్యవహరింపబడటం మాటేమిటి? అంతే కాదు మొత్తం భారతం అంతా సపాదలక్ష గ్రంథమని పండితులు ఏనాడో నిర్ణయించారు. సపాద శబ్దమే 'సవా' అనే వికృతి రూపాన్ని పొంది మొత్తం సవాలక్ష అనే రీతిగా తెలుగు నుడికారం కాబడి ఆంధ్రజాతి నోళ్ళలో స్థిరపడి పోయింది. ఇతర విషయాలలో కూడా ఈ సవాలక్ష పదం (భారత గ్రంథపరంగానే కాకుండా) వాడబడుతూ ఉంది. ఉదా:- 'నాకు సవాలక్ష పనులున్నాయి. నీతో మాట్లాడే తీరిక లేదు' అని సమస్యల వలయంలో చిక్కుకున్నవాడు చికాకుతో తన్ను విసిగించిన వానిని అభిశంసిస్తూ పలికే వరకు వచ్చింది.

ఇంత ప్రసిద్ధమైన సపాదలక్ష గ్రంథ పరిమితమైన మహాభారతం రచించిన తరువాత కూడా వ్యాసుడు వ్యాకులపాటు చెందినాడనడం ఆశ్చర్యకరంగా తోస్తుంది.

అయితే - హరివంశంలో చెప్పబడిన విషయాలు ముఖ్యంగా కృష్ణుని లీలా వర్ణనకు సంబంధించినవి. భాగవతంలో లీలామానుష విగ్రహుడైన శ్రీ మహావిష్ణువు యొక్క పరతత్త్వాన్ని వేద ప్రమాణాలతో నిరూపించడం అనే ప్రత్యేక ప్రణాళిక నిండి ఉంది. కాబట్టి పరబ్రహ్మతత్త్వ నిరూపణతలతో బాటు భక్తి ప్రబోధంకూడా సమన్వయపరచడం కోసం మరల ఒక ప్రత్యేక గ్రంథం రచించవలసిన ఆవశ్యకతను గుర్తించి వ్యాసుడు మహాభాగవతాన్ని వేరుగా రచించాడని సమన్వయించుకోవడం సముచితం.

ఈ సమన్వయము వల్ల భాగవతాన్ని బోపదేవుడో, మరొకరో రచించారంటూ బయలుదేరిన వాదం కూడా అపాస్తమవుతుంది.

(డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు భాగవతము బోపదేవ కృతమనే వాదాన్ని సోపపత్తికంగా ఖండించి 'ఇది ఆరవ శతాబ్దానికి ఈవల జరిగినది కాదని' వివరించి నిరూపించారు)

*ఉత్పలమాల :*

*అంచితమైన ధర్మచయమంతయు ఁజెప్పితి వందులోననిం*
*చించుకగాని విష్ణుకథ లేర్పడఁజెప్పవు; ధర్మముల్ ప్రపం*
*చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁగాక నీకు నీ*
*కొంచెము వచ్చుటెల్ల హరిఁగోరి నుతింపమి నార్యపూజితా ! -1*

నీ మనస్సుకు యీ కొరత రావడానికి కారణం నీ గ్రంథాలలో హరినామ సంకీర్తన ప్రధానంగా చేయకపోవడమే.

*త్వమాత్మ నాత్మానమలేహ్యా మోఘదృక్, పరస్యపుంసః పరమాత్మనః కలామ్ ।*
*అజం ప్రజాతం జగతః శివాయత, న్మహానుభావాభ్యుదయోऽభిగణ్యతామ్ ॥ -2*

---

1. *పోతన భాగవతము, 1 : 95 : పుట-36*
2. *వ్యాసమహర్షి, భాగవతం, 1 : 5 : 21 : పుట-75*

వ్యాసమహర్షి! నీవు సాక్షాత్తు శ్రీహరి అంశయై ఉన్నావు. అందువలన నీవు శ్రీహరి అభ్యుదయమును విశేషంగా వర్ణింపుము. నీ మానసిక విచారం తొలగిపోతుంది అని పనికి వెళ్ళిపోయాడు నారదుడు.

వ్యాసమహర్షి భగవంతుని లీలావైభవాన్ని వర్ణించేది, భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వ, మోక్షములను ప్రసాదించేది అయినటు వంటి భాగవతాన్ని వ్రాసి తన విచారాన్ని పోగొట్టుకున్నాడు.

ఇది 18వేల శ్లోకాలు, 12 స్కంధాలుగా రచింపబడింది. ఇది కేవలం తాత్త్విక ప్రధానమైన గ్రంథము. దీనిలో అద్వైత తత్త్వము. భక్తి సమన్వయపడి ఉన్నాయి.

## పోతనామాత్యుడు :

శ్రీమద్భాగవత సుధను తన భక్తి కవితా మకరందముతో రంగరించి దానిని ఆస్వాదించే భాగ్యాన్ని ఆంధ్రదేశంతో పాటు యావత్ప్రపంచానికి కలిగించిన మహా భాగవత కవి పోతన. ఇహపరదాయకము, భవహరత్వరూపము అయిన మహాభ్యుదయసంధాయకము శ్రీమద్భాగవతము. దీనిని ఆంధ్రీకరించి పోతన పునర్జన్మ రాహిత్యాన్ని పొందాడు.

పోతన ఆరువేల నియోగి బ్రాహ్మణుడు, కౌండిన్యస గోత్రుడు. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, కేసనలు.

*అట్టి ఘనుండు మంచికి, దయాగుణధీమణిమాచమాంబకున్*
*బుట్టిన లక్ష్మి కన్యయనఁబొల్పగు గోపనకూర్మి చెల్లెలిన్*
*నెట్టనఁబెండ్లియాడె మహనీయుఁడు కేసనమంత్రి శ్రీపతిన్*
*దట్టపు వేడ్కఁగేశవుఁడు దాను వరించిన భంగిఁబొంగుచున్ ॥ -1*

వీరభద్ర విజయములో యీ విధముగా చెప్పుకున్న పోతనగారు భాగవతములో మాత్రము లక్కమాంబ, లక్కసాని తన తల్లియని చెప్పుకున్నారు.

*ఆ॥వె॥ లలితమూర్తి బహుకళానిధి, దానమాననీతిధనుఁడు ఘనుఁడు*
*దనకు లక్కమాంబ ధర్మగేహినిగాఁగ, మనియె శైవశాస్త్రమతముఁగనియె ॥ -2*

దీనిని బట్టి లక్కమాంబ కుమారుడైన పోతన వేరు, లక్ష్మమ్మ కుమారుడైన పోతన వేరని భావించనవసరం లేదు. లక్ష్మి అనునది సంస్కృత పదము. దానికి గౌరవ వాచకమగు 'అమ్మ' జేర్చిన లక్ష్మమ్మ అని అగును. లక్ష్మమ్మకు లక్కమాంబ అనునది తెలుగు పదము. లక్ష్మమ్మ ప్రకృతి కాగా లక్కమ వికృతి. దానికి అంబ పదము గౌరవార్థముగా చేర్చబడింది. అదే విధముగా లక్కమ పదములోని మకారం లోపించి గౌరవవాచకముగా సాని పదం చేరుట వలన లక్కసాని అగుచున్నది. ఈ విధముగా లక్కమాంబ, లక్కసాని అను రెండు పదములు సమానార్థకములుగా భాగవతము వలన తెలియుచున్నవి.

"*తనకు లక్కమాంబ ధర్మగేహినిగాఁగ; బమ్మెరకేసయ లక్కసానికిన్*" అని పోతనగారు వ్రాసినాడు.

---

*1. పోతన, వీరభద్ర విజయం, 36 : పుట-9*

*2. పోతన భాగవతము, గ్రంథకర్తృ వంశవర్ణనము, 1: 24 : పుట-9*

## పోతన కాలము :

పోతన గారి కాలము నిర్ణయించడానికి ఖచ్చితమైన శాసనాధారములు లేవు. పోతన గారు చెప్పి యుండలేదు. ప్రత్యక్ష సాక్ష్యములు యింతవరకు లభించకపోవడంతో పరోక్ష సాక్ష్యములపైనే ఆధారపడవలసి ఉన్నది. 'భోగినీ దండకము'ను ఆధారముగా గ్రహించి పండితులు, విమర్శకులు అనేక మంది పోతనగారు 15వ శతాబ్దం పూర్వభాగం నుండి ఉన్నాడని నిశ్చయించారు.

పోతన గారి కాలమును గూర్చి ఆయా పండితులు ఈ విధంగా నిర్ణయించారు.

1. వీరేశలింగం పంతులు గారు : క్రీ.శ. 1400–1470 మధ్య (ఆంధ్రకవుల చరిత్రము, ప్రథమ భాగము, పేజీ నెం. 560, 557)
2. రాయదుర్గం నరసయ్య శాస్త్రి గారు : క్రీ.శ. 15శ. ప్రథమార్థము (భాగ. వావిళ్ళ ప్రతి పీఠిక పేజీ నెం. 21)
3. వంగూరి సుబ్బారావు గారు : 1480–1520 (ఆంధ్రకవి తరంగిణి వాల్యూమ్–6, పేజీ నెం. 169)
4. శేషాద్రి రమణ కవులు : క్రీ.శ.1372 ప్రాంతము జననము. (భాగ.వావిళ్ళ ప్రతిపీఠిక పేజీ 64)
5. చాగంటి శేషయ్య గారు : క్రీ.శ. 1450–1508/1509 (ఆంధ్రకవి తరంగిణి వాల్యూమ్–6, పేజీ నెం. 169)
6. అనుముల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు : క్రీ.శ. 1410–1470 (భాగ. అకాడమీ పీఠిక, పేజీ నెం. 12)
7. మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు : క్రీ.శ.15శ. ఉత్తరార్థము (ఆ.మ.భా. ఉ. పేజీ నెం. 14)
8. నిడదవోలు వేంకటరావు గారు : క్రీ.శ. 1400–1470 (పోతన పేజీ నెం. 18)
9. అకాడమీ భాగవత పీఠికకారులు పోతన కాలము మిక్కిలి వివాదాస్పదమైనదని, అది యీనాటి వరకు నిశ్చయింపబడలేదనియే మా అభిప్రాయము అని వ్రాసి యున్నారు. *–1*

## పోతన నివాస స్థల నిర్ణయము :

భాగవతంలో పోతనగారు ఏకశిలా నగరమునకు వచ్చి అందుగల గురు, వృద్ధ, బుధ, బంధుజనులచే నాజ్ఞాపితుడనై యీ నగరమందే తాను మహాభాగవత రచనకు ఉపక్రమించినట్లు చెప్పారు. కాకతీయుల రాజధాని 'ఓరుగల్లు'నకు ఏకశిలా నగరమని ప్రసిద్ధనామమున్నదని కొరవి గోపరాజు తాను రచించిన 'సింహాసన ద్వాత్రింశిక'లో చెప్పాడు.

---

*1. ప్రసాదరాయ కులపతి, ఆంధ్ర భాగవత విమర్శ – అవతరణ పూర్వరంగము పుట–22,23*

*"ఆకడ నీతిశాస్త్ర విదుఁడై గురువీడ్కొని యేగెవేడ్కతో*
*కాకితమూలశక్తిగనిగా నొనరించిన పైడిచట్టునా*
*నేకశిలాఽభిధానమున నెన్నికనెక్కి ధరిత్రిలోననే*
*పోకలఁబోనియట్టి సిరిపుట్టిన యింటికి నోరుగంటికిన్"* –1

*చందన గంధులున్ విటులు జాణలు దానవినోదులుంబ్రభా*
*సుందరమూర్తులుంగవులు శూరులు పెద్దలు నుల్లసిల్ల సం*
*క్రందన వైభవాఢ్యుఁడగు కాకతి భూపతి రాజ్యలక్ష్మి బెం*
*పొందెడు నప్పురంబున మహోత్సవ లీలలనుండె నేర్పునన్"* –2

పై పద్యములను బట్టి కాకతిరాజుల రాజధాని అయిన ఏకశిలా నగరమే నేటి ఓరుగల్లు (పట్టణం) అనబడుతుంది. కాని, కడప జిల్లాలోని ఒంటిమిట్ట మాత్రము కాదని నిశ్చయమగుచున్నది. ఒంటిమిట్టకు జన వ్యవహారంలో కానీ, ప్రాచీన శాసనములందు కానీ, గ్రంథములలో కానీ, ఏకశిలానగరమని పేరు లేదు.

నాటి నిజాం రాష్ట్రములోనిది, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్ జిల్లాకు 60 కి.మీ. దూరంలో నున్న 'బమ్మెర' గ్రామమే పోతన గారి జన్మస్థలము అని చెప్పడానికి అనేక ఆధారాలున్నాయి.

ఎ. పోతన గారి శిష్యుడు వెలిగందల నారయ కరీంనగర్ మండలములోని వెలిగందల నివాసి. ఇది వరంగల్‌నకు 70 కి.మీ.ల దూరంలో ఉంది.

బి. అలాగే మరొక శిష్యుడు యేర్చూరి సింగన ఓరుగల్లునకు సమీపములో నున్న యేర్చూరు నివాసి.

సి. ఏకాదశ, ద్వాదశ స్కంధములను తిరిగి రచించిన హరిభట్టారకుడు తెలంగాణము నందలి కంభంమెట్టు నివాసి.

డి. దశమ స్కంధ భాగమును ద్విపదగా రచించిన మడికి సింగన ఓరుగల్లుకు 50 మైళ్ళ దూరములో నున్న రామగిరి నివాసి.

ఇ. భోగినీ దండకము కృతిగొన్న సర్వజ్ఞసింగమనీడు ఓరుగంటికి 50 మైళ్ళ దూరంలో నున్న రాచకొండ నివాసి.

ఎఫ్. దాక్షాయణీ పరిణయము వ్రాసి దానిని గురిజాల మల్లన సోమయాజికి అంకితమిచ్చిన కేసన, మల్లన కవులు పోతన మనుమలు.

---

*1. కొరవి గోపరాజు, సింహాసన ద్వాత్రింశిక, 156 : పుట–50*

*2. కొరవి గోపరాజు, సింహాసన ద్వాత్రింశిక, 158 : పుట–50, 51*

*'నెఱిగుఱిగల్గు నన్నయ మనీషినిఁదిక్కన శంభుదాసునిన్*

*బరువడి మత్పితామహుని బమ్మెర పోతన భాస్కరాహ్వయున్' -1*

ఈ గురజాల గుంటూరు జిల్లాలోనిది కాదు. వరంగల్ జిల్లా పరకాల మండలములోనిది.

అదే విధముగా పోతనగారు భాగవతము నందు వాడిన కొన్ని పదప్రయోగములను బట్టి కూడా పోతన గారు తెలంగాణా వాసియని స్పష్టమగుతుంది.

ఎ. ఉబ్బు : లోపలన్ రుధిరముబ్బుదు *-2*

బి. ద్రొబ్బు : శైలతటంబులందు ద్రొబ్బించితి *-3*

సి. చిక్కు : ఒక బొట్టు చిక్కకుండగ సకల సుధారస మమర సంఘంబునకున్ బ్రకటించి పోసి*-4*

డి. దొడ్డు : కలకంఠి కొయ్యన గర్భంబు దొడ్డుగా *-5*

ఇ. ఉఱుకు : 'ఇచ్చెలువఁజూచి మ్రుచ్చిలి యచ్చుగ నుఱికించి కొనుచు నరిగెద నాతో వచ్చెదవాయని' *-6*

ఎఫ్. రొప్పు : 'అదలించి రొప్పంగ నాలమందలు గావు గంధగజేంద్ర సంఘములు గాని' *-7*

ఈ ధాతువులన్నీ తెలంగాణా వ్యవహారమును బట్టి పోతనగారు రచించినారు.

ఈ విధమైన పదప్రయోగ లక్షణముల వలన పోతన గారు తెలంగాణాలోని 'బమ్మెర' గ్రామంలోనే నివశించేవారని బహువిమర్శకులు ఆమోదించారు. ఇప్పుడు ఎవరూ కడపజిల్లాలోని ఒంటిమిట్టవాదము చేయడం లేదు.

**పోతన స్మార్తశైవుడు :**

దాక్షాయణీ పరిణయమును అంకితముగా తీసుకున్న గురిజాల మల్లన సోమయాజి పోతన మనుమల వరకు గల కవి ప్రశస్తి చేస్తూ..

*"కౌండిన్య గోత్ర విఖ్యాత బమ్మెర భవ్య*

*వంశాఢ్యులై సిరివరలు వారి*

*ఇవటూరి ముక్తి నాగేశ సద్గురుభక్తి*

*నాదిమ శైవులైనట్టి వారి...." -8*

---

1. *ధూళిపాళ శ్రీరామమూర్తి, శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము, పుట-5*
2. *పోతన భాగవతం, 7 : 192 : పుట-152*
3. *పోతన భాగవతం, 7 : 201 : పుట-55*
4. *పోతన భాగవతం, 8 : 324 : పుట-224*
5. *పోతన భాగవతం, 10 : 75 : పుట-15*
6. *పోతన భాగవతం, 10 : 317 : పుట-68*
7. *పోతన భాగవతం, 10 : 1543 : పుట-355*
8. *ఖండవిల్లి సూర్యనారయణశాస్త్రి, భక్త పోతన - మహాభాగవత రచన - పుట-4*

అని వర్ణించాడు. దీనిని బట్టి పూర్వుల వలె పోతన కూడా శైవమత ప్రియుడైనట్లు తెలుస్తోంది. పోతన తాతగారు ఎల్లన శైవలోక ప్రియుడు. పోతన తండ్రి కేసన శైవమతమును స్వీకరించినవాడు. తల్లి లక్కమాంబ సదాశివ పాదములను కొలుచుట యందు ఆసక్తి కలిగింది. అన్నగారు తిప్పన ఈశ్వర సేవా కాముకుడు.

.....భాగవత గ్రంథకర్త వంశవర్ణనము..

"…. సదాశివ పాదయుగార్చ నానుకంపా – నయవాగ్భవానికిని, బమ్మెర కేసయ లక్కసానికిన్" *–1*

ఈ విధముగా తాతతండ్రుల నుండి శైవమత ప్రియులైనప్పుడు పోతన కూడా మొదట శైవుడై ఉండటం సహజము. పోతన తన తొలికృతి వీరభద్ర విజయములో ప్రత్యేకముగా సిరియాళుడు కరికాలుఁడు మొదలగు వీరశైవ భక్తులను వర్ణించాడు.

*సీసం : సిరియాలుఁగరికాలుఁ జేరమున్నుద్భటు బాణుఁగేశవరాజు బసవరాజుఁ*
*కుమ్మర గుండయ్య నెమ్మినాథుఁ బండితారాధ్యుని భల్లాణునమినంది*
*మాహేశు మడివాలు మాచిరాజు చేరమరాజయ్య చిరుతొండనోహాళి*
*సాంఖ్య తొండని సురిచముడదేవు*

*ఆ॥వె॥ వెలయ మఱియుఁ గల్లు వీరమాశ్వరా, చారపరుల వీరసత్యవ్రతుల*
*వీర సచ్చరిత్రుల వీరవిక్రములను, బరఁగ మ్రొక్కి తలఁచి భక్తితోడ –2*

ఇది కూడా పోతన యొక్క శైవమత ప్రియతకు కారణమై ఉంది.

కానీ యీయన వీరశైవుడు కాదు. స్మార్తశైవుడు. స్మార్తులలో శివార్చన చేస్తూ శివకేశవ అభేదమును పాటించువారు కొందరు, విష్ణువును అర్చిస్తూ శివకేశవ అభేదమును పాటించువారు కొందరు. వీరిరువురూ అద్వైతులే. వీరు శ్రుతి స్మృతులు చెప్పిన రీతిగా అనుసరిస్తూ శంకర అద్వైతమును ప్రమాణముగా అంగీకరిస్తారు. అనంతర కాలంలో వీరిలోని స్మార్త వైష్ణవులు శ్రీ వైష్ణమును స్వీకరించుటచే ఒక్క శైవులే స్మార్త మతము నందు మిగిలిపోయారు. పోతన గారు అతని పూర్వీకులు యిట్టి స్మార్తశైవులే.

వీరశైవులకు శివుడు పరదేవత. అలాగే వైష్ణవులకు విష్ణువు పరదేవత. వీరశైవులకు విష్ణుద్వేషము ఉండవచ్చు. లేకపోవచ్చు. అదే విధముగా వైష్ణవులకు కూడా శివద్వేషము ఉండవచ్చు. ఉండకపోవచ్చు. కానీ వీరు శివునితో విష్ణువు సమానుడని గానీ, వారు విష్ణువుతో శివుడు సమానుడని కానీ అంగీకరింపరు. పైగా ఆ విధంగా గణించడం మహా పాతకంగా భావిస్తారు. స్మార్త మతావలంబకులైన యీ అద్వైతమతావలంబకులు మాత్రమే శివకేశవాభేదమును పాటిస్తారు.

---

1. *పోతన భాగవతం, 1 : 26 : పుట–9*
2. *పోతన, వీరభద్ర విజయము, పీఠిక, 11 : పుట–4*

వీరభద్ర విజయమును బట్టి కూడా పోతన శివకేశవ అభేదమును పాటించు స్మార్త శైవుడని తెలుసుకోవచ్చును. గ్రంథాది యందు ఇష్టదేవతా స్తుతిలో

*చం॥ సిరియును వాణిగౌరియనఁజెన్నగు కన్యకు మేను వాక్కుఁబె*
*న్నురమును నుంకువిచ్చి ముదమొప్ప వరించి జగమ్ములన్నియున్*
*దిరములు సేయఁబ్రోవఁదుదిఁదేర్పఁగఁద్రృష్టయుగేక్షణుండునై*
*హరివిధి శంభుమూర్తియగు నాధ్యుడు మాకుఁబ్రసన్నుఁడయ్యెడిన్ ॥ -1*

అను యీ పద్యములో త్రిమూర్తులను ఒకే పరమేశ్వరుని విభిన్నాకారములుగా భావించినట్లు స్పష్టమగుతుంది.

**పోతన గ్రంథములు :**

పోతనగారు నాలుగు గ్రంథములు వ్రాశారు. (ఎ) వీరభద్ర విజయము (బి) భోగినీ దండకము (సి) నారాయణ శతకము (డి) శ్రీ మహాభాగవతము. వీటిలో మహాభాగవత విషయమును వదలి తక్కిన మూడు గ్రంథముల కర్తృత్వ విషయములో అభిప్రాయ భేదములున్నాయి.

**ఎ. వీరభద్ర విజయము :** ఇది నాలుగు ఆశ్వాసముల ప్రబంధము. వీరశైవుడు, తనకు గురువు అయిన ఇవటూరి సోమనారాధ్యుడు ఆజ్ఞాపించగా పోతన రచించిన తొలికృతి వీరభద్ర విజయము.

*"పిన్నవాఁడననియుఁబెక్కు సంస్కృతులను*
*విననివాఁడ ననియు వెఱపుమాని*
*మత్ప్రసాద దివ్యమహిమచే నైంతైనఁ*
*గవితఁజెప్పలావు గలదు నీకు" -2*

పోతనగారు పిన్నతనములో మొట్టమొదట రచించిన కృతి వీరభద్ర విజయము అని దీనిని బట్టి తెలుస్తుంది,

వీరభద్ర విజయ ఆశ్వాసాంతగద్య కూడా ఇదే విషయమును తెలుపుతుంది.

"ఇది శ్రీమన్మహా మహేశ్వర యివటూరి సోమనారాధ్య దివ్యశ్రీపాదపద్మారాధక కేసనామాత్యపుత్ర పోతయనామధేయ ప్రణీతంబైన వీరభద్ర విజయంబను మహా పురాణకథ యందు..."

"అదియునుంగాక నీకు వీరభద్రేశ్వర ప్రసాదంబు గలదు. కావున వాయుపురాణ సారంబగు నీ కథావృత్తాంతం బంతయుఁ దెనుంగున రచియింపుమని యానతిచ్చిన మద్గురు మధుర వాక్యంబులకు నత్యంతానురాగ సంతుష్టుండనై తదీయానుమతంబున..." *-3*

---

*1. పోతన, వీరభద్ర విజయము, 2 : పుట-1*
*2. పోతన, వీరభద్ర విజయపీఠిక, 21 : పుట-6*
*3. పోతన, వీరభద్ర విజయపీఠిక 22 : పుట-232*

ఈ ఆశ్వాసాంత గద్యమును బట్టి పిన్నవాడైన పోతన శ్రీ సోమనారాధ్యుల వారి ప్రోత్సాహ విశేషము చేత ఈ తొలి కృతి రచించినట్లు స్పష్టమగుతుంది.

అంతే కాకుండా పోతన కాలములో ఉచ్ఛస్థితి యందున్న శైవమతము, ఆ మతానికి నాడు లభించిన రాజాదరణము, అట్టి ఆదరముతో ఆనాడు వెలసిన శైవ ప్రబంధములు, సాంఘికముగా పోతనపై వాని ప్రభావము మొదలగునవి పోతనచే యీ శైవప్రబంధమును వ్రాయించుటలో దోహదకారులైనట్లు భావించవచ్చును.

పోతన తన భాగవత రచనానంతరము నందే యీ వీరభద్ర విజయాన్ని రచించినట్లు తెలిపే పద్యమొకటి కనబడుతుంది.

*భాగవత ప్రబంధమతిభాసురతన్ రచియించి దక్షకృ*
*ద్యాగ కథాప్రసంగమున నల్పవచస్కుఁడనైన తన్నిమి*
*త్తాగత వక్త్రదోష పరిహారతకై యజనైక శైవ శా*
*స్త్రాగమ వీరభద్ర విజయంబు రచించెద వేడ్క తోడు తన్ ॥ -1*

"కానీ వీరభద్ర విజయ లిఖిత ప్రతులందు కానీ, ఆంధ్ర పరిశోధక మహామండలిలో నున్న వీరభద్ర విజయ లిఖిత ప్రతులందు గాని, ఆంధ్రసాహిత్య పరిషత్తులోఁగల యీ తాళపత్ర ప్రతులందు గానీ యీ పద్యము గాన రాకుండుటచే నిది ప్రక్షిప్త పద్యమని పండిత విమర్శకులు నిశ్చయించి యుండిరి" *-2*

**బి. భోగినీ దండకము :** భోగినీ దండక కర్తృత్వములో విమర్శకులు భిన్నాభిప్రాయములు వ్యక్తం చేశారు.

*ఉ॥ పండిత కీర్త నీయుఁడగు బమ్మెర పోతన యా సుధాంశు మా*
*ర్తాండ కులాచలాంబునిధి తారకమై విలసిల్ల భోగినీ*
*దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావు సింగ భూ*
*మండల భర్తకున్ విమత మానవ నాథ మదాపహర్తకున్ ॥ -3*

భోగినీ దండక గ్రంథములో ఉన్న యీ పద్యమును బట్టి దండకములో యీ పేరు లేదు కావున యీ పద్యము ప్రక్షిప్తమంటారు. అయితే గ్రంథం చివరలో గద్యం రాయడం కంటే పద్యం రాయడమే రమణీయం కనుక, మరియు కర్త పేరు దండకము నందే చెప్పవలసిన నియమం లేదు. కావున పద్యము నందు ఉండటమే సముచితము.

---

1. *పోతన, వీరభద్ర విజయం, 41 : పుట-10*
2. *ఖండవిల్లి సూర్యనారయణ శాస్త్రి, భక్త పోతన మహాభాగవత రచన, పుట-13*
3. *పోతన, భోగినీ దండకము, పుట-34*

ఈ గ్రంథములోని భావప్రౌఢి, రచనా ప్రౌఢి, శైలీ సంవాదము పోతన గారి కవితాత్మను తెలుపుతున్నాయి. తన యవ్వనములో రాజాశ్రయానికి ఆయన పడిన పాట్లు, ఆ అవివేక కార్యాన్ని స్మరించడానికి ఇష్టం లేక పోతన గారు దానిని భాగవతంలో పేర్కొనలేదు. అంతే కాకుండా యిది ఉదాత్తమైన ఇతివృత్తం కాదు. మరియు నరాంకితం చేయబడింది. భోగినీ దండకము నందలి రాజనింద భాగవతంలోని రాజనిందతో సరిపోవుచున్నది.

**భోగినీ దండకము :**

*రాజుల్ బహు వ్యాజులే భోజులే చంచలచ్ఛిత్తులే మత్తులే*
*ప్రేత కాయత్తులే దోషసంసిక్త సంపాదులే వీతమర్యాదులే* -1

**భాగవతం :**

*ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్*
*సొమ్ములు కొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము బాసి కాలుచే*
*సమ్మెట వ్రేటులంబడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ*
*బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్ ॥* -2

భోగినీ దండ రచనా కాలము నాటికి సామాన్యముగా నున్న రాజద్వేషము కాలాంతరములో స్వానుభవముచే పరిణతి చెంది భాగవత పద్యము నందు విశేషాకారంగా రూపొందినది.

**భోగినీ దండకము :** "సింగ భూపాలుపై వ్రాలి నా చిత్తమున్మత్తమై సోలి కామానలాయత్తమై రాదు తేరాదు నేనామరుండైన గౌరీవరుండైన లక్ష్మీశ్వరుండైన వాణీధరుండైన దేవోత్తముండైన నన్నున్ మదిం గోరగా నొల్లనే యుల్లసత్ఫుల్ల మందార రాజన్మరందంబు నందంబు నంగ్రోలు మత్తాళి దుత్తూరమున్ గ్రోలునే, హేమ రాజీవ రాజీరజో రాజితాకాశ గంగానదీలోల కల్లోల డోలా నటద్రాజ హంసంబు శైవాల జంబాల గండూ పది భేకీ ఢేకీ ధుతీ సంకులాసార కాసారముంజేరునే మండితాఖండలా నీలజీమూత నిర్యత్పయోధారలన్ ద్రావు సారంగి కుంభాంత రాళంబు పూరంబులం ద్రావునే మాధవోజ్జాత చూతాం కురస్వాదులీలాలసత్కోకి లేంద్రంబు ఝిల్లీరవక్రూరభల్లాతకీ శాఖ – కుంబోవునే సింగభూపాలు బాహాపరీరంభ సంరంభ సంభోగముం గోరుయోషా శిరోరత్నముం గోరునే నీచ సంభోగమంబా" -3

---

1. *పోతన, భోగినీ దండకము, పుట–27*
2. *పోతన భాగవతం, 1 : 8 : పుట–3,4*
3. *పోతన, భోగినీ దండకము, పుట–32*

**భాగవతం :**

*సీసం॥ మందార మకరంద మాధుర్యమునఁదేలుమధుపంబు వోవునే మదనములకు*
*నిర్మల మందాకినీ వీచికలదూగు రాయంచచనునే తరంగిణులకు*
*లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు కోయిల చేరునే కుటజములకు*
*బూర్ణేందు చంద్రికాస్ఫురిత చకోరకం బరుగునే సాంద్రనీహారములకు*

*ఆ॥వె॥ నంబుజోదర దివ్యపాదారవింద చింతనామృతపాన విశేషమత*
*చిత్తమేరీతి నితరంబుఁజేరనేర్తు వినుతగుణశీల ! మాటలు వేయునేల -1*

పై దండకము నందలి దృష్టాంతాలంకారము ఈ పద్యంలో ప్రతి వస్తూపమాలంకారముగా పరిణమించింది.

రాజాశ్రయమునకై అనేకపాట్లు పడి అందులో పొందిన వైఫల్యమునకు నిదర్శనంగా ప్రత్యక్షంగా 'ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి' అని రాజనింద చేశాడు. పైన చెప్పిన కారణముల రీత్యా 'భోగినీ దండకము' పోతనగారు రచించినదనుటయే సముచితము.

**నారాయణ శతకము** : 'నారాయణ' అను మకుటముతో నూటమూడు పద్యములు కల శతకమిది. ఈ శతకము నందు కవి పేరు లేదు.

*అపరాధంబులు నిన్ను నమ్మి వినుమే నా జన్మపర్యంతమున్*
*విపరీతంబుగఁజేసినాఁడ నిఁక నీవేదిక్కు నాలోనికిన్*
*గపటం బింతయు లేక దండధరుకున్ గట్టొక రక్షింపు - మీ*
*కృపకుం బాత్రుఁడనయ్య ధర్మపురి లక్ష్మీనాథ నారాయణా" -2*

అని కవి కరీంనగర్ మండలంలోని గోదావరి ఒడ్డున గల ధర్మపురి లక్ష్మీనారాయణస్వామిని పేర్కొన్నాడు. ఓరుగల్లుకు యిది చాలా దూరంలో ఉంది. పోతనగారు యీ గ్రామమునకు వెళ్ళి స్వామిని దర్శించి ఈ శతకమును చెప్పి ఉండుననడానికి అవకాశం కలదు.

ఈ శతకము చివరలో ఉన్న గద్యను ఆధారముగా చేసుకొని ఈ గ్రంథమును ముద్రించిన శ్రీ వంగూరి సుబ్బారావు గారు పోతనే యీ గ్రంథకర్త అని నిర్ణయించారు.

కానీ యీ గద్య విషయమై 'విశ్వదాత' శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు తమ 'శతక మంజరి' పీఠికలో యీ విధంగా వ్రాశారు.

---

*1. పోతన భాగవతం, 7 : 150 : పుట-42*

*2. శతక సంపుటం గ్రంథం (నారాయణ శతకం) 97 : పుట-17*

"..... ఈ శతకాంతమునఁగల గద్యము తాళపత్ర ప్రతులందు లేదు. రెండు కాగితపు ప్రతులందు మాత్రము వేరు సిరాతో నీ గద్యము వ్రాయఁబడి యున్నది" -1

పంతులు గారి పైవ్రాతను బట్టి యీ శతకము పోతన కృతమనుటకు వీలు కాదు.

అంతే కాకుండా శతావధానులు బ్రహ్మశ్రీ శేషాద్రి రమణకవులు తమ "ఆంధ్ర భాగవత విమర్శము"లో ఈ శతక కర్త విషయంలో యీ విధంగా వ్రాశారు.

"..... భాగవతమును ఁబలుమారభిమాన గ్రంథముగాఁ బఠించిన యొక కవి యీ శతకమును రచించి యుండునేమో యని పలువురభిప్రాయపడుచున్నారు. ఇందలి పద్యములు కొన్ని భాగవతమునందలి పద్యములతోఁగొన్ని యెడలఁ బోలి యున్నవి. రచనా సౌష్టవమున ఁగవితా నైపుణ్యమున మాత్రమివి భాగవత పద్యములంత ప్రౌఢముగా లేవు..."

లక్షణ గ్రంథములలో నుదహరింపబడిన కతననిది ప్రాచీనకవి కృతమనుటలో సందేహము లేదు. కాని శైలిని బట్టి యిది పోతన కృతమన వీలు లేదు. ఇందలి శైలి పోతన శైలి ననుసరించినట్లున్నది. పద్యములలో ఁజాలినంత భావము లేదు. కనుక నింక నాధారములు చిక్కు వఱకు నీ శతకమును పోతరాజకృత గ్రంథములలో ఁజేర్పకుండుటయే మంచి పని". -2

## నారాయణ తీర్థులు శ్రీకృష్ణ లీలా తరంగిణి

శ్రీకృష్ణ లీలా తరంగిణీ కర్తలైన నారాయణతీర్థుల సంస్కృతాంధ్ర రచనలను గూర్చి పండితులు, విమర్శకులు 70 సంవత్సరములుగా అందించిన సమాచారాన్ని బట్టి నారాయణతీర్థుల సమయం, జీవిత విశేషాలు, రచనలు, సంప్రదాయం, కళారాధన, తాత్త్విక ధోరణి, శిష్య పరంపర మొదలైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. అర్ధ శతాబ్దం పైగా తమిళనాట సంగీత విద్వాంసులు తమ కచేరీలలో నారాయణ తీర్థుల తరంగాలను తప్పక గానంచేస్తూ వచ్చారు. ఈనాటికీ యీ సంప్రదాయం కొనసాగుతూ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో పరంపరగా అద్దంకి, ఒంగోలు, విజయవాడ కాజ, గుంటూరు ప్రాంతాలలో ఈ తరంగ గాన పరంపర విస్తరించి ఉంది. కూచిపూడి నాట్యంలో కూడా వీటికి పెద్దపీట వేయడం జరిగింది. వరహూరు (తమిళనాడు) తిరుప్పూన్‌తురుత్తి (తమిళనాడు), అద్దంకి, ఒంగోలు, విజయవాడ పరిసరాలలో వేలాది భక్తులు నారాయణ తీర్థుల తరంగాలను సంప్రదాయబద్ధంగా వార్షికోత్సవాలు జరుపుతూ గానం చేసే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. ఆంధ్ర తమిళనాడు రాజ్యాలలో శతాబ్దాలుగా మౌఖికంగా యీ తరంగ గానం సంప్రదాయబద్ధంగా సాగటం సంతోషకరమైన విషయం. క్రీ.శ. 17,18,19 శతాబ్దాలకు చెందిన త్యాగరాజస్వామి తదితర కర్ణాటక సంగీత కృతికర్తలెందరో తెలుగు బ్రాహ్మణులు. సంగీతానికి కులము, భాష ప్రాంతాలు లేవు. సంగీత త్రిమూర్తులలో తెలుగు బ్రాహ్మణులైన త్యాగరాజస్వామి, శ్యామశాస్త్రి,

1. *ఖండవిల్లి సూర్యనారాయణ శాస్త్రి, భక్తపోతన, మహాభాగవత రచన, పుట-20*
2. *ఖండవిల్లి సూర్యనారాయణ శాస్త్రి, భక్తపోతన, మహాభాగవత రచన, పుట-20*

తమిళనాడులోని తిరువావూరులో జన్మించి తమ జీవితంలో ఎక్కువ భాగం తమిళనాటే గడిపినా తన రచనలన్నీ తెలుగులోనే చేశారు.

నారాయణతీర్థులు ఆంధ్రదేశంలో జన్మించి ఎక్కువ భాగం తమ జీవిత కాలంలో ఆంధ్రదేశంలోని పవిత్ర స్థలాలలో గడిపారు. అందుచేత ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్వాంసులు తీర్థుల వారు పర్యటించిన ఆంధ్రప్రదేశ్‌లోని యాత్రాస్థలాలు, వారు సంగీత, సాహిత్య, నాట్య, దర్శనాలకు చేసిన సేవల గూర్చి పరిశోధించారు. తమిళనాడులోని సంగీత విద్వాంసులు గోవిందపురం, గుణశేఖరం, తిరువైయ్యార్, మేలత్తూర్, నడుక్కావేరి, వరహూరు, తిరుప్పూన్‌తురుత్తిలతో తీర్థుల వారి సంబంధాన్ని గుర్తించారు. ఆంధ్రదేశంలోని తల్లావఝుల వారి వంశవృక్షం తీర్థుల వారి జీవిత విశేషాలను అందించడంలో విశేషంగా ఉపకరిస్తోంది.

సద్గురు శ్రీ నారాయణ తీర్థుల వారు కృష్ణతత్త్వ ప్రతిపాదకమైన మహాద్భుత సృష్టి శ్రీకృష్ణ లీలా తరంగిణికి కర్తలై మానవాళికి ప్రాతఃస్మరణీయులయ్యారు. కృష్ణ జననం మొదలు రుక్మిణీ కళ్యాణం వరకు యక్షగాన ప్రక్రియలో తీర్థులు దీనిని రచించారు. సంగీత, సాహిత్య, నృత్యాత్మకమైన కృష్ణలీలా తరంగిణి ఉపనిషత్తుల సారమే. దీనిని భక్తులు తరతరాలుగా గానం చేస్తూ ధన్యులయ్యారు. నారాయణ తీర్థుల వారి జీవితకాలం క్రీ.శ. 1675-1745 గా పండితులు నిర్ణయించారు. ఆంధ్రదేశంలో గుంటూరు జిల్లా, మంగళగిరి మండలంలోని 'కాజ' గ్రామం వీరి జన్మస్థలం. తల్లావఝుల ఇంటి పేరు కలిగిన వీరు సర్వశాస్త్రములలోనూ పాండిత్యం కలిగినటువారు. గొప్ప తపస్సంపన్నులు. అనన్య వాఙ్మయ రచనా దురంధరులు అయి అద్వైత బ్రహ్మానంద స్వరూపమైన కృష్ణతత్త్వాన్ని అనేక రీతులలో వర్ణించారు.

తీర్థుల వారికి వివాహమైన కొద్ది రోజులలోనే విరక్తి భావం జనించి యత్యాశ్రమ స్వీకారం చేశారు. తీర్థయాత్రలు చేస్తూ బ్రహ్మానందానుభూతిని కలిగించే కృష్ణతత్త్వాన్ని ప్రజలకు అందించి తాను తరించి ఇతరులను తరింపచేస్తూ అవతార పురుషులయ్యారు.

ఒకనాడు పాకనాటి సీమగా పిలువబడేటటువంటి నేటి ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ తీరంలోని కొన్ని సంప్రదాయ కుటుంబాల వారికి తీర్థుల వారు ప్రత్యేకమైన తాళ, గతులతో ఈ తరంగ అభినయాన్ని నేర్పారు. కాలక్రమంలో యివియే లయవిన్యాసము, రాసగానము, సంకీర్తన, యక్షగాన ప్రదర్శన లాంటి ఎన్నో ప్రయోగ విన్యాసములతో ప్రసిద్ధి పొంది, ఒక విశిష్టతను సంపాదించుకొని, సువర్ణాక్షరములతో నిలిచిపోయి, నేల నాలుగు చెరగులా ప్రత్యేక బాణితో ప్రదర్శింపబడుతున్నాయి.

తన సమకాలీకులైన బోధేంద్రస్వామి, శ్రీధరులు, సదాశివబ్రహ్మేంద్రస్వామి వంటి సంకీర్తనా సంప్రదాయ ప్రచారకుల వలెనే నారాయణతీర్థుల వారు కూడా సన్యాసమును స్వీకరించిన అద్వైతులు. సంగీతాన్ని, భజనని దైవాన్ని కొలిచే సాధనాలుగా తీర్చిదిద్దిన వారిలో నారాయణ తీర్థులు ఒకరు. తీర్థులు అటు కర్ణాటక

సంగీత సంప్రదాయంలోను, ఇటు భజన సంప్రదాయ ఒరవడిలోనూ ఒక విశిష్టస్థానం పొందారు.

## గ్రంథకర్త పరిచయము :

నారాయణతీర్థుల వారు క్రీ.శ. 1675 సంవత్సరములో ఆంధ్రదేశం, గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, కాజ గ్రామములో పార్వతీ, గంగాధరులకు ఆషాఢశుద్ధ తొలి ఏకాదశి, విశాఖ నక్షత్రంలో జన్మించారు. వీరి ఇంటిపేరు తల్లావఝుల వారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు గోవిందుడు.

అయితే కవిసామ్రాట్టు విశ్వనాథ సత్యనారాయణవారు శ్రీ నారాయణతీర్థుల వారి చరిత్రను పద్యరూపంలో వ్రాస్తూ వీరు కూచిమంచి అగ్రహారంలో జన్మించినట్లు వ్రాశారు. ఇది తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలంలో ఉంది.

*గీ॥* *కోనసీమ భీమేశు నుద్యాన సీమ*
*సాధు గోదాపయోగర్భ సస్యభూమ*
*తనరునాంధ్రీ సతీ గళోద్దామ దామ*
*కూచిమంచి యనంగ నక్కోనసీమ* ॥1॥

*కందం॥* *కలదొక్క యగ్రహార*
*మ్మలఘు సరస్వతికి రత్నహారము దానన్*
*గలరు జగతీ సుపర్వులు*
*తెలిసిన దంపతులు పార్వతీ గంధర్వుల్* ॥2॥

*ఉత్పలమాల॥* *కాయముగన్న భక్తియనగల్గెను వారికి c బుత్రకుండు నా*
*రాయణ భక్తి తత్పరత నట్టిద పేరును బెట్టిరింతలో*
*నాయన వేద వేద శిఖరాఖిల మేఖలయైన వాణి సం*
*ధాయుత భాసమాన రసనా నటనంబుల దేల్చునట్టిదై* ॥3॥ -1

తల్లావఝుల వారు కాజ గ్రామానికి ఎప్పుడు వచ్చింది తెలియకపోయినా నేడు ఉన్నటువంటి తల్లావఝుల వారికి నరశింహశాస్త్రి అనువారు మూలపురుషుడు. ఈయన కుమారుడు రాజగోపాలశాస్త్రి. వీరు తమ ప్రతిభా పాండిత్య విశేషముల చేత ధరిణికోటను రాజధానిగా చేసుకొని పాలించుచున్న వాసిరెడ్డి వారి నుండి కాజ గ్రామంలోని 400 ఎకరముల పొలమును కంద్రికగా సంపాదించారు.

రాజగోపాలశాస్త్రి గారి కుమారుడు రఘునందన శాస్త్రి. ఈయన కుమారుడు రుక్మిణీశ్వరశాస్త్రి. వీరి కుమారుడు గంగాధరశాస్త్రి. శాస్త్రి గారి కుమారుడు శ్రీకృష్ణశాస్త్రి. అయితే వీరిలో అందరూ కాలాంతరంలో యత్యాశ్రమమును స్వీకరించినవారే.

---

*1. విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ అనుబంధము, పుట-590*

నారాయణ తీర్థుల వారు పై వారికి మూలపురుషుడైన నరశింహశాస్త్రి గారికి సమకాలీకులు గానీ, లేక అంతకు పూర్వపువారు గానీ అయి ఉంటారు. ఈ తల్లావఝుల వారు ఎక్కడ ఉన్నా తీర్థుల వారు తమ వంశము వారని నేటికీ చెప్పుకుంటారు. వీరిలో కొందరు తమ పిల్లలకు పేరు చివర 'తీర్థులు' అని నామకరణం చేయుట కలదు. తీర్థుల వారు మా వంశంలోని వారని మరెవ్వరూ చెప్పుకోవడం లేదు. తీర్థుల వారి ఆనాటి రూపం తెలిపేటటువంటి చిత్తరువు ఉంది. ఆ చిత్తరువు తీర్థుల వారిదే అని నిరూపించుటకు ఆ రూపం వంటి వారే అనేకులు ఆ వంశంలో కూడా ఉండుట నిదర్శనముగా చెప్పుచున్నారు.

<u>**కాలము :**</u> నారాయణతీర్థుల వారి జననం విషయంలో పండితులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' అను గ్రంథమును రచించిన సుబ్బరాయ దీక్షితుల వారు తీర్థుల వారు 300 సంవత్సరముల క్రితం వారని రాశారు.

అయితే తీర్థుల వారు రచించిన పారిజాతాపహరణము అనే యక్షగాన గ్రంథము నందు చివరి కీర్తనలో 'అచ్యుతాబ్ధి ప్రభో వరదరాజ' అను చరణం కలదు. అచ్యుతాబ్ధి అనగా మెరటూరు. దానిని పాలించిన అచ్యుతప్ప నాయుడు క్రీ.శ. 1561-1614 వరకు ఉండెను. దీనిని బట్టి తీర్థుల వారు క్రీ.శ. 1600 నాటి వారని భావిస్తున్నారు.

కంచర్ల గోపన్నకు అప్పటి గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా భద్రాచల రామాలయంలో నందు ఉద్యోగిగా నియమిస్తూ హిజరీ 1075న జమాదిల వల్ మాసంలో ఒక ఫర్మానా ఇచ్చాడు. తీర్థుల వారు అంతకు పూర్వము వారు అను ప్రతీతి ఉంది.

<u>**విద్యాభ్యాసము :**</u> గోవిందుడికి 8వ సంవత్సరముననే ఉపనయనం చేశారు. వాసుదేవశాస్త్రి గారి వద్ద విద్యాభ్యాసం సాగింది. ఆయన వద్ద సర్వశాస్త్రములు అభ్యసించాడు. చదువుకొనే సమయంలో అప్పుడప్పుడూ కీర్తనలు గానం చేస్తూ దానిలో తన్మయత్వం చెందేవాడు. తోటి విద్యార్థులు దీనిని గమనించి గోవిందుడు పాటలు పాడుతూ పాఠములను నిర్లక్ష్యం చేస్తున్నాడని గురువు గారికి చెప్పారు. గురువు గారు గోవింద శాస్త్రిని పిలిచి పాటలు పాడవద్దని మందలించారు.

ఆ కాలంలో సాధారణంగా వేదశాస్త్ర పండితులు తమ శిష్యులు పాటలు పాడటానికి గాని, శ్రుత పాండిత్యం వలన కలిగిన జ్ఞానంతో గానం చేయడానికి గాని అంగీకరించేవారు కారు. రాగంతో శ్లోకం కూడా చదువనిచ్చేవారు కారు. గానం వల్ల వేద శాస్త్రాభ్యాసమునకు అనర్థం కలుగుతుందని వారి భయం. అంతే కాకుండా చెడిపోయే వారని కూడా అనుకొనేవారు.

గురువు గారు మందలించడము మరియు తోటి విద్యార్థుల బాధపడలేక గోవిందశాస్త్రి వేకువజామున లేచి నరసంచారము లేనంత దూరము వరకు గ్రామము వెలుపలకు వెళ్ళి అక్కడ ఒక చెట్టు క్రింద కూర్చుండి కీర్తనలు పాడుతూ తన్మయమవుతూ ఉండేవారు. తిరిగి పాఠముల సమయమునకు యథాప్రకారంగా గురువు గారి వద్దకు వెళుతుండేవారు.

ఈ విధంగా కాలం గడుస్తూ ఉండగా తోటి విద్యార్థులు కొందరు యీ విషయాన్ని గమనించి వీడు గురువుగారు వద్దన్నా వినకుండా గురుధిక్కారం చేస్తూ ఇంకా పాటలు పాడుతూనే ఉన్నాడని మరికొన్ని కూడా కల్పించి గురువు గారికి చెప్పారు.

గోవిందశాస్త్రి ఏకసంథాగ్రాహి అవడం చేత, శిష్యులందరిలోనూ గోవిందశాస్త్రి యందు అధిక ప్రేమ కలవాడవడం చేతను, గురువు గారు చెప్పుడు మాటల మీద ఆధారపడకుండా అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలనుకొని ఒక రోజు తెల్లవారుజామునే లేచి ముందుగానే గురువుగారు ఆ ప్రదేశానికి వెళ్ళి గోవిందశాస్త్రి కూర్చుండు చెట్టు చాటున కూర్చున్నాడు. తరువాత కొంతసేపటికి గోవిందశాస్త్రి వచ్చి యథాప్రకారంగా ఆ చెట్టు క్రింద కూర్చుండి గానం చేయడం ప్రారంభించి తన్మయావస్థలోనికి వెళ్ళిపోయాడు. ఇది గమనించిన గురువుగారు ఆశ్చర్యం పొంది శిష్యుడు మహాభక్తుడని గ్రహించి పరమానందం చెందాడు.

ఆరోజు ఉదయం యథాప్రకారంగా శిష్యులకు పాఠాలు చెబుతూ గురువుగారగు వాసుదేవ పండితుడు "గోవిందుడు సామాన్యుడు కాడు. భక్తి, జ్ఞాన, వైరాగ్యములు అతనికి జన్మతోనే లభించాయి. అతడికి నేర్చుకోవలసింది ఏమీ లేదు" అని గోవిందశాస్త్రిని గురించి చెబుతూ తాను చెట్టు దగ్గర చూచిన విషయం కూడా వివరించాడు. ఆ రోజు నుండి తోటి విద్యార్థులందరూ గోవిందశాస్త్రిని పరమ భాగవతోత్తమునిగా గౌరవిస్తున్నారు.

## సన్యాసాశ్రమ స్వీకారము - గురువులు :

గోవిందశాస్త్రి అత్తగారి ఊరు కృష్ణానదికి ఆవల ఒడ్డున ఉన్నటువంటి వేదాద్రి. ఇది కృష్ణాజిల్లా, జగ్గయ్యపేట మండలంలోనిది. ఒకనాడు గోవిందశాస్త్రి అత్తగారి ఊరు వెళ్ళడానికి కృష్ణను దాటుతున్నాడు. నది మధ్యలోకి వెళ్లేసరికి ప్రవాహం అధికమై ప్రాణాపాయస్థితి ఏర్పడింది. ఇక గత్యంతరం లేక ప్రేషోచ్చారణం చేసి మానసికంగా ఆతుర సన్యాసాన్ని స్వీకరించాడు. అంతలో దైవికంగా చేతికి ఆలంబనం దొరికి ఒడ్డుకు చేరాడు. అత్తవారింటికి వెళ్ళాడు. అత్తగారు కుమార్తెకు భర్త రాకను గురించి చెప్పింది. గోవిందశాస్త్రి భార్య పాదప్రక్షాళణమునకు నీళ్ళు తీసుకొని రాగా ఆమెకు అతడు సన్యాసిగా కనిపించాడు. వెంటనే తల్లి వద్దకు వెళ్ళి సన్యాసిని చూపించి అల్లుడు వచ్చాడని చెప్పావేంటని అడిగింది. ఉభయులు వచ్చి చూచి అల్లుడే అని తల్లి, కాదు సన్యాసి అని కుమార్తె అనడం గోవిందశాస్త్రి గమనించి నదిలో తాను మానసికంగా సన్యసించిన విషయం తెలిపి భార్య వద్ద సన్యాస స్వీకారము కొరకు అనుజ్ఞను పొంది తన జన్మస్థానమైన కాజ గ్రామానికి వచ్చాడు. సహోదరుని కుమారునితో తన కుటుంబాన్ని చూసుకోమని చెప్పి కాశీకి వెళ్ళి అక్కడ రామానందుల వారి వద్ద యత్యాశ్రమాన్ని స్వీకరించాడు.

'భక్త్యాధి కరణమాలా' శాండిల్య సూత్ర వ్యాఖ్యలో తీర్థుల వారు...

శ్లో॥ శ్రీరామ గోవింద సుతీర్థపాద
కృపావిశేషాదుపలభ్య బోధం ।
శ్రీ వాసుదేవా దధిగత్య సర్వ
శాస్త్రాణి వక్తుం కి మపి స్పృహా నః ॥

అని చెప్పారు. ఈ రామగోవింద తీర్థులకే శివరామానంద యతీంద్రతీర్థులని శ్రీకృష్ణ లీలా తరంగిణిలో ఉంది. గోవిందశాస్త్రి యతి అయిన తరువాత ఆయనకు 'శ్రీ నారాయణ తీర్థులు' అన్న ఆశ్రమనామం కలిగింది.

## శ్రీ నారాయణతీర్థుల రచనలు :

1. శ్రీకృష్ణ లీలా తరంగిణి : దీనికి గోవింద తీర్థుని సహాయంతో వేంకటేశ్వరుడను వారు ఒక వ్యాఖ్యను రచించినట్లు తెలుస్తోంది.
2. పారిజాతాపహరణము : ఇది తెలుగు యక్షగానము. తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయములో దీని వ్రాతప్రతి ఉంది. సిద్ధేంద్రయోగి కృష్ణాజిల్లాలోని కూచిపూడి అగ్రహారీకులకు దీనిని బోధించాడు.
3. హరిభక్తి పదార్ణవము : భాగవత దశమ స్కంధమును బట్టి రచింపబడ్డ సంస్కృత (వ్యాఖ్యానము) గ్రంథమిది. ఇందులోని కొన్ని ప్రకరణములు లుప్తమయ్యాయి.
4. శాండిల్య భక్తి సూత్రవ్యాఖ్య : ఇది భక్తి సిద్ధాంత సంబంధము
5. భక్త్యధికరణమాల : ఇది భక్తి సిద్ధాంత సంబంధము
6. సాంఖ్యకారికా వ్యాఖ్య : సాంఖ్యపరములు
7. సాంఖ్యతత్త్వ కౌముదివ్యాఖ్య : సాంఖ్యపరములు
8. న్యాయ కుసుమాంజలిటీక : తర్కపరమైనది
9. న్యాయముక్తావళీటీక : తర్కపరమైనది
10. భాట్టభాషా ప్రకాశము : పూర్వమీమాంసా గ్రంథము
11. యోగసూత్ర వ్యాఖ్య : యోగశాస్త్రపరమైనది
12. సిద్ధాంత బిందు : వేదాంత సంబంధమైనది
13. లఘుచంద్రిక : వేదాంత సంబంధమైనది
14. వేదస్తవటీక : వేదాంత సంబంధమైనది
15. వేదాంత విభావనాటిక : వేదాంత సంబంధమైనది
16. వివరణ దీపిక : సురేశ్వరాచార్యుల వారి పంచీకరణ వార్తికము మీద వివరణము ఇది.

వీటిలో కొన్ని ముద్రణమై ఉన్నాయి. మరికొన్ని ముద్రణ కాలేదు. ఇవన్నీ కాశీవిశ్వవిద్యాలయంలో ఉన్నాయి.

తీర్థుల వారు తమ వ్యాఖ్యలను కొన్నింటిని చంద్రికలుగాను, మరికొన్నింటిని గురుచంద్రికలుగాను చెప్పారు. వీటిలో భాట్టభాషా ప్రకాశమును పూర్వాశ్రమంలో ప్రారంభించి యత్యాశ్రమంలో ముగించారు.

"భగవచ్ఛివరామ తీర్థ శిష్యోమునినారాయణ తీర్థ నామధేయః వ్యతనోదధి కాశి భాట్ట భాషా గ్రంథనం భాట్టనయ ప్రకాశ హేతోః" అని భాట్ట భాషా ప్రకాశములో ఉంది.

## కాశీవాసము - భారతదేశ యాత్ర :

నారాయణతీర్థులు కాశీ క్షేత్రంలో ఏడు ఇండ్లకు వెళ్ళి భిక్షను తెచ్చుకొని ఆహారం తీసుకుంటూ ఎల్లప్పుడు కృష్ణ పరమాత్మ ధ్యాన తన్మయులవుతూ ఉండేవారు. ఆ విధంగా వీరు గానం చేస్తూ ఉంటే కృష్ణ పరమాత్మ బాలుని రూపంలో నృత్యం చేస్తూ ఉండేవాడు. తన ధ్యానమునకు ఇతరుల వలన అభ్యంతరం కలుగకుండడానికి గది తలుపులు వేసుకొని గానం చేస్తూ ఉండేవారు. తీర్థుల వారి గానమే కాకుండా లోపల నుండి మద్దెల, తాళముల ధ్వని, గజ్జెలమ్రోత వినిపిస్తూ ఉండేది. ఇది సమీపమున ఉన్నవారికి అనుమాన కారణమైంది. స్త్రీలతో రాత్రిళ్ళు కాలక్షేపం చేస్తున్నాడని తీర్థుల వారి మీద నిందను మోపి ఇరుగుపొరుగు వారు ప్రచారం చేయటం ప్రారంభించి భిక్ష వేయడం మానివేశారు. తీర్థుల వారు కూడా భిక్షకు వెళ్ళడం మానివేశారు. నిరంతరం భగవన్నామ చింతనలో మునిగి కాలము తెలియకుండా ఉన్నారు. తీర్థుల వారిని అనుమానించిన వారికి నిరంతరం ఆయన చర్యను పరీక్షించడమే పని అయింది. ఆయన ఎంత కాలమైన తలుపులు తెరవకపోవడంతో కొంతమంది ఆ చిత్రం తెలుసుకోవడానికి ఇంటికి ఒక (సూక్ష్మమార్గం) చోట కన్నం వేసి చూడగా లోపల ఒక మహాతల్లి తీర్థుల వారికి అన్నం కలిపి నోటిలో పెడుతూ ఉండడం కనిపించింది. అందరూ చేరి తలుపులు తెరచి చూస్తే లోపల అన్నము లేదు. ఆమెయును లేదు. తీర్థుల వారు తీవ్రమైన సమాధి అవస్థలో ఉన్నారు. తప్పు తెలుసుకొని వారు తీర్థులవారు దైవాంశ సంభూతులు అని గ్రహించి ఆ రోజు నుండి తీర్థుల వారిని అత్యంత భక్తి శ్రద్ధలతో సేవించారు.

మరి ఒకసారి తీర్థుల వారి నుండి చందనపు వాసన వస్తూ ఉంటే కొందరు సంశయించి ఆయన ఉన్న ఇంటి పైకప్పుకు రంధ్రం వేసి చూస్తే తీర్థుల వారు గానం చేస్తున్న సమయంలో శ్రీకృష్ణ భగవానుడు గోపికలతో కూడా నృత్యం చేస్తున్న దృశ్యం కనబడింది. విభ్రాంతి చెంది వారు తాము చేసిన అపరాధానికి తీర్థుల వారిని క్షమాపణలు కోరుకున్నారు. పరమాత్మ సందర్శన భాగ్యం కలిగినటువంటి అదృష్టవంతులు మీరు అని తీర్థులవారు వారిని అభినందించి తాను భగవంతుని చూడలేకపోయానే అని చింతించారు.

ఒకరోజు పండితులనెందరినో గెలిచిన ఒక కాశ్మీరీ పండితుడు నారాయణతీర్థుల వారిని జయపత్రం ఇవ్వమని అడిగాడు. తీర్థులు అందుకు సమ్మతించి ఇచ్చారు. ఏనుగుపై ఊరేగుతున్న ఆయనను తీర్థుల శిష్యులు ప్రశ్నల పరంపరతో ఉక్కిరిబిక్కిరి చేసి ఆ కాశ్మీర పండితుని ఓడించారు. ఓటమి ఒప్పుకున్న ఆ పండితుడు తనకు లభించిన బహుమానాలను తీర్థుల వారి ప్రథమ శిష్యునకు అప్పగించాడు. ఈ వృత్తాంతాన్ని తెలుసుకున్న తీర్థులు శిష్యుని నుండి తిరిగి వాటినన్నింటినీ ఆ కాశ్మీర పండితునకు ఇప్పించారు. అతడే తీర్థుల వారికి శిష్యుడై అనంతర కాలంలో కాశ్మీర సదానంద కవిగా ప్రసిద్ధికెక్కాడు.

అటు తర్వాత తీర్థుల వారు కాశీ నుండి దక్షిణ భారతదేశమునకు యాత్ర చేస్తూ మార్గమధ్యంలో ఒరిస్సా రాష్ట్రంలోని పూరీజగన్నాథుని దర్శించి ఆ స్వామిని స్తుతిస్తూ సౌరాష్ట్రరాగం త్రిపుటతాళంలో ఒక కీర్తన వ్రాశారు.

*ప॥ సుభద్రా బలభద్ర సుదర్శన సహిత*
*అ॥ప॥ ఇభరాజతారక ఈశమామవదేవ ॥ -1*

అనంతరం తీర్థుల వారు ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ ప్రాంతం అమలాపురం మండలంలోని కూచిమంచి అగ్రహారంలో మూడు సంవత్సరములు ఉన్నారు.

అలా పర్యటన చేస్తూ తీర్థుల వారు కృష్ణాజిల్లా నూజివీడు మండలం ఆగిరిపల్లి గ్రామంలోని శ్రీ శోభనాద్రి నృసింహస్వామి వారిని దర్శించి ఆ స్వామిపై సావేరి రాగం త్రిపుట తాళంలో కీర్తన రాశారు.

*ప॥ కరుణయావలోకయ మాం శ్రీనృసింహ*
*శూరాసురసంహార శోభనాద్రి శ్రీనృసింహ -2*

తరువాత చల్లపల్లి మండలం కృష్ణా తీరంలో ఉన్న శ్రీకాకుళానికి వెళ్ళి అక్కడ స్వామిని సేవించి శంకరాభరణ రాగం మిశ్ర చాపుతాళంలో కీర్తన రాశారు.

*ప॥ నవజలధరశ్యామం నందితబలరామం*
*ఏకాంత దైవతం యాదవాబ్ధి సముదితం*
*శ్రీకాకుళనగరీ శ్రీభూమిసహితం*
*నాకవల్లభగీతం నారాయణతీర్థ రచితం*
*వికటమోహరహితం విజయగోపాలమసితం -3*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణి 1 : 3 : పుట-9*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణి 6 : 7 : పుట-254*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణి, 10 : 6 : 3 : పుట-447*

తరువాత తీర్థుల వారు అత్తగారి ఊరగు వేదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని సేవించి, కాంభోజి రాగం ఝంపె తాళంలో కీర్తన రచించి తన భక్తిని చాటుకున్నారు.

*కీర్తన : వేదాద్రి శిఖరనరసింహ మా కలయామి*
*విమల విద్యుజ్జ్వలితజిహ్వం*
*వేదాంత వేద్యవిమలానందవిజ్ఞాన*
*విదళిత దురంత భవమోహం త్వాంనౌమి ॥ -1*

తనకు కలిగిన శూల వ్యాధి నివారణ కోసం తీర్థుల వారు ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, శింగరాయకొండకు వెళ్ళి అక్కడ గుండ్లకమ్మ నదీ తీరంలోని నృసింహస్వామిని గూర్చి తపస్సు చేయగా ఆ వ్యాధి నివారింపబడింది. అక్కడే తీర్థుల వారు సమీపంలోని 60 గ్రామముల వారికి తరంగాలను బోధించారు. అందుచేతనే తరంగగానంలో అద్దంకి వారిది శుద్ధమైన సంప్రదాయమని నేటికీ పేరు కలిగి ఉంది.

అనంతరం తీర్థుల వారు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించి మార్గమధ్యంలో ఇంకా అనేక పుణ్యక్షేత్రాలను చూస్తూ తంజావూరు జిల్లా కావేరీ నదికి ఉపనది అయిన “కుడుమపత్తి” అనే నదికి దక్షిణ తీరాన ఉన్న వరహూరు (భూపతిరాజపురం) కు చేరారు. అక్కడ ప్రజలు ఆయన యొక్క దివ్యమహిమను గుర్తించి సేవించారు. అక్కడ రాజు నిర్మించిన దేవాలయంలో తీర్థుల వారు స్వయంగా శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భూపతిరాజపురంలో మూడు సంవత్సరములు ఉండి అక్కడి వారికి తరంగములను నేర్పారు.

ఈ విధంగా తీర్థుల వారు అనేక దివ్య క్షేత్రాలను దర్శిస్తూ మధ్యార్జునము అని పేరు కలిగిన తిరువిడై మరుదరై అనే ప్రదేశానికి చేరారు. అది గొప్పవైన ఉద్యానవనాలతో నిండింది. అక్కడ శ్రీమహాలింగస్వామిని దర్శించి అక్కడ నివసిస్తూ ఉన్న సచ్చిదానందస్వాముల వారిని దర్శించారు. వారు తీర్థుల వారిని పంచనదీ క్షేత్రమునకు వెళ్ళి ఉండవలసిందిగా సెలవిచ్చారు.

తీర్థుల వారు ఐదు నదులతో చుట్టబడిన తిరువయ్యూరు దివ్యక్షేత్రానికి చేరుకొని అక్కడ ఒక బిల్వవృక్షం క్రింద కూర్చున్నారు. అక్కడ నుండి ఏకాంతంగా ఉండడానికి విళాంగుడిలోని ఇప్ప తోటలో ఒక చెట్టు క్రింద నివసించారు. అక్కడ నుండి కొళ్ళడమునకు ఉత్తర దిక్కుగా ఉన్నటువంటి తిరుమళ్ళప్పాడియల్‌లో ఒక చోట కూర్చున్నారు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణి, 11 : 8 : పుట-475*

అక్కడ నుండి తీర్థుల వారు దక్షిణదిశగా వెళుతూ సూర్యాస్తమయ సమయానికి బ్రాహ్మణులు అధికంగా ఉండేటటు వంటి నడుక్కావేరి గ్రామానికి చేరుకున్నారు. ఆ గ్రామంలోని వినాయకుని గుడిలో రాత్రి బసచేసి యోగంలో ఉన్నారు. ఆ రాత్రి కలలో శంఖచక్రాలతో శ్రీమహావిష్ణువు సాక్షాత్కరించి తాను పూర్వం ధరించిన అనేక రూపాలను చూపాడు. చివరగా శ్రీ వేంకటేశ్వరస్వామి అవతారంగా దర్శనమిచ్చి తీర్థుల వారిని రేపు ఉదయం ఇక్కడ కనబడే వరాహం వెంట వెళ్ళి అది చూపేటటువంటి చోటుకు చేరెదవు గాక" అని పలికి అంతర్థానమయ్యాడు.

తెల్లవారిన తరువాత స్వామి కలలో చెప్పినట్లు ఒక వరాహం కనబడింది. తీర్థుల వారు వరాహం వెంట వెళుతూ ఉండగా అది వరగూరు అను ఒక గ్రామంలో బ్రాహ్మణవీధి మధ్యలోని ఒక ఇంటిలో దూరి అదృశ్యమైంది. తనను తీసుకు వచ్చిన వరాహం సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అని భావించి స్వామి వారి దశావతారాలను గూర్చి పాడుకుంటూ అక్కడే ఉన్నారు.

*కీర్తన : మత్స్యకూర్మ వరాహ నరమృగవామనామర భార్గవ*
*కుత్సితారివిరామదశరథ రామబలరామాభవ కృష్ణ కృష్ణ -1*

ఇది మత్తకోకిల అనే వృత్తము. సంస్కృత కవులు వాడలేదు. తెలుగులో పోతన మొదలైనవారు వాడారు. గానానుగుణంగా ఉండే దీనిని తీర్థులు స్వీకరించి తన తెలుగుతనాన్ని నిరూపించుకున్నారు.

ఏడు రోజులు నిష్ఠతో ఉండి ఎనిమిదవ రోజు అదే యింటిలో దేవాలయాన్ని ఏర్పాటు చేయించి దానిలో శ్రీ వేంకటేశ్వరుని ప్రతిష్ఠించాడు. పెరటాసి నెలలోను, శనివారములందు పూజలు చేస్తూ గోకులాష్టమికి ఉత్సవములు నిర్వహించేవారు.

ఒకనాటి రాత్రి కలలో శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై తన లీలలను గానం చేయవలసిందని ఆజ్ఞాపించి అంతర్థానమయ్యాడు. అప్పుడు 'జయజయరమానాథ' అనే తరంగాన్ని గానం చేశారు.

*ప॥ జయజయరమానాథ జయజయధరానాథ*
*అ॥ప॥ జయజయవరాహపురీ శ్రీవేంకటేశ ॥ -2*

తరువాత తీర్థుల వారు తిరువైయారు సమీపమున కల "కొల్లనొౌతురిత్తియే" అనే క్షేత్రానికి వచ్చి శ్రీ అప్పర్ స్వామిని దర్శించి అక్కడ నుండి కావేరీ నదికి దక్షిణాన గల తిరుపుందుర్తి క్షేత్రానికి చేరుకున్నారు. అక్కడ నది ఒడ్డున కల ఒక మామిడి చెట్టు క్రింద కూర్చుండి చాలా కాలము తపస్సులో ఉన్నారు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణి, 1 : 5 : పుట-15*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణి, 1 : 4 : పుట-12*

**శిష్యులు :**

నారాయణ తీర్థుల

వారి శిష్యులలో గౌడ బ్రహ్మానందులు, కాశ్మీర సదానందులు, ఆంధ్ర మహేశ్వర తీర్థులు ప్రముఖులు.

**తిరుపుందుర్తిలో సమాధి అగుట :**

నారాయణ తీర్థుల వారు తన నిర్యాణ సమయాన్ని అమరసింగ మహారాజునకు, తిరుపుందుర్తి వాసులకు, తన శిష్యులకు ముందుగా చెప్పారు. తీర్థు వారి మోక్ష కాలాన్ని దర్శించడానికి అనేక మంది విచ్చేశారు. 1745 సంవత్సరం – మాసి నెల – శుక్ల పక్షము – అష్టమి తిథి – కృత్తికా నక్షత్రము – గురువారం రోజు తమిళనాడులోని తిరుపుందుర్తిలో తీర్థుల వారి దేహం నుండి దివ్య తేజస్సు వినీలాకాశంలో అంతర్థానమయింది.

**తీర్థుల వారి మహిమలు :**

తిరుపుందుర్తి నది ఒడ్డున తీర్థుల వారు తపస్సు చేసిన మామిడిచెట్టు నేటికి 400 సంవత్సరముల కాలం నుండి చెక్కుచెదరకుండా నిలిచి ఉంది. 1952 నవంబరు 30వ తేదీన వచ్చిన పెద్ద తుఫాను తాకిడికి అక్కడి మహా వృక్షాలన్నీ నేలకూలినా అది మాత్రం చెక్కు చెదరకుండా నిలిచి ఉండటం తీర్థుల వారి మహిమకు నిదర్శనముగా నిలుస్తోంది.

తీర్థుల వారు తనకు సేవ చేసిన బ్రాహ్మణుని ఉద్ధరింపతలచి ఆతని చేతికి ఒక ఆకును ఇచ్చి యీ విధంగా పలికారు. "తంజావూరు రాజధానిగా చేసుకొని పాలించుచున్న అమరసింహ మహారాజు పూర్వజన్మ కర్మ ఫలితంగా చేతిలో ఏర్పడిన వ్రణంతో బాధపడుతున్నాడు. ఈ మూలిక ఆ వ్రణానికి దివ్యౌషధము. నీవు దానికి ఉపయోగించుము. నీకు మేలు కలుగుతుంది" అని ఆశీర్వదించి పంపారు. బ్రాహ్మణుడు తీర్థుల వారి ఆదేశానుసారంగా మహారాజు వద్దకు వెళ్ళి అతని చేతిలో మూలికా ఔషధాన్ని ప్రయోగించాడు. దానితో పూర్తి స్వస్థత పొందిన మహారాజు ఆ బ్రాహ్మణునకు అనేక విధమైన కానుకలు ఇచ్చి సంతోషపెట్టాడు.

తనకు మూలిక లభించిన వృత్తాంతం బ్రాహ్మణుడు చెప్పగా విని అమరసింహుడు తీర్థుల వారిని దర్శించి అత్యంత భక్తి శ్రద్ధలతో వారిని సేవించాడు. అక్కడ ఒక గుడి కట్టించాలని, తీర్థుల వారి వద్ద నున్న మేక తిరగడానికి కొంత భూమిని ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. ఆయన సంకల్పానికి అనుగుణంగా తీర్థుల వారి వద్దనున్న మేక లేచి తన వెనుక కాలితో గీతను గీస్తూ తోటలో కొంతభాగం చుట్టి వచ్చింది.

రాజు ఆనందాశ్చర్యాలు పొంది ఆ మేక చుట్టి వచ్చిన ప్రదేశమంతా పట్టా చేసి యిచ్చాడు. అక్కడ రాజు సూర్యపుష్కరిణి అనే పేరుతో ఒక తటాకాన్ని త్రవ్వించాడు. మేక వచ్చి నిలబడిన ప్రదేశంలో ఒక దేవాలయమును, మంటపాన్ని, ప్రాకారాన్ని కట్టించాడు.

"నానృషిః కురుతేకావ్యం" అన్నది ఆర్యోక్తి. అంటే ఋషికానివాడు కావ్యం రాయలేడు అని భావము. కేవలం వనాలలోనో, నదీ తీరాలలోనో తపస్సు చేసుకొనేవారు మాత్రమే ఋషులు కారు. భార్యా పిల్లలతో లౌకిక ప్రపంచములో గడుపుతూ ఆ సుఖాలకు ప్రాధాన్యమియ్యకుండా పారలౌకిక సుఖంకోసం పారమార్థిక చింతనతో కృషి చేసే గృహస్థుడు సైతం ఋషులే అనటం సముచితం. ఈ కోవకు చెందినవారు సంసారిక విషయాల పట్ల తామరాకుపై నీటి బొట్టులా వ్యవహరిస్తారు. కృష్ణ తత్త్వానికి భాగవతం, నారాయణ తీర్థుల, శ్రీకృష్ణలీలాతరంగిణీ మణిదీపాలవంటివి. ఈ పరిశోధన పోతన, తీర్థుల వారికి సంబంధించింది మాత్రమే అయినా కృష్ణ తత్త్వాన్ని ప్రతిపాదించిన వారిలో వ్యాసభగవానుడు ఆద్యుడు. ఈ కారణంచేత ఋషిత్రయం అన్న శీర్షికతో యీ ప్రకరణాన్ని కొనసాగిస్తూ వ్యాస , పోతన, తీర్థులకు సంబంధించిన విషయాలను, వారు ప్రతిపాదించిన కృష్ణ తత్త్వాన్ని సంక్షిప్తంగా ప్రతిపాదించే ప్రయత్నం చేసాను. గురువులందరికీ మహాగురువు శ్రీ కృష్ణుడు కాబట్టి "కృష్ణం వందే జగద్గురుం" అని సంభావించి ఈ ప్రకరణాన్ని ప్రారంభించాను.

వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషమ్ ।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥



# వేద వ్యాస మహర్షి

# కథా సారాంశము

***పోతన భాగవతం దశమస్కంధ పూర్వభాగంలో 1791 గద్య పద్యాలలో చెప్పబడ్డ కథాభాగం తీర్థుల వారి గ్రంథంలో 12 తరంగాలుగా వర్ణింపబడింది.***

## శ్రీకృష్ణావిర్భావ ఘట్టము :

మధురా నగరాన్ని రాజధానిగా చేసుకొని శూరసేనుడు అను యాదవరాజు మధురకు, శూరసేనమునకు సంబంధించిన దేశాలను ప్రజానురంజకంగా పాలిస్తున్నాడు. అతని కుమారుడు వసుదేవుడు. ఇదే సమయంలో యదు, భోజ, అంధక దేశాలను ఉగ్రసేనుడు ఏలుతున్నాడు. ఇతని కుమారుడు కంసుడు. పినతండ్రి దేవకుని కుమార్తె, చెల్లెలైన దేవకి యందు మిక్కిలి వాత్సల్యము కలవాడై యుండెను.

దేవకుడు తన కుమార్తెను వసుదేవునకు ఇచ్చి వివాహము చేశాడు. సోదరి దేవకి యందు అనురాగము కలవాడగుటచే కంసుడు తానే స్వయముగా రథం నడుపుతూ భేరీ, మృదంగ, శంఖ, పటహ ధ్వనుల నడుమ బావగారి గృహమునకు తీసుకొని వెళ్ళుతున్నాడు.

*సీసము॥ ఆ శూరసేనుని కాత్మజుండగు వసుదేవుఁడా పురి నొక్క దినము నందు*
*దేవకిఁ బెండ్లియై దేవకియును దానుఁగడు వేడ్క రథమెక్కి కదలువేళ*
*నుగ్రసేనుని పుత్రుఁడుల్లాసి కంసుండు చెల్లెలు మఱఁదియు నుల్లసిల్లి*
*హరుల పగ్గములఁ జేనంది రొప్పఁదొడంగె, ముందట భేరులు మురజములును*

*ఆ॥వె॥ శంకపటహములును జడిగొని మ్రోయంగఁగూఁతు తోడివేడ్కకొనలుసాఁగ*
*దేవకుండు సుతకు దేవకీ దేవికి, నరణమీఁదలంచి యాదరించి -1*

దేవకి వెంట అరణంగా పంపబడిన పదునెనిమిది వందల రథాలు, అలంకరింపబడియున్న నాలుగు వందల ఏనుగులు, పదివేల గుఱ్ఱములు, సుందరీమణులు, విలాసవతులు అయిన దాసికాజనము రెండు వందలు మంది అనుసరిస్తుండగా గుర్రాల పగ్గాలు సడలించి రాచబాటలో కంసుడు రథాన్ని వేగంగా నడపసాగాడు. ఇంతలో అకస్మాత్తుగా "కంసా ! సోదరి యందు ప్రేమతో రథం నడుపుతున్న నీకు ముందు రానున్న ఆపద తెలియజేస్తున్నాను. దేవకీ దేవి అష్టమగర్భ సంజాతుడు నీకు మరణ కారకుడౌతాడు సుమా!" అని అశరీరవాణి పలికింది. ఈ మాటలు కంసునికి పిడుగుపాటైనాయి.

*కందం॥ "పగ్గములు వదలి వేగిర, మగ్గలముగ రథముఁగడపు నా కంసుఁడు లో*
*బెగ్గిలి యెగ్గని తలఁపఁగ, దిగ్గన నశరీరవాణి దివినిట్లనియెన్" -2*

---

*1. పోతన భాగవతం, 10 : 20 : పుట-4, 5*

*2. పోతన భాగవతం, 10 : 22 : పుట-5*

కందం॥ తుష్టయగు భగిని మెచ్చఁగ, నిష్టుఁడవై రథముగడిపె, దెఱుఁగవు మీదన్

*శిష్టయగు నీ తలోదరి, యష్టమ గర్భంబు నిన్ను హరియించుఁజుమీ ! ॥ -1*

పై విషయమంతా నారాయణ తీర్థులు ఒక గద్యంలో క్లుప్తీకరణ చేసి వ్యక్తపరిచారు.

గద్యం : అథ దేవకీ వసుదేవయోః వివాహోత్సవానంతరం వసుదేవ గృహప్రవేశ సమయే తయోస్సారథ్యం కుర్వతి కంసే దేవక్యాస్త్వష్టమో గర్భః కంసమృత్యురిత్యశరీరవాక్యం శృత్వా కంసోవసుదేవం ప్రత్యాహ ॥ -2

'దేవకి కడుపున జన్మించే ఎనిమిదవ బిడ్డ తనను చంపుతాడు' అన్న భావన మనసులో ఎప్పుడైతే కలిగిందో కంసుడు ఖిన్నమనస్కుడై బద్ధలైన హృదయం కలవాడయ్యాడు. సహజంగానే క్రూరస్వభావుడైన కంసుడు తనకు చెల్లెలు ద్వారానే మృత్యువు కలుగుతుందన్న భయంతో ఉలిక్కిపడ్డాడు. రక్తసంబంధాన్ని మరచి, తెగించి కొప్పుపట్టి దేవకిని క్రిందకు లాగి కత్తి దూసి ఆమెను చంపబోతూ ఉండగా వసుదేవుడు అడ్డుపడ్డాడు.

*వచనం: "అని యిట్లాకాశవాణి పలికిన నులికిపడి భోజకుల పాంసనుండైన కంసుండు సంచలదంసుండై యడిదంబు బెడిదంబుగాఁ బెఱికి జళిపించి దెప్పరంబుగ ననుజ కొప్పుఁబట్టి కప్పరపాటున నొప్పఱందిగిచి యొడిసిపట్టి, తోఁబుట్టువని తలంపక తెంపుసేసి తెగవ్రేయ గమకించు సమయంబున వసుదేవుండు డగ్గఱి॥ -3*

బావా! గాలిమాటలు విని అవే నిజమనుకొని యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం మరచి ఆగ్రహోదగ్రుడవై అగ్నిజ్వాలలుగా మండిపడటం వివేకం అనిపించుకోదు. అన్నగారవైన నీవు చెల్లెలుకు ధన, కనక వస్తు వాహనాదులతో సంతోషపెట్టి ఆడపడుచును ఆదరించి గౌరవించాలి. సహనం నశించి ఆమెను చంపడం ధర్మం కాదు. దయతో ఆమెను రక్షించవలసినదిగా అర్థిస్తున్నాను.

*ఉ॥ "అన్నవు నీవు చెల్లెలికి, నక్కట! మాడలు చీరలిచ్చుటో !*
*మన్ననసేయుటో? మధుర మంజుల భాషలనాదరించుటో ?*
*'మిన్నుల మ్రోఁతలే నిజము. మే'లని చంపకుమన్న మాని రా*
*వన్న ! సహింపుమన్న ! తగదన్న! వధింపకుమన్న! వేఁడెదన్" -4*

భోజవంశం ఉత్కృష్టమైనది. ఈ వంశంలో జన్మించిన వారందరూ పుణ్యమూర్తులు, పవిత్రులున్నూ. నీవు అటువంటివాడవు కాక మరేమిటి? అమాయకురాలు, ఎల్లప్పుడూ నీ క్షేమాన్నే కోరు నీ చెల్లెలు దేవకి ప్రాణసమానంగా ప్రేమించే నీ చేతనే చంపబడటం ఆలోచించి చూస్తే నీ ప్రతిష్ఠకు భంగం కాదా? అదే కాక అశరీరవాణి మాట కారణంగా చంపడం మరీ అన్యాయము, మహాపాపము కూడా.

---

*1. పోతన భాగవతం, 10 : 23 : పుట-5*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 17 : పుట-22*

*3. పోతన భాగవతం, 10 : 24 : పుట-5*

*4. పోతన భాగవతం, 10 : 26 : పుట-6*

*మ॥ చెలియల్, గన్నియ, ముద్దరాలబల, నీ సేమంబు చింతించు ని*
*ర్మల, దీనిన్ బయలాడు మాటలకు నై మర్యాదఁబోఁదట్టి, స*
*త్కుల జాతుండవు పుణ్యమూర్తి వకటా! గోపంబు పాపంబు నె*
*చ్చెలి నోహో ! తెగవ్రేయఁబాడియగునే ? చింతింపు భోజేశ్వరా ॥ -1*

*"వసుదేవ హనిష్యామి కరిష్యామ్యాత్మనో హితమ్ ।*
*దేవకీం భగినీ మేనాం మృత్యుబీజం మమాప్యహమ్ ॥ -2*

నా భయమునకు కారణమైన దేవకిని నా చెల్లెలైనా సంహరిస్తాను అంటూ దేవకిని చంపడానికి సిద్ధపడిన కంసుని పలుకులను తీర్థుల వారు పై శ్లోకంలో తెలియచేశారు.

భార్యను రక్షింపదలచిన వసుదేవుడు కంసుని అనునయించుటను నారాయణ తీర్థుల కీర్తన రూపంలో రచించారు.

*కీర్తన :*

*ప॥ హే కంస రాజసుత హే నరశ్రేష్ఠ*
*అ॥ప॥ హే సత్య సంధకుల జలధి భవరత్న*

*చరణం॥ హే సౌమ్యగుణయుక్త హితజనాసక్త*
*కళ్యాణవేద్యాం చ కలితబహుభద్రాం*
*ముంచ భగినీ మద్య ముహురధిక హృద్యాం*
*సత్యం వదామితవ సత్య సంధోకస్మి*

*చరణం॥ దాస్యామి తజ్జాత వత్సాన నింద్య*
*మా సాహసం కర్తు మర్హసి సదైవ*
*తవ భగిన్యైవ సహ సుఖమధివసామి*
*భవనే తవైవపర మస్తు శుభమద్య -3*

ఈ కీర్తన యొక్క నడక గానానుకూలమైన మాత్రాఛందస్సులో ప్రముఖమైన ద్విపదకు దగ్గరగా ఉంది.

నేను నీ మనస్సుకు ప్రియం చేకూర్చే మాటను చెబుతున్నాను. ఈమె యొక్క ఎనిమిదవ గర్భము వాడు నిన్ను చంపును అన్న వార్త నీకు భయమును కలిగించింది. కానీ నేను బిడ్డలందరినీ నీకు అప్పగిస్తాను. నీ యిష్టప్రకారం కానిమ్ము. నేను నిన్ను కోరేది ఒక్కటే. నీ చెల్లెలు సుఖంగా ఉంటే చాలు. ఆ వరం నాకు అనుగ్రహించు. మేము నీ యింటనే ఉంటాము. అప్పుడు మాకు తప్పించుకొను అవకాశము కూడా కలుగదు.

---

1. *పోతన భాగవతం, 10 : 28 : పుట-6*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 18 : పుట-22*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 10 : పుట-23*

అప్పుడు నీకు విచారం పోతుంది. మేలు పొందుతావు.

*శ్లో॥ దదౌ కంసాయ దేవక్యాశ్శిశుం ప్రథమజం నృపః ।*
*అష్టమం సరిపుం మత్వా దదౌ కంసః పునశ్శిశుమ్ ॥ -1*

అన్నమాట ప్రకారము వసుదేవుడు తన మొదటి బిడ్డను కంసునకు ఇవ్వగా ఎనిమిదవవాడు శత్రువు కనుక వీడు వధార్హుడు కాదు అని అతని పుత్రుని అతనికే ఇచ్చి పంపివేశాడు.

ఈ భావమునే పోతనగారు ఆత్మీయ వచనముల ద్వారా ఉత్కృష్టముగా వెల్లడించినారు.

*కందం॥ పలికిన పలుకులు దిరుగక, సొలయక వంచనము లేక సుతుల రిపునకుం*
*గలఁగక యిచ్చిన ధీరుం, డిల వసుదేవుండు దక్క నితరుఁడు గలఁడే ? -2*

వసుదేవుడు మోసం చెయ్యాలి అనే తలంపు లేనివాడు. కనుకనే ఆడిన మాట తప్పవలసి వస్తుందనే భయంతో, శత్రువు చంపడానికి తన బిడ్డను ఇస్తున్నాననే బెంగ లేకుండా, తాత్సారం కాకుండా కన్నకొడుకును కంసునకు అప్పగించిన ధీరుడు వసుదేవుడు. ఇటువంటి వాడు మరొకడు భూమిపై ఉండడు అని పోతన గారి భావం.

ఈ సంఘటన ద్వారా కంసుడు ఆనందం, ఆశ్చర్యం ఒకేసారి పొందాడు. మనసులో ఇక ఎటువంటి శంక లేనివాడై

*ఆ॥వె॥ కొడుకు నీవు మరల ఁగొనిపొమ్ము వసుదేవ ! వెఱపు లేదు నాకు వీని వలన*
*నల్గవీనికి భవదష్టమపుత్త్రుండు మృత్యువఁట ! వధింతు, మీఁద నతని ॥ -3*

నీ ఎనిమిదవ కొడుకు నాకు మారకుడౌతాడట. కనుక వాడినే తీసుకురావలసింది. వాణ్ణి నేను వధిస్తాను అని పలికి వసుదేవుణ్ణి పంపివేశాడు. ఇక్కడ కంసుని దయాస్వభావం కన్నా సోదరిపై ఏ మూలనో ఉన్న అల్పప్రేమ దాన్ని మించి ఆత్మవిశ్వాసపూర్వక దర్పోద్ధతి వెల్లడి అవుతున్నాయి.

ఒకనాడు నారదుడు కంసుని గృహానికి వచ్చాడు. రాజా ! వ్రేపల్లెలోని యాదవులందరూ దేవతా సమూహమే కానీ మానవమాత్రులు కారు. భూమిని రక్షించడానికి, రాక్షస సంహారానికి, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువే దేవకీ దేవి గర్భాన జన్మిస్తాడు.

*సీసము॥ ఒకనాఁడు నారదుండొయ్యన కంసుని యింటికి ఁజనుదెంచి యేకతమున*
*మందలోపలనున్న నందాదులును, వారి భార్యలుఁ బుత్త్రులు బాంధవులును*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 30 : పుట-42*
2. *పోతన భాగవతం, 10 : 47 : పుట-10*
3. *పోతన భాగవతం, 10 : 50 : పుట-10*

*దేవకి మొదలగు తెఱవలు వసుదేవుఁడాదిగా గల సర్వయాదవులును*

*సురలు గాని, నిజంబునరులుగారని చెప్పి 'కంసుండ! నీవు రక్కసుఁడవనియు*

*ఆ॥వె॥ దేవమయుఁడు చక్రి దేవకీ దేవికిఁ బుత్త్రుఁడై జనించి భూతలంబు*

*సెఱుపఁ బుట్టినట్టి చెనఁటి దైత్యుల నెల్లఁజంపు ననుచుఁ జెప్పిచనియె దివికి -1*

ఎనిమిదవవాడు కదా నిన్ను చంపును అన్న అవివేకముతో వీరిని ఉపేక్షించి నీవు చంపలేదు. అతనికి వీరు సహాయకులై తద్వారా నీకు శత్రువులవుతారు. కనుక వీరిని వధింపుము అని నారదుడు పలికాడు.

*శ్లో॥ అష్టానామష్టమత్వేతు నవిశేషోఽస్తి కశ్చన ।*

*ఉపేక్షసే కథం మూఢ యత్కర్తవ్యం కురుష్వతత్ ॥ -2*

*పై శ్లోకం తీర్థుల వారి తర్కశాస్త్ర ప్రావీణ్యానికి ఉదాహరణ :*

*కందం॥ తొడితొడిఁ గంసుఁడు దేవకి, కొడుకుల నార్వుర వధింప గురు శేషాఖ్యం*

*దొడవగు హరి రుచి యాసతి, కడుపున నేడవదియైన గర్భంబయ్యెన్ ॥ -3*

*శ్లో॥ ఏవముక్తో నారదేన షట్సుతానవధీత్ఖలః ।*

*సంకర్షణస్తు రోహిణ్యామానీతోయోగమాయయా ॥ -4*

వెనువెంటనే కంసుడు దేవకీదేవి ఆరుగురు బిడ్డలను వధించాడు. విష్ణుదేవుని తేజమైన యోగమాయ ఏడవదిగా ఆమె గర్భంలో ప్రవేశించినది.

నారద మహర్షి మాటలు విని కంసుడు క్రోధంతో దేవకీ వసుదేవులను పట్టి బంధించి తన తండ్రి అయిన ఉగ్రసేనుని కారాగారంలో వేయించి పట్టుదలతో శూరసేన దేశానికి రాజై పాలిస్తున్నాడు.

*తే॥గీ॥ దేవకీ దేవి కడుపులోఁ దేజరిల్లు, దీప్త గర్భంబు మెల్లనఁదిగిచి యోగ*

*నిద్ర రోహిణి కడుపున నిలిపి చనియెఁ, గడుపు దిగెనంచుఁ బౌరులు గలఁగఁ బడఁగ ॥ -5*

దేవకీ దేవి కడుపులో కాంతులు చిమ్ముతున్న గర్భాన్ని యోగనిద్రాదేవి వసుదేవుని మరొక భార్య రోహిణి గర్భంలో ప్రవేశపెట్టింది. ప్రజలందరు దేవకీ దేవికి గర్భస్రావం కలిగిందని తలంచి బాధపడ్డారు.

యోగమాయ గోకులంలో ఉన్న నందుని భార్య యశోద గర్భంలో ప్రవేశించింది. తరువాత రోహిణీదేవి కడుపున పుట్టిన బిడ్డ సంకర్షణుడు, బలభద్రుడు, రాముడు అను పేర్లతో పిలువబడ్డాడు.

---

*1. పోతన భాగవతం, 10 : 52 : పుట-11*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 32 : పుట-43*

*3. పోతన భాగవతం, 10 : 57 : పుట-12*

*4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 33 : పుట-43*

*5. పోతన భాగవతం, 10 : 62 : పుట-13*

గంధర్వులు ఆనందంగా గానం చేస్తూ ఉన్న సమయంలో దేవకీ దేవి అర్ధరాత్రివేళ దేవదేవుడు విష్ణువును ప్రసవించింది.

నీలమేఘ ఛాయ దేహము, గద, శంఖ, చక్ర, పద్మాలతో వెలుగొందుతున్న దీర్ఘములైన నాలుగు బాహువులు, పద్మదళనేత్రములు, విశాల వక్షస్థలంలో శ్రీవత్సమనే పుట్టుమచ్చ కలవాడు, కౌస్తుభరత్నము, అందమైన మొలత్రాడు, కంకణ బాహు కురులు, కర్ణ కుండలాలు, మణులు, వైఢూర్యములు పొదిగిన కిరీటమును ధరించి బాలుని రూపంలో శ్రీమహావిష్ణువు వసుదేవునకు దివ్యరూపంతో దర్శనమిచ్చాడు. దివ్యలక్షణాలతో విరాజిల్లుతున్న ఆ బాలుణ్ణి చూసి వసుదేవుడు పులకించిపోయాడు.

*సీసము॥ జలధరుదేహు నాజానుచతుర్బాహు సరసీరుహాక్షువిశాల వక్షుఁ*
*జారుగదా శంఖచక్ర పద్మవిలాసుఁగంఠ కౌస్తుభమణి కాంతిభాసుఁ*
*గమనీయ కటిసూత్ర కంకణ కేయూరు శ్రీవత్సలాంఛనాంచిత విహారు*
*నురుకుండల ప్రభాయుత కుంతల లలాటు వైదూర్యమణి గణ వరకిరీటు*

*తే॥గీ॥ బాలుఁ బూర్ణేందురుచిజాలు భక్తలోక, పాలు సుగణాలవాలుఁ గృపావిశాలుఁ*
*జూచి తిలకించి పులకించి చోద్యమంది, యుబ్బి చెలరేఁగి వసుదేవుఁడుత్సహించె ॥ -1*

*తీర్థుల వారీ విషయాన్ని ఇలా చెప్పారు :*

*కీర్తన : శంఖీ చక్రీ గదీ పద్మీ శార్ఙ్గీ కిరీటకుండలీ*
*శ్రీవత్స కౌస్తుభో దివ్య పీతాంబరో విరాజతే ॥ -2*

దివ్య మంగళ విగ్రహుడై పీతాంబర మాలా విభూషితుడై దేవకీగర్భంలో ప్రకాశిస్తున్న దేవదేవుని బ్రహ్మాది దేవతలు స్తుతించారు.

*సీసం॥ సత్యవ్రతుని నిత్య సంప్రాప్తి సాధనుఁ గాలత్రయము నందుఁ గలుగు వాని*
*భూతంబులైదును బుట్టుచోటగు వాని నైదు భూతంబులందమరువాని*
*నైదు భూతంబులు నడఁగిన పిమ్మటఁ బరఁగు వానిని సత్యభాషణంబు*
*సమదర్శనంబును జరిపెడు వానిని నిన్నాశ్రయింతుము, నీ యధీన*

*ఆ॥వె॥ మాయ చేత నెఱుకమాలిన వారలు, పెక్కు గతుల నిన్నుఁ బేరుకొందు*
*రెఱుఁగనేర్చు విబుధు లేక చిత్తంబున, నిఖిల మూర్తులెల్ల నీవయంద్రు " -3*

---

*1. పోతన భాగవతం, 10 : 112 : పుట-23*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 19 : పుట-43*

*3. పోతన భాగవతం, 10 : 89 : పుట-18*

సత్యమే వ్రతముగా కలవాడు, యోగసిద్ధికి ఆధారభూతుడు, భూతభవిష్యద్వర్తమాన కాలములలో ఉండువాడు, పంచ భూతముల పుట్టుకకు కారణుడు, వాటిలో ఉండువాడు, అవి ప్రళయంలో అణగిపోయినా ఉండువాడు, సత్యమైన వాక్కులన్నింటినీ సమానంగా చూచువాడు, మాయ తన అధీనంలో ఉండువాడు అయిన ఆ మహానుభావుణ్ణి నీవే దిక్కని బ్రహ్మాది దేవతలు ఆశ్రయించారని భావము.

అనంతరం కృష్ణుడు వసుదేవుని కర్తవ్యోన్ముఖుని చేశాడు. ఈశ్వరలీలా విలాసం చేత కంసుని భటులు గాఢనిద్రాపరవశులై ఉండగా ఆ బాలుని వసుదేవుడు వ్రేపల్లెకు తీసుకుబోతున్న సమయంలో ద్వారములు వాటంతట అవే తెరువబడ్డాయి. ఆదిశేషుడు పడగలు విప్పి ఆ బాలునికి గొడుగులాగ పట్టి నడిచాడు. యమునానది తాను స్వయంగా త్రోవ యిచ్చింది. శ్రీహరి గోకులము నందు సుఖముగా నివసించుచుండెను.

దేవదేవుడు యశోదాబిడ్డయై ఉండగా యశోదకు జన్మించిన శిశువు యోగమాయ దేవకి వద్దకు తీసుకురాబడింది. ఆ స్త్రీ శిశువు ఏడ్పు వినబడగానే కావలివారు మేల్కొని కంసుని వద్దకు వెళ్ళి వార్తను చెప్పగా అతడు కర్కసుడై ఆ పసి పాపను నేలకు విసిరికొట్టాడు. ఆ చిట్టిపాప నేలమీద పడడానికి బదులుగా ఆకాశం మీదకు ఎగిరి ఈ విధంగా పలికింది.

వచనం : కావరంబున నడుగులొడిసి తిగిచి వడింబెడిసి పడం బుడమిపయింబడవైచిన నబ్బాలయు నేలంబడక యవలీలనెగడి... నవ్యదివ్యమాలికా గంధ బంధుర మణిహారాంబరాద్యలం–కార మనోహారిణియు, గదాశంఖచక్ర పద్మ చాపాది శూలధారిణియునై యెనిమిది కరంబులం గరంబొప్పుచు, సిద్ధచారణ కిన్నరగరుడ గంధర్వాది వైమానిక నికాయంబు గానికలిచ్చి పొగడ, నెగడుచు నచ్చరల యాటపాటలకు మెచ్చుచు,... మింట నుండి కంటఁబడి కంటువడ ఁగంసున కిట్లనియె ॥ *–1*

*"భాగినేయీ మసౌ దృష్ట్వా దుష్టాత్మాతత్ర మందిరే*
*గృహీత్వా పాదమేతస్యాః క్షేప్తుం భూమౌమనోదధే" –2*

*"పదాసంతాడ్య కంసం సా యోగమాయా సుదుర్జయమ్ ।*
*అంతరిక్షంగతా విష్ణోర్దుర్గా భూత్వాస్తుతాకమరైః ॥ –3*

"నిన్ను చంపే వీరుడొకడు నాతో పాటే జన్మించాడు. అతడు మరొక దిక్కున పెరుగుతున్నాడు. అక్కడ మహాగౌరవం పొందుతున్నాడు. దేవతల స్తుతులందుకొంటున్నాడు అని ఆమె ఈ విధంగా పలికి అంతర్ధానమయింది.

---

1. *పోతన భాగవతం, 10 : 153 : పుట–33*
2. *నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 1 : 43 : పుట–60*
3. *నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 1 : 44 : పుట–60*

## పూతన, శకటాసుర, తృణావర్తుల సంహారం :

యశోదానందులకు కొడుకు పుట్టాడని వ్రేతలు పొంగిపోయారు. ఉత్సాహంతో గోపకులు నెయ్యి, పెరుగు, పాలు, నీళ్ళు, వెన్నలను ఒకరిపై ఒకరు విసురుకుంటూ ఉత్సాహంతో వసంతోత్సవం జరుపుకున్నారు.

*కందం॥ ఏతెంచి చూచి చెలఁగుచు, నేతులఁ బెరుఁగులను బాలనీళ్లను వెన్నం*
*బ్రీతి వసంతములాడిరి, యేతరులై సరసభాషలెసఁగన్ గొల్లల్ ॥ -1*

*కీర్తన॥ వల్లవయువతి కదంబం ఆయాతి వరమరుణాధర బింబం*
*శృంగారవిలసిత పృథుల నితంబం – విఖ్యాత వివిధ విలాస విడంబం*
*కరధృత దధి దుగ్ధ కమనీయ ఫలజాత*
*నిరుపమ సంతోష నీలకుంతలమిహ ॥ -2*

"పూర్వజన్మలో నోచిన పుణ్యాల ఫలము ఈరోజు ఉదయాన్నే శుభవార్త విన్నాము. యశోదమ్మ కన్నబిడ్డను చూసి వద్దాము అని పరమ ఔత్సుక్యంతో గోకులవాసులంతా నందుని గృహమునకు వచ్చారు.

*ఆ॥వె॥ ఏమినోము ఫలమొ యింత ప్రొద్దొక వార్త, వింటి మబలలార ! వీనులలర*
*మన యశోద చిన్ని మగవానిఁ గనెఁనఁట, చూచి వత్తమమ్మ ! సుదతులార ! -3*

*శ్లో॥ ప్రభాతే గోకులేనందగేహే గోకుల వాసినః ।*
*ఆవిర్భావం హరే శ్రుత్వావివిశుర్నందమందిరమ్ ॥ -4*

ప్రతి ఒక్కరు తాము తెచ్చిన కానుకలు యిచ్చి పిల్లవాడిని ఆనందంతో దీవించి పాటలు పాడారు. నందుడు తన బిడ్డకు జాతకర్మలు చేయించాడు. యశోదాదేవి చనుబాలు త్రాగుతూ ఆమె ఒడిలో పెరుగుతున్నాడు ఆ బాలుడు.

కాలం గడుస్తూ ఉండగా కంసుని చేత ప్రేరేపింపబడినదై పసిపిల్లలను చంపడంలో ఆరితేరినది, మాయావిని, కామరూపిణి అయిన పూతన అనే రాక్షసి పల్లెలు, పట్టణాలలో సంచరిస్తూ కనబడిన పాపలను సంహరిస్తూ వ్రేపల్లె వచ్చింది. మాయతో ఇల్లిల్లూ తిరుగుతూ నందుని ఇంట్లో బాలుని ఏడుపు విని అందమైన యువతి వేషం ధరించి గృహంలోకి ప్రవేశించింది. పూతన సరాసరి మంచం మధ్యలో ఉన్న బాలుని వద్దకు వెళ్ళి చేతులతో లేవదీసి తొడలపై పడుకోబెట్టుకొని లేని వాత్సల్యం నటిస్తూ చన్ను కుడుపడానికి ప్రయత్నించగా బిగువైనచన్నును నోటపెట్టుకొని రెండు గ్రుక్కలతో దాని సత్తువంతా త్రాగి చివరకు దాని ప్రాణాలు త్రాగేశాడు బాలుడు.

---

1. *పోతన భాగవతం, 10 : 182 : పుట-39*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 2 : పుట-67*
3. *పోతన భాగవతం, 10 : 184 : పుట-140*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 7 : పుట-68*

సీసం॥ కంసుపంపున బాలఘాతిని పూతన పల్లెల మందలఁ బట్టణముల
నిలనెల్లచో బాలహింసఁగావించుచుఁ జనుచు నెవ్వని పేరు శ్రవణవీథిఁ
బడిన యంతన సర్వభయ నివారణమగునట్టి దైత్యాంతకుం డవతరించి
యున్న నందుని పల్లెకొకనాఁడు ఖేచరియై వచ్చి యందుమాయా ప్రయుక్తిఁ

తే॥గీ॥ గామరూపిణియై చొచ్చి కానకుండ, నరిగి యిల్లిల్లుఁ దప్పక యరసికొనుచు
నందగృహమున బాలుని నాదమొకటి, విని ప్రమోదించి సుందరీవేషయగుచు -1

సీసం॥ మేల్కొన్న తెఱఁగున మెల్లన కనువిచ్చి క్రేఁగంటఁ జూచుచుఁ గిదికి నీల్గి
యావులించుచుఁ జేతులాదరంబునఁ జూఁచి యొదిఁగిలి యాఁకొన్న యోజ నూఁది
బిగి చన్నుఁగవఁగేలఁ బీడించి కబళించి గ్రుక్కగ్రుక్కకు గుటు గుటుకుమనుచు
నొక రెండు గ్రుక్కలనువిద ప్రాణంబులు సైతము మేనిలో సత్త్వమెల్లఁ

తే॥ ద్రావెనదియును గుండెలు దల్లడిల్లఁ జిమ్మఁదిరుగుచు నిలువక శిరముద్రాల
నితర బాలుర క్రియవాఁడవీవుగావు చన్ను విడువుము విడువుము చాలు ననుచు -2

కందం॥ నిబ్బరపు దప్పి మంటలు, ప్రబ్బిన ధృతి లేక నేత్రపద హస్తంబుల్
గొబ్బున వివృతములుగనా, గుబ్బగుచున్నట్టి కూఁతఁగూలెన్ నేలన్ ॥ -3

శ్లో॥ కంసేన ప్రేరితా కాచిత్పూతనా శిశుఘాతినీ ।
కృష్ణం స్తనంధయం మత్వా తస్మైస్తన్య విషందదౌ ॥ -4

శ్లో॥ తద్భావం సర్వవిద్ జ్ఞాత్వాస్తన్యపానమిషేణతాం ।
జఘాన సాకపతద్భూమౌ దర్శయంత్యాసురీంతనుమ్ ॥ -5

గోపికలు బాలునకు స్వస్తి వచనాలు పలికారు.

యశోద మంగళాశాసనం చేసింది.

రాక్షసి పొట్టపై నిర్భయంగా ఆడుకుంటున్న కుర్రవాని వద్దకు అందరూ ఒక్క ఉదుటున వచ్చి ఓదార్చారు.

---

1. పోతన భాగవతం, 10 : 212 : పుట-45
2. పోతన భాగవతం, 10 : 225 : పుట-48
3. పోతన భాగవతం, 10 : 226 : పుట-48
4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 13 : పుట-77
5. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 14 : పుట-77

"చిన్ని తండ్రీ బ్రహ్మ, వాయువు, యజ్ఞుడు, అచ్యుతుడు, హయగ్రీవుడు, కేశవుడు, ఈశుడు, చతుర్భుజుడు, త్రివిక్రముడు, ఈశ్వరుడు క్రమంగా పాదాలు, మోకాళ్ళు, తొడలు, నడుము, కడుపు, హృదయం, వక్షస్సు, భుజాలు, ముఖము, శిరస్సు రక్షించుగాత అంటూ బాలునికి రక్షణకై భగవంతుని ప్రార్థించారు.

ఒకనాడు యశోద బాలుని జన్మనక్షత్రం సందర్భముగా వేడుక చేయదలచి గోపికలనందరినీ పేరంటానికి పిలిచింది. వృద్ధులైన గోపకులను గోపికలను చక్కగా పూజిస్తూ ఆ సందడిలో నిద్దురపోయిన పిల్లవాడి విషయం మరచిపోయింది. నిద్రలేచిన ఆ పిల్లవానికి ఆకలి వేసి తల్లి పాలిండ్ల కోసం తడుముకోగా అవి దొరకలేదు. కోపం వచ్చి చక్రరేఖ, చాపరేఖ వంటి దివ్యరేఖలు గల పాదాలతో ప్రక్కనున్న బండిని ఒక తన్ను తన్నాడు. పిల్లవాడిని చంపడానికి బండిలో చేరిన మాయావి రాక్షసుడొకడు ఆ దెబ్బతో మరణించాడు. మరొక సమయంలో తృణావర్తుడు అనే రాక్షసుడు కంసుడు పంపగా వచ్చి సుడిగాలి రూపంలో బాలునిపైకెత్తుకు వెళ్లిపోయాడు. క్రమంగా బాలుడు బరువెక్కి పోయి రాక్షసుడు భరించడానికి వీలు లేని శక్తి కలవాడయ్యాడు. పెద్ద కొండంత బరువుతో వాడి మెడ పట్టుకొని క్రింద వ్రేలాడగా వాడి శరీర భాగాలు నుజ్జు నుజ్జు అయ్యే విధంగా క్రింద రాళ్ళపై పడిపోయాడు. శివుని బాణఘాతానికి త్రిపురాసురులపురం కూలిన విధంగా వాడు నేలకూలాడు.

*కందం॥ శకటము హరిదన్నిన దివిఁ, బ్రకటంబై యెగసి యిరుసు భరమునఁగండ్లున్*
*వికటంబుగ నేలంబడె, నకటా ! యని గోపబృందమాశ్చర్యపడన్ ॥ -1*

*కందం॥ హరికరతల పీడనమునఁ, బరవశుఁడై ఱాలఁమీద భగ్నాంగకుఁడై*
*సురవైరి భటుఁడు గూలెను, బురభంజనుకోలఁగూలు పురముంబోలెన్ -2*

*శ్లో॥ నిహతే శకటే పద్భ్యాం తృణావర్తే చమర్దితే ।*
*కృష్ణేన విష్ణునా సోఽయం స్వస్థః క్రీడతిబాలవత్ ॥ -3*

## నామకరణం :

ఒకనాడు సద్గుణ, సదాచార, సత్ప్రవర్తనతత్పరుడు సత్సాంగత్యం కలవాడు, శివారాధకుడు, అరిషడ్వర్గములను జయించినవాడు, జ్యోతిశ్శాస్త్రవేది, తేజస్సంపన్నుడు, బ్రహ్మానుభవం పొందినవాడు అయిన గర్గ మహర్షి వ్రేపల్లెకు వచ్చాడు. యథోచిత సత్కారాలతో నందుడు ఆ మహర్షిని పూజించి కుమారులిద్దరికి అవసరమైన సంస్కారాలు జరిపించవలసినదిగా అర్థించాడు. అప్పుడు మహర్షి "మహారాజా ! కంసుని వ్రేటు నుండి తప్పించుకున్న బాలిక శక్తి స్వరూపిణి. అశరీరవాణి మాట విన్న కంసుని నుండి ఈ బాలకునికి

1. *పోతన భాగవతం, 10 : 251 : పుట-54*
2. *పోతన భాగవతం, 10 : 275 : పుట-59*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 17 : పుట-81*

అపకారం జరుగకుండా రహస్యంగా క్రతువు చెయ్యడం మంచిది. ఈ రోహిణీ దేవి కుమారుడు బలరాముడు జనులందరికీ ప్రీతిపాత్రుడౌతాడు కనుక 'రాముడు' అనీ, వ్రేపల్లెలోనికి లాగబడినాడు కనుక 'సంకర్షణుడు' అనీ, మహాబలవంతుడు కనుక 'బలుడు' అని పిలువబడతాడు. యశోదా తనయుడు పూర్వం తెలుపు, ఎఱుపు, పసుపు రంగులలో ఉండేవాడు. ఇప్పుడు నల్లనైనాడు. కనుక 'కృష్ణుడు' అనీ, వసుదేవుని కుమారుడు కనుక 'వాసుదేవుడని' నామము ఇతనికి చెల్లుబాటవుతుంది.

*కందం॥ జనులు రమియింపఁదిరిగెడి, యనువుకలిమి రాముఁడనియు యదుసంకర్షం*
*బున సంకర్షణుఁడనియును, ఘనబలమున బలుఁడు ననియు గణుతించె నృపా । –1*

వచనం : మఱియుం గృష్ణునుద్దేశించి తొల్లి యీ శిశువు ధవళారుణ పీతవర్ణుండై యిప్పుడు నల్లనైన కతంబునఁ గృష్ణుండయ్యె. వసుదేవునకు నొక్కెడ జన్మించిన కారణంబున వాసుదేవుండయ్యె॥ –2

పై కథాభాగాన్ని తీర్థులు పూతన సంహారానికి ముందే చెప్పారు. ఇలా..

*కీర్తన : నిర్గతమోహతిమిరో నిర్మలమానసో నిత్యం*
*స్వర్గాపవర్గాధికారీ గర్గాచార్యో విరాజతే । –3*

*గద్యం : గర్గోకపి నిర్గత మోహతిమిర పటలో దివ్యదృష్టిస్తయో*
*ర్బల భద్రకృష్ణనామనీ నందేన కిల కారయామాస –4*

అని పలికి గర్గ మహాముని వెళ్ళిపోయాడు.

బాలకృష్ణుడు, బలరాముడు చిన్న చిన్న నడకలతో గోప బాలురతో ఆడుకుంటూ వున్నారు. కృష్ణుని శరీరపు నీలవన్నెలు చూచి గోపికాస్త్రీలు చాలా సంతోషిస్తున్నారు.

*కందం॥ తన యీడు గోపబాలురు, దనుఁగొలువఁగ రాముఁగూడి తనుపు గలుగుచుం*
*దను గమనంబులఁ గృష్ణుఁడు, తను మధ్యలు మెచ్చ నీల తనురుచి మెఱసెన్ –5*

*శ్లో॥ జానుభ్యాం పాణిపద్మాభ్యాం వ్రజంతం నందనందనం ।*
*ఆనందయంత మబలాస్సబలం పరమం జగుః ॥ –6*

---

1. *పోతన భాగవతం, 10 : 287 : పుట–61*
2. *పోతన భాగవతం, 10 : 288 : పుట–61*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 5 : పుట–76*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 12 :పుట–67*
5. *పోతన భాగవతం, 10 : 300 : పుట–65*
6. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 19 : పుట–86*

## గోపికలు కృష్ణుని దుడుకు చేతలను గూర్చి యశోదకు చెప్పట :

కొంచెము నడవటం నేర్చింది మొదలు కృష్ణుడు గోపబాలురతో వెన్న మొదలగు వానిని దొంగిలించడం కూడా ప్రారంభించాడు.

కృష్ణుని బాల్యక్రీడలు, అల్లరి చూచి ఇవి అతనికి లీలలే కానీ నిజమైనవి కావు' అని మనసులో గ్రహించినా గోపికలు ఓర్పు నశించి యశోద వద్దకు వచ్చి నల్లనయ్య చేష్టలు చెప్పుకున్నారు.

మా యిండ్లలో బాలెంతలు పిల్లలకు పాలు చాలవని గోలపెడుతూ ఉంటే నీ కొడుకు పకపక నవ్వుతూ వెక్కిరిస్తూ లేగదూడల త్రాళ్ళు విప్పి ఆవుల వద్దకు వదిలివేస్తున్నాడు.

*కందం॥ బాలురకుఁ బాలులేవని, బాలెంతలు మొఱలు వెట్టఁ బకపక నగి యీ*
*బాలుండాలము సేయుచు, నాలకుఁ గ్రేపులను విడిచె నంభోజాక్షీ ! -1*

కడవలలో ఉన్న కాగినపాలు తోటి పిల్లలకు పోసి అంతటితో ఆగకుండా మిగిలిన కడవలను పగలగొట్టేశాడు.

*కందం॥ పడఁతీ ! నీ బిడ్డఁడు మా, కడవలలో నున్న మంచి కాఁగిన పాలా*
*పడుచులకుఁ బోసి చిక్కిన, కడవలఁ బోనడిచె నాజ్ఞ గలదో లేదో ! -2*

వారిళ్ళలో ఇళ్ళల్లో చొరబడి ఘుమఘుమలాడే నెయ్యి త్రాగి చివరకు ఆ కడవలు వీరిండ్లలో పడవేసిపోయాడు.

*కందం॥ వారిల్లు సొచ్చికడవలఁ, దోరంబగు నెయ్యి ద్రావి తుదినా కడవల్*
*వీరింట నీ సుతుండిడ, వారికి వీరికిని దొడ్డవాదయ్యె సతీ ! -3*

నిన్న గాక మొన్న పుట్టాడు. అప్పుడే గడిదీరి దొంగతనాలు మొదలుపెట్టాడు. మీ వాడు యీ విధంగా చేస్తున్నాడు కదా అని మేము ఎత్తుగా ఉట్టి కట్టాము. వాడికి చెయ్యి పెట్టడానికి సాధ్యం కాక కుండకు క్రింద నుండే పెద్ద చిల్లి పెట్టి దోసిళ్ళతో పట్టి మీగడపాలు తాగాడు. సన్నని కడుపు కలదానవైన నీవు అంత పెద్ద పొట్ట గలవాడిని ఎలా కన్నావు?

*మత్త॥ పుట్టి పుట్టఁడు నేఁడు దొంగిలఁబోయి మా యిలుసొచ్చితా*
*నుట్టి యందక ఱోళ్ళుఁ బీఁటలు నొక్క ప్రోవిడి యెక్కి, చే*
*వెట్టఁజాలక కుండ క్రిందొక పెద్ద తూఁటొనరించి మీ*
*పట్టి మీఁగడపాలుఁజేరలఁబట్టి త్రావెఁదలోదరీ । -4*

---

1. *పోతన భాగవతం, 10 : 307 : పుట-66*
2. *పోతన భాగవతం, 10 : 308 : పుట-66*
3. *పోతన భాగవతం, 10 : 312 : పుట-67*
4. *పోతన భాగవతం, 10 : 310 : పుట-66, 67*

ఆటలకని బయలుదేరిన నీ కొడుకు వీళ్ళింటికి వెళ్ళి పెరుగు తిని వెళ్ళేవాడు. వెళ్ళిపోతూ ఈమె కోడలు నిద్రపోతుండగా మూతికి పెరుగు రాసి వెళ్ళాడు. దొంగతిండి తిన్నదని భావించి అత్తగారు కోడలిని కొట్టింది.

*కం॥ ఆడంజని వీరల పెరుఁ, గోడక నీ సుతుఁడు ద్రావి యొకయించుకతాఁ*
*గోడలి మూఁతిం జమిరినఁ, గోడలు ముచ్చునుచు నత్తగొట్టెలతాంగీ । -1*

ముఖమింత చేసుకొని చూస్తున్నావు. మా ఇంట్లో దొంగతనంగా వెన్న తింటూ వుంటే అడ్డం వెళ్ళిన మా అమ్మాయి ఈవలకు లాగింది. రొమ్ము మీద గోళ్ళతో గీకి పారిపోయాడు. యివి పసిబిడ్డల చేష్టలు కానే కావు.

*కం॥ వెన్నఁ దినఁగఁ బొడగని మా, పిన్న ది యడ్డంబు వచ్చి పిఱిఁదిఁకిఁ దివియం*
*జన్నొడిసి పట్టి చీరెను, జిన్ని కుమారుండె యితఁడు శీతాంశుముఖీ । -2*

*శ్లో॥ వ్రజభువి నందకుమారే వ్రజబాలాబృందకుముదపూర్ణేన్దౌ ।*
*విహరతి తస్యచరిత్రం వ్రజపురనార్యోజగుర్యశోదాయై ॥ -3*

గోపికలందరూ యశోదతో యీ విధంగా పలికారు.

కీర్తన :

*ప॥ కలయ యశోదే తవ బాలం*

*అ॥ప॥ ఖల బాలక ఖేలనలోలం*

*చరణం: అపహృత బహుతర నవనీతం అనుపమ లీలా నటనకృతం*
*కపటమానుష బాలక చరితం కనక కందుకఖేలన నిరతం*

*చరణం: పథిపథిలుంఠిత దధిభాండం పాపతిమిరశత మార్తాండం*
*అధిక బలోద్ధృత జగదండం ఆనంద బోధరసముఖండం*

*చరణం: మల్లబాలక ఖేలనచతురం మనసిజకోటిలావణ్యధరం*
*కల్యాణగుణనవమణి నికరం కమనీయ కౌస్తుభమణి శేఖరం*

*చరణం: నవనీత చోరబాలక చరితం నందాది వ్రజపుణ్య తరు ఫలితం*
*ధ్రువపద ఫలమేతదతి లలితం భువినారాయణ తీర్థయతి ఫణితం -4*

మా మీద ఒట్టు. మమ్మల్ని మాటలతో మభ్యపుచ్చవద్దు. మీవాడు మా పాలు పెరుగు బ్రతకనివ్వడం లేదు. ఇక ఈ వాడలో ఉండలేము అని పలికారు.

---

1. *పోతన భాగవతం, 10 : 311 : పుట-67*
2. *పోతన భాగవతం, 10 : 314 : పుట-67*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 26 : పుట-101*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 12 : పుట-101*

గోపికల మాటలన్నీ విన్న యశోద వారితో ఈ విధంగా పలికింది. “అమ్మా! వీడికి మరేమీ తెలియదు. బిడ్డపై నిందలు వేయకండి. మిమ్మల్ని బ్రతిమాలుకుంటాను” అని సముదాయించి ఒప్పించి పంపివేసింది.

## మృద్భక్షణ విశ్వరూపము :

ఒకనాడు బలరాముడు, గోపాలకులు యశోద వద్దకు వచ్చి కృష్ణుడు మట్టి తింటున్నాడు అని చెప్పగా ఆమె బాలుని చేయి పట్టుకొని కోపంతో యిలా అంది.

*వచనం : అంతనొక్కనాఁడు బలభద్ర ప్రముఖులైన గోపకుమారులు వెన్నుండు మన్నుదినెనని చెప్పిన యశోద బాలునికీలు పట్టుకొని యిట్లనియె. –1*

ఇంట్లో తినడానికి యిన్ని పదార్థాలుండగా మన్ను తినే కర్మమేంటి? అన్నయ్య, స్నేహితులు అబద్ధం చెప్పరు కదా. నేను చెప్పిన మాటలనీ విడిచిపెట్టావు. తల అడ్డంగా ఊపవద్దు అని అమాయకంగా అడిగింది.

*కందం॥ మన్నేటికి భక్షించెదు?, మన్నియమము లేలనీవు మన్నింపవు? మీ*
*యన్నయు సఖులును జెప్పెద, రన్నా! మన్నేల? మఱిపదార్థములేదే? –2*

అమ్మా! వాళ్ళు చెప్పారు నీవు విన్నావు. నేనేమైనా పసివాడనా లేక అంతకంటే వెర్రివాడినా! ఇప్పుడే కదా ఆకలి వేసిందని పాలు తాగాను. ఇదంతా వీళ్ళు పన్నిన పన్నాగం. నా మాట అబద్ధమైతే నా నోరు వాసన చూడు అంటూ కృష్ణుడు తల్లికి నోరు తెరచి చూపించాడు.

*శా॥ అమ్మా ! మన్నుదినంగ నే శిశువునో? యాఁకొంటినో? వెఱ్ఱినో ?*
*నమ్మంజూడకు వీరి మాటలు మదిన్, నన్నీవుగొట్టంగ వీ*
*రిమ్మార్గంబు ఘటించి చెప్పెదరు. కాదేనిన్ మదీయాస్య గం*
*ధమ్మాఘ్రాణము సేసి నా వచనముల్ దప్పైన దండింపవే । –3*

అండపిండ బ్రహ్మాండాలన్నీ ఆ నోటిలో కనిపించాయి. యశోదమ్మ విభ్రాంతి చెందింది. ‘కలా? లేక విష్ణు మాయా విలాసమా ?’

*కందం॥ ఆ లలితాంగి కనుంగొనె, బాలుని ముఖమందు జలధిపర్వత వన భూ*
*గోళ శిఖితరణి శశిదిక్పాలాది కరండమైన బ్రహ్మాండంబున్ ॥ –4*

వెలుగులు చిమ్ముతున్న బ్రహ్మాండమంతా పిల్లవాడి నోటిలో కనబడుతోందే. ఆశ్చర్యం కాకపోతే మరేమిటి? యశోద బుద్ధి పనిచేయక తనపైనే సందేహం కలిగింది.

---

1. *పోతన భాగవతం, 10 : 335 : పుట–71*
2. *పోతన భాగవతం, 10 : 336 : పుట–72*
3. *పోతన భాగవతం, 10 : 338 : పుట–72*
4. *పోతన భాగవతం, 10 : 340 : పుట–72*

మ॥ కలయో ! వైష్ణవమాయయో! యితర సంకల్పార్థమో ! సత్యమో !
తలఁపన్ నేరక యున్న దాననొ ! యశోదాదేవిఁ గానో ! పర
స్థలమో ! బాలకుఁడెంత ! యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర
జ్వలమై యుండుటకేమి హేతువో ! మహాశ్చర్యంబు చింతింపఁగన్ ॥ -1

శ్లో॥ కర్తారం సర్వలోకానాం మాయామానుషబాలకమ్ ।
కుక్షౌ సంరక్షితాశేషముచ్చైః స్తౌతీతి సాదరమ్ ॥ -2

ఇతడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువే అని నిర్ధారించుకొని ఈ విధంగా స్తోత్రం చేసింది యశోద. "విష్ణువు అంతటా వ్యాపించి ఉన్నాడు. ఈరోజు విశ్వరూపం చూడటం చేత నా బుద్ధి చలించినది. అన్ని లోకములకు ఆధారభూతమైన ఆ మహావిష్ణువే నాకు శరణమగు గాత".

కీర్తన : ప॥ హరిమీడే శ్రీహరిమీడే దేవం...హరిమీడే

అ॥ప॥ గురుతరాసురభారహర మహమీడే

1. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయక మిహనిఖిల భువన కర్తారం
ప్రకటిత నిజవిశ్వరూప మనామయమఘటిత ఘటనాకారం

2. స్వర్ధామమస్తకం సూర్యచంద్ర నయనం విధ్వస్తమోహమహం
వర్ధితాఖిల వేదవాచమాశాశ్రుతి మనిలాసుమఖిల దేహం

3. విశ్వహృదయదేశవిపుల మహీచరణ శాశ్వతానందఘనం
నిశ్వసితాగమనిర్మల విజ్ఞాన నిత్యకల్యాణ నిదానం

4. భక్తజన సమూహ భద్రదం భవభయ ముక్తమమరమృదుగీతం
ముక్తసంగమునీంద్రముక్తిదాన నిపుణమూలమాగమబోధితం

5. తరణి శశిమండల కోటి కోటి భాస్వర మరవింద భవకారణం
హరిభక్త శివనారాయణ తీర్థకృత మిదమఖిల పాతకహరణం -3

## యమళార్జున భంజనము :

ఒకరోజు యశోదమ్మ పెరుగు చిలుకుతూ ఉంది. "అమ్మా! నాకు పాలివ్వవే!" అంటూ కృష్ణుడు ఆమె పైట లాగుతూ గంతులు వేస్తూ దగ్గరకు వచ్చి కవ్వం కదలకుండా పట్టుకున్నాడు. యశోద నవ్వుతూ

---

1. పోతన భాగవతం, 10 : 342 : పుట-72
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 38 : పుట-116
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 16 : పుట-117

దగ్గరకు తీసుకొని పాలివ్వసాగింది. పొయ్యి మీద పాలు పొంగుతూ ఉంటే చూసిన యశోద పిల్లవాడు పాలు త్రాగకుండానే మధ్యలో దింపి పాలకుండ దించడానికి గబగబ లోపలకు వెళ్ళింది. కోపంతో కృష్ణుడు రాతితో పెరుగు కుండ బ్రద్దలుకొట్టాడు. అది చూసిన యశోద “బాగా గారాబం చేస్తే పిల్లలు చెడిపోతారు. అప్పుడప్పుడు తగలనిస్తూ ఉండాలి. దుండగులైన పిల్లలకు దండోపాయమే మంచిదని నిశ్చయించుకొని బెత్తం చేత పట్టుకొని కొడుకును బెదిరించింది. “నీకు బొత్తిగా అదురు బెదురూ లేకుండా పోయింది. ఒరేయ్! ఆగు అక్కడ అంటూ కోపంగా అదలిస్తూ ముందుకు వచ్చింది. కృష్ణుడు భయపడినట్టు ముఖం పెట్టి అతి వేగంగా పారిపోసాగాడు. ‘ఇక ముందు దొంగతనం చేయను. ఈ ఒక్కసారికి క్షమించవే’ అంటూ దొంగ కన్నీళ్ళు కారుస్తూ మాటి మాటికీ తప్పుకుంటున్న కృష్ణుణ్ణి ఎలాగైతేనేం యశోద పట్టుకున్నది. కొట్టడానికి చేతులు రాక ఆ దుడుకు బాలుణ్ణి ఒక రోటికి కట్టివేసింది.

*కం॥ ఆలలనగట్టెబోలన్, లీలన్ నవనీత చౌర్యలీలుంబ్రియ వా*
*గ్జాలుం బరివిస్మిత గో, పాలున్ ముక్తాలలామ ఫాలున్ బాలున్ ॥ -1*

*శ్లో॥ కదాచిదౌద్ధత్య మనంత వీర్యే*
*హరావిలోక్యాప్రతిమం యశోదా,*
*బబంధ దామ్నా తమశేషబంధు*
*ములూఖలే బాలవిలాసలోలమ్ ॥ -2*

యశోదమ్మ ఇంటి పనులలో మునిగిపోయింది. కృష్ణుడు రోలు ఈడ్చుకుంటూ యింటి పెరడులో ఉన్న జంట మద్దిచెట్లను కూల్చివేయాలని సంకల్పించాడు. వాటి మధ్య నుండి రోటిని అమాంతంగా ఈడ్చుకు వెళ్ళాడు.

*కందం॥ ముద్దుల తక్కరి బిడ్డఁడు, మద్దుల ఁగూల్పంగఁదలఁచి మసలకతానా*
*మద్దికవ యున్న చోటికి, గ్రద్దన ఱోలీడ్చుకొనుచుఁ గడఁకం జనియెన్ -3*

బాలుడు రోలు అడ్డం తిప్పి లాగగానే ఆ మద్ది ద్వయం భయంకరమైన ధ్వనితో వేళ్ళతో సహా నేల కూలిపోయింది. నారదుని శాపం చేత మద్దిచెట్లుగా మారిన నలకూబర మణిగ్రీవులు శాపవిమోచనం పొందారు. కృష్ణపరమాత్మను స్తుతించారు.

---

*1. పోతన భాగవతం, 10 : 379 : పుట-80*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 31 : పుట-109*

*3. పోతన భాగవతం, 10 : 400 : పుట-84*

*శ్లో॥ దేవం బ్రహ్మపురాంతస్థం*
*పుండరీకాంతరస్థితమ్ ।*
*చిదాకాశం జగద్బీజం*
*వాసుదేవం తమాశ్రయే ॥ -1*

స్వప్రకాశుడు, జ్ఞానస్వరూపుడు, హృదయకమలము నందు వసించువాడు, ప్రపంచమునకు కారణభూతుడు, సమస్తమునందు ఉండువాడు అయిన నిన్ను ఆశ్రయించుచున్నాము.

కమలపత్రనేత్రుడా! ఎల్లప్పుడూ మా చెవులు నీ స్తుతిని వినాలి. వాక్కు నిన్ను గురించి మాత్రమే మాట్లాడాలి. మేము చేస్తున్న ప్రతి కార్యము మీ పనిగానే ఉండాలి. మా కన్నులు ప్రతిక్షణము నీ రూపాన్నే చూస్తూ ఉండాలి. మా బుద్ధి సదా నీ పైనే ఉండునట్లు కరుణతో అనుగ్రహింపుము అని స్తుతించారు.

*శా॥ నీ పద్యావళులాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్*
*నీ పేరంబనిసేయు హస్తయుగముల్ నీ మూర్తిపైఁ జూపులున్*
*నీ పాదంబులపొంత మ్రొక్కుశిరముల్ నీ సేవపైఁజిత్తముల్*
*నీపై బుద్ధులు మాకునిమ్ము కరుణన్ నీరేజ పత్రేక్షణా -2*

## అఘాసుర వృత్తాంతము :

కంసుని ఆజ్ఞానువర్తియై బకాసురుని తమ్ముడు అఘాసురుడు "అన్న మరణానికి కారణమైన కృష్ణుని తోటి బాలకులతో సహా చంపుతాను" అని మహారోషంతో బయలుదేరాడు.

*కందం॥ బకునికిఁ దమ్ముఁడు గావున, బక మరణము దెలిసి కంసుపంపున గోపా*
*లక బాలురతోఁ గూడను, బక వైరిని ద్రుంతు ననుచుఁబటురోషమునన్ ॥ -3*

రాకాసి కొండచిలువ రూపం ధరించి దారిలో అలా నోరు తెరుచుకొని పడుకున్నాడు. చంపడానికి ఎదురుచూస్తూ దారి మధ్యలో పడుకొని ఉన్న కొండచిలువను వారు చూశారు. పాము రూపంలో ఉన్న మహారాక్షసుడని తెలియని గోపాలురు మొండి ధైర్యంతో దానిని ఎదుర్కొన్నారు. కృష్ణునికి తమకు తాము సమర్పించుకున్న గోప కుమారులు ఆ రాక్షసుడు తమను మ్రింగివేసినా ధైర్యంగానే ఉన్నారు. సర్వద్రష్ట, ఆర్తత్రాణ పరాయణుడు, పద్మపత్ర నేత్రుడు అయిన కృష్ణుడు వారిని రక్షించదలచి వారి వెనుకనే పాము కంఠద్వారం వద్ద చేరి ఊపిరి తీసుకోవడానికి వీలు లేని విధంగా తన శరీరాన్ని పెంచివేశాడు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 35 : పుట-114*
2. *పోతన భాగవతం, 10 : 408 : పుట-86*
3. *పోతన భాగవతం, 10 : 465 : పుట-98*

ఆ పాముకు ఊపిరి ఆడక, లోపలి గాలి బయటకు పోవకపోవడం చేత కడుపు ఉబ్బసాగింది. తుకతుకలాడిన ప్రాణవాయువులు వ్యాకోచించి పాముతలను, ప్రక్క భాగాలను బ్రద్దలు కొట్టుకుంటూ పెద్ద శబ్దంతో బయటకు వచ్చేశాయి.

*కందం॥ ఊపిరి వెడలక కడుపున, వాపొద వినఁబాము ప్రాణవాతంబులు సం*
*తాపించి శిరము ప్రక్కలు, వాపికొనుచు వెడలిచనియెఁ బటుఘోషముతోన్ ॥ -1*

మహాసర్పశరీరం నుండి అద్భుతమైన వెలుగు కృష్ణునిలో ప్రవేశించింది.

నారాయణ తీర్థుల వారు ఈ కథాఘట్టంలో...

*శ్లో॥ అఘాసురముఖావిష్టా స్సవత్సా గోపబాలకాః ।*
*ప్రాప్తమోహాపనుత్త్యర్థం ప్రార్థయంతోజగుర్హరిమ్ ॥ -2*

ఆ రాక్షసుని నోరు పెద్ద కొండ గుహ వలె ఉంది. వారు దానిని గుర్తించలేకపోయారు. లేగలతో సహా సమూహంగా నోటిలోకి ప్రవేశించారు. కొంతసేపటి తరువాత అదిపర్వత కుక్షి కాదు అని నిశ్చయించుకొని తమను రక్షింపమని శ్రీకృష్ణుని వేడుకున్నారు.

*శ్లో॥ పరమ కరుణయా మాం పాలయత్వాం ప్రసన్నం*
*నిజపరిజన కామం పూరయాచింత్యకీర్తే ।*
*నిరవధిక కృపాబ్ధే నిర్మలానందమూర్తే*
*భయ జలనిధి మగ్నందీన ముత్తారయేశ ॥ -3*

*కీర్తన : ప॥ పరమ కరుణయా మాం పాలయ భక్తమనోరథం పూరయ*
*అ॥ప॥ పరిపంథి గణమిహ వారయ భవసాగర పతితం తారయ*

*చరణం: మధుకైట భాది విజయాధార మత్స్యకూర్మాదిరూపసాదర*
*అధిక దయావలోక సుందర అపరిమితానందసాగర*

*చరణం: అఖిలాండకోటి పరిపాలక అనవద్యగోకుల నాయక*
*అఘహరణ దుష్టనివారక ఆశ్రితజన సముద్ధారక*

*చరణం: తరళమణిమకర కుండల తాండవనటన కృతమండల*
*సరస పరిపాలితా ఖండల సాధుగోకుల వరస్థండిల*

---

1. *పోతన భాగవతం, 10 : 480 : పుట-101*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 9 : పుట-138*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 10 : పుట-138*

*చరణం: అవని మండల భారఖండన ఆశ్రిత జనహృదయమండన*

*ధ్రువ విభూతి దానవిచక్షణ శివనారాయణ తీర్థరక్షణ ॥ -1*

*శ్లో॥ ఏవం స్తుత స్సగోవిందః ప్రవృద్ధ స్తమఘాసురమ్*

*ఆస్ఫాట్యబాలైర్గోవత్సై స్సహగోకుల మాయయౌ ॥ -2*

తనను స్తుతించిన గోపబాలకులను రక్షించి, రక్కసుని సంహరించి గోసమూహముతో గోకులమునకు బయలుదేరాడు కృష్ణుడు.

## బ్రహ్మ గోవత్సములను గోపబాలకులను అంతర్ధానం చేయుట :

అఘాసురుని బారి నుండి లేగలను, గోపబాలురను రక్షించిన మాయాబాలుని కృష్ణుని మహాశక్తిని పరీక్షింపదలచి బ్రహ్మ అడవిలోని లేగలను, గోపబాలుర సమూహాన్ని ఒక రహస్య ప్రదేశంలో దాచిపెట్టాడు. విశ్వరహస్యాలను ఎఱిగినవాడు బ్రహ్మాండాలను వంచించడం, మరలించడం అనే విద్యలు తెలిసినవాడు, ఈశ్వరుడు అయిన ఆ శ్రీహరి ఇది బ్రహ్మదేవుని మోసమని గ్రహించి ఏ ఒక్కటీ వదలకుండా ఆయా బాలుర, లేగల రూపాలన్నీ తానే ధరించాడు.

*మత్తేభం :*

*కరముల్ పాదములున్ శిరంబులవలగ్నంబుల్ ముఖంబుల్ భుజాం*

*తరముల్ ముక్కులుఁ గన్నులున్ శ్రవణముల్ దంతాదులున్ దండ కాం*

*బర స్రగ్వేణు విషాణ భూషణ వయో భాషా గుణాఖ్యాన త*

*తత్పరతల్ వీడ్వడకుండఁ దాల్చె విభుఁడా వత్సార్భకాకారముల్ ॥ -3*

ఈ విధముగా ఒక సంవత్సరం గడిచింది. బలరాముడు కూడా కృష్ణమాయ గ్రహించలేకపోయాడు. తానొకడైనా తలకొకరూపై విహరించిన మాయామోహనుని లీలావిలాసాన్ని చూచి బ్రహ్మదేవుడు నివ్వెరపోయాడు. ఈశ్వరుడైన శ్రీకృష్ణ పరబ్రహ్మను స్తుతించాడు.

*శ్లో॥ ఇత్థం భూతం హరిందృష్ట్వా వత్సరాంతేవిధిః స్వయమ్*

*సందర్శిత జగత్కోటి శరీరం స్తౌతి సాదరమ్ ॥ -4*

*కీర్తన : ప॥ జయజయగోకులబాల జయసకలాగమమూల*

*అ॥ప॥ దయయామాంగోపాల దీనం పాలయ బాల*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 7 : పుట-139*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 11 : పుట-141*
3. *పోతన భాగవతం, 10 : 511 : పుట-109*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 14 : పుట-143*

*చరణం: దేవ మయా చరితమిదం దీన ధియా అపరాధం*

*శ్రీవసుధాధవ కృపయా కేవలమిహధునుహి*

*చరణం: ఈ క్షేతావకదేహే ఈశజగంతి నిరీహే*

*వీక్షాశిక్షిత మోహే వేదాంతాగమనగేహే*

*చరణం: జగదండ కోటితనో జగదుదరాంతరసుతనో*

*అగణిత సంజాతమనోహ్యా అపరిమితా శ్రితధేనో*

*చరణం: వితరమ యీశ్వర కరుణాం విఘటయ మోహావరణం*

*సతతంమే భవశరణం సాధయ సంసృతి తరణం*

*చరణం: ఇతి విధినా పరిగీతం శ్రుతి వచసాహరచరితం*

*యతి నారాయణ కథితం యదుకుల భూషణ ముదితం -1*

*మత్తేభం :*

*నను మన్నించి భవజ్జనంబులకు నానందంబు నిండించు నీ*

*తను రూపంబిదె నా మనంబున కచింత్యం బయ్యె, నీ యుల్ల స*

*ద్ఘన విశ్వాకృతి నెవ్వఁడోపు? నెఱుఁగం గైవల్యమై యొప్పు నా*

*త్మ నివేద్యంబగు నీదు వైభవము చందం బెట్టిదో యీశ్వరా ॥ -2*

నీ యీ చిన్న రూపము నేను ఊహించలేకపోయాను. ఇక నీ విశ్వరూపం తెలుసుకోవడానికి సమర్థుడు ఎవడునూ కాడు. ఇంత విశేషమైన నీ వైభవం నీకు మాత్రమే తెలియును. అన్యునకు సాధ్యము కాదు.

నన్ను గన్న తండ్రివైన నిన్ను గుర్తించి సేవించుకొనుచున్నాను.

*కీర్తన : ప॥ దేవదేవ ప్రసీదమే*

*అ॥ప॥ దీనజనపరిపాల*

*చరణం: లీలావినోద విగ్రహ లక్ష్మీపతే*

*బాలమోహవినిగ్రహ బాలోన్నతే*

*కలితసేవకానుగ్రహ కామాకృతే*

*అలఘువీర్య పరిగ్రహ అఖిలాండపతే*

*(అ) ఖిలమునిబృందానుగ్రహ గోపాలకృష్ణ*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 9 : పుట-143, 144*

*2. పోతన భాగవతం, 10 : 549 : పుట-119*

బాలఘననీలాతి సుశీల హేమచేలా నంత

లీలాగమమూల శ్రీలోలాతివిశాలఫాల బాలగోపాలకృష్ణ

చరణం: శ్రీవత్సలక్షణాంచిత శ్రీ భావిత

దేవగంధర్వ సేవిత దివ్యాయుధ

గోవత్సగణసంవృత గోపాలవృత

అవ్యయముని వందిత అచింతిత

భవ్యగోకుల నిరత గోపాలకృష్ణ

పీతాంబరవీత విధుశీతాఖిలతాతా ఘవి

ఘాతార్జునసూతామరగీతాగమ జాతభాత బాలగోపాలకృష్ణ

చరణం: పూర్ణేందు మండలానన పురాతన

పూర్ణసుపర్ణ వాహన వరానన

తీర్థ సంసారమోహన ధీరాయన

కర్ణకుండల శోభన కంజానన

వర్ణిత వీర్యవామన గోపాలకృష్ణ

నారాయణ ధీరా గమసారాఘవిదూరాసమ

ఘోరారి విదారామరవీర సంసారపార బాలగోపాలకృష్ణ -1

కందం॥ జిష్ణు ! నిశాటవిపాటన !, వృష్ణి కులాంభోజ సూర్య ! విప్రామర గో

వైష్ణవ సాగర హిమకర, కృష్ణా ! పాషండ ధర్మగృహదావాగ్నీ! -2

రాక్షసులను సంహరించడానికి అవతరించిన సాక్షాత్తు విష్ణుమూర్తివి. గో, బ్రాహ్మణ దేవతామరులు, విష్ణు భక్తుల చేత నుతింపబడేవాడవు. వేదధర్మాన్ని ప్రకాశింప చేయువాడవు. పాషండమతానికి అగ్నిహోత్రుడవంటివాడవు.

శ్లో॥ భగవంతమితిస్తుత్వా విధిః స్వంధామ సత్వరమ్ ।

హరిణాగురుణాజ్ఞాతో యయౌ కృష్ణోకపిగోకులమ్ ॥ -3

అని యీ విధముగా బ్రహ్మదేవుడు శ్రీకృష్ణుని స్తుతించి సత్యలోకానికి వెళ్ళిపోయాడు.

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 10 : పుట-146, 147
2. పోతన భాగవతం, 10 : 578 : పుట-128
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 17 : పుట-150

## ధేనుకాసుర వధ :

తాటిచెట్ల వనంలో ధేనుకుడు అను పేరు గల గాడిద రూపంలో ఉండే రాక్షసుడు నరమాంస భక్షణ చేస్తూ ఉన్నాడు. తాటిపండ్లపై మక్కువతో శ్రీదాముడు అనే మిత్రుడు 'మాకు తినిపించండయ్యా' అని బలరామకృష్ణులను ప్రార్థించగా చెలికాని మాటలను చిరునవ్వుతో అంగీకరించి తాళవనంలో ప్రవేశించారు. విజృంభించి వస్తున్న గాడిద రాక్షసుని బలరాముడు నాలుగు కాళ్ళు ఒడిసిపట్టి నేలపై గిరగిరా త్రిప్పి చంపివేశాడు.

వచనం : అంత బలభద్రుండు రౌద్రాకారంబున గర్దభాసురుపదంబులు నాలుగు నొక్కకేల నంటంబట్టి బెట్టుదట్టించి త్రిప్పి విగతజీవునింజేసి *-1*

ఈ ఘట్టంలో నారాయణతీర్థుల వారు శ్రీకృష్ణుడే చంపినట్లుగా వ్రాశారు.

శ్లో॥ *ఖరాసురవధం కృత్వా ఖగాధిపతివాహనః ।*
*నిరాయాసః పరానందో రమతే నందనందనః ॥ -2*

ఖరరూపం ధరించిన ధేనుకాసురుని గరుడవాహనుడగు శ్రీకృష్ణుడు చంపాడు.

ఆ శుభ సమయములో దేవతలు పుష్పవర్షం కురిపించారు. అనంతరం బలరామకృష్ణులు అందరితో కలిసి గోకులానికి తిరిగి వచ్చారు.

రామకృష్ణులను హింసించడానికి ప్రలంబుడనే రాక్షసుడు గోపబాలుని రూపం ధరించి వచ్చాడు. శ్రీకృష్ణుడు అతడెవరో తెలిసినా తెలియనట్లే నటిస్తూ అతనితో స్నేహం పెంచుకున్నాడు. బంతులాట నెపంతో అతడిని హతమార్చడానికి పన్నాగం పన్నాడు. ఆటలో ఓడినవారు గెలిచినవారిని మోయాలి. పరాజయం పొందిన ప్రలంబుడు బలరామునికి వాహనమయ్యాడు. ఎల్లలు దాటి పరుగెత్తిపోయాడు. బలరాముడు అతడు అసురుడని గ్రహించి పిడికెడు పోటుతో వాడిని నేలగూల్చాడు.

*కందం॥ హలధరు బలుపిడికిటి హతిఁ, దలపగిలిన రుధిర జలము దను వివరములం*
*దొలఁక మొఱయిడుచ దనుజుఁడు, బలరిపుపని నిహతనగము పగిదిం బడియెన్ ॥ -3*

శ్రీకృష్ణ లీలా తరఙ్గిణిలో తీర్థులవారు ఈ ఘట్టంలో బలరాముడు శ్రీకృష్ణుని సాహాయ్య మర్ధించినట్లు తద్వారా శ్రీకృష్ణుడు అతని సహజ సామర్థ్యమును గుర్తు చేసినట్లు వ్రాశారు.

---

*1. పోతన భాగవతం, 10 : 619 : పుట-137*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 13 : పుట-184*

*3. పోతన భాగవతం, 10 : 737 : పుట-166*

శ్లో॥ సంకేతస్థానముల్లంఘ్య పలాయనపరోబలః ।
మాం నయత్యేషకిం కార్యం వదకృష్ణే త్యభాషత ॥ -1

"వీడు నన్ను ఎత్తుకొని పోతున్నాడు. నేనిప్పుడు ఏమి చేయాలి" అని బలరాముడు పలికాడు.

శ్లో॥ వీర్యమావేదయన్ కృష్ణో బలభద్రస్యధీమతః ।
ఇదమాహమహావీర్యమార్యం బలసమున్నతమ్ ॥ -2

"గర్వముచే అధికమై యున్న వానిని శిక్షింపక ఉపేక్షింపరాదు" అని శ్రీకృష్ణుడు అతని సహజసామర్థ్యము జ్ఞాపకము చేస్తూ ఈ విధముగా పలికాడు.

కీర్తన : తావకం పరభావమనుస్మర తావకం స్మరతాం
అ॥ప॥ సేవక సంకల్ప సిద్ధతనోపర - దైవత నరభావ భావన యాలం

చరణం: స్మరతవాతుల బలమతివీర్యం సాహసం చ బలభద్రగాంభీర్యం
నగవపుర్ధరమసురమిమంజహి నగవరాధిక ధైర్యదుర్వీర్యం

చరణం: ఖేలనే సమయోనాయమిహ బలనీలాంబర తవ భో
తాలనికేతన తాడయ కుటిలంతవ
ఖేలనమిత్ర మమరశత్రుభృత్యం

చరణం: అఘటితం ఘటయతి తవమాయా అఖిలలోక జననీ
విఘటిత భవబంధమూల మోహనిబద్ధ
విపులబోధానంద రసఘన జయభో

చరణం: లోకబంధు ఫణిత మేతదాశ్రిత శోకమూలహరణం
భక్తసంసిద్ధి సాధక శ్రీహరి భక్తనారాయణతీర్థ భరణం -3

శ్లో॥ జఘానబలభద్రస్తం శ్రీకృష్ణేన ప్రచోదితః ।
ప్రలంబం ముష్టినామూర్ధ్ని ప్రలంబోకపి పపాత చ॥ -4

శ్రీకృష్ణ ప్రేరితుడైన బలరాముడు ప్రలంబాసురుని సంహరించాడు.

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 20 : పుట-193
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 21 : పుట-194
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 11 : పుట-194, 195
4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 22 : పుట-196

## కాళియ మర్దనము :

శ్రీకృష్ణుడు దుష్టశిక్షణార్థం అవతరించాడు. కాళియుని విషప్రభావం చేత దోషం చెందిన యమునానది మడుగును, ప్రాణులను రక్షించదలచినవాడై ఒడ్డుననే ఉన్న కడిమిచెట్టు ఎక్కి కుప్పించి మడుగులోకి దూకాడు. కాళియుడు రోషంతో తన పొడవైన శరీరం చేత చుట్టి వేశాడు. గట్టిగా పెనవేసి కృష్ణుణ్ణి బంధించివేశాడు. అది చూసి గోపబాలకులు భయపడ్డారు. కృష్ణుని శక్తి తెలిసినవాడైన బలరాముడు మాత్రం నిశ్చల మనస్సుతో స్తుతించాడు. గోకులవాసులు ఆపద శంకించి కృష్ణుని జాడ తెలుసుకోవడం కొరకు పరుగులెత్తారు.

*మత్తేభం :*

*కటిచేలంబు బిగించి పింఛమున జక్కంగొప్పుబంధించి దో*

*స్తట సంస్ఫాలన మాచరించి చరణ ద్వంద్వంబుఁ గీలించి త*

*త్కుట శాఖాగ్రము మీద నుండియుఱికెన్ గోపాల సింహంబు ది*

*క్తటముల్ మ్రోయ హ్రదంబులో ఘుభఘుభధ్వానం బనూనంబుగన్ ॥ -1*

*కందం॥ వారిబ్భంగి నెఱుంగని, వారై హరిఁజూడఁబోవ వడిగఁగొని నగుచున్*

*వారింపఁడయ్యె రాముఁడు, వారిని హరి లావెఱుంగు వాఁడయ్యనృపా ॥ -2*

*శ్లో॥ పశ్యత్సునందాదిషు గోపికాసుశ్రీకృష్ణ మేవాఖిలమిత్రభూతం ।*

*తుష్టావ రామస్సకలాత్మదర్శీ సర్వాత్మకం కృష్ణమనన్యదృష్ట్యా ॥ -3*

సర్వవ్యాపియగు కృష్ణుని బలరాముడు స్తుతించుచున్నాడు.

*కీర్తన :*

*ప॥ బంధనాన్మోచయ కాళియకృత బంధనాన్మోచయ*

*అ॥ప॥ బంధనాన్మోచయాత్మాన మనుపమ*

*బలమనుస్మరతావకమధునా*

*చరణం: కారణం జగతా మఘౌఘవి దారణం హి భవాన్*

*దూరితా శేషశోక మహీభార*

*వారణాయ కృతమానుషవేష శ్రీకృష్ణ*

---

*1. పోతన భాగవతం, 10 : 637 : పుట-141*

*2. పోతన భాగవతం, 10 : 650 : పుట-143*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 7 : పుట-176*

*చరణం: బాలచాపల తయా తవానఘ లీలయాల మిహ*

*కాళియ విషమాశు వినాశాయ*

*కలయ గోకుల కళ్యాణ మథ భో*

*చరణం: నంద గోప మహిషీ తవేయ మనిందినీ జననీ*

*నందమేన మానందయ తామపి*

*నందనందన సుందర శ్రీకృష్ణ*

*చరణం: కృష్ణ తత్త్వ విదాగీతమితి - వృష్ణి జనముదే*

*విష్ణుభక్తి శివనారాయణ తీర్థ*

*విరచితం విపులానందముదితం -1*

క్రూరసర్పం గర్వం అణచివేసి కాళియుని విశాల పడగలపై బాలకృష్ణుడు నృత్యం చేశాడు. బలహీనుడైన కాళియుడు కృష్ణుని శ్రీహరిగా భావించినవాడై శరణు కోరాడు. భర్త యొక్క దుఃస్థితిని భరింపలేక నాగపత్నులు బాలగోపాలుని వేడుకున్నారు.

*మత్తేభం :*

*కచబంధంబులు వీడ భూషణము లాకంపింప గౌఁదీవియల్*

*కుచయుగ్మంబుల వ్రేఁగునం జడియఁబైకొంగుల్‌వడిన్ జాఱఁగాఁ*

*బ్రచుర భ్రాంతిఁగలంగి ముందటరుదద్బాలావలిం గొంచుఁస*

*క్కుచు భక్తింజని కాంచి రాగుణమణిన్ గోపాలచూడామణిన్ ॥ -2*

వచనం : శక్తి లేనివాడై పడియున్న భర్తను జూచి నాగపత్నులు పతిభిక్ష పెట్టమని ఆ మహాత్ముని ప్రార్థించారు.

*శ్లో॥ ఫణేషు తస్యనృత్యంతం క్షీణశక్తేర్ముహుర్ముహుః ।*

*భర్తృభిక్షాం ప్రార్థయంత్యోనాగపత్న్యో జగుర్హరిమ్ ॥ -3*

*కీర్తన :*

*ప॥ దేవకురుశిక్షాం దేహిపతిభిక్షాం*

*అ॥ప॥ దీనపరిపాలనాయ స్వీకురుదీక్షాం*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 6 : పుట-176, 177*
2. *పోతన భాగవతం, 10 : 671 : పుట-149*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 9 : పుట-180*

*చరణం: ఆగమైకశరణ మశేషలోక కారణం*

*ఆహు రాగ మేన తత్త్వా మానందమఖండితం*

*చరణం: యోగిమతిభూషణా ఘౌఘ పరిశోషణ*

*భోగి శయన భువన భూషపాహి పతితం*

*చరణం: జాతి కులశరణమ శేషజంతు తారణం*

*జాతం భవతాకృత మిత్యాగమ విదితం*

*చరణం: సర్వజంతు సమతా సాధుతవవిదితా*

*సర్వబుద్ధిషు ప్రహితా సాచవేద విదితా*

*చరణం: అజ్ఞాత వస్తుకి మస్తి విజ్ఞానస్యతే*

*ఆజ్ఞాపయ యదుచిత మస్మాకం జగత్ప్రభో*

*చరణం: నాగపత్నీ గీతమిదం నారాయణ చరితం*

*యోగివరనారాయణ తీర్థయతి ఫణితం -1*

మా భర్త నేరమే చేశాడు. అయినా క్షమించు అని ప్రార్థించారు. కృష్ణుడు వారి విన్నపాన్ని ఆలకించాడు. కాళియుని శిరస్సుపై పాదతాండవం చాలించాడు. ఆయాసంతో వగరుస్తూ కాళియుడు కృష్ణునికి నమస్కారం చేసి ఈ విధంగా పలికాడు. కృష్ణా! నా పుణ్యమేమని చెప్పను. నీ పాదధూళిని పొందగలిగాను. అటువంటి నాకు ఇక ఏ స్థితిలో ఉన్నా క్షేమమే.

*కందం : నా పుణ్యమేమిసెప్పుదు? నీ, పాదరజంబుఁ గంటినే, సనకాదుల్*

*నీ పాదరజము గోరుదు, రేపదమందున్ననైన నింకమేలు హరీ । -2*

పరమాత్మ అనుజ్ఞ పొందినవాడై తన వారిని తీసుకొని సముద్రంలోని ఒక ద్వీపం చేరుకున్నాడు.

## శ్రీకృష్ణుడు దావాగ్నిని మ్రింగి గో - గోపక సంఘమును కాపాడుట :

కారడవిలో చెలరేగిన కార్చిచ్చుకు ఆవులు గడగడ వణికిపోయాయి. గాలి వేడికి దప్పికతో అంబా అని ఆక్రోశించసాగాయి. అడవి నలుమూలలా అలముకున్న దావాగ్నికి గొల్లపిల్లలు భయపడి మరణభయంతో బలరామకృష్ణులకు మ్రొక్కి ఈ విధంగా పలికారు. "లోకాలను మాడ్చి మసిబూది గావించే విధంగా విస్తరిస్తున్న ఈ పెనుమంట నుండి మమ్ములను కాపాడు" అని విన్నవించుకున్నారు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 8 : పుట-180,181*

*2. పోతన భాగవతం, 10 : 693 : పుట-155*

ఉత్పలమాల :

*బంధుజనంబు చేత నిటు ప్రార్థితుఁడై హరివిశ్వరూపుఁడో*

*బంధువులార ! మీనయనపంకజముల్ ముకుళింపుఁడగ్ని నీ*

*సంధినడంతు నేననినఁ జక్కన వారలునట్ల చేయుడున్*

*బంధురదావపావకముఁబట్టి ముఖంబునఁద్రావె లీలతోన్ ॥ -1*

కృష్ణుని మాట విని గోపాలకులు కళ్ళు మూసుకొనగా అతడు దావానలాన్ని నోటితో పీల్చి త్రాగివేశాడు. అప్పుడు బాలకులందరూ ఆ పరమేశ్వరుని స్తుతించారు.

*శ్లో॥ శ్రీ గోపాలకమేకమేవ పరమం దైవం సదామానయే*

*శ్రీవత్సాంకిత వక్షసంశ్రిత జనాధారం సమారాధయే*

*ఆమ్నాయాంత సరోజహంస మఖిలానందాత్మకం శాశ్వతం*

*కుక్షిస్థాఖిలలోక రక్షకమముంగీర్వాణగేయం ప్రభుమ్ ॥ -2*

తన గర్భము నందు సమస్త లోకములను పోషించుచున్న ఈ గోపాలకృష్ణుడే పరమదైవము.

*కీర్తన : శ్రీగోపాలక మేవ దైవతం హృదయే*

*అ॥ప॥ ఆగమారవింద బృందహంస మాకలయే*

*చరణం: సర్వలోకైక శరణ్య చరణారవిందం*

*దుర్వినీతమదభంగ దోర్దండ బృందం*

*నిర్విశేషనిరంతర నిర్మలానందం*

*గీర్వాణ గంధర్వ కోటిగీత గోవిందం*

*చరణం: నిజజన స్వర్గాపవర్గ నిత్యదాతారం*

*అజమవ్యయ మధి దేవమనుపమాధారం*

*విజయసారథి మశేష విదుషామాధానం*

*భుజబలనిర్జిత వైరి భూపాల శూరం*

*చరణం: లక్షిత సర్వభువనలక్షణమేకం*

*పక్షిరాజవాహనం విపక్షశిక్షకం*

*కుక్షిగత జగదండకోటి ధారకం*

*అక్షీణగోకుల నివాస లక్ష్మీనాయకం*

---

1. *పోతన భాగవతం, 10 : 747 : పుట-168*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 26 : పుట-198*

*చరణం: నారదాది మునిగేయనామ ధేయకం*
*నామరూప నిర్వాహక మామ్నాయమానకం*
*వారిజాసనాది వినుత వారితశోకం*
*నారాయణానంద తీర్థానంద దాయకం -1*

అని గోపబాలకులు స్తుతిస్తూ ఉండగా గోవులతో గూడి కృష్ణుడు మరల గోకులమునకు వచ్చాడు.

## ముని భార్యలు అన్నము తీసుకొని వచ్చి శ్రీకృష్ణునికి ఆరగింపచేయుట :

మంచి వేసవి కాలంలో యమునానదీ తీరంలో గోపకులు గోవులను మేపుతున్నారు. భాను తాపాన్ని భరించలేని వారై ఆకలి వేయుచుండగా కన్నయ్యకు విన్నవించుకున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు "స్వర్గగమనాభిలాషులు, వేదవేత్తలు అయిన భూసురులు 'అంగిరస' మనే సత్రయాగం చేస్తున్నారు. మా సోదరులిరువురి పేర్లు చెప్పి అన్నం పెట్టమని వారిని అనురాగ పూర్వకంగా అర్థించండి" అని పలుకగా గొల్లపిల్లలు యాగశాల వద్దకు వెళ్ళి అర్థించగా వారు లేదని అదలించి పొమ్మన్నారు.

*సీసం॥ వల్లవులార ! ఈ వనమున విప్రులు బ్రహ్మవాదులు దేవ భవనమునకు*
*నరుగుట కాంగిరసాహ్వయ సత్త్రంబు సలుపుచున్నారు సనుఁడు మీరు*
*మా నామములు సెప్పి మైత్రితో నడిగిన నన్నంబు వెట్టె దరనుచు బలుక*
*వారలు చని విప్రవరుల కెల్లను మ్రొక్కి పసులమేపుచు బలభద్రకృష్ణు*

*తే॥ లలసి పుత్తెంచిరిటమమ్ము నన్నమడుగ, ధర్మవిదులార ! యర్థిప్రదాతలార !*
*పెట్టుఁడన్నంబు శ్రాంతుల బిలిచి తెచ్చి, పెట్టుదురు గాదె మిముఁబోటి పెద్దలెల్ల -3*

*మ॥ క్రతువున్ మంత్రము దంత్రమున్ ధనములుం గాలంబు దేశంబు దే*
*వతయున్ ధర్మము నన్యముల్ దలఁప నెవ్వాఁడట్టి సర్వేశ్వరున్*
*మతినూహింపక గోపబాలుఁడనుచున్ మందస్థితిం జూచి దు*
*ర్మతులై యన్నము లేదు లేదనిరి సమ్మాన క్రియాశూన్యులై -4*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 12 : పుట-199, 200*
*2. పోతన భాగవతం, 10 : 852 : పుట-193*
*3. పోతన భాగవతం, 10 : 855 : పుట-193*

*కీర్తన : అరణిపాత్రపాలాశకుశ భారం వహంతో*
*ధరణితలే సతతం ధావంతో యాజ్ఞికా ఆయాంతి*
*పవిత్ర పాణయో నిత్యం పశులక్షణవిదో*
*సవితృమండలాంతస్థం ధ్యాయంతో యాజ్ఞికా ఆయాంతి*
*అహం పూర్వమహంపూర్వ మితియజ్ఞకుశలాః*
*గహనకర్మసామాదీనిగాయంతో యాజ్ఞికా ఆయాంతి ॥ -1*

*శ్లో॥ యాజ్ఞికైర్యజమానేన ప్రత్యాఖ్యాతశ్చతైర్ద్విజైః ।*
*యయాచే యజ్ఞపత్నీస్తాః కృష్ణార్థే గోపబాలకః ॥ -2*

సాక్షాత్తు నారాయణుని మనస్సు నందు ధ్యానించుచూ బ్రాహ్మణులు యజ్ఞం సాగిస్తున్నారు. కానీ శ్రీకృష్ణుని భగవానునిగా గ్రహించలేక సామాన్య బాలకునిగా భావించుట చేత అన్నము లేదని తిరస్కరించారు.

నిరాశ చెందిన గోపాలురు కృష్ణునికి విషయం వివరించగా "రామకృష్ణులు వచ్చారు. శ్రీకృష్ణుడు గోవులను మేపుచూ ఆకలి గొన్నాడు. మిమ్ములను అడిగి అన్నం పెట్టించుకురమ్మని మమ్ములను ఇక్కడకు పంపినాడని" బ్రాహ్మణ పత్నులతో చెప్పమని శ్రీకృష్ణుడు చెప్పగా గోపబాలకులు ముని పత్నులను దర్శించి నమస్కరించారు. ఉన్న విషయం చెప్పారు. ఆ మాట వింటూనే కృష్ణుని దర్శించాలని ఉవిదలు ఉబలాటపడ్డారు. ఆహార పదార్థములతో సాగరుణ్ణి చేరే నదుల లాగా వేగంగా బయలుదేరారు.

వచనం : అనిన విని గోవింద సందర్శన కుతూహలులై ధరణీసుర సుందరులు సంభ్రమానందంబులు డెందంబుల సందడింప, భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య పానీయ భేదంబులు కలిగి, సంస్కార సంపన్నంబులైన యన్నంబులు కుంభంబులనిడుకొని సంరంభంబుల సముద్రంబునకు నడచు నదుల తెఱంగున *-3*

*శ్లో॥ సకృచ్ఛ్రవణ మాత్రేణ స్వాద్వన్నాని బహూన్యపి ।*
*ఆదాయతాః పరంకృష్ణం ముక్తసంగాః ప్రదుద్రువుః ॥ -4*

శ్రీకృష్ణునకు అన్న మరుక్షణమే రుచికర భోజన పదార్థములను తీసుకొని బ్రాహ్మణపత్నులు పరాత్పరుని వద్దకు పరుగిడి వచ్చారు.

శ్రీకృష్ణుడు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపము అని తెలుసుకొనడం వారి పూర్వకర్మ పరిపాకమునకు నిదర్శనం. బ్రాహ్మణపత్నులు పరిపూర్ణమైన భక్తిభావం చేతనే పరబ్రహ్మమును తెలుసుకొనుట విశేషం.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 11 : పుట-150*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 22 : పుట-154*
3. *పోతన భాగవతం, 10 : 858 : పుట-194*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 23 : పుట-154*

*కందం॥ పరమేశ్వరార్పణంబుగఁ, బరజనులకు భిక్షయిడినఁబరమపదమునం*

*బరఁగెదరఁట ! తుదిసాక్షా, త్పరమేశుఁడు భిక్షగొన్న ఫలమెట్టిదియో ! -1*

పరమేశ్వరార్పణంగా పరులకు భిక్ష పెడితేనే పరమపదం లభిస్తుంది. సాక్షాత్తు పరమేశ్వరుడైన శ్రీకృష్ణుడే ప్రియంగా స్వయంగా ఆప్తమిత్రులతో కలిసి వారు తెచ్చిన ఆహారం ఆరగిస్తే కలిగేటటువంటి ఫలితం చెప్పడానికి కూడా శక్యం కాదు. బ్రాహ్మణ పత్నుల విషయంలో కూడా ఇదే జరిగింది. వారి యొక్క నిష్కల్మషమైన భక్తికి భగవంతుడు సంతోషించాడు. వారిని అనుగ్రహించాడు.

*శ్లో॥ తత్ర గత్వాతు గోపాలం గోపీజన మనోహరమ్*

*భోజయిత్వాఽథసంతుష్టం విహితాఞ్జలయోఽస్తువన్ ॥ -2*

శ్రీకృష్ణునకు భోజనం పెట్టి, తృప్తి చెందినవారై బద్ధాంజులులై వినుతించారు.

*కీర్తన :*

*ప॥ బాల గోపాలకృష్ణ పాహి పాహి*

*అ॥ప॥ నీలమేఘ శరీర నిత్యానందం దేహి*

*చరణం: కలభ సుందరగమన కస్తూరి శోభితానన*

*నళినదళాయుత నయన నందనందన*

*మిళిత గోపవధూజన మీనాంక కోటిమోహన*

*దళిత సంసారబంధన దారుణవైరినాశన*

*చరణం: యజ్ఞ యజ్ఞ సంరక్షణ యాదవ వంశాభరణ*

*యజ్ఞ ఫల వితరణ యతి జన శరణ*

*అజ్ఞాన ఘనసమీరణ అఖిలలోక కారణ*

*విజ్ఞాన దళితావరణ వేదాంత వాక్యప్రమాణ*

*చరణం: వ్యత్యస్తపాదారవింద విశ్వవందిత ముకుంద*

*సత్యఖండ బోధానంద సద్గుణబృంద*

*ప్రత్యస్తమిత భేదకంద పాలిత నందసునంద*

*నిత్యద నారాయణ తీర్థ నిర్మలానంద గోవింద -3*

---

1. *పోతన భాగవతం, 10 : 870 : పుట-197*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 24 : పుట-154*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 13 : పుట-155*

*శ్లో॥ యజ్ఞ పత్న్యస్త మీశానం లీలాగోపాల విగ్రహమ్ ।*
*ప్రసాదయంతి యం వేదాస్తాత్పర్యేణామనంతి తే ॥ -1*

ఆ పరమేశ్వరుడు లీలచే గోపాలబాల రూపమును ధరించాడు. వేదములచే స్తుతించబడుతున్న ఆ కృష్ణుని బ్రాహ్మణ భార్యలు వేడుకొన్నారు.

## గోవర్ధన గిరిధారి :

మేఘాధిపతి అయిన ఇంద్రుడు మెచ్చే విధంగా ఇంద్రయాగం చేయడానికి నంద మహారాజు సంకల్పించాడు.

*శ్లో॥ ఇంద్రయాగ సమారంభం నందాదీనాం విలోక్యసః*
*ఐశ్వర్యం ఖ్యాపయన్ స్వీయం నందమాహేద మచ్యుతః ॥ -2*

యజ్ఞం సంకల్పించడంలో గల ఉద్దేశ్యమడిగిన కృష్ణునితో నందమహారాజు ఈ విధముగా పలికాడు.

*సీసం: పర్జన్యుఁడధికుండు భగవంతుఁడమరేంద్రుఁ డతనికిఁ బ్రియమూర్తులగుచునున్న*
*మేఘ బృందంబులు మేదినీతలముపై నతని పంపున భూతహర్షణముగ*
*జలములు గురియుఁ దజ్జల పూరములఁ దోఁగి పండుసస్యంబు లాపంటదమకు*
*ధర్మార్థ కామప్రదాయకంబుగ లోకులెల్లను బ్రతుకుదు; రింతయెఱిఁగి*

*తే॥ మేఘవిభుఁడైన యింద్రుండు మెచ్చుకొఱకు, నింద్రయాగము సేయుదు రెల్లనృపులు*
*కామలోభభయ ద్వేష కలితులగుచుఁ, జేయకుండిన నశుభంబు సెందుఁ బుత్ర । -3*

భగవంతుడగు దేవేంద్రుడే గొప్పవాడైన పర్జన్యుడు. జనులకు ధర్మార్థ కామము సిద్ధించడానికి ఈ యాగం చేస్తారు. ఈ యజ్ఞం కామ, లోభ, భయ, ద్వేషాల వల్ల చేయకపోతే అశుభం ప్రాప్తిస్తుంది.

అప్పుడు శ్రీకృష్ణుడు వారితో ఈ విధంగా పలికాడు. "ప్రాణి పుట్టుట, వృద్ధి పొందుట, లయించుట కర్మ చేతనే జరుగుతోంది. కావున జీవుల సుఖదుఃఖాలకు హేతువైన కర్మమే దైవం. మన కర్మమే మనకు ఫలితాలను నిర్దేశిస్తుండగా దేవేంద్రునకు జంకవలసిన పని ఏముంది? పరమేశ్వరునికైనా కర్మఫలం తప్పించుట సాధ్యము కాదు.

*కందం॥ కర్మమునఁ బుట్టు జంతువు, కర్మమున నవృద్ధిఁబొందు గర్మమునఁజెడుం*
*గర్మమె జనులకు దేవత, కర్మమె సుఖదుఃఖములకుఁ గారణమధిపా ! -4*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 25 : పుట-157*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 11 : పుట-215*

*3. పోతన భాగవతం, 10 : 879 : పుట-199*

*4. పోతన భాగవతం, 10 : 884 : పుట-200*

*కందం॥ కర్మములకుఁ దగు ఫలములు, కర్ములకు నిడంగ రాజుగాని సదా ని*
*ష్కర్ముఁడగు నీశ్వరుండును, గర్మవిహీనునికి రాజుగాఁడు మహాత్మా ! -1*

*కీర్తన : ప॥ ఇంద్రయాగ సమారంభ సంభ్రమ మిహతుముధా మన్యే*

*అ॥ప॥ చంద్రరవిపావక ముఖసురవర*
*పరిగణిత విభూతిరయంహితాత*

*చరణం: సకల లోక జనకం సకలాగమ సంబోధిత మహిమాన మనింద్రం*
*ప్రకటిత జగదణ్డ కోటివదనమిహ సాక్షాదేవవిహాయ మహేంద్రం*

*చరణం: వనచరాహివయంవనపర్వత వర్ధిత భువివనమేత దధునా*
*అనుపమాన్న రసాదిభి రచలేంద్ర మనుపమమా రాధయామో విధినా*

*చరణం: గిరివనసరిదమరనరఖగాదిషు పరిపూర్ణ బోధరసమాగమ విదితం*
*హరిమిహ గోవర్ధన గిరివరయుత మచ్యుతమేవ భజామోనిరతం*

*చరణం: నందనందన గీతమిదం భువి నందగోపహితం ముహురధునానందయోగి*
*విచింతిత మను శివనారాయణ తీర్థకృతమితి విధినా -2*

ఇచ్చుటి పర్వతములలో గొప్పదైన గోవర్ధన పర్వతము నందు నారాయణుని ఆవాహన చేసి పూజింతము అని తీర్థుల వారి భావము.

పోతనగారు శ్రీహరి తానే గిరిరూపం ధరించి తన్ను తానే ప్రత్యేకంగా పూజించుకుంటూ గొల్లనిడిన నైవేద్యమంతా ఆరగించాడు అని వ్రాశారు.

*మత్తేభం :*

*సకలాభీరులు వీఁడెకృష్ణుఁడన నైజంబైన రూపంబుతో*
*నకలంక స్థితి నుండి శైలమిదె మీరర్చింపరం డంచుఁదా*
*నొక శైలాకృతిఁ దాల్చి గోపకులతో నొండొండ పూజించి గో*
*పక దత్తాన్నము లాహరించె విభుఁడా ప్రత్యక్ష శైలాకృతిన్ ॥ -3*

ఇది తనకు అవమానంగా భావించిన ఇంద్రుడు కోపంతో ప్రళయ భయంకరములైన సంవర్తక మేఘములను వ్రేపల్లెలోని గో, గోప సమూహం నాశనమయ్యేటట్లు రాళ్ళవాన కురియడానికి ఆజ్ఞాపించాడు.

---

1. *పోతన భాగవతం, 10 : 885 : పుట-200*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 4 : 215, పుట-216*
3. *పోతన భాగవతం, 10 : 891 : పుట-202*

శార్దూలం :

*ఉద్యత్సంపద నమ్మినందతన యోద్యోగంబునన్ వెఱ్ఱులై*
*మద్యాగంబు విసర్జనీయమని రీమర్త్యుల్ వడిన్ మీరు మీ*
*విద్యుద్వల్లులఁ గప్పి గర్జనములన్ వేధించి గోవుల్ జనుల్*
*సద్యోమృత్యువుఁ బొందఁజాల్ గురియుఁడీ ! శౌర్యంబవార్యంబుగన్ ! -1*

దారుణమైన శిలావర్షం చేత గో, గోప సమూహం కొయ్యబారిపోయారు. యాదవులు శ్రీకృష్ణుని వేడుకున్నారు. కృష్ణుడు అవలీలగా ఒక్క హస్తంతో గోవర్ధనాద్రిని గొడుగులా పైకెత్తినాడు.

*కందం॥ కిరియై ధరయెత్తిన హరి, కరిసరసిజ ముకుళ మెత్తుగతిఁ ద్రిభువనశం*
*కరకరుఁడై గోవర్ధన, గిరియెత్తెం జక్కనొక్క కేలన్ లీలన్ -2*

శార్దూలం :

*బాలుండీతఁడు, కొండదొడ్డది; మహాభారంబు సైరింపఁగాఁ*
*జాలండో? యనిదీని క్రింద నిలువన్ శంకింపఁగాఁ బోల; దీ*
*శైలాంభోనిధి జంతు సంయుత ధరాచక్రంబు పైబడ్డనా*
*కేలల్లాడదు; బంధులార ! నిలుఁడీ క్రిందం బ్రమోదంబునన్ । -3*

"మీరు ఆనందంగా దీని క్రింద నిలవండి. సాక్షాత్తు చరాచర విశ్వమంతా మీదబడినా, నా చేయి చలించదు" అన్న పరంధాముని పలుకులను గోపకులు మనస్ఫూర్తిగా విశ్వసించారు.

ఎడతెరిపి లేకుండా ఏడు రోజులు భోరున జడివాన కురిసింది. ఇన్ని రోజులూ గోకులమంతా పర్వతం క్రిందే తలదాచుకున్నారు. పురందరుడు శ్రీకృష్ణుని వీరచరితం చేత విస్మయం చెంది తన ప్రయత్నం వమ్ము కాగా మబ్బులను మరలించి నందనందనుణ్ణి సందర్శించి, పాదాలను పూజించి, శుద్ధ సత్త్వమయుడు, శాంతుడు, శాశ్వతుడుయగు హరిని వేడుకున్నాడు.

శార్దూలం :

*నీ సామర్థ్య మెఱుంగ మేఘములచే నీ ఘోషమున్ భేషణో*
*గ్రాసారంబున ముంచితిన్ మఖమునాకై వల్లవుల్ సేయరం*
*చో సర్వేశ ! భవన్మహత్త్వమున నాయుద్యోగ మిట్లయ్యె నీ*
*దాసున్ నన్నుఁ గృతాపరాధుఁగరుణన్ దర్శింపవే మాధవా ! -4*

---

1. *పోతన భాగవతం, 10 : 902, పుట-204*
2. *పోతన భాగవతం, 10 : 914 : పుట-207*
3. *పోతన భాగవతం, 10 : 920 : పుట-208*
4. *పోతన భాగవతం, 10 : 942 : పుట-213*

నీ దాసుడనైన నా తప్పు సైరించి నన్ను కరుణతో రక్షింపుమని వేడుకున్నాడు. అనంతరం ఇంద్రుడు పుండరీకుని అభిషేకించి దేవతా సమూహంతో అమరావతికి వెళ్ళిపోయాడు.

గోవర్థన పర్వతము ఎత్తి గోకులవాసులను రక్షించిన గోపాలుని గోపికలు కీర్తించారు.

*శ్లో॥ ఛత్రీకృతగిరిరాజే రక్షిత గోపాల గోధనసమాజే ।*
*గోవిందే తమనంతం భక్త్యాగోప్యాజగుః పరంతుష్టాః ॥ -1*

*కీర్తన :*

*ప॥ గోవర్ధన గిరిధర గోవింద*
*గోకుల పాలక పరమానంద*

*అ॥ప॥ శ్రీవత్సాంకిత శ్రీకౌస్తుభధర*
*భావక భయహర పాహిముకుంద*

*చరణం: పురుహూతమఖవి ఘాతసుచతుర*
*పురుషోత్తమ పూరితజగదుదర*
*మేరుభూరిధై ర్యాఘవిదూర*
*మీనకేతుశత కోటిశరీర*

*చరణం: అమిత కల్యాణగుణ అగణితలీల*
*అపరిమితానంద ఘననందబాల*
*శమితదైత్యదంభ శాంత్యాదిమూల*
*విమల మానసవృత్తి విలసితశీల*

*చరణం: వహతో జగదండ కోటిస్తవేదం*
*వరదకి మద్భుత మచలేంద్రవహనం*
*మహనీయ కీర్తి మావహసి దేహిముదం*
*మాఘవనం మద మపనయసికథం*

*చరణం: ఆనందామృత వారిధి ఖేల*
*అలఘుపరాక్రమ అనుపమలీల*
*శ్రీనందాత్మజ శ్రితజనపాల*
*శ్రీకరకిసలయ లాలనలోల -2*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 14 : పుట-219*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 5 : పుట-219, 220*

*చరణం: పాటితసురరిపు పాదపబృంద*

*పావనచరిత పరామృతకంద*

*నాట్యరసోత్కట నానాభరణ*

*నారాయణతీర్థార్చిత చరణ -1*

## శరద్రాత్రి గానమొనర్చు కృష్ణుని సన్నిధికి గోపికలు వచ్చుట :

హేమంత ఋతువులో కాత్యాయనీవ్రతం సాగిస్తున్న గోపికలు ఒకనాడు ప్రాతఃకాలములో యమునానదీ తీరానికి చేరి ఒక ఏకాంత స్థలంలో కోకలు విడిచి జలకాలాటలకై నదిలోకి ప్రవేశించారు.

*శార్దూలం :*

*ఉద్యద్గంధ గజేంద్ర గౌరవముతో యోషాంబరంబుల్ విభుం*

*దాద్యుండర్భకు భంగి నర్భకులతో హాసార్థియై కొంచుఁద*

*న్నద్యంభఃకణ శీతవాత జనితానందంబుతో నెక్కెఁదా*

*సద్యోముక్తదురంతపాదప జనుస్సంతాపమున్ నీపమున్ ॥ -2*

కృష్ణుడు సమయం చూసి వస్త్రాలను అపహరించి కడిమిచెట్టు ఎక్కి నవ్వుతూ పరిహాసాలాడుతున్నాడు. విశ్వవిభుడు, తొలివేలుపు అయిన ఆ పరమాత్ముడు తనను అధిష్టించగానే ఆ చెట్టు వృక్షజన్మము వలన తనకు కలిగిన సంతాపాన్ని వెంటనే పోగొట్టుకున్నది.

*శ్లో॥ నితంబినీగణం హ్రదే దిగంబరం విలోక్యతత్*

*వరాంబరం బహిఃస్థితం కరాంబుజేసముద్వహన్ ।*

*బహూన్నతే తటద్రుమే మహోన్నతో హరిఃస్థితో*

*వదన్ విచిత్ర నర్మతం హసన్ సగాయతే భృశమ్ ॥ -3*

కృష్ణుడు వస్త్రాలను ఒక మూటగా కట్టి ఒక క్రొమ్మకు వ్రేలవైచి ఆ గోపికలతో స్వయముగా పలికాడు.

*కీర్తన : ప॥ ఆయాహి వ్రజయువతిబృంద త్వరయా*

*మాయాహి సలిలేదూరం*

*అ॥ప॥ ఆయాసో మాభవతు అలమధునా తవ*

*తోయక్రీడయా పరయా -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 5 : పుట-219, 220*
2. *పోతన భాగవతం, 10 : 818 : పుట-186*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 4 : పుట-204*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 1 : పుట-205*

చరణం: పరిణామ విరస ఫలోదయ కర్మణి పాటవమతి వితథం
పరిణామ విరహిత పరమపురుషమేవ - భజజగదేకనాథం

చరణం: పరిగృహాణ భువన బాహ్యదృగావరణం - పరిహరసివృథాకథం
పరమ బాంధవ స్తవప్రకటమేవ వదతి - పరిహార ఖేలన బంధం

చరణం: ఆనందమయ భవనే తవ జననీ - సానంద మను సరతి
మాయాతీత వపుషం మాధవమేవ జనకం - మానయ మానయ సతి

చరణం: హరివిరచిత పరిహాస కథారస గౌరవ సంస్మరణం
గురుభక్త శివనారాయణ తీర్థకృతమిదం - గోవింద జనభూషణం -1

వలువలు అపహరించిన కమలాకాంతునితో గోపికలు ఈ విధంగా పలికారు.

సీసం : బహుజీవనము తోడ భాసిల్లియుండుటో గోత్రంబు నిల్పుటో కూర్మితోడ ?
మహినుద్ధరించుటో ? మనుజ సింహంబవై ప్రజలఁగాచుటొ ? కాక బలిఁదెరల్చి
పిన్నవై యుండియుఁ బెంపు వహించుటో ? రాజులగెల్చుటో రణములందు ?
గురు నాజ్ఞసేయుటో ? గుణనిధివై బలప్రఖ్యాతిఁ జూపుటో భద్రలీల ?

ఆ॥వె॥ బుధులు మెచ్చ భువిఁ బ్రబుద్ధత మెఱయుటో, కలికితనము సేయ ఘనత గలదె ?
వావిలేదు వారి వారు నావారని, యెఱుఁగవలదె వలువలిమ్ము కృష్ణ ! ॥ -2

ఈ పద్యంలో పోతనగారు గోపికల పలుకుల నెపంతో భగవంతుని దశావతారాలు వర్ణించారు.

వావివరుసలు లేనటువంటి నీవు ఇంకా ఏమి చేయనున్నావో ఎఱుగము అనడం చక్కని వ్యాజస్తుతి.

సీసం : రాజసంబున నీవు రంజిల్లు టెఱుఁగమే చెలరేఁగి వింతలు సేయుచుండ ?
సత్త్వసంపద గల్గి జరగుటఁ దలఁపమే, సిరిగల్గియన్యులఁ జెనకుచుండ ?
గురుతర శక్తియుక్తుఁడవౌట యెఱుఁగమే తామసంబున నెగ్గుదలఁచుచుండ ?
నొకభంగితో నుండకుంటఁ జింతింపమే మాయావియై మాఱుమలయుచుండ ?

ఆ॥వె॥ నేమిజాడఁవాడ ? వేపాటి గలవాఁడ, వేగుణంబునెఱుఁగ వెల్లయెడల
నొదిఁగి యుండనేర వోరంత ప్రొద్దును, బటము లీఁగదయ్య ! పద్మనయన -3

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 1 : పుట-205
2. పోతన భాగవతం, 10 : 821 : పుట-186
3. పోతన భాగవతం, 10 : 823 : పుట-187

గోపికల మాటల రూపంలో భగవంతుడి లీలలు విచిత్రములు. పోకడలు యిట్టివని తెలియదు. పరిణామ రహితుడు, త్రిగుణాతీతుడు, సర్వవ్యాపి, కాలాతీతుడని పోతనగారు వర్ణించారు.

*శ్లో॥ గోవిందం గోపికానందం వదంతం నర్మశర్మదం*
*పున్నాగవిటపాగ్రస్థం పుణ్యపుంజ ఫలోదయమ్ ॥ -1*

*శ్లో॥ భక్తానుగ్రహసువ్యగ్ర గృహీతాద్భుత విగ్రహం*
*ఇత్థం గోప్యోజగుః కృష్ణం కంఠ దఘ్నజలేస్థితాః ॥ -2*

గోపికల పూర్వ పుణ్యఫలమున విహరించు మాధవుడు వారిని అనుగ్రహించుటకై పున్నాగ వృక్షంపై కూర్చుండి వారితో పరిహాసాలాడుతుండగా నీటిలోని గోపికలు ఆయనను గూర్చి గానం చేశారు.

*కీర్తన : ప॥ శ్రీకృష్ణ తావక మహిమా కేన వర్ణ్యతే*
*అ॥ప॥ లోకాలోకనావరణం లోకేశదేహి నౌమితే*

*చరణం: పున్నాగ రాజాధిరూఢ పురుషోత్తమ*
*ఉన్నత వంశవిస్తార ఛిన్న పాపాఖండిత*

*చరణం: శాఖాగ్రలక్ష్య సద్విగ్రహ శం విధేహి భో*
*శోకసాగరా దుద్ధరమాం శుద్ధ భావం సందర్శయ భో*

*చరణం: నంద యశోదానందన నలిననాభ*
*సుందరహాస విలాస సూచితైరలం విమలాభ*

*చరణం: సర్వకామాది గుణాకార సర్వపాలక*
*శర్వరీ నాయకానన శాతకుంభవర్ణవసన*

*చరణం: గోవింద కింకరవామ గోపబాలక*
*నవ్యగోపీగీతమిదం నారాయణ తీర్థరచితం -3*

వారి ప్రార్థనలు విన్న శ్రీకృష్ణుడు “నీటి నుండి వెలుపలికి వచ్చి నా దగ్గర నున్న వస్త్రములు తీసుకొనండి” అని పలుకగా గోపికలు నీటి నుండి వెలుపలకు వచ్చి చేతులతో తమ మర్మాంగాలు మాటుపరచుకొని వరుసగా బయటకు వచ్చారు. చీరలు ధరింపకుండా జలక్రీడలు చేయడం అంబికకు అపరాధం కల్గించడమేనని లోకమాన్యుడైన శ్రీకృష్ణుని ద్వారా వారు తెలుసుకున్నారు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 6 : పుట-207*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 7 : పుట-207*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 2 : పుట-207, 208*

*మత్తేభము :*

*వ్రతముల్ సేయుచు నొక్కమాటయిన నెవ్వానిన్ విచారించినన్*

*వ్రత భంగంబులు మానునట్టి వరదున్ వామాక్షు లీక్షించియున్*

*గత చేలాప్లవనంబు నేఁడు వ్రతభంగంబంచు శకించి ఫా*

*లతటన్యస్త కరాబ్జలై సరసలీలన్ మ్రొక్కి రట్లందరున్ ॥ -1*

పరమపురుషుడు, ఉత్తమ శ్లోకుడు, పరాత్పరుడు అయిన కృష్ణుని గోపికలు వీక్షించారు. యదు వల్లభునకు ఒయ్యారంగా వంగి నమస్కారం గావించారు.

దయాలవాలుడు, భక్తజన పరిపాలకుడు అయిన శ్రీకృష్ణుడు ఆ గోపికలకు వలువలు ఇచ్చివేశాడు.

ఈ సందర్భంలో నారాయణతీర్థుల వారు గోపీకృష్ణ సంవాదాన్ని ఆత్మానాత్మ సంభాషణా రూపంగా వర్ణించారు.

*శ్లో॥ గోపీభిః ప్రార్థితః కృష్ణో గోవిందో భూర్యనుగ్రహమ్ ।*

*కుర్వాణస్తాసు సంవాదం భూయోఽప్యకృతసాదరమ్ ॥ -2*

అధికమైన అనుగ్రహముతో శ్రీకృష్ణుడు మరలా వారితో ఈ విధముగా పలికాడు.

*కీర్తన :*

*కృష్ణ : ఆవరణ మమనహితే దాతుం*

*భావయ గోపవధూజన బృంద*

*గోప్య : దేవయదావరణం మమనీతం*

*దేహివిభో భవతా తదనంత*

*కృష్ణ : నీతంనైవ మయాపరకీయం*

*నైవమమావరణం నిజదృష్ట్యా*

*గోప్య : ఆహగృహాణ భవానితి పూర్వం*

*దేహి తదావరణం మమబంధో*

*కృష్ణ : అక్షినిమీలన మేవమయోక్తం*

*సాక్షాదిహతుగృహాణావరణం -3*

---

1. *పోతన భాగవతం, 10 : 843 : పుట-190*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 8 : పుట-209*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 3 : పుట-210, 211*

*గోప్య : లోకాలోకనవిహితావరణం*
*లోకేశ్వర మమదేహి సముదితం*

*కృష్ణ : లోకస్యావరణం న విధాతుం*
*లోకేకోకపి సమర్థః పురుషః*

*గోప్య : కశ్చన నాలోకయతి యథాస్మాన్*
*కలయ తథావిధమేవావరణం*

*కృష్ణ : లోక్యోనాలోకయతి హిలోకే*
*లోకం కశ్చనకమపి విరోధాత్*

*గోప్య : లోక్యాఏవవయం పరభోగ్యాః*
*లోకేశా వరణం తు విధేహి*

*కృష్ణ : తర్హి తదావరణై రలమల్పైః*
*తస్య నకించిదలోక్యమిహాస్తి*

*గోప్య : కి మిద మలౌకిక సిద్ధావరణం*
*కేవావయ మిహ లజ్జాభరణాః*

*కృష్ణ : యుక్తిసహం నహి భవదావరణం*
*యోగిభిరితి మీమాంసిత మబలాః*

*గోప్య : అస్మాభిర్నవిధేయం కి మపి*
*హ్యావగత మచ్యుత తద్వద భగవన్*
*శివనారాయణ తీర్థ సుగీతం*
*శ్రీహరి గోపీజన సంవాదం -1*

నారాయణ తీర్థుల వారు గోపికలు నీటి నుండి బయటకు వచ్చి మర్మావయములను కప్పి ఉంచిన చేతులను పైకెత్తి నమస్కరించినట్లు చెప్పి యుండలేదు.

*శ్లో॥ ఆబాల్యమేతద్యుష్మాకమబలాః కేవలం మతమ్ ।*
*ఉభాభ్యామేవ హస్తాభ్యాం గృహ్ణంతువసనానివః ॥ -2*

కేవలం రెండు చేతులను పైకెత్తి మీ వస్త్రములను అందుకొనుడు. బాల్యము నుండి ఇది మీకు తెలిసిన విషయమే కదా !

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 3 : పుట-210, 211*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 9 : పుట-214*

*శ్లో॥ ఇత్యుక్త్వా వసనాన్యాసాం దత్వా గోపాలకైస్సహ ।*
*అవరుహ్యతరోః కృష్ణః ప్రయయౌ స్వగృహం ముదా ॥ -1*

అని పలికి కృష్ణుడు వారి వస్త్రములను వారికి అందించి చెట్టు నుండి క్రిందకు దిగి మిత్రులతో కలిసి గృహమునకు వెళ్ళాడు.

## గోపికా గీతాలు :

శరత్కాలము నందు బృందావనంలో శ్రీకృష్ణుని వేణుగానానికి ఆకర్షితులై గొల్లచేడియలు మైమరచి ఆ రాత్రి సమయంలో కృష్ణ సందర్శనానికి బయలుదేరారు.

*శ్లో॥ ఇతిప్రలపతి వ్రజే శరదిగోపికామండలే*
*సుధాకిరణమండలే పరిహృతాంధ కారేనిశి*
*పరాక్రవణమానసా స్సఖలుకృష్ణసారాః స్ఫుటం*
*మురారి మురళీరవస్సపదితాస్సమాకర్షతి ॥ -2*

తనను దర్శించడానికి వచ్చిన గొల్లభామలతో అధికుడు, కళ్యాణ గుణకారకుడు, చతురుడు అయిన ముకుందుడు మాటల నేర్పుతో మృదువుగా ఈ విధంగా పలికాడు. "ఏ మాత్రం భయము లేక ఈ రాత్రి వేళ ఈ ప్రదేశానికి తెగువతో మీరు వచ్చారు. మీ జాడ తెలియని మీ బంధుగణము ఎక్కడ వెదుకుతున్నారో! ఈ పనులు మీకు కూడవు.

*శార్దూలము :*

*మీరేతెంచిన జాడఁగానక వగన్ మీతల్లులుం దండ్రులున్*
*మీ రాముల్ మఱఁదుల్ తనూజులు గురుల్ మీ సోదరుల్ బంధువుల్*
*'మేరల్ మీఱిరి లేరుపోయి' రనుచున్ మీ ఘోషభూభాగమం*
*దేరీతిం బరికించిరో తగవులే ఈ సాహసోద్యోగముల్ ? -3*

*కీర్తన :*

*ప॥ వల్లవాంగనామాకలయతధర్మోల్లంఘనం*
*అ॥ప॥ వల్లవాంగనా నిజవల్లభ పదయుగ*
*పల్లవసేవనమేవ పరోధర్మో -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 10 : పుట-215*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 6 : పుట-239*
3. *పోతన భాగవతం, 10 : 977 : పుట-221*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 4 : పుట-246*

*చరణం: కులశీల కర్మాది కుళీరాదిజాలం*

*కోపసంతాపాది నిబిడకల్లోలం*

*అలమిహ సంసార జలధి మాగమకృత*

*కులధర్మసేతు రథతారయతి బహుళం*

*చరణం: రహసి నిశివనే కిం రమణీయ చరణం*

*మహనీయ గృహపతి మపహాయతరుణం*

*సహసా పరపురుషానుసరణే నాల మిహ*

*గృహపతి మిహయాత గృహిణీశరణం*

*చరణం: గురుబంధు జనావజ్ఞా కుత్సితాచారం*

*పరిహరత కురుత పరపరిహారం*

*త్వరయైవ గృహమను యాతపాతకబుద్ధి*

*మరివర్గమపి పరిహరత నిస్సారం*

*చరణం: పరిపూర్ణ బోధైకరసమఖిలసారం*

*పరమపురుష మనుసరత బాలగోపాలం*

*గురువరకరుణా సుధాసముదంచిత*

*శివనారాయణతీర్థయతి గీతమతులం ॥ -1*

కులధర్మము సేతువు వంటిది. సంసార సముద్రమును దాటుటకు వేరొక ఉపాయము లేదు. భర్తలను వదలి రాత్రివేళ బృందావనమునకు వచ్చుట సరికాదు. సతికి పతియే ప్రత్యక్ష దైవము. పర పురుషాశ్రయము దురాచారము. కామక్రోధముల నిగ్రహణము చేత సంఘము యొక్క ఆదరణము పొందుతారు. సత్యజ్ఞానానంద స్వరూపుడైన పరమాత్మను అనుసరించండి.

శ్రీకృష్ణుని యందే విరహాగ్ని దగ్ధులవుతున్న గోపికలకు ఆ పలుకులు విచారం కలిగించాయి. తొట్రుపాటు పడినవారై ఆ యాదవ స్త్రీలు కృష్ణునితో ఈ విధంగా పలికారు.

ప్రభుడవు, ఆది పురుషుడవు, ముముక్షుసంతారకుడవు అయిన నీవు ధర్మవేత్తవు. నిన్ను నమ్ముకున్న మమ్ము కాపాడుము. నీవు ఆత్మభూతుడవు. కరుణకు పెన్నిధివి. ఇక మాకెవ్వరి పొత్తూ వద్దు. నీ పాద దాస్యమిచ్చి రక్షించు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 4 : పుట-246*

*కీర్తన :* *ప॥ శరణం భవకృష్ణ సంసరతాం భవకృష్ణ*

*అ॥ప॥ కరుణా తవ సంసరణ పయోధి సం*

*తరణీతి వరముని ఫణితి రస్మాకం*

*చరణం: ఆరంభణ మధజగతి ఫలావధి*

*ధీరమునిభి రిహనిశ్చిత మఖిలం*

*భూరి కృపాలయ మాహురిహాగమ*

*సారం త్వా మఖిలాత్మక మమలం*

*చరణం: నూనం త్రిభువన గృహిణీపతి రితి*

*గానం మహతా మను సంవిదితం*

*శ్రీనందాత్మజ శ్రీవసుధాధిపా*

*నందం త్వా మనుయామో నిరతం*

*చరణం: కామినీ జన సకల కామదుహం పరమ*

*కారుణికం ప్రాహురేవ భవంతం*

*కోమలగిరా గోపికా గణగీతం*

*గోవిందమితి నారాయణ తీర్థ భణితం ॥ -1*

నీవు ప్రపంచమునకు అంతర్యామివి, వేదసారభూతుడవు, నిత్యశుద్ధవు, దయామయుడవు, సకల కామములను ఒసంగువాడవు. మేము మా ఆనందము కోసం ఎల్లప్పుడూ నిన్నాశ్రయిస్తాము.

నీ పాదపద్మములు శ్రీమహాలక్ష్మికి ఎంతో ఆనందాన్ని చేకూర్చాయి. అటువంటి నీ చరణములను మేము చేరగలిగాము. ఇక ఇక్కడ నుండి మరలిపోము. మా పతులనూ అంగీకరించము. తామరపూవుల సుగంధాన్ని మరగిన తుమ్మెదలు ఇతరపుష్పముల చెంతకు పోవు.

*చంపకమాల :*

*సిరికినుదార చిహ్నములు సేయు భవచ్చరణారవిందముల్*

*సరసిజనేత్ర ! మా తపము సంపద జేరితిమెట్టకేలకున్*

*మరలఁగ లేము మామగల మాటలనొల్లము; పద్మగంధముల్*

*మరిగిన తేఁటు లన్యకుసుమంబుల చెంతను జేరనేర్చునే ? -2*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 5 : పుట-249, 250*

2. *పోతన భాగవతం, 10 : 991 : పుట-225*

నీ యొక్క ఆలింగన భాగ్యము దొరుకుతుందనే మేము అత్తమామలు ఆక్రోశించినా, భర్తలు చిన్నబోయినా, కుల మర్యాదలను త్రోసి వచ్చాము అంటే అది నీ నవ్వులకు, నీ అనునయ వాక్యాలకు ముచ్చటపడే కదా! మదనుడు హృదయాన్ని మధిస్తూ ఉంటే తాళలేక నీ వద్దకు వచ్చిన మాకు నిందలూ, నిష్ఠూరాలా ! మగవారు పలికే మాటలేనా యివి.

*ఉత్పలమాల :*

*అత్తలు మామలున్ వగవనాఁడి కోడక నాథులన్ శుగా*
*యత్తులఁ జేసి యిల్వరుసలాఁడి వోవఁగ నీదు నవ్వులన్*
*మెత్తని మాటలన్ మరుఁడు మేకొని యేఁచిన వచ్చినార; మే*
*పొత్తుల నొల్లమో పురుషభూషణ ! దాస్యములిచ్చి కావవే ॥ -1*

*మత్తేభము :*

*మగువల్ సిక్కరె తొల్లివల్లభులకున్ ? మన్నించి తద్వల్లభుల్*
*మగపంతంబు దలంపరే ? తగులముల్ మాపాలనే పుట్టినే ?*
*మగవారాడెడు మాటలే తగవు నీ మాటల్ మనోజాగ్నిచేఁ*
*బొగులంజాలము; కౌఁగిలింపుము మముం; బుణ్యంబు పుణ్యాత్మకా ! -2*

అనురాగవతులైన స్త్రీలు వలచిన పురుషునిపై కల కోరికను లోకసామాన్య రీతిలో యదార్థము ప్రస్ఫుటించే విధంగా పోతనగారి రచన సాగింది.

నారాయణ తీర్థుల వారి గోపిక విజ్ఞానవతి. జన్మాంతరముల నుండి చేయుచున్న పుణ్య పరిపాక విశేషము ఇప్పుడు ఫలోదయమైంది. కనుకనే కృష్ణునకు నమస్కరిస్తూ పలికింది.

*శ్లో॥ జన్మాంతర సహస్రేషు కృతపుణ్య ఫలోదయా ।*
*ఇదమాహాపరాకాంతం కుర్వంతీ ప్రణతీర్ముహుః ॥ -3*

*కీర్తన : పూరయ మమకామం గోపాల - పూరయమమకామం*
*అ॥ప॥ వారం వారం వందనమోస్తుతే వారి జయదళనయన గోపాల -4*

---

*1. పోతన భాగవతం, 10 : 993 : పుట-225*

*2. పోతన భాగవతం, 10 : 994 : పుట-225*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 12 : పుట-251*

*4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 6 : పుట-252*

*చరణం: మన్యేత్వామిహ మాధవ దైవం*
*మాయాస్వీకృత మానుషభావం*
*ధన్యైరాధృత తత్త్వస్వభావం*
*దాతారం జగతామతి విభవం*

*చరణం: బృందావన చరబర్హావతంస*
*బద్ధకుంజవన బహుళవిలాస*
*సాంద్రానందసముద్గీర్ణ హాస*
*సంగతకేయూర సముదితహాస*

*చరణం: మత్స్యకూర్మాది దశమహితావతార*
*మదనుగ్రహధవ మదనగోపాల*
*వాత్సల్య పాలిత వరయోగిబృంద*
*వర నరాయణ తీర్థద వర్ధిత మోద -1*

నాపై కరుణ జూపి నా అభీష్టములను నెరవేర్చుము.

మన్మథుని చెఱుకు బాణ శరపరంపరలచే కట్టుబడ్డాము. ఇది కేవలం నీ వదనం వీక్షించడం చేతనే జరిగింది. ఎందుకంటే నీ చెక్కిళ్ళు, మోవి, ఫాలభాగము, అన్నింటికీ మించి నీ చిరునవ్వు చూపులు అటువంటివి కదా.

*ఉత్పలమాల :*

*కుండల దీప్త గండమును గుంచిత కుంతల ఫాలమున్ సుధా*
*మండిత పల్లవాధరము మంజులహాస విలోకనంబునై*
*యుండెడు నీ ముఖంబుఁగని యుండఁగ వచ్చునె? మన్మథేక్షుకో*
*దండ విముక్త బాణముల దాసులమయ్యెద; మాదరింపవే ! -2*

ఈ విధంగా గోపికలు కృష్ణుని అధరసుధారసమును చిలికించమని అడిగారు. శరీర స్పర్శ చేతనే మదనాగ్ని చల్లారుతుంది. కాబట్టి చన్నులపై కృష్ణ వక్షఃస్థలాన్ని కోరారు. ఆయన చేతిని కొప్పుపై ఉంచి దగ్గరకు తీసుకోమని కోరారు. ఏ మాటలతో మదనతాపం చల్లారుతుందో తేనెలొలికే కృష్ణ పలుకులు చెవులలో వినిపించమన్నారు. అన్నింటికీ ఒక్కటే సమాధానం. మా మొరాలకించి మా మన్మథాగ్నిని చల్లార్చుమని వేడుకున్నారు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 6 : పుట-252*
2. *పోతన భాగవతం, 10 : 995 : పుట-226*

సీసం : నీ యధరామృత నిర్ఘరంబులనేఁడు సేరి వాతెఱలపైఁజిలుకకున్న
నీ విశాలాంచిత నిర్మల వక్షంబుఁ గుచకుట్మలంబులఁ గూర్పకున్న
నీ రమ్యతరహస్త నీరజాతంబులు చికురబంధములఁ జేర్పకున్న
నీ కృపాలోకన నివహంబు మెల్లన నెమ్మొగంబుల మీఁదనెఱపకున్న

ఆ॥వె॥ నీ నవీన మాననీయ సల్లాపంబు కర్ణరంధ్ర దిశలఁగప్పకున్న
నెట్లు బ్రతుకువార ? మెందు జేరెడివార ? మధిప ! వినఁగఁదగదె యాఁడుకుయిలు -1

మానవులకు సంసార బంధమును హరించుటకు పరమగురులైన (శ్రేష్ఠుడైన) నృసింహుడవు నీవు అని గోపికల మాటల రూపంలో తీర్థుల వారు తన భక్తిభావమును వెల్లడి చేశారు.

శ్లో॥ నృణాంబంధహతిం కుర్వన్ నృసింహోఽసిదయాఘన
ఇతిసంబోధ్య గోవిందం సానందం ప్రాహగోపికా ॥ -2

కీర్తన : కరుణయావలోకయమాం శ్రీనృసింహ
అ॥ప॥ శూరాసురసంహార శోభనాద్రి శ్రీనృసింహ

1. పరిపూర్ణ దయారస పాథోధిబృంహణ
ప్రహ్లాద చంద్రోదయ శ్రీనృసింహ
నిరసిత తామస నిర్విశేషమానస
గురుతరవీర శ్రీ గూఢసుగుణాలయ

2. పాతక మహాటవీ పఙ్క్తికోపానల
భక్తచందనశీతల శ్రీనృసింహ
ఉత్తుంగ సుకిరీట ఉన్నతకేయూర
మత్తచిత్తమాతంగ మర్దన మహాబల

3. త్రైగుణ్యఫలాతీత తత్త్వఫలాత్మక
తాపజలధితారక శ్రీనృసింహ
శ్రీగురుకరుణయా శ్రితభక్తి సుధారస
శ్రీ నారాయణతీర్థ శ్రేయోవిధాయక -3

---

1. పోతన భాగవతం, 10 : 996 : పుట-226
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 13 : పుట-253
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 7 : పుట-254

శోభనాద్రి నృసింహుడు సద్గుణాశ్రయుడు, తమోగుణ రహితుడు, మహాబలుడు, దుష్టారణ్య దావానలుడు, శాశ్వత మోక్షదాత.

పశుపక్ష్యాదులు, వన మృగాలు నీ సంగీతానికి పులకించిపోతాయి. మేము కూడా అందుకు భిన్నముగా లేము.

మానినీ చిత్త చోరుడవైన ఓ కృష్ణా! నీ యింపైన పలుకు మా మదనాగ్నిని చల్లారుస్తుంది. నీ చూపు మదన సాగరాన్ని దాటిస్తుంది. నీ నవ్వు కామాంధకారాన్ని పోగొడుతుంది. నీ అధరామృతం స్మరజ్వరాన్ని శమింపజేస్తుంది. దయమాలిన కందర్పుడు మమ్ము బ్రతకనీయటం లేదు కనుక నీ ఆలింగన భాగ్యాన్ని మాకు ప్రసాదింపుము అని పలికారు.

*కందం : తరుమృగఖగ గోగణములు, కరమొప్పెడు నిన్నుఁగన్నగానము విన్నం*
*గరఁగి పులకించు; నబలలు, గరఁగరె నినుఁగన్న నీదుగానము విన్నన్ ॥ -1*

*సీసం॥ ఈ పంచబాణాగ్ని నేమిట నార్తుము నీ మంజు వాగ్వృష్టి నెగడదేని?*
*నీ మన్మథాంబోధి నేత్రోవఁ గడతుము నీ దృష్టినావయై నిలువదేని ?*
*నీ చిత్తజధ్వాంతమే జాడఁజెఱతుము నీ హాసచంద్రిక నిగుడదేని ?*
*నీ దర్పక జ్వరమే భంగి నడఁతుము నీ నవాధరసుధ నింపవేని ?*

*ఆ॥వె॥ నెట్లు నిర్వహింతు? మేలాగు మాలాగు; కరుణ సేయవేని ఁగదియవేని;*
*మరుఁడు నిర్దయుండు మననిచ్చునే ?, యశోదా కుమార ! యువతి ధైర్యహార । -2*

తీర్థుల వారి గోపిక ధన్యురాలు. యుక్తియుక్తముగా ఆదరపూర్వకముగా శ్రీకృష్ణునితో పలికినది.

*శ్లో॥ అన్యాపియువతీ కాచి దన్యాదృశగిరా హరిమ్ ।*
*ధన్యాసంబోధయం త్యద్ధా సన్యాయం ప్రాహసాదరమ్ ॥ -3*

---

*1. పోతన భాగవతం, 10 : 998 : పుట-226*

*2. పోతన భాగవతం, 10 : 999 : పుట-227*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 14 : పుట-256*

*కీర్తన :*

*ప॥ భూయో భూయో యాచేఽంజలినా*

*అ॥ప॥ భూమన్ త్వయి మేదాస్యం దేహి*

*చరణం: నిమిషార్ధమపి త్వద్దర్శనవిధురా*

*నింద్యాహి తనురేషా*

*తామరసేక్షణ తవపాదకమలే*

*తనుతాం మమతనోరతులాం*

*చరణం: కాంతం కాంతారమపి తవయోగే*

*కమలేక్షణ మన్యే*

*కాంతారం గృహమపి తువియోగే*

*కరుణా తరుణీ మయితవ భవతు*

*చరణం: వరయామి గోపాల వల్లభ మధునా*

*త్వరయాహ మఖిలగురుం*

*సరసగిరా గోపయువతీ కథితమితి*

*గురుకృపయా నారాయణతీర్థ ఫణితం -1*

నాకు నీ సేవాభాగ్యమును అనుగ్రహింపుము. ఎల్లప్పుడు నీ పాద పద్మములందు సడలని భక్తి ప్రసాదింపుము. నీ దయ ఎల్లప్పుడూ నాపై క్రొత్తదనముగా ప్రసరింపబడు గాక అని వేడుకుంది.

## రాసక్రీడ :

వచనం : అని యిట్లు కుసుమశరుని శరపరంపరా పరవశలై యోపికలు లేక పలికిన గోపికల దీనాలాంపబులు విని, నవ్వి యోగీశ్వరుండైన కృష్ణుండాత్మారాముండై వారలతో రమించెనప్పుడు.

యోగీశ్వరుడు, ఆత్మారాముడు అయిన శ్రీకృష్ణుడు వ్రజ సుందరీమణుల దీనవచనములను విని నవ్వుతూ వారితో రమించాడు.

శ్రీకృష్ణుడు వారిని పరిగ్రహించగా తరుణులందరూ ఆయన చుట్టూ చేరి గానం చేయసాగారు.

*శ్లో॥ నిగమబృందసరోరుహసంగతం*

*నిఖిలలోక మధుస్వసుభాత్మకమ్ ।*

*మధురిపుంప్రతిలభ్యచవల్లవీ*

*మధుకరాస్సుకరం జగురిత్యలమ్ ॥ -2*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 8 : పుట-256, 257*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 17 : పుట-261*

బ్రహ్మానంద మకరందమైన శ్రీకృష్ణ రూపమును గోపికా భ్రమరములు మిక్కిలి ఉత్సాహముతో గానం చేయుట ప్రారంభించినాయి.

*కీర్తన : ప॥ వనభువి గోపాల విహరంతం*

*అ॥ప॥ వల్లవ యువతీ జనవలయ భాస్వంతం*

*చరణం: నిగమసరోరుహ నిత్యసంగతమధు*
*మధుహరాత్మత యేహ సముదితం*
*అగణిత గోధన మపరిమితానందం*
*ఆనందకర మమరేశితు రపితం*

*చరణం: ఇన శశిపావకతార కాభాసక*
*మీక్షణ సముదిత జగదేకనాథం*
*మునిజన మానస సారస వరహంస*
*మహనీయదైవత మఖిలదేహరథం*

*చరణం: లావణ్య సరిదేకనాయక మఖిలసం*
*రక్షణ మమర సంరక్షణ మధునా*
*సేవక శివనారాయణ తీర్థ భావిత*
*శ్రేయో విధాయక మిహ వేదవిధినా ॥ -1*

సంకల్ప మాత్రం చేతనే లోకాలను సృష్టించువాడు. సూర్యచంద్ర నక్షత్రాదులను తన ప్రకాశం చేతనే ప్రకాశింపజేయువాడు అయిన కృష్ణరూపము లావణ్య సముద్రుడై బృందావనంలో గోపికల మధ్య విహరించుచున్నాడు అని భావము.

*శ్లో॥ గాయంత్యోనన్నృతుశ్చేత్థం గాయంతం నందనందనమ్ ।*
*వేణునాదసుదాధారా ముద్గిరంతం ముహుర్ముహుః ॥ -2*

వేణుగానామృతమును వర్షిస్తూ వారి మధ్య కృష్ణుడు నిలుచున్నాడు. గోపికలు గానం చేస్తూ నృత్యమును కూడా ఆచరించారు.

ఆహ్లాదకరమైన శరత్కాలము, నిర్మలమైన యమునానది, నంద గోపబాలుని పదస్పర్శచే పావనమైన బృందావనము. ఒకరి చేతులు ఒకరు పట్టుకొని సవిలాసంగా వలయాకారంగా ఏర్పడి గోపికలు గోవిందుని

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 10 : పుట-262*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 18 : పుట-264*

చుట్టూ తిరుగుతూ ఉండగా అంతర్యామి, అనంతుడు అయిన శ్రీకృష్ణుడు రాసక్రీడను ప్రారంభించాడు. ముఖ, హస్త, పాద విన్యాసాలతో పలు విధాలుగా రాసలీల ప్రతిబింబించింది. దేవతలు అది చూసి ఆనందాన్ని అనుభవించారు.

*ఉత్పలమాల :*

*ఆ సమయంబునన్ విభుడనంతుఁడు గృష్ణుఁడు చిత్రమూర్తియై*
*చేసెను మండల భ్రమణశీల పరస్పర బద్ధబాహు కాం*
*తా సువిలాసమున్ బహువిధ స్ఫురితానన హస్త పాద వి*
*న్యాసము రాసముంగృత వియచ్చరనేత్ర మనోవికాసమున్ ॥ -1*

ఈ సమయంలో బృందావన సౌందర్యమును తీర్థుల వారు రమణీయంగా వర్ణించినారు.

గద్యం : తత్రఖలు బృందావనే మందార పారిజాత సంతాన సంకల్ప హరిచందనాది తరు బృందానందిత శుకపిక శారికారి బృంద వినిందిత నందనోద్యానే సముత్ఫుల్ల శారద మల్లికాది మకరంద పరిమళ లాలసతయా సంచరచ్చంచరీక ఝుఝుణాత్కార నూపురరవైః విచిత్ర పతత్రి వక్త్రోద్గళిత నానావిధ వినోద వినాద దళమృదంగ సంగీతాది కళావిశేషైః ఆలక్షితానేక కోటి వనదేవతా నట్యరసోత్కటే కవింద నందినీ పుళింతసముల్ల సితలవఙ్గలతాది వివిధ లతాభవనే క్వాపి క్వాపి శారదసాంద్ర చంద్రికా సంగ విలసిత మణివాలుకా మౌక్తిక సితసికతా సుధారమణీయ వేరికాజాలే దివ్యవిమాన సమారూఢసుర కిన్నరాది వరవనితా గణేషు పశ్యత్సువర్షత్సు చ ముహుర్ముహుః పారిజాతాది దివ్యసుగంధి కుసుమాని భక్తసంకల్ప సిద్ధి మాతన్వానో గోపరమణీ నయనోత్సలారాధిత మదన గోపాలమూర్తి ర్వాసుదేవో గోపీభిస్సహ రాసక్రీడా మహోత్సవారంభ సంభ్రమచేతాః గోపీభీః సార్ధమాత్మతత్వ ముపరిశన్నిదమాహ *-2*

చక్కనిశోభతో అలరారుతున్న బృందావనంలో తన యదార్థ స్వరూపాన్ని శ్రీకృష్ణుడు తెలుపుతున్నాడు. శ్రీకృష్ణ వాక్యామృతమును పానం చేసిన గోపికలు పరమానందం పొంది కృష్ణునితో ఐక్యమైన విధముగా ఉన్నారు. తానొక్కడైనా తలకొకరూపై గోపకాంతల నడుమ రాసమండలం కల్పించాడు. సనకసనందననాదులచే నమస్కరింపబడు తన పాదములతో విశిష్టరీతుల నాట్యం సాగించాడు. గుణవంతుడైన కుమారుని వలన కులం ప్రకాశించినట్లుగా నందనందనుని వేణు విలాసంతో రాసలీల భాసించినదని పోతనగారు వర్ణించారు.

ఈ విధముగా గోపికలు కృష్ణతత్త్వమును తెలుసుకున్న వారై ఆత్మారాములై కృష్ణునితో అభేదము చెంది, దేహాభిమానమును, అహంకారమును విడిచిపెట్టి శ్రీకృష్ణ పరబ్రహ్మము నందు చిత్తము నిల్పి గానము చేస్తున్నారు.

---

*1. పోతన భాగవతం, 10 : 1082 : పుట-245*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 5 : పుట-256*

శ్లో॥ సంసార రోగ సంతప్తాః కృష్ణ బ్రహ్మ రసాయనమ్ ।
గోప్యః పిబంత్యస్తన్ముక్తా రమంతే హ్యభయం గతాః ॥ -1

శ్లో॥ ఆత్మారామాః పరానంద నిత్యతృప్తాః పునః పునః ।
ఆత్మానుభూతిం గాయంత్యః కృష్ణైక రసతాం గతాః ॥ -2

శ్లో॥ రమంతే పరమానందే కృష్ణ బ్రహ్మణి తా భృశమ్ ।
త్యక్త దేహాద్యహంమానా నిర్విశేషసుఖేస్థితాః ॥ -3

కీర్తన : ప॥ పరమిహ పశ్యత పూరుషం స్వీకృతమాయిక మానుషం

చరణం: నిజపర భేద రహిత దృశమక్షర మీక్షణకృత భువనం విభుం
ఉపనిషదేక సమధిగత మద్వయ బోధసుఖైకరసం ప్రభుం

చరణం: ఇదమిద మిత్యఖిలేషుసమనుగత సత్యచిదద్వయ విగ్రహం
శ్రుతిశిరసి ప్రవివిక్త మసక్త మభక్తజనై రతి దుర్గ్రహం

చరణం: గగన మరున్ముఖ భూతసముదిత సమస్త జగత్ప్రతి భాసకం
తదను తదన్తర సమయ మశేష విశేష మఖండ సుఖాత్మకం

చరణం: అధిగత మన్నమయాఘ యోగిభి రాంతరమాంతర మవ్యయం
హరిమఖిలైకరసం జననాది వికార విహీన మనామయం

చరణం: విదురిహయం నిగమాంతవచోభి రపోహ్యపరాంచమఖండితం
అఘటిత సంఘటనా ఘటితాకృతి మద్భుత కుండల మండితం

చరణం: స్వజన దయాధృత దేహమదేహతయా విహారం తమిహభూతలే
వనభువి రాససమయరసపండితం గోపవధూకృతమండలే

చరణం: అతనుమశేషతనుం జగతా మభయం భయకారణతారణం
నిజకలయా పరిబృంహిత సర్వజనాత్మతయాఘ నివారణం

చరణం: సకృదవలోక నిరాకృత గోపవధూజనతాపమరిందమం
నవజలదాభతనుం తటిదాభపటం నటవేషధరం సమయం

చరణం: హరిచరణ స్మరణైక పరాయణ జనసుఖదం పరదైవతం
మునినారాయణ తీర్థసువిరచిత గీతమిదం నిగమాన్వితం -4

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 8 : పుట-285
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 9 : పుట-285
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 10 : పుట-286
4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 2 : పుట-286, 287

అద్వితీయుడు, భక్తిచేత మాత్రమే దొరుకువాడు, పరిపూర్ణానంద స్వరూపుడు, పుట్టుట మొదలగు వికారములు లేనివాడు, ఉపనిషత్తుల సహాయముచే మహాత్ముల చేత తెలియబడువాడు, రూపరహితుడయ్యునూ భక్తులను రక్షించుట కొరకు శరీరమును దాల్చినవాడును, భయ విదూరుడు, పాప హరుడునూ, సర్వసముడు అయిన భగవంతుని దృష్టి గోపికలపై పడగానే వారి సంతాపము తీరిపోయింది.

జవజవలాడే నడుములు కలిగిన ఆ ఇందువదనలు ఉల్లాసంగా కృష్ణునితో ఆడిపాడారు. దాని చేత వారి మెడలోని దండలు మెలివడినాయి. మొలనూళ్ళు సడలినాయి. కమలాక్షునితో కూడి నాట్యం సల్పెడి వేళ వారి నడుముల నున్న చిరుగంటలు, కాలి అందెలు, కరకంకణములు చెవులపండువగా గల్లుమని మ్రోగినాయి. గోప వధూగోవిందుల రాసలీలలు చూచి ఖేచరభామినులు కామపీడితులైరి. ఆకాశంలోని చంద్రుడు తన వంశాబుంధి చంద్రుడైన కృష్ణచంద్రుని రాసలీల చూడటం చేత ఆ రాత్రిని ఆలస్యంగా ముగించాడు.

*కందం॥ తారాధిపనిభవదనలు, తారాధిపవంశ్యుఁగూడి తారునటింపం*

*దారలతోడ సుధాంశుఁడు, దారును వీక్షింప రేయి దడవుగ జరగెన్ -1*

రాసక్రీడా సమయంలో వాయువు కూడా కృష్ణుని యందు తన స్వామి భక్తిని ప్రకటించింది.

*మత్తేభం :*

*యమునాకంకణచారియై వనజ పుష్పామోదసంచారియై*

*రమణీఘర్మనివారియై మదవతీ రాసశ్రమోత్తారియై*

*ప్రమదామానస నవ్యభవ్యసుఖ సంపత్కారియై చేరి యా*

*కమలాక్షుండల రంగ గాలివిసరెంగల్యాణభావంబునన్ ॥ -2*

ఆమంద మారుతం మగువల మనస్సులలో నూతనమైన ఆనందాన్ని సమకూర్చిపెట్టింది. కాళిందీ జలాలపై ప్రసరించడం ద్వారా చల్లదనము, పద్మపూల సుగంధము, చెమటను దూరం చేయడము అన్నింటికీ మించి రాసక్రీడ వల్ల కలిగిన బడలికలను పోగొట్టింది. ఒక రాజీవాక్షి స్వరభేదాలు, జాతులు కలియబడకుండా రాగమొక్కటి రమ్యంగా వీణను మీటుతూ పాట పాడింది. కృష్ణుడు మేలుమేలని అభినందించాడు. ఒక గోపిక అనంతుని హస్తాన్ని చనుదోయిపై నుంచింది.

ఈ విధంగా చిరునవ్వులు, హస్తవిన్యాసాలు, చూపులు, రాగాలాపనలతో రాసకేళి యందు అలసిన ముదితలు పరమపురుషుని కరుణకు పాత్రులయ్యారు.

---

*1. పోతన భాగవతం, 10 : 1089 : పుట-250*

*2. పోతన భాగవతం, 10 : 1090 : పుట-251*

*కందం॥ హాసంబులఁగరతలవి, న్యాసంబుల దర్శనముల నాలాపములన్*

*రాసశ్రాంతల నా హరి, సేసెన్ మన్ననలు కరుణసేసి నరేంద్రా ! -1*

గోప వధువులందరికీ తానందరయిన ఆత్మారాముడు భగవంతుడు శ్రీకృష్ణుడు తన అంగసంగమ సుఖం చేత ఆనందం కలిగిస్తూ రాసలీల సాగించాడు. ఈ లోకోత్తర అమందానంద రాసలీలోత్సవమును చూసి దేవాంగనలు సమ్మోహితులయ్యారు.

*కందం॥ హరితనుసంగసుఖంబునఁ, బరవశలై వ్రేతలెల్లఁబయ్యెదలు నిజాం*

*బరములు నెఱుఁగమి చోద్యమె ?, సురసతులీక్షించి కరఁగి చొక్కిరిమింటన్ ॥ -2*

వచనం : ఇట్లు భగవంతుండైన శ్రీకృష్ణుండాత్మారాముండయ్యును గోపసతులెందఱందరకు నందఱై నిజప్రతిబింబంబులంతోడం గ్రీడించు బాలుపోలిక రాసకేలి సలిపిన *-3*

రాసక్రీడానంతరం జలక్రీడలతో శ్రీకృష్ణుడు గోపికలను సంతోషపెట్టాడు.

*మత్తేభం :*

*సతులుం దానును నీటిలో వెడలి భూషాగంధచేలాద్యలం*

*కృతుఁడై కుంభికరేణు యూథములతోఁ గ్రీడించు చందంబునన్*

*లతలందుం దరులందుఁ బుష్పమయ లీలాశయ్యలందున్ సుఖో*

*న్నతుఁడై కృష్ణుఁడు క్రీడలందనిపెనా నారీల లామంబులన్ ॥ -4*

అతిశయించిన ఆనందంతో నందనందనుడు గోపసుందరీమణులతో తీవ పొదరిండ్లలో, చిక్కని చెట్ల నీడలలో చక్కని పూలసెజ్జలతో ఆశరత్కాలంలో అస్ఖలితేంద్రియుడై తరుణీమణులతో రమించాడు.

నారాయణుడు సకలలోకములకు కారణభూతుడు. సంసార భయమును నశింపజేయునట్టి మహాత్ముడు. ఆయనకు నమస్కరిస్తూ గోపికలు గానం చేస్తున్నారు.

*కీర్తన : ప॥ మాధవ మామవదేవ యాదవకృష్ణ యదుకులకృష్ణ*

*అ॥ప॥ సాధుజనాధార సర్వభావ మాధవ మామవదేవ*

*చరణం: అంబుజలోచనకంబు శుభగ్రీవ బింబాధర చంద్రబింబానన*

*చాంపేయ నాసాగ్రలగ్నసుమౌక్తిక శారదచంద్ర జనిత మదన - 5*

---

*1. పోతన భాగవతం, 10 : 1096 : పుట-252*

*2. పోతన భాగవతం, 10 : 1097 : పుట-252*

*3. పోతన భాగవతం, 10 : 1098 : పుట-252*

*4. పోతన భాగవతం, 10 : 1101 : పుట-254*

*5. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 4 : పుట-300, 301*

*చరణం: కపట మానుషదేహా కల్పిత జగదండకోటి మోహిత భారతీరమణ*
*ఆపగత మోహతదుద్భవ నిజజన కరుణయాధృతదేహసులక్షణ*

*చరణం: తరళకుండల రవిమండల వికసిత నిజజన మానస పంకేరుహ*
*కరుణాహాస సుధానిధి కిరణశమిత భవతాపస జనమోహ*

*చరణం: మురళీగాన రసామృత పూరిత వ్రజయువతీ మానసార్ణవ భో*
*సరస గుణార్ణవ తీర్ణభవార్ణవ సతతగీత కీర్తిమండల భో*

*చరణం: శంఖచక్ర పద్మ శార్ఙ్గ దాఖడ్గ వైజయంతీ కౌస్తుభాది భూష*
*స్వీకృత బుద్ధ్యాది తత్త్వ సమన్విత దివ్యమంగళ గోపబాలక వేష*

*చరణం: ఆగమగిరి శిఖరోదిత సత్యచిదద్వయలక్షణసుభానో*
*భోగికులోత్తమ భోగశయన దుగ్ధసాగరజాల క్షణాధ్యతనో*

*చరణం: ఇందిరయా సహ సుందరకృష్ణపురందరాది వంద్య పదకమల*
*నందనందనయోగి వర్యదురంధర నారాయణ తీర్థమతివిహార -1*

శరత్కాల నిర్మల చంద్రోదయం వేళ నిను చూచినంత కామబాధ అధికమవుతోంది. ఓ మాయామానుష శరీరధారీ ! చతుర్ముఖునే భ్రమింపజేసిన నీవు నన్ను బ్రోవుము. నీ చిరునవ్వు మహర్షుల అజ్ఞానమును పోగొట్టుతోంది. నీ వేణుగానమనే అమృత ధారల చేత మమ్ము తృప్తిపరచితివి. దివ్యమంగళ గోపాలరూపా! ఓ నందకుమార! సుందరాకార! కృష్ణా! నీవు నిశ్చలచిత్తముతో భగవంతుని ఆశ్రయించువారలను రక్షించువాడవు.

ఈ విధముగా పరమానందముతో దాస్యము సల్పుతూ మహానురాగముతో నృత్యము చేస్తున్న గోపికలను చూసి దేవాంగనలు భగవంతుని స్తుతించారు.

*ప॥ గోవిందమిహ గోపికానందకందం*
*సానందమవలోకయామోముకుందం*

*చరణం: గోపికా గణనయన కుముదపూర్ణేందుం*
*గోపాలకుల తిలక మఖిలజనబంధుం*
*శ్రీపతిమనింద్యహరిచందన సుగంధం*
*శ్రేయోవిధాయి కరుణారస సింధుం - 2*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 4 : పుట-300, 301*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 5 : పుట-305, 306*

*చరణం: సంగీత రస రసిక సరససల్లాపం*
*సరళ మురళీ గళిత సాధుసంతాపం*
*శృంగార రసపూర శ్రీమదనగోపం*
*శ్రితజనానంద మఖిలానందరూపం*

*చరణం: అంగనాముఖపద్మ సంగిభృంగాక్షం*
*ఆలోలమకర కుండలనటనదక్షం*
*మంగళాకార మఖిలలోక సంరక్షకం*
*మాధవ మశేష సురరిపుగణవిపక్షం*

*చరణం: వల్లవీ మాణిక్యమణియుగలఖేలం*
*మరకత మణిచ్ఛాయ మదనగోపాలం*
*మల్లికాజాజి చంపకాది సుమభారం*
*మహనీయ లావణ్య లలితతర పూరం*

*చరణం: స్ఫురదధర కవిత మురళీనాద సుధయా*
*సురసుందరీగణం కర్షయతి కృపయా*
*గురుకరుణయా రచితమే తదతిలలితం*
*నారాయణానంద తీర్థసముదితం -1*

బృందావన విహారి అయిన గోపాలకృష్ణ దర్శనం మిక్కిలి ఆనందం కలిగిస్తోంది. చందనాలంకారుడైన ఆ పరమానంద స్వరూపుడు, వేణుగానముచే ఆశ్రితులను, మనోహరాకారముచే శృంగార రసప్రవాహమును, చమత్కారముతో కూడిన సంభాషణ చేయుచూ సంచరిస్తున్నాడు.

శ్రీకృష్ణుడు నృత్యము చేస్తూ, వేణుగానంతో మనలను ఆకర్షిస్తున్నాడు. ఇది మనకు మహానుగ్రహము.

*శ్లో॥ ఆజ్ఞ ప్రత్యజ్ఞ గౌణస్ఫుట సమవిషమ వ్యంజకవ్యక్తిసిద్ధైః (వత్యః)*
*శృంగారాద్యై రనింద్యై రధికమభినయం వ్యంజయంత్యోయువత్యః*
*రాసక్రీడావిలాసై ద్వనఘువినితరాం మాధవం తోషయంత్యః*
*తుష్టాః స్వైరం రమంతే చిరమిహ గురుణా శ్రీధరేణాప్తకామాః ॥ -2*

అని ఈ విధముగా గోపికలు అంగప్రత్యంగముల చేతను, గౌణముఖ్య భేదముల చేతను, సమవిషప్రకారముల చేతను, వ్యంజకముల నుపయోగించి వాని మూలమున శృంగారాది నవరసములను బాగా అభినయించుచున్నారు. దీనిచే ఆ రాసక్రీడా మహోత్సవమున శ్రీకృష్ణుడు మిక్కిలి సంతోషించాడు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 5 : పుట-305, 306*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 19 : పుట-321*

## శ్రీ కృష్ణ అదృశ్యం, గోపికా విలాపములు, కృష్ణదర్శనం :

ఆ పరమేశ్వరుని మాయాజాలానికి చిక్కి ధన్యురాండ్రయిన గోపికలు మదనకేళిలో సొక్కి సోలిపోయారు. భగవంతుడు కళ్యాణ పరిపూర్ణుడు. వారి కామోత్కంఠతకు శాంతి కలిగించేటందుకు, ఆదరంతో వారిని అనుగ్రహించేటందుకూ వారి కన్ను గప్పి అదృశ్యమైనాడు. ఆయనను కనుగొనడానికి మగ ఏనుగును కనుగొనడానికి సంచరించే ఆడ ఏనుగులు వలె సంచలించిన హృదయాలతో మనస్సులు మనస్సులలో లేక గమనలీలలు, హాసవిలాసాలు, చూపులు, విహారాలు, ఆటలు, మాటలు వంటి గోవిందుని గుణచేష్టితాలు అనుకరిస్తూ తన్మయత్వంతో నేనే మాధవుణ్ణి అంటూ తిరుగసాగారు.

ఉత్పలమాల :

*చిక్కక యీశుఁడై యెదిరిఁజిక్కులఁబెట్టెడి మాయలానికిం*
*జిక్కి కృతార్థలై మరుని చిక్కులఁజొక్కిలతాంగులుండఁగా*
*మక్కువ శాంతి సేయుటకు మన్ననసేసి ప్రసన్నుఁడౌటకుం*
*జక్కన నా విభుండు గుణశాలి దిరోహితుఁడయ్యె నయ్యెడన్ ॥ -1*

వచనం : ఇట్లు హరిగను మొఱంగి చనిన కరింగానక తిరుగు కరేణుల పెల్లున నుల్లంబులు దల్లడిల్ల వల్లవ కాంతలు తదీయ గమన హాస విలాస వీక్షణ విహార వచన రచనానురాగంబులం జిత్తంబులు గొల్పడి, వివిధ చేష్టలకుంబాల్పడి, తదాత్మకత్వంబున నేననేన కృష్ణుండనని కృష్ణ గుణావేశంబులం జరియించుచు. *-2*

శ్లో॥ *కదాచిద్గోవిందే గతవతి పరానంద సదనం*
*నిరాకారంధామ స్వకమతిచ విజ్ఞాపయతితాః ।*
*తదాకారం సాక్షాత్పరమధిగతాః కృష్ణరసికాః*
*పునస్తంగాయంత్యో రహసిమృగయంతి ప్రియతమమ్ ॥ -3*

బృందావనవిహారి వాసుదేవుని గూర్చి వల్లవాంగనలు యమునా నదీ తీరములో ప్రేమతో పాడుతూ వెదుకుతున్నారు.

పుంసాంమోహనరూపుడు, పరులచే నమస్కరింపబడువాడు, ఫాలమున తిలకమును ధరించినవాడు, బలము కలిగి భాసిల్లువాడు, అందరకూ బంధుమిత్రుడు, సాక్షాత్తు మన్మథాకారుడు, వేణుధరుడు, చందనసమము వాడు, అందమైన పలువరుసలు కలవాడు, దేవేంద్ర వైభవముతో శోభిల్లువాడు, ప్రియవిహారుడు అయిన బృందావిహారిని గూర్చి గోపికలు వరుసగా పున్నాగ, బొట్టుగ, కర్పూర, మంకెన, వెలగ, వెదురు, చందన, మొల్ల, మరువక, రేగు, ప్రేంకణ, పాదపములను అడిగారు.

---

1. *పోతన భాగవతం, 10 : 1006 : పుట-228*
2. *పోతన భాగవతం, 10 : 1007 : పుట-228*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 6 : పుట-333*

*"నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ*
*జల్లెడివాఁడు మౌళిపరిసర్పిత పింఛము వాఁడు నవ్వు రా*
*జిల్లెడు మోము వాఁడొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చెనో*
*మల్లియలార! మీ పొదల మాటున లేఁడు గదమ్మ చెప్పరే ? -1*

నల్లనివాడు, కమలముల వంటి కన్నులు గలవాడు, కరుణ రసము చిందించేటటువంటి వాడు, సిగపై వ్యాపించిన నెమలిపురి గలవాడు, మోముపై చెరగని చిరునవ్వు కలవాడు అయిన ఒక కుఱ్ఱవాడు మీ పొదల మాటున ఉన్నాడా! ఉంటే చెప్పండి అన్ని మల్లెతీగలను కోరుతున్నారు.

మీ శ్రీకృష్ణుడు ఎటువంటివాడు అని ఆ వృక్షములు అడుగుతాయేమో అన్న శంకతో ఆ వల్లవాంగనలు మేము వెదుకుతున్న శ్రీకృష్ణుడు మన్మథుని కూడా కరగించేవాడు, వక్షఃస్థలము నందు సిరి కలవాడు. చెవులకు యింపు కలిగించు వేణురవము కలవాడు అని వృక్షములతో పాటు లవంగ, మాదీఫల, నారింజ చెట్లను కూడా అడిగారు.

పడతుల పాలిటి పంచశరుడు, అందమైనవాడు, ఉదారుడు వత్సాసురుని తెగటార్చినవాడు అయిన అచ్యుతిని కనుగొన్నారేమో అని కొడిసె మరియు మద్దితరువులను కూడా అడిగారు. యమళార్జున భంజనుడైన హరిని అవలోకించారా అని కంకేళి పాదములను అడిగారు. ఇంకా సంపెంగ, ఎఱ్ఱ గోరింట, అడవిమొల్ల, నెల్లి చెట్లను దుఃఖరహితుడైన తోయజాక్షుని గూర్చి అడిగారు.

కలిగొట్టు, మిరియం, మామిడి, గురివెంద, జాజి కదళీ వృక్షములను కంజనేత్రుని చూపించమని అడిగారు మరియు గోవింద చరణారవింద ప్రియురాలు, మాధవుని ఆదరము చేత మంగళములు పొందుచున్న తులసిని అడిగారు. మరియు పొగడ, ఎర్రకిత్తలి, మొల్ల, మోదుగు వృక్షములను కృష్ణుని జాడ గురించి అడిగారు.

మొదలైన ఈ వర్ణనలతో బృందావనం అనేక చెట్లతో శోభాయమానంగా ఉన్నట్లు తోస్తోంది.

*కందం॥ తరుణీకుచ కుంకుమయుత, హరికంధరదామ గంధమడరెడుఁ జూడ్కుల్*
*హరిఁగనిన పగిదిదనరెడిఁ, హరిణీ! హరిజాడఁ బుణ్యమయ్యెడిఁ జెపుమా ! -2*

ఈ పద్యంలో గోపికలు ఆడులేడిని కూడా అడిగినట్లు పోతనగారు చెప్పియున్నారు. ఆ లేడి కంఠం కుంకుమ పూత అంటుకొని ఉంది. అది యువతులు స్తనాలపై పులుముకొన్నది అగుట చేత వారు ఆడులేడి కంఠమును తమ స్తనాలకు హత్తుకొనుట చేత పుష్పమాలికా పరిమళం వెదజల్లుచున్నది. దాని చూపులు గోపాలుని చూచిన చూపులుగా ఉన్నట్లు భావించి నీ పుణ్యముంటుంది. కృష్ణుని జాడ తెలుపమని అడిగినారు. భూదేవిని ప్రార్థించినవారైనారు.

---

1. *పోతన భాగవతం, 10 : 1011 : పుట-229*
2. *పోతన భాగవతం, 10 : 1017 : పుట-231*

కృష్ణతాదాత్మ్యాన్ని పొందిన గోపికలు ఆ భగవంతుని లీలలను అనుకరింపసాగారు. పూతన, శకటాసురుడు, తృణావర్తుడు, బకాసురుడు అని భావించిన గోపికలను మిగిలిన గోపికలు నేను కృష్ణుడను అని చెప్పి క్రమముగా వారి యందు కృష్ణుడు సల్పిన విధముగా సల్పారు.

*సీసం : పూతనయై యొక్క పొలఁతి చరింపంగ శౌరియై యొకకాంత చన్నుఁగుడుచు;*
*బాలుఁడై యొక భామపాలకునేడ్చుచో బండినేనను లేమఁబాఱఁదన్ను;*
*సుడిగాలినని యొక్క సుందరిగొనిపోవ; హరిననువర్తించునబ్జ ముఖియు*
*బకుఁడనేనని యొక్క పడఁతి సంరంభింపఁ బద్మాక్షుఁడను కొమ్మ పరిభవించు*

*ఆ॥వె॥ నెలమి రామకృష్ణులింతులిద్దఱుగాఁగ, గోపవత్సగణముగొందఱగుదు;*
*రసురవైరిననుచునబల యొక్కతె చీరుఁ, బసులమనెడి సతుల భరతముఖ్య ! -1*

సాక్షాత్తు మాధవునిగా భావించుకొనిన ఒక గోపిక విశ్వమంతా నాకుక్షిలో ఉందంటూ యశోదగా నటిస్తున్న మరొక గోపికకు తన నోరు తెరచి చూపించింది. నేను వెన్నదొంగను అని భావించిన గోపికతో నేను యశోదననే గోపిక ఆమెను పూదండతో బంధించింది. ఇది కాళీయ సర్పం. మిగిలినవారు దాని పత్నులు నేను నందతనయుణ్ణి అని ఒక గోపిక కులుకులాడింది. ఒక గోపిక చీరకొంగు పైకెత్తి పట్టుకొని నేను గోవర్ధనగిరిని ఎత్తుతున్నాను. మీరందరూ రండి. రాళ్ళ వాన నుండి రక్షించుకొనండి అని పిలువసాగింది. కృష్ణుడనైన నేను కార్చిచ్చు నుండి రక్షిస్తాను అని పలికి ఒక గోపిక బయలును మ్రింగింది.

ఈ విధంగా గోపికలు బృందావనంలోని చెట్లను, తీగలను శ్రీహరిని గురించి అడుగుతూ ఒక చోట శుభ లక్షణములచే మనోజ్ఞములైన శ్రీహరి అడుగులను గుర్తించారు.

వచనం : ఇట్లు తన్మయత్వంబున గోపసుందరులు బృందావనంబునం గల తరులతాదుల హరినడుగుచు దుర్గమంబులయిన విపిన మార్గంబుల సరోజాత కేతన హలకులిశ కలశాంకుశాది శుభలక్షణలక్షితంబులయి మనోహరంబులయిన హరిచరణంబుల చొప్పుఁగని తప్పక చెప్పికొనుచుఁ దమలో నిట్లనిరి. *-2*

ఈ కృష్ణుడు ఒక యువతితో గడిపాడు. ఆ యువతి కొరకు కృష్ణుడు చేసిన పనులను ఊహించుకున్నారు. అంతలో ఒక గోపిక ఇంతకు ముందే కృష్ణుడు నాతో మన్మథక్రీడ సల్పినాడు అని తెలుపగా మరికొందరు కృష్ణుడు మునుపు చేసిన శృంగార చేష్టలను మాటిమాటికీ తలచుకొని కొనియాడారు.

*శ్లో॥ మల్లికాదిలతా స్తద్వదోషధ్యోన్యాశ్చతద్వనే ।*
*సంబోధ్య నామభిస్తేషాం తానాహుర్వల్లవాంగనాః ॥ -3*

---

*1. పోతన భాగవతం, 10 : 1020 : పుట-232*

*2. పోతన భాగవతం, 10 : 1026 : పుట-233*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 9 : పుట-340*

*కీర్తన : మాధవం ధర్శయ హేమందారమాధవం ధర్శయ*

*అ॥ప॥ మాధవమిహరాధికారాధిత మథసాధకజనఫలసాధక మధునా ॥*

*చరణం: రేరేమందార సంతానకల్పక పారిజాతచందన*
*రేరే చంపక నాగపున్నాగ శ్రీపూగపనసనారికేళ రసాల*

*చరణం: సరసకదంబ కపలాశ కురవకవట సమూహ*
*విలసదశోక కపిత్థకదలీవన లలిత దేవదారుబృన్ద పిచుమన్ద*

*చరణం: బృందే బృందావన చరమహర్నిశి నందనందన మతులం*
*కుందలవంగలతే కుటిలాలకమిందు సుందరాననమీశమతిబలం*

*చరణం: పుల్లకుసుమమల్లికే జాజిమాలతీవల్లి వనజలతికే*
*కల్లోల శ్రీకమలకేతకి కుముదకల్హారాది కుసుమచయపంక్తిలలితే*

*చరణం: శుకకోకిల శారికాబృంద శకుంత శోభనహంసకుల*
*ప్రకటాకాశానిలానలజల ధరణి సకలదేవగణసరసగుణగుణ*

*చరణం: సకలనిగమగూఢ మఖిలలోకాధారమఖ్యాత మఖిలగురుం*
*సరసగోపీగణ పరిగీతమను శివనారాయణ తీర్థఫణిత ముదారం ॥ -1*

ఆ వనములో తిరుగుతూ భక్తజనులకు కోరిన వరములు ఇచ్చువాడు, రాధాలోలుడైనట్టి ఆ శ్రీకృష్ణుని ఇప్పుడు మాకు చూపుము అంటూ వనవృక్షములు, పక్షులతో పాటు పంచభూతములను, దేవతా సమూహములను కూడా వేడుకున్నారు. భగవదనుగ్రహముచే వారి మనస్సులలో పరబ్రహ్మ రూపము ప్రకాశించింది.

*శ్లో॥ గోపీషుమృగయంతీషు వనేగోపాలనందనమ్ ।*
*ఆత్మానందర్శయామాస చికీర్షుర్భూర్యనుగ్రహమ్ ॥ -2*

*శ్లో॥ మాధవచరణ సరోజే వనభువిసికతాసురేఖ యానుమితే ।*
*దృష్ట్వాతదనుచ తన్వ్యాశ్చరణౌకస్యాఇతీతరాః ప్రాహుః ॥ -3*

ఈ విధంగా వారు వనంలో తిరుగుతుండగా ఒక చోట మహాపురుష లక్షణములు గల అడుగులు కనబడ్డాయి. ఇవి శ్రీకృష్ణుని పాదములే అని వారు నిశ్చయించుకొని బాగా విమర్శించి చూసిన వారికి ప్రక్కన ఒక స్త్రీ అడుగులు కూడా కనబడ్డాయి. కృష్ణునితో ఏ స్త్రీ ఈ త్రోవలో వెళ్ళింది? అని వారు

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 4 : పుట-341*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 10 : పుట-344*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 13 : పుట-350*

వితర్కించుకోసాగారు.

*గద్యం : కదాచిదధ బృందావనే శారదచంద్రచంద్రికా ధవళిత కాళిందే పులిన నలినాభ చరణ నలినాంక రమణీయ భాగే విస్మృతపతి పుత్రబాంధవా స్తత్రగాయం గాయం సంచరంత్యోమధుకరాయివ మాధవ మఖిలషంత్యో విలపంత్యశ్చ రహస్యారాధిత మాధవాం రాధాంక్వాప్యుప కుంజం మాధవవిరహవ్యాకులాంతరతయా చోన్మాదావస్థాయాం స్థితాం సర్వాగోపయువత్యోదదృశుః ఇత్థంచ తాంపప్రచ్ఛుః ॥ -1*

ఒకచోట శ్రీకృష్ణుని పాదములు కానరాగా వాటిని అనుసరించి నడచిన వారికి కృష్ణ విరహమున మిక్కిలి బాధ పొందుతూ, ఉన్మాద్యావస్థను చెందిన రాధ కనబడింది. గోపికలు రాధను ప్రశ్నించారు.

*కీర్తన : కథయ కథయ మాధవం హేరాధే*
*కథయ కథయ మాధవం*

*అ॥ప॥ అధసఖికథయ శ్రీమధుసూదన మశేష*
*విధినావర్ణిత వీర్యమమితవిభవం*

*చరణం: వనభువి రహసి సమారాధితో భగవా*
*ననవద్యసుందరాంగి హే రాధే*
*ఘనజఘనయాత్వయా ఘననీల కుంతలశ్రీ*
*వనమాలీ పీతవాసా వసతిక్వవా జగతి*

*చరణం: మృగమద కలిత తిలక ఫాల సుందరం*
*అగణిత సుగుణ మణిరత్నాకరం*
*విగళిత మోహమఖిల వేదభాగవిదితం*
*భగవంత మాశ్రిత భావుకవిధాతారం*

*చరణం: సరసహాసన రస సరళ తరళ*
*మురళీ మిళిత గోపవధూజనం*
*అరవింద లోచన మరివర్గసూదనం*
*వరనారాయణ తీర్థవాంఛిత ఫలనిదానం ॥ -2*

శ్రీకృష్ణుని వృత్తాంతమును తెలియజేయమని అడుగుతున్నారు.

పోతనగారి భాగవతంలో రాధ వృత్తాంతము లేదు. అడుగుజాడలు గనిన గోపికలు హరినుద్దేశించి

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 18 : పుట-374*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 10 : పుట-375, 376*

పలికినవే "గోపికా గీతలు".

ప్రాణములరచేత నుంచుకొని నీ వారమైన మేము నీ కోసం వెదుకుచున్నాము. కావున నీ రూపం చూపు ధీరుడవైన నీవు ఇలా వేధించుకు తినడం నిజంగా చంపడమే కదా !

ఎన్నో విధాల భయముల నుండి కాపాడిన నీవు ఇప్పుడు పంచబాణునికి అప్పగించడం భావ్యమా !

*ఆ॥వె॥ విషజలంబు వలన విషధరదానవు, వలనఱాల వాన వలన వహ్ని*
*వలన నున్న వాని వలనను రక్షించి, కుసుమశరుని బారిఁగూల్పఁదగునె ? -1*

ఉత్పలమాల :

*నీవు యశోదబిడ్డఁడవె ? నీరజనేత్ర సమస్త జంతుచే*
*తోవిదితాత్మ వీశుఁడవు తొల్లివిరించి దలంచి లోక ర*
*క్షావిధమాచరింపుమని సన్నుతి సేయఁగ సత్కులంబునన్*
*భూవలయంబుఁగావ నిటుపుట్టితి గాదె మనోహరాకృతిన్ ॥ -2*

నీవు యశోదబిడ్డవు మాత్రమే కావు. ప్రాణులందరి బుద్ధికి సాక్షీభూతుడవైన అంతరాత్మవు. పరమేశుడవు. విశ్వరక్షణ కొరకు భూమండలాన్ని ఉద్ధరించేటందుకు మనోజ్ఞ స్వరూపంతో యదువంశంలో ఉద్భవించావు.

సంసార భయమును పోగొట్టేది, అభీష్టములు సిద్ధింపజేసేది నీ కరము. దానిని మా శిరముపై నుంచి మమ్ము కాపాడుము.

నీ పాదము పాప సమూహమును పోగొడుతుంది. కాళియుని పడగలపై నర్తించిన నీ పాదమును మాకుచాల మీద మోపి కుసుమశర బాధను పరిహరింపుము.

నీ అధరామృతము జుర్రితేనే మా మదనతాపం శమిస్తుంది అని అర్థించారు.

మత్తేభము :

*అని యిట్లంగన లంచిత స్వరముతో నంకించుచుం బాడుచుం*
*దను 'రావే' యని చేరి యేడువ జగత్రాణుండు త్రైలోక్యమో*
*హనుఁడై మన్మథ మన్మథుండయి మనోజ్ఞాకారియై హారియై*
*ఘనపీతాంబరధారియై పొడమెఁ దత్కాంతా సమీపంబునన్ ॥ -3*

ఈ విధంగా గోపకాంతలు కృష్ణుని మధురంగా కీర్తిస్తూ 'ప్రియతమా రమ్ము' అని విలపించగా మన్మథ

---

1. *పోతన భాగవతం, 10 : 1039 : పుట-236*
2. *పోతన భాగవతం, 10 : 1040 : పుట-236*
3. *పోతన భాగవతం, 10 : 1059 : పుట-240*

మన్మథుడైన ఆ పరమాత్ముడు వారి ముందు సాక్షాత్కరించాడు.

రాధ శ్రీకృష్ణుని పరతత్త్వమును చెప్పినది.

*శ్లో॥ ఏవం గోప్యస్తతః శ్రుత్వా సమాధాయ పరాత్మని ।*
*కృష్ణే చిత్తం తదాకారా కారితం మౌనమాస్థితాః ॥ -1*

రాధ పలుకులు ఆలకించి గోపికలు శ్రీకృష్ణుని యందు మనసు నిలిపి శ్రీకృష్ణ రూపమయులై ఉండగా

*శ్లో॥ విస్మరంత్యః స్వకం దేహమాత్మ మాత్రావశేషితం ।*
*బాలోన్మత్తాదయో యద్వదాత్మన్యేవ సమాహితాః ॥ -2*

పరమాత్మానుభవం అధికమగుట చేత గోపికలు కృతార్థులైనారు కనుక భగవానుడు లీలా మానుష రూపంలో వారికి సాక్షాత్కరించాడు.

విజయం చేసిన మనోహరుణ్ణి చూచి ముగ్ధలై ఆవెలదులు వికసించిన మోములతో పోయిన ప్రాణములు తిరిగి వచ్చిన దేహేంద్రియముల వలె లేచి నిలబడ్డారు. ఒక్కొక్క గోపిక కృష్ణుని యందు తనకు గల మనోభావమును కృష్ణునితో ఒక్కొక్క రకముగా తీర్చుకుంది. వాసుదేవుడు ఆ వ్రజసుందరులను వెంటబెట్టుకొని యమునానదీ సైకత స్థలానికి చేరుకున్నాడు. అక్కడ గోపికలకు జ్ఞానోదయం కలిగింది. పరమాత్మను దర్శించడం చేత విరహం వల్ల కలిగిన తాపం పోగొట్టుకున్నారు. వారి కోరికలన్నీ చక్కగా నెరవేరినాయి.

*వచనం : అంతనక్కాంతుండు గాంతాజనపరిక్రాంతుడై వనాంతరంబున శక్తినికర సంయుక్తుండైన పరమ పురుషుండునుంబోలె వారలం దోడ్కొని మందారకుంద కుసుమ పరిమళ మిళిత పవమాన మానిత మధుకర నికర ఝుంకార సుకుమారంబును, శరత్కాల చంద్ర కిరణ సందోహ సందళి తాంధకారంబును, యమునా తరంగ సంగత కోమల వాలు కాస్ఫారంబునై యమలినంబైన పులినంబు ప్రవేశించె వారును జ్ఞానకాండంబున నీశ్వరుంగని విరహ వేదనలు విడిచి పరిపూర్ణ మనోరథలై. -3*

శ్రీకృష్ణునితో గోపికలు ఈ విధంగా పలికారు.

"నందనందనా కొందరు తమ్ము కొలిచిన వారినే కొలుస్తారు. మరికొందరు తమ్ము కొలవని వారిని కూడా కొలుస్తారు. ఇంకొందరు తమ్ము కొలిచే వారినీ, కొలవని వారినీ కూడా కొలవరు" అని నర్మగర్భంగా పలికారు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 20 : పుట-383*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 21 : పుట-384*
3. *పోతన భాగవతం, 10 : 1070 : పుట-243*

అప్పుడు శ్రీకృష్ణుడు వారికి ఈ విధంగా బదులు చెప్పాడు. నెలతలారా ! మీరు మాట్లాడిన వారిలో నేను వేటికీ చెందిన వాడను కాను. నేను మిక్కిలి కరుణ కలిగినవాడను. ఆత్మబంధువుడనైన నేను మీకు అపరిమితమైన ధ్యానం సమకూర్చడానికి కనుమరుగైనాను.

"ప్రత్యక్షంగా నన్ను దర్శిస్తే అంతటితో గర్వించి నన్ను సేవించరని వారికి నా రూపం చూపించను. దరిద్రుడు తనకున్న డబ్బు పోయినప్పుడు తదేక చింతలో మునిగినట్లు నేను కనబడకుండా ఉంటేనే నన్ను కోరేవారు నా రూపాన్ని ధ్యానిస్తారు.

*మత్తేభము :*

*నను సేవించుచునున్న వారలకు నేనా రూపముంజూపఁ; జూ*
*చినఁ జాలించి మదించి వారు మఱినన్ సేవింపరోయంచు; ని*
*ర్ధనికుండాత్మధనంబు సెడ్డనెపుడుం దత్పారవశ్యంబుఁదా*
*ల్చిన భంగిన్ ననుఁబాసి మత్ప్రియుఁడు దాఁజింతించు నా రూపమున్ ॥ -1*

గోపికలు శ్రీకృష్ణుని యధేష్టముగా ఆలింగనము చేసుకొని కొంతకాలము గడపి ఆ కృష్ణ పరబ్రహ్మమును వినుతి చేయసాగారు.

*శ్లో॥ ముగ్ధాః స్నిగ్ధాంతరజ్ఞాః మురనరకరిపుం మూర్తిత్తార్తిహంతం*
*కామానాం కామరూపం కలితనవరసం కాలమేఘాభిరామమ్ ।*
*దృష్ట్వాహృష్టా స్సుపుష్టా ఝుటితి మురభిదం వేష్టయన్త్యోయథేష్టం*
*త్వాలింగన్త్యోకనురక్తాశ్రుతయ ఇవపరబ్రహ్మ గోప్యో జగుస్తం ॥ -2*

*కీర్తన : ప॥ నాథనాథ మాకలయనందనం*

*అ॥ప॥ మాధవమఖిలగోపీ మదనకోటి మోహనం*

*చరణం: పాదపల్లవ కలిత పద్మకులిశాది రేఖం*
*వేదవేదాంత విదితం విపులసుఖం*
*సాదరమఖిలలోక సాధకతయా భువన*
*నాథ మమరేంద్ర వంద్య నటవినోదం*

*చరణం: బృందావన భువి గోపీబృందానంద సందోహశ్రీ*
*కుందసుందర రదనమందహసనం*
*ఇందిరాసేవ్యపాదారవింద భక్తిమకరంద*
*నందితామరభూసురనందననందనం సఖి*

---

1. *పోతన భాగవతం, 10 : 1078 : పుట-244*

2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 23 : పుట-384*

*చరణం: కుటిలాలకశైవాలభ్రుకుటి భుజగనయనశఫరి*

*పటుతర లావణ్యరసతటినీ నాయకం*

*నిటల సుందరకస్తూరి చటుల తిలక నందిత శ్రీ*

*ఘటిత నారాయణ తీర్థ ఘనపరిపాలకం -1*

పద్మము, వజ్రము మొదలగు ఉత్తమ రేఖలు పాదముల యందు కలిగినవాడు, దేవబ్రాహ్మణులను రక్షించువాడు, కస్తూరీ తిలకము సుందరమైన ముఖము నందు కలవాడు అయిన కృష్ణుని చూసి

*శ్లో॥ ఉరసా మనసా దృష్ట్వా పరిష్వజ్యముహుర్ముహుః ।*

*కృతకృత్యాస్తదాత్మానం కృష్ణం మత్వాసమాస్థితాః ॥ -2*

అభేద మనస్కులైన గోపికలు ఆనందము పొందుచూ కృతార్థులైనారు.

## అక్రూరుడు :

ఒక రోజు నారదుడు కంసుని వద్దకు వచ్చాడు. "శ్రీకృష్ణుడు దేవకీ గర్భసంజాతుడు, బలరాముడు రోహిణి కుమారుడు. ఆ కన్య యశోద కన్నకూతురు" అని కంసునితో పలికాడు. ఆగ్రహావేశంతో కంపించిపోయిన కంసుడు "వసుదేవుడు నన్ను వంచించి నందవ్రజంలో కొడుకులను దాచిపెట్టాడు. ఇతనిని చంపడమే యుక్తము" అని ఉద్యుక్తుడైనాడు. "వసుదేవుని చంపడం నీ వంటి వానికి తగదు" అని నారదుడు కంసుని వారించి దేవలోకానికి వెళ్ళిపోయాడు.

*చంపకమాల :*

*ఘనుఁడొకనాఁడు నారదుఁడు గంసునితోఁడ యశోదగూఁతుఁదాఁ*

*గనుటయుఁజక్రి దేవకికి గర్భుజుఁడౌటయుమున్ను రోహిణీ*

*తనయుఁడు రాముఁడౌటయును దద్విభులిద్దఱు మందనున్నవా*

*రని యెఱుగంగఁ జెప్పిన మహాద్భుతమంచుఁజలించి కిన్కతోన్ ॥ -3*

*చంపకమాల :*

*కొడుకుల మందలోన నిడిగొంటు తనంబున మోసపుచ్చె నీ*

*బడుగును బట్టి చంపుటిది భావ్యమటంచుఁ గృపాణపాణియై*

*వడి వసుదేవునిందునుమ వచ్చిన కంసునిఁ జూచి నారదం*

*డుడుగుము చంపఁబోల దని యొడక మానిచిపోయె మింటికిన్ ॥ -4*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 12 : పుట-385, 386*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 24 : పుట-387*

*3. పోతన భాగవతం, 10 : 1148 : పుట-265*

*4. పోతన భాగవతం, 10 : 1149 : పుట-265*

దేవకీ వసుదేవులను లోహపు సంకెళ్ళతో బంధించి రామకృష్ణులను చంపడానికి 'కేశి'ని గోకులానికి పంపాడు. తరువాత ముఖ్యులను పిలిచి వారిని చంపడానికి తగిన ఉపాయాలు చెప్పి చతుర్దశినాడు ధనుర్యాగం ఏర్పాటు చేశాడు. తరువాత అక్రూరుణ్ణి పిలిపించి ధనుర్యాయాగం చూడటము అనే మిషతో రామకృష్ణులను ఇక్కడకు తీసుకు రావలసినదిగా ఆజ్ఞాపించాడు.

ఈ వృత్తాంతమును నారాయణ తీర్థుల వారు రెండు శ్లోకములలో చెప్పి యున్నారు.

*శ్లో॥ అథనివసతి తస్మిన్ గోకులేవాసుదేవే*
*వ్రజయువతి చకోరీ బృందరాకాశశాంకే*
*ఇతికథయతి కంసం నారదే కృష్ణవృత్తం*
*భయవికలితచేతాః ప్రాహకంసోకపిదూతాన్ ॥ -1*

*ఉత్పలమాల :*

*పంపినఁబోని వాఁడనె నృపాలక ! మానవులెన్నఁదమ్మునూ*
*హింపరుదైవయోగముల నించుకగానరు తోఁచినట్లు ని*
*ష్కంపగతిం జరింతురదిగాదనవచ్చునె? యీశ్వరేచ్ఛఁద*
*ప్పింపఁగ రాదు నీ పగతు బిడ్డలఁదెచ్చెదఁబోయి వచ్చెదన్ ॥ -2*

విధి నిర్ణయం తప్పించడము ఎవరి తరమూ కాదు. రాజాజ్ఞను తప్పక పాటిస్తాను. మహారాజా! బుద్ధికి తోచిన విధంగా ప్రవర్తించే మానవులు తమ శక్తికి మించిన దైవశక్తిని గూర్చి కొంచెమైననూ గ్రహించలేరు అని అక్రూరుడు కంసునితో పలికి బయలుదేరాడు.

*శ్లో॥ మంత్రిభిర్మం త్రయిత్వాథ ధనుర్యాగ చికీర్షయా*
*అక్రూరం చోదయామాసకంసస్త్వానయనే తయోః ॥ -3*

నారాయణతీర్థుల వారు గూడ బలరామకృష్ణుల ప్రభావము ఎఱుగని వారు లేరు. అటువంటి వారిని మీరు ఇక్కడకు తీసుకురమ్మని చెప్పుతున్నారు. దైవసంకల్పము ఏ విధముగా ఉన్నదో తెలియుట ఎవరికీ శక్యము కాదు అని పోతన గారి అభిప్రాయమును బలపరచినారు.

ఈ లోపుగా కంసుని ప్రోత్సాహంతో 'కేశి' అనే రాక్షసుడు అశ్వరూపం ధరించి నందుని మందలో ప్రవేశించి కలత పొందించగా అతనిని శ్రీకృష్ణుడు అంతమొందించాడు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 4 : పుట-390*
2. *పోతన భాగవతం, 10 : 1164 : పుట-268*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 5 : పుట-390*

*కందం॥ నలినాక్షుడు లీలాగతి, విలయముఁ బొందించె నిట్లు వీరావేశిన్*

*బలలాశిన్ జగదభినవ, బలరాశిన్ విజితశక్రపాశిం గేశిన్ ॥ -1*

'కేశి' రాక్షస వధానంతర సమయంలో నారదుడు నందనందనునితో ఏకాంతముగా మాట్లాడాడు. ఒకరోజు గోపబాలురు ఒక పర్వతం చెంత పశువులను మేపుతూ దాగుడుమూతలాడుకొంటున్నారు. మయుడు అనే రాక్షసుని కుమారుడైన వ్యోమాసురుడు గోపబాలురను పర్వతగుహలో పెట్టి రాళ్ళతో మూసివేశాడు. అది గమనించిన కృష్ణుడు వానిని జంకు గొంకు లేక కూల్చివేశాడు.

ఉత్పలమాల :

*పంకజలోచనుండొడిసి పట్టిన శైలనిభాసురాకృతిన్*

*బింకముతోడఁ బొంగి విడిపించుకొనంగ బలంబులేమి లో*

*శంకిలి బిట్టు తన్నుకొనఁ జక్కన యారణభీము వ్యోమునిం*

*గొంకకఁ గూల్చె నవ్విభుఁడు గోయని మింట సుపర్వు లార్వఁగన్ ॥ -2*

గోకుల ప్రయాణ సమయంలో అక్రూరుడు సాక్షాత్తూ పరమాత్ముడైన శ్రీకృష్ణుని గుణగణములను కీర్తిస్తున్నాడు.

నా పూర్వజన్మదాన తపఃఫల పుణ్యముగా ఆద్యుడు, పరమయోగుల యోగదృష్టికి కూడా గోచరంకాని భగవంతుడు, బ్రహ్మస్వరూపుడు అయిన శ్రీకృష్ణుని నేను చూడబోతున్నాను.

ఉత్పలమాల :

*ఎట్టితపంబు సేయఁబడె? నెట్టి చరిత్రములబ్ధమయ్యెనో ?*

*ఎట్టి ధనంబులర్థులకు నీఁబడెనో తొలిబామునందు ! నా*

*యట్టి వివేకహీనునకు నాది మునీంద్రులు యోగదృష్టులం*

*బట్టఁగలేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరిఁజూడఁగల్గెడిన్ -3*

ప్రహ్లాద అంబరీషాదులకు జనన మరణ భయము లేకుండా చేసిన భగవంతుడే ఈ శ్రీకృష్ణుడు. కంసుడు నాకెంతో మేలు చేశాడు. అతనిని తీసుకురావడానికి వెళ్ళుతున్న నాకు అతని వంటి చెలికాడు మరొకడు లేడు. ఈ విధంగా అనేక విధములుగా మనస్సులో కృష్ణుని తలుస్తూ బృందావనం దాటి వ్రేపల్లెలో ప్రవేశించాడు. నవమన్మథాకారులైన బలరామకృష్ణులను సందర్శించాడు.

---

*1. పోతన భాగవతం, 10 : 1176 : పుట-271*

*2. పోతన భాగవతం, 10 : 1186 : పుట-273*

*3. పోతన భాగవతం, 10 : 1189 : పుట-274*

మత్తేభము :

కనె నక్రూరుఁడు పద్మపత్రనేత్రులను రంగద్గాత్రులన్ ధేను దో
హన వాటీగతుల న్నలంకృతుల నుద్యద్భాసులం బీతనీ
ల నవీనోజ్జ్వల వాసులం గుసుమమాలాధారులన్ ధీరులన్
వనితా కాములఁ గృష్ణరాముల జగద్వంద్య క్రమోద్దాములన్ ॥ -1

శ్లో॥ అక్రూరో గోకులం గచ్ఛన్ మధ్యేమార్గం ముహుఃస్మరన్
కృష్ణస్యగుణరత్నాని గాయన్ గాయన్ యాయావితి ॥ -2

శ్రీకృష్ణుని గుణగణాలను అక్రూరుడు ఈ విధంగా గానం చేశాడు.

కీర్తన : ప॥ ద్రక్ష్యామి గోకులనిలయం గోపీమాధవం

అ॥ప॥ ప్రక్షీణకల్మషయోగి ప్రత్యక్షదైవం నూనం

చరణం: పాతకారణ్యకుఠార పాదపంకజం శుద్ధ
పాదజసలిలపూత భక్తసమాజం
కేతకీ చంపక తులసీలలిత వారిజం శ్రిత
కేవలానందైక భావం గళితమోహజం నూనం

చరణం: పక్షిమృగ బృందమిహ యాతిదక్షిణేపథి
పశ్యామి పూర్ణకలశం భద్రలక్షణం
అక్షీణ శంఖవీణాది - నాదమోక్షణం - పర
మద్యైవ శృణోమిమధుర మఖిలరక్షణం నూనం

చరణం: చంద్రవదన సుందరం మందహసనం - చారు
చంపక నాస మరుణార విందలోచనం
నందనందన మమర రచిత వందనం-భూరి
నందిత నారాయణతీర్థా నందరసఘనం నూనం -3

కృష్ణ సందర్శనాభిలాషుడై వెళుతున్న అక్రూరునికి దక్షిణ పార్శ్వముగా (ఎడమ నుండి కుడికి) పక్షులు పోతున్నాయి. కాబట్టి ఇది శుభశకునంగా భావించాడు.

---

1. పోతన భాగవతం, 10 : 1199 : పుట-277, 278
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 9 : పుట-393
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 2 : పుట-394

పోతన గారి భాగవతం అడవి మృగములు ప్రదక్షిణంగా వెళ్ళడం చేత అక్రూరుడు శుభశకునంగా భావించాడని చెప్పుచున్నది.

*మత్తేభం :*

*అలకభ్రాజితమై సుధాంశునిభమై హాసప్రభోద్దామమై*
*జలజాక్షంబయి కర్ణకుండల విరాజద్గండమై యున్నయా*
*జలజాతాక్షుముఖంబు సూడcగలుగున్ సత్యంబు వోనాకు నా*
*వల దిక్కేcగుచున్న వీ వనమృగ వ్రాతంబు లీత్రోవలన్ ॥ -1*

కృష్ణ పాదస్పర్శ చేత యమునా నదీ, దాని సైకత సీమ కూడా ధన్యమైనవని తీర్థుల వారు అభివర్ణించారు.

*శ్లో॥ కళింద కన్యాల హరీహధన్యా*
*కళింద జాయాః పులినంచధన్యం*
*మిళన్ముకుందస్యపదారవింద*
*ప్రసారభాగ్యోదయతః ప్రసన్నే -2*

అంతటితో తృప్తి చెందని అక్రూరుడు భక్తిపరవశుడై కృష్ణ పాదపద్మములను తన హృదయకమలము నందు నిల్పి 'ఓ కృష్ణా' ! అని పిలుస్తూ గానం చేశాడు.

*శ్లో॥ శ్రీహరిచరణ సరోజే హృదయసరోజే నిధాయభూయోఽపి*
*గాయతినందకుమారం సంబోధ్యానన్య భక్తియుక్తాత్మా ॥ -3*

*కీర్తన : భావయే హృదయారవిందే తావకపదారవిందే*

*అ॥ప॥ దేవగంధర్వాది బృంద సేవితమామవముకుంద*

*చరణం: సకలలోక నాయక సాధుజనతారక*
*మకరకేతు జనక మాయాధారక*
*వికటారివిదారక వేదసముద్ధారక*
*వికృత భయవారక విపులసుఖదాయక - 4*

---

1. *పోతన భాగవతం, 10 : 1193 : పుట-275*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 11 : పుట-396*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 13 : పుట-399*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 4 : పుట-400*

*చరణం: కనకమయదుకూల కలితకళ్యాణజాల*

*మునిమాన సానుకూల మురళీలోల*

*వినయాది గుణశీల వేదపురాణాదిమూల*

*వీర విజయగోపాల విగతశోకాదిమూల*

*చరణం: కాళిందీ తట విహార కరుణారస సాగర*

*మిళిత గోపీనికర మేరుసమధీర*

*కాళియ మదహార కంసాది భయంకర*

*గోకుల శ్రీమందార కోటికామసుందర*

*చరణం: భక్తజన సంరక్ష పరమకరుణావీక్ష*

*సక్తజన సుశిక్ష సాధుజనపక్ష*

*రక్తకమల పత్రాక్ష రమణీయాచరణ దక్ష*

*భక్త నారాయణతీర్థ భవబంధనమోక్ష -1*

సర్వలోకేశ్వరుడు, సుఖదుఃఖాలు లేనివాడు, కరుణా సముద్రుడు, సజ్జన పక్షపాతి అయిన శ్రీకృష్ణుని బృందావనంలో ఆవులమంద వెనుక గోపబాలకుల మధ్య వస్తుండగా అక్రూరుడు చూశాడు, ప్రార్థించాడు.

*శ్లో॥ బృందావనే గవాం మధ్యే గోపమండల మధ్యగమ్*

*దృష్ట్వాక్రూరః ప్రణమ్యాథ భక్త్యా ప్రార్థయతే హరిమ్ ॥ -2*

*శ్లో॥ మాయామానుషదేహీ మాధవనామాభి వాద్యతంసబలః ।*

*తేనాలింగితమూర్తి స్సురరిపువృత్తం తదుక్త మథవేద ॥ -3*

బలరామ సహితుడైన శ్రీకృష్ణుడు అక్రూరునికి నమస్కరించాడు. అక్రూరుడు రామకృష్ణులను ఆలింగనం చేసుకొని, కొంతకాలము గడిపి వచ్చిన కార్యము చెప్పగా వారు మధురానగరమునకు వచ్చుటకు అంగీకరించారు.

రామకృష్ణుల పాదములకు పులకిత గాత్రుడైన అక్రూరుడు వినమ్రతతో నమస్కరించాడు. భక్తవత్సలుడైన శ్రీకృష్ణుడు చక్రాయుధ చిహ్నితమైన హస్తం చాచి అక్రూరుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 4 : పుట-400*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 14 : పుట-402*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 17 : పుట-403*

*కందం॥ కనివారల పాదములకు, వినయంబున(మ్రొక్కెం భక్తి వివశుండగుచుం*

*దనువునcబుల కాంకురములు, మొనయcగ నా నందబాష్పములు జడిగురియన్ ॥ -1*

*కందం॥ అక్రూరులైన జనులన, వక్రగతింగాచు భక్తవత్సలుcడంత*

*న్నక్రూరుc గౌcగిలించెను;, జక్రాంకిత హస్తతలముc జాcచినరేంద్రా ! -2*

కృష్ణుణ్ణి అక్రూరుడు మధురానగరానికి తీసుకువెళుతున్నాడు అన్న వార్త తెలిసిన గోపికలు అక్రూరుని గూర్చి తమలో తాము అనుకున్నారు.

*శార్దూలం :*

*అక్రూరుండని పేరు వెట్టుకొని నేcడస్మన్మనోవల్లభుం*

*జక్రిన్ మాకడcబాపికొంచు నరుగంజర్చించి యే తెంచినాc*

*డక్రూరుండcట క్రూరుcడీతcడు నిజంబక్రూరుcడౌనేనిని*

*ర్వక్రత్వంబునc గృష్ణుcబెట్టి తన త్రోవంబో విచారింపcడే? -3*

ఇతని పేరు మాత్రమే అక్రూరుడు. కానీ ఇతడు క్రూరుడు. కాకపోతే కృష్ణుని ఇక్కడ దిగవిడిచి వెళ్ళవచ్చును కదా! అని అనుకున్నారు.

బలరామ సహితుడైన కృష్ణుడు కళింద పర్వత కూతురైన యమునానదిని అక్రూరునితో దర్శించాడు. బలరామకృష్ణులు రథాన్ని అధిరోహించిన సమయములో వేదమంత్రాలు జపిస్తూ నదిలోనికి దిగిన అక్రూరునికి నదీ జలాలలో బలరామకృష్ణులు కనబడ్డారు. జలం మధ్యలోకి ఎప్పుడు వచ్చారా అని ఆశ్చర్యపోతూ చూడగా వారిరువురూ రథం మీదనే యున్నారు. ఇది భ్రమ కాదు కదా అనుకుంటూ మరలా నీటిలో మునిగాడు. ఆదిశేషుణ్ణి పానుపుగా చేసుకొని ఆ మధ్య భాగంలో శయనించిన, వక్షఃస్థలంపై లక్ష్మీ శోభిస్తూ ఉన్న, పురుషోత్తముడైన కృష్ణుని అవలోకించాడు అక్రూరుడు. భక్తి సంభ్రమాలతో తటాలున చేతులు జోడించి డగ్గుత్తికతో స్తోత్రం చేసినాడు.

*ఉత్పలమాల :*

*స్నానముసేసి చేసినది చల్లని నీటను రామకృష్ణులన్*

*మానుగcజూచి వీరు రథమధ్యమునన్ వసియించి యున్న వా*

*రీనది నీటిలోపలికి నెప్పుడు వచ్చి? రటంచు లేచి మే*

*ధానిధి సూచె వారిని రథస్థుల భక్తమనోరథస్థులన్ ॥ -4*

---

*1. పోతన భాగవతం, 10 : 1200 : పుట-278*

*2. పోతన భాగవతం, 10 : 1202 : పుట-278*

*3. పోతన భాగవతం, 10 : 1216 : పుట-281*

*4. పోతన భాగవతం, 10 : 1227 : పుట-283*

బలరామకృష్ణులు మధురానగరానికి రావడానికి అంగీకారం తెలిపారు. అక్రూరుడు ఆ రాత్రి గోకులాన సుఖంగా నిద్రించి వేకువజామున ముందుగా నిద్దుర లేచి రామకృష్ణులను మేల్కొలిపాడు.

*శ్లో॥ అక్రూరో రామకృష్ణాభ్యాం న్యవసద్గోకులేసుఖమ్ ।*
*అధోత్థితో రాత్రిశేషే సముత్థాపయతిస్వయమ్ ॥ -1*

*కీర్తన : ప॥ హేరామ హేకృష్ణ ఇహసముత్తిష్ఠ*
*అ॥ప॥ హేరామ హేకృష్ణ హే జగత్త్రయగురో*
*హే పుండరీకాక్ష రక్షనిజపక్షం*

*చరణం: ప్రాచీదిశాంగనా పరిహసతి హేకృష్ణ*
*పతియోగ పరమసౌభాగ్యమహితా*
*ప్రాచీనవైరస్య మభినయత్యథసా*
*ప్రతీచీందిశం రామకామముదితా*

*చరణం: నళిన ముకుళోదర విదళనగళితాళయో*
*లలితతరరవినిహ్నుతాంధతిమిరాః*
*మిళిత నవనళిన పరిమళ బహుళమకరంద*
*కలనయావిచరంతి కామముఖరాః*

*చరణం: దధిమథన సంజాత మధురతర సంగీత*
*బుధజనాగమ ఘోషరమ్యఘోషం*
*మధుమథన సంకలయ మాధవ విధీంద్రనుత*
*పదకమల పద్మాకృతాభిలాషం*

*చరణం: భూపాల దేశాక్షి దేవగాంధారి శుభ*
*బిలహరి వసంత ముఖరాగబృందం*
*గోపికాగాయంతి గోవింద తవ తు శుభ*
*గుణరత్న బృంద మానందకందం*

*చరణం: కలితనవమల్లికా కుసుమాని విహసంతి*
*కామమిహతారకా బృందమమితం*
*లలితవచసా క్రూరకలితమితి గురుభక్త*
*నారాయణానంద తీర్థరచితం -2*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 18 : పుట-409*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 6 : పుట-409, 410*

వారు మధురానగరానికి సమీపించారు. ఇంటికి విజయం చేయమని పలికిన అక్రూరునితో కంసవధానంతరము తప్పక రాగలనని పలికి మధురాపుర రాచమార్గంలో కాలినడకన బలరామునితో బయలుదేరాడు కృష్ణుడు.

*శ్లో॥ అక్రూరో రామకృష్ణాభ్యాం మధురాభిముఖోవ్రజన్*
*ఆచరన్ యామునే స్నానం సలిలే దృష్టవాన్ హరిమ్ ॥ -1*

నదిలో స్నానం చేయబోయిన అక్రూరునకు నదీ జలములలో శ్రీకృష్ణుని విశ్వరూపము కనబడెను.

*శ్లో॥ ముహుర్ముహు స్స్యందనస్థం, సలిలస్థం, హృదిస్థితమ్ ।*
*దృష్ట్వా సర్వాత్మకం కృష్ణం ప్రాహచేదం సతత్వవిత్ ॥ -2*

*శ్లో॥ అవతీర్ణోరథాత్తూర్ణ మక్రూరాధిష్ఠితాత్ప్రభుః ।*
*మధురారాజమార్గేణ పద్భ్యామేవశనైర్యయౌ ॥ -3*

రథము నందు, జలము నందు,తన హృదయమందు కానవచ్చిన కృష్ణుని అతడు వినుతించెను.

*కీర్తన : ప॥ జానే భువనసృష్టి చాతురీధురీణం*
*అ॥ప॥ గోనికేతనం విజయగోపాల మఖిలశరణం*

*చరణం: సకల హృదయకమల సవితృకోటి ప్రకాశం*
*సలిలాది భావమధ్య సంగమ పూరితాశం*
*ప్రకటమేవ ఫణీంద్ర ప్రచురశయన దేశం*
*ప్రత్యగభిన్నమఖిల పరమానందనివేశం*

*చరణం: నిగమసారసనిచయ నిత్యవిదితభావం*
*సుగుణమణి సమూహ సూత్రసత్స్వభావం*
*అఖిల జగదంతరాత్మాన మమిత విభవం*
*ఖగమృగసురనరాది ఘననామరూపమభవం*

*చరణం: నందితవ్రజజనా నందఘనభాగధేయం*
*కందర్ప శతకోటి కలితకాంతికాయం*
*నందితయోగినిచయం నారదాదిగేయం*
*బృందావన విహారం బద్ధమాయూరవలయం - 4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 23 : పుట-421*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 24 : పుట-422*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 26 : పుట-429*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 10 : పుట-422, 423*

*చరణం: అవనిమండల తిలక మచ్యుత మఖిలజనకం*

*నవనవనీతరసికం నమదభయదాయకం*

*భవభయనివారకం భవ్యముక్తినాయకం*

*శివనారాయణతీర్థ సిద్ధానందదాయకం ॥ -1*

## శ్రీకృష్ణుడు రజకుని సంహరించుట, సాలివానిని, సుధాముని అనుగ్రహించుట :

శ్రీకృష్ణుడు అపరాహ్ణ కాలంలో బలరాముడు, గోపకులతో కూడినవాడై మధురానగరం ప్రవేశించాడు.

వచనం : అని పలికిన నక్రూరుండు పురంబునకుం జని రామకృష్ణులు వచ్చిరని కంసునకెఱింగించి తన గృహంబునకుంజనియె; నంత నపరాహ్ణంబున బలభద్రగోపాల సహితుండై కృష్ణుండు -2

రాజభవనాలు మొదలగు వాటితో విరాజిల్లుతున్న మధురను చూశాడు.

*మత్తేభం :*

*పరిఖల్గోటలుఁ గొమ్మలుం బడగలుం బ్రాసాదముల్ వీధులున్*

*హరులుం దేరులు వీరులున్ గజములున్ హర్మ్యంబులున్ వాద్యముల్*

*తరుణుల్ ధాన్యములున్ ధనంబులు మహోద్యానంబులున్ దీర్ఘికల్*

*గరమాశ్చర్యరుచిం దనర్చు మధురన్ గాంచెన్ విభుండంతటన్ -3*

ఈ విధమైన శోభతో ఒప్పుచున్న మధురానగరాన్ని తీర్థులవారు శ్రీకృష్ణ పలుకులలో వర్ణించారు.

*శ్లో॥ దృష్ట్వాథమధురాం రామం నగరీం సురనాగరీమ్*

*ఆహచేదం మహోత్సాహో మాధవో మధురం వచః ॥ -4*

*కీర్తన : ప॥* రామమధురానగరీ రమ్యాహేమగోపుర ప్రాకారకలితా

*అ॥ప॥* రామరమణీయ కాభిరామ రత్నకోటీరసంభారా

*1.* *సౌధచంద్రశాలాజాల సోమరవిలీలాలోలా*

*మాధురీ భాగ్యామరఖేలా మహనీయభూతి విశాలా*

*2.* *నవనవమణిశ్రేణీ నాకరమణీ మనోహారిణీ*

*అవనీసుర భారిణీ అమర పరివారిణీ*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 10 : పుట-422, 423*

*2. పోతన భాగవతం, 10 : 1244 : పుట-289*

*3. పోతన భాగవతం, 10 : 1245 : పుట-290*

*4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 24 : పుట-425*

3. కాళిందీ హేళినందినీ కల్లోలాలోల పద్మినీ
మిళితహంస మాలినీ మీనాంకరాజ రాజధానీ

4. అబ్జయోని కృత్యాతీతా అఖిల సంపదుపేతా
లబ్ధవిద్యావారాద్యుషితా లక్షితలక్షణ సహితా

5. మాధవ సుగీతమిదం మహితబలరామమోదం
బాధిత సంసారఖేదం భవ్యనారాయణతీర్థ సుఖదం -1

ఆ పట్టణంలోని రమణీమణులు కృష్ణ సందర్శనం కోసం తహతహలాడినవారై తమ పనులను విడిచి బంగారుమేడలపై గుంపులు గూడి, విశాలవక్షుడు, పద్మపత్రనేత్రుడు అయిన శ్రీకృష్ణుని చూశారు.

ఉత్పలమాల :

నందతపః ఫలంబు, సుగుణంబుల పుంజము, గోపకామినీ
బృందము నోముపంట; సిరివిందు; దయాంబుధి, యోగిబృందముల్
డెందములందుఁగోరెడు కడింది నిధానము సేరవచ్చెనో
సుందరులార ! రండుచని చూతము కన్నులకోర్కి దీఱఁగన్ ॥ -2

కందము :

వీటఁగల చేడెలెల్లను, హాటక మణిఘటితతుంగ హర్మ్యాగ్రములం
గూటువలు గొనుచుఁ జూచిరి, పాటించి విశాలవక్షుఁ బద్మదళాక్షున్ -3

శ్లో॥ ఆయాంతం రాజమార్గేణ మధురాపుర యోషితః
ఆశ్చర్యరూపసంపన్నమాశ్చర్యం సబలంజగుః " -4

రాజమార్గమున బలరామ సహితుడై వస్తున్న శ్రీకృష్ణుని రూపసంపదకు ఆశ్చర్యపడి అక్కడి స్త్రీలు గానం చేశారు.

కీర్తన : ప॥ నందనందనం నిజభక్త చందన మాకలయ

చరణం: నందాది మునీంద్రభావ్యా నందమాకలయ

చరణం: సుందరానన చంద్రశ్రీ మందిరమాకలయ - 5

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 11 : పుట-426
2. పోతన భాగవతం, 10 : 1247 : పుట-290
3. పోతన భాగవతం, 10 : 1249 : పుట-291
4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 5 : పుట-433
5. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 1 : పుట-434

*చరణం: శృంగారరసప్రవాహ శ్రీనిధి మాకలయ*

*చరణం: భ్రూభంగ కటాక్షలక్ష్య భూరికరుణమాకలయ*

*చరణం: సర్వలావణ్యతటినీ సాగరమాకలయ*

*చరణం: కలభసుందర గమన కలితలలితమాకలయ*

*చరణం: పరిజన రక్షణబద్ధ పరికర మాకలయ*

*చరణం: విజయగోపాల మతుల విఖ్యాతమాకలయ*

*చరణం: బలభద్రభద్రదబాహు బంధమిహాకలయ*

*చరణం: మధురామానినీ జన మనసిజ మాకలయ*

*చరణం: శివనారాయణతీర్థసేవ్య దివ్యపదమాకలయ -1*

మధురానగర బ్రాహ్మణ పూజలందుకున్నారు వసుదేవ కుమారులు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఒక రజకుణ్ణి చూసి "రాజు గారి అల్లుళ్ళమైన మాకు వస్త్రాలు ఇస్తే నీకు మేలు కలుగుతుంది" అని పలుకగా కోపించిన రజకుడు

*శార్దూలం :*

*ఎట్టెట్రా ! మనుజేంద్రుచేలములు మీకీఁబాడియే? మీరలుం*
*గట్టం బోలుదురే? పయోఘృత దధిగ్రాసంబులన్ మత్తులై*
*యిట్టాడం జనెఁగాక గొల్లలకుమీకెబ్భంగి నోరాడెడిన్ ?*
*గట్టా ! ప్రాణముఁగోలుపోయెదు సుమీ కంసోద్ధతిన్ బాలకా ! -2*

కంస మహారాజు గారి ఆగ్రహానికి నీ ప్రాణం పోగొట్టుకుంటావు సుమా ! అని పలికిన చాకలివాణ్ణి తన ముంజేతితో తల ఊడేటట్లుగా కొట్టాడు. వాడు నేలకూలగా గోపకులు, కృష్ణ బలరాములు తమకు కావలసిన వస్త్రములు కట్టుకొని బయలుదేరారు. దారిలో ఒక చేనేత పనివాడు వారికి మెత్తని వస్త్రములను, ఆభరణములను పరమ సంతోషంతో ఇవ్వగా వాని పరిచర్యకు సంతోషించి వానికి తన సారూప్యమును సంపత్తిని ప్రసాదించాడు కృష్ణుడు.

తన యింటికి వచ్చిన రామకృష్ణులను అర్ఘ్యపాద్యాది విధులతో సత్కరించాడు పువ్వులు కట్టే సుదాముడు. మహానుభావులు మీ రాక చేత మా వంశము పావనమైంది. మీ బంటునైన నేను ఏ పనులు చెయ్యాలి? సెలవివ్వమన్నాడు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,10 : 1 : పుట-434*
2. *పోతన భాగవతం, 10 : 1258 : పుట-292*

ఉత్పలమాల :

*పావనమయ్యె నా కులము; పండెఁదపంబు; గృహంబులక్ష్మికిన్*
*సేవితమయ్యె; నిష్టములు సేకుఱె; విశ్వనిదానమూర్తులై*
*భూవలయంబుగావనిటు పుట్టిన మీరలు రాకఁజేసినే*
*నేవిధమాచరింతుఁ ? బనులెయ్యవి? బంటు; నెఱుంగఁజెప్పరే ! -1*

సుదాముడిచ్చిన పరిమళ భరితమైన పూలమాలలను అలంకరించుకొని వరం కోరుకొమ్మనిన శ్రీకృష్ణునితో..

*కందం : నీ పాదకమలసేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం*
*తాపార భూతదయయును, దాపసమందార ! నాకు దయసేయఁగదే ! -2*

ఓ కృష్ణా ! నీవు తపస్వులకు కల్పవృక్షం వంటివాడవు. నీ పాదపరిచర్య, పాదపూజ జరిపే భక్తులతో స్నేహము, అఖిల ప్రాణుల మీద అత్యంత అపరిమితమైన దయయూ నాకు ప్రసాదింపుము అని వేడుకున్నాడు సుదాముడు. అతడిని అనుగ్రహించాడు కృష్ణుడు.

## శ్రీకృష్ణుడు కుబ్జను సౌందర్యవతిని గావించుట :

బలరామ సహితుడై రాజవీథిలో సాగిపోతున్న కృష్ణుడు మైపూతలు పట్టుకువస్తున్న కుబ్జను చూశాడు.

*కందం : ఆనలినాక్షుఁడు గాంచెను, నానా లేపముల భాజనము సేకొనుచుం*
*బూని చనుదెంచు దానిని, నానన రుచినిచయ వినమితాబ్జంగుబ్జన్ ॥ -3*

నీవెవరు? ఈ లేపనములు ఎవరి కొరకు తీసుకువెళ్ళుతున్నావు? నీ పేరు ఏమిటి? ఈ లేపనములు మాకిస్తే నీ సౌందర్యం పెరుగుతుంది అన్నాడు.

*కందం : ఎవ్వరి దానవు? లేపము, లెవ్వరికిం గోరికొనుచునేఁగెదు? నీపే*
*రెవ్వతెమాకిమ్మిన్నియు, నివ్వటిల్లెదు చక్కనగచునీరజనేత్రా! -4*

శ్లో॥ క్వాపి కుబ్జాం సునేత్రాబ్జా మబ్జనాభో విలోక్యతామ్ ।
ప్రాతిలోమ్యగిరాం సారైః ప్రహసన్నిదమాహ సః ॥ -5

---

*1. పోతన భాగవతం, 10 : 1226 : పుట-294*

*2. పోతన భాగవతం, 10 : 1270 : పుట-274*

*3. పోతన భాగవతం, 10 : 1272 : పుట-295*

*4. పోతన భాగవతం, 10 : 1274 : పుట-295*

*5. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 7 : పుట-437*

*కీర్తన :* ప॥ కామమోహిని కథయ కిన్నునామతేపదం

*అ॥ప॥* కోమలాథ కరపాద పల్లవ కుముదబంధువదన కుంతలజాలే

*చరణం:* *తన్వఙ్గితావక తనురియమార్జవ*

*మతివహతి సుతరా మానన్దకారిణి !*

*అన్వహమభినవయౌవనఘనవన*

*మాచరసి భువన జనమనోహారిణి !*

*చరణం: చందనమృగనాభి చంపకాదికుసుమ*

*గన్ధసుగన్ధిత గగనదిఙ్మండలే !*

*కందర్పరథిక రథకల్పిత శుభగాత్రి !*

*కలహంస భాషిణి కళ్యాణశీలే !*

*చరణం: తవరూపమన్వర్ధనామ విదితమిహ*

*భువిపౌరజానపదై రపివిపులం*

*శివనారాయణ తీర్థశివగీతమిదమిహ*

*భవభయ భంజన మభయదమతులం -1*

కంసుడి దాసినైన నన్ను 'త్రివక్ర' అంటారు. నేనేర్చిన విద్య మైపూతలు చేయడము. అందరికీ అందం రమ్మంటే వస్తుందా? నీవు అందగాడవని అందరూ అలా ఉంటారా! సరసాలతో నన్ను వేధించక ఈ విలేపనం పూసుకొమ్మని మైపూతలు ఇచ్చింది.

*ఉత్పలమాల :*

*చక్కని వాఁడ వౌదు; సరసంబులనొంపకు; మెల్లవారికిన్*

*జక్కఁదనంబులెక్కడివి? చారు శరీర! త్రివక్రయండ్రు; నే*

*నిక్కముకంసుదాసిని? వినిర్మల లేపన విద్యదాన; నన్*

*మిక్కిలి రాజుమెచ్చుఁ; దగ మీరు విలేపనముల్ ధరింపరే ? -2*

ప్రసన్నుడైన కృష్ణుడు కుబ్జను మన్మథుని సమ్మోహనాస్త్రం వలె మార్చాడు. చక్కని చుక్క అయిన కుబ్జ కమలాక్షుని వైపు కాంక్షతో చూసింది.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 3 : పుట-438*
2. *పోతన భాగవతం, 10 : 1276 : పుట-295*

సీసం : ఇవ్విధంబునఁ గుబ్జ యిచ్చిన లేపంబు లన్నియు, దాను దేహమున నలఁది
కొనిప్రసన్నతనొంది కుబ్జ ముప్వంకల యొడలు సక్కఁగ నొత్తియునుపఁ దలఁచి
తత్పదంబులమీఁదఁదనపదంబులు ద్రొక్కి హస్తాంగుళ ద్వయమబలగౌద
క్రింద విప్పుగనిడి కృష్ణుఁడు మీఁదికి, నెత్తిన వక్రతలెల్లమాని

ఆ॥వె॥ చక్కనైన చిత్తజన్ముబాణము క్రియఁ, గొమరు మిగిలి పిఱుఁదుగుచయుగంబు
సొంపు సేయఁదరుణి సుందరమూర్తియై, కమలనయనుఁ జూచిఁ కాంక్షతోడ -1

మదనపీడిత అయిన కుబ్జ 'నా యింటికి దయచేయ'మని కృష్ణుని పై పుట్టము చెరగు పట్టుకొని లాగగా "నా వచ్చిన పని సాధించిన తరువాత నీ యింటికి వస్తాను" అని పలికి ఆమెను సాగనంపి ధనుశ్శాలకు వెళ్ళాడు.

శ్లో॥ సర్వాంగ సౌందర్య సుధాపగాయా
మపారసంసార విశోధికాయామ్
కంసద్విషస్తస్య సుఖంచరంతీ
కుబ్జా మనోవృత్తి రతన్నివృత్తా -2

శ్రీకృష్ణుని శరీర సౌందర్యము చూసి కుబ్జ మనస్సు వెనుకకు మరలకున్నది.

శ్లో॥ ఆకర్ణ్య కుబ్జావచనమాశ్చర్యం తామనిందితామ్ ।
అకరోత్కరసంస్పర్శాదమరీం సుందరీంహరిః ॥ -3

కృష్ణుడు ఆమె సద్గుణములకు మెచ్చి ఆమె ఇచ్చిన గంధమాల్యాదులను స్వీకరించి ఆమెను దేవాంగన వలె త్రిభువన సుందరిని చేశాడు.

శ్లో॥ రిరంసయా తేనసాకం కుబ్జాసా కామమోహితా ।
పీతాంబరధరం శ్యామం మధురం ప్రాహమాధవమ్ ॥ -4

మన్మథుని శరపరంపరకులోనగుతున్న కుబ్జ ఆ పీతాంబరుని గూర్చి పలుకుతున్నది.

కీర్తన : ప॥ మాధవమే రతిందేహి - నాథనాథమాధవమే రతిందేహి

అ॥ప॥ మధురాధరబింబధన్యేయం మాననీయా త్వయానూనం

---

1. పోతన భాగవతం, 10 : 1278 : పుట-295, 296
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 9 : పుట-443
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 10 : పుట-443
4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 11 : పుట-444

*చరణం: దీనజనావనదయాఘన దేవకీ వరనందన*
*మానినీమాన భంజన మదన మదన*
*మునిమనోనికేతన మోహతిమిరనిధన*
*కనకమయ పరిధాన కలితనిఖిలభువన*

*చరణం: నత్యజామి చేలాంచలం నాథ తవ సురతి మూలం*
*అతినీలఘనసుందరం ఆనందలీలం*
*సత్యమాశాస్మిగోపాలం సత్యకామాదిగుణజాలం*
*భృత్యవర్గ పరిపాలం బలభద్రానుజం బాలం*

*చరణం: తరణికోటికిరణ తామసగుణనిర్హరణ*
*తారకముక్తాభరణ దాసపోషణ*
*దూరిత దుర్జనగణ దోషరహిత చరణ*
*వరనారాయణ తీర్థ వర్ణిత నిజచరణ -1*

అజ్ఞాననాశకుడవు, భక్తరక్షకుడవు, దోషరహితుడవు అయిన నిన్ను చూసిన యువతి అనురాగము చెందకుండునా? అన్నది. వచ్చిన పని సాధించిన తరువాత నేను నీ వద్దకు వస్తాను అని కృష్ణుడు కుబ్జను సమాధానపరిచాడు.

## ధనుర్భంగము, కువలయాపీడ, చాణూర, ముష్టికుల హననము :

అనంతరం ధనుశ్శాలకు వెళ్ళిన కృష్ణుడు ఎడమచేత్తో ధనస్సును పైకెత్తి రెండుగా విరిచివేశాడు. పౌరుషంతో వచ్చిన చాప రక్షకులను బలరామకృష్ణులు మట్టుపెట్టారు. తమ విడుదులకు వెళ్ళిపోయారు.

అలంకరించుకొనిన బలరామకృష్ణులు జెట్టీల భేరీనినాదాలు విని మల్లరంగం చూడడానికి ఉబలాటపడ్డారు. కృష్ణుడు అక్కడ 'కువలయాపీడము' అనే ఏనుగును చూశాడు. కంసుని ఆజ్ఞానుసారం దాని మావటి బాలుడని కూడా సందేహింపకుండా కృష్ణుని పైకి దానిని ఉసి కొలిపాడు. వీరశిరోరత్నమైన ఆ గోపాల శేఖరుడు దాని ప్రాణములు తీసివేశాడు.

*శార్దూలం :*

*కాలం ద్రొక్కి సలీలుఁడై నగవుతోఁ గంఠీరవేంద్రాకృతిం*
*గేలన్ భీషణదంతముల్ వెఱికి సంక్షీణంబుగామొత్తి గో*
*పాలగ్రామణి వీరమౌళిమణియై ప్రాణంబులంబాపె నా*
*శైలేంద్రాభముఁ బ్రాణలోభము నుదంచత్సార గంధేభమున్ ॥ -2*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 5 : పుట-444*
2. *పోతన భాగవతం, 10 : 1320 : పుట-305*

మావటి వానిని కూడా యమపురికి పంపి ఆ చోటును వదిలిపెట్టాడు.

పురప్రజలు చూస్తూ ఉండగా చాణూర ముష్టికులనే మల్లయోధులు యుద్ధక్రీడకు బలరామకృష్ణులను ఆహ్వానించారు. చాణూరుడు కృష్ణునితోనూ, ముష్టికుడు బలరామునితోనూ తలపడ్డారు. ఒకరితో ఒకరు పోరాటం సాగిస్తూ ఉన్నారు. అచ్యుతుని చేత గిరగిరా త్రిప్పబడ్డ చాణూరుడు బాగా నలిగి నోటి నుండి నెత్తురు కారుతుండగా భూమిపై బడి ప్రాణాలు విడిచాడు.

*కందం॥ శోణితము నోరనొలుకఁగ, జాణూరుండట్లు కృష్ణసంభ్రామణ సం*
*క్షీణుండై క్షోణింబడి, ప్రాణంబులు విడిచెఁ గంసుప్రాణము గలఁగన్ ॥ -1*

ఇక బలరాముడు తన అపారమైన బాహుబలంతో ముష్ఠిఘాతంతో ముష్టికుణ్ణి నేలకూల్చాడు. వాని మిత్రులైన కూటుడు, తోసలుడు, శలుడు అను వారిని కూడా తన కాలితాపులతో తలలు పగులగొట్టి యముని చెంతకు పంపాడు.

*కందం॥ పాటవమునఁబలుపిడికిట, సూటింబడఁ బొడిచె బలుఁడు శోషితఘన బా*
*హాటోపనృపతి కీటుం, గూటున్ వాచాటు నధికఘోరలలాటున్ ॥ -2*

వచనం : అంత నద్దనుజాంతకుండు చరణప్రహరణంబుల భిన్న మస్తకులం జేసి వాని చెలులంగూట తోసల శలుల నంతకాంతికంబున కనిచిన. *-3*

ధనుర్భంగ, కువలయాపీడ, చాణూర, ముష్టిక వృత్తాంతములను తీర్థుల వారు రెండు శ్లోకములలో క్లుప్తీకరించినారు.

*శ్లో॥ ప్రార్థితస్త్వనయా కృష్ణస్తాం సమాధాయ సత్వరమ్ ।*
*బలాత్కువలయాపీడం కుంజరం నిజఘానసః ॥ -4*

*శ్లో॥ హత్వాముష్టికచాణూరౌ ధనుర్భంగం విధాయ చ ।*
*సాగ్రజోమాతుల సభాంప్రవిష్టో గీయతేఽమరైః ॥ -5*

---

*1. పోతన భాగవతం, 10 : 1362 : పుట-316*
*2. పోతన భాగవతం, 10 : 1366 : 31పుట-6*
*3. పోతన భాగవతం, 10 : 1367 : పుట-317*
*4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 12 : పుట-446*
*5. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 13 : పుట-447*

## కంస వధ :

కంసుడు ఖడ్గాన్ని చేత ధరించి తన వారు తనను పొగుడుతూ ఉండగా కృష్ణుని ఎదిరించినాడు. కంసుని జుట్టు ముడి పట్టుకొని శ్రీకృష్ణుడు మల్లరంగ స్థలం మీదకు త్రోసివేశాడు. పడిన కంసుడు కట్టెలాగ బిగుసుకుపోయి మరణించాడు. ఆ దృశ్యాన్ని అక్కడి వారంతా ఆశ్చర్యపడి చూశారు.

*శార్దూలం :*

*మంచాగ్రంబుననుండి రంగధరణీమధ్యంబునంగూలియే*
*సంచారంబును లేక చిక్కిజనులాశ్చర్యంబునుంబొందcగాc*
*బంచత్వంబును బొందియున్న విమతున్ బద్మాక్షుcడీ డ్చెన్ వడిన్*
*పంచాస్యంబు గజంబునీడ్చు పగిదిన్ బాహాబలోల్లాసియై ॥ -1*

ఆ కంసుడు ఆ భగవంతునే పొంది ఉత్తమ గతినందుకున్నాడు.

*కందం॥ రోషప్రమోదనిద్రా, భాషాశన పానగతులcబాయక చక్రిన్*
*దోషగతిc జూచియైనవి, శేషగతిన్ గంసుcడతనిc జెందె నరేంద్రా ! -2*

*శ్లో॥ అవరుహ్యాసనాద్వీరః కంసోరంగగతః ఖలః ।*
*యుద్ధాయ సహకృష్ణేన స్మరన్ ప్రాగ్దేవభాషితమ్ ॥ -3*

ఆకాశవాణీ పలుకుల చేత తన మరణము తథ్యమని తలచినా వీరుడైన కంసుడు యుద్ధము చేయుట ఆవశ్యకమని తలచాడు.

*శ్లో॥ హతః కంసారిణాకంసః సంసారభయహరిణా ।*
*శౌరిణాహరిణా యుద్ధే జగుస్తం సురభూసురాః ॥ -4*

శ్రీకృష్ణునిచే కంసుడు నిహతుడవగా దేవబ్రాహ్మణులు గానం చేశారు.

*కీర్తన : ప॥ పాహి పాహిమాం పరమ కృపాళో*
*దేహిమేత్వయి దేవసుభక్తిం*

---

1. *పోతన భాగవతం, 10 : 1376 : పుట-318*
2. *పోతన భాగవతం, 10 : 1377 : పుట-319*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 14 : పుట-449*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 15 : పుట-450*

*చరణం: అసురసంహార శ్రీ విజయగోపాల*

*అమర సంరక్షణ విజయగోపాల*

*వసుదేవతనయ శ్రీవిజయగోపాల*

*వాసుదేవాదినుత విజయగోపాల*

*చరణం: సంగీతలోల విజయగోపాల*

*సద్గుణశీల శ్రీవిజయగోపాల*

*శృంగారరసపూర విజయగోపాల*

*శ్రితజనపాల శ్రీవిజయగోపాల*

*చరణం: ధీరగుణాధార విజయగోపాల*

*ధేనుకాదిహరణ విజయగోపాల*

*నారదాది మునిగేయ విజయగోపాల*

*నారాయణతీర్థ విజయగోపాల -1*

దేవకీ వసుదేవులు తమ పుత్రులను ఆలింగనము చేసుకొని తొడపై కూర్చుండబెట్టుకొని మూర్ధాఘ్రాణము చేస్తూ ఆశీర్వచనములను ఇచ్చారు.

*శ్లో॥ పరిష్వజ్యాంక మారోప్య మూర్ధ్న్యపాఘ్రాయసాదరమ్*

*దేవకీ వసుదేవౌ తావాశిషం చక్రతుర్ముదా ॥ -2*

ఉగ్రసేనునికి ఆనందం కలిగిస్తూ శ్రీకృష్ణుడు ఆపురమందే నివసిస్తున్నాడు.

*శ్లో॥ జగతీపతి రపి భగవాన్ యదుపతి బంధుస్సు బంధురఖిలాత్మా*

*హరిరథ మధురానగరీ నరపతి మానందయన్ సతత్రాస్తే ॥ -3*

శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవుల చెఅమాన్పి ఉగ్రసేనునికి పట్టము గట్టాడు. మధురా నగర ప్రజలంతా కలసి మెలసి జీవించారు.

## కృష్ణుడు ఉద్ధవుని గోపకాంతల చెంతకు పంపుట :

మధురానగరంలో ఉన్న శ్రీకృష్ణుడు 'సదా నా మీదనే మనస్సు లగ్నం చేసినటువంటి వ్రేపల్లె గొల్లముద్దియలు నా ఆగనాభిలాషులై అనేక విధాలుగా వగ చెందుతూ ఉంటారు. దైన్యంపాలైన గోపికలు

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 7 : పుట-450, 451*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 18 : పుట-453*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 12 : పుట-453*

కినుక వహించి నన్నెంత దూషించుచున్నారో అని తలపోశాడు. వృష్ణి వంశజుడు, ఉత్తముడు అయిన ఉద్ధవుని పిలిచి మెల్లగా ఇట్లా అన్నాడు.

*కందం॥ సిద్ధవిచారు గభీరున్, వృద్ధవచోవర్ణనీయు వృష్ణిప్రవరున్*
*బుద్ధినిధి నమరగురుసము, నుద్ధవునిం జూచి కృష్ణుఁడొయ్యనపలికెన్ -1*

ప్రణయమూర్తులైన గోపికలు నా ఆగమనాభిలాషులై వియోగాగ్ని జ్వాలలతో దహించబడిపోతూ ఉంటారు. నమ్ముకున్న వారిని విడవడం ధర్మం కాదు అని కూడా అంటూ ఉండేవారు. వేగంగా వెళ్ళి "బృందావన విహారియైన కృష్ణుడు మిమ్ముల్ని వదిలిపెట్టడు. ఈ విషయంలో సందేహం మానండి" అని కృష్ణుడు వార్త పంపినాడని నీవు చెప్పవలసినది అని కృష్ణుడు పలుకగా ఉద్ధవుడు సూర్యాస్తమయం వేళ వ్రేపల్లెకు చేరాడు. అక్కడ నందాదులకు శ్రీకృష్ణ కుశలవార్తలను తెలియజేశాడు.

*కా॥ రమ్మా యుద్ధవ ! గోపకామినులు నా రాకల్ నిరీక్షించుచున్*
*సమ్మోహంబున నన్నియున్ మఱచి యే చందంబునంగుందిరో*
*తమ్మున్ నమ్మినవారి డిగ్గవిడువన్ ధర్మంబుగాదంద్రు; వే*
*పొమ్మా! ప్రాణములేక్రియన్ నిలిపిరో ప్రోద్యద్వియోగాగ్నులన్ ॥ -2*

*కం॥ 'సందేహము మానుండర, విందాననలార ! మిమ్ము విడువను వత్తున్*
*బృందావనమున' కనిహరి, సందేశము పంపెననుము సంకేతములన్ ॥ -3*

*శ్లో॥ సమాధానాయ గోపికానాం గోవిందేన ప్రచోదితః ।*
*ఉద్ధవో గోకులజనైః పృష్టః ప్రత్యాహ కౌశలమ్ ॥ -4*

గోపికలు ఉద్ధవునితో ఈ విధంగా పలికారు. 'ఓ ఉద్ధవా! శ్రీకృష్ణ స్నేహితుడవైన నీవు ప్రస్ఫుటమైన భక్తితో కృష్ణ సందేశం తీసుకొని ఇక్కడకు వచ్చావు. మేము గుర్తుండకపోయినా కనీసం తల్లిదండ్రులనైనా గుర్తుంచుకున్నాడు. సర్వసంగ పరిత్యాగులైన మహర్షులు కూడా బంధం వదలుకోలేదు. శ్రీకృష్ణుడు తల్లిదండ్రులను వదులుకుంటాడా! మేము మాత్రం ఆయన ప్రయోజనం కొరకు ఉన్నవారము. ఆ ప్రయోజనం తీరిన వెంటనే స్నేహం వదిలిపోతుంది. ఆకలి తీరిన తుమ్మెదలు పువ్వులను వదలడం లేదా? అని నర్మగర్భంగా పలికారు. ఇంతలో శ్రీకృష్ణ చరణధ్యాన పరవశురాలైన ఒక గోపిక గండుతుమ్మెదను చూసింది. ఉద్ధవుడు అర్ధం చేసేకొనే విధంగా అన్యాపదేశంగా తుమ్మెదతో ఈ విధంగా పలికినది.

---

*1. పోతన భాగవతం, 10 : 1434 : పుట-329*

*2. పోతన భాగవతం, 10 : 1435 : పుట-330*

*3. పోతన భాగవతం, 10 : 1437 : పుట-330*

*4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 6 : పుట-456*

*మత్తేభం :*

*భ్రమరా ! దుర్జనమిత్ర! ముట్టకుము మా పాదాబ్జముల్ నాగర*
*ప్రమదాళీ కుచకుంకుమాంకిత లసత్ప్రాణేశ దామప్రసూ*
*నమరందారుణి తాననుండ వగుటన్ నాథుండు మన్నించుఁగా*
*కమమున్నే పుచుఁ బౌరకాంతల శుభాగారంబులన్ నిత్యమున్ ॥ -1*

ఓ తుమ్మెదా! శ్రీకృష్ణుడు మధురాపుర కాంతల శోభన గృహాలలో నిత్యమూ కులుకుతున్నాడు. ఆయన పుష్పమాలికలోని మకరందము గ్రోలినటువంటివాడవు నీవు. ఆయన మాకు ధూర్తుడైనాడు కనుక ఆయన మిత్రుడవైన నీవు కూడా మాకు శత్రువే. అతని మన్ననకు పాత్రుడవైన నీవు మాకు మాననీయుడవు మాత్రము కాదు.

శ్రీకృష్ణుడు నీకు ఏ మాత్రం తీసిపోడు. నీవు ఒక పువ్వులోని మకరందాన్ని త్రాగి మరొక పువ్వును ఆశ్రయిస్తావు. శ్రీకృష్ణుడు మా అధరామృతాన్ని గ్రోలి మా యవ్వనాన్ని కొల్లగొట్టి అన్యకాంతాసక్తుడైనాడు. అటువంటి వాడికే ఆడవారు దాసులవుతారు అన్న దానికి గుర్తుగా ఆ చంచల చిత్తునకు లక్ష్మీదేవి దాసోహమయింది. ఓ తుమ్మెదా! నీవిద్య అంతా మధురానగరీ మగువుల ఎదుట ప్రదర్శించు. అతని కథలు మాకు క్రొత్తా! ఏమి? శ్రీకృష్ణుని సంతోషంతో కీర్తిస్తున్నాము. మేమేమి ఇక్కడ సోలిపోవడానికి సిద్ధంగా లేము. సాక్షాత్తు లక్ష్మీదేవే ఆయన చరణ కమలాలను సేవిస్తూ ఉండగా ఆమె ముందు తక్కువవారమైన మాకు ఆయన సేవా భాగ్యం దొరుకుతుంది అని భ్రమ చెందడం తప్ప మరేమీ కానరాదు. ఎందుకంటే మూడులోకాలలోనూ ఆయన మందహాసానికి, కనుబొమ్మల విలాసములకు కరగిపోని కాంతలు ఉండరు. మాకు ఈ విధంగా జరుగవలసిందే భర్త, కుమారులను వదలి, మంచి గతులను తలపెట్టకుండా తనలో లీనమయ్యాము కాబట్టి ఆయన మమ్ము పరిత్యజించాడు. ఒక్క మాట యదార్థము. ధర్మము తెలిసినవారు మాత్రము ఆయన నడవడిక మెచ్చరు. మా మాటలలో తప్పు ఎంత మాత్రము లేదు. నీవు అతనిని పొగుడుతున్నావు కాబట్టి ఇలా అంటున్నాము.

*శార్దూలం :*

*వాలింజంపెను వేఁటకాని పగిదిన్ వంచించి; దైత్యానుజన్*
*లోలంబట్టి విరూపఁజేసెను; బలిన్ లోభంబుతోఁగట్టి యా*
*త్రైలోక్యంబు మొఱంగి పుచ్చుకొనియెన్; ధర్మజ్ఞుఁడేమాధవుం?*
*దేలాషట్పద ! యెగ్గుమావలన నీకెగ్గింపఁగా నేటికిన్ ? -2*

---

1. *పోతన భాగవతం, 10 : 1456 : పుట-334*
2. *పోతన భాగవతం, 10 : 1461 : పుట-335, 336*

వానరరాజైన వాలిని వంచించి వధించాడు. తనపైన మోహం చెందిన శూర్పణఖను ముక్కు చెవులు కోసి విరూపను గావించాడు. బలిచక్రవర్తిని మోసపుచ్చి ముల్లోకములను ఆక్రమించాడు. ఇటువంటివాడు లక్ష్మీపతి అయిన ధర్మమెఱిగిన వాడు అని మాత్రము అనము. ఆకర్షణీయమైన పలుకులు ఆలకించి పారవశ్యంతో చెంతకు వస్తే వేటగాడు వాని మీద బాణాలు ప్రయోగించి అతి దారుణమైన బాధకు గురి చేస్తాడు. మేము కూడా ఇంతకంటే భిన్నమైన వారము కాము. శ్రీకృష్ణుని మాయమాటలు నమ్మి మన్మథ శర పరంపరకు గురి అయ్యాము. ఇప్పుడు దుఃఖాన్ని అనుభవిస్తున్నాము. కామాంధత్వముచే బంధువులను విడిచి తనను శరణుజొచ్చాము. ఇప్పుడు విరహసాగరంలో ముంచి మా వంకకు కూడా రావడం లేదు. ఇది న్యాయం కాదు అని గట్టిగా చెప్పు.

ఉత్పలమాల :

*బంధుల బిడ్డలన్ మగలభ్రాతలఁదల్లులఁదండ్రులన్‌మనో*
*జాంధతఁ జేసిడించి శరణందిన మమ్ము వియోగదుర్దశా*
*సింధువులోనఁ ద్రోచి యిటుచేరకపోవుట పాడిగాదు; పు*
*ష్పంధయ! మీయధీశునకుఁ బాదములంబడి యొత్తిచెప్పవే? -1*

లోకంలో ప్రభువులు నవనవప్రియులు అన్నమాట మీ ప్రభువు యథార్థం చేశాడు. బంగారు మణులతో నిర్మించబడిన మేడల ముందు మా గుడిసెలు కానరావు. మా పల్లెటూరు ప్రధాన పట్టణముకాదు. ఇక్కడ యీ అడవిలో సువాసనలీను చెట్లు, పూతీవెలతో చెలువారు ఉద్యానవనములు లేవు. మధురానగర గజ, తురగములలో మా గోవులు సరిపోలవు. అన్నింటికీ మించి రూపవిభ్రమ విలాసములతో విరాజిల్లుతున్న మధురకాంతలు కారు ఈ వ్రజకాంతలు.

*సీసం ॥ కాంచనరత్న సంఘటిత సౌధంబులే మా కుటీరంబులు మాధవునకు*
*వివిధ నరేంద్ర సేవిత రాజధానియే మాపల్లె యదువంశ మండనునకు*
*సురభిపాదప లతా శోభితారామమే మాయరణ్యము సింహమధ్యమునకుఁ*
*గమనీయలక్షణ గజతురంగంబులే మాధేనువులు కంసమర్దనునకు?*

*తే॥ రూపవిభ్రమ నైపుణ రూఢలైన, మగువలమె మేము మన్మథమన్మథునకు*
*నేల చింతించుమముఁ గృష్ణుఁడేల తలఁచు?, బృథివినధిపులు నూతన ప్రియులు గారె! -2*

అని కృష్ణ సందర్శనాభిలాషులైన గోపికలు తమ మనోవ్యథను భ్రమరనెపంతో ఉద్ధవునికి విన్నవించుకున్నారు

---

1. *పోతన భాగవతం, 10 : 1464 : పుట-336*
2. *పోతన భాగవతం, 10 : 1465 : పుట-336, 337*

*శ్లో॥ నందాద్యైస్తోషిత స్తత్రమాధవోక్తిం నివేద్య చ*
*సంతం రహసిగోప్యస్తం ప్రాహుర్మధుపకల్పితమ్ ॥ -1*

*కీర్తన : ప॥ మధుప మధుప దూతం మన్యేత్వాం మాధవీయ మధునా*

*అ॥ప॥ మధురాపురనారీ వదనాంబుజ*
*మకరన్ద మాకలయ మాయాహి యాహి యాహి*

*చరణం: మధుపమధుపూరితం మాధురే వదనకమలం*
*మాధవభాస్కర మహితకరకలితం*
*అధునాయాదవకరుణా సుధయాసముల్లసితం*
*కథయ కథయ కిమిహ కామయకలయకామం*

*చరణం: భ్రమరభ్రాల్యీ మకరంద సంభృతేషు*
*పావన గోవింద పదచిహ్నితేషు*
*కమనీయ మధురా కాంతారపాదపేషు*
*కిమపి మాధవవృత్తం కేనవాదరణీయ మిహ*

*చరణం: అలమసిత సఖ్యేన స్మితభాషణేనాలం*
*చల చంచల స్వభావ చంచరీక*
*పరికలయమాధవం బహుధామరగీతం*
*వరనారాయణతీర్థ వరదం విజయగోపాలం -2*

*శ్లో॥ శ్రుత్వా తద్గోపికా గీతం శ్రావ్యం శ్రుతిమనోహరమ్*
*తత్త్వమావేదయన్ గోపీః ప్రత్యాహోద్ధవ ఉత్సుకః ॥ -3*

గోపికలు చెప్పిన మాటలు విని ఉద్ధవుడు శ్రీకృష్ణ యదార్ధ స్వరూపమును వారికి చెప్పుచున్నాడు. సాక్షాత్తు శ్రీకృష్ణుని యందు మీకు గల అనురాగం మీ మాటలలో వ్యక్తమవుతోంది. గోపికలారా! శ్రీకృష్ణుడు నన్ను మీ వద్దకు పంపుతూ నాతో చెప్పిన మాటలు మీకు చెబుతున్నాను అని పలికి శ్రీకృష్ణ పలుకులు చెప్పడం ప్రారంభించాడు.

*కందం॥ నను మీకడకం గృష్ణుఁడు, పని పంపెడువేళఁ బిలిచి పలికిన పలుకుల్*
*వినుఁ; డన్నియు వివరించెద, వనజేక్షణలార ! మీరు వగవకుఁడింకన్ ॥ -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 7 : పుట-456*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 2 : పుట-457*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 8 : పుట-459*
4. *పోతన భాగవతం, 10 : 1468 : పుట-337*

"సమస్త కార్యములకు ముఖ్యకారణమై యున్నా నా యెడబాటు మీకు కలుగదు. సకల ప్రాణులకు నేను ఆధారభూతుడను. ఈ చరాచర ప్రపంచమునకు నేను సృష్టి, స్థితి, లయకారకుడను".

*సీసం॥ ఎల్ల కార్యములకు నేను బ్రధాన కారణము గావున మీరు రమణులార !*
*కలుగదు మద్వియోగము చరాచర రూపములలో మహాభూతంబులు వసించు*
*కరణినుండుదు సర్వగతుఁడనైనే మనః ప్రాణబుద్ధి గుణేంద్రియాశ్రయుండ*
*నాత్మయం దాత్మచే నాత్మఁ బుట్టింతు రక్షింతును ద్రుంతుహృషీకభూత*

*తే॥ గుణగణాకార మాత్మలోఁ గొమరుమిగులు, నిబిడమాయానుభవమున నిత్యశుద్ధ*
*మాత్మవిజ్ఞానమయమునైయమరుగుణముఁ, బ్రకృతికార్యమనోవృత్తిఁబట్టి పొందు -1*

జీవునకు ప్రపంచ స్వరూపం సత్త్వాది గుణములు లేదా భూతేంద్రియ గుణములతో కలుగుతోంది. జాగ్రత్స్వప్న సుషుప్తులనే మనోవృత్తుల యందు అతడు దేవ మనుష్యాది రూపాలతో తోచుచున్నాడు.

స్వప్నములో చూచినదంతా మిథ్య అని మేల్కొన్నవాడు భావిస్తాడు. తత్త్వవేత్త తనకంటే భిన్నంగా ప్రపంచం లేదని చెబుతాడు. మనస్సును అరికడితే భేదభావం పొడచూపదు.

*కందం॥ కలఁగని లేచి మున్నుగలఁగన్న సమస్త విధంబుఁగల్లఁగాఁ*
*దలఁచిన భంగి మానస పదార్థముచే నిఖిలేంద్రియార్థముల్*
*బలమునఁగట్టి తద్జ్ఞుఁడు ప్రపంచము లేదనుఁదన్మనంబుఁదా*
*రలయక కట్టుడున్ బుధుల కవ్వల నొండొక భేదమున్నదే? -2*

"నదీనాం సాగరోగతిః" నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. సాంఖ్యము, అష్టాంగ యోగము, వేదము, సత్యము, తపము, ఇంద్రియ నిగ్రహము, దమము ఇవన్నీ ఒక్క మనోనిగ్రహం చేతనే పరిసమాప్తి పొందుతున్నాయి.

*ఆ॥ సాంఖ్యయోగ నిగమసత్యతపోదమ, ములు మనోనిరోధములు గడపలఁ*
*గాఁగ నుండు జలధి కడపలగాఁగలఁ, నదుల భంగి నళిననయనలార ! -3*

స్త్రీలు సమీపంలో ఉన్నవారికన్నా దూరంలోనున్న ప్రియులయందే మిక్కిలి అనురాగవతులై ఉంటారు. మీకు దూరంలో ఉన్నా కూడా మీరు భయపడకండి. నిరంతర ధ్యానపారంగతులై నన్నే స్మరిస్తూ ఉంటే నన్నే పొందగలరు.

---

*1. పోతన భాగవతం, 10 : 1470 : పుట-338*

*2. పోతన భాగవతం, 10 : 1471 : పుట-338*

*3. పోతన భాగవతం, 10 : 1472 : పుట-338*

మత్తేభం :

చెలువల్ దవ్వులనున్న వల్లభులపైఁ జిత్తములం గూర్తురు
త్కలికం జేరువ వారి కంటె నదియుంగాకెప్పుడున్ నన్ను మీ
రలు చింతించుచు నుండఁగోరి యిటు దూరస్థత్వముం బొందితిన్
దలఁకం బోలదు నన్నుఁగూడెదరు నిత్యధ్యానపారీణలై ॥ -1

కీర్తన : ప॥ గోపీజన గోమధ్య చరంతం గోపాలం విద్ధిగోపాలం

చరణం: అంతరంగే సతతం భాంతం ఆదిమధ్యాంతవసంతం
సంతతం సత్సుచరంతం సత్యమేకాంతం
అంతరే యోగివిచింత్యం అనుపమసకలాగమాంతం
హంతదురంత సంసారబంధ హంతారం విహరంతం

చరణం: సంయోగ వియోగవిహీనం సాధుమానసజీవనం
మాయోపాధివిదళనం మానసాసనం
కాయక్లేశాదివిహీనం కారణమానవజన్మానం
భూయోభూయోవిచార్యైనం భూమానం భూరి మహిమానం

చరణం: బుద్ధి వికల్పిత భేదాభేదం బోధబాధిత సర్వభేదం
సిద్ధ సంభావిత సిద్ధిదం శ్రితజనబర్హివారిదం
బుద్ధముక్తసిద్ధవేద బోధితానందమోదం
సిద్ధనారాయణతీర్థ సేవితశ్రీపాదం -2

ఉద్ధవుని పలుకులు విన్న గోపికలు సంతోషించి ఆయనతో ఇట్లా అన్నారు. "మా ప్రాణం పోయిన తరువాత ఆయన వచ్చిననూ ఉపయోగం లేదు" అని ఈ విధంగా విజ్ఞప్తి చేయుమని గోపికలు ఉద్ధవునికి విన్నవించారు.

సీసం : తనుఁబాసి యొక్కింత తడవైననిట మీఁద నేలపై మేనులు నిలువమనుము
నేలపై మేనులు నిలువకయటమున్న ధైర్యంబులొక్కటఁదలఁగుననుము
ధైర్యంబులొక్కటఁ దలఁగిన పిమ్మటఁ జిత్తంబులిక్కడఁజిక్కవనుము
చిత్తంబులిక్కడఁజిక్కక వచ్చినఁ బ్రాణంబులుండకపాయుననుము - 3

---

1. పోతన భాగవతం, 10 : 1473 : పుట-339
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 3 : పుట-460
3. పోతన భాగవతం, 10 : 1480 : పుట-340

తే॥గీ॥ ప్రాణములు వోవమఱి వచ్చి ప్రాణవిభుఁడు, ప్రాణి రక్షకుఁడగు తన్నుఁ బ్రాణులెల్లఁ
జేరి దూఱంగ మఱియేమి సేయువాఁడు, వేగ విన్నపమొనరింపవే మహాత్మ ! -1

శ్లో॥ విగళిత భయశోకా విద్యయాలబ్ధతత్త్వాః
కథమపి పరతత్త్వే స్థాపయిత్వా మనాంసి
ముహురపిపరభక్త్యా విశ్వవంద్యే ముకుందే
మధుకర పరిక్లుప్తం తంప్రతి ప్రాహురిత్థమ్ ॥ -2

ఆ గోపికలు తుమ్మెదపై మిషపెట్టి ఉద్ధవునితో యీ విధంగా పలికిరి.

కీర్తన : ప॥ కిము రాజతే రాజసదసి

అ॥ప॥ కుముదగణేషు కోటికోటి సంఖ్యాకేషు
కుముదబంధురివ కోటిమదనఇవ

చరణం: మధుపకులవతంస కథయమధుమాధవచరితమిహ
మధుకరాచారరసికోఽథ మాధవో విజయతే
కథమపి కదా కింస్మరతినస్సదసి రహసి
కిముకుశలీవనమాలీ సుగుణశాలీ

చరణం: స్మరతికిమథబృందావన భువి
పరమరహసినిశిముదాపరయాయత్సుకృతం
సరళ మురళీరవసుధయాసమాకృష్ట
సురవనితాగణ సరససంగీతమిహ

చరణం: కతికతిసంతి న కలహంస గతయః
తత్పరిచర్యావిధానైక కుశలాః
తదిహనస్మరతీతి సాధువిదితమిహ
తదలమసిత సంగవార్తయావిఫలయా

చరణం: మధురానగరీనారీ మధురసంగీత రసికే
మాధవే వసతిమధురాయాం మధురం
వందిమాగధై రధికం గీయతే గీతం జయహే
గోపికా జారగోపీనాథేతినహికిం

---

1. పోతన భాగవతం, 10 : 1480 : పుట-340

2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 9 : పుట-463

*చరణం: సృతపంచదశ కలాచంద్ర ఇవ జీవాయో*

*ధ్రువకలయా వయమధునా*

*ఇతిమధుసూదనం వదయాహి మాధవం*

*ప్రతినారాయణ తీర్థ ప్రత్యగాత్మానమసితం -1*

ఉద్ధవుడు శ్రీకృష్ణ సందేశం తెలిపి వారి చేత పూజితుడై కొన్ని మాసములు వ్రేపల్లెలో గడిపి నందాదియదు పుంగవులు వీడ్కోలు పలుకుతుండగా మధుర బయలుదేరి శ్రీకృష్ణుని దర్శించి గోపికల మాటలను ఆయనకు తెలియజెప్పాడు.

*శ్లో॥ మధురిపుంమధురాపుర నాయకం*

*సమధిగమ్యస చోద్ధననామకః*

*రహసి గోపవధూపరిభాషితమ్*

*మధురమాహమనోభవరూషితమ్ ॥ -2*

## సాందీపని వృత్తాంతం :

గురువుల ఉపదేశం చేత మాత్రమే విద్యావంతులు కాగలరు అని లోకమునకు చాటి చెప్పడానికి బలరామకృష్ణులు ఆచార్యుణ్ణి అన్వేషిస్తూ గొప్ప వైభవములకు నిలయమైన కాశీ పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అవంతీ పట్టణ వాస్తవ్యుడూ, సమస్త విద్యావాసి అయిన సాందీపనిని గురువుగా స్వీకరించారు.

*శార్దూలం :*

*ఉర్విన్ మానవులెవ్వరైన గురువాక్యోద్యుక్తులై కాని త*

*త్పూర్వారంభము సేయఁబోల దనుచున్ బోధించు చందంబునన్*

*సర్వజ్ఞత్వముతో జగద్గురువులై సంపూర్ణులై యుండి యుం*

*గుర్వంగీకరణంబు సేయఁజని రాగోవిందుడున్ రాముఁడున్ -3*

*వచనం: చని మహావైభవరాశియైన కాశింజేరి తత్తీరంబున*

*నవంతీపుర నివాసియు, సకలవిద్యా విలాసియునైన సాందీపని*

*యను బుధవర్యుంగని యథోచితంబుగ దర్శించి, శుద్ధభావ*

*వర్తనంబుల భక్తిసేయుచుండ, వారలవలన సంతుష్టుండై -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 4 : పుట-463, 464*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 11 : పుట-467*
3. *పోతన భాగవతం, 10 : 1408 : పుట-325*
4. *పోతన భాగవతం, 10 : 1409 : పుట-325*

శిష్యుల వినయ విధేయతలకు సంతోషించిన సాందీపని వారికి సమస్త విద్యలను తెల్లంగా బోధించాడు. ఈ విధంగా వారిద్దరూ 64 విద్యలను 64 రోజులలో కేవలం వినికిడి చేతనే నేర్చుకున్నారు.

*శార్దూలం :*

*వేదశ్రేణియునంగకంబులు ధనుర్వేదంబుఁదంత్రంబు మ*
*న్వాదివ్యాహృత ధర్మశాస్త్రములునుద్యన్న్యాయముందర్కవి*
*ద్యాదక్షత్వము రాజనీతియును శుద్ధప్రక్రియంజెప్పె నా*
*భూదేవాగ్రణి రామకృష్ణులకు సంభూత ప్రమోదంబునన్ ॥ -1*

*కందం॥ అఱువది నాలుగు విద్యలు, నఱువది నాలుగు దినంబులంతనవారల్*
*నెఱవాదులైన కతమున, నెఱినొక్కొక్క నాఁటి వినికి నేర్చిరిలేశా ! -2*

వారి ప్రభావమునకు ఆశ్చర్యపడిన సాందీపని భార్యతో ఆలోచించి రామకృష్ణులతో ఈ విధంగా పలికాడు. ఇంతకు మునుపు నా కుమారుడు సముద్రంలో 'ప్రభాసము' అనే ఘట్టంలో స్నానం చేస్తూ మునిగిపోయాడు. అతడిని తీసుకురావలసినదిగా కోరుతున్నాను. ఇది మీ కర్తవ్యంగా భావించండి అని పలికాడు. సముద్రంలో స్నానం చేస్తున్న భూసుర కుమారుణ్ణి ఒక తరంగం లోపలకు గొనిపోగా అక్కడ 'పంచజనుడు' అను పేరు గల ఒక రాక్షసుడు విప్రకుమారుని మ్రింగివేశాడు అని పలికి సముద్రుడు బలరామకృష్ణులకు రాక్షసుడుండేచోటు తెలిపాడు. అక్కడ పంచజనుని పొట్ట చీల్చి విప్రకుమారుడు కనిపించకపోగా అతని శరీరం నుండి జనించిన 'పాంచజన్య'మనే శంఖాన్ని తీసుకొని 'సంయమని' అను పేరు గల యమ నగరానికి వెళ్ళి శంఖాన్ని పూరించాడు కృష్ణుడు. యముడు వారిరువురు నరులుగా అవతరించిన నారాయణులని గ్రహించి భక్తితో పూజించి వారి ఆజ్ఞానువర్తియై గురుపుత్రుణ్ణి అప్పగించాడు. గురువుకు ఆయన పుత్రుని యిచ్చివేసి ఆయన చేత దీవింపబడి గురువు వద్ద సెలవు తీసుకొని బలరామకృష్ణులు మధురానగరానికి వెళ్ళిపోయారు.

వచనం: 'మహాత్ములారా ! యేనుగృతార్థుండనైతి'నని దీవించిన సాందీపుని వీడ్కొని కృతకృత్యులై రామకృష్ణులు రథారోహణంబు చేసి మధురకుం జనుదెంచి పాంచజన్యంబు పూరించినఁ గని నష్టధనంబులు గనినవారి భంగిం ప్రజలు ప్రమోదించి; రంతరొక్కనాఁడేకాంతంబున. *-3*

ఈ సాందీపని వృత్తాంతమును తీర్థులవారు శ్లోకము, కీర్తన రెండు శ్లోకములు రెండు కీర్తనలలో ముగించినారు.

---

*1. పోతన భాగవతం, 10 : 1410 : పుట-325*

*2. పోతన భాగవతం, 10 : 1411 : పుట-325*

*3. పోతన భాగవతం, 10 : 1431 : పుట-329*

*శ్లో॥ నిత్యసిద్ధాగమజ్ఞోకపి భగవాన్ సబలోగమత్ ।*
*విద్యార్థిలోకశిక్షార్థం సాందీపని మునింగురుమ్ ॥ -1*

*కీర్తన : నిష్పన్నవేదవిజ్ఞానో నిత్యం స్వాధ్యాయతత్పరః ।*
*శిష్యోపశిష్య సేవితో సాందీపనిర్విరాజతే ॥ -2*

*శ్లో॥ గృహీత విద్యోభగవాన్ బలరామసహాయవాన్*
*గురుంప్రసాద్యవిధినా సతస్థౌ బ్రహ్మచారిభిః ॥ -3*

## జరాసంధ, కాలయవనుల వృత్తాంతము, ముచకుంద స్తుతి :

కంసుని భార్యలు అస్తి, ప్రాప్తి. కృష్ణుని వలన మాకు వైధవ్యం ప్రాప్తించినదని తండ్రి జరాసంధునికి విన్నవించారు. ప్రళయ కాలాగ్నిలా మండిపడ్డ జరాసంధుడు 23 అక్షౌహిణుల సైన్యంతో మధురపై దండెత్తి వచ్చాడు. కృష్ణుడు భూభారాన్ని తగ్గించాలి అనే ఉద్దేశ్యంతో వీడిని చంపకుండా సైన్యాన్ని మాత్రమే సంహరిస్తే వీడు పదే పదే సైన్య సమీకృతుడై వస్తాడు. అప్పుడు అందరినీ చంపి చివరకు ఇతడిని చంపవచ్చు అని భావించాడు. ఇరుసైన్యాలకు భీకర యుద్ధం జరిగింది. యాదవసైన్యం వెనుకకు తగ్గింది. కొంతసేపటికి అవక్రవిక్రమంతో మగధరాజ సైన్యాన్ని ఎదుర్కొన్నారు. ఆ సమయంలో బలరాముడు జరాసంధుణ్ణి ముందుకురికి పట్టుకున్నాడు. తన పిడికిట పోటుతో జరాసంధుణ్ణి కంఠగత ప్రాణుణ్ణి చేశాడు. భావి కార్యం తలపోసిన చక్రాయుధుడు అతడిని విడిపింపజేశాడు. జరాసంధుడు సిగ్గుతో కుమిలిపోయి మొగమెత్తుకోలేక కోపం కుటిలత్వము మనస్సులో మెలివడగా తపస్సు చేసి అయినా వీళ్ళను జయించాలి అనుకున్నాడు. పారిపోయిన వారిలో ఇతడు కూడా ఒకడయ్యాడు.

*శార్దూలం :*

*అంహఃకర్ములు తల్లడిల్ల భయదాహంకారుఁడై సీరి దో*
*రంహం బొప్పహలాహతిన్ రథధనూరథ్యంబులంగూల్చి త*
*త్సంహార స్పృహఁజొచ్చిపట్టెను జరాసంధున్ మదాంధున్ మహా*
*సింహంబుం బ్రతిసింహముఖ్యము బలశ్రీఁ బట్టు నేర్పేర్పడన్ ॥ -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 12 : పుట-470*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 6 : పుట-471*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 13 : పుట-471*
4. *పోతన భాగవతం, 10 : 1575 : పుట-365*

ఉత్పలమాల :

*కుంఠితులై పరుల్ బెగడ ఘోరబలుండు బలుండు వాని సో*
*ల్లుంఠము లాడుచున్ దిగిచిలోక భయంకరమైన ముష్టిచేఁ*
*గంఠ గతాసుఁజేసి తమకంబున మొత్తఁగ భూభరక్షయో*
*త్కంఠుఁడు చక్రి మీఁదెఱిఁగి కార్యము గల్దని మాన్పియిట్లనున్ ॥ -1*

శార్దూలం :

*దుఃఖింపంబని లేదు; పొమ్ము; బలసందోహంబులందెమ్ము; చే*
*తఃఖేదం బెడలంగ రమ్ము; రిపులందండింపు; కాదేని భూ*
*స్వఃఖేలజ్జన మెల్లమెచ్చనృప ! నీ శౌర్యోన్నతుల్ సూపి మే*
*దః ఖండంబులు భూతముల్ దినఁదనుత్యాగంబు సేయందగున్ ॥ -2*

జరాసంధుడు 17 సార్లు 17 అక్షౌహిణుల సైన్యంతో మధురపై దండెత్తాడు. 18వ పర్యాయం దండెత్త సమాయత్తమగుతున్నాడు. ఆ సమయంలో నారదునితో వీరోక్తులాడిన కాలయవనుడు 3 కోట్ల మ్లేచ్ఛ సైన్యంతో మధురను ముట్టడించాడు. జరాసంధ కాలయవనుల నుండి ప్రజలను రక్షించాలి అని శ్రీకృష్ణుడు సాగరమధ్యంలో దేవశిల్పి విశ్వకర్మ రూపకల్పనలో ఒక పట్టణాన్ని నిర్మించాడు. తన యోగ మహిమతో శ్రీకృష్ణుడు మధురానగర ప్రజలందరినీ ద్వారకాపట్టణానికి చేర్చాడు. మధుర నుండి బయలుదేరిన మాధవుని కాలయవనుడు చూశాడు. మిక్కిలి కావరంతో మిడిసిపడుతూ తన పట్టణానికి వస్తున్న కాలయవనుడికి దొరకకుండా కృష్ణుడు మిక్కిలి వేగంగా పరుగెత్తాడు. మిక్కిలి భయంకరమైన ఒక కొండగుహలో ప్రవేశించాడు. కాలయవనుడు తాను కూడా ఆ కొండగుహలోనికి ప్రవేశించి పెద్ద పాన్పు మీద నిద్రలో మునిగి గురకపెడుతున్న ఒక మహాపురుషుణ్ణి చూసి అతడే శ్రీకృష్ణుడని భావించి వికారపు నవ్వు నవ్వి, తన కాలితో నిద్రపోతున్న ఆ పురుషుణ్ణి ఎగరి తన్నాడు. అతడు నిద్రలేచి కాలయవనుణ్ణి చూడగా అతడు మాడి మసైనాడు. కాలయవనుడు భస్మమైన పిదప ముకుందుడు ముచకుందుని ఎదుట సాక్షాత్కరించాడు.

*కందం॥ ఇటు దన్నుఁబట్టవచ్చినఁ, బటుతర జవరేఖమెఱసి పట్టువడక ది*
*క్తటములదర హరివాఱెం, జటులగతిన్ వాఁడు దోడఁ జనుదేరంగన్ ॥ -3*

*కందం॥ దారితశాత్రవ భవనున, పారమహావేగ విజిత పవనున్ యవనున్*
*దూరముగొని చని కృష్ణుఁడు, ఘోరంబగు నొక్క శైలగుహవడిఁజొచ్చెన్ ॥ -4*

---

1. *పోతన భాగవతం, 10 : 1577 : పుట-365*
2. *పోతన భాగవతం, 10 : 1578 : పుట-365*
3. *పోతన భాగవతం, 10 : 1622 : పుట-375*
4. *పోతన భాగవతం, 10 : 1633 : పుట-377*

వచనం: ఇట్లు సొచ్చి మూఢహృదయంబునుం బోలెఁదమ పూర్ణంబయిన గుహాంతరాళంబున దీర్ఘతల్ప నిద్రితుండై గుఱకపెట్టుచున్న ఒక మహాపురుషునిం గని శ్రీహరిగాఁ దలంచి -1

ఆ॥ *అనుచు యవనుఁడట్టహాసంబు గావించి, చటుల కఠిన కులిశ సదృశమైన*
*పాదమెత్తి తన్నెఁబాఱితద్దేహంబు, నగగుహం బ్రతిస్వనంబు నిగుడ -2*

ఉత్పలమాల :

*తన్నిన లేచి నీల్గి కనుఁదమ్ములు మెల్లనవిచ్చి లోపలన్*
*సన్నపుఁగిన్క వర్ధిల దిశల్‌గని దృష్టి సమిద్ధ విగ్రహో*
*త్పన్నమహాగ్ని కీలముల భస్మముసేసె నతండు సాయక*
*ఛ్ఛిన్న విరోధి కంఠవను శ్రీభవనున్ యవనున్ లఘుక్రియన్ ॥ -3*

ఈ జరాసంధ, కాలయవన వృత్తాంతములు తీర్థుల వారు ఒక శ్లోకములో చెప్పారు.

శ్లో॥ *జరాసంధస్య సైన్యానిహతాని హరిణాసకృత్*
*నిహతః కాలయవనో ముచకుంద ముఖాగ్నినా ॥ -4*

ముచకుందుడు శ్రీకృష్ణుని స్తుతించాడు.

ఉత్పలమాల :

*పూని యనేకజన్మములఁబొంది తుదిందన పుణ్యకర్మ సం*
*తానము పేర్మిఁగర్మ వసుధాస్థలిఁ బుట్టి ప్రపూర్ణదేహుఁడై*
*మానవుఁడై గృహేచ్ఛఁబడు మందుఁడజంబు తృణాభిలాషియై*
*కానకపోయి నూతఁబడు కైవడి నీపద భక్తిహీనుఁడై ॥ -5*

*కందం॥ నరవర సంజ్ఞితమై రథ, కరిసేవితమైన యొడలు కాలగతిన్ భీ*
*కరమృగ భక్షితమైదు, స్తర విట్క్రిమి భస్మసంజ్ఞితం బగునీశా ! -6*

---

1. *పోతన భాగవతం, 10: 1635 : పుట-378*
2. *పోతన భాగవతం, 10 : 1638 : పుట-378*
3. *పోతన భాగవతం, 10 : 1639 : పుట-378, 379*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 14 : పుట-474*
5. *పోతన భాగవతం, 10 : 1656 : పుట-383*
6. *పోతన భాగవతం, 10 : 1660 : పుట-383*

*శ్లో॥ ఉద్ధరోద్ధర గోవింద పతితం భగసాగరే !*
*భీకరే శ్రీహరే కృష్ణ వృష్ణివంశ సముద్భవ ॥ -1*

శ్రీకృష్ణుడు ముచకుందునికి దృఢమైన భక్తిని ప్రసాదించి మధురకు వెళ్ళిపోయాడు.

*శ్లో॥ ఇతిస్తువంతం ముచకుంద మాదరాత్*
*కృపా సుధావర్షి దృశావలోక్యసః*
*హితం సమాదిశ్యచసత్వరం పునః*
*వివేశ శౌరిర్మధురా మరిందమః ॥ -2*

ముచకుందుడు అల్పప్రమాణంగా ఉన్న మనుషులు, పశువులు, చెట్లు, తీగలను గమనించి కలియుగం రాబోతున్నదని గ్రహించి ఉత్తరదిక్కుగా బయలుదేరి హరి మీద మనస్సు లగ్నం చేసి తపోదీక్ష వహించి గంధమాదన పర్వతం చేరి, అక్కడ నుండి నర నారాయణులకు నెలవైన బదరికాశ్రమాన్ని చేరి శాంతుడై అచ్యుతుని ఆరాధింపసాగాడు.

శ్రీకృష్ణుడు ముచకుందుని అనుగ్రహించి మధురానగరానికి వచ్చిన తరువాత జరాసంధుడు 23 అక్షౌహిణుల సైన్యంలో మధురాపట్టణం పైకి దండెత్తి వచ్చాడు. బలరామకృష్ణులు యుద్ధప్రయత్నం మానుకొని సామాన్య మానవులలాగా భయంకరారణ్యంలో పడి పరుగెత్తసాగారు. అది చూసి జరాసంధుడు మిమ్మల్ని వదలక సంహరిస్తాను అంటూ తన సకల సేనలతో వెంటపడ్డాడు. రామకృష్ణులు ప్రహర్షణగిరిని ఆరోహించారు. జరాసంధుడు ఆ పర్వతాన్ని తగులబెట్టించాడు. మహాగ్ని ఆ పర్వతాన్ని కాల్చివేసింది. రామకృష్ణులు దాని నుండి తప్పించుకొని ద్వారకానగరాన్ని చేరుకున్నారు. జరాసంధుడు వారు కాలిపోయారని భావించి సేనలతో మగధ దేశానికి మరలిపోయాడు.

## రుక్మిణీ కళ్యాణము :

కుండిన నగరాన్ని రాజధానిగా చేసుకొని విదర్భ దేశాన్ని భీష్మకుడు పాలిస్తున్నాడు. ఇతనికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె, పెద్ద కుమారుడు రుక్మి, కుమార్తె రుక్మిణి.

*చంపకమాల :*

*వినుము విదర్భ దేశమున వీరుఁడు కుండిన భర్త భీష్మకుం*
*డను నొక దొడ్డరాజు గల; డాతనికేవురు పుత్త్రులగ్రజుం*
*డనయుఁడు రుక్మినాఁబరఁగు; నందఱకున్ గడగొట్టుచెల్లెలై*
*మనుజవరేణ్య! పుట్టెనొకమానిని రుక్మిణినాఁబ్రసిద్ధయై ॥ -3*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 17 : పుట-479*
*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 18 : పుట-479*
*3. పోతన భాగవతం, 10 : 1687 : పుట-390*

*కీర్తన : ధీమానిహ శ్రీమానయం భీమపరాక్రమాన్వితః*

*భూమౌ విఖ్యాత మాహాత్మ్యో భీష్మోరాజావిరాజతే ॥ -1*

క్రమంగా యవ్వనవతి అయిన రుక్మిణి తన తండ్రి యింటికి వచ్చిన అతిథుల వలన కృష్ణరూపం, బలం, సద్గుణాలు మొదలగు వాటిని విని అతడే తనకు తగిన మగడని నిర్ణయించుకుంది. శ్రీకృష్ణుడు కూడా రుక్మిణిని తప్పక వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఒక్క రుక్మి తప్ప రుక్మరథుడు, రుక్మబాహువు, రుక్మకేశుడు, రుక్మనేత్రుడు అనే సోదరులు మతిమంతులైన చుట్టాలు రుక్మిణీ కృష్ణుల పెండ్లికి కృతనిశ్చయులయ్యారు. రుక్మి మాత్రం చేదిభూపాలుడైన శిశుపాలునకు రుక్మిణినిచ్చి కట్టబెట్టాలని సంకల్పించాడు.

*ఉత్పలమాల :*

*బంధువులెల్లఁ గృష్ణునకు బాలికనిచ్చెదమంచు శేముషీ*
*సింధువులై విచారములు సేయఁగ వారలనడ్డపెట్టి దు*
*స్సంధుఁడు రుక్మికృష్ణునెడఁ జాలవిరోధముఁజేసి మత్తపు*
*ష్పంధయ వేణినిత్తు శిశుపాలునకంచుఁదలంచె నంధుఁడై॥ -2*

తీర్థుల వారు కూడా ఈ విధమైన భావమును వెల్లడి చేశారు.

*గద్యం : అథభీష్మమహారాజో రుక్మిణ్యాః స్వసుతాయా వివాహ మహోత్సవాయ వరమన్విష్యన్ స్వమంత్రిభిః కులవృద్ధైశ్చ సమం పర్యాలోచ్య వాసుదేవం వరం రోచయామాసకిల రుక్మీచ తద్వృత్తం జ్ఞాత్వా చైద్యపక్షత్వాత్సామర్షమువాచ అలమహో విచారేణ గోపాల వరకన్యాప్రదాన విషయేణ అయం హి జారచోరశిఖామణిః పరతంత్రో నాస్మత్కులోచిత వరఇతి రాజాపి పుత్రస్నేహ వశాత్త ద్రోచయామాస -3*

రుక్మిణి అన్నగారి చెడు ఆలోచన గుర్తించి రానున్న ప్రమాదం తలచుకొని అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణుని రప్పించి తన స్థితిని చక్రాయుధునకు విన్నవింపమని, ఆయనను ఇక్కడకు పిలుచుకురమ్మని, మరికొన్ని రహస్యమైన విషయాలు కూడా చెప్పి ఆ విప్రుని పంపింది. ద్వారకానగరానికి వెళ్ళిన బ్రాహ్మణుడు పరమ పురుషుని తిలకించి పెండ్లికుమారుడవు కమ్ము అని దీవించాడు. శ్రీకృష్ణుని చేత పూజితుడైన అగ్నిద్యోతనుడు

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 1 : పుట-486*
2. *పోతన భాగవతం, 10 : 1697 : పుట-392*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,12 : 5 : పుట-487*

రుక్మిణీ సందేశాన్ని తెలుప నారంభించాడు.

*ఉత్పలమాల :*

*అన్నతలంపు దానెఱిఁగి యన్నవనీరజగంధిలోన నా*
*పన్నత నొంది, యాప్తుడఁగు బ్రాహ్మణునొక్కనిఁ జీరి గర్వసం*
*ఛన్నుఁడు రుక్మినేఁడు ననుఁ జైద్యునకిచ్చెదనంచు నున్నవాఁ*
*డెన్ని విధంబులంజని బుధేశ్వర! చక్రికి విన్నవింపవే ! -1*

*కందం॥ అయ్యా! కొడుకు విచారము, లయ్యయు వారింపఁజాలఁడటుగాకుండన్*
*నెయ్యమెఱిఁగించి చీరుము, చయ్యన నిజసేవకానుసారిన్ శౌరిన్ ॥ -2*

*శ్లో॥ బ్రాహ్మణం బ్రహ్మవిద్వర్యం బ్రహ్మణ్యేవ పరాయణమ్*
*దృష్ట్వాతు లిఖితందత్వా తమాహానయవై హరిమ్ ॥ -3*

*శ్లో॥ లిఖిత్వా లిఖితం దత్తం విప్రహస్తే తు కన్యయా*
*గృహీత్వా లిఖితం విప్రస్త్వరయా ద్వారకాం యయౌ ॥ -4*

*శ్లో॥ సగత్వా ద్వారకాం రమ్యాం దృష్ట్వా గోపాలనందనం*
*విజ్ఞాపయామాస వచోరుక్మిణ్యా లిఖిత ద్విజః ॥ -5*

ఓ కంసాంతకా ! నీ యందు నా హృదయం లగ్నమయింది. ఇది నిజం కరుణతో కటాక్షింపుము.

*సీసం॥ ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక దేహతాపంబులు దీఱిపోవు*
*నేనీశుభాకార మీక్షింపఁగన్నుల కఖిలార్థలాభంబు గలుగుచుండు*
*నేనీచరణసేవ లేప్రొద్దు, జేసిన భువనోన్నతత్వంబు బొందఁగలుగు*
*నేనీలసన్నామమే ప్రొద్దుభక్తితోఁ దడవిన బంధసంతతులు వాయు*

*తే॥గీ॥ నట్టి నీ యందు నా చిత్తమనవరతము, నచ్చి యున్నది నీ యాననానలేదు*
*కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి !, శ్రీయుతా కార ! మానినీ చిత్తచోర ! -6*

---

1. *పోతన భాగవతం, 10 : 1698 : పుట-392*
2. *పోతన భాగవతం, 10 : 1699 : పుట-392*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 15 : పుట-502*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 16 : పుట-502*
5. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 17 : పుట-502*
6. *పోతన భాగవతం, 10 : 1704 : పుట-394*

వంశము, విద్య, చక్కదనము, జవ్వనము, మంచితనము, సంపద, బలము, దానము, పరాక్రమము, కారుణ్యము అనే గుణములతో అలరారుతున్నావు. సింహమునకు చెందవలసిన సొమ్ము నక్క వాంఛించినట్లు నన్ను మదోన్మత్తుడైన శిశుపాలుడు హరించడానికి యత్నిస్తున్నాడు.

ఉత్పలమాల :

*శ్రీయుతమూర్తి ! యోపురుషసింహమ ! సింహముపాలి సొమ్ము గో*
*మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీ పదాంబుజ*
*ధ్యాయినియైన నన్ను వడిఁదాఁగొని పోయెదనంచునున్న వాఁ*
*డాయధమాధముండెఱుఁగఁ డద్భుతమైన భవత్ప్రతాపమున్ ॥ -1*

పూర్వజన్మములో నే చేసిన పుణ్యఫలములచే శ్రీకృష్ణుడు నాకు ప్రాణేశ్వరుడౌతాడు. శిశుపాలుడు మొదలుగా గల నీచులు పరాజితులవుతారు. నీకు ఇక్కడ అడ్డమేమీ లేదు. రాక్షస వివాహ పద్ధతిలో నన్ను ఎత్తుకువెళ్ళు. నేను నీ వెంట రావడానికి సిద్ధంగా ఉన్నాను.

ఉత్పలమాల :

*అంకిలి సెప్పలేదు; చతురంగబలంబులతోడ నెల్లియో*
*పంకజనాభ ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా*
*వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే*
*యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ ! చేకొని పొమ్ము వచ్చెదన్ ॥ -2*

దుర్గగుడి వద్దకు మొక్కులు చెల్లించడానికి వచ్చిన నన్ను నిరాటంకముగా నీవు తీసుకొని వెళ్ళవచ్చును. నూరు జన్మలకైనా నీవే నా పతివి కావాలని నిన్నే ధ్యానిస్తూ నా ప్రాణాలు నీకే అర్పిస్తాను. ఇది నా మనోనిశ్చయం.

మత్తేభం :

*ఘనులాత్మీయ తమోనివృత్తి కొఱకై గౌరీశు మర్యాదనె*
*వ్వని పాదాంబుజ తోయమందు మునుఁగన్ వాంఛింతు రేనట్టి నీ*
*యనుకంపన్ విలసింపనేని వ్రతచర్యన్ నూఱుజన్మంబులన్*
*నినుఁజింతించుచుఁ బ్రాణముల్ విడిచెదన్ నిక్కంబు ప్రాణేశ్వరా ! -3*

నీ పాద పరిచర్యకు ఉపకరింపని ఈ జన్మ ఎన్ని జన్మలెత్తినా ఉపయోగం లేదు.

1. *పోతన భాగవతం, 10 : 1706 : పుట-395*
2. *పోతన భాగవతం, 10 : 1708 : పుట-395*
3. *పోతన భాగవతం, 10 : 1710 : పుట-396*

*సీసం॥ ప్రాణేశ ! నీ మంజు భాషలు వినలేని కర్ణరంధ్రంబుల కలిమియేల ?*

*పురుషరత్నమ! నీవు భోగింపఁగా లేని తనులతవలని సౌందర్యమేల ?*

*భువనమోహన ! నిన్నుఁ బొడగానఁగాలేని చక్షురింద్రియముల సత్త్వమేల ?*

*దయిత! నీ యధరామృతంబానఁగా లేని జిహ్వకు ఫలరససిద్ధియేల !*

*ఆ॥వె॥ నీరజాతనయన ! నీవనమాలికా, గంధమబ్బులేని ఘ్రాణమేల ?*

*ధన్యచరిత ! నీకు దాస్యంబు సేయని, జన్మమేల? ఎన్ని జన్మములకు ? -1*

అని ఈ విధంగా అగ్నిద్యోతనుడు రుక్మిణి సందేశం వినిపించి కర్తవ్యము ఏలినవారు ఆలోచించాలి అని పలికాడు.

*శ్లో॥ త్వత్ప్రసాదం పరం కాంక్షే కృష్ణ నాన్యంతుకామయే*

*మనసో వచసానూనం మత్పాణిగ్రహణం కురు -2*

'నన్ను వివాహం చేసుకొనుటకు మనసున సంకల్పింపుము' అని రుక్మిణి భావము.

*శ్లో॥ నాన్యం వృణేపతి మశేషగురో రనంతాత్*

*త్వత్తస్సమస్త గుణదామభిరాత్మతుల్యాత్*

*క్షేమంసదైవ గురుదేవ శిఖామణే త్వాం*

*యాచే త్వదంఘ్రికమలే ప్రణతాస్మినిత్యమ్ ॥ -3*

'నీవే నాకు తగిన విభుడవు. నీవు నన్ను పరిగ్రహించవలెను. ఈ విషయములో నేను నీ పాదపద్మములను యాచించుచున్నాను. నాకు శుభమును చేకూర్చుము' అని రుక్మిణి భావము.

కీర్తన : క్షేమం కురు సతతం గోపాల మమక్షేమం కురుసతతం

అ॥ప॥ కామంతవపాద కమలే భ్రమరీ భవతు శ్రీ

మన్మమమానసం మధుసూదన

*చరణం: అక్షీణ కరుణానిధే - ఆనందఘన ప్రక్షీణ దోషతతే*

*శిక్షితాసురగణ రక్షిత నిజజన*

కుక్షిస్థితానేక కోటిలోకావన - 4

---

1. *పోతన భాగవతం, 10 : 1711 : పుట-396*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 19 : పుట-505*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,12 : 20 : పుట-508*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 8 : పుట-509*

*చరణం: ప్రహ్లాదభయవిదూర పరమయోగి పావనభువనాధార*

*మోహరహితచిత్త మౌనిమానసహంస*

*సాహసహతవైరి సంఘ మహోదార*

*చరణం: అజిత విజయగోపాల అనంతలీల అద్భుత పద కమల*

*విజయద్వారకాపురీ విమలకమలాలోల*

*నిజనారాయణతీర్థ నిత్యానందబాల -1*

*శ్లో॥ గౌరీశంకర పూజార్థం యాత్రామేనగరాద్బహిః*

*యదాతదాహ్యవసరో భవతో మత్పరిగ్రహే ॥ -2*

*ఉత్పలమాల :*

*ఆయెలఁనాగ నీకుఁదగు; నంగనకుం దగుదీవు; మాయుపా*

*ధ్యాయుల యాన పెండ్లియగుఁ; దప్పదుఁ జాడ్యములేల? నీవు నీ*

*తోయము వారిఁ గూడుకొని తోయరు హాననఁదెత్తుగాని వి*

*చ్చేయుము; శత్రులన్ నుఱుము సేయుము; సేయుము శోభనం బిలన్ -3*

అగ్నిద్యోతనుడు రుక్మిణీదేవి సౌందర్యమును వర్ణించి మీ యిరువుర జంట అన్యోన్యమైనది. మీకు వివాహం జరిగితే లోకానికి మేలు చేకూరుతుంది అని పలికాడు.

అగ్నిద్యోతనుని మాటలు విన్న యదుకుల చక్రవర్తి అతని చేయి పట్టుకొని నవ్వుతూ యిలా అన్నాడు.

*కందం॥ వచ్చెద విదర్భ భూమికిఁ, జొచ్చెద భీష్మకుని పురము; సురుచిరలీలన్*

*దెచ్చెద బాలన్ వ్రేల్మిడి, వ్రచ్చెద నడ్డంబురిపులు వచ్చినఁబోరన్ ॥ -4*

*శ్లో॥ ఇతివిప్రముఖాచ్ఛ్రుత్వా రుక్మిణ్యాలిఖితం హరిః ।*

*ప్రత్యుత్తరం లిఖిత్వాథ తత్రగంతుం మనోదధే ॥ -5*

శ్రీకృష్ణుడు ప్రత్యుత్తరము వ్రాసి పంపెనని తీర్థుల వారి భావము.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 8 : పుట-509*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 21 : పుట-511*
3. *పోతన భాగవతం, 10 : 1714 : పుట-397*
4. *పోతన భాగవతం, 10 : 1717 : 39పుట-8*
5. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 22 : పుట-511*

శ్రీకృష్ణుడు అగ్నిద్యోతనునితో పాటు రథం మీద ఒకే రాత్రి పయనించి ఆనర్తకదేశాలు దాటి విదర్భకు వచ్చాడు.

అగ్నిద్యోతనుడు రుక్మిణీదేవి వద్దకు వెళ్ళి "తల్లీ! నీ అదృష్టం నేటికి ఫలించింది. శ్రీకృష్ణుడు వచ్చేశాడు" అని తెలుపగా రుక్మిణి ఆ బ్రాహ్మణునకు నమస్కారం చేసింది.

*ఉత్పలమాల :*

*మెచ్చె భవద్గుణోన్నతి; కమేయధనావళులిచ్చెనా నాకుఁ; దా*
*వచ్చె సుదర్శనాయుధుఁడు వాడె; సురాసురులెల్ల నడ్డమై*
*వచ్చిననైన రాక్షస వివాహమునం గొనిపోవునిన్ను; నీ*
*సచ్చరితంబు భాగ్యమును సర్వము నేఁడు ఫలించెఁ గన్యకా ! -1*

బలరామకృష్ణులు తన తనయ స్వయంవరానికి వచ్చారని తెలిసి భీష్మకుడు మంగళ వాయిద్యాలతో ఎదురేగి శాస్త్రోక్త విధానంతో వారిని పూజించాడు. శ్రీకృష్ణుడు అరుదెంచాడు అన్న వార్త తెలిసిన విదర్భ ప్రజలు ఆయన సౌందర్యమును ఆస్వాదిస్తూ "వీరిరువురు ఒకరికి ఒకరు తగి యున్నారు. చక్రాయుధుడు మా రాజకుమారిని పెండ్లి ఆడు గాక" అని పలికారు.

*మత్తేభం :*

*తగునీచక్రి విదర్భ రాజసుతకం; దధ్యంబువైదర్భియుం*
*దగు నీ చక్రికి; నింతమంచిదగునే? దాంపత్యమీయిద్దఱిం*
*దగులం గట్టిన బ్రహ్మ నేర్పరిగదా! దర్పాహతారాతియై*
*మగఁడౌగావుతఁ జక్రి యీ రమణికిన్ మా పుణ్యమూలంబునన్ ॥ -2*

రుక్మిణి ఆలయానికి వెళ్ళి గౌరీ శంకరులను భక్తితో ప్రార్థించింది. భవానిని అర్చించి ఆలయం నుండి వెడలింది. జగములను మోహింపజేయు శ్రీకృష్ణుని దర్శించింది. రుక్మిణీదేవిని పుండరీకాక్షుడు అవలోకించాడు. శత్రురాజ సమూహం చూస్తూ ఉండగానే అందరినీ తిరస్కరించి రుక్మిణిని రథమెక్కించుకొని బలరామ సహితుడై యాదవ సైన్యంతో ద్వారకానగరమార్గం పట్టాడు.

*శ్లో॥ గృహీత్వాపాణినాపాణిం రుక్మిణ్యాస్స్వరయాప్రభుః*
*ఆరోప్యస్యందనే భైష్మీంద్వారకాం ప్రస్థితో హరిః " -3*

తక్కిన భూపాలకులందరూ కృష్ణుని విక్రమాటోపం సహించలేక యాదవవీరులను వెంబడించి బాణాలతో కప్పివేయసాగారు. బలరాముడు మొదలైన యాదవవీరులు విజృంభించి యుద్ధం చేశారు. జరాసంధాది ప్రముఖులు భయపడి పారిపోతూ ఒకచోట చేరారు. బ్రతికి ఉంటే ఇంకొక భార్య వస్తుంది. ఇందుకొరకు బాధ చెందనవసరం లేదు అని శిశుపాలుని ఓదార్చారు.

---

*1. పోతన భాగవతం, 10 : 1736 : పుట-403*

*2. పోతన భాగవతం, 10 : 1740 : పుట-404*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 33 : పుట-524*

*ఆ॥వె॥ బ్రతుకవచ్చు నొడలఁబ్రాణంబులుండిన, బ్రతుకుగలిగెనేని భార్యగలదు;*

*బ్రతికితీవు భార్య పట్టుదైవమెఱుంగు, వగవ వలదు చైద్య! వలదు వలదు -1*

రాక్షస విధానంతో తన చెల్లిని ఎత్తుకుపోవడం సహించలేని అన్న రుక్మి కృష్ణుని వెంటాడుతూ వెళ్ళి నీ గర్వం సర్వం హరిస్తాను అని పలుకుతూ ఉండగానే కృష్ణుడు అతని శక్తిని దెబ్బతీశాడు. రుక్మి కత్తి బూని కమలాక్షుని సమీపించాడు. హరి ఒర నుండి ఖడ్గం తీసి రుక్మి తలను తెగ నరకడానికి వస్తుండగా రుక్మిణీదేవి అడ్డం వచ్చి మా అన్నను కాపాడమని ప్రాణేశ్వరుని పాదములు పట్టి వేడుకుంది. దేవకీ నందనుడు రుక్మిని ఖడ్గంతో ఖండింపక వెనుకకు మరలినాడు. బావా రమ్మని దగ్గరకు పిలిచి అతడిని పట్టి బంధించి అతని గడ్డం, మీసం, తల పాయలుగా గొఱిగి అతడిని కురూపిని గావించాడు. అప్పుడు రుక్మిణీదేవి శోకాన్ని బలరాముడు పోగొట్టాడు. ఈ విధంగా నారాయణుడు రుక్మిణిని తన పట్టణమునకు తోడ్కొని వచ్చాడు. శుభసమయంలో రుక్మిణిని శ్రీకృష్ణుడు పెండ్లి చేసుకొన్నాడు.

*శార్దూలం :*

*ధ్రువకీర్తిన్ హరిపెండ్లియాడె నిజచేతోహారిణిన్ మానవై*
*భవగాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధుభాం*
*ధవ సత్కారిణిఁ బుణ్యచారిణిఁ మహాదారిద్ర్య సంహారిణిన్*
*సువిభూషాంబరధారిణిన్ గుణవతీ చూడామణిన్ రుక్మిణిన్ ॥ -2*

*కీర్తన : ప॥ రుక్మిణీ కళ్యాణం సదా దృశ్యతాం*

*చరణం: కళ్యాణగోపాలం కరుణాలవాలం*
*మాల్యాలం కృతమీడే మదనగోపాలం*

*చరణం: అమరనారీగీతం ఆగమవిదితం*
*అమితభాగ్యోపేత మాశ్రయేఽనంతం*

*చరణం: సత్యకామాదిగుణం సకల జగత్కారణం*
*భృత్యసంరక్షణం భవబంధమోక్షణం*

*చరణం: మురళీసరళగానం మునిబృందాధీనం*
*శరణాగత పాలనం శరదిందువదనం*

*5. భవతిమిరఘనభానుం భక్తకామధేనుం*
*శివనారాయణ తీర్థ శీఘ్ర ఫలదానం -3*

---

*1. పోతన భాగవతం, 10 : 1760 : పుట-411*
*2. పోతన భాగవతం, 10 : 1784 : పుట-418*
*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 13 : పుట-541*

ఉత్తములు, మహానుభావులు, పరోపకార పరాయణులు, సమాజ శ్రేయస్సును ఆకాంక్షించే సహృదయుల ఆలోచనా విధానం ఒకటిగానే ఉంటుంది అనటానికి పోతన, నారాయణ తీర్థులు నిర్వహించిన శ్రీ కృష్ణ జననం ఆదిగా రుక్మిణీ కళ్యాణం వరకు సాగిన కథాభాగం మంచి ఉదాహరణ, ఈ కథా భాగాన్ని రచించడంలో పోతన, తీర్థులు అనుసరించిన విధానాన్ని సంక్షిప్తంగా పరిశీలించాను. ఇద్దరిలోనూ పెల్లుబికిన భక్తి భావం మనకు సుస్పష్టంగా కథా పరంగా కన్పిస్తుంది. దీనిని ఆస్వాదించిన వారిలో సైతం భక్తి భావం వెల్లివిరుస్తుందనటంలో సందేహం లేదు. పోతన తెలుగులోను, తీర్థులు సంస్కృతంలోను తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు అయితే తీర్థుల తరంగాలు కూడా పోతన పద్యాలలాగా తెలుగు వారిని ఆకర్షించి వారి ఆమోద ప్రమోదాలకు పాత్రం కావడం గమనార్హం. ఈ విధమైన కథారచన ద్వారా పోతన, తీర్థుల జీవితాలు భవ్యమయ్యాయి. మన జీవితాలు కూడా భక్తిభావజాలంతో ధన్యం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ విధంగా ఇద్దరి లోకోపకార దృష్టి ప్రశంసనీయం.


శ్రుతి స్మృతి పురాణానామాలయం కరుణాలయమ్
నమామి భగవత్పాద శంకరం లోకశంకరమ్ ॥
ఆది శంకరాచార్య

# అద్వైతము

భారతీయ వేదాంతంలో అనేక మత సిద్ధాంతాలు వెలసి ఒకదానినొకటి ఖండించుకుంటూ అనేక తర్క వితర్కాలతో తమ తమ మతాలను స్థిరపరచుకోవడానికి ప్రయత్నం చేశాయి. స్థూలంగా అవి 3 ప్రధాన సిద్ధాంతాలుగా స్థిరపడ్డాయి. (1) అద్వైతం, (2) ద్వైతం, (3) విశిష్టాద్వైతము వీటిలో అద్వైత సిద్ధాంతం వేద ప్రామాణికంగా ఎక్కువ యుక్తియుక్తంగా ప్రతిపాదించబడింది. బాదరాయణుడు (వ్యాస మహర్షి) బ్రహ్మసూత్ర గ్రంథాన్ని ఆవిష్కరించడంతో పై మూడు మతాలు వ్యాప్తిలోనికి వచ్చాయి.

ద్వైతం జీవేశ్వరులు వేరు వేరు తత్త్వాలని నిరూపించడానికి ప్రయత్నం చేసింది. విశిష్టాద్వైతం జీవతత్త్వం ఈశ్వరతత్త్వం నుండే ఆవిర్భవించిందని, ఈశ్వరునకు వలెనే జీవునకు సమాన లక్షణాలు ఎన్ని ఉన్నా కొన్ని అవలక్షణాలు కూడా ఉన్నాయని, ఈశ్వరుడు కళ్యాణ గుణ విశిష్టుడని, జీవుడు భక్త్యాది సాధనల ద్వారా తనలో ఉన్న చెడు లక్షణాలను తొలగించుకొని ఈశ్వర భావాన్ని పొందుతాడని, అలా పొందినా ఈశ్వరునకు గల సృష్టి స్థితి లయ శక్తులను సాధించలేడని ప్రధానంగా యీ మతం బోధిస్తుంది.

అద్వైతం బ్రహ్మమొకటే సత్యము. జగత్తంతా మిథ్య. సత్యం పారమార్థిక, వ్యావహారిక, ప్రాతిభాసిక భేదాలతో ఉంటుంది. బ్రహ్మపదార్థం పారమార్థిక సత్యం. జీవుడు చేసే జగద్వ్యాపారమంతా వ్యావహారిక సత్యం. భ్రాంతి మూలకం ప్రాతిభాసిక సత్యం. భ్రాంతి ఒక వస్తువునందు గల సహజ లక్షణాన్ని వేరొక లక్షణంగా భ్రమను కలిగిస్తుంది. దీనికి సర్పరజ్జు భ్రాంతి ఒక ఉదాహరణ. చీకటిలో రజ్జువును చూసి సర్పంగా భావించడం. అలాగే సర్పాన్ని చూసి రజ్జువుగా భావించడం జరుగుతుంది. చీకటి తొలగిపోగానే అది రజ్జువే కానీ సర్పం కాదని తెలియడం ద్వారా భ్రాంతి తొలగిపోతుంది. అలాగే బ్రహ్మవస్తువు నందు జీవుడు భ్రాంతితో జగత్స్వరూపాన్ని చూస్తాడు. ఇది అజ్ఞానం వలన కలుగుతుంది. జ్ఞానోదయం కాగానే బ్రహ్మవస్తువు సత్యపదార్థంగాను, జగద్వస్తువు అసత్య పదార్థంగాను తెలుస్తుంది. అనగా ఒకటి మరొకటిగా ప్రతిభాసించే అవస్థ తొలగిపోతుంది. కాబట్టి యీ ప్రాతిభాసిక సత్యం స్థిరం కాదు.

వ్యావహారిక సత్యం కూడా నిత్యం కాదు. భ్రాంతి జనకమే. జాగ్రదవస్థలో నడిచే ప్రపంచమంతా సత్యం అనుకుంటాం. కానీ స్వప్నావస్థలో అది తన ఉనికిని కోల్పోతోంది. అయితే జాగ్రద్దశలోని వాసనలు జీవుని ఆత్మకు అంటే కొన్ని కల్పనలు స్వప్న రూపంలో మెదలుతూ ఉంటాయి. సుషుప్తిలో యీ వాసనలు కూడా లయించి ఒక్క ఆత్మయే మిగిలి యుండి ఒకానొక ఆనందాంశ అనుభవమవుతుంది. ఇదే ఆత్మ యొక్క సహజస్థితి. జ్ఞానాభ్యాసం చేత ఈ మూడు అవస్థలలో ఉన్న తత్త్వాన్ని పరిశీలించి సుషుప్తిలో జీవుడు పొందే ఆత్మానంద స్థితిని జాగ్రదవస్థలో కూడా పొందే దశకు చేరుకోవాలని ఈ అద్వైత సిద్ధాంతం ఘోషిస్తోంది.

సత్యవస్తువు జీవునకు అనుభవంలోనికి రాకపోవడానికి కారణం మాయ అని యీ అద్వైతవాదులు అంటారు. మాయ అంటే భ్రాంతి అని స్థూలంగా అర్థం. ఇది ఈశ్వరుని యొక్క శక్తియే. కానీ ఈశ్వరునకు మాయ అంటదు. ఈశ్వరుని మాయ జీవునకు సంక్రమిస్తుంది. ఈశ్వరునిపరంగా చెప్పబడే యీ మాయనే జీవపరంగా అవిద్య అంటాము. ఈ మాయ ప్రపంచ హేతువు. అది ఈశ్వరుని సగుణబ్రహ్మరూపము. దీనిచే ఈశ్వరుడు జగత్సృష్టికర్త అగుచున్నాడు.

మాయా స్వరూపాన్ని శంకరులు 'వివేక చూడామణి'లో యిలా నిర్వచించారు.

*అవ్యక్తనామ్నీ పరమేశ శక్తిః । అనాద్యవిద్యా త్రిగుణాత్మికాపరా ।*
*కార్యానుమేయా సుధియైవమాయా యయా జగత్సర్వమిదం ప్రసూయతే ॥ -1*

అవ్యక్తమనే పేరు గల పరమేశ్వరుని యొక్క శక్తియే మాయ. దీనికే అవిద్యా అని కూడా పేరు. ఇది అనాది. సమస్త కార్యజాతానికి పరమైనదై సత్త్వరజస్తమోగుణ విశిష్టమైన తత్త్వజ్ఞాతలకు కార్యజాతాన్ని బట్టి ఊహింపదగినదై చరాచర ప్రపంచ సృష్టి హేతువై ఉన్నది అని భావము.

దీనినే మరికొంత వివరిస్తూ ఆయన యింకా యిలా అన్నారు.

*సన్నాప్యసన్నాప్యుభయాత్మికానో*
*భిన్నాప్యభిన్నా ప్యుభయాత్మికానో*
*సాంగాప్యనంగా ప్యుభయాత్మికానో*
*మహాద్భుతా నిర్వచనీయ రూపా ॥ -2*

మాయ సద్రూపము కాదు. అసద్రూపము కాదు. అనగా అజ్ఞానులకు కనబడేది. జ్ఞానులకు కనబడనిది. సదసద్రూపమూ కాదు. (కాబట్టే ఇది అవ్యక్తము). చైతన్యము కంటే భిన్నము కాదు. చైతన్యాభిన్నము కాదు. అంగ సహితము కాదు. అంగరహితము కాదు. ఇది మహాద్భుతమైనది. అనిర్వచనీయమైనది అని భావము.

సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపకుడు అయిన ఈశ్వరుడు మాయాసహితుడై హిరణ్యగర్భుడు అని చెప్పబడుచున్నాడు. ఈ దశలోనే అతడు సృష్టి క్రియ జరుపును. అంతకు ముందు ఆయన సర్వతంత్ర స్వతంత్రుడైన పరబ్రహ్మము. హిరణ్యగర్భుడే స్థూల, సూక్ష్మ కారణ శరీరములుగా ప్రకృతిలోని చరాచర ప్రపంచాన్నంతటినీ సృష్టిస్తున్నాడు. ఇలా బ్రహ్మమునకు పరిచ్ఛిన్నత్వము కలుగుచున్నది. కాబట్టే సృష్టి అంతా వేరు వస్తువుగా కనబడి ద్వైత భావానికి దారి తీస్తున్నది. బ్రహ్మము యొక్క అపరిచ్ఛిన్నత్వాన్ని గుర్తించుటయే మానవ జీవిత లక్ష్యం. మోక్షమంటే అదే.

---

1. శంకరాచార్యులు, వివేకచూడామణి, శ్లోకం-110, పుట-71
2. శంకరాచార్యులు, వివేకచూడామణి, శ్లోకం-111, పుట-72

జీవ బ్రహ్మైక్య సిద్ధియే మోక్షము. దీనినే కైవల్యం అంటారు. ఇది జ్ఞానం చేత మాత్రమే సిద్ధించేది. సారూప్య, సాలోక్య, సామీప్య, సాయుజ్య, భేదాలతో ఇతర మతాల చేత నిర్వచించబడ్డ ముక్తి కంటే ఈ కైవల్య ముక్తి అతీతమైనది. ఇందు జీవుడు బ్రహ్మాకారాన్ని పొంది కేవల సత్తా రూపంతో నిలిచి ఉంటాడు. ఈ స్థితిని శంకరులు వివేక చూడామణిలో చక్కగా వర్ణించారు.

*జాతి నీతి కులగోత్ర దూరగం*

*నామరూప గుణదోష వర్జితం ।*

*దేశకాల విషయాతి వర్తియత్*

*బ్రహ్మతత్త్వమసి భావయాత్మని ॥ -1*

పరబ్రహ్మము మనుష్య పశ్వాది జాతితో కానీ, కర్తవ్య అకర్తవ్యాది నీతితో కానీ, బ్రాహ్మణ క్షత్రియాది కులాలతో కానీ, కశ్యపాది గోత్రాలతో కానీ సంబంధము లేనిది. నామరూపాలతో పరిచ్ఛిన్నము కానిది. దేశ కాలాలకు అతీతమైనది. ఆ బ్రహ్మనివి నీవే అని భావము.

జీవుడు (మానవుడు) బుద్ధి గుహ యందు భాసమానుడయ్యే సదసద్విలక్షణము, త్రికాలాబాధ్యము, అద్వితీయము, పరమార్థ సత్యము అయిన ఆ బ్రహ్మమును నిరంతర ధ్యానాదులచే, తత్త్వ విచారణచే తెలుసుకొని చివరకు బ్రహ్మముగా మారిపోతాడని కూడా శంకరులు చెప్పారు.

*బుద్ధౌ గుహాయాం సదసద్విలక్షణం*

*బ్రహ్మాస్తి సత్యం పరమ ద్వితీయం*

*తదాత్మనా యోఽత్రవసేద్గుహాయాం*

*పునర్నతస్యాఙ్గ గుహాప్రవేశః ॥ -2*

అది కాని దాని యందు 'అది' అనెడి భ్రాంతికే 'అధ్యాస' అని పేరు. దీనిని అభ్యాస వైరాగ్యాలతో తొలగించు కోవాలి అంటూ దానికి మార్గాన్ని శంకరులు యిలా చెప్పారు.

*లోకానువర్తనంత్యక్త్వా*

*త్యక్త్వాదేహానువర్తనం*

*శాస్త్రానువర్తనం త్యక్త్వా*

*స్వాధ్యాసాపనయంకురు -3*

---

1. శంకరాచార్యులు, వివేకచూడామణి, శ్లోకం-255, పుట-140
2. శంకరాచార్యులు, వివేకచూడామణి, శ్లోకం-267, పుట-146
3. శంకరాచార్యులు, వివేకచూడామణి, శ్లోకం-271, పుట-148

మానవునికి మూడు వాసనలు (గతజన్మల సంస్కారాలు) ఈ జన్మకు సంక్రమిస్తాయని అవి (1) లోకవాసన (2 దేహవాసన (3) శాస్త్రవాసన అనే రూపంలో ఉన్నాయని వానిని విడిచిపెట్టి తత్త్వవిచారణ ద్వారా మోక్షాన్ని సాధించాలని శంకరుల వారి తాత్పర్యం.

బ్రహ్మస్వరూపాన్ని శంకరుల వారు యిలా నిర్వచించారు.

*కిమపిసతత బోధం కేవలానంద రూపం*
*నిరుపమ మతి వేలం నిత్యముక్తం నిరీహం ।*
*నిరవధిగగనాభం నిష్కలం నిర్వికల్పం*
*హృదికలయతి విద్వాన్బ్రహ్మ పూర్ణం సమాధౌ ॥ -1*

*ప్రకృతి వికృతి శూన్యం భావనాతీత భావం*
*సమరస మసమానం మానసంబన్ధదూరమ్*
*నిగమవచనసిద్ధం నిత్యమస్మత్ప్రసిద్ధమ్*
*హృదికలయతి విద్వాన్బ్రహ్మ పూర్ణం సమధౌ ॥ -2*

*అజరమమరమస్తా భాస వస్తు స్వరూపం*
*స్తిమిత సలిల రాశి ప్రఖ్యామాఖ్యా విహీనమ్ ।*
*శమిత గుణవికారం శాశ్వతం శాన్తమేకం*
*హృదికలయతి విద్వాన్బ్రహ్మ పూర్ణం సమధౌ ॥ -3*

అఖండ బోధ స్వరూపము, దుఃఖమిశ్రము కాని ఆనంద స్వరూపము, ఎంత మాత్రమును సాటిలేనిది, సంసార బంధము లేనిది కనుక దేనిని కోరనిది, హద్దు లేనిది, ఆకాశము వలె నిరాకారము, అవయవ రహితము, ఇట్టిదా అట్టిదా అని శంకింపతగనిది, కార్యకారణాతీతము, ఊహకు అందని సత్తా మాత్రము, జాతిగోత్రాది భేదము లేని నిత్యానంద రూపము, సజాతీయ వస్త్వంతరము లేమిచే సాటిలేనిది, నిందా గౌరవములు కాని, తూకము గాని, కొలత గాని లేనిది, ఉపనిషద్వాక్యగోచరము, జననమరణాది వికారములు లేనిది "యుష్మదస్మత్ప్రత్య గోచరయోః" అని చెప్పబడిన అస్మత్ప్రత్యయ రూపము (నేననెడి శుద్ధ జ్ఞానరూపము) జరామరణ రహితము, కల్పిత వస్తు శూన్యముగ వాస్తవమైనది. నిస్తరంగ సముద్రము వలె గంభీరమైనది, కల్పితనామము లేనిది, రాజసాది గుణవికార శూన్యము, కాలత్రయా బాధ్యము కల్పిత వికార రహిత వాస్తవ రూపము అని భావము.

---

1. శంకరాచార్యులు, వివేకచూడామణి, శ్లోకం-409, పుట-207
2. శంకరాచార్యులు, వివేకచూడామణి, శ్లోకం-410, పుట-207
3. శంకరాచార్యులు, వివేకచూడామణి, శ్లోకం-411, పుట-207, 208

స్వామి వివేకానంద అమెరికాలో పర్యటిస్తూ ఒకానొక సభలో ప్రసంగించిన ఉపన్యాసములో అద్వైతానుభూతిని గురించి యిలా వివరించారు.

"Know the truth and be free in a moment". All the darkness will then vanish. When man has seen himself as one with the infinite being of the universe, when all seperateness has ceased, when all men and women, all gods and angels, all animals and plants, and the whole universe have melted into that oneness, then all fear disappears. Can I hurt myself? Can I kill myself? Can I injure myself? Whom to fear? Can you fear yourself? Then will all sorrow disappear what can cause me sorrow? Iam the one existence of the universe. Then all jealousies will disappear; of whom to be jealous? Of myself? Then all bad feelings disappear. Against whom can I have bad feeling? Against myself? There is none in the Universe but I. and this is the one way, says the vedantist to knowledge. Kill out this differentiation, kill out this superstition that there are many. "He who in this world of many sees that one, he who in this mass of insentiency sees that one sentinent being, he who in this world of shadows catches that reality, unto him belongs enternal peace, unto none else, unto none else".

## 1. శ్రీ కృష్ణావతార ఘట్టము

భారాన్ని భరించలేని భూదేవి బ్రహ్మదేవుని వేడుకొనగా ఆయన భూదేవి, దేవతలను వెంటబెట్టుకొని విష్ణు దర్శనార్థం బయలుదేరడము, పురుషసూక్తం పఠించి సమాధినిష్ఠలో ప్రవేశించగా వినబడిన విష్ణు మాటన వారితో చెప్పి వారిని పంపివేయడము పోతన భాగవతంలో కనబడుతోంది. అయితే తీర్థుల వారి తరంగిణిలో బ్రహ్మాదులకు విష్ణువు ప్రత్యక్షమైనట్లు కనబడుతుంది.

**విష్ణుస్తుతి :** బ్రహ్మాదులకు ప్రత్యక్షమైన విష్ణువును తీర్థుల వారు వర్ణించిన తీరు అద్భుతము

గద్యము : అథ భగవాన్ అపరిమిత చిదానంద సత్యపరిపూర్ణః – అనాద్య నిర్వచనీయాచింత్యశక్తిః – మాయావిలసిత లోకానుజిఘృక్షయా పరిగృహీత దివ్యమంగళ విగ్రహమూర్తిః – శ్రీమన్నారాయణః – క్షీరాబ్ధౌ శేషపర్యంక శయానో – మహానసౌ సదాऽऽస్తే. దామేవ మాసురభారభరాక్రాంతా గోరూపధారిణీ ధరణీ – సురపతి ముఖసుర పరివేష్టితా సతీ – అనన్యశరణా – శరణమాజగామ *-2*

శ్రీమహావిష్ణువు అపరిమిత చిదానంద సత్యపరిపూర్ణుడు. దీనినే కైవల్యోపనిషత్ స్పష్టము చేస్తూ మరింత విస్తృతముగా వర్ణించినది.

---

1. స్వామి అనన్యానంద, ఎబ్రిడ్జ్ ఎడ్యుకేషన్ ఆఫ్ వర్క్స్ ఆఫ్ వివేకానంద, పుట–148
2. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 1 : 21 : పుట–26

*మంత్రము :*

*అచింతమవ్యక్తమనంతరూపం, శివం ప్రశాంతమమృతం బ్రహ్మయోనిమ్*

*తదాది మధ్యాంత విహీనమేకం, విభుం చిదానందమరూపమద్భుతమ్ ॥ -1*

పదమూడు విశేషణాలతో పరమసత్యమైన పరమాత్మ తత్త్వాన్ని సూచిస్తున్నాడు. అచింత్యము, అవ్యక్తము, అనంతము, శుభకరము, ప్రశాంతము, అమృతరూపము, బ్రహ్మకు కూడా కారణమైనది. ఆదిమధ్యాంత రహితము, ఏకము, సర్వవ్యాపి, చిదానందము, అరూపము, అద్భుతము. భగవంతుడు అనాది, అనిర్వచనీయుడు, అచింత్యుడు, శక్తిస్వరూపుడు.

**ఎ) అనాది :** భూత భవిష్యత్ వర్తమాన కాలముల యందు చెదరకుండా ఎల్లప్పుడూ స్థిరముగా ఉండునటువంటి ఆ పరమాత్మ సనాతనుడు.

*మంత్రము :*

*స ఏవ సర్వం యద్ భూతం, యచ్చభవ్యం సనాతనమ్ ।*

*జ్ఞాత్వాతం మృత్యుమత్యేతి, నాన్యఃపంథా విముక్తయే ॥ -2*

**బి) అనిర్వచనీయుడు :** అగ్ని, నీరు, మొక్క, మాను యిలా యావద్విశ్వము యొక్క అన్ని పరిణామాల వెనుక ఉన్నది ఆ దివ్యత్వమే.

*శ్లో॥ యోదేవో అగ్నౌయోఽప్సుయోవిశ్వం భువనమావివేశ ।*

*యఓషధీషు యోవనస్పతిషుతస్మైదేవాయ నమోనమః ॥ -3*

***సి) అచింత్యుడు :*** అపరిమితము, తేజోమయము, ఊహాతీతము, సూక్ష్మాతిసూక్ష్మము, దూరాతిదూరము అయిన ఆ ఆత్మను మహాత్ములు ఈ జన్మలోనే దర్శిస్తారు.

*బృహచ్చతద్ దివ్యం అచిన్త్యరూపమ్, సూక్ష్మాచ్చతత్ సూక్ష్మతరం విభాతి ।*

*హధాత్ సుదూరే తదిహాన్తికే చ, పశ్యత్సు ఇహైవ నిహితం గుహాయాం ॥ -4*

***శక్తిస్వరూపుడు :*** పైన, అడ్డము, మధ్యలలో అతనిని ఎవరూ పట్టుకోలేరు. అతనికి సమానులు ఎవరూ లేరు.

---

1. *కైవల్యోపనిషత్, 1 : 6 : పుట-22*
2. *కైవల్యోపనిషత్, 1 : 9 : పుట-232*
3. *శ్వేతాశ్వతరోపనిషత్, 2 : 17 : పుట-248*
4. *ముండకోపనిషత్తు 3 : 7 : పుట-264*

*నైనమూర్ధ్వం న తిర్యంచనమధ్యే పరిజగ్రభత్ ।*

*నతస్యప్రతిమాఅస్తి యస్యనామమహద్యశః ॥ -1*

భగవంతునికి ఎవడూ యజమాని లేడు. అన్నింటికీ కారణం అతడే. జీవాత్మలకు పాలకుడూ అతడే. అతడికి జనకుడు లేడు. ప్రభువు లేడు అని భావము.

*నతస్యకశ్చిత్ పతిరస్తిలోకే న చేశితానైవచ తస్యలింగమ్ ।*

*స కారణం కరణాదిపాధిపో న చాస్య కశ్చిజ్జనితా నచాధిపః ॥ -2*

"మాయావిలసిత లోకానుజిఘృక్షయా పరిగృహీత దివ్యమంగళ విగ్రహమూర్తిః" తన మాయచే సృష్టింపబడ్డ లోకాలను అనుగ్రహించడానికి స్వీకరించబడిన దివ్యమంగళ విగ్రహము కలవాడు శ్రీమన్నారాయణమూర్తి.

అద్వితీయమైన పరమసత్త తన అజ్ఞేయమైన మాయాశక్తితో వివిధములైన శక్తులను సంతరించుకొని జగత్ప్రభువుగా ఈశ్వరునిగా కనిపిస్తుంది. ఈ సత్తను సాక్షాత్కరించుకున్నవారు అమరులవుతారు.

*య ఏకోజాలవానీశత ఈ శనీభిః, సర్వాంల్లోకానీశత ఈ శనీభిః*

*ఏవైక ఉద్భవే సంభవేచ, య ఏతద్ విదురమృతాస్తే భవంతి -3*

నా భారమును హరింపుము అని భూదేవి విష్ణువును శరణు వేడుకొన్న సందర్భంలోనే బ్రహ్మాది దేవతలు కూడా నారాయణుని స్తుతించుచున్నారు.

శ్లో॥ క్షీరాబ్ధిమధ్యే భుజగేంద్రమహాసనాయ
దేవాయనాభికమలోదితపద్మజాయ
యోగీంద్రభావ్య గగనామలనిత్యబోధ
భూమాభిదాయ పురుషాయ నమః పరస్మై -4

పై శ్లోకంలో కవి 'భూమ' పదం వాడడం చేత భగవంతుని సర్వవ్యాపకత్వమును సూచించుచున్నది.

*'యత్రనాన్యత్ పశ్యతి, నాన్యత్శృణోతి నాన్యత్విజానాతి స భూమా ! అథ*

*యత్ర అన్యత్ పశ్యతి, అన్యత్ శృణోతి, అన్యత్ విజానాతి తత్ అల్పమ్। -5*

---

1. *శ్వేతాశ్వతరోపనిషత్, 4 : 19 : పుట-81*
2. *శ్వేతాశ్వతరోపనిషత్, 6 : 9 : పుట-102*
3. *శ్వేతాశ్వతరోపనిషత్, 3 :1 : పుట-49*
4. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 1 : 26 : పుట-36
5. *ఛాందోగ్యోపనిషత్, 1వ మంత్రం, 24వ ఖండం, 7వ అధ్యాయం, పుట-248*

దేవదేవుడు దేవకీ గర్భాన ఉదయించి దేదీప్యమానముగా ప్రకాశించుచుండగా బ్రహ్మాదిదేవతలు స్తుతించారు.

బ్రహ్మాదుల ప్రార్థనలో విష్ణువు యొక్క స్తుతియే కాక పెక్కు వేదాంత విషయాలు కూడా చెప్పబడ్డాయి. సంసారాన్ని వృక్షంతో పోలుస్తూ పోతనగారు యిలా అంటారు.

*సీసం॥ ప్రకృతి యొక్కటిపాదు, ఫలములు సుఖదుఃఖములు రెండు గుణములు మూఁడు వేళ్ళు,*
*తగు రసంబులు నాల్గు ధర్మార్థముఖరంబు లెఱిఁగెడి విధములై దింద్రియంబు*
*లాఱు స్వభావంబు లాశోకమోహాదులూర్ములు, ధాతువులొక్కయేడు*
*పై పొరలెనిమిది ప్రంగలు, భూతంబులైదు బుద్ధియు మనోఽహంకృతులును*

*తే॥గీ॥ రంధ్రములు దొమ్మిదియుఁగోటరములు, ప్రాణపత్త్ర దశకంబు, జీవేశ పక్షియుగము*
*గలుగు సంసార వృక్షంబు గలుగఁజేయుఁ, గావ నడఁగింప రాజవొక్కరుఁడ వీవ ॥ –1*

జీవులందరకూ యీశ్వరుడవు నీవు. ఈ సృష్టిలో సంసార వృక్షానికి ప్రకృతి పాదు, ఫలములు, సుఖదుఃఖాలు, వేళ్ళు సత్త్వరజస్తమస్సులు. రసములు ధర్మార్థ కామమోక్ష పురుషార్థములు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులైదు ఇంద్రియాలు గ్రహించే విధానాలు. ఆ వృక్షానికి గల ఆరు ఊర్ములు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు. రస, రక్త, మాంస, మేధ, అస్థి, మజ్జ, శుక్రములనే ఏడు ధాతువులు ఆ వృక్షానికి గల 7 పొరలు. పంచభూతాలు, బుద్ధి, మనస్సు, అహంకారము అనే ఎనిమది కొమ్మలు ఆ వృక్షానికి ఉన్నాయి. కన్నులు, చెవులు, ముక్కుపుటాలు, నోరు, మలమూత్ర ద్వారములు అనే తొమ్మిది ఆ వృక్షానికి గల తొమ్మిది రంధ్రములు. ప్రాణాపాన వ్యానోఽదాన సమానములనే పంచప్రాణములు. నాగ, కూర్మ, క్రుకుర, దేవదత్త, ధనంజయములనే ఉపప్రాణాలు ఐదు మొత్తం పది ప్రాణాలు అనే ఆకులు ధరించి ఉంటుంది.

జీవుడు, ఈశ్వరుడు అనే రెండు పక్షులు ఆ వృక్షంపై నివశిస్తూ ఉంటాయి. ఇటువంటి అద్భుత సంసార వృక్షాన్ని పుట్టించటానికి, రక్షించడానికి, మళ్ళీ లయం చేయడానికి ప్రభువు నీవొక్కడవే అనటం చేత వేదాంతార్థం ద్యోతకమవుతోంది.

తీర్థుల వారు ఈ సందర్భాన్ని రూపసౌందర్యవర్ణనముగా మలచడం గమనార్హం. ఇందులో అద్వైతం గోచరించదు.

శంకరాచార్యుల వారి వివేకచూడామణి కూడా పై భావాన్నే విశదపరుస్తుంది.

---

*1. పోతన భాగవతం, 10 : 91 : పుట–18, 19*

*శ్లో॥ బీజం సంసృతి భూమిజస్యతుతమో దేహాత్మ ధీరంకురో*
*రాగః పల్లవమంబు కర్మతువపుః స్కన్ధోకసవః శాఖికాః ।*
*అగ్రాణీంద్రియ సంహతిశ్చ విషయాః పుష్పాణి దుఃఖం ఫలం*
*నానాకర్మ సముద్భవం బహువిధం భోక్తాత్ర జీవః ఖగః ॥ -1*

పోతన భాగవతంలో దేవకి గర్భస్థుడైన విష్ణువును బ్రహ్మాది దేవతలు స్తుతించారు. తీర్థుల వారి గ్రంథములో మాత్రము విష్ణువు జన్మ తరువాత బ్రహ్మాది దేవతలు స్తుతించారు. ఇది గమనార్హము.

**వసుదేవుని స్తుతి :**

దివ్యలక్షణాలతో పూర్ణచంద్రుని కాంతులు చిమ్ముతూ ఉన్న ఆ బాలుని చూసి వసుదేవుడు యీ పాపడు సాక్షాత్తు విష్ణువే అని భావించి భక్తితో సాష్టాంగపడి నమస్కారం చేసి ఆ బాలుని దివ్యచరిత్రలన్నీ తలుచుకొని పొగుడుతున్న సమయంలో జ్ఞానానంద స్వరూపుడు, సంతతుడని వసుదేవుని ప్రార్థన రూపంగా పోతనగారు వాడారు.

*కందం॥ ఏ నిన్ను నఖిలదర్శను, జ్ఞానానందస్వరూపుసంతతునపరా*
*ధీనుని మాయాదూరుని, సూనునిఁగాఁగంటి నిట్టిచోద్యముగలదే ? -2*

ఇది "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" -3
అన్న ఉపనిషద్వాక్యానికి వ్యాఖ్య.

అంతేకాకుండా నీ మాయతో సత్త్వరజస్తమోగుణాలను విస్తరింపజేసి వాటి వలన జగత్సృష్టి కారకుడవయ్యావు. త్రిగుణాలు నీలో ఉండటం చేత నీవు సృష్టిలో ప్రవేశించడం ఉండదు. అలా అని ప్రవేశించకపోవడము ఉండదు అంటూ వసుదేవుడు పలికాడు.

*కందం॥ అచ్చుగ నీ మాయనుమును, జెచ్చెరఁద్రిగుణాత్మకముగఁజేసిన జగముం*
*జొచ్చినక్రియఁజొరకుందువు, చొచ్చుటయును లేదు లేదు చొరకుండుటయున్ -4*

ఈ సందర్భంలో భగవద్గీతలోని

*దైవీ హ్యేషాగుణమయీ మమమాయా దురత్యయా ।*
*మామేవ యేప్రపద్యంతే మాయామేతాంతరంతితే ॥ -5*

---

1. *శంకరాచార్యులు, వివేక చూడామణి, 147 : పుట-89*
2. *పోతన భాగవతం 10 : 117 : పుట-24*
3. *తైత్తరీయోపనిషత్, బ్రహ్మానందవల్లీ, మొదటి అనువాకం, పుట-72*
4. *పోతన భాగవతం 10 : 118 : పుట-25*
5. *వ్యాసమహర్షి, భగవద్గీత, 7 : 14 : పుట-187, 188*

అన్న విజ్ఞానయోగంలో చెప్పబడిన యీ శ్లోకం త్రిగుణాత్మక మాయతో జగత్సృష్టి జరిగిన విషయం అద్వైతపరంగా పోతనగారి భావనతో అనుసంధింపబడింది.

ఈ సందర్భంలోనే పోతనగారు వసుదేవుని పలుకుల రూపంలో

*సీసం॥ అదియునెట్లన మహదాదులంబోలెడిద్రై వేఱువేఱయియెయన్నివిధము*
*లగు సూక్ష్మభూతంబులమరషోడశ వికారములతోఁగూడి విరాట్టనంగఁ*
*బరమాత్మునకు నీకు బఱపైన మేను సంపాదించి యందులోఁ బడియు బడక*
*యుండు సృష్టికిమున్నయున్న కారణమున వానికిలోని భవంబుగలుగ*

*ఆ॥వె॥ రట్లబుద్ధినెఱుఁగ ననువైన లాగునఁ, గలుగు నింద్రియముల కడల నుండి*
*వాని పట్టులేకవరుస జగంబులఁ, గలిసియుండి యైనఁగలయవెపుదు -1*

ఇక్కడ పరమాత్మకు 'విరాట్' అనే సంజ్ఞ కలదని,
అద్వైతపరంగా అన్వయించడం చేత యిది 'ఇంద్రియాణి పరాణ్యాహుః' -2
అన్న ఉపనిషత్ మంత్రానికి వ్యాఖ్యానంగా సాగింది.

అన్ని భూతములయందును పరమాత్మ ఉన్నాడు. అన్ని భూతములు పరమాత్మలోనే ఉన్నవి అన్న వాసుదేవ తత్త్వాన్ని కూడా పోతనగారు నిరూపించారు.

*కందం॥ సర్వము నీలోనిదిగా, సర్వాత్ముడు, వాత్మవస్తుసంపన్నుఁడవై*
*సర్వమయుఁడవగు నీకును, సర్వేశ్వర ! లేవులోను సంధులు వెలియున్ -3*

తిక్కన గారి భారతంలో కూడా వాసుదేవ శబ్దానికి నిర్వచనం కనబడుతుంది.

భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించడం

*సీసం॥ శుచియును హంసుండు శుచిషత్తుఁబరముండుఁ*
*బరమేషియునునగు భవ్యుఁగొలుతు;*
*మునులును సురలు నెవ్వనియున్న రూపెఱుం*
*గరు సర్వవిదుని నప్పు రుషుఁగొలుతు;*
*శ్రుతులు సెప్పఁగ మహామతులు దుఃఖౌషధం*
*బుగ నెఱింగెడు పుణ్యమూర్తి ఁగొలుతు*
*లోకంబులెల్లఁ గల్గుట నిల్చుటొదుఁ గుట*
*తనయంద యగు మహోత్తరునిఁ గొలుతు -4*

---

1. *పోతన భాగవతం 10 : 119 : పుట-25*
2. *వ్యాసమహర్షి, భగవద్గీత, 3 : 42 : పుట-114*
3. *పోతన భాగవతం 10 : 120 : పుట-25*
4. *శ్రీమదాంధ్ర మహాభారతం, శాంతిపర్వం, ద్వితీయాశ్వాసం 20 : పుట-178*

*తే॥గీ॥ పక్షి రత్నచయంబు పుష్పవ్రజంబుఁ*
*బంజరము త్రాడు నార యుపాశ్రయముగ*
*నుండుచాడ్పున విశ్వంబు నుండుటకు సు*
*భాస్పదంబగు పుండరీకాక్షుఁగొలుతు -1*

శుచి, హంసుడు, శుచిషత్తు, పరమాత్ముడు, పరబ్రహ్మ అయిన శ్రీకృష్ణుని పూజిస్తాను. మహర్షులు దేవతలు కూడా ఎవడి కలరూపు తెలుసుకొనలేకపోయారో అట్లాంటి పరమపురుషుడైన శ్రీకృష్ణుని అర్చిస్తాను. ప్రాజ్ఞులు దుఃఖరోగానికి ఎవరినైతే ఔషధంగా భావించారో ఆ పుణ్యపురుషుడైన శ్రీకృష్ణుని ప్రార్థిస్తాను. ఈ జగత్తులన్నింటి సృష్టి స్థితి లయములకు కారణమెవ్వడో ఆ మహాశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుని కొలుస్తాను. పక్షి పంజరాన్ని, రత్నసమూహందారమునూ, పూలు నారను ప్రాపుగా గొని ఉన్నట్లుగానే ఈ ప్రపంచం సువ్యవస్థితమై నిలవడానికి ఉత్తమాశ్రయమైన పుండరీకాక్షుడైన శ్రీకృష్ణుని స్మరిస్తాను.

పరబ్రహ్మ వరకు సమస్త దేవతామయుడై సర్వజగత్తుల సృష్టిస్థితి లయకారణభూతుడై సమస్తము తానే అయిన శ్రీకృష్ణుడిని భీష్ముడు స్తుతించాడు. సమస్త కారణభూతుడు కృష్ణుడు అనడానికి ఈ పద్యంలోని ప్రతి పదము ఉపకరిస్తుంది.

*అమృతమయు, ఋగ్యజుస్సా, మముల యుపనిషద్వచ స్సమాజములకు వా*
*చ్యమయిన పురుషోత్తము, నిక్కము రూపగువాని భక్తిగమ్యుఁదలంతున్ -2*

అమృతమయుడు, వేదాలు, ఉపనిషత్తుల వాక్యసమూహం చేత వాచ్యుడు, సత్యస్వరూపుడు, భక్తితో పొందదగినవాడు అయిన పురుషోత్తముని ధ్యానిస్తున్నాను.

భగవంతుడు భక్త పరాధీనుడు అనే అంశాన్ని తెలియజేయడానికే తిక్కన భక్తిగమ్యుఁడు అనే మాట ప్రయోగించాడు.

*కం॥ సర్వమునందును దానున్, సర్వము ఁదనయందు నుండు సంచారంబున్*
*సర్వమునకు ఁదనవలనన, సర్వాత్మకు నట్టి వృష్ణిసత్తముఁ దలఁతున్ -3*

సమస్తము భగవంతుడిలోను, సమస్తము భగవంతుడి యందు, సమస్తమునకు తన వలెనే మెలగుట జరుగునో అట్లాంటి సర్వాత్మకుడైన శ్రీ మహావిష్ణువును ప్రార్థిస్తాను.

*నారాయణపరములు నిజమారయబ్రహ్మంబుఁ బరము నంచితసత్యో*
*దారతపంబులుఁగావున నారాయణ పరతవీని నాల్గిటినిచ్చున్ ॥ - 4*

---

1. *శ్రీమదాంధ్ర మహాభారతం, శాంతిపర్వం, ద్వితీయాశ్వాసం 20 : పుట-178*
2. *తిక్కన భారతం, శాంతిపర్వం, ద్వితీయాశ్వాసం, 22 : పుట-179*
3. *తిక్కన భారతం, శాంతిపర్వం, ద్వితీయాశ్వాసం, 38 : 185*
4. *తిక్కన భారతం, శాంతిపర్వం, ద్వితీయాశ్వాసం, 52 : 190*

పరబ్రహ్మం, మోక్షం, అత్యున్నత సత్యం, తపస్సు అన్నవి శ్రీమహావిష్ణువు పరమై యున్నాయి. కాబట్టి విష్ణువును ధ్యానించేవారికి ఆ శ్రీమహావిష్ణువు ఈ నాల్గింటిని ప్రసాదిస్తాడు.

"అంతర్బహిశ్చతత్సర్వం వ్యాప్యనారాయణః స్థితః" –1

అన్న మంత్రపుష్పంలోని వాక్యం కూడా ఇక్కడ సమన్వయపడుతుంది.

ఆత్మనుండే శరీరము మనస్సు మొదలైనవి పుట్టుకువస్తాయి. వాటిని ఆత్మకన్నా వేరు అని భావించేవాడు మూర్ఖుడు. ఈశ్వరా విశ్వమంతా నీవే. నీవు కానిది వేరుగా ఏమీ లేదు అంటూ వసుదేవుని ప్రార్థనగా పోతనగారు

*ఆ॥వె॥ ఆత్మ వలన ఁగలిగి అమరుదేహాదుల, నాత్మకంటె వేఱులవి యటంచుఁ*
*దలఁచువాఁడు మూఢతముఁడు గావుననీశ ! విశ్వమెల్ల నీవ, వేఱు లేదు* –2

చెప్పిన యీ పద్యంలో 'సర్వఖల్విదం బ్రహ్మ' –3

అన్న ఉపనిషత్ వాక్యార్థం ద్యోతకమవుతుంది.

కృష్ణావతార ఘట్టంలో తమ ఎదుట విష్ణు రూపంతో ప్రత్యక్షమయిన స్వామిని వసుదేవుడు వేదాంతపరంగా వర్ణిస్తే దేవకీదేవి కూడా ఆయనను స్తుతించినట్లుగా పోతన చెబుతూ

*"కుమారునునింగని, కంసుని వలన వెఱపున శుచిస్మితయై యిట్లనియె"* –4

అని ఆమె అవస్థను వర్ణించాడు. కంసుని వలన తన కుమారునకు అపాయం కలుగుతుందని భయపడే ఆమెకు శుచిస్మితం ఎట్లా ఉంటుంది? అనే సందేహం కలుగుతుంది.

అయితే ఆ పుట్టిన కుమారుడు అవతారమూర్తి అనే విశ్వాసంతో ఆమె దుఃఖం తొలగిపోగా లోకాలకు మేలు కలుగజేసే ఆ దివ్యమూర్తి లక్షణం ఆమెకు అలాంటి ముఖవికాసం కలిగించిందనుకుంటే దోషం తొలగిపోతుంది.

ఆత్మను అధిష్ఠించి దానికి ఆధారంగా నిలబడిన జ్యోతివి నీవే అంటూ దేవకీదేవి ఆ స్వామిని స్తుతించింది.

*సీసం॥ అట్టిట్టిదనరానిదై మొదలై నిండుకొన్నదై వెలుఁగుచు గుణములేని*
*దై యొక్క చందంబుదై కలదై నిర్విశేషమై క్రియలేక చెప్పరాని*
*దే రూపమని శ్రుతులెప్పుడు నొడివెడి యా రూపమగుచు నధ్యాత్మ దీప*
*మై బ్రహ్మ రెండవయర్ధంబు తుది జగంబులు నశింపఁ, గఁబెద్దభూతగణము* –5

---

*1. చల్లా లక్ష్మీనరసింహ శాస్త్రి, యాజుషస్మార్త మంత్ర పాఠము, 6వ మంత్రము, పుట–81*
*2. పోతన భాగవతం 10 : 121 : పుట–25*
*3. ఉపనిషత్తు కల్పతరువు (ఛాందోగ్యోపనిషత్) తృతీయ ప్రపాఠకము, 14వ ఖండము, 1వ మంత్రము పుట–153*
*4. పోతన భాగవతం 10 : 125 : పుట–26*
*5. పోతన భాగవతం 10 : 126 : పుట–27*

ఆ॥వె॥ సూక్ష్మభూతమందు చొరంగ నా భూతంబు, ప్రకృతిలోన చొరంగఁప్రకృతిపోయి
వ్యక్తమందు చొరంగ వ్యక్తమడంగను, శేషసంజ్ఞ నీవు సెలువమగుదు -1

అదే అన్నిటా నిండి వెలుగుతూ ఉంటుంది. అదే అన్నింటికీ మొదలు. దాని రూపం ఇలా ఉంటుంది అని చెప్పడానికి వీలు లేదు. ఆ జ్యోతివి నీవే అంటూ ఆమె స్తుతించడం చేత 'పూర్ణమదఃపూర్ణమిదం...' -2 అనే పరమేశ్వరుని యొక్క పూర్ణత్వం ఉపనిషత్పరంగా నడిచింది.

బ్రహ్మదేవుని ఆయుర్దాయంలో రెండవ సగభాగం పూర్తి అయిన తర్వాత పంచ మహాభూతాలు అహంకారంలో లీనమవుతాయి. అది మూల ప్రకృతిలో లీనమవుతుంది. మూలప్రకృతి వ్యక్తతత్త్వంలోనికి లీనమవుతుంది. అది కూడా లీనమైన తర్వాత శేషుడవై నీవు నిలబడి ఉంటావు అనడం చేత విశిష్టాద్వైత తత్త్వం ఈమె స్తుతిలో ప్రసక్తమయింది.

తీర్థుల వారి రచనలో వసుదేవుడు భార్యసహితుడై తనకు ప్రత్యక్షమైన విష్ణువు అలౌకిక రూపమును చూసి కంస భయంతో యిలా ప్రార్థించాడు.

శ్లో॥ సర్వాధారరమాపతేకథభవతాతచ్చింతనీయంవిభో
యత్కర్తవ్యమశేషశేషవిభునాబ్రహ్మణ్యరక్షావిధౌ
ఏవంరూపమమానుషం మునివరధ్యేయం సమాచ్ఛాదయ
స్వామిన్ మానుషబాలభావమధునాసందర్శయాస్మాన్ ప్రతి -3

ఓ ప్రభూ ! బ్రహ్మణ్య రక్షణ కోసం చేయవలసిన నీ కర్తవ్యాన్ని వెంటనే పాటింపుము. ఈ అమానుష రూపమును విడిచి మానుష బాలభావరూపంతో మాకు కనబడుము అంటూ సాగిన యీ ప్రార్థనలో ఇక్కడ సర్వాధార విశేషణం పౌరాణికార్థమును, ఉపనిషన్మత ప్రకారమును సూచించుచున్నది. అశేషశేషవిభు అనునది వైష్ణవ సంప్రదాయముననుసరించి ప్రపంచమంతయు శేషము. భగవంతుడు ఒక్కడే శేషి అని తెలుపుచున్నది.

కీర్తన :

పల్లవి॥ రక్షరక్షాసురశిక్షరాజీవదళాయతాక్ష
అ॥ప॥ అక్షీణకృపాకటాక్ష ఆశ్రితపక్ష సంరక్ష
1. సర్వమనోరథాధ్యక్ష సర్వలోకావనదక్ష
సర్వవేదాంతైకలక్ష సర్వయోగీంద్ర సంరక్ష -4

---

1. పోతన భాగవతం 10 : 126 : పుట-27
2. ఈశావాస్యోపనిషత్తు, శాంతి మంత్రం, పుట-2
3. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 1 : 38 : పుట-51
4. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 1 : 22 : పుట-52

2. అప్రమేయబలవీర్య అనుపమ మహౌదార్య
అపరిమితగాంభీర్య అవ్యయాఖండితైశ్వర్య

3. అచ్యుతానంతగోవింద అత్యంత నిర్మాలానంద
విచ్యుత సంసారకంద విశ్వమంగళముకుంద

4. పతిత జనపావన పంకజ సుందరానన
పతగపతివాహన పండిత పరిపాలన

5. తావకరూపముదారం ధారయశాంతసంసారం
దర్శయమానుషాకారం దేవబాలకశరీరం

6. చింతయాథయద్విధేయం చేతసాచిరమనుభావ్య
అంతరాయోమాభూదద్య ఆగమబృందసంవేద్య

7. అద్యమే జన్మసాఫల్యం అద్యమే వంశనైర్మల్యం
సద్యఏవసమజని సంభూతేత్వయి భూమని

8. కలికల్మషనాశనం కామితఫలనిదానం
నారాయణీయచరితం నారాయణతీర్థగీతం -1

భగవంతుడు అప్రమేయుడు (ఇంతటివాడని ఊహించుటకు శక్యం కానివాడు) అవ్యయుడు (నాశములేనివాడు) అని ప్రార్థిస్తున్న ఈ కీర్తనలో భగవంతుడు అప్రమేయ బలవీర్యుడు, అవ్యయాఖండితైశ్వర్యుడు అని ప్రార్థించడం చేత ఇక్కడ మహన్యాసంలోని శివసంకల్ప ప్రకరణంలో కల పరమేశ్వర వర్ణనం కనబడుతుంది.

"అచింత్యంచ అప్రమేయంచ వ్యక్తావ్యక్తపరంచయత్" -2

ఇటువంటి పదాలు పరబ్రహ్మ తత్త్వానికి విశేషణాలుగా వేదాంతులు వాడతారు.

"అత్యంత నిర్మలానంద" అనేది "ఆనందో బ్రహ్మేతివ్యజానాత్" -3

అన్న తైత్తరీయ ఉపనిషత్ వాక్యమును వివరించేది.

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 22 : పుట-52
2. చల్లా లక్ష్మీనరసింహ శాస్త్రి, యాజుషస్మార్త మంత్ర పాఠము, మహాన్యాసం శివసంకల్ప ప్రకరణం 12వ మంత్రం పుట-46
3. తైత్తరీయోపనిషత్తు, భృగువల్లీ, 6వ అనువాకం, పుట-168

ఇక్కడే మరొక విశేషణం పండితపాలన శబ్దం. ఇది భగవల్లక్షణంగా కాకుండా లౌకికంగా మహారాజు పండితులను పోషించుట అను సన్నివేశాన్ని సూచిస్తున్నది అనుకుంటే దీనిలో ఏ విశేషము కనబడదు.

*"విద్యావినయసంపన్నే బ్రాహ్మణేగవిహస్తిని ।*
*శునిచైవశ్వపాకేచ పణ్డితాః సమదర్శినః ॥* -1

అని గీతలో చెప్పిన పండిత లక్షణాలను బట్టి (సమస్త ప్రాణుల యందును) సమస్త ప్రాణుల యందును సమభావం కలవాడు పండితుడు అనే లక్షణాన్ని బట్టి 'సమత్వం యోగఉచ్యతే' -2

అని సమత్వమే యోగంగా చెప్పబడింది కాబట్టి అట్టివారు యోగులే అవుతారు. కాబట్టి ఇక్కడ పండిత శబ్దానికి యోగులని అర్థం చెప్పుకోవచ్చు. అప్పుడు యీ విశేషణం సరి అయినదే అవుతుంది. అయితే సర్వయోగీంద్ర సంరక్షక అని కవి ప్రయోగించాడు కాబట్టి యిది పునరుక్తం అవుతుంది. యీ విశేషణంలోని సంరక్షక శబ్దం, పండిత పాలన అనే చోట పాలన శబ్దం ఉన్నాయి కాబట్టి వాటి మధ్య గల తేడాలను బట్టి పునరుక్త దోషం పరిహరించుకోవచ్చు.

అలాగే కీర్తనలోని ప్రార్థన భాగంలో నీ అసలు రూపాన్ని చూపమని, ఇహలోకంలో సామాన్య బాలక శరీరాన్ని ధరించమని, నీ ప్రణాళిక ప్రకారం కర్తవ్యాన్ని నిర్వహించమని నీ ఈ జన్మ వల్ల మాకు జన్మసాఫల్యం లభించిందని, మా వంశం పావనమయినదని కోరిక, కృతజ్ఞత కూడా తెలుపబడ్డాయి. తీర్థుల వారి రచనా పాటవానికి ఇది చక్కని ఉదాహరణ. భగవద్గీతలోని విశ్వరూప సందర్శన ఘట్టం ఈ సన్నివేశం గుర్తుకు తెస్తున్నది.

అదే విధంగా ఆగమబృందసంవేద్య అనే విశేషణం శ్రుతివాక్యములచే స్తుతింపబడినవాడు అనే అర్థంలో వాడబడి భగవత్తత్త్వాన్ని నిరూపిస్తున్నది.

*"నమకం చమకంచైవ పురుషసూక్తం చ నిత్యశః"* -3

అనే శివ సంకల్పమంత్రం ఇక్కడ సమన్వయపడుతుంది.

ఇక్కడే 'భూమన్' శబ్దాన్ని కవి ప్రయోగించాడు.

ఈ ఘట్టంలో పోతన మూలానుసారంగా వేదాంత విషయం విస్తరించడం జరిగింది.

అన్ని చోట్ల వేదాంతార్థాన్ని చొప్పించి భగవత్పరంగా ఆయా విశేషణాలతో వర్ణించడం అలవాటుగా గల తీర్థుల వారు యీ కీర్తన దగ్గర మాత్రం క్లుప్తత పాటించారు.

---

*1. వ్యాసమహర్షి, భగవద్గీత, 5 : 18 : పుట-152*

*2. వ్యాసమహర్షి, భగవద్గీత, 2 : 48 : పుట-74*

*3. చల్లా లక్ష్మీనరసింహ శాస్త్రి, యాజుషస్మార్త మంత్ర పాఠము, 38వ మంత్రము, పుట-49*

అయితే యీ ఘట్టం భగవంతుని త్వరగా మానుషరూపాన్ని దాల్చి లోకోపకారం చేయడం కోసం ప్రార్థనా పూర్వకంగా వసుదేవుడు యాచించడం అనే దానికి సంబంధించింది కాబట్టి వేదాంత విషయానికి అంతగా ప్రాముఖ్యత లేకపోవడం సముచితమే అవుతుంది. కనుక వీరిరువురదీ ప్రకరణోచితమే అవుతుంది.

అటు తరువాత విష్ణువు మానవ బాలకునిగా రూపం ధరించి వసుదేవుడు చేయవలసిన కర్తవ్యాన్ని నిర్దేశించాడు.

*కీర్తన : ప॥ అవధారయ మామీశ్వరం దేవాదిదేవం అవధారయ*

*అ॥ప॥ తవతాత తపసా సంతోషితోకహం*
*తావక తనయాత్మ నావసౌ సమవతీర్ణాఖిలసారం*

*చరణం: ఆగమాంతైక మానసమనన్య భావం*
*అగణిత లోకనాయకం*
*విగళిత మోహమేకం విమల యోగితారకం*
*గగనాకారక మేకం గతాగత నివారకం*

*చరణం: మధురాపురం సమానయ మామకయోగ*
*మాయామిహ నిధాపయ*
*అథగోకులే నయ మాకనవద్య నందాలయం*
*విధినాకృత నిలయం వివిధ యోగిసుగేయం*

*చరణం: సంకర్షణాఖ్య మవ్యయం సాధువిధేయం*
*సంభూత మాశ్రితాభయం*
*శృంగారాది నిలయం శ్రీరామనామధేయం*
*సంగతం మత్సహాయం సర్వలోకాభ్యుదయం*

*చరణం: సుర వైరిభూరి సంకులం ధరణీతలమిదమ్*
*సురహరణోద్యమం*
*పరిభావయ మామితి పరమాత్మ గీతమిహ*
*వరనారాయణతీర్థ విరచితమేతదితి ॥ -1*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 23 : పుట-55, 56*

'సమవతీర్ణ అఖిలసారం' అనగా సృష్టిలోని సమస్త చరాచరముల మూలసారాన్ని నేనే అని విష్ణువు చెబుతున్నాడు. అలాగే అనన్యభావం. ఇక్కడ భావశబ్దానికి రూపం అని చెప్పుకోవాలి. అన్యరూపము లేనివాడు అనన్య రూపుడు. ఇది వేదాంత సంప్రదాయమునకు సంబంధించింది. ఆదిశంకరుల వారు వివేక చూడామణిలో బ్రహ్మతత్త్వాన్ని వివరించారు.

భగవంతుడు జాతి నీతి కులగోత్రములు లేనివాడని, నామరూప గుణదోష రహితుడని, దేశ కాలాద్యతీతుడని చెప్పారు.

*శ్లో॥ జాతినీతి కులగోత్ర దూరగం*
*నామరూప గుణదోష వర్జితం*
*దేశకాల విషయాది వర్తియత్*
*బ్రహ్మతత్త్వమసి భావయాత్మని* –1

**గగనాకారకం :** రూపరహితుడని సూచిస్తున్న ఈ వాక్యం కూడా 'పరమేవ్యోమన్' –2 అన్న ఉపనిషత్తు వాక్యాన్ని సూచిస్తుంది.

దైవప్రేరణతో వ్రేపల్లెలో యశోద గర్భాన ఉద్భవించిన యోగమాయను దేవకి ప్రక్కలో ఎవరికీ అనుమానం రాకుండా పడుకోబెట్టాడు వసుదేవుడు. కారాగృహంలోని పాప ఏడ్వడంతో కోపంతో కంసుడు ఆమెను చంపబోయాడు.

కంసుడు ఆ బిడ్డను కాళ్ళు పుచ్చుకొని భూమి మీదకు విసిరితే ఆమె ఆకాశంలోకి ఎగిరి అష్టభుజ మహాదుర్గయై దేదీప్యమానముగా విలసిల్లుతూ ఉండగా సురమునిగణములు ఆమెను పెక్కు విధములుగా స్తుతించారు.

*శ్లో॥ దుర్గే దుర్గతి హారిణి త్రిజగతాం సర్గాది సిద్ధార్థకే*
*స్వర్గాధీష్ట ఫలప్రదాన నిపుణే త్రాయస్వనశ్శంకరీ*
*సాత్వం సర్వజనాంతరాంతర చిదంశానన్య సిద్ధాత్మికా*
*సారాసార వివేకదృష్టివిదితా సర్వైక సాక్ష్యాత్మనా ॥* –3

శ్లోక రూపంలో ఉన్న యీ వర్ణన ప్రత్యేకంగా ఒక ప్రార్థనా రూపంలో మనము నిత్యము ప్రార్థనాంశముగా పెట్టుకోవడానికి వీలుగా రచించడం విశేషం.

---

1. *శంకరాచార్యులు, వివేకచూడామణి, 255 : పుట–140*
2. *తైత్తరీయోపనిషత్తు, బ్రహ్మానందవల్లీ, మొదటి అనువాకం, పుట–72*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 45 : పుట–61*

*కీర్తన : ప॥ జయ జయ దుర్గే జితవైరివర్గే*

*అ॥ప॥ వియదనీలాది విచిత్రసర్గే*

*చరణం: సుందర తర చరణారవిందే*
*సుఖపరిపాలితలోకబృందే*
*నందసునందాది యోగివంద్యే*
*నారాయణ సోదరి పరానందే*

*చరణం: సరసమణినూపుర సంగతపాదే*
*సమధిగతాఖిల సాంగవేదే*
*నరకిన్నర వరసురబహుగీతే*
*నందనుతే నిఖిలానందభరితే*

*చరణం: కనకపటావృత ఘనతరజఘనే*
*కళ్యాణదాయిని కమనీయవదనే*
*ఇనకోటి సంకాశ దివ్యాభరణే*
*ఇష్టజనాభీష్ట దాననిపుణే*

*చరణం: అనుదయలయ సచ్చిదానందలతికే*
*ఆలోల మణిమయ తాటంక ధనికే*
*నానారూపాది కార్యసాధనికే*
*నారాయణతీర్థ భావిత ఫలకే -1*

అనుదయలయ సచ్చిదానందలతికే (చావు పుట్టుకలు లేని సత్‌చిత్ ఆనంద స్వరూపిణి), నానారూపాది కార్యసాధనికే (అనేక రకములుగా సృష్టి కార్యములను సాధించునది) అనేది 'జన్మాద్యస్యయతః' -2 అనే బ్రహ్మసూత్ర వాక్యాలకు వ్యాఖ్య.

## 2. యశోదానందం :

గొప్పవాని కన్నిటి కంటే కూడా గొప్పవాడు, పుణ్యకర్మల చేతనే తెలియబడువాడు, బాహ్యకరచరణాదులచే తెలియబడనివాడు, తన యిచ్ఛచే మానుష రూపమును ధరించినవాడు అయిన బాలకుని చూసి యశోద ఆనందాన్ని పొందింది.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 24 : 61, పుట-62*

*2. నోరి శ్రీనాథ వేంకట సోమయాజులు, బ్రహ్మసూత్ర దర్శనం, 1వ అధ్యాయం, 2వ సూత్రం, 1వ పాదం, పుట-12*

*శ్లో॥ పరం పరస్మాదపి పాఙ్గ్యకర్మ క్రమేణ వేద్యం కరణైరవేద్యమ్ ।*
*నిజేచ్ఛయా ప్రాప్తమనుష్యవేషం సుతం యశోదా సుఖమాపదృష్ట్వా ॥ -1*

పరం పరస్మాత్ : పరమే వ్యోమన్, పరమం పరస్తాత్ అన్న శ్రుతి వాక్యాలు దీనికి అనుసంధించుకోవచ్చు.

కరణైః అవేద్యం : "యతో వాచోనివర్తన్తే అప్రాప్య మనసా సహ" -2

అన్న ఉపనిషత్ వాక్యానికి వ్యాఖ్య.

'యథేచ్ఛయా ప్రాప్తమనుష్యవేషం' అనునది సోకకామయత బహుస్యాం ప్రజాయేతి' -3

అన్న ఉపనిషత్ వాక్యానికి వ్యాఖ్య.

## 3. వైష్ణవ తేజస్సు :

ఆ తరువాత గోపస్త్రీలందరూ పుట్టిన బిడ్డను చూసి సాముద్రిక లక్షణములను బట్టి సాక్షాత్తు వైష్ణవ తేజస్సే ఈ బాలుని రూపంలో ఆవిర్భవించినదని మురిసిపోవడం సబబుగా తోచదు. ఎందుకంటే గోప వనితలు విద్యాగంధం లేనివారు. అయితే శుభలక్షణాలు కలిగిన సుందర శిశువును చూసినప్పుడు ముఖ్యముగా స్త్రీలు ఏ దివ్య పురుషుడో యిలా జన్మించాడని ఆనందంతో చెప్పుకోవడమనేది వారి స్వభావానికి అనుగుణంగానే ఉంటుంది కాబట్టి శాస్త్రగంధం లేకపోయినా ఆనంద వ్యక్తీకరణానికి ఆ సందర్భం తగినది అని సమర్థించుకోవచ్చు.

*శ్లో॥ అన్యోన్యం వ్రజనార్యోనందస్యాంతః పురేశిశుందృష్ట్వా ।*
*ఇతిజగురావిర్భూతం లక్షణతస్తద్ధి వైష్ణవం తేజః ॥ -4*

ఆ వెనువెంటనే కీర్తనలో ఒక గోపికపై శుభలక్షణాలన్నింటినీ వివరించినట్లు తీర్థుల వారు చెప్పారు.

*కీర్తన : ప॥ శ్రీపతి మిహనందగోపగృహేపర*

*అ॥ప॥ మాగతమాకలయే అయేసఖి ఆగతమాకలయే ॥*

*చరణం: పరమపురుష చిహ్నం - భద్రదమవధారయ*
*పద్మాంకుశాది రేఖం అయే సఖి - పద్మాంకుశాదిరేఖం*
*పరిపూర్ణ భావం ప్రకటీకరోతి దివ్య*
*పాణిపద్మాబ్జగతం జగదార్తిహర మమోఘమ్ ॥ -5*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 6 : పుట-67, 68*
2. *తైత్తరీయోపనిషత్, బ్రహ్మానందవల్లి, 9వ అనువాకం, పుట-146*
3. *తైత్తరీయోపనిషత్, బ్రహ్మానందవల్లీ, 6వ అనువాకం, పుట-117*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 9 : పుట-70*
5. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 3 : పుట-71*

*చరణం: పశ్యపశ్యాధునా - పాదపబృందాని*

*విశ్వస్యమేవచనం - అయేసఖి - విశ్వస్యమేవచనం*

*భృశమివభూమౌ దిశిదిశి సఫలాని*

*భవ్య సుగంధికుసుమై రతినిబిడాని జాయంతే ॥*

*చరణం: అరవిందలోచనే ఆవిర్భవతి జగ*

*దతితరా మిహరమతే అయేసఖి అతితరామిహ రమతే*

*నిరుపమానంద నిత్య బోధ స్వరూపం*

*పరమనుగీతమిదం నారాయణ తీర్థ యతినా ॥ -1*

ఇక్కడి విశేషణాలలో పద్మ, అంకుశ మొదలైన పరమ పురుష చిహ్నాలన్నీ ఉన్నట్లుగా ఆ గోపిక చెబుతుంది. పరమపురుష అనే పదం వేదాంత సంబంధి. పరిపూర్ణ భావం అనే మరో విశేషణం కూడా ఇక్కడ కనబడుతున్నది.

*"ఓం పూర్ణ మదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।*

*పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే ॥*

*ఓం శాంతిః శాంతిః శాంతిః -2*

అలాగే 'నిరుపమానంద నిత్య బోధస్వరూపం' అనే విశేషణం కూడా 'ప్రజ్ఞానం బ్రహ్మ' - 3 అనే ఉపనిషత్ వాక్యానికి వ్యాఖ్య.

ఈ విధమైన గోపికల భావన ఎంత వరకు సమంజసం అనిపిస్తుంది.

ఆ బాలుడు యశోదమ్మ ఒడిలో పెరుగుతూ ఉన్నాడు. ఈ సందర్భంలో పోతనగారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులుగానూ, సాక్షాత్తు పరబ్రహ్మగాను ఆ బాలుగు గోచరించాడని చెప్పారు.

*మత్తేభం :*

*చెయువుల్ సేయుతఱిన్ విధాతకరణిం జెన్నొందు, సంతోష దృ*

*ష్టియుతుండై నగుచున్ జనార్దనుని మాడ్కింబొల్చు, రోషించియు*

*న్నయెడన్ రుద్రుని భంగినొప్పును, సుఖానందంబునంబొంది త*

*న్మయుఁడై బ్రహ్మము భాతి బాలుఁడమరు న్బాహుళ్య బాల్యంబునన్ ॥ -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 3 : పుట-71*
2. *ఈశావాస్యోపనిషత్తు, శాంతిమంత్రం పుట-2*
3. *ఉపనిషత్తు కల్పతరువు, ఐతరేయోపనిషత్తు, 3 అధ్యాయము 2 వ మంత్రం, పుట-112*
4. *పోతన భాగవతం, 10 : 195 : పుట-42*

లీలలు ప్రకటించేటప్పుడు బ్రహ్మ, నవ్వుతున్నప్పుడు విష్ణువు, కోపం వచ్చి రోషం తెచ్చుకున్న సమయంలో రుద్రుడు, సుఖంగా ఆనందంగా తన్మయుడై ఉన్న సమయంలో పరబ్రహ్మములాగా ఆ బాలుడు గోచరిస్తాడు అని భావము. ఈ వర్ణన వేదాంతపరంగానే ఉన్నా పౌరాణిక లక్షణాలతో ఒప్పారింది. "ఏకం సత్ విప్రా బహుధావదంతి" అన్న శాస్త్ర వాక్యానికి ఇది దర్పణంగా నిలుస్తుంది.

## 4. మృద్భక్షణ వృత్తాంతము :

మృద్భక్షణ సందర్భములో యశోద కృష్ణుని నోట సమస్తలోకాలు చూసి అత్యంతాశ్చర్యానికి గురియై ఆ బాలుడు విశ్వరూపుడైన విష్ణువే తప్ప వేరొకడు కాదని ఒక నిర్ణయానికి వస్తుంది. అక్కడ యశోద పలుకులలో

"ఇతడు సర్వాత్ముడాది విష్ణుడగుట నిజము" -1

అన్న విశేషణంలో పరమేశ్వరుని సర్వవ్యాపకత్వ లక్షణం వర్ణింపబడి "ఈశావాస్య మిదం సర్వం" -2 అనే ఉపనిషత్ వాక్య భావం ఇక్కడ అనుసంధింపబడింది.

యశోద ఇతడు ఆదివిష్ణుడే బాలరూపంలో అవతరించాడని భావించడం

*"అజోకపిసన్నవ్యయాత్మా భూతానామీశ్వరోకపిసన్ ।*
*ప్రకృతింస్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥ -3*

అనే భగవద్గీతా వాక్యానికి ప్రతిబింబంగా ఉంది.

తీర్థుల వారు యీ ఘట్టంలో నిఖిలభువనకర్తగాను, అఘటితఘటనాకారుడిగాను విష్ణువును వర్ణించారు.

*కీర్తన :*

*ప॥ హరిమీడే శ్రీహరిమీడే దేవం - హరిమీడే*

*అ॥ప॥ గురుతరాసురభారహరమహమీడే*

*చరణం॥ అఖిలాండకోటి బ్రహ్మాండనాయక మిహ నిఖిలభువనకర్తారం*
*ప్రకటితనిజవిశ్వరూపమనామయ మఘటిత ఘటనాకారం*

*చరణం॥ స్వర్ధామమస్తక సూర్యచంద్రనయన విధ్వస్తమోహమహం*
*వర్ధితాఖిల వేదవాచమాశాశ్రుతి మనిలాసు మఖిలదేహం -4*

---

1. పోతన భాగవతం 10 : 343 : పుట-73
2. *ఉపనిషత్తు కల్పతరువు, ఈశావాస్యోపనిషత్తు, 1వ మంత్రం, పుట-21*
3. *వ్యాసమహర్షి, భగవద్గీత, 4 : 6 : పుట-118*
4. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, *2 : 16 : పుట-117*

*చరణం॥ విశ్వహృదయదేశవిపులమహీచరణ శాశ్వతానందఘనం*
*నిశ్వశితాగమనిర్మల విజ్ఞాన నిత్యకళ్యాణనిదానం*

*చరణం॥ భక్తజనసమూహభద్రదం భవభయముక్తమమరమృదుగీతం*
*ముక్త సంగమునీంద్రముక్తి దాననిపుణమూలమాగమబోధితం*

*చరణం॥ తరణి శశిమండలకోటికోటి భాస్కరమరవిందభవకారణం*
*హరిభక్త శివనారాయణతీర్థకృత మిదమఖిలపాతకహరణం -1*

పై రెండు విశేషణాలు అద్వైతపరంగా అన్వయిస్తున్నాయి.

అవతారవర్ణనం కాబట్టి ఇక్కడ కొంత ద్వైతభావం కూడా స్ఫురిస్తుంది.

'అఖిలదేహం' అనేది అద్వైతపరం. అన్ని ఆకారములు తానే అయినవాడని అర్థం. 'శాశ్వతానందఘనం' అనేది కేవలం అద్వైత విశేషణమే.

'నిశ్వసితాగమనిర్మలవిజ్ఞాన నిత్యకళ్యాణనిదానం' అనేది పౌరాణిక పరమైన విశిష్టాద్వైత విశేషం. 'ఆగమబోధితం' అనేది కూడా అద్వైతపరమైనదే.

ఇక మరొక కీర్తనలో తీర్థుల వారు వాడిన విశేషణాలన్నీ భగవంతుని సగుణమూర్తి ఆరాధనకు సంబంధించినవి. ద్వైత, విశిష్టాద్వైతుల భావాలను ప్రతిబింబించే పౌరాణిక విశేషణాలు ఎన్నో కవి ఇక్కడ వాడుకున్నాడు. అగణిత గుణగ్రామ, నగధరఘనశ్యామ, అసురమండల భీమ, నవనీత చోర, శరదిందు సమవదన మొదలగునవి.

*కీర్తన :*

*ప॥ గోవిందఘటయ పరమానందమమృతమిహ*
*అ॥ప॥ శ్రీనందతనయ బహుయోగీంద్ర సురవినుత*

*చరణం॥ అగణిత గుణగ్రామ అపరిమిత నిజకామ*
*నిగమపరమారామ నిఖిలమోహవిరామ*
*నగధర ఘనశ్యామ నతజనకుముదసోమ*
*అఘహరణసర్వసమ అసురమండలభీమ -2*

---

1. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, *2 : 16 :* పుట*-117*
2. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, *2 : 17 :* పుట*-120, 121*

*చరణం॥ పరమపురుషాశేష పాలపరిజనతోష*
*పరిహృతాఖిలదోష పతగవాహనశేష*
*పర్యంకమృదుభాష పరమమంగళవేష*
*నిరవద్యగోపపురి నియతవరమణిభూష*

*చరణం॥ నవమౌక్తికాహార నందగోపకుమార*
*భవబంధనవిదూర భద్రదశుభాకార*
*అవనతజనాధార అపరిమిత శుభచార*
*నవనీతచోర నరనారాయణవతారా*

*చరణం॥ శరదిందుసమవదన శతమన్మథసమాన*
*గురుతరానందఘన కుందసుందరరదన*
*పరిపంథిగణదళన పాలితాఖిలభువన*
*సరసనారాయణతీర్థ సత్యఫలదాన -1*

అయితే అద్వైతి అయిన తీర్థుల వారు తన సహజ స్వభావాన్ని ప్రదర్శించకుండా ఉంటారా. కాబట్టే నిగమ పరమారామ, పరమపురుష, నిఖిలమోహవిరామ, అపరిమితనిజకామ, గురుతరానందఘన అనే కేవలాద్వైత విశేషణాలు కూడా కనబడతాయి. 'పరమపురుష' అనేది

*'ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।*
*యోలోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥ -2*

అనే గీతా శ్లోకానికి ప్రతిబింబంగా ఉంది.

ఇలాపోతనగారు, తీర్థుల వారు అద్వైత విషయాన్ని కొద్దిగాను, విష్ణువర్ణనాన్ని అధికంగాను వర్ణించి ఘట్టానికి సౌందర్యాన్ని కూర్చారు. యశోద నోటివెంట అద్భుత రసంతో కూడిన వాక్యాలు పలికించాలి కానీ సన్యాసులకు సాధ్యమైన వేదాంత సూక్తులను పలికించడం న్యాయం కాదు కనుక ఇద్దరూ సందర్భోచిత రసౌచిత్యాన్ని, పాత్రౌచిత్యాన్ని పరిపోషించారు.

**5. యమళార్జున భంజనము :**

(యశోద కృష్ణుని శిక్షింపబోయి ఒకనాడు రోటికి వానిని బంధించింది. అప్పుడు ఆమె అన్న మాటలలో చక్కటి అద్వైతం వినబడుతుంది)

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణి 2 : 17 : పుట-120, 121*

*2. వ్యాసమహర్షి, భగవద్గీత, 15 : 17 : పుట-350*

యశోద 'వెన్నదొంగ చిక్కాడు' అంటూ బాలకృష్ణుణ్ణి పట్టుకున్నది. పట్టుకున్నదే కాని కొట్టడానికి చేతులు రాలేదామెకు. అతని మీద జాలిపడి పోనీలే కొట్టకుండా కట్టివేద్దామనుకుంది.

"ఓహో ఎవరు వీరు? శ్రీకృష్ణుల వారేనా! పట్టుకోవాలంటే ఎవరికీ పట్టుబడనని నీవు అనుకుంటున్నావు. పట్టుకోవాలని నేను పట్టుబడితే నిన్ను పట్టుకోవడం పెద్ద కష్టమనుకుంటున్నావా? నీవు పట్టుబడవని అందరూ అనుకుంటారు. నిన్ను పట్టుకోవడం నాకు తప్ప ఇతరులకు సాధ్యం కాదురా" అని కూడా అంటుంది.

*కందం॥ పట్టిన cబట్టువడని నినుc, బట్టెదనని చలముగొనిన cబట్టుటబెట్టే ?*
*పట్టుబడవండ్రు పట్టీ !, పట్టుకొనన్ నాకుcగాక పరులకు వశమే ? -1*

యశోదకు తెలియకుండానే అసలు తత్త్వం కూడా ఆమె నోటి వెంటనే అంతరార్థంగా బయటపడింది. అది శ్రీకృష్ణుని సాన్నిధ్యంలో ఉన్న దివ్యప్రభావం. భగవంతుడు మామూలుగా పట్టుబడడు. నిష్టగా యోగసాధన చేస్తే ఆనందస్వరూపుడుగా పట్టుబడతాడు. తనలోను అందరిలోను అంతర్యామిగా ఉన్న 'నేను' అనే ప్రజ్ఞగా మాత్రమే అతడు పట్టుబడతాడు. ఇతరులను వేరుగా చూస్తే పట్టుబడడు. ఇదే భావం యశోద మాటలలో వ్యక్తమయింది.

యశోద కృష్ణుణ్ణి రోటికి కట్టివేసింది. అయితే ఇంట్లో ఉన్న తాళ్ళన్నీ తెచ్చి కట్టివేసినా ముడి వేయడానికి రెండంగుళాలు తగ్గి వెలితి ఉండిపోయింది. ఈ ఘట్టాన్ని వర్ణిస్తూ పోతనగారు 'ముజ్జగాలు దాగి ఉన్న ఆ చిరు బొజ్జను కట్టడం ఎవరి తరం? అంటాడు.

*కందం॥ తజ్జననిలోcగిట గల, రజ్జుపరంపరల cగ్రమ్మఱన్ సుతుcగట్టన్*
*బొజ్జదిరిగి రాదయ్యెజ, గజ్జాలము లున్న బొజ్జ cగట్టన్ వశమే ? -2*

భగవంతుడు తన యందు సర్వజగంబులను దాల్చి యుంటాడు అనే వేదాంత భావన ఇక్కడ స్పష్టమయింది.

ఈ సందర్భంలోనే భగవంతుడు భక్తికి లొంగుతాడనే విశిష్టాద్వైత సిద్ధాంతం కూడా ఇక్కడే నిరూపించబడింది.

*కందం॥ జ్ఞానులచే మౌనులచే, దాసులచే యోగసంవిధానులచేతం*
*బూని నిబద్ధుండగునే, శ్రీనాథుcడు భక్తియుతుల చేతంబోలెన్ ? -3*

రోలు రెండు మద్దిచెట్ల మధ్యను చేరి వాటిని కూలుస్తుంది. వాటి స్థానంలో ఇద్దరు గంధర్వులు (నలకూబర, మణిగ్రీవులు) తమ స్వస్వరూపంతో ప్రత్యక్షమవుతారు. వారిరువురు కృష్ణుని ప్రార్థిస్తారు.

---

1. *పోతన భాగవతం 10 : 375 : పుట-79*
2. *పోతన భాగవతం 10 : 385 : పుట-81*
3. *పోతన భాగవతం 10 : 390 : పుట-82*

అన్ని భూతాలకు, ఇంద్రియాలు, అహంకారం, ప్రాణం అనే వాటికి నీవే ప్రభుడవు. అన్నింటికీ మూలం కూడా నీవే. ఇలా మొత్తం అద్వైతపరంగానే నడిచిందీ వర్ణన.

*సీసం॥ ఎల్లభూతంబుల కింద్రియాహంకృతి, ప్రాణంబులకు నధిపతినవినీవ !*
*ప్రకృతియు ఁబ్రకృతిసంభవ మహత్తును నీవ, వీని కన్నిటికిని విభుఁడ వీవ*
*ప్రాకృత గుణవికారముల ఁబొందక, పూర్వసిద్ధుండవగు నిన్నుఁజింతసేయ*
*గుణవృతుండోపునే ? గుణహీన !, నీయంద, కలగుణంబులనీవ కప్పఁబడదు.*

*తే॥గీ॥ మొదలనెవ్వని యవతారములు శరీరు, లందు సరిదొడ్డులేని వీర్యములఁదనువు,*
*లడరజన్మించి వారలయందు ఁజిక్క, వట్టి పరమేశ ! మ్రొక్కెదమయ్య ! నీకు –1*

ఇక్కడే ప్రకృతి, మహత్తు లాంటి సాంఖ్య వేదాంతపరంగా కూడా కొన్ని పద్యాలు చోటు చేసుకున్నాయి.

ఇంకా వారి స్తుతిలో అఖిలేశ్వర, వాసుదేవ కళ్యాణనిధి అనే మూడు విశేషణాలలో విశిష్టాద్వైతం కనబడుతుంది.

*కందం॥ భువనములు సేయఁగావఁగ, నవతీర్ణుఁడవైతికాదె యఖిలేశ్వర ! యో*
*గివరేణ్య ! విశ్వమంగళ !, కవిసన్నుత ! వాసుదేవ ! కల్యాణనిధీ ! –2*

నీవు ఈ అంతటికీ ఈశ్వరుడవు. యోగులందరూ నిన్ను దైవంగా వరించారు అనడం చేత అద్వైతం స్పష్టము.

*శ్లో॥ నారదముని వరశాపాద్యమళార్జున వృక్షభావమాపన్నౌ ।*
*యక్షసుతౌ సవిచిత్రం దామ్నాబద్ధోకప్యమోచయద్బంధాత్ ॥ –3*

ఇక్కడ కృష్ణుడు తాను త్రాటికే కట్టబడి ఉన్ననూ గంధర్వులను బంధవిముక్తులను చేశాడు అని వర్ణించడం తీర్థుల వారి ఉక్తి వైచిత్రికి ఉదాహరణ.

శాపవిమోచనం పొందిన యక్షులు 'ఓ దామోదరా! నీ పరమాత్మ స్వరూపము తెలుసుకున్నాము' అంటూ కృష్ణుని ఎన్నో విధాలుగా స్తుతిస్తారు. కృష్ణుడు చిద్ఘనాకాశుడు, సత్యకామాదిగుణకుడు, పండిత పరిభావితుడు. ఇక్కడ పండిత శబ్దం కవులు, పండితులు అనే రీతిగా వాడిన లౌకిక పదంలా తోస్తుంది. తీర్థుల వారు స్వతహాగా పండితుడు కాబట్టి తన చేతనే కీర్తింపబడేటటు వంటి వానిగా కృష్ణుని నిరూపించడం సమంజసముగా ఉంది.

---

1. *పోతన భాగవతం 10 : 405 : పుట–85*
2. *పోతన భాగవతం 10 : 406 : పుట–86*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 33 : పుట–110*

కీర్తన : దామోదరతావక పరభావ మహంసదా జానే

అ॥ప॥ శ్యామ ధామ భూమ సామాది సర్వనిగమవాసం జానే

చరణం: పుండరీక పురమధ్య పురుషభావేన సిద్ధం
చండభానుకోటిప్రకాశం చిద్ఘనాకాశం
పండిత పరిభావితం పాపసంఘవివర్జితం
ఖండిత మాయావిలాసం కారణమఖండరసం

2 సత్యకామాది గుణకం సర్వహృదయాభాసకం
నిత్యమంగళనివహం నిర్గతమోహం
ప్రత్యయబాధితశోకం ప్రతిభాతిసర్వలోకం
మృత్యుజన్మాదివిరహం సత్యలోకాది సర్వదేహం

3 కమలాసనాదిగీతం కామయానాదిఫలితం
శ్రీమదశేషవిభవం ధీరానుభావ్యం
సమరసతయానిత్యం విమలయోగివిదితం
అమరరమ్యశ్రీగోకుల కమనీయగోపాలశరీరం

4 నరకభయ వారకం నామరూపనిర్వాహకం
పరిపూర్ణానందదాయకం భక్తతారకం
సురగురుగీతమేకం సూదితాసురనాయకం
వరనారాయణతీర్థ వందితపాదపద్మకం -1

తీర్థుల వారి రచనలో కారణం, అఖండరసం చిద్ఘనాకాశం, సమరసతయానిత్యం అనే విశేషణాలు అద్వైతపరంగా సాగాయి. శ్రీమదేషవిభవం, పాపసంఘ వివర్జితం, నరకభయ వారకం ఇలాంటి పౌరాణిక విశేషణాలన్నీ విశిష్టాద్వైతపరంగా నడిచాయి.

అని యీ విధంగా స్తుతించి స్వప్రకాశుడు, జ్ఞానస్వరూపుడు, హృదయ కమలస్థితుడు, ప్రపంచమునకు కారణభూతుడు, తన యందే సకల ప్రపంచములు కలవాడు అయిన సాక్షాత్తు నారాయణుడే అయిన కృష్ణుని ఆ గంధర్వులిద్దరూ ఆశ్రయించారు.

శ్లో॥ దేవం బ్రహ్మ పురాంతస్థం పుండరీకాంతరస్థితమ్ ।
చిదాకాశం జగద్బీజం వాసుదేవం తమాశ్రయే ॥ -2

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 15 : పుట-112
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 35 : పుట-114

శ్రీకృష్ణుని బ్రహ్మపురాంతస్థునిగా వర్ణించడం శ్రుతిననుసరించి చేసిన వర్ణన.

*"యోవైతాం బ్రహ్మణోవేద అమృతే నా వృతాం పురీం" -1*

దీనిని బట్టి తీర్థుల వారి వైదిక ప్రీతి తెల్లమగుచున్నది.

వ్యాఖ్య : పోతనగారి వర్ణనలో విస్తృతంగా చెప్పబడ్డ విషయం తీర్థుల వర్ణనలో క్లుప్తంగా సాగింది. కీర్తన ప్రధానమైన రచనలో స్తుతి ప్రాధాన్యమే తప్ప శాస్త్రప్రాధాన్యం ఎక్కువగా ఉండనక్కరలేదనే సమన్వయంతో ఇక్కడ సన్నివేశాన్ని అర్థం చేసుకోవాలి.

### 6. గోపాలనం :

బలరాముని ఆగమనం తరువాత శ్రీకృష్ణుడు వచ్చాడు. దేవతాంగనలు అతనిని యీ విధంగా వర్ణించారు.

*కీర్తన : ప॥ ఆలోకయే శ్రీబాలకృష్ణం – సఖి*
*ఆనంద సుందర తాండవ కృష్ణం*

*చరణం: నవనీతఖండదధి చోరకృష్ణం – భక్త*
*భవపాశ బంధ మోచనకృష్ణం*

*చరణం: నీలమేఘశ్యామ సుందర కృష్ణం – నిత్య*
*నిర్మలానందబోధ లక్షణ కృష్ణం*

*చరణం: చరణనిక్వణిత నూపురకృష్ణం కరకలిత*
*సంగత కనక కంకణ కృష్ణం*

*చరణం: కింకిణీజాల ఘణఘణిత కృష్ణం – లోక*
*శంకిత తారావళి మౌక్తిక కృష్ణం*

*చరణం: సుందర నాసామౌక్తిక శోభితకృష్ణం నంద*
*నందన మఖండవి భూతికృష్ణం*

*చరణం: కంఠోప కంఠశోభి కౌస్తుభకృష్ణం – కలి*
*కల్మష తిమిర భాస్కరకృష్ణం*

*చరణం: వంశనాద వినోద సుందరకృష్ణం – పరమ*
*హంసకుల శంసిత చరితకృష్ణం -2*

---

1. *కృష్ణ యజుర్వేదం, ఆరణ్యకం, ప్రథమ ప్రశ్న, పుట-31*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 4 : పుట-126, 127*

*చరణం: గోవత్సబృంద పాలకకృష్ణం - కృత*
*గోపికాజాల ఖేలనకృష్ణం*

*చరణం: నంద సునందాది వందిత కృష్ణం - శ్రీ*
*నారాయణతీర్థ వరద కృష్ణం -1*

యీ వర్ణనలో 'ఆనంద సుందర తాండవ కృష్ణం' అనే విశేషణం వేదాంత మరియు లౌకిక వర్ణనానికి కూడా సరిపోతున్నది. ఆనంద శబ్దం ఉపనిషత్ సంబంధి. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" -2

సుందర తాండవకృష్ణ అనడంలో చూడముచ్చటగా ఆయన వేస్తున్న చిందులను చూపెడుతుంది. కాబట్టి లౌకికమే. 'భవపాశబంధమోచన' శబ్దం కూడా భగవంతుని రక్షణ లక్షణాన్ని సూచించేదే. 'అఖండ విభూతి' శబ్దం భగవంతుని సాక్షాత్కరింపజేస్తుంది. భగవానుడు గీతలో తన యొక్క విభూతి సృష్టిలో ఎలా పరిణమించిందో యిలా చెప్పారు.

*శ్లో॥ అహం సర్వస్యప్రభవో మత్తః సర్వంప్రవర్తతే ।*
*ఇతిమత్వా భజన్తే మాం బుధా భావ సమాన్వితాః ॥ -3*

'నేను సమస్త జగత్తునకు ఉత్పత్తికారణమైనవాడను. నా వలన నే యీ సమస్తము నడచుచున్నది' అని వివేకవంతులు తెలుసుకొని పరిపూర్ణ భక్తి భావముతో కూడినవారై నన్ను భజించుచున్నారు అని భావము.

*శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః ।*
*అహమాదిశ్చ మధ్యం చ భూతానామంతయేవ చ ॥ -4*

అర్జునా ! సమస్త ప్రాణుల యొక్క హృదయము నందున్న ప్రత్యగాత్మను నేనే అయి ఉన్నాను. మరియు ప్రాణుల యొక్క ఆది మధ్యాంతములున్నూ నేనే అయి ఉన్నాను అని భావము.

*శ్లో॥ యద్యద్విభూతిమత్సర్వం శ్రీమదూర్జితమేవ చ ।*
*తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశ సమ్భవమ్ ॥ -5*

ఐశ్వర్యయుక్తమైనది, కాంతిమంతమైనది, ఉత్సాహముతో కూడినది అయిన వస్తువు ఏది ఏది ఉందో అదియది నా తేజస్సు యొక్క అంశము వలన కలిగిన దానినిగనే నీవు తెలుసుకొనుము అని భావము. గోవులు కాచుచున్న గోపాలుని తీర్థుల వారు చక్కగా వర్ణించారు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 4 : పుట-126, 127*
2. తైత్తరీయోపనిషత్, భృగువల్లీ, 6వ అనువాకం, పుట-168
3. *వ్యాసమహర్షి, భగవద్గీత, 10 : 8 : పుట-230*
4. *వ్యాసమహర్షి, భగవద్గీత, 10 : 20 : పుట-236*
5. *వ్యాసమహర్షి, భగవద్గీత, 10 : 41 : పుట-244, 245*

గద్యం : అసౌఖలు భగవాన్ అపరిమిత కరుణారసాల వాలో, భూమాఖ్యో, నిజజన సంతాపహరణ ప్రవీణః పరిగృహీత గోపకుమార భావో వేణువిషాణనినాద విశేషైః ఉపవన పరిమితాళితాన్ ఆగమభాగవచో విలాసైరివ పరతత్త్వ పరిమిళితా నశేషయోగి చిత్తవృత్తి విశేషాని వాశేష గోవత్సాన్ నిజకరకలిత నేత్రసంచారవిలాసైర్నియమేన సంచారయన్ సముదిత మహోత్సాహస్సహసావలోకన భాషణాదిభిః అఖిలానపి గోపబాలానానందయన్ వైమానిక బృందనయన మహోత్సవో మోహాతీత విశుద్ధ బోధమూర్తి రపి – విహరతి హరిరిహ దీనబంధుః ॥ *–1*

ఇక్కడ వాడిన 'భూమాఖ్యః' అను విశేషణం వేదాంత సంబంధి. ఆయన యొక్క వేణువు వాదనం ఆగమభాగవచో విలాసముల వలె ఉన్నదట. ఇది చక్కని పోలిక. ఆయన మాయాతీతుడు. ఇది పురుషోత్తమ తత్త్వాన్ని ఆవిష్కరిస్తుంది.

*శ్లో॥ ద్వావిమౌపురుషౌలోకే క్షరశ్చాక్షర ఏవచ ।*
*క్షరస్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే ॥ –2*

ఈ ప్రపంచములో క్షరుడు, అక్షరుడు అనే యిద్దరు పురుషులు కలరు. అందు సమస్త ప్రాణుల దేహముల యొక్క అభిమాని క్షరుడు. కూటస్థుడగు జీవుడు అక్షరుడు అని భావము.

*శ్లో॥ ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।*
*యోలోకత్రయమావిశ్యబిభర్త్యవ్యయ ఈశ్వరః ॥ –3*

మూడు లోకములను భరించువాడు, నాశరహితుడు, జగన్నియామకుడు, వేరైనవాడు అగు ఉత్తమ పురుషుడు పరమాత్మయని చెప్పబడుచున్నాడు అని భావము.

*శ్లో॥ యస్మాత్క్షర మతీతోఽహమక్షరాదపిచోత్తమః ।*
*అతోఽస్మిలోకే వేదేచప్రథితః పురుషోత్తమః ॥ –4*

పరమాత్ముడు క్షరస్వరూపుని కంటే మించినవాడు. అక్షర స్వరూపుని కంటే శ్రేష్ఠుడు. కనుకనే ప్రపంచము నందు, వేదము నందు పురుషోత్తమునిగా ప్రసిద్ధికెక్కినాడు అని భావము.

అలాగే విశుద్ధ బోధమూర్తిః అనే వాక్యం కూడా "ప్రజ్ఞానం బ్రహ్మ" –5

అనే ఉపనిషద్వాక్యానికి వ్యాఖ్య. అటువంటి శ్రీకృష్ణుని దేవతలు స్తుతించారు. పరమాత్ముడు చేయుచున్న గోవత్సపాలనము గూర్చి దేవతలు తమలో తాము గానం చేశారు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 5 : పుట–130*
2. *వ్యాసమహర్షి, భగవద్గీత, 15 : 16 : పుట–349*
3. *వ్యాసమహర్షి, భగవద్గీత, 15 : 17 : పుట–350*
4. *వ్యాసమహర్షి, భగవద్గీత, 10 : 18 : పుట–351*
5. *ఉపనిషత్తు కల్పతరువు, ఐతరేయోపనిషత్తు, తృతీయాధ్యాయం, 2వ మంత్రం, పుట–112*

కీర్తన :

ప॥ కలయత గోపికా కారుణ్యరసపూర కాలమేఘాభిరామం

అ॥ప॥ చలదధరాంచిత బూరుమురళీనాద కలితకైవల్యకామం

చరణం: కుత్సితాసుర తిమిరకోటి సూర్యమమరకుముదకుముదబాంధవం
మత్స్యకూర్మాది శ్రీమహనీయావిర్భావమయోల్లసితవైభవం
సత్సుఖామృత జలధి సతత ఖేలన నిరతం సాధుజనాత్మదేవం
వత్స సంరక్షణ వాత్సల్య పరిపూర్ణ వల్లవబాల భావం

చరణం: అక్షీణ సంపదా మాశ్రయ మఖిల సంరక్షణ దీక్షాధరం
పక్షీశవాహనం పంకజభవభవ భావిత భద్రాకారం
కుక్షిస్థ బ్రహ్మాండ కోటివిరాజితం కుటిలకుంతల సుందరం
వీక్షణ సముదిత వివిధ విశ్వాకారం విమలవిజ్ఞానసారం

చరణం: కరసరోరుహ గత కనక నిర్మిత వలయం కమనీయ తరవిగ్రహం
గురుతరమౌక్తిక గుణమణి గణభారం గోపీసంతాపాపహం
సురరాజరిపువత్సాసుర సూదన చరిత సులలితమతిసుగ్రహం
వరనారాయణతీర్థ వరణీయ పరమార్థావరణమోహవినిగ్రహమ్ ॥ -1

ఇక్కడ అక్షీణ సంపదాం ఆశ్రయం అనేది భగవంతుని యొక్క లక్షణాలలో మొదటిదైన ఐశ్వర్య లక్షణానికి వివరణం. వీక్షణ సముదిత వివిధ విశ్వాకారం (కంటి చూపు నుండియే పుట్టిన విశ్వము కలవాడు) అనేది వేదాంతపరమైన వర్ణన. "తదైక్షత" -2

శ్లో॥ "సేయం దేవతైక్షత హన్తాహమిమాస్తిస్రో దేవతా అనేన
జీవేనాత్మనాను ప్రవిశ్యనామరూపే వ్యాకర వాణీతి" -3

పరమార్థావరణ మోహ వినిగ్రహం (పరమాత్మను తెలుసుకొనుట విషయంలో బుద్ధిని కమ్మివేసే మోహావరణాన్ని తొలగించువాడు.

శ్లో॥ దైవీహ్యేషాగుణమయీ మమమాయాదురత్యయా ।
మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే ॥ -4

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 5 : పుట-132
2. ఛాందోగ్యోపనిషత్, 6వ అధ్యాయం, 2వ ఖండం, 3వ మంత్రం, పుట-430
3. ఛాందోగ్యోపనిషత్, 6వ అధ్యాయం, 3వ ఖండం, 2వ మంత్రం, పుట-431
4. వ్యాసమహర్షి, భగవద్గీత, 7 : 14 : పుట-187, 188

నా మాయ దైవసంబంధమైనది. త్రిగుణాత్మకమైనది. కావున యిది దాటుటకు కష్టసాధ్యము. నన్ను శరణు బొందువారు యీ మాయను దాటివేయగలరని భావము.

యజ్ఞస్వరూపుడు అయిన శ్రీకృష్ణుని దేవతలు వినుతించుచున్నారు.

*శ్లో॥ యజ్ఞం యజ్ఞ భుజం విష్ణుం గోపబాలైస్సమన్వితమ్ ।*
*దధ్యన్నపూర్ణ శిక్యాఢ్యం జగుర్వైమానికావనే ॥ -1*

ఇక్కడ తీర్థుల వారు కృష్ణ శబ్దానికి బదులు విష్ణు శబ్దాన్ని వాడారు. యజ్ఞము, యజ్ఞభుక్కు అయినవాడు విష్ణువు అని విష్ణువునకు రెండు విశేషణాలు వాడారు.

'యజ్ఞోవై విష్ణుః' అనే శ్రుతి వాక్యానికి ఇది వ్యాఖ్య. యజ్ఞ భుక్ అనునది విష్ణు సహస్రనామాలలో విష్ణుపరంగా వాడిన ఒక నామం.

*'యజ్ఞ ఇజ్యోమహేజ్యశ్చ క్రతుస్సత్రం సతాంగతిః' -2*
*యజ్ఞో యజ్ఞపతిర్యజ్వా యజ్ఞాంగో యజ్ఞ వాహనః -3*
*యజ్ఞ భృత్ యజ్ఞకృత్ యజ్ఞీ యజ్ఞభుక్ యజ్ఞసాధనః*
*యజ్ఞాంతకృత్ యజ్ఞ గుహ్యమన్న మన్నాదయేవచ -4*
అని విష్ణుసహస్రనామాలలో వర్ణించబడినది.

## 7. బ్రహ్మ గోవులను, గోవత్సములను మాయము చేయుట :

బ్రహ్మ తాను కృష్ణుని అవతార తత్త్వమును తెలుసుకోలేక సామాన్యునిగా భావించినందులకు ఆయనను క్షమాపణ కోరుతూ ప్రార్థించిన ఘట్టాన్ని పోతన 30 గద్య పద్యాలలో వర్ణించారు. ప్రారంభంలో

"ఏకచిత్తంబున చతుర్ముఖంబుల" -5

స్తుతించాడని కవి చెప్పాడు. ఇక్కడ చతుర్ముఖంబుల అనడాన్ని బట్టి బ్రహ్మ యొక్క ముఖాల నుండి వెలువడిన వేదవాక్యాలతో వర్ణించాడని అర్థం చెప్పుకోవాలి.

భగవంతుడు వికారరహితుడని, ఇంద్రియాతీతుడని సాధారణులకు ఎరుకపడనివాడని, నిర్గుణ స్వరూపుడని, ఏకాంతచిత్తులకు మాత్రమే నిర్మలమైన యింద్రియముల చేత తెలుసుకొనుటకు వీలైనవాడని, త్రిగుణాత్మకుడని, నిర్గుణుడయ్యును అమితగుణుడని బ్రహ్మదేవుని వర్ణన.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 7 : పుట-134*
*2. విష్ణుసహస్రనామ స్తోత్రం, శంకరభాష్య సహితము, 48 : పుట-9*
*3. విష్ణుసహస్రనామ స్తోత్రం, శంకరభాష్య సహితము, 104 : పుట-15*
*4. విష్ణుసహస్రనామ స్తోత్రం, శంకరభాష్య సహితము, 105 : పుట-15*
5. పోతన భాగవతం 10 : 547 : పుట-118

*సీసం ॥* *విక్రియాశూన్యమై విషయత్వమును లేనిదగుచు నాత్మాకారమై తనరుచ*
*నంత కరణమొక్క యధిక సాక్షాత్కార విజ్ఞానమునఁ బట్టి వే ఱొరులకు*
*నెఱుఁగంగ రానిదై యేపారి యుండుటఁజేరి నీ నిర్గుణ శ్రీవిభూతి*
*బహిరంగవీథులఁబాఱక దిరములై యమలంబులగు నింద్రియముల చేత*

*ఆ॥వె॥* *నెట్టకేలకైన నెఱుఁగంగ నగుఁగాని, గుణవిలాసి వగుచుఁగొమరు మిగులు*
*నీగుణ వ్రజంబు నేరరా దెఱుఁగంగ, నొక్కమితము లేక యుంటనీశ* –1

బ్రహ్మతత్త్వం అంతా వర్ణించి అద్వైత వేదాంత కిరణాలను కవి వెదజల్లిన దీనికి యీ క్రింది వివేక చూడామణి వాక్యాలు పోషకంగా ఉన్నాయి.

*శ్లో॥* *అతీవసూక్ష్మం పరమాత్మతత్త్వం, నీస్థూలదృష్ట్యా ప్రతిపత్తుమర్హసి ।*
*సమాధినాత్యక్తసు సూక్ష్మవృత్త్యా, జ్ఞాతవ్య మార్యైరతిశుద్ధ బుద్ధిభిః ॥* –2

భగవద్గీతలో విశ్వరూప సందర్శనయోగంలో కూడా అర్జునుడు తన యెదుట ప్రత్యక్షమైన కృష్ణుని విశ్వరూపాన్ని వర్ణిస్తూ ఇలా అనడం చూస్తాము.

*శ్లో॥* *పశ్యామి దేవాంస్తవ దేవదేహే సర్వాంస్తథా భూతవిశేషసఙ్ఘాన్ ।*
*బ్రహ్మాణమీశం కమలాసనస్థ మృషీంశ్చ సర్వానురాగాంశ్చదివ్యాన్ ॥* –3

*శ్లో॥* *త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్యపరం నిధానమ్ ।*
*త్వమవ్యయశ్శాశ్వత ధర్మగోప్తా సనాతనస్త్వం పురుషోమతోమే ॥* –4

*శ్లో॥* *అనాదిమధ్యాన్త మనన్తవీర్యమనన్త బాహుం శశిసూర్యనేత్రమ్ ।*
*పశ్యామిత్వాం దీప్తహుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపన్తమ్ ॥* –5

బ్రహ్మ కృష్ణుని 'మాయలు కల్గువారలను మాయలఁ బెట్టెడి ప్రోడ'వని –6

విశ్లేషించడం చెత ఇది 'దైవీహ్యేషాగుణమయీ' –7

అన్న వాక్యమునకు వ్యాఖ్యగా ఉన్నది.

ఇంకా బ్రహ్మ ఈ జగత్తులకు కార్యము కారణము కూడా భగవంతుడే అని వర్ణిస్తాడు.

---

1. *పోతన భాగవతం 10 : 553 : పుట–120*
2. *శంకరాచార్యులు, వివేక చూడామణి 361 : పుట–187*
3. *వ్యాసమహర్షి, భగవద్గీత, 11 : 15 : పుట–252*
4. *వ్యాసమహర్షి, భగవద్గీత, 11 : 18 : పుట–253*
5. *వ్యాసమహర్షి, భగవద్గీత, 11 : 19 : పుట–254*
6. పోతన భాగవతం 10 : 556 : పుట–121
7. *వ్యాసమహర్షి, భగవద్గీత, 7 : 14 : పుట–187, 188*

"కారణకార్య రూపమునైన యీ సకలంబు నీ కడుపులోనిది గాదె" -1

అద్వైత వేదాంతపరంగా సృష్టికంతటికీ నిమిత్త కారణం, ఉపాదాన కారణం కూడా బ్రహ్మమే. దానినే పోతనగారు వర్ణించారు.

అంతే కాకుండా నీ అసలు రూపం యిది కాదని, ఈ జగత్తంతా కలవంటిదని, దుఃఖమయమని, అజ్ఞానంలో మునిగి ఉన్నదని, నీ మాయ చేత యీ జగత్తు పుట్టుతూ, ఉంటూ లేకుండా పోతూ ఉన్నట్లు అనిపిస్తుందని, నీవు మాత్రమే సత్యమైనవాడని, ఆత్మస్వరూపుడవైన నీవు అంతము లేనివాడవని మరొక శరీరం అక్కరలేనివాడవని, ఆద్యుడవని, నీకు సాటి రెండవవాడు లేడని, ఆదిపురుషుడవని, సనాతనుడవని, షోడశ కళాప్రపూర్ణుడవు నీవని పోతనగారు బ్రహ్మపలుకుల రూపంలో అద్వైతపరంగా వర్ణించారు.

*సీసం ॥ అది గాన నిజరూపమనరాదు, కలవంటిదై బహువిధ దుఃఖమై విహీన*
*సంజ్ఞానమైయున్న జగము సత్సుబోధ తనుఁడవై తుదిలేక తనరు నీదు*
*మాయచేఁ బుట్టుచు మనుచులేకుండుంచునున్న చందంబున నుండుచుండు*
*నొకఁడ, వాత్మఁడ, వితరోపాధిశూన్యుండ, వాద్యుండ, వమృతుండ, వక్షరుండ*

*ఆ॥వె॥ వద్వయుండవును, స్వయంజ్యోతి, వాపూర్ణుఁడవు, పురాణపురుషుఁడవు, నితాంత*
*సౌఖ్యనిధివి, నిత్యసత్యమూర్తివి, నిరంజనుఁడ వీవు, దలఁపఁ జనునె నిన్ను ? -2*

ఈ సందర్భంలోనే సూర్యునితో పోలుస్తూ అట్టి గురుడు ప్రసాదించిన జ్ఞానం అనే నేత్రంతో ఉపనిషదార్థాన్ని తెలుసుకొని ప్రపంచము యొక్క మిథ్యాస్వరూపాన్ని అవగాహన చేసుకోవడం కర్తవ్యమని ఒక ఉపాయాన్ని కవి సూచించాడు. ఆయన ఇంకా రజ్జువు నందు సర్పభ్రాంతిని పొంది పరిశీలన ద్వారా అది రజ్జువే అనే యదార్థాన్ని జీవులు గ్రహించుకొనే విధంగా అజ్ఞానం చేత జగత్తును శాశ్వతమనుకొని (గురువిచ్చిన) జ్ఞానం చేత అదంతా బ్రహ్మమయమేనని తెలుసుకుంటారని రజ్జు సర్పభ్రాంతి అనే అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పరమేశ్వరునికి బంధమోక్షాలనేవి లేవని చెప్పేది కూడా అద్వైత వేదాంతమే.

పరిపూర్ణమై, పురాతనమై, ఆనంద స్వరూపమైన బ్రహ్మమే చెలికాడుగా గల యీ గోపకులెంత ధన్యులో కదా అని బ్రహ్మదేవుడు భావిస్తాడు.

*కందం॥ పరిపూర్ణంబుఁబురాణముఁ, బరమానందంబునైన బ్రహ్మమె చెలికాఁ*
*డరుదరుదు నందఘోష, స్థిరజనముల భాగ్యరేఖ చింతింపంగన్ -3*

---

1. పోతన భాగవతం 10 : 558 : పుట-122
2. *పోతన భాగవతం 10 : 566 : పుట-124*
3. *పోతన భాగవతం 10 : 570 : పుట-126*

ఈ వాక్యాలలో "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" -1

అనే ఉపనిషత్ సూక్తి ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంలో వివేక చూడామణిలోని యీ క్రింది శ్లోకాల అర్థానికి పై వర్ణనం సమానంగా నడిచింది.

తీర్థులవారు యీ ఘట్టంలో రెండు తరంగాలను రచించారు.

అలా వచ్చిన బ్రహ్మ కృష్ణుని స్తుతించినట్లుగా తీర్థుల వారు చెప్పారు.

*శ్లో॥ ఇత్థం భూతం హరిం దృష్ట్వా వత్సరాంతే విధిః స్వయమ్ ।*
*సందర్శిత జగత్కోటి శరీరంస్తౌతి సాదరమ్ ॥ -2*

ఇక్కడ వత్సరాంతే అని చెప్పడం ద్వారా యిలా కృష్ణుడు గోవత్సరూపాలను ధరించిన కాలం సంవత్సరమని సూచించారు. "సందర్శిత జగత్కోటి శరీరం" అని కృష్ణునకు వాడిన విశేషణం మన దృష్ట్యా లౌకికం. ప్రస్తుత కథలో గోపాల గోవత్సరూపాలను ధరించిన కృష్ణునకు అన్వయిస్తుంది కనుక. కానీ యీ విశేషణంలో అనేక జగత్తులే శరీరంగా కలవాడు అనే విస్తృతార్థంలో ప్రయోగించడం కథకు అనవసరం. అయితే బ్రహ్మదృష్ట్యా ఆలోచిస్తే ఆయనకు విష్ణువు తనతో పాటుగా మొత్తం లోకాలనన్నింటినీ వ్యాపించి ఉండేవాడు విష్ణువని తెలుసును కాబట్టి తీర్థులవారు ఆలోచించి బ్రహ్మదృష్టితో యీ విశేషణం వేశారు.

*కీర్తన : ప॥ జయజయగోకులబాల జయసకలాగమమూల*
*అ॥ప॥ దయయా మాంగోపాల దీనంపాలయబాల*

*చరణం: దేవమయా చరితమిదం దీనధియా అపరాధం*
*శ్రీ వసుధాధవ కృపయా కేవలమిహ ధునుహి*

*చరణం: ఈక్షేతావకదేహే ఈశజగంతి నిరీహే*
*వీక్షాశిక్షితమోహే వేదాంతాగమనగేహే*

*చరణం: జగదండకోటి తనో జగదుదరాంతరసుతనో*
*అగణితసంజాతమనో హి అపరిమితాశ్రితధేనో*

*చరణం: వితరమయీశ్వర కరుణాంవిఘటయమోహావరణం*
*సతతం మేభవశరం సాధయసంసృతితరణం*

*చరణం: ఇతివిధినా పరిగీతం శ్రుతివచసా హరచరితం*
*యతినారాయణకథితం యదుకుల భూషణముదితం -3*

---

1. *తైత్తరీయోపనిషత్, బ్రహ్మానందవల్లీ, 1వ అనువాకం, పుట-72*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 14 : పుట-143*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 9 : పుట-143, 144*

నా అపరాధమును మన్నింపమని వేడుకుంటూ బ్రహ్మ కృష్ణుని ప్రార్థిస్తాడు. నీ శరీరంలో ఎన్నో బ్రహ్మాండాలను చూడగల్గుతున్నాను అని 'జగదండకోటి తనో', 'జగదుదరాంతర సుతనో' అని అద్భుతాన్ని ప్రకటిస్తాడు. వీటిలో మొదటిది 'సందర్శిత జగత్కోటి శరీరం' అన్న పై శ్లోకవిశేషణానికి సరిపోయింది. బ్రహ్మాండములే విష్ణువు యొక్క శరీరమని దీని తాత్పర్యం. రెండో విశేషణం జగములన్నిటి యందునూ అంతర్యామిగా ఉన్నాడన్న విశేషణాన్ని తెలుపుతుంది. ఇవి రెండునూ ఉపనిషద్వాక్యాలకు వ్యాఖ్య.

'తత్ సృష్ట్వా తదేవానుప్రవిశత్' *-1*

మోహావరణాన్ని తొలగింపుము, సంసృతి నుండి తరింపజేయుము అని వేడుకొనడం ఒక భక్తుని శరణాగతి లక్షణానికి సూచకం. బ్రహ్మదేవుడంతటి వానికి కూడా మోహాన్ని సంసార లక్షణాలను కల్పించగల శక్తిమంతుడు విష్ణువని తీర్థులవారు చెప్పినట్లుగా మనం భావించాలి. ఇంకా బ్రహ్మ శ్రీకృష్ణుని గూర్చి యీ విధంగా వేడుకున్నాడు.

*కీర్తన : ప॥ దేవదేవ ప్రసీదమే*

*అ॥ప॥ దీనజనపరిపాల - దే*

*చరణం: లీలావినోదవిగ్రహ లక్ష్మీపతే*
*బాలమోహవినిగ్రహ బాలోన్నతే*
*కలితసేవకానుగ్రహ కామాకృతే*
*అలఘువీర్యపరిగ్రహ అఖిలాండపతే*
*(అ)ఖిలమునిబృందానుగ్రహ గోపాలకృష్ణ*
*బాలఘననీలాతిసుశీల హేమచేలానంత*
*లీలాగమమూల శ్రీలోలాతివిశాలఫాల బాలగోపాలకృష్ణ*

*చరణం: శ్రీవత్సలక్షణాంచిత శ్రీభావిత*
*దేవగంధర్వసేవిత దివ్యాయుధ*
*గోవత్సగణసంవృత గోపాలవృత*
*అవ్యయముని వందిత అచింతిత*
*భవ్యగోకులనిరత గోపాలకృష్ణ*
*పీతాంబరవీత విధుశీతాఖిలతాతాఘవి*
*ఘూతార్జునసూతామరగీతాగమ జాతభాత బాలగోపాలకృష్ణ* *-2*

---

1. *తైత్తరీయోపనిషత్, బ్రహ్మానందవల్లీ, 6వ అనువాకం, పుట-117*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 10 : పుట-146, 147*

*చరణం: పూర్ణేందు మండలాలన పురాతన*

*పూర్ణసుపర్ణవాహన వరానన*

*తీర్థసంసారమోహన ధీరాయన*

*కర్ణకుండల శోభన కంజానన*

*వర్ణితవీర్యవామన గోపాలకృష్ణ*

*నారాయణ ధీరాగమసారాఘవిదూరాసమ*

*హరారి విదారామరవీర సంసారపార బాలగోపాలకృష్ణ -1*

ఇక్కడ వాడిన 'అలఘువీర్యపరిగ్రహ' అనే విశేషణం భగవలక్షణాలలో ఒక దానికి సూచన.

"ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః। జ్ఞాన వైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగఇతీంగనా॥ -2

'అచింతిత' అనే విశేషణం ఉపనిషత్తులలోని 'యతోవాచోనివర్తన్తే అప్రాప్య మనసా సహ' -3

అన్న తైత్తరీయానికి వ్యాఖ్య.

'అవ్యయ' అనేది కూడా అట్టిదే. 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' యోవేద నిహితం గుహాయాం పరమేవ్యోమన్ -4

మొదటి దానిలో తన అపరాధాన్ని క్షమించమని వేడటం ప్రధానాంశం.

ఇక్కడ తీర్థుల వారు 'వీక్షాశిక్షితమోహే వేదాంతాగమనగేహే' అంటూ వాడిన రెండు విశేషణాలు వేదాంతపరంగా ఉన్నాయి. దృష్టి మాత్రం చేతనే మానవుల యొక్క మోహాన్ని తొలగించేవాడని ఆ మొదటి దానికి అర్ధం. ఇది సగుణ నిర్గుణ రూపాలను రెండింటినీ కూడా చెబుతున్నది. దైవదర్శనం అవడం, భక్తులు వరాలు కోరడం ఆయన తన చూపుల ద్వారా భక్తుణ్ణి అనుగ్రహించడం సగుణ రూపారాధన. సాధకుని వైపు నుండి చూస్తే సమ్యక్ దర్శనం ద్వారా అజ్ఞానాంధకారం తొలగిపోతుంది అనే విశేషణం నిర్గుణపరంగా ఉంది.

రెండో విశేషణం అద్వైత వేదాంతము నందే నివశించువాడు అని కేవల శంకరాద్వైత ప్రస్తావన ఇక్కడ చేయబడినది.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 10 : పుట-146, 147*
2. *వ్యాస మహర్షి, అగ్నిపురాణం, 379 : 11 : పుట-436*
3. *ఉపనిషత్తు కల్పతరువు, తైత్తరీయోపనిషత్తు, ఆనందవల్లీ, 3వ అధ్యాయనం, 9వ అనువాకం, పుట-96*
4. *ఉపనిషత్తు కల్పతరువు, తైత్తరీయోపనిషత్, బ్రహ్మానందవల్లీ, మొదటి అనువాకం, పుట-72*

ఇక్కడే 'సతతంమేశరణం భవ' అనే చోట విశిష్టాద్వైతం కనబడుతుంది. అనగా శరణాగతి తత్త్వం.

*సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణంవ్రజ ।*
*అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామిమాశుచ ॥ -1*

అద్వైతంలో జీవుడు బ్రహ్మలో కలవడం ఉంది. విశిష్టాద్వైతంలో పరమేశ్వరానుగ్రహాన్ని తపస్సు మొదలైన వాని ద్వారా పొంది ఆయన లోకానికి చేరుకోవడం ఉంటుంది.

నిజానికి శరణాగతి అనే పదానికి అర్థం ఆలోచిస్తే విశిష్టాద్వైత సిద్ధాంతం నిలబడదు అని అద్వైతుల మతం. ఎలాగంటే శరణం అనే శబ్దానికి గృహము, రక్షించువాడు అనే రెండు అర్థాలున్నాయి.

ఇక్కడ విశిష్టాద్వైతులు రెండవ అర్థాన్ని స్వీకరించారు. అద్వైతులు మొదటి అర్థాన్ని స్వీకరించారు. ఒక గృహస్థుడు ఇల్లు విడిచి ఆయా వ్యవహారాల మీద బయటకు వెళ్ళి అవన్నీ ముగించుకొని ఎప్పటికైనా చేరేది ఇంటికే కదా! అలాగే బ్రహ్మము నుండి వచ్చిన జీవుడు బ్రహ్మములోనికే చేరుకోవడం సహజం. దీనినే సాయుజ్యముక్తి అంటారు. ఈ రెండు అర్థాలలో మొదటి దానిని విడిచి రెండవ దానిని స్వీకరించడం శాస్త్ర సమ్మతం కాదు. "ప్రథమాతిక్రమణే కారణాభావాత్" -2

మొదటిది కుదరకపోతే తప్ప రెండవదానిని ఆశ్రయించవలసిన పని లేదు అని శాస్త్రజ్ఞమతం అప్పుడు అద్వైతార్థమే యీ కీర్తనలో చెప్పబడినట్లుగా నిర్ధారించాలి.

అప్పుడు అర్జునునికి శ్రీకృష్ణుడు నేర్పిన శరణాగతి తత్త్వం యొక్క స్వరూపం ఎలాంటిది? అన్ని ధర్మములను విడిచి నన్ను శరణు కోరిన (వారికి) నీకు మోక్షాన్ని ఇస్తాను అని కదా కృష్ణుని యొక్క హామీ? మోక్షం కావాలంటే భగవంతుని శరణు కోరవలసిందే కదా అనే ప్రశ్న ఉదయిస్తుంది.

అయితే శరణు కోరేవాడు శరణు ఇచ్చేవాడు ఒక్కరే అయినప్పుడు సిద్ధించేది అద్వైతమే కదా! వ్యవహారంలో భేదమే తప్ప పరమార్థంలో భేదమేమున్నది? అట్లే తీర్థుల వారు 'సతతంమే శరణం భవ' అని ప్రార్థించడం వ్యావహారిక శరణాగతియే కాని పారమార్థికము కాదు. కాబట్టి ఇక్కడ కూడా అద్వైతమే స్థాపించబడింది.

పోతన గారి బ్రహ్మ ప్రార్థనలో శ్రీకృష్ణుల బహిఃసౌందర్యం ఒక వంతు. బ్రహ్మతత్త్వనిరూపణం రెండు వంతులు ఉన్నట్లుగా నిరూపించవచ్చును. భాగవతం శాస్త్రం కాబట్టి శాస్త్రమర్యాదానుసారంగా వేదాంత తత్త్వాన్ని నిరూపించవలసిన బాధ్యత కవికి ఉంది కాబట్టి వ్యాసులవారు, ఆయనను అనుసరించిన పోతనగారు పై రీతిగా వేదాంతచర్చకు సముచితమైన స్థానం ఇచ్చారు.

---

1. *వ్యాసమహర్షి, భగవద్గీత, 18 : 66 : పుట-413*
2. *లోకోక్తి*

తీర్థుల వారి కీర్తనలలో ప్రాస్తావికంగా వేదాంతము, సందర్భోచితంగా వ్యక్తి రూపవర్ణనం బ్రహ్మపరంగా సాగింది. సారాంశముగా శరణాగతి తత్త్వంతో ఎక్కువ భాగం నిండి ఉన్నది. ఇక్కడ అది అవసరం కూడా. బ్రహ్మ అజ్ఞాన వశం చేత శ్రీకృష్ణుని మాహాత్మ్యం తెలుసుకోలేక ఏడాది పాటు గోగోప సంపదను మాయం చేయడం ఒక అపరాధం. దానికి క్షమాపణగా చేసిన యీ ప్రార్థనలో వేదాంత విషయాలకు అసలు తావు ఉండదు.

అయితే తీర్థుల వారు యోగీంద్రుడు కాబట్టే వేదాంత ప్రశంస సహజంగానే ఏ ప్రార్థనాఘట్టంలోనైనా చోటు చేసుకొంటుంది. ఈ రకంగా పోతనగారు, తీర్థుల వారు కూడా యీ ఘట్టానికి రమణీయతను, పఠనీయతను కల్పించారు.

**8. కాళియుని భార్యలు కృష్ణుని స్తుతించడం :**

కాళియుడు తన పణాశతాన్ని భగ్నం చేసిన కృష్ణుడు

"సర్వచరాచరభూతేశుండైన పరమపురుషుడు" -1

అని నిశ్చయించుకున్నాడని పోతన వర్ణన. ఇది అద్వైతపరమైన విశేషణం విశిష్టాద్వైతులకు కూడా యీ విశేషణాలు ఇష్టమే.

కాళియుని భార్యలు క్రూరాత్ములను దండించడం కోసం ధారుణిపై అవతరించిన మహానుభావుడవు నీవని విన్నవించుకున్నారు.

*కందం॥ క్రూరాత్ముల దండింపఁగ, ధారుణిపైన నవతరించి తనరెడి నీకీ*
*క్రూరాత్ముని దండించుట, క్రూరత్వముగాదు సాధుగుణము గుణాఢ్యా ॥ -2*

కృష్ణుని యీ విధంగా వర్ణించడంలో గీతలోని సాధురక్షణ కొరకు తాను అవతరిస్తానన్న కృష్ణవాక్యం ఇక్కడ స్ఫురిస్తున్నది.

*శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతాం*
*ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే -3*

వారి వర్ణనలో నిర్గుణస్వరూపము కల పరమేశ్వరుడే సగుణరూపంలో భూలోకంలో ఆవిర్భవించాడని భావనయే కాకుండా సకల పురుషాంతర్యామి, అచ్ఛిన్నుడు, భూతవాసుడు, భూతమయుడు, కారణాతీతుడు, పరమాత్ముడు, జ్ఞాన విజ్ఞాన పరిపూర్ణుడు, అనంతశక్తి, అప్రాకృతుడు మొదలైన అద్వైత విశేషాదులు ఇక్కడ ఎన్నింటినో చూస్తాము.

---

1. పోతన భాగవతం 10 : 669 : పుట-148
2. *పోతన భాగవతం 10 : 673 : పుట-149*
3. *వ్యాసమహర్షి, భగవద్గీత, 4 : 8 : పుట-120*

అంతేకాకుండా వారు సమస్త విశ్వము నీవే అని, దీనిని నిర్మిస్తూ ఉన్నది నీవే అని, విశ్వంగా ఉంటూ విశ్వాన్ని చూస్తూ ఉన్నవాడివి కూడా నీవే అని, పంచతన్మాత్రలు, పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తం, ప్రాణం ఇవన్నీ నీవే అని, సత్త్వరజస్తమో గుణాలకు అతీతుడవని, గమనించడానికి వీలులేని సూక్ష్మరూపుడవై ఉన్నావని వర్ణించడం ద్వారా అద్వైత వేదాంత ప్రాముఖ్యం కనబడుతున్నది. సాంఖ్యుల చతుర్వింశతి తత్త్వ నిరూపణ కూడా ఇక్కడ కనబడుతుంది.

*సీస॥ విశ్వంబు నీవయై విశ్వంబుఁజూచుచు, విశ్వంబు సేయుచు విశ్వమునకు*
*హేతువవై పంచభూతమాత్రేంద్రియములకు మనఃప్రాణ బుద్ధిచిత్త*
*ములకెల్ల నాత్మవై మొనసి గుణంబుల నావృతమగుచు నిజాంశభూత*
*మగు నాత్మచయమున కనుభూతి సేయుచుమూఁడహంకృతులచే ముసుఁగువడక*

*తే॥గీ॥ నెఱిననంతుఁడవై దర్శనీయరుచివి, గాక సూక్ష్ముఁడవై నిర్వికారమహిమఁ*
*దనరికూటస్థుఁడన సమస్తంబు నెఱుఁగు, నీకు మ్రొక్కెద మాలింపు నిర్మలాత్మ ఁ* –1

*"వేదమయ నిశ్వాసత్వంబువలనశాస్త్రయోనివి"*
*"అంతఃకరణప్రకాశకత్వంబుగలిగి" నవాడవు*
*"ఒరులకెఱుంగరామినగోచరుండవు"*
*"తర్కింపరాని పెంపువలన నవ్యాహతవిహారుండవు"* –2

మొదలగునవి కాళియుని భార్యల ప్రార్థన రూపంలో అద్వైతపరంగా కనబడతాయి.

తీర్థుల వారి గ్రంథంలో కాళియపత్నులు స్తుతిప్రార్థనలో మాకు పతిభిక్ష ప్రసాదింపుమని కోరడమే వారి ప్రధాన లక్ష్యంగా కనబడుతుంది. అయితే కొన్ని విశేషణాలు కృష్ణునిపరంగా వారు వాడినవి అద్వైతపరంగా అన్వయిస్తున్నాయి.

కృష్ణుడు బలరాముని ప్రోత్సాహంతో కాళియుని చీల్చి చెండాడి జలాలలో పడద్రోసి వాని శిరస్సుపై నాట్యం చేశాడు. తరువాత కాళియుని భార్యలు అక్కడకు వచ్చారు.

---

1. *పోతన భాగవతం 10 : 681 : పుట–151*
2. *పోతన భాగవతం 10 : 682 : పుట–151*

కీర్తన : ఆయాతినాగదారకదంబం ప్రతి
మాయాకలితలోకకదంబం
నందాదియోగిబృంద చింత్యపాదం పరమా
నందైక కందమాశ్రిత వేదం
ఫణిఫణాసమర్పిత పాదారవిందం నిత్య
మణిమాది భూతిదమఖండితానందం
కమనీయ కాలమేఘాభిరామం గోప
కామినీ బృంద కలిత కామం
నానావిచిత్ర లీలావినోదం శ్రీ
నారాయణతీర్థ భయ వరదం -1

ఇక్కడ 'మాయాకలితలోకకదంబం' అనే విశేషణం.

శ్లో॥ మాయాంతుప్రకృతింవిద్ధి మాయినంతుమహేశ్వరమ్ ।
తస్యావయవభూతైస్తు వ్యాప్తం సర్వమిదం జగత్ ॥ -2

అనే ఉపనిషత్ సూక్తికి వ్యాఖ్య. పరమానందైక కందం అనునది కూడా ఇట్టిదే.
'ఆనందోబ్రహ్మేతి వ్యజానాత్', -3
'ఆశ్రితవేదం' అనేది మరొకటి.

యస్యనిశ్వసితం వేదా యో వేదేభ్యోఽఖిలం జగత్ ।
నిర్మమే తమహం వందే విద్యాతీర్థం మహేశ్వరమ్ ॥ -4

అను స్మృతివాక్యానికి ఇది వ్యాఖ్య.

"ఆగమైక వరణ, అశేషలోకకారణ, సర్వబుద్ధిషుప్రహితా, వేదవిదితా" -5

అను నటువంటివి మొదలగునవి కూడా అదేవిధంగా కనిపిస్తున్నాయి.

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 7 : పుట-179
2. శ్వేతాశ్వతరోపనిషత్, 4 : 10 : పుట-73
3. ఉపనిషత్తు కల్పతరువు, భృగువల్లీ, 6వ అనువాకం, పుట-168
4. చతుర్వేద సంహిత, భూమిక, పుట-21
5. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 8 : పుట-180, 181

ఈ ఘట్టంలో పోతనగారు విపులీకరించిన అద్వైత వేదాంతం శాస్త్రమర్యాదలతో కూడి ఉన్నది. తీర్థుల వారి వర్ణనమంతా పాత్ర యొక్క ప్రయోజన వాదిత్వాన్ని సూచిస్తున్నది. గ్రంథాన్ని విస్తరించడం పోతన గారి ప్రణాళిక, కుదించడం తీర్థుల ప్రణాళిక. కనుక రెండునూ సమంజసములే.

## 9. యజ్ఞపత్నులు కృష్ణుని స్తుతించుట :

ఈ యజ్ఞపత్నులకు కృష్ణుడనిన గోపికల కంటే ప్రేమ ఎక్కువ. భర్తలు అడవిలోని గో, గోపాలురకు యజ్ఞక్రియ పూర్తి అయ్యే వరకు అన్నం పెట్టడానికి వీలు లేదని ఆంక్ష పెట్టారు. వీరు పతుల ఆజ్ఞ ధిక్కరించి ఆ గో గోపకులకు ఆహారం పెట్టడానికే ముందుకు వచ్చారు.

*కందం॥ బిడ్డలు మగలును భ్రాతలు, నడ్డము చనివలదనంగ నటుదలఁడని మా*
*ఱొడ్డుచు జగదీశ్వరునకు, జడ్డన నన్నంబు గొనుచుఁజని రా సుదతుల్ -1*

కృష్ణుడు తన వద్దకు వచ్చిన యజ్ఞపత్నులను వారించి 'యాగవాటంబునకుచనుండు' అని హితవు చెప్పగా వారు ససేమిరా అన్నారు. ఆయన వారి భక్తికి మెచ్చి మీరీ విధంగా నన్నాశ్రయించి వచ్చినందులకు మీ పతులు, భ్రాతలు, బంధులు, సుతులు నిందింపకుందురు గాక. దేవతలు యీ చర్యకు మిమ్ములను మెచ్చుకుంటారు. నా శరీరమును ఆలింగనము చేయుట నరులకు ఆనందదాయకమగుటయే గాక అది ముక్తిదాయకము కూడా అని పలుకుతాడు.

ఈ వాక్యములు

"కౌంతేయ ప్రతిజానీహి నమేభక్తప్రణశ్యతి" -2

అనే భగవంతుని ప్రతిజ్ఞకు చివర చెప్పిన శరణాగతి తత్త్వానికి అనుగుణంగా సాగినది.

ఒక జీవాత్మ పరమాత్మలో ఐక్యం కావడానికి పడే తాపత్రయం విప్రభార్యలలోను, శ్రద్ధాభక్తులతో సేవించిన వారిని పరమాత్మ తనలో ఐక్యం చేసుకుంటాడనే అభయం శ్రీకృష్ణునిలోను పోతనగారు చక్కగా వేదాంతపరంగా విశదీకరించారు.

వారు కృష్ణునకు భోజనం పెట్టి తిరిగి వచ్చేటప్పటికి యాజ్ఞీకుల మనస్సు కూడా మారిపోయింది. భక్తుడు తనతో పాటు ఇతర భక్తులను కూడా తరింపజేస్తాడనేది విశిష్టాద్వైత సిద్ధాంతం అంతే కాదు భక్తుడు భగవంతుని కంటే శక్తివంతుడు అని వారి విశ్వాసం.

---

*1. పోతన భాగవతం 10 : 859 : పుట-194*

*2. వ్యాసమహర్షి, భగవద్గీత, 9 : 31 : పుట-225*

పశ్చాత్తాపంతో వారు యిలా ప్రార్థిస్తారు.

*మత్తేభం॥ క్రతువుల్ ధర్మము మంత్రతంత్ర ధనముల్ గాలంబు దేశంబుదే*
*వతయున్ వహ్నులు మేదినీసురులు నెవ్వాఁడిట్టి సర్వేశుఁడీ*
*క్షితి రక్షింప జనించినాఁ; డెఱుఁగ; మాశ్రీభర్తకుంగర్తకుం*
*గుతలోద్ధర్తకుమేము మ్రొక్కెదము రక్షోనాథసంహర్తకున్ ॥ –1*

ఈ పద్యంలో క్రతువులు, ధర్మాలు, మంత్రాలు, దేశకాలాదులు, దేవతలు, అగ్నులు, బ్రాహ్మణాది మానవులు ఆ పరమేశ్వరుడి స్వరూపములే అనే అద్వైతం స్ఫుటంగా స్థాపింపబడింది.

తీర్థుల వారు యజ్ఞపత్నులు ప్రార్థనానికి ఉపోద్ఘాతంగా యిలా అంటారు.

*శ్లో॥ యజ్ఞపత్న్యస్త మీశానం లీలాగోపాల విగ్రహమ్ ।*
*ప్రసాదయంతి యంవేదా స్తాత్పర్యేణామనంతి తే ॥ –2*

ఇక్కడ వేదములన్నీ ఎవరిని గూర్చి వర్ణిస్తున్నాయో ఆ లీలాగోపాలుని వారు స్తుతించారని తాత్పర్యం. ఇక్కడ గోపాలతాపిన్యుపనిషత్ అనునది బృందావనములో గోపికలతో విహారం చేసే కృష్ణుని లీలలను వర్ణిస్తున్నది.

ఒక జీవుడు పరమాత్మ కోసం తహతహలాడి సర్వస్వ సమర్పణ ద్వారా సాయుజ్యముక్తిని పొందడం ఈ ఉపనిషత్తులోని విషయం. ఈ యజ్ఞపత్నుల ప్రార్థన దానికి అనుగుణంగా సాగటం చూస్తాము.

*శ్లో॥ ఏకోవశీ సర్వగః కృష్ణ ఈడ్యః, ఏకోఽపిసన్ బహుధా యోవిభాతి ।*
*తంపీఠగం యేఽను భజంతిధీరాః, తేషాగుంసిద్ధి శ్శాశ్వతీ నేతరౌషాయ్ ॥ –3*

జగత్తునంతటినీ వశపరచుకున్న కృష్ణుడొక్కడే నమస్కరింపతగినవాడు. ఒక్కడే అయిననూ అతడు అనేక రూపములను ధరించుచున్నాడు. ఆయనను పీఠమునందుంచి ఎవరు పూజిస్తారో వారికి అన్ని సిద్ధులు శాశ్వతములగును.

ఈ విధమైన భావన ఇటు గోపికలు, అటు బ్రాహ్మణపత్నులు కలిగినవారు కాబట్టి అవకాశాన్ని సద్వినియోగము చేసుకొని కృతార్థులైనారు.

"బాల గోపాల మాముద్ధర పరమ కళ్యాణ గుణాకర" –4

---

*1. పోతన భాగవతం, 10 : 855 : పుట–193*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 25 : పుట–157*

*3. గోపాలతాపిన్యుపనిషత్ 4వ మంత్రం, పుట–1435*

*4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 14 : పుట–158*

కీర్తనలో కళ్యాణగుణాకర అనే విశేషణం విశిష్టాద్వైతాన్ని తెలిపేది. ద్వైతులు కూడా ఇలాగే చెబుతారు. అద్వైతులకిది అంతగా సమ్మతింపదు. 'యతిజనముక్తిదసువ్రత' –1

అనేది అద్వైతుల మాట.

"అన్నమయాదిఘపంచసుత్వామంతరమానంద విగ్రహమ్" –2

అనేది పూర్తిగా తైత్తరీయోపనిషద్వర్ణనమే.

దీనిలో అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాల వివరణముంది. ఒక్కని కంటే ఒకటి సూక్ష్మమయినది. ఈ ఐదింటినీ దాటి జీవుడు సాధన ద్వారా ఆనందమయ కోశంలో స్థిరంగా నిలబడిపోయి ముక్తిని పొందుతాడు. ఆనందమే అయిపోతాడు. అదే సాయుజ్యముక్తి. ఇది అద్వైతుల చరమ సిద్ధాంతం. తీర్థులు ఆనందవిగ్రహం, ఉదయలయాదిలక్షితం, సత్యవిజ్ఞానసుఖాకృతిం, అపార మహిమానం, అణిమానం అనే విశేషణాలను అద్వైతపరంగా వాడటం చూస్తాము. వీనితో పాటు మందస్మిత సుందరానన, కోటిమదన సుందర జగన్మోహన, యోగిచింతిత, సకలమునిగీత మొదలగునవి పౌరాణిక విశేషణాలను వాడి విశిష్టాద్వైతులను సంతృప్తిపరిచాడు.

ఈ రీతిగా పోతనగారు కానీ, తీర్థులవారు కానీ, కథాఘట్టానికి అనుగుణంగా దైవతత్త్వాన్ని ద్వైతాద్వైత, విశిష్టాద్వైతపరంగా వాడి అన్నింటినీ మించినది భక్తి అని స్థాపించారు. ఈ విషయంలో పోతనగారు (సాహిత్యపరంగాను) శాస్త్రపురాణపరంగాను, తీర్థులవారు ఉపనిషత్పరంగాను వర్ణించడానికి ప్రాధాన్యం చూపారని భావించవచ్చు.

## 10. దేవేంద్రుడు కృష్ణుని నుతించడం :

కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గోగోపకులకు ఇంద్రుని వల్ల కలిగిన ఉపద్రవాన్ని తప్పిస్తాడు. ఇంద్రుడు త్రిలోక రాజ్యమదాన్ని విడిచి నిర్గర్వియై కృష్ణుని శరణు కోరతాడు.

*సీస॥ నీధామంబు భాసురసత్త్వంబు; శాంతంబు; హతరజస్తమము; నిత్య*
*మధికతపోమయ; మట్లుగావున మాయనెగడెడి గుణములు నీకు లేవు*
*గుణహీనుఁడవు గాన గుణములనయ్యెడి లోభాదికరములు నీలోనఁజేర*
*వైనదుర్జననిగ్రహము శిష్టరక్షయుఁదగిలి సేయఁగ దండధారివగుచు –3*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 14 : పుట–158*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 14 : పుట–158*

*3. పోతన భాగవతం 10 : 938 : 212*

*తే॥గీ॥ జగముభర్తవు; గురుఁడవు; జనకుఁడవును, జగదధీశుల మను మూఢజనులు దలఁక*
*నిచ్చపుట్టిన రూపంబులీవుదాల్చి, హితము సేయుదు గాదె లోకేశ్వరేశ !* –1

ఆయన చేసిన స్తోత్రంలో పరమ, భాసురతత్త్వం, శాంతము, నిత్యము అయిన బ్రహ్మోనివి నీవే అని కృష్ణుని విశేషించడం చేత అద్వైతపరమైన పరతత్త్వ వర్ణనం భాసమానమవుతుంది.

"మాయనెగడెడి గుణములు నీకు లేవు" అనే విశేషణం వలన భగవంతుడు మాయాతీతుడు, గుణాతీతుడు అనడం ఉపనిషత్‌పరమైన వర్ణనయే.

'దుర్జన నిగ్రహం' దుష్టశిక్ష, శిష్టరక్ష చేయడానికి అవతరించావనడం 'పరిత్రాణాయ సాధూనాం' –2 అన్న గీతావాక్యానికి పునరుక్తి.

"నిఖిలబీజ భూతాత్మకబ్రహ్మ" అనేది స్పష్టంగా అద్వైత విశేషణమే. –3

"ఘనలీలావిభవంబుపెంపుఁదెలియంగా నెవ్వఁడన్? సర్వగా!" –4

అనే సంబోధన సర్వాంతర్యామిత్వం వర్ణించే విశేషణం.

కృష్ణుడు ఇంద్రునితో నీ గర్వాన్ని అణచడం కోసం ఇంద్రయాగాన్ని తప్పించాను. ఇది అనుగ్రహమే కాని నిగ్రహం కాదు. నేను ఉద్ధరించదలచుకున్న వానిని నిర్ధనుణ్ణి చేస్తూ ఉంటాను అని చెప్పడం చూస్తాము. భగవంతుని లీలా విశేషాలలో ఇదొకటి. భగవంతుడు సర్వశక్తిమంతుడు అనే అద్వైత సిద్ధాంతాన్ని యిది నిరూపిస్తున్నది.

విశ్వేశ, విశ్వభావన, విశ్వాకృతి అని ఇంద్రుడు కృష్ణుని విశ్వాత్మకుడిగా వర్ణించడం కూడా అటువంటిదే.

*కందం॥ విశ్వేశ ! విశ్వభావన ! విశ్వాకృతి ! యోగివంద్య ! వినునీచేతన్*
*శాశ్వతులమైతిమిప్పుడు, శాశ్వతముగఁగంటి మధికసౌఖ్యంబు హరీ ॥* –5

ఈ సందర్భంలో తీర్థుల వారు భగవత్పరంగా ఆదిపురుష, అనాధార, నిత్యద, జగదాధార, శ్రుత్యంతవన సంచార, ఆదిత్య చంద్రమండలాభ్యంతరాధార, బోధరూపానంద నిరుపమ నిర్మలానంద, నానాగమాంత సంచార అనేవి విశేషణాలుగా వాడారు. ఇవన్నీ అద్వైతపరమైన విశేషణాలే.

---

*1. పోతన భాగవతం 10 : 938 : పుట–212*
*2. వ్యాసమహర్షి, భగవద్గీత, 4 : 8 : పుట–120*
*3. పోతన భాగవతం, 10 : 941 : పుట–213*
4. పోతన భాగవతం, 10 : 943 : పుట–214
*5. పోతన భాగవతం 10 : 948 : పుట–214*

కీర్తన :

ప॥ మామకాపరాధశతం క్షమ్యతాంత్వయా

అ॥ప॥ మామకాపరాధశతం మాగణయాథవాయుతం
శ్యామవర్ణశమాన్విత మాగణయాథవాయుతం

చ॥ అత్యంత కృపాసాగర ఆదిపురుషానాధార
నిత్యద జగదాధార నిహృతాసుర
శ్రుత్యంత వనసంచార శోభనఫలదాచార
భృత్యదయాధృతాకార భ్రమకారణవిదార

చ॥ కామశతకోటివేష ఖండితనిఖిలదోష
దామోదరోదారభాషదాసపోష
కమలాకృతాభిలాష కామనాకల్పితాశేష
సామగీతాశ్రితావేష సాధుజనసంతోష

చ॥ ఆదిత్యచంద్రమండలాభ్యంతరాధారనిర్మల
బోధరూపానందాచల పోషితాఖిల
వేదపురాణాది మూలవేణుగానక్రీడాలోల
సుందరతర గోకుల శ్రీధరనాథ గోపాల

చ॥ ధారాధరాకారధీర ఘోరారిసంహారశూర
నీరజనాభ నిరుపమ నిర్మలానంద
పారావారశ్రీవిహార పాపతిమిర భాస్కర
నారాయణతీర్థసంతార నానాగమాంతసంచార -1

ఇందులో 'ఆదిత్యచంద్రమండలాభ్యంతరాధార' అనేది మాత్రం పౌరాణికమైన 'ధ్యేయస్సదాసవితృ మండలాంతర్వర్తీ' -2

అనే విషయాన్ని సూచిస్తున్నది. ఒక రకంగా ఇది కూడా శుద్ధ అద్వైత వర్ణనమే. కాళిదాసు శాకుంతలంలో నాందీ శ్లోకం 'యాసృష్టిస్రష్టురాద్యా' -3

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 7 : పుట-224, 225
2. డా॥ ఆదిపూడి వెంకట శివ సాయిరామ్, శ్రీ ఆదిత్యారాధన పుట-71
3. కాళిదాసు, అభిజ్ఞాన శాకుంతలం, శ్లోకం 1, పుట-1

అనే చోట సూర్యచంద్రులు కాలస్వరూపులై ఈశ్వరుని అష్టశరీరాలలో స్థానం సంపాదించారని వర్ణింపబడింది. అప్పుడు ఇది పరమాత్మ విశేషణమే అవుతుంది.

ఇక్కడే జగదాధార, ఆదిపురుష, అనాధార వంటి విశేషణాలు విశిష్టాద్వైతపరంగా కూడా అన్వయించేవి.

***గోపికలు స్తుతించడం :***

అలా కాపాడిన గోవిందుని గోపికలు స్తుతించారు.

*కీర్తన : గోవర్ధనగిరిధర గోవింద*
*గోకులపాలక పరమానంద*

*అ॥ప॥ శ్రీవత్సాంకిత శ్రీ కౌస్తుభధర*
*భావక భయహర పాహి ముకుంద*

*చరణం: పురుహూతమఖవి ఘాతసుచతుర*
*పురుషోత్తమ పూరిత జగదుదర*
*మేరుభూరిధై ర్యాఘువిదూర*
*మీనకేతుశత కోటిశరీర*

*చరణం: అమితకల్యాణగుణ అగణితలీల*
*అపరిమితానంద ఘననందబాల*
*శమితదైత్యదంభ శాంత్యాదిమూల*
*విమలమానసవృత్తి విలసితశీల*

*చరణం: వహతోజగదండ కోటిస్తవేదం*
*వరదకి మద్భుత మచలేంద్రవహనం*
*మహనీయ కీర్తి మావహసి దేహిముదం*
*మాఘవనంమద మపనయసికథం*

*చరణం: ఆనందామృత వారిధిఖేల*
*అలఘుపరాక్రమ అనుపమలీల*
*శ్రీనందాత్మజ శ్రితజనపాల*
*శ్రీకరకిసలయ లాలనలోల*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : పుట-219, 220*

*చరణం: పాటితసురరిపు పాదపబృంద*

*పావనచరిత పరామృతకంద*

*నాట్యరసోత్కట నానాభరణ*

*నారాయణతీర్థార్చిత చరణ -1*

ఇక్కడ వేయబడిన విశేషణాలలో 'అపరిమిత ఆనందఘన' అనునది 'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్' అనే ఉపనిషత్ వాక్యానికి వ్యాఖ్య. *-2*

'శాంత్యాదిమాల' అనునది అశాంత జీవనులకు ప్రశాంతి కలిగించువాడు అను లౌకికార్థంలోను, అదే విధంగా శాంతం శివమద్వైతమ్... చతుర్థం మన్యంతే సఆత్మాసవిజ్ఞేయః *- 3*

అని ఉపనిషత్ ప్రతిపాదితంగాను అన్వయించుచున్నది. రెండవ అర్థం అద్వైత స్వరూపుడైన భగవంతుని యొక్క ఓంకార తత్త్వం దీనిచే గ్రహించబడుచున్నది.

దేవేంద్రుని వెంట వచ్చినటువంటి కామధేనువు కూడా స్తుతించటంలో అద్వైతవర్ణనమే కనబడుతుంది.

*కీర్తన : ప॥ నందనందన గోవింద నౌమితేపదం*

*అ॥ప॥ మందరభూధరోద్ధార మధురగోపాలకృష్ణ*

*చరణం: సరస సుందరహాస సముదిత నిజభాస*

*నిరసితాంధతమస నిత్యానందరస*

*చరణం: అపరిమిత కరుణ అసురబృందనిర్వారణ*

*తపనీయాంబరభరణ దాసపోషణ*

*చరణం: కలితకస్తూరీతిలక కమనీయ ఫాలఫలక*

*లలితత్రివళిపులక లక్ష్మీపాలక*

*చరణం: కౌస్తుభశోభిత కంఠ కలితశ్రీవైకుంఠ*

*విస్తీర్ణదయోత్కంఠ వినతశ్రీకంఠ*

*చరణం: హరిహయ మణిలీల హాటకమణికుండల*

*నరనారాయణలీల నందితాఖిల -4*

---

1. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, *5 : పుట-219, 220*
2. *తైత్తరీయోపనిషత్, భృగువల్లీ, 6 : 1 : పుట-168*
3. మాండూక్యోపనిషత్ 7 : పుట-11
4. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, *5 : 8 : పుట-228, 229*

*చరణం: గోపరమణీనయన కుముదచంద్రవదన*

*తాపసమానసాయన తాపనాశన*

*చరణం: శరణాగతహితార్థ శంసితనతపార్థ*

*వరనారాయణతీర్థ వర్యపురుషార్థ -1*

ఇక్కడ వాడబడిన విశేషణములలో 'సముదిత నిజభాస' అనునది ఉపనిషత్పరమైన వర్ణన.

*నతత్ర సూర్యోభాతినచంద్రతారకం*

*నేమా విద్యుతోభాంతికుతోయమగ్నిః ।*

*తమేవ భాంతమనుభాతిసర్వం*

*తస్యభాసా సర్వమిదం భాతి -2*

అదే విధంగా మరొక కీర్తనలో 'అపరిమిత ఆనందఘన' అని భగవత్పరంగా తీర్థుల వారు వాడిన విశేషణం 'ఆనందోబ్రహ్మేతివ్యజానాత్' -3

అనే ఉపనిషత్ వాక్యానికి వ్యాఖ్య.

'శాంత్యాదిమాల' అనునది అశాంత జీవనులకు ప్రశాంతి కలిగించువాడు అని లౌకిర్థంలోను, అదే విధంగా 'శాంతం శివమద్వైతం... చతుర్థం మన్వంతేసాత్మాసవిజ్ఞేయః' -4

అని ఉపనిషత్ ప్రతిపాదికంగాను అన్వయింపబడుతున్నది.

రెండవ అర్థం అద్వైత స్వరూపుడైన భగవంతుని యొక్క ఓంకార తత్త్వం దేనిచే గ్రహింపబడుచున్నది. 'తస్యవాచకః ప్రణవః' -5

అన్న పతంజలి యోగసూత్రం కూడా ఇక్కడ అన్వయించుచున్నది.

ఇలా పోతనగారు ఇంద్రస్తుతిలో కృష్ణుని పరబ్రహ్మ తత్త్వాన్ని ఏ విధంగా ఆవిష్కరించారో. అంతటి అభినివేశంతోను తీర్థుల వారు యీ ఘట్టాన్ని వర్ణించారు.

---

*1.* నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, *5 : 8 : పుట-228, 229*

*2. కఠోపనిషత్, పంచమీవల్లీ 15 : పుట-69*

3. తైత్తరీయోపనిషత్, భృగువల్లీ 6: 1 : పుట-168

4. మాండూక్యోపనిషత్ 7 : పుట-11

5. పతంజలి, రాజయోగగ్రంథం 1 : 27 : పుట-141

## 11. శారద రాత్రి :

వచనం: అని యిట్లు కుసుమశరుని శరపరంపరా పరవశలై యోపికలు లేక పలికిన గోపికల దీనాలాపంబులు విని, నవ్వి యోగీశ్వరుండయిన కృష్ణుండాత్మారాముండై వారలతో రమించెనప్పుడు *-1*

ఈ ఘట్టాన్ని నిర్వహించడంలో పోతన తన కవితా శక్తినంతటినీ వినియోగించాడు. మూలంలో కూడా విపులంగా వర్ణింపబడ్డ యీ సన్నివేశానికి మరింత వన్నె చేకూర్చాడు. యోగేశ్వరేశ్వరులు అని శ్రీకృష్ణునకు వేసిన విశేషణం ఆలోచింపదగి ఉన్నది. ఆత్మారాముడనే పదం కూడా అలాంటిదే.

ఇక్కడ యోగమనగా జీవాత్మ పరమాత్మల యొక్క సంయోగం. బాహ్యశృంగార క్రీడ కాదు. ఆత్మారాముడంటే తనతో తానే రమించువాడు అని అర్థం. గోపికలందరూ తన ఆత్మ స్వరూపులుగానే భావించి తానే ఆనందపడ్డాడని అర్థం. ఇది భగవంతునికి ఒక క్రీడ. భగవంతుని అంశలుగా పుట్టిన జీవులు తిరిగి భగవంతుని పొందుటకై పడే ఆరాటమే ఇక్కడ గోపికలలో కలిగిన ఆర్తి రూపంలో వివరింపబడ్డది. కృష్ణుని అవతారం కంసాది రాక్షసుల సంహారానికి మాత్రమే కాదు. ఎన్నో యుగాలలో తన భక్తులకు ఇచ్చిన వరాలను నిజం చేస్తూ వారికి తన ప్రేమరసాన్ని పంచిపెట్టడానికి అవతరించినదే కృష్ణావతారం.

"ప్రేమైవ గోపరామాణాం కామయిత్యగమత్ప్రథామ్" *-1*

గోపికల యొక్క పరాకాష్ఠకు చేరిన ప్రేమయే కామముగా లోకములో ప్రచారము పొందినది అని భావము. నారదుల వారు గోపికల భక్తియే అందరి భక్తి కంటే శ్రేష్ఠమైనదని ఉద్ఘాటించారు. "యథాప్రజగోపికానాం" *-2*

భక్తిరసామృత సింధువులో రూపగోస్వామి

*శ్లో॥ 'పతిపుత్ర సుహృద్ భ్రాతృ పితృవన్మిత్రవత్ హరిమ్,*
*యే ధ్యాయన్తి సదోద్యుక్తాః తేభ్యోపీహ నమోనమః' -3*

హరిని పతిగాను, పుత్రుడుగాను, సుహృత్తుగాను, భ్రాతగాను, పితగాను భావించి ధ్యానించెడివారు నమస్కారార్హులు అని భావము.

అదే విధంగా వ్యాసులవారు

*భగవానపితారాత్రీః శరదోత్ఫుల్లమల్లికాః*
*వీక్ష్యరంతుంమనశ్చక్రే యోగమాయాముపాశ్రితః ॥ -4*

---

*1. పోతన భాగవతం, 10 : 1002 : పుట-227*

1. రూపగోస్వామి, భక్తిరసామృత సింధుః, గౌతమీయ తంత్రం, 285 : పుట-107

2. శ్రీనారదభక్తి సూత్రములు 21 : పుట-46

*3. రూపగోస్వామి, భక్తిరసామృత సింధుః, నారాయణ వ్యూహస్తవమ్, 308 : పుట-115*

*4. శ్రీమద్భాగవతం, 29 : 1 : పుట-491*

అని యీ సందర్భంలో చెప్పడం గమనించాలి. యోగమాయతో కృష్ణుడు గోపికతో రమణక్రీడకు ఉద్యుక్తుడయినాడు కానీ కామదృష్టితో కాదని దీని అర్థం. కాబట్టి యిది అంతరరమణమే కానీ బాహ్యరతి కాదు. ఇక్కడ 'యోగమాయాముపాశ్రితః' అనే వాక్యానికి ఆయా వ్యాఖ్యాతలు వివిధ రీతులలో చెప్పిన అర్థాలు దాదాపు 100 వరకు ఉంటాయి. ఎవరూ కూడా గోపికల రతిని కామరతిగా చెప్పలేదు. పతి పుత్రాదులు దేహానికి సంబంధించినవారు. భగవంతుడు అంతఃకరణానికి సంబంధించినవాడు. ఆనందస్వరూపుడు. ఆనందాన్ని అందించేవాడు. ఆనందము నుండియే భూతసృష్టి జరిగినదని ఉపనిషత్తులు చెబుతున్నాయి.

"ఆనందాద్ధి ఏవ ఖల్విమాని భూతాని జాయంతే" *-1*

అట్టి ఆనందాన్ని అందుకోవడమే ప్రేమ భక్తి. అది గోపికల స్వంతము.

*స్వాంగాలింగేరతిర్నస్యాత్ అంగనాలింగనేరతిః*
*యస్యాంగం జగదీశస్య తస్యరాగాదయః కుతః ॥ -2*

ప్రపంచమంతా తన శరీరము అయినప్పుడు తనలో తానే తనతో తననే రమించడం జరుగుతుంది అని అగ్ని పురాణంలో చెప్పబడినది. కాబట్టి కాముకీ కాముక భావంలో జరిగిన రతిగా శ్రీకృష్ణుడు చేసిన రమణక్రీడను భావించకూడదు అని దీని తాత్పర్యం.

## 12. రాసమహోత్సవం

ఈ రీతిగా కృష్ణుడు గోపికలతో రాసనృత్యం చేస్తుండగా ఆ దృశ్యాన్ని చూచి కొందరు గొల్లపడుచులు ఆనందంతో గానం చేశారు.

*కీర్తన : వనభువిగోపాలంవిహరంతం*
*అ॥ప॥ వల్లవయువతీజనవలయభాస్వంతం*
*చరణం: నిగమసరోరుహ నిత్యసంగతమధు*
*మధుహరాత్మతయేహసముదితం*
*అగణితగోధనమపరిమితానందం*
*ఆనందకరమమరేశితురపితం -3*

---

1. తైత్తరీయోపనిషత్, భృగవల్లీ, 6 : 2 : పుట-168.
2. *ధూళిపాళ సూర్యనారయణ మూర్తి, శ్రీ కృష్ణలీలా రహస్యామృతము (అను భాగవత సుధ) పుట-15*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 10 : పుట-262*

*చరణం: ఇనశశిపావకతారకాభాసక*
*మీక్షణసముదితజగదేకనాథం*
*మునిజనమానససారస వరహంస*
*మహనీయదైవత మఖిలదేహరథం*

*చరణం: లావణ్యసరిదేక నాయకమఖిల సం*
*రక్షణ మమరసంరక్షణ మధునా*
*సేవక శివనారాయణతీర్థభావిత*
*శ్రేయోవిధాయక మిహ వేదవిధినా -1*

ఆ కృష్ణుడు నిగమములనెడి పద్మముల యందు వ్యాప్తమై యున్న మధువు వలె ఉన్నాడు. ఇన, శశి, పావక, తారకల యొక్క కాంతి కలిగి యున్నాడు. మహనీయదైవతమైన ఆయన అఖిలరథుడు. దేహాన్ని రథంతో పోల్చడం ఉపనిషద్విధానం.

'ఆత్మానంరథినం విద్ధిశరీరం రథమేవతు బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ" *-2*

ఇక్కడ విశేషంగా అన్ని దేహరథములు కృష్ణుడే అని జగమంతా పరమాత్మ స్వరూపమే అనే భావంతో చెప్పడం వల్ల చక్కని రూపకం ప్రకాశించడమే కాక యిది తీర్థుల వారి ఉపనిషద్విజ్ఞానమునకు చక్కని ఉదాహరణగా నిలిచినది. అలాగే 'ఈక్షణసముదిత జగదేకనాథః' అని చెప్పటం చేత 'తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి' -3

అన్న ఛాందోగ్యోపనిషత్ వాక్యానికి ఇది వ్యాఖ్యగా నిలిచింది. లావణ్య సరిదేకనాయకం (లావణ్యమనే నదులకు సముద్రుడు) అనే రూపకం కడు మనోహరము.

కృష్ణుని నోటి నుండి వెలువడిన వాగ్రూపమైన అమృతాన్ని గ్రోలుతూ గోపికలందరూ ఆనంద పరవశులైనారు.

రాసమండలమునందు శ్రీకృష్ణుని గూర్చి పాడుతూ, ఆయనతో నాట్యం చేస్తూ గోపికలు అద్వైతానుభవం పొందారు.

*శ్లో॥ నృత్యంతస్తేన తద్గీతంగా యంత్యోరాసమండలే ।*
*తేనోపదిష్టమద్వైతమనుకుర్వంతి మానతః ॥ -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 10 : పుట-262*
2. కఠోపనిషత్, తృతీయావల్లీ, 3 : పుట-54.
3. ఉపనిషత్తు కల్పతరువు, ఛాందోగ్యోపనిషత్, 6వ అధ్యాయం, 2వ ఖండం, 2వ మంత్రం పుట-193
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 7 : పుట-269*

*కీర్తన : అద్వయమఖండితమశేషజగదాదిం*
*యత్రచ జగత్త్రితయమాస్థిత మనంతే*
*యత్ర విలయం పునరుపైతి మృదికుంభో*
*యద్వదవధారయత సత్యమితిమామోం*

నేను అద్వితీయుడను. సజాతి, విజాతి, స్వగత బేధములు లేనివాడను. నాశరహితుడను. ఒక కుండ పుట్టుటకు ముందు, పుట్టిన తరువాత నశించినప్పుడు మృత్తికయే కారణం. అట్టి నన్ను ఓంకారవాచ్యుడునైన పరమాత్మునిగా తెలుసుకొనుము.

*చరణం: యచ్చునిజశక్తి యుతమైక్షతపురస్తాత్*
*యత్పునరభూద్వికృతమైక్షతసుతేజః*
*యచ్చ కమభూత్పునరుదైక్షత యదన్నం*
*జాతమవధారయత సత్యమితి మామోం*

పరబ్రహ్మము మాయాశక్తితో కలసి సృష్టి సంకల్పము చేసి మొదట ఆకాశంగాను, పిదప వాయురూపంగాను ఏర్పడినది. వాయురూపము నుండి అగ్ని, అందుండి జలం, దాని నుండి పృథ్వి వరుసగా పుట్టినవి. ఈ విధంగా ప్రపంచ రూపుడనైన, సత్తామాత్రమునైన ఓంకార వాచ్యడనైన పరబ్రహ్మమును నేనే అని తెలిసికొనుము.

*చరణం: యత్పునరభూత్త్రివిధ పూరుషశరీరం*
*యత్తదనువిశ్వమఖిలం త్రివృతమాసీత్*
*జీవకలయా సకల సాక్ష్యవికృతం సత్*
*తత్త్వమవధారయత సత్యమితిమామోం* -1

ఏ పరబ్రహ్మము జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలలో ఏకరూపముగా ఉంటుందో, ఏది అగ్ని, జల, పృథ్వి రూపాలను ధరించి త్రివృత్ కరణముచే సమస్త విశ్వమును కలిగినదో, సర్వసాక్షిగా ఉండి ఎట్టి వికారమును లేక జీవకళగా ప్రకాశిస్తూ ఉంటుందో అట్టి ఓంకార రూపమైన పరబ్రహ్మమును నేనే అని తెలుసుకోండి.

త్రివృత్‌కరణమనగా అగ్ని, జలము, పృథ్వి అను వానిలో ఒక్కొక్క దానిని 3 భాగాలు చేసి వాటిలో రెండు భాగములను మిగిలిన రెండు భూతముల యందును చేర్చుటచే లోకజాలములన్నియు సృష్టింపబడినవని ఛాందోగ్యము.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 1 : పుట-270, 271, 272*

*చరణం:* *అన్నసలిలే అభవతామశితపీతే*

*ప్రాణమానసపరిణతే పరమసూక్ష్మే*

*వాగభవదప్యశిత మల్పపరిణామి*

*జ్యోతి రవధారయత సత్యమితిమామోం*

అన్నము, జలము, ప్రాణులచే అనుభవింపబడి మనస్సుగా మారుతున్నవి. వాగ్రూపములో అవియే పరిణమిస్తున్నాయి. ఈ పరిణామానికి మూలభూతుడై ఓంకార రూపుడైన పరబ్రహ్మమును నేనే అని తెలుసుకోండి.

*చరణం:* *షోడశకలః పురుష ఏష పరిశిష్టః*

*తాసువిలయం పరిగతాసునచవేద*

*తాసు తు సమస్తమను పశ్యతి తదిత్థం*

*తత్త్వమవధారయత సత్యమితి మామోం*

షోడశ కళాత్మకుడైన జీవాత్మ ఏ పరబ్రహ్మము యొక్క ప్రభావం చేత మనగలుగుచున్నాడో ఆ కళలు ఏ పరమాత్మలో లీనమైపోగా జీవుడు ఉనికినే కోల్పోవుతున్నాడో అట్టి ఓంకార స్వరూపుడనైన పరబ్రహ్మను నేనే అని తెలుసుకొనుడు.

*చరణం:* *యేన పురుష స్సమరసత్వము పలభ్య*

*స్వాపనసమయే స్వపితి నామక ఇతిస్యాత్*

*యత్రవిలయం సమనుయాతి మన ఆది*

*తత్త్వ మవధారయత సత్యమితి మామోం*

సుషుప్తి కాలము నందు జీవుడు ఏ పరబ్రహ్మము నందు లీనమై నామరూపాలను కోల్పోవుతున్నాడో అట్టి నిర్వికార ప్రణవరూపుడైన పరబ్రహ్మమును నేనే అని తెలుసుకొనుడు.

*చరణం:* *యత్రమధుపాహృతమాధూపమితమేతత్*

*చిత్రరసమేకరసతాం సమధిగమ్య*

*నైవరసభేద మిహవేద జగదాది*

*తత్త్వమవధారయత సత్యమితిమామోం*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 1 : పుట–270, 271, 272*

తేనెటీగలచే సంపాదింపబడిన మధువు వంటి చిత్రవిచిత్ర రసములన్నీ ఏ పరబ్రహ్మము నందు ఏకరసత్వాన్ని పొందుతున్నాయో అవియే తిరిగి వివిధ రసాలుగా ప్రాణిజాతము చేత ఆస్వాదింపబడుతున్నాయో ఆ ఓంకార స్వరూపుడనైన పరబ్రహ్మమును నేనే అని తెలుసుకొనుము.

*చరణం: యత్రజలధౌసమరసత్వమనుయాతాః*

*తత్పృథగ శేషసరితోనవిదురేవం*

*బ్రహ్మణి జనాఅనుదినం సమనుయాతాః*

*తత్త్వమవధారయత సత్యమితిమామోం*

సముద్రంలో కలసిన నదులు సముద్రము కంటే వేరు కానట్లుగా ఏ పరబ్రహ్మము నందు లీనమై ప్రాణులు ఆ బ్రహ్మమే అగుచున్నవో అట్టి ఓంకార స్వరూపుడనైన పరబ్రహ్మను నేనే అని తెలిసికొనుడు.

*చరణం: యస్యకలయామ మఖిలస్యసహిభోక్తా*

*తత్పరిహృతోమృత ఇతిప్రతివదన్తి*

*యచ్చ భవమృత్యురహిత సకలసాక్షీ*

*తత్త్వమవధారయత సత్యమితిమామోం*

ఏ పరమాత్మ కళచేత జీవుడు ఆయా శబ్ద స్పర్శాది విషయమునకు భోక్తగా అగుచున్నాడో, ఏ కళ లేకపోవుట చేత మృతప్రాయుడో, ఎవడు సంసార మృత్యురహితుడో, సర్వసాక్షియో అట్టి ఓంకార స్వరూపుడైన పరబ్రహ్మమును నేనే.

*చరణం: యత్ర చ విజృంభిత మిదం స్వగతశక్త్యా*

*స్యాత్పృథ గవస్థితమశేష జడజాతం*

*యచ్ఛవటబీజ సదృశం పరమసూక్ష్మం*

*తత్త్వమవధారయత సత్యమితిమామోం*

విడివిడిగా ఉన్న సమస్త సృష్టి ఏ పరబ్రహ్మము యొక్క శక్తి చేత లోకము నందు ప్రవర్తించుచున్నదో, మర్రి విత్తనం వలె ఏది సమస్త సృష్టికి బీజభూతమో అట్టి సత్యస్వరూపుడై, ఓంకార స్వరూపుడనైన పరబ్రహ్మమును నేనే.

*చరణం: సింధుజనితం సలిలమిశ్రిత మివాత్మా*

*సర్వగత ఏకరసతామనుగతో యః*

*వేదశిరసాం పరిచయేన సువివిక్తః*

*తత్త్వమవధారయత సత్యమితిమామోం* -1

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 1 : పుట-270, 271, 272*

సముద్రపు నీటిలో కరిగిపోయిన ఉప్పువలె ఏ బ్రహ్మము సమస్త ప్రాణులలో వ్యాపించి ఉన్నదో, ఎవడు ఉపనిషత్‌వాక్యములచే బాగుగా తెలియదగి యున్నాడో ఆ ఓంకార స్వరూపుడనైన పరబ్రహ్మమును నేనే.

*చరణం: బద్ధనయనో వనభువి ప్రతివిముక్తః*
*ప్రశ్నముపలభ్యనగరం పునరవాప*
*యద్గురుమతం పునరవాప నిజబుద్ధ్యా*
*తత్త్వమవధారయత సత్యమితిమామోం*

పొరపాటుగా అడవిలో ప్రవేశించిన గ్రుడ్డివాడు మార్గసంచారులైన వ్యక్తుల ద్వారా తాను వెళ్ళవలసిన మార్గం తెలుసుకొను విధముగా సద్గురువుల వలన మానవులు ఏ బ్రహ్మము యొక్క ధ్యానమార్గం తెలుసుకొని ధన్యులగుచున్నారో అట్టి ఓంకార స్వరూపుడనైన పరబ్రహ్మము నేనే.

*చరణం: యత్రలయమేతిమన ఆది పరమాత్మ*
*న్యన్యదనుపశ్యతి న బంధుజనమేషః*
*సర్వవిలయేకప్యవిలయం యదవశిష్టం*
*తత్త్వమవధారయత సత్యమితిమామోం*

ఏ పరమాత్మ యందు ఇంద్రియములన్నీ లయమును పొందుతున్నాయో సమస్తము నశించినను ఎవడు మిగిలియే యుంటాడో అట్టి సత్యస్వరూపుడైన ఓంకార పరబ్రహ్మము నేనే.

*చరణం: అక్రియతయాసకలవిక్రియదృశిత్వా*
*న్నైవ హననాది విషయో యదవశిష్టం*
*తప్తపరశుస్పృగివ సత్యపరిగుప్తం*
*తత్త్వమవధారయత సత్యమితిమామోం*

ఎట్టి ప్రాకృతిక్రియలు లేక క్రియలకు ద్రష్టగా ఉంటూ హననాది క్రియలకు విషయభూతుడు కాక తప్త పరశువులోని అగ్నివలె సర్వత్ర వ్యాపించి యుండు సత్యస్వరూపుడైన ఓంకార రూపుడగు పరబ్రహ్మమును నేనే.

*చరణం: కిన్ను కథనీయ మబలాయదనుభూతం*
*సర్వమనుభూతి మపహాయ సతుతత్వం*
*నిత్యమనుభూతి సుఖవిగ్రహమచింత్యం*
*తత్త్వమవధారయత సత్యమితిమామోం –1*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 1 : పుట–270, 271, 272*

ఏ ఇతర అనుభవములనైననూ విడిచి ఎల్లప్పుడు అనుభవించుటకు యోగ్యమై సుందరమైన స్వరూపము కల సత్యస్వరూపుడైన ఓంకార రూప పరబ్రహ్మమును నేనే.

*చరణం: సత్సదితి సర్వవిషయేష్వనుగతంయద్*
*భాసకతయాప్రియతయా చపరిశిష్టం*
*మానమితిమేయమితిహీనమతిరిక్తం*
*విద్వదనుభూత మవధారయతసత్యం*

ఎప్పుడూ ఏకరూపము కలదియై ఆయా వస్తువుల యందు వివిధాకారములతో భాసించునట్టిదియు, ప్రత్యక్షాది ప్రమాణములు కానీ, వానిచే నిరూపింపబడు విషయములు కానీ కాకయే సర్వప్రాణుల జ్ఞానమునకు అనుభూతమయ్యే లక్షణములు కల ఓంకార రూపమైన పరబ్రహ్మమును నేనే.

*చరణం: నిశ్చితమశేష నిగమాంతవచనైర్యత్*
*తత్త్వమయమిత్యఖిల సారమనుభూతేః*
*తర్కశతకైరపి దృగేకరసమాద్యం*
*ధీరమతిగమ్య మవధారయతసత్యం*

సమస్త వేదాంత వాక్యములచే, సమస్తమైన యుక్తులచే నిరూపింపబడు వాడును, దృగ్రూపమున భాసించుచూ సృష్టికి ముందే ఉండి ధీరులైన వారికి మాత్రమే (ఇంద్రియ వికారములు లేని వారికి మాత్రమే) గోచరుడయ్యే సత్యస్వరూపుడయిన ఓంకార పరబ్రహ్మమును నేనే.

*చరణం: పర్యవసితం నిగమవాక్కృతకమిాళే*
*లక్షకతయాస్య విషయే పరిసమాప్తేః*
*సర్వవిషయస్య చ తదాత్మకతయాతం*
*శిష్టమవధారయత సత్యమితిమామోం*

'తత్త్వమసి' అనే మహావాక్యములోని లక్షణావృత్తి చేత నీవే ఆ పరమాత్మవు అను రీతిగా తెలియబడుచూ, సర్వజీవాత్మల యందును అంతరాత్మగా ఏ పరబ్రహ్మ నిలిచి ఉన్నాడో ఆ ఓంకార స్వరూపుడైన పరబ్రహ్మమును నేనే.

*చరణం: శ్రీమురరిపోర్వదన పద్మమకరందం*
*బ్రహ్మసుఖసార వచనం బహుపిబంతః*
*గోకులవధూమధుకరాస్తు పరితృప్తాః*
*రాసభువి మండలకృతో బహురమంతే -1*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 1 : పుట-270, 271, 272*

ఈ విధంగా శ్రీకృష్ణుని ముఖకమలము నుండి వెలువడిన అద్వైత జ్ఞాన సుధాధారలు త్రాగి సంతృప్తిని పొందిన గోపకాంతలందరూ రాసక్రీడా భూమి యందు మండలముగా ఏర్పడి ఆయనతో కూడి నాట్యాదులచే నిర్విశేషానందమును పొందిరి.

*చరణం: సామనిగమాంత వచనార్థముపలభ్య*
*స్వానుభవమేకమఖిలైక రసభూతం*
*ఏతదమృతం భవభయాపహరమాద్యం*
*నారాయణానంద తీర్థపరిగీతం -1*

ఉపనిషత్తునందలి (ఛాందోగ్యము ప్రధానము) సారమంతటిని స్వానుభవములోనికి తెచ్చుకొని బ్రహ్మానందామృతమును ఆస్వాదించిన నారాయణతీర్థులచే చెప్పబడిన ఈ అద్వైత జ్ఞానము అందరకూ ఆస్వాద్యము.

ఈ కీర్తనలోని గోపికల అద్వైతానుభవమును తీర్థుల వారు అతి విపులంగా దృశ్యావిష్కృతం చేశారు. ప్రతి చరణం చివర 'అవధారయత సత్యమితిమామోం' అని వస్తుంది. తెలుగులోని శతక సంప్రదాయాన్ని కవి యీ మకుటం ద్వారా ప్రతిష్ఠించారు.

ఈ విధముగా తీర్థుల వారు శంకరాదులచే ప్రతిష్ఠింపబడిన అద్వైత జ్ఞానమును ఈ కీర్తన ద్వారా ఆంధ్ర లోకానికి అందించి కృతకృత్యులవడం ఆంధ్రులందరికీ గర్వకారణం. ఈ విధముగా ఆయన మనకందరకూ గురుస్థానీయుడు.

పోతనగారు కథను ప్రధానముగా తీసుకొని వర్ణించిన వర్ణనములలో అద్వైతము వ్యంగ్య రీతిగా వ్యక్తమగుచుండగా తీర్థుల వారి యీ వర్ణనము ద్వారా అది వాచ్యమై సాధకులందరికీ ఒప్పారుచున్నది.

గోపికలు ఆ కృష్ణుని యొక్క గుణగానం చేస్తూ వానికై విలపిస్తూ ఆయనను వెదుకుకుంటూ యమునానది ఇసుకతిన్నెలపై ఆయన పాదచిహ్నములు కానరాగా కొంతదూరము పోయి అక్కడ ఒక పొదరింటి యందు తమకు వలెనె కృష్ణుని రూపములో ఉన్మదావస్థను పొంది కూర్చున్న రాధను చూచి ప్రశ్నించారు.

## 13. రాధ - రాధిక

ఈ రాధా గోపికల కలయిక భాగవతంలో లేదు. ఓ రాధా శ్రీకృష్ణుని గూర్చిన విశేషములను మాకెరిగింపుము అంటూ ఆయన యొక్క బాహ్య స్వరూపమును, ఆయన సుగుణాలను కీర్తిస్తూ అట్టి వానికి సంబంధించిన వృత్తాంతాన్ని చెప్పమని రాధను అడుగుతారు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 1 : పుట-272*

తరువాత ఏకాంత స్థలంలో కృష్ణుని చేత చిరపరిభుక్త అయిన ఆ రాధ తాను అనుభవించిన బ్రహ్మానందానుభవాన్ని కృష్ణుని పరంగా అన్వయిస్తూ వారిలో యిలా అన్నది.

*కీర్తన : ప॥ హరిమేకరసాకృతి మధునా అవధారయ తాగమవిధినా*

*చరణం: చిరతర పురుషం ప్రతిభావపుషం పరమిహావియదాతతం*
*ప్రశమిత కలుషం భవరోగముషం ప్రత్యగభేదమనంతం*

*చరణం: ఇదమితి సకలం జగదతి చపలం మాయిక మధునాతనం*
*పరిణతి వికలం ఫలమివవిపులం కలయత పరిశోధనం*

*చరణం: విలసిత మఖిలం గురుతల లీలం యద్వదవబోధవిధం*
*క్షణమిహావిదితం సత్పునరుదితం పశ్యతపురతోహితం*

*చరణం: అనుదయ విలయం ప్రియతమమభయం జగదుదయాదిదృశం*
*యదవధి విదితం సకలమభిహితం నియత మబోధవశం*

*చరణం: అసుకృత దురితం ఫలయుగరహితం కేవల బోధాత్మకం*
*చిరమిహా మృగితం మునిజనవిదితం నిరవధిక సుఖాత్మకం*

*చరణం: యదపృథ గఖిలం నిగమభాగఫలం భాతిహి పరదైవతం*
*న భవతి భూతం న చ భావిసతతం సుకృతిభిరభిభావితం*

*చరణం: నిరవధివిభవం నియతానుభవం భూమపదేనేరితం*
*ఫలమివకరగం సకల హృదయగం తత్త్వాధియాండితం*

*చరణం: అవచనమమతిం గతలోభరతిం నిరతనిస్త్రారఖిలం*
*వ్రజపుర వనితాగతతనుమమతాః స్వాత్మతయైవామలం*

*చరణం: ఇదమిహా ఫణితం నిగమై రనుగతం కృష్ణరసై కాత్మనా*
*హరిగురుకృపయా నిగమజసుధియా నారాయణతీర్థేన -1*

కృష్ణుడు అనాది పురుషుడు, జ్ఞాన శరీరుడు, ఆకాశం వలె సర్వవ్యాపి, ప్రత్యగభిన్నుడు, అపరిచ్ఛిన్నుడు, సృష్టికి సాక్షిభూతుడు, కేవల బోధాత్మకుడు, నిరవధిక సుఖాత్ముడు, భూతభవిష్యద్వర్తమానాతీతుడు, అమితవిభవుడు, భూమశబ్దవాచ్యుడు, వాఙ్మనస్సులకు అతీతుడు అని రాధ కృష్ణతత్త్వాన్ని గోపికలకు వివరించినది.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 8 : 11 : పుట-378, 379*

రాధ వలన కృష్ణతత్త్వాన్ని విని పరమాత్మాకారము తమ యందు దర్శించుకుంటూ మౌనముతో గోపికలంతా నిశ్చేష్టులై దేహస్పృహ లేకుండా పరమాత్మ స్వరూపములో లీనమై బాలురవలె ఉన్మత్తుల వలె ప్రవర్తించారు.

*శ్లో॥ ఏవం గోప్యస్తతః శ్రుత్వా సమాధాయ పరాత్మని*
*కృష్ణేచిత్తం తదాకారకారితం మౌనమాస్థితాః ॥ -1*

## 14. అక్రూరుని స్తుతి :

అక్రూరుడు చేసిన వర్ణనలో ఎక్కువ భాగం భగవంతుని వేషభూషాదుల వర్ణనంతో పాటు ఆయన అవతార విశేషాలన్నీ కనబడతాయి. ఇక్కడ పోతనగారు రచించింది ఒక పెద్ద దండకం.

*"పావకాకాశవాతావనీ వార్యహంకారమాయామహామానసాదుల్*
*హృషీకాదులున్ లోకముల్ లోకబీజంబులున్ నిత్య సందోహమై*
*నీ మహాదేహమందుల్లసించున్; వసించున్, నశించున్" -2*

అనే వాక్యం కేవలాద్వైతపరంగా నడిచింది. "అధ్యాత్మలందున్న శేషాదిభూతంబులందున్ననేకాది దైవంబులందున్ సదా సాక్షివై ఉందువంచున్" (కొంతరు నుతింతురు) ఈ విశేషణాలు కూడా అద్వైతపరాలే.

తరువాత కొందరు ఆత్మస్వరూపునిగాను, మరికొందరు సంకర్షణ, వాసుదేవ, అనిరుద్ధ, ప్రద్యుమ్ననామక చతుర్వ్యూహ స్వరూపుడవని పాంచరాత్రానుసారంబుగా వర్ణిస్తారని శివుడు, విష్ణువు కూడా నీవే అని వర్ణిస్తూ ఉంటారు అనే అద్వైతపరమైన మాటలు కూడా యీ దండకంలో చోటు చేసుకున్నాయి.

మూర్ఖుడు పుత్ర, మిత్ర, వనితా, గృహాదులు నిక్కమనుకొని వారి యందు కోర్కె పెంచుకుంటాడు. నిజానికి వారందరూ ఎండమావులలోని జలాలవంటివారు. నేనట్టి మూర్ఖుడను దయతో నన్ను ఉద్ధరింపుము అంటాడు అక్రూరుడు.

*మత్తేభం॥ కలలంబోలెడి పుత్రమిత్ర వనితాగారాదిసంయోగముల్*
*జలవాంఛారతినెండమావులకు నాసల్‌సేయు చందంబునం*
*దలఁతున్ సత్యములంచు; మూఢుఁడ వృథాతత్త్వజ్ఞుఁడన్ నాకు నీ*
*విలసత్పాదయుగంబు సూపికరుణన్ వీక్షింపు లక్ష్మీపతీ ! -3*

---

1. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, *8 : 20 : పుట-383*
2. *పోతన భాగవతం 10 : 1234 : పుట-285, 286*
3. *పోతన భాగవతం 10 : 1235 : పుట-288*

నిజానికి కుందేటికొమ్ము, వంధ్యాసుతుడు, ఎండమావులలో నీళ్ళు ఉండటం అసంభవం. ఇలా అసత్యాన్ని సత్యమనుకోవడం భ్రాంతి. ఆభ్రాంతిని తొలగించుకోవడమే మోక్షం అని (అద్వైత) వేదాంతులు బోధ చేస్తారు.

తీర్థుల వారి గ్రంథంలో అక్రూరప్రార్థనలో "మోహపాశవినాశనం" -1

"శ్రేయసామమితాస్పదం" -2

అనే రెండు విశేషణాలు అద్వైతపరంగా అన్వయించేవి. తక్కినవన్నీ శ్రీకృష్ణుని రూపవర్ణనగా సాగినాయి.

"దేహధారిణాం అతీవదృష్టిరమణీయం" -3

"రూపయవ్వనసంయుతం" - 4

"శంఖచక్ర వజ్రపద్మచారుపతాకాదిరే" - 5

మరొక కీర్తనలో

"మాయాధారక, మునిమానసానుకూల, వేదపురాణాదిమాల" -6

అనే విశేషాలు పరతత్త్వ వర్ణనాత్మకాదులు కాగా ఇక్కడ కూడా తీర్థుల వారు ప్రయోగించిన వాటిలో "మకరకేతు జనక, కనకమయ దుకూల, మురళీలోల, కాళిందీ తటవిహార" -7

మొదలగునవి రూపవర్ణనాత్మకంగా సాగాయి.

వ్యాఖ్య : అక్రూరుడు మహాభక్తుడు. పోతన అక్రూరుడు తానే అయి విష్ణువర్ణనం విపులంగా చేశాడు. పౌరాణికమైన అనేక ఘట్టాలను దండకంగా కూర్చాడు. ఆ పారవశ్యంలో జ్ఞానాంశకు సంబంధించిన అద్వైత విశేషణాలను క్లుప్తంగా చెప్పాడు.

తీర్థుల వారి వర్ణనలో అద్వైతాంశం పోతన వర్ణనలో కంటే తక్కువగానే ఉంది. ఇక్కడ కూడా అక్రూరుని యొక్క భక్తి భావాన్ని ప్రదర్శించడమే యీయన ప్రధానంగా పెట్టుకున్నాడనుకోవాలి. సంగీతపరమైన ప్రదర్శనానుకూలమైన యక్షగానానికి తగిన విన్యాసాలన్నీ పదాలలో చూపించి ప్రశంసలను అందుకున్నాడు.

---

1. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 9 : 3 : పుట-398
2. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 9 : 3 : పుట-398
3. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 9 : 3 : పుట-397
4. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 9 : 3 : పుట-398
5. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 9 : 3 : పుట-398
6. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 9 : 4 : పుట-400
7. నారాయణ తీర్థులు, శ్రీ కృష్ణ లీలా తరంగిణీ, 9 : 4 : పుట-400

## 15. ఉద్ధవుడు :

మధురానగరంలో ఉన్న శ్రీకృష్ణుడు మిత్రుడైన ఉద్ధవుని పిలిచి గోపికల వద్దకు పంపాడు. శ్రీకృష్ణుడు మిమ్ము విడువడు అన్న వార్తను ఉద్ధవుడు వారికి చేరవేశాడు. వారు భ్రమరం మీద నెపంతో అన్యాపదేశంగా మాట్లాడారు. ఉద్ధవుడు వారికి శ్రీకృష్ణుని యదార్థ స్వరూపమును తెలుపుచూ పలికిన మాటల ద్వారా వేదాంత విషయాలను స్పష్టపరిచారు పోతన.

మానవుడు కలలో చూసిన దృశ్యాలను మెలకువ రాగానే మరచిపోయినట్లుగా అజ్ఞానంతో సత్యమనుకొని యీ ప్రపంచయాత్రను సాగిస్తూ సాధనల ద్వారా జ్ఞానవంతుడై దాని యొక్క అసత్యతత్త్వాన్ని మనస్సులో స్థాపించుకొంటాడు. ఆ పూర్వావస్థ కానీ, ఈ పరావస్థ కానీ అవస్థా భేదముచే ఏర్పడినవి తప్ప యదార్థములు కావు.

శ్లో॥ *కలఁగని లేచి మున్నుగలఁగన్న సమస్త విధంబుఁగల్లఁగాఁ*
*దలఁచిన భంగి మానస పదార్థముచే నిఖిలేంద్రియార్థముల్*
*బలమునఁగట్టి తర్జ్ఞుఁడు ప్రపంచము లేదనుఁదన్మనంబుఁఆ*
*రలయక కట్టుడున్ బుధులకవ్వల నొండొక భేదమున్నదే ?* –1

ఈ విధమైన భావన శంకరాచార్యుని ఆత్మబోధలో చెప్పబడిన భావానికి తుల్యంగా ఉన్నది.

శ్లో॥ *సంసార స్వప్నతుల్యోహి రాగద్వేషాది సంకులః ।*
*స్వకాలే సత్యవద్భాతి ప్రబోధేకసత్యవద్భవేత్ ॥* –2

ఈ సందర్భంలోనే పోతనగారు జ్ఞానదశకు చేరుకోవాలంటే సాంఖ్యము, యోగము, నిగమాగమములు, సత్యము, తపస్సు, దమము, శమము అనేవి అవసరమని ఉద్ధవుని వాక్యాలలో చెప్పారు.

ఆ॥వె॥ *సాంఖ్యయోగనిగమసత్యతపోదమ, ములు మనోనిరోధములు గడపలఁ*
*గాఁగనుండు జలధి కడపలగాఁగలఁ, నదులభంగినళిన నయనలార !* –3

అంటూ చెప్పిన యీ పద్యభావం పతంజలి యోగసూత్రాలలోని "తపఃస్వాధ్యాయేశ్వర ప్రణిధానాని క్రియాయోగః" అను సూత్రార్థమునకు వివరణగా కనబడుతుంది. –4

---

1. *పోతన భాగవతం 10 : 1471 : పుట–338*
2. *శంకరాచార్యులు, ఆత్మబోధ 6 : పుట–11*
3. *పోతన భాగవతం 10 : 1472 : పుట–338*
4. *పతంజలి మహర్షి, రాజయోగ, రెండవ అధ్యాయం, మొదటి సూత్రం, పుట–168*

ఇదే సందర్భంలో తీర్థుల వారి గ్రంథంలో గోపికలతో ఉద్ధవుని పలుకుల రూపంలో అద్వైతం భాసించింది.

*కీర్తన :*

*ప॥* *గోపీజనగోమధ్య చరంతం గోపాలం విద్ధిగోపాలం*

*చ॥* *అంతరంగే సతతం భాంతం ఆదిమధ్యాంతవసంతం*
*సంతతం సత్సుచరంతం సత్యమేకాంతం*
*అంతరేయోగివిచింత్యం అనుపమసకలాగమాంతం*
*హంత దురంత సంసారబంధహంతారంవిహరంతం*

*చ॥* *సంయోగ వియోగ విహీనం సాధుమానసజీవనం*
*మాయోపాధివిదళనం మానసాసనం*
*కాయక్లేశాదివిహీనం కారణమానవ జన్మానం*
*భూయోభూయోవిచార్యైనం భూమానం భూరి మహిమానం*

*చ॥* *బుద్ధివికల్పిత భేదాభేదం బోధబాధిత సర్వఖేదం*
*సిద్ధసంభావిత సిద్ధిదం శ్రితజన బర్హివారిదం*
*బద్ధముక్త సిద్ధవేద బోధితానందమోదం*
*సిద్ధనారాయణతీర్థ సేవితశ్రీపాదం -1*

వేదాంతపరంగా సాగిన యీ కీర్తనలో మానవుల అంతరంగంలో ఎల్లప్పుడూ ప్రకాశించువాడు (అంతరంగే సతతం భాంతం) అనే విశేషణం

*శ్లో॥* *ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేऽర్జునతిష్ఠతి ।*
*భ్రామయస్సర్వభూతాని యంత్రారూఢానిమాయయా ॥ -2*

అనే గీతావాక్యాన్ని సంగ్రహిస్తున్నది.

ఆదిమధ్యాంత వసంతం (మొదట మధ్య చివరనుండువాడు) అనే విశేషణం

'అహమాదిరి దేవానాం' మహర్షీణాంచసర్వశః -3

అనే గీతావాక్యాన్ని ప్రతిబింబిస్తుంది.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 11 : 3 : పుట-460*
2. *వ్యాసమహర్షి, భగవద్గీత, 18 : 61 : పుట-411*
3. *వ్యాసమహర్షి, భగవద్గీత, 10 : 2 : పుట-227*

‘సత్యమేకాంతం’ అనేది ‘సత్యంజ్ఞానమనంతంబ్రహ్మ’ -1

అను దానికి వ్యాఖ్య.

సంయోగవియోగవిహీనం అనేది ‘నమేద్వేషోకస్తినప్రియః’ -2

అనే గీతావాక్యంతో సరిపోలుతున్నది.

(1) బుద్ధివికల్పిత భేదాభేదం (భేదము అభేదము అనేది బుద్ధికల్పితమే కానీ సత్యము కాదు)

(2) బద్ధముక్త సిద్ధవేద బోధితానందమోదం (జ్ఞానాత్ములై వేనితో సంగమం లేకుండా ఉన్న సిద్ధ పురుషులకు వేదవర్ణితమైన ఆనందాన్ని మోదాన్ని కలిగించేవాడు అనేది పోతనగారి వలెనే ఈయన కూడా బ్రహ్మతత్త్వ నిరూపణం చేశారు.

ఈ ఘట్టంలో పోతన, తీర్థులు అద్వైత వేదాంతాన్ని సూత్రబద్ధంగా సముచిత వివరణతో ప్రబోధించారు. ఎవరికిని ఎవరూ తీసిపోరు.

## 16. రుక్మిణీ కళ్యాణం :

రుక్మిణీ సందేశంలో ‘ఏనీలసన్నామమే ప్రొద్దుభక్తితోఁడ వినబంధసంతతులు వాయు” -3

మిగిలినవన్నీ వ్యక్తి వర్ణనం కాగా ఇక్కడ నామవర్ణన విశేషంగా చెప్పబడింది.

“యజ్ఞానాం జపయజ్ఞోస్మి” అనే భగవద్గీతా వాక్యంలో జపానికి గల ప్రాధాన్యం వర్ణింపబడింది. నామ జపమే భగవత్ప్రాప్తికి హేతువు అనడం విశిష్టాద్వైత సంప్రదాయం అయితే అహంబ్రహ్మాస్మి అనే వాక్యాన్ని నిరంతరం స్మరించుకుంటూ ఉన్నా జీవునకు మోక్షం ఖాయం అనే అద్వైత పక్షం కూడా ఇక్కడ స్వీకరింప తగినదే. మొత్తం మీద సగుణమైతే నామజపం నిర్గుణమైతే తత్త్వానుసంధానం మానవుడు చేయవలసిన కృత్యాలని మనం స్వీకరించాలి. రమణమహర్షి ఉమాసహస్రంలో ఇలా అంటారు.

*అర్చనకాలేరూపగతా సంస్తుతికాలేశబ్దగతా ।*
*చింతనకాలేనామగతా తత్త్వవిచారేసర్వగతా ॥ -4*

అని చింతనలో నామజపాన్ని కూడా చేర్చారు.

---

1. తైత్తరీయోపనిషత్తు, బ్రహ్మానందవల్లీ, 6వ అనువాకం, పుట-117
2. *వ్యాసమహర్షి, భగవద్గీత, 9 :* 29 : పుట-224
3. పోతన భాగవతం, 10 : 1704 : పుట-394
4. ఉమాసహస్రం, పంచమ శతకం, వింశస్తబకము, 3వ శ్లోకము, పుట-368

రుక్మిణిని శ్రీకృష్ణుడు రథమెక్కించుకొని పారిపోతుండగా రుక్మి అడ్డుపడి వానిని నిందించిన 'మాసరివాడవా' అనేపద్యంలో వ్యాజస్తుతి రూపంలో పరమేశ్వర సర్వశక్తిమత్త్వం సర్వాంతర్యామిత్వం, సర్వజ్ఞత్వం అనే అంశాలపై ప్రకటనం జరిగింది. ఏపాటికలవాడు, ఏది వంశము, ఎందు జన్మించితివి, ఎక్కడ పెరిగితివి? ఎయ్యదినడవది? మానహీనడవు, మర్యాదలు లేవు, మాయగాడవు మొదలైనవన్నీ అలాంటివే.

బలభద్రుడు రుక్మిణిని ఓదారుస్తూ మా తమ్ముడు నీ అన్నకు చేసిన అవమానాన్ని మనసులో పెట్టుకోక విషమబుద్ధిని పొందక స్థిమితత్వాన్ని పొందు అని ఉపదేశిస్తాడు.

*శార్దూలం॥ తోడంబుట్టినవాని భంగమునకున్ దుఃఖించిమాకృష్ణునె*
*గ్గాడం జూడకుమమ్మ ! పూర్వభవకర్మాధీనమై ప్రాణులన్*
*గీడును మేలును జెందు, లేఁడొకఁడు శిక్షింపంగ రక్షింప నీ*
*తోడంబుట్టువు కర్మ శేష పరిభూతుండయ్యెనేఁడియ్యెడన్ -1*

అంటాడు. ప్రాణులు భగవంతునిచే సృష్టింపబడ్డాక భూలోకంలో ఆయా కర్మలాచరిస్తారని పుణ్య కర్మమైతే పుణ్యానికి, పాపకర్మమైతే పాపానికి అనుగుణమైన జన్మపరంపరలు దాలుస్తూ ఉంటారని ఈశ్వర శరణాగతి ద్వారా ఆ రెండింటినీ తప్పించుకోవచ్చునని దీని భావం.

'సర్వధర్మాన్ పరిత్యజ్య' అనే శరణాగతి తత్త్వం, కర్మసిద్ధాంతం ఇవన్నీ విశిష్టాద్వైత పద్ధతికి చెందినవి.

అద్వైతపరంగా కూడా సాధన ద్వారా కర్మాతీతత్త్వం సాధించవచ్చునని గీతలోనే స్థితప్రజ్ఞ లక్షణాన్ని చెబుతూ భగవానుడు అర్జునకు అనేక ఉపాయాలు చెబుతాడు. కనుక ఇక్కడు ఉభయ మతస్థుల వేదాంతం సమంగా నడిచింది.

తరంగ ప్రారంభములో తీర్థుల వారు 'అథరుక్మిణీకళ్యాణ మహోత్సవ వర్ణనం అభినీయతే" -2

అని ఈ రుక్మిణీ కళ్యాణ వృత్తాంతాన్ని ప్రదర్శనరూపంగా రచిస్తున్నట్లు సూచించారు. దీనిని బట్టి పోతన వర్ణన ప్రధానంగా రచించిన దానిని ఈయన దృశ్య ప్రధానంగా మార్చినట్లుగా అర్థమవుతున్నది.

రుక్మిణి శ్రీకృష్ణునే నిత్యం స్మరిస్తూ ఉంటుందని ఒక విశేషణం చెప్పారు.

"కృష్ణమేవ చింతయంతే సదా హృది" -3

---

1. *పోతన భాగవతం 10 : 1775 : పుట-415*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : పుట-485*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 3 : పుట-488*

దీనిని బట్టి యోగమార్గం ద్వారా ఆమె ధ్యానప్రక్రియను సాధించిందని అవగతమవుతోంది. యోగము పరోక్షముగా అద్వైత సిద్ధాంతానుసారియే. అద్వైతము సిద్ధాంతము కాగా యోగము దాని ప్రయోగరూపము.

ఆ కృష్ణుని దర్శనం నాకెప్పుడు కలుగునో అని పరిపరి విధాల పరితాపాన్ని చూపిన రుక్మిణి తన మనసును సంబోధిస్తూ "రేరే మానసగోపాలం భజ"

(ఓ మనసా! గోపాలుని భజింపుము) అని ఆత్మబోధ చేసుకుంటుంది.

కీర్తన :

పల్లవి : రేరే మానస గోపాలం భజ దూరే పరిహార భూపాలం
ఆరాదంతరతరం అఖిలాత్మక బోధానందఘనం బాలం

చరణం : విమల హృదయ కమలోదారం వేదశమిత వివిధ విషయాకారం
కమనీయతర కరుణాసారం సర్వసమభావ భావమహోదారం

చరణం : సామాది నిగమాంత సంచార ధీర ధీమదనుస్మృత సుగుణాకారం
సమరసమేక మనంత మనన్వయం అమిత నిరంతర సుఖసాగరం

చరణం : జగదండకోటి పరాకాశం సర్వనిగమాంత విదిత స్వప్రకాశం
అగణిత గుణమణి వాగీశం దేవం ఆగమరూప నిజాదేశం

చరణం : విదళిత మోహజ భవపాశం విశ్వమంగళ కృతతను మఖిలేశం
భగవంతమాదిగురుం శివమద్వయచిద్గగనం నవనీతాశం

చరణం : సుందరతర మురళీవాదం మునిబృంద విచింత్య సుందరపాదం
నందతనయ మఖిలానందం శరదిందు వదనమిహ గోవిందం

చరణం : బృందావన హిత గోబృదం ధృతమందర మఖిల నిగమబృదం
నందసునందాది వద్యం అనన్యగ నారాయణతీర్థ యతివరదం -1

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 5 : పుట-494, 495*

ఈ ఘట్టంలో కూడా తీర్థులు విష్ణువు యొక్క సగుణ నిర్గుణ తత్త్వాలను రెంటినీ కూడా ఆవిష్కరించారు. "బోధానందఘనం సర్వసమభావమహోదారం, అనంతం, అనన్వయం, అమిత నిరంతర సుఖసాగరం"

అనేవి అద్వైతపరంగా వాడిన విశేషణాలు. "సుగుణాకారం, అగణిత గుణమణివాగీశం" అనేవి సగుణబ్రహ్మ వర్ణనంలోనికి వస్తాయి కాబట్టి విశిష్టాద్వైతానికి చెందుతాయి.

"గోపాలకమేవదైవతంభజే" -1

అని ఆమె కృష్ణుని గుణగణాలను స్మరించుకుంటుంది. ఇక్కడ కూడా విశిష్టాద్వైత విస్తారమే జరిగింది. సర్వలోక కారణం, సత్యకామాది గుణం అనేవి విశిష్టాద్వైత, అద్వైత సిద్ధాంతాలకు సమానంగా అన్వయించేవి.

బ్రాహ్మణుడు కృష్ణునకు రుక్మిణి ఇచ్చిన ప్రేమలేఖను అందించి సమాధానంగా కృష్ణుడు రుక్మిణి కోరినట్లుగా తాను వస్తానని చెప్పినట్లుగా తిరిగి వచ్చి రుక్మిణితో చెబుతాడు. అక్కడ 'శరణంజగతామేవ' -2

అనే విశేషణం వాడి ఆ వెంటనే 'సకలాంతరాత్మా' -3

అంటారు తీర్థులు. ఇందులో మొదటిది విశిష్టాద్వైతపక్షం, రెండవది అద్వైత పక్షం.

మూలభాగవతకర్త వ్యాసుడు పరతత్త్వం యొక్క సగుణ నిర్గుణ స్వరూపాన్ని ఆవిష్కరించిన రీతిగానే పోతన మహాకవి, తీర్థుల వారు ఆ రెండు తత్త్వాలను సమన్వయపరచినట్లుగా అర్థం చేసుకోవాలి.

పురోహితులు చదివిన మంగళాష్టకములలో కూడా ఈ రెండు తత్త్వాల ఆవిష్కరణం జరిగింది.

*శ్లో॥ సత్యజ్ఞానసుఖస్వరూపమమలం సర్వోత్తమంనిత్యదృక్*
*ప్రత్యక్తత్త్వమచింత్యశక్తి విలసద్విశ్వం పరబ్రహ్మయత్*
*లోకానుగ్రహ విగ్రహస్యజగతాంనాథస్య తస్యామరాః*
*రుక్మిణ్యాస్సతతం వివాహసమయే కుర్వంతుతే మంగళం -4*
*సులగ్నే సావధాన*

"సత్య జ్ఞానసుఖ స్వరూపం, నిత్యదృక్, ప్రత్యక్తత్త్వం, అచింత్యశక్తిః, విలసద్విశ్వం అనేవి అద్వైతపరాలు కాగా, అమలం, సర్వోత్తమం, లోకానుగ్రహవిగ్రహస్య, జగతాంనాథస్య" అనేవి విశిష్టాద్వైతపరాలు.

లగ్నాష్టకం చివర 'సులగ్నే సావధాన' అనే మాట ముద్రితప్రతులలో కనబడుతోంది. ఆలోచిస్తే యీ పదం అంత సమంజసమైనదిగా తోచదు. సులగ్నము నందు మీరందరూ సావధానముగా ఉండండి అని

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 :6 : పుట-498*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 :9 : పుట-514*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 :9 : పుట-514*

*4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 :39 : పుట-528*

పురోహితుల వారు ఆహుతులందరికీ హెచ్చరిక చేయడం దీని ప్రయోజనం. పదం సావధానాః (భవన్తు) అని ఉండాలి. తీర్థుల వారైతే ఇలానే చెబుతారు. అయితే అనంతరులు యీ దృశ్యాన్ని ప్రదర్శిస్తూ లోకంలో ప్రచురంగా వ్యాప్తిలో ఉన్న పురోహిత వాక్యాన్ని ఇక్కడ చేర్చినట్లుగా భావించాలి.

మొత్తం మీద తీర్థుల వారు విశిష్టాద్వైత పదాన్ని వాడినా ఆ వెంటనే అద్వైత విశేషణాన్ని చొప్పించడం చేత ఆ రెంటి సమన్వయాన్ని తీర్థుల వారు జీర్ణం చేసుకున్నారని భావించాలి.

సగుణరూపాన్ని వర్ణించిన తీర్థుల వారే అద్వైతపరమైన పరతత్త్వ నిరూపణానికి మొగ్గచూపడాన్ని గమనించవచ్చు.

ఈ విధమైన భావన ఆయన అద్వైతప్రీతిని వెల్లడి చేస్తోంది.

దీనిని బట్టి తీర్థుల వారు సందర్భం కోసం వర్ణనాత్మకంగా సన్నివేశాన్ని అందుకొని సుందరంగా శబ్దజాలంతో వర్ణించినా సన్యాసి హృదయమైన వేదాంత విచారాన్ని ప్రదర్శించి తన సహజలక్షణాన్ని నిరూపించుకున్నారని తెలుతోంది.

పోతన గారిలో కూడా యీ అద్వైత, విశిష్టాద్వైత లక్షణాలు ఉన్నా కవిత్వం మీద ఆయనకు ఉన్న అభిరుచిని బట్టి భగవద్వర్ణన సందర్భంలో సగుణతత్త్వాన్నే ఎక్కువగా ప్రకటించినట్లుగా తోస్తున్నది.

ఈ విషయంలో ఇద్దరిదీ ఒకే దారి అయినా అద్వైతపరంగా చూసినప్పుడూ తీర్థుల వారిదే ప్రథమ స్థానము.

వ్యాఖ్య : పోతన గారి వర్ణనలో ఈ రుక్మిణీ కళ్యాణ వృత్తాంతం ఒక ప్రబంధంలా నడిచింది. ఆరంభము, విస్తారము, ముగింపు అనే మూడు అంశాలతో పాత్రపోషణ మహనీయంగా ఆంధ్రులకు ఆరాధ్యమైన, శుభావహమైన శైలిలో నడిచిన యీ ఘట్టం గజేంద్రమోక్షం, వామన చరిత్ర, ప్రహ్లాద చరిత్ర వంటి వానితో సమాన స్థాయిని సంతరించుకొని ఆంధ్రుల హృదయాలకు హత్తుకొని పోయింది.

వేదాంత విషయమునకు వస్తే రుక్మిణి వాక్యాలలో పెద్దగా కనబడదు. అనంతర కథలో పోతనకు తన సహజమైన సగుణ నిర్గుణ సమారాధన స్వభావం స్మరణకు వచ్చి బలభద్రుని ద్వారా రుక్మిణికి వేదాంతోపదేశం చేయించాడు. వర్ణనలలో మూలాన్ననుసరించినదైనా పరిహరించకుండా సన్నివేశానికి పుష్టి చేకూర్చాడు.

తీర్థుల వారికి కథ మీద దృష్టి, తాను రచించిన గ్రంథాన్ని ప్రదర్శన రూపంలో యక్షగానంగా రూపొందించడమనే బాధ్యత ఎక్కువ అయి కథాపుష్టి కోసం కీర్తనలను పెంచారు. అయితే ఆయన రచించిన కీర్తనల సంఖ్య కొంచెం తగ్గించి యుంటే బాగుండేది.

పరిశీలించి చూస్తే తీర్థుల పేరులోనే ఆద్వైతం ఉంది (శివనారాయణ తీర్థులు) తిక్కన హరిహరనాథ తత్త్వానికి దీటుగా ఈయన పేరు కన్పిస్తుంది. పేరుకు తగ్గట్టు తన తరంగాలలో తీర్థులు సందర్భోచితంగా అద్వైత తత్త్వాన్ని ప్రతిపాదించి కృతకృత్యులయినారు.

పైన ప్రస్తావించినట్లు పోతన భాగవతంలో కంటే తీర్థుల కృష్ణ లీలాతరంగిణిలో అద్వైత తత్త్వ ప్రతిపాదన ఎక్కువగా కన్పిస్తుంది.

అద్వైత తత్త్వాన్ని తీర్థులు తాననుభవించి తన తరంగాల ద్వారా ప్రజలకు అందజేశారు.

పలికెడిది భాగవతమఁట

పలికించెడివాడు రామభద్రుండఁట నేఁ

బలికిన భవహరమగునఁట

పలికెద వేఱొండు గాథబలుకఁగనేలా



# బమ్మెర పోతనామాత్యుడు

శ్రీ గురుభ్యో నమః

# కవితాంశాలు

**దశమ స్కంధము - పూర్వ భాగము - పోతన భాగవత స్వరూపము :**

| | | | |
|---|---|---|---|
| 1. | మత్తకోకిలము | : | 11 |
| 2. | శార్దూలము | : | 115 |
| 3. | ఉత్పలమాల | : | 124 |
| 4. | మత్తేభము | : | 136 |
| 5. | మాలిని | : | 2 |
| 6. | వచనం | : | 530 |
| 7. | కందం | : | 576 |
| 8. | ఉపేంద్రవ్రజ | : | 1 |
| 9. | ఆటవెలది | : | 90 |
| 10. | సీసము | : | 153 |
| 11. | పంచచామరం | : | 1 |
| 12. | తేటగీతి | : | 6 |
| 13. | తరళం | : | 5 |
| 14. | చంపకమాల | : | 36 |
| 15. | ఇంద్రవజ్ర | : | 2 |
| 16. | దండకం | : | 1 |
| 17. | లయవిభాతి | : | 2 |
| | | | **1,791** |

## తీర్థకృత శ్రీకృష్ణ లీలా తరంగిణీ - స్వరూపము :

శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ గ్రంథమును నారాయణతీర్థుల వారు 345 గద్య శ్లోకములు మరియు 157 కీర్తనలలో రచించారు.

| | | | |
|---|---|---|---|
| 1. | ఆర్యావృత్తం | : | 14 |
| 2. | అనుష్టుప్ | : | 214 |
| 3. | మాలినీ | : | 14 |
| 4. | వసంతతిలక | : | 5 |
| 5. | స్రగ్ధర | : | 7 |
| 6. | గద్యం | : | 33 |
| 7. | శార్దూలం | : | 19 |
| 8. | ఉపజాతి | : | 6 |
| 9. | ఉపేంద్రవజ్ర | : | 5 |
| 10. | మందాక్రాంత | : | 8 |
| 11. | శిఖరిణీ | : | 4 |
| 12. | ఇంద్రవజ్ర | : | 3 |
| 13. | భుజంగప్రయాతం | : | 2 |
| 14. | పృథ్వీ | : | 2 |
| 15. | పంచచామరం | : | 2 |
| 16. | రథోద్ధత | : | 2 |
| 17. | ద్రుతవిలంబితం | : | 3 |
| 18. | హరిణీ | : | 1 |
| 19. | వంశస్థం | : | 1 |
| | | | **345** |

# శ్రీకృష్ణ లీలా తరంగిణీ స్వరూపము

శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ గ్రంథమును తీర్థుల వారు గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో రచించారు. -1

నారాయణతీర్థులు శ్రీమద్భాగవత దశమస్కంధ పూర్వభాగమును రుక్మిణీ కళ్యాణాంతము వరకు సంస్కృతంలో గద్య పద్యాత్మకంగా రచించారు. ఈ గ్రంథంలో 12 భాగాలున్నాయి. ప్రతి భాగాన్ని తీర్థుల వారు తరంగములని పేర్కొన్నారు. అందువల్లనే దీనిలోని కీర్తనలకు తరంగములని పేరు ఏర్పడింది. తరంగమును గానం చేసే సమయంలో భావములు అలల వలె వృద్ధి పొందుతాయి. తరంగములకు మధ్య మధ్యశ్లోకములను, గద్యలను కథా సందర్భమును తెలుపునవి కలవు. దరువులతో సహా శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ గ్రంథంలో 152 తరంగములు (కీర్తనలు) ఉన్నాయి. ఇవి కాకుండా మంగళం కొరకు చెప్పబడినది ఒకటి. ప్రక్షిప్త తరంగములు నాలుగు. మొత్తం కలిపి 157 అచ్చులో ఉన్నాయి.

చేతో శ్రీరామం అనే నవరోజు రాగంలోని కీర్తన అచ్చులో లేనిది ఉంది. ప్రక్షిప్త తరంగమైన "జయ జయ వైష్ణవి దుర్గే" అనే దేవగాంధారి రాగంలోని తరంగము చివర అంకితం కల పాదం లభించడం లేదు.

| | రాగములు | తరంగములు | | రాగములు | తరంగములు |
|---|---|---|---|---|---|
| 1. | ఆనంద భైరవి | 2 | 19. | పంతువరాళి | 1 |
| 2. | ఆహిరి | 3 | 20. | పూరీ కళ్యాణి | 1 |
| 3. | ఆరభి | 2 | 21. | పున్నాగవరాళి | 3 |
| 4. | కాంభోజి | 16 | 22. | భైరవి | 4 |
| 5. | కళ్యాణి | 9 | 23. | బిలహరి | 2 |
| 6. | కేదారగౌళ | 9 | 24. | ముఖారి | 9 |
| 7. | కురంజి | 1 | 25. | మధ్యమావతి | 13 |
| 8. | కర్ణాట సారంగ | 1 | 26. | మోహన | 4 |
| 9. | కాపి | 2 | 27. | మంగళకాపి | 1 |
| 10. | కమాస్ | 1 | 28. | యదుకుల కాంభోజి | 4 |
| 11. | గౌరీ | 1 | 29. | రేగుప్తి | 2 |
| 12. | తోడి | 1 | 30. | శ్రీరాగం | 3 |
| 13. | ద్విజావంతి | 5 | 31. | శంకరాభరణం | 7 |
| 14. | ధన్యాసి | 2 | 32. | సౌరాష్ట్ర | 15 |
| 15. | దేశాక్షి | 1 | 33. | సావేరి | 8 |
| 16. | నాట | 2 | 34. | సురటి | 2 |
| 17. | నాదనామక్రియ | 16 | 35. | సారంగ | 1 |
| 18. | నవరోజు | 1 | 36. | హుసేని | 1 |

*1. సంగ్రహ ఆంధ్రవిజ్ఞాన కోశము, పుట-215*

ఈ ప్రకారంగా చూస్తే 36 రాగాలలో 157 తరంగాలు చెప్పబడ్డాయి. 'చేతో శ్రీరామం' అనే నవరోజు రాగంతో కలిసి 158 ఉన్నాయి. ఈ తరంగములలో కొన్నింటిని రాగములు మార్చి పాడుతున్నారు. భూపాల, మలహరి, వరాళి, శహన, సారంగ, దేవగాంధారి మొదలైన రాగాలలో మార్చి పాడుతున్నారు.

| | **తాళము** | **కీర్తనలు** |
|---|---|---|
| 1. | ఆది తాళం | 85 |
| 2. | అట లేక చాపు | 40 |
| 3. | త్రిపుట | 13 |
| 4. | ఝంపె | 9 |
| 5. | రూపకము | 4 |
| 6. | ధృవ | 1 |
| 7. | మత్య | 1 |
| 8. | విళంబ | 1 |
| 9. | ఏక | 1 |
| 10. | అట / త్రిపుట | 1 |
| 11. | ఆది / ఝంపె | 1 |
| | మొత్తం 11 తాళములలో చెప్పబడినవి | **157** |

## పోతన భాగవత స్వరూపము :

భక్తపోతన ధ్యేయము కేవలము మోక్షకామనయే. స్వయముగా భాగవతము నందు పోతన గారే యీ విషయమును తెలియజేశారు.

*ఒనరన్ నన్నయ తిక్కనాదికవులీ యుర్విన్ పురాణావళుల్*
*తెనుగున్ జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబుతానెట్టిదో*
*తెనుగున్ జేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించినా*
*జననంబున్ సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండగన్ ।  -1*

కవిత్రయము వారి అనువాదములో ఆవిర్భవించిన మోక్షకామన లేక పరతత్త్వారాధన భక్తపోతన అనువాదములో భక్తిభావ పారవశ్యము మోక్షేచ్ఛ, అంతర్దృష్టి రూపములలో రూపొందింది.

పోతన గారి భాగవతానువాదమునకు పరమ ప్రయోజనము శ్రీరామచంద్రుడు ఆనతినిచ్చినట్లుగా భవబంధములు త్రెగుట కొరకు మాత్రమే.

---

*1. పోతన భాగవతం, 1 : 21 : పుట-8*

*పలికెడిది భాగవతమట, పలికించు విభుండు రామభద్రుండట*
*నే పలికిన భవహరమగునట, పలికెద వేరొండుగాథ బలుకగనేలా -1*

*"శ్రీ కైవల్యపదంబుఁజేరుటకునై చింతించెదన్ లోకర*
*క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో*
*ద్రేక స్తంభకుఁ గేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా*
*నా కంజాత భవాండకుంభకు మహానందాంగనా డింభకున్ -2*

**పోతన - భాగవతానువాదము :**

భాగవతానువాదంలో పోతన కవిత్రయం వారిని, శ్రీనాథుని మధ్యేమార్గంగా అనుసరించినాడు. నన్నయ తిక్కనాదుల వలె ఒక్కొక్క కథాభాగమును తీసుకొని ఆయన స్వతంత్రానువాదం చేశాడు. వేరొక చోట శ్రీనాథుని వలె ప్రతి శ్లోకమును ఒక పద్యముగా తీర్చిదిద్దినాడు. భాగవతానువాదములో ఆయన చూపిన అఖండ ప్రజ్ఞా విశేషము దశమ స్కంధ పూర్వభాగములో అనేక విధాలుగా గోచరమవుతుంది.

**ఎ) యథామూలము :**

ఒక భాష నుండి మరొక భాషకు అనువాదము జరిగేటప్పుడు యథామూల భావానువాదమే కానీ యథామూల పదానువాదం ఉండదు. మూలమునకు ఎట్టి మార్పులు చేయకుండా చాలా వరకు ఉన్నది ఉన్నట్లుగా అనువదించుటను యథామూలానువాదముగా భావించవచ్చును.

మూలము :

*శ్లో॥ ధన్యేయమద్య ధరణీతృణవీరుధస్త్వత్, పాదస్పృశోద్రుమలతాః కరజాభిమృష్టాః*
*నద్యోఽద్రయః ఖగమృగాస్సదయావలోకైః, గోప్యోఽంతరేణ భుజయోరపియత్ స్పృహాశ్రీః ॥ -3*

*సీసం॥ నీ పాదములు సోకి నేడు వీరుత్తృణ పుంజంబుతో భూమి పుణ్యయయ్యె*
*నీ నఖంబులు సోకి నేడు నానాలతా తరు సంఘములు కృతార్థంబులయ్యె*
*నీ కృపాదృష్టిచే నేడు నదీ శైల ఖగమృగంబులు దివ్యకాంతి జెందె*
*నీ పెన్నురము మోవనేడు గోపాంగనా జనముల పుట్టువు సఫలమయ్యె ॥*

*ఆ॥వె॥ నని యరణ్య భూమి నంకించు పసులను, మిత్రజనులు దాను మేపుచుండి*
*నళినలోచనుండు నదులందు గిరులందు, సంతసంబు మెరయ సంచరించె ॥ -4*

---

1. *పోతన భాగవతం, 1 :18 : పుట7*
2. *ఆంధ్ర భాగవత పీఠిక 1 : 1 : పుట-1*
3. *సంస్కృత భాగవతం 10-10-పుట-8*
4. *పోతన భాగవతం, 10 : 599 : పుట-132*

సంస్కృతములో అన్నింటికీ 'ధన్య' శబ్దమే అన్వయించుకొనవలసి యుండగా తెలుగులో పుణ్యమయ్యె, కృతార్థములయ్యె, కాంతి జెందె, సఫలమయ్యె అని భిన్న పదములు వాడబడినవి. మిగిలినదంతా యథామూలముగా గ్రహించవచ్చు.

**బి) యథామూలప్రాయము :**

మూలభావానికి చిన్న చిన్న మార్పులు చేసి ప్రయోగించుటయే యథామూలప్రాయము లేక సన్నిహితానువాదము

*శ్లో॥ నారాయణం నమస్కృత్య, నరంచైవ నరోత్తమమ్*
*దేవీం సరస్వతీం వ్యాసం, తతోజయముదీరయేత్ ॥ -1*

*కందం॥ నారాయణునకు నరునకు, భారతికిని మ్రొక్కి వ్యాసుపదములకు నమ*
*స్కారము చేసి వచింతు ను, దార గ్రంథంబు దళిత తను బంధంబున్ ॥ -2*

**సి) మూలమును విడుచుట :**

మూల శ్లోకాన్ని అనువదించడంలో ఆయా సందర్భాలలో దానిలో కొన్ని పదాలో లేక ఇంకా ఎక్కువ భాగమో వదలివేయబడుతుంది.

*శ్లో॥ అస్యాపి దేవవపుషోమదనుగ్రహస్య, స్వేచ్ఛామయస్యన తు భూత మయస్య కోకపి*
*నే శే మహిత్వ వసితుం మనసాంతరేణ, సాక్షాత్తవైవ కిముతాత్మ సుఖానుభూతేః ॥ -3*

*నిను మన్నించి భవజ్జనంబులకు నానందంబు నిండించు నీ*
*తను రూపంబిదెనా మనంబున కచింత్యంబయ్యె నీ యుల్లసత్*
*ఘనవిశ్వాకృతి నెవ్వడోపు నెరుగన్ గైవల్యమై యొప్పునా*
*త్మ నివేద్యంబగు నీదు వైభవము చందం బెట్టిదో ఈశ్వరా । -4*

**డి) మూలభిన్నత :**

అనువాద సమయంలో మూలంలోని పదాలకు, భావాలకు భిన్నములైన పదాలు, భావాలు చేర్చితే అది మూల భిన్నత.

---

1. *సంస్కృత భాగవతం 1 : 2 : పుట-4*
2. *పోతన భాగవతం 1 : 57 : పుట-20*
3. *సంస్కృత భాగవతం 10 : 14 : పుట-2*
4. *పోతన భాగవతం, 10 : 549 : పుట-119*

*శ్లో॥ గాయంత్య ఉచ్చైరముమేవ సంగతా, విచిక్యు రున్మత్తకవద్వనా ద్వనమ్*
*పప్రచ్ఛు రాకాశవ దంతరం బహిర్, భూతేషు సంతం పురుషం వనస్పతీన్ ॥ –1*

*కందం॥ భూతములలోన వెలి ప్ర, ఖ్యాతుండగు నట్టి వాని కాంతలు కాళిం*
*దీతీర వనాంతరముల, బ్రాతిన్ వెదకంగ జనిరి పాడుచునధిపా ॥ –2*

**ఇ) అమూలకములు :**

కాళియ మర్దన ఘట్టంలో సర్పముచే చుట్టబడిన కృష్ణుని చూచి యశోదానందులు బాధపడినారు.

*కందం॥ పన్నగము మమ్ము గరువక, నిన్నేటికి గరచె గుఱ్ఱ? నెమ్మిగలిగి నీ*
*మన్నన మము రక్షింతువు, నిన్నున్ రక్షింప నేము నేరము తండ్రీ ! –3*

అమూలకముగా పోతనగారు వర్ణించిన వివిధ ఋతు వర్ణనలు

**ఎ) గ్రీష్మఋతు వర్ణన :**

*ఆ॥వె॥ వాడి రుచులు గలుగువాని వేడిమి గ్రీష్మ, కాలమందు జగము గలయబడియె*
*బ్రహ్మ జనుల కొఱకు బ్రహ్మాండ ఘటమున, నుష్ణరసము దెచ్చియునిచె ననగ ॥ –4*

**బి) వర్షఋతు వర్ణన :**

*కందం॥ చెలువుడు ప్రావృట్ కాలుడు, పొలసిన పులకించు భూమి పులకము లనగా*
*మొలచి తలలెత్తి నిక్కుచు, సలలిత గతి జాలువారె సస్యములధిపా ? –5*

**సి) శరదృతు వర్ణన :**

*కందం॥ జొంపములు గొనియె వనములు, రొంపు లిగిరె నెమలిగముల రొదలుడిగె నదుల్*
*పెంపులకు బాసె నురుముల, శంపల సంపదలు మానె శారదవేళన్ ॥ –6*

---

1. *సంస్కృత భాగవతం 10 : 30 : పుట–4*
2. *పోతన భాగవతం 10 : 1008 : పుట–229*
3. *పోతన భాగవతం, 10 : 656 : పుట–145*
4. *పోతన భాగవతం, 10 : 717 : పుట–161*
5. *పోతన భాగవతం, 10 : 755 : పుట–170*
6. *పోతన భాగవతం, 10 : 764 : పుట–173*

డి) హేమంత ఋతు వర్ణన :

*కందం॥ ఉత్తరపు గాలి విసరె వి, యత్తలమున తుహిన కిరణుడహితుండయ్యెన్*
*బొత్తు జరిగె మిథునములకు, నెత్తమ్ములు దరిగె హిమము నెలకొనియె నృపా ॥ -1*

## పోతన భాగవతం నుండి తీర్థుల వారు పరిహరించిన ఘట్టములు :

దేవకీ వసుదేవుల పూర్వజన్మ వృత్తాంతము : స్వాయంభువమన్వంతరంలో పృశ్ని, సుతపుడు బ్రహ్మదేవుని ప్రేరణతో పన్నెండు వేల దివ్యసంవత్సరములు గొప్ప తపస్సు చేశారు. నారాయణుడు ప్రత్యక్షమై వరము కోరుకోమన్నాడు. భగవంతుని మాయ ఆవరించడం చేత వారు అతి కష్టసాధ్యమైన మోక్షాన్ని కోరలేదు. భగవంతునితో సమానమైన కొడుకును ప్రసాదించమని వేడుకున్నారు. ఆయనకు సాటి వేరొకడు లేడు కాబట్టి తనే 'పృశ్నిగర్భుడు' అనే పేరుతో వారికి కుమారునిగా జన్మించాడు. వారే రెండవ జన్మలో అదితి, కశ్యపులుగా జన్మించారు. వామనరూపంలో నారాయణమూర్తి వారి గర్భాన ఉదయించాడు. మూడవజన్మలో వారు దేవకీ వసుదేవులై జన్మించగా నారాయణుడు వారికి శ్రీకృష్ణ పరబ్రహ్మముగా ఉద్భవించాడు. ఇకపై వారికి జన్మ కలుగకుండా అనుగ్రహించాడు.

*కందం॥ నందనుఁడనియుంబరమా, నందంబగు బ్రహ్మమనియు ననుఁదలఁచుచు నా*
*పెందెరువు నొందెదరు, నా, యందలి ప్రేమమున భవమునందరు మీరల్ -2*

## యశోదానందుల పూర్వజన్మ వృత్తాంతము :

అష్ట వసువులలో ఒకడైన ద్రోణుని భార్య ధర. బ్రహ్మదేవుని ఆదేశానుసారం భూమిపై జన్మించి విష్ణుసేవా భాగ్యం పొందారు. ఆ ధరాద్రోణులే యీ యశోదానందులు.

*సీసం: అవనీశ వినుద్రోణుఁడనువాఁడు వసువుల యందు ముఖ్యుఁడు, ధరయతని భార్య,*
*వారినిద్దర బ్రహ్మ 'వసుధపై జన్మింపుఁ' డంచుఁ బంచిన వారలతని జూచి*
*'విశ్వేశ్వరుండైన విష్ణుసేవారతి, మాకిచ్చి తేనిని మహిజనింతు'*
*మనవుడు 'నట్లకా' కనియె వేల్పుల పెద్ద యా ద్రోణుఁడే నందుఁడై జనించె*

*ఆ॥వె॥ ధర యశోదయయ్యె, దనుజేంద్రవైరియుఁ, గమల గర్భుమాటగారవించి*
*తల్లిదండ్రులనుచుఁ దగవారి మన్నించె, నధికభక్తితోడ నలరినట్లు -3*

---

*1. పోతన భాగవతం, 10 : 799 : పుట-182*

*2. పోతన భాగవతం, 10 : 134 : పుట-29*

*3. పోతన భాగవతం, 10 : 353 : పుట-74*

## వత్సాసుర వధ :

ఒకనాడు బలరామకృష్ణులు యమునానదీ తీరంలో గోపబాలకులతో కలిసి గోవత్సాలను మేపుతున్నారు. వత్సాసురుడు వారిని చంపదలచి తాను ఒక కోడె దూడ రూపంలో కృష్ణుని వెనుక తిరుగసాగాడు. కృష్ణుడు దాని కాళ్ళు, తోక గట్టిగా పట్టుకొని పైకెత్తి వెలగ చెట్టు కేసి మోదాడు. వత్సాసురుడు గిలగిలా కొట్టుకొని చనిపోయాడు. గోపాలకులు ఆనందంతో కేకలు వేశారు.

*చం॥ 'ఇదియొక మంచిలేఁగ, వినుఁడెంతయు నొప్పెడి' నంచుదాని త*
*త్పదములఁదోఁకయున్ బిగియఁబట్టి చెలంగి వెలంగ(మానితోఁ*
*జదియఁగనొక్కపెట్టుగొని చంపెఁగుమారుఁడు లేఁగరక్కసం,*
*గుదులుకొనంగ బాలకులు గోయనియార్వనఖర్వలీలతోన్ -1*

## బకాసుర వధ :

ఒకనాడు ఉదయం గోపకుమారులు దూడలను తోలుకుని అడవికి వెళ్ళారు. ఎండ తీవ్రత చేత వాటికి దాహం వేసింది. గోపకులు వాటిని కొలను దగ్గరకు తీసుకుపోయి వాటికి నీటిని త్రాగించారు. వారు దాహం తీర్చుకున్నారు. తిరిగి వచ్చే సమయంలో వారు మహాభయంకరమైన కొంగను చూశారు. పెద్ద కన్నులతో అది కృష్ణుని చంపడానికి వేచి ఉన్నది. ఒక్క కృష్ణుని పైనే అది తన దృష్టినంతా కేంద్రీకరించింది. కొక్కెర ఒక్కసారిగా కృష్ణుని పైకి కుప్పించి దూకింది. భయంకరంగా కూతపెడుతూ విజృంభించి తన ముక్కుతో కృష్ణుని మ్రింగివేసింది. గోపబాలుడు నిప్పుముద్దలాగా దాని కంఠానికి అడ్డుపడ్డాడు. అది కృష్ణుని మ్రింగలేక మరల బయటకు క్రక్కివేసింది. బయటపడిన కృష్ణుడు ఆ కొంగ ముక్కు రెండు భాగాలను రెండు చేతులతో పట్టుకొని గడ్డిపరకను చీల్చినట్లు నిలువనా చీల్చివేశాడు. దీంతో కొంగ రూపంలో ఉన్న బకాసురుడు చనిపోయాడు.

*కందం॥ క్రక్కి మహాఘోషముతోఁ జక్కఁగఁదనుఁబొడువరాఁగఁ జంచులు రెండున్*
*(సుక్కఁగఁ బట్టి తృణముక్రియ గ్రక్కున హరిసీరెబకునిఁ గలహోత్సుకునిన్ -2*

## గోపబాలురు, బలరామకృష్ణులు చల్దులు ఆరగించుట :

ఒకనాడు బలరామకృష్ణులు, గోపబాలురు అందరూ కలిసి వనభోజనాలు చెయ్యాలని సరదాపడ్డారు. తల్లులు సిద్ధం చేసిన రకరకాల పిండివంటలు మూటలు కట్టుకున్నారు. వారు అడవిలో రకరకాల ఆటలు ఆడుకున్నారు. ఎండలో మ్రగ్గిపోయిన వారు రాతిపలకులు, లేత తామర ఆకులు మొదలైన వాటినే కంచాలుగా చేసుకొని చల్దులు ఆరగించారు. ఆ సమయంలో వారు అనేక విధాలుగా ప్రవర్తించారు.

---

1. *పోతన భాగవతం, 10 : 435 : పుట-92*
2. *పోతన భాగవతం, 10 : 450 : పుట-95*

ఒక గోపబాలుడు వేళ్ళ మధ్యలో ఊరగాయముక్కలను ఇరికించుకొని పక్క వాడిని ఊరిస్తూ తింటూ ఉంటే మరొకడు పక్కవాడి కంచంలోనిది గభాలున లాక్కొని వాడు చూసేసరికి ఏమీ లేదని నోరు చూపించాడు. ఇంకొకడు పందెం వేసి మరీ ఐదారుగురు తినే చల్దిని నోట కూరుకుంటున్నాడు. వేరొకడు ఒక్కొక్కరి కంచంలో నుంచి ఒక్కొక్కటి తీసుకుంటూ స్నేహమంటే యిదే అని 'బంతెనగుండ్లు' అనే ఆట ఆడుతున్నాడు. ఒకడు కృష్ణుడు ఎలా నవ్వుతున్నాడో చూడు అంటూ మిత్రుని ముందున్న మధురపదార్థాలు తినేస్తున్నాడు. నవ్వుతూ నవ్విస్తున్నాడొకడు. తాను నవ్వకుండా మరొకడిని నవ్విస్తున్నాడింకొకడు. ఒకడు ముచ్చటలు చెబుతూ ఉంటే వేరొకడు అవి వింటూ మురిసిపోతున్నాడు. ఈ విధంగా కొలను ఒడ్డున ఇసుక తిన్నెలపై ఆహ్లాదకరమైన వాతావరణంలో వారు చల్దులు ఆరగించారు.

*సీసం॥ మాటిమాటికి వ్రేలుమడిచి యూరించుచు నూరుఁగాయలు దినుచుండునొక్కఁ,*
*డొకని కంచములోని దొడిసిచయ్యనమ్రింగి "చూడులే"దని నోరు సూపునొక్కఁ,*
*డేగురార్గురచల్దులెలిమిఁ బన్నిదమాడి కూర్కొని కూర్కొని కుడుచునొక్కఁ*
*డిన్నియుండఁగఁబంచియిడుట నెచ్చెలి తన మనుచుబంతెనగుండు తాడునొకఁడు*

*ఆ॥వె॥ కృష్ణుఁజూడుమనుచుఁగికురించి పరుమ్రోల, మేలి భక్ష్యరాశి మెసఁగునొకఁడు*
*నవ్వునొకఁడు సఖుల నవ్వించునొక్కఁడు, ముచ్చటాడునొకఁడు, మురియునొకఁడు -1*

## కాళియుని పూర్వ వృత్తాంతం :

పాములకు నైవేద్యంగా ప్రజలు పెట్టిన మధుర పదార్థాలను గరుత్మంతుడు తమను చంపకుండా ఉండటానికి ప్రతి మాసము కానుకగా సమర్పించి సర్పరాజులు బ్రతుకుతూ ఉండేవారు. కాళీయుడు మాత్రం గరుత్మంతుని ధిక్కరించి ఎదిరించాడు. గరుత్మంతుని కాటువేశాడు. ఖగరాజు తన ఎడమరెక్కతో కాళియుని కొట్టగా కాళియుని కోరలు విరిగిపోయాయి. భయపడి కాళియుడు మడుగులో దాక్కున్నాడు. అదే కాళిందీ తటం. ఇదిలా ఉండగా 'సౌభరి' అనే ముని ఈ మడుగులో తపస్సు చేసుకుంటున్నాడు. ఆకలిగొన్న గరుత్మంతుడు యీ మడుగులోని చేపలను పట్టుకొని తినివేశాడు. మిగిలినవి దుఃఖంతో ఏడుస్తున్నాయి. అది చూసి సహించలేని మహర్షి గరుత్మంతునికి శాపం ఇచ్చాడు. దాని ప్రకారం గరుత్మంతుడు ఇందులోని చేపలను తింటే వెంటనే చనిపోతాడు. అది కాళియునికి వరంగా మారింది.

*సీసం॥ మున్ను సౌభరియనుముని యీహ్రదంబునఁ దపము సేయుచునుండ ధరణిలోన*
*నాఁకలిగొని పన్నగాంతకుఁడొకనాఁడు సనుదెంచి యిందుల జలచరేంద్రు*
*నొడిసి భక్షించిన మన్నమీనములెల్ల ఖిన్నంబులై వగఁగ్రస్సియున్నఁ*
*జొచ్చియుమునిరాజు శోకించి కోపించి గరుఁడుడు నేఁడాదిగాఁగ నిందుఁ*

---

1. పోతన భాగవతం, 10 : 496 : పుట-106

*తే॥గీ॥ జొచ్చి మీనంబులను మ్రింగఁ జూచెనేని !, జచ్చుఁగావుత మని యుగ్రశాపమిచ్చెఁ*
*గాలియుండొక్కఁడా శాపకథ యెఱుంగు, నితరభుజంగంబులెవ్వియు నెఱుఁగవధిప ! -1*

## సుదర్శనుని శాపవిమోచనము :

అంబికావనానికి వెళ్ళిన నందాదులు అక్కడ సరస్వతీ నదిలో స్నానం చేసి పార్వతీ పరమేశ్వరులను పూజించారు. ఆ సమయంలో ఒక మహాసర్పం నందుణ్ణి చుట్టి మ్రింగడానికి యత్నించింది. గొల్లలందరూ దుడ్డుకర్రలతో దానిని మోదసాగారు. ఆ బాధని భరిస్తోంది కానీ అది నందుని విడవడం లేదు. కృష్ణుడు విజృంభించి ఆ సర్పాన్ని కాలితో ఒక తన్ను తన్నాడు. అది పాము రూపు విడిచి విద్యాధరరూపం ధరించి కృష్ణునికి నమస్కరించి తన శాపవృత్తాంతాన్ని వివరించింది.

నా పేరు సుదర్శనుడు. సౌందర్య గర్వంతో అంగిరసుని సంతతి వారు, వికారరూపం కలిగినవారు అయిన ఋషులను చూసి నేను నవ్వాను. వారు నాకు ఈ శాపం ఇచ్చారు.

'దేవా! యేను సుదర్శనుండను విద్యాధరుండ; విమానారూఢుండనై రూపసంపద్గర్వంబులంజొక్కి దిక్కులం జరించుచు నొక్క యెడ నాంగిరసులైన ఋషులం గురూపులైన వారలంగని నగినవారును నీవు రూపదర్పంబున మమ్మునగితివి; గావున మహాసర్పంబవై యుండు' అని శపించి పిదపనే వేఁడుకొనిన నిట్లనిరి. *-2*

నేను వేడుకొనగా విష్ణువు భక్తుల భయం రూపుమాపడానికి యాదవ వంశంలో అవతరిస్తాడు. ఒకరోజు ఆయన అడవికి వస్తాడు. ఆయన కాలి తన్నుతో నీకు యీ పన్నగ శరీరం పోతుంది అని ఆ కృపానిధులు పలికారు. నీ దయవలన నాకు శాపవిమోచనం తొలగిపోయింది అని కృష్ణునికి నమస్కరించి దేవలోకానికి వెళ్ళిపోయాడు.

## శంఖచూడుని సంహారము :

వెన్నెల రాత్రి బలరామకృష్ణుల గానానికి ఒడలెరుగని వయ్యారి గోపికలు ఆ వనసీమలో ఆనంద పారవశ్యంలో మునిగిపోయారు. ఆ సమయంలో కుబేరభటుడైన శంఖచూడుడు తన యోగబలంతో గోపకాంతలను బలాత్కారంగా పట్టుకొని ఉత్తరదిశకు తీసుకుపోసాగాడు. వారు బెబ్బులి బారిపడ్డ ఆవులవలె ఆక్రందన చేయసాగారు. రామకృష్ణులు వారి మొర ఆలకించి మద్దిచెట్లు చేతిలో పట్టుకొని ఆ గుహ్యకునితో తలపడసాగారు. వాడు వారిని వదలి తత్తరపాటుతో పరుగెత్తసాగాడు. కృష్ణుడు గోపికలను కాపాడడానికి బలరాముని నియోగించి యక్షుని వెంటబడి తన సాటిలేని పెను పిడికిలితో వాని శరీరం తునక క్రింద పడేటట్లు పొడిచాడు. ఆ వీరుని కిరీటంలో వెలుగొందే మణిని గోపికలు చూస్తూ ఉండగా గైకొన్నాడు.

---

*1. పోతన భాగవతం, 10 : 707 : పుట-158*

*2. పోతన భాగవతం, 10 : 1116 : పుట-258*

శా॥ *ఓరీ! గుహ్యక! పోకు పోకు మని రోషోక్తిన్ బకారాతి వాఁ*
*డేరూపంబున నెందుఁజొచ్చె నెటఁబోయెందోడఁదానేఁగిదు*
*ర్వారోదంచిత ముష్టివానితలద్రెవ్వంబట్టి తద్వేరు కో*
*టీరభ్రాజితరత్నముంగొనియె దండిన్ గోపికల్ సూడఁగన్ -1*

## వృషభాసుర సంహారం :

ఒకనాడు అరిష్టుడనే రాక్షసుడు ఎద్దురూపం ధరించి కృష్ణునికి కీడు చేయాలనే తలంపుతో మీదకు దూకాడు. ఆ దెబ్బకు గొల్లలు, ఆవులు, దూడలు, ఎద్దులూ చెల్లాచెదురైనాయి. గోపకులు కృష్ణుని శరణు కోరారు. యశోదానందనుడు ఆ వృషభాసురుని కొమ్ములు పట్టి నేలపై పడగొట్టాడు. వాని కొమ్ము పెరిగి దానితోనే వాణ్ణి చంపివేశాడు.

ఆ॥వె॥ *అంత గోపసింహుఁడసురకొమ్ములు వట్టి, ధరణిద్రొచ్చి త్రొక్కి దైత్యభటుల*
*కొమ్మువీఁగ సురలకొమ్ము వర్ధిలవాని, కొమ్మువెఱికి మొత్తి కూల్చెనధిప ! -2*

## ముచకుందుని పూర్వకథ :

ఇక్ష్వాకు వంశీకుడైన మాంధాత కుమారుడు ముచకుందుడు. అతడు అసురుల బారి నుండి దేవతలను రక్షించాడు. దేవతలు వరం కోరమన్నారు. ముచకుందుడు మోక్షాన్ని కోరుకున్నాడు.

వచనం : ఇక్ష్వాకుకుల సంభవుండు మాంధాత కొడుకు ముచకుందుండను రాజు రాక్షసభీతులైన వేల్పులం బెద్దకాలంబు సంరక్షించిన మెచ్చి, వారమరలోక రక్షకుండైన యా రాజకుమారుని కడంజేరి వరంబు వేఁడుమనిన వారలం గనుంగొని, మోక్షపదం బడిగిన వారలతనికిట్లనిరి. *-3*

ఓ రాజా! మోక్షమివ్వడానికి భగవంతుడు నారాయణుడు తప్ప మరెవ్వరికీ సాధ్యం కాదు అని పలికారు. ముచకుందుడు నిద్రను కోరుకున్నాడు. దేవతలు అనుగ్రహించారు. అతడు ఇంతకాలం కొండగుహ లోపల పడుకొని యున్నాడు. కాలయవనుడు భస్మమైన పిదప ముచకుందునికి ముకుందుడు సాక్షాత్కరించాడు.

## శ్రీ మద్భాగవతము - పరిచయము :

భగవంతుని అవతారములు ఆరు. అంశ, అంశాంశ, కల, ఆవేశ, పూర్ణ, పరిపూర్ణతమములు, శ్రీకృష్ణుడు పరిపూర్ణతమావతారుడు.

---

*1. పోతన భాగవతం, 10 : 1125 : పుట-260*

*2. పోతన భాగవతం, 10 : 1145 : పుట-264*

*3. పోతన భాగవతం, 10 : 1642 : పుట-379*

శ్లో॥ *పరిపూర్ణతమః సాక్షాత్ శ్రీకృష్ణోభగవాన్ స్వయమ్ ।*
*అసంఖ్య బ్రహ్మాండపతిర్గోలోకే ధామ్నిరాజతే ॥ -1*

భాగవత గ్రంథం సాక్షాత్తుగా శ్రీకృష్ణుని యొక్క శరీరము.

ప్రథమ స్కంధము : పాదముల నుండి మోకాలు
ద్వితీయ స్కంధము : మోకాలి నుండి కటిప్రదేశము
తృతీయ స్కంధము : నాభి
చతుర్థ స్కంధము : ఉదరము
పంచమ స్కంధము : హృదయం
షష్ఠ స్కంధము : కంఠము, బాహువులు
సప్తమ స్కంధము : ముఖము
అష్టమ స్కంధము : కనులు
నవమ స్కంధము : చెక్కిళ్ళు, కనుబొమ్మలు
దశమ స్కంధము : బ్రహ్మరంధ్రము
ఏకాదశ స్కంధము : మనస్సు
ద్వాదశ స్కంధము : ఆత్మ *-2*

దీనిలో 5,76,000 అక్షరములు కలవు. ప్రతి 32 అక్షరములు ఒక గ్రంథము. గ్రంథము = 32 అక్షరముల ఒక శ్లోకము. *-3*

అలాంటి గ్రంథాలు వ్యాసుని భాగవతంలో 18,000 వున్నాయి. (18,000 × 32=5,76,000)

భాగవత రూపము కౌశిక సంహితలో ఈ విధముగా చెప్పబడినది.

శ్లో॥ *"సద్బీజః ప్రణవాంకురో, రవిమిత స్కంధైర్యుతః కల్పవృట్*
*పంచత్రిత్రిమితాః, ఖఖాభ్రవసుభూః శాఖాప్రశాఖాస్తధా ।*
*శూన్యాకాశ ఖషడ్గిరీఘు సమితాః, పత్రాణి యస్యస్ఫుటమ్*
*స శ్రీ భాగవతాహ్వ ఇష్టఫలదో భక్త్యుర్థితో రాజతే ॥ -4*

---

*1. గర్గమహర్షి, గర్గసంహిత, 1 : 4 : పుట-2*

*2. వేదుల సూర్యనారాయణ శాస్త్రి, శ్రీకృష్ణ లీలా రహస్యామృతము, పుట-10*

*3. బహుజనపల్లి సీతారామాచార్యులు, శబ్ద రత్నాకరము, పుట-55*

*4. వేదుల సూర్యనారాయణ శాస్త్రి, శ్రీకృష్ణ లీలా రహస్యామృతము (అను భాగవత సుధ) పుట-9*

శ్రీకృష్ణావిర్భావము మొదలు రుక్మిణీ కళ్యాణ పర్యంతము కల కథాభాగమును పోతనగారు 1791 గద్య పద్యములలో దశమ స్కంధ పూర్వభాగముగా రచించారు. దీనిని తీర్థుల వారు 12 తరంగములుగా విభజించి యక్షగాన రూపంలో ఆవిష్కరించారు. సామాన్యులమైన మన జీవితాలలోని ఘట్టాలు కేవలం ఆయా దశలు, ఆ దశలలో మనం నడిపిన జీవనవిధాన వైఖరి వాటి సన్నివేశాల రూపంలో మాత్రమే ప్రయాణిస్తాయి. అయితే లీలామానుషవిగ్రహుడు, అవతార స్వరూపుడు అయిన శ్రీకృష్ణుని జీవిత ఘట్టాలన్నీ దివ్యమైనవే కావడం చేత అవి లీలలుగా లోకంలో ప్రసిద్ధికెక్కినాయి.

వ్యాసమహర్షి, పోతనామాత్యుడు, నారాయణతీర్థుల వారు ఆ లీలలను వర్ణించడంలో అతివేలమైన ఆధ్యాత్మికతను, భక్తిరసమాధుర్యాన్ని పండించారు. మన హృదయక్షేత్రాలలో వాటిని నింపారు.

## శ్రీకృష్ణావిర్భావ ఘట్టము :

శ్రీమహావిష్ణువు పరిపూర్ణతమావతారిగా భూలోకము నందు జన్మించడానికి ప్రాతిపదికగా పోతన భాగవతంలోనూ, వ్యాసమూలంలోను ఈ క్రింది వృత్తాంతం చెప్పబడింది. భూలోకంలో అనేక మంది దైత్యులు రాజుల రూపంలో పుట్టి మొత్తం భూభాగాన్ని స్వాయత్తం చేసుకొని నానా దుశ్చర్యలతో పాలిస్తూ ఉండగా ఆ భారాన్ని భరించలేక భూదేవి రోదన చేస్తూ గోరూపాన్ని ధరించి బ్రహ్మను శరణు వేడింది. తనకు కలిగిన కష్టాన్ని ఆయనకు నివేదించింది. ఆయన దేవతలను వెంటబెట్టుకొని ఆమెతో సహా మహావిష్ణువు దర్శనానికి వెళ్ళాడు. ఆ దేవదేవుని పురుషసూక్తంతో స్తుతించి సమాధి నిమగ్నుడయ్యాడు. ధ్యానంలో విష్ణువు తనకు కనబడినట్లు తనతో అనుగ్రహ వాక్యములు యిలా పలికినట్లు ఆయన వారికి తెలియజేస్తాడు.

“ఓ దేవతలారా ! మీరు యాదవులై భూమిపై జన్మించండి. భూభారమును తొలగించడానికి వసుదేవుని కుమారుడు విష్ణువు జన్మిస్తాడు. ఓ సురకాంతలారా! మీరు శ్రీహరికి ఉపచారార్థం పుట్టవలసింది. ఆదిశేషుడు విష్ణు కళతో హరి అగ్రజునిగా జన్మిస్తాడు. యోగమాయ నిజాంశతో కార్యనిర్వహణ కోసం జన్మిస్తుంది.

*కందం॥ యాదవకులమున నమరులు, మేదినిపైఁ బుట్టజనుఁడు మీయంశములన్*
*శ్రీదయితుఁడు వసుదేవున, కాదరమునఁ బుట్టి భారమంతయుఁబాపున్ ॥ -1*

*కందం॥ హరి పూజార్థము పుట్టుఁడు, సురకన్యలు! భూమి యందు సుందరతనులై*
*హరికగ్రజుఁడై శేషుఁడు, హరికళతోఁబుట్టుఁ దత్ప్రియారంభుండై -2*

*ఆ॥వె॥ ఈ ప్రపంచమెల్ల నేమాయచేమోహి, తాత్మమగుచునుండు నట్టిమాయ*
*కమలనాభునాజ్ఞఁగార్యార్థమై నిజాం, శంబుతోడఁ బుట్టు జగతియందు -3*

---

1. *పోతన భాగవతం, 10 : 15 : పుట-4*
2. *పోతన భాగవతం, 10 : 16 : పుట-4*
3. *పోతన భాగవతం, 10 : 17 : పుట-4*

ఈ విధంగా చెప్పి బ్రహ్మ వారందరినీ వీడ్కొలిపి నిజలోకాన్ని చేరుకుంటాడు.

మొత్తం భూమిని ఆక్రమించుకున్న రాక్షసాంశలుగా గల రాజులందరినీ సంహరించి భూమికి రక్షణ కల్పించడము అనే ప్రయోజనాన్ని సాధించడానికి ఒక మహాపురుషుని యొక్క అవతారం అవసరమై యున్నది అని వ్యాసులవారు వర్ణించారు. శ్రీకృష్ణుని అవతారమునకు గల యావత్ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని పోతనగారు శ్రీకృష్ణుని జన్మమునకు ముందే (అనగా కథాప్రారంభమునకు పూర్వమే) వ్యాసానువర్తియై ఈ ఘట్టమును వర్ణించుట సముచితముగా ఉన్నది.

## తీర్థుల ప్రణాళిక :

శ్రీకృష్ణలీలాతరఙ్గిణిలో ఈ విషయము కొంత భిన్నముగా కనబడుతుంది. కంసుడు ఆకాశవాణీ వాక్యాల వలన తనకు తన సోదరి యందు పుట్టబోయే సంతానము ద్వారా కీడు కలుగుతుందన్న భయంతో చెల్లెలిని, ఆమె భర్తను (దేవకీ వసుదేవులు) కారాగృహంలో బంధించిన వృత్తాంతాన్ని ముందుగా చెప్పి ఆ తరువాత బ్రహ్మదేవుని వద్దకు దేవేంద్రుడు, భూదేవి రావడం, కంసాది రాజుల వల్ల జరుగుతున్న క్లేశములు వివరించి తరుణోపాయం కోరడము, తక్కిన దేవతలతో కూడి భూ, దేవేంద్రబ్రహ్మలు, సనకాది మహర్షులు వైకుంఠ ధామము చేరి శ్రీమన్నారాయణుని స్తోత్రం చేయడము, ప్రత్యక్షమైన విష్ణువుతో భూదేవి తన భారం తీర్పమని వేడుకొనుట, అదే విధముగా మిగిలినవారు విన్నవించుకొనుట, భూలోకము నందు అవతరించి మీకు హితం చేస్తాను అని విష్ణువు పలికిన పిమ్మట కృతార్థులైన వారు తమ తమ తావులకు వెళ్ళడము అనే అంశాలు ఘట్టాలుగా విభజించి నారాయణతీర్థుల వారు రచన సాగించారు.

కంస వధను ప్రయోజనంగా పెట్టుకొని తీర్థులవారు ఈ మార్పు చేసినట్లు కనబడుతుంది. తీర్థులవారి యీ విధమైన ప్రణాళిక శ్రీకృష్ణావతారము అల్పప్రయోజనసిద్ధి కొరకు జరిగినదని భావించుటకు అవకాశము కల్పించుచున్నది. కంసుని వలన ముఖ్యముగా బాధ కలిగినది దేవకీ వసుదేవులకు. ఇంకా కొంచెం ఆలోచిస్తే కంసుని తల్లిదండ్రులకు అప్పుడు కేవలం కుటుంబవ్యక్తులే బాధితులు. ఆ బాధను తొలగించడానికి మాత్రమే విష్ణు వంతటివాడు అవతారము ధరింపనక్కరలేదు. కంసుని మిత్రుల ద్వారానో, ఆత్మీయుల ద్వారానో లేదా కంసునికంటే శక్తివంతులైన రాజుల వల్లనో ఆ ప్రయోజనాలు సాధించుకోవచ్చు.

అయితే అభినయ ప్రధానమైన యక్షగాన ప్రణాళిక ప్రకారము కథాభాగం కంటే గానభాగం అనగా స్తోత్రపాఠం ప్రధానంగా భావించి తీర్థులవారు యిక్కడికి యీ ఘట్టాన్ని మార్చినట్లు భావించవచ్చును. మొదట బ్రహ్మదేవుని వర్ణిస్తూ శ్రీమన్నారాయణుని ధ్యానం చేస్తున్న బ్రహ్మ శ్రీహరి గుణగణములను కీర్తించి పాడుచూ దండకమండలుధారియై కొలువు తీరుటకు వస్తూ ఉండెనని తీర్థులవారు చెప్పారు. పాత్ర ప్రవేశ సూచన యక్షగానంలో మొట్టమొదట ఉండటం సంప్రదాయం. వేషభాషలు కూడా వర్ణించడం ద్వారా ఆహార్యాన్ని కూడా కవి నిర్దేశించాడన్నమాట. ఆయనకు విశేషణాలుగా కవి దానవవైరి, అండబ్రహ్మాండ విధాత, అఖిల జనయిత అను మూడు విశేషణాలను వాడాడు.

*కీర్తన : ఆయాతి చతురాననో బ్రహ్మసదసి*
*గాయంగాయం ధ్యాయం ధ్యాయం విష్ణుం చేతసి*
*దండకమండలుధారీ దానవవైరీ*
*అండబ్రహ్మాండవిధాతా అఖిల జనయితా ॥ -1*

దానవవైరి అనడం ద్వారా దేవతలకు హితం చేసేవాడు అనే అర్థం వస్తుంది. 'అండబ్రహ్మాండవిధాత', 'అఖిలజనయిత' అను యీ రెండు విశేషణాలలో ఆయన సృష్టికర్త అయినప్పటికీ తానే చేసిన యీ కంసుని సృష్టి తానే పరిహరించలేక విష్ణువును శరణు కోరవలసి వచ్చిన స్థితిలో ఉన్నాడని గమ్యార్థము.

"విషవృక్షోకపి సంవర్థ్య స్వయం చేత్తుమసాంప్రతమ్" -2

అని కాళిదాసు అన్నట్లుగా విషవృక్షమైనా స్వయంగా పెంచిన దానిని ఖండించుట సబబు కాదు అనునది యిక్కడ అనుసంధించబడుతుంది.

అలాగే దేవేంద్రుని వర్ణిస్తూ 'బృందారకాదివినుతుడు' అని వర్ణించాడు.

*కీర్తన : బృందారకాదివినుతో మందం మందం మహీసుఖం*
*అంతరంగే విచింతయన్ ఇంద్రోమహాన్ విరాజతే ॥ -3*

దేవతా గణములచే స్తోత్రం చేయబడుచున్నవాడు దేవతలకు అధిపతి అనే అర్థంలో అధిపతి అయినవాడు ప్రజాసంక్షేమాన్ని సాధించాలి. అది యిప్పుడు చేయలేని పరిస్థితిలో అతడున్నాడు అనేది వ్యంగ్యార్థం. తన ఏలుబడిలోనిదే భూమి కనుక ఆమె యొక్క సుఖాన్ని (భూభారహరణం) సాధించవలసిన అవసరం అతనికి ఏర్పడినది. దీనినే తీర్థుల వారు 'మహీసుఖం అంతరంగే విచింతయన్ మహాన్ ఇంద్రః విరాజతే" (భూమికి సుఖాన్నిచ్చే అంతరంగంతో ఉన్నాడు) అన్నారు.

మరో క్రియావిశేషణం "మందం మందం" (ఆగతః) అని వాడారు. భూమి ఎట్లా దైత్యభారంతో మందగమన అయినదో యీయన కూడా అలా అయ్యాడని అర్థం చేసుకోవచ్చును.

పోతే భూదేవిని గూర్చి తీర్థుల వారు లావణ్యమూర్తి, లలిత భూసురధారిణీ, సర్వలోకహితకారిణీ, సదాదేవీ సత్యలోక సంచారిణీ అనే విశేషణాలతో చెప్పారు.

*కీర్తన : లావణ్యమూర్తి ర్ధరణీ సమాయాతి లలిత భూసురధారిణీ*
*సర్వలోకహితకారిణీ సదాదేవీ సత్యలోక సంచారిణీ -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ 1 : 11 : పుట-24*
2. *కాళిదాసు, కుమార సంభవం, ద్వితీయ సర్గ, 55 శ్లోకం, పుట-39*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ 1 : 12 : పుట-25*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ 1 : 13 : పుట-25*

భూమిని రంగస్థలం మీద స్త్రీ మూర్తిగా ప్రదర్శించడం అభినయకళ సంప్రదాయం. స్త్రీవలె భూమి కూడా లావణ్యవతి. భూసురధారిణి అనే పదం కూడా స్త్రీకి (గౌరవహేతువు) భూమికి అన్వయించేదే. భూమి సర్వలోక హితకారిణి ఇక్కడ లోక శబ్దానికి జనులు అనే అర్థం చెప్పుకోవాలి.

"లోకస్తు భువనేజనే" - 1

దేవీ అనే విశేషణం పాలకురాలు అనే అర్థానిస్తోంది. సత్యలోకసంచారిణీ అనే దానికి సత్యమార్గమున లోకమును సంచరింపజేసేది అని కూడా అర్థము చెప్పుకోవచ్చు.

తాను పాలకురాలే అయినా లోకమును (జనులు) ఆ విధంగా ప్రవర్తింపచేయలేకున్నాను అన్న బాధ భూదేవిలో తొంగి చూసిందన్నది తీర్థుల వారి భావనగా అర్థం చేసుకోవచ్చును.

ఈ విధంగా తీర్థుల వారు పై ముగ్గురి ప్రాధాన్యాన్ని వర్ణించడం ద్వారా ప్రస్తుత కథలో వారిని ఏకత్రీకరించారు.

*"అథసనకాదీనాం (ఋషీణాం) భగవన్నామ మాహాత్మ్యం*
*ఖ్యాపయతామాగమనం గీయతే" -2*

సనకాది దేవఋషుల యొక్క వచ్చుటను గానం చేయబడుచున్నది అని భావము. పై బ్రహ్మాదుల ఆగమనాన్ని ప్రత్యేకకీర్తనల ద్వారా వర్ణించిన తీర్థులు ఈ సనకాదుల ఆగమనాన్ని వర్ణిస్తూ ఏ కీర్తన రచించలేదు.

దీనిని బట్టి కొంత గ్రంథపాతము జరిగినట్లు తెలుస్తుంది. ఆ వెంటనే కవి సనకాదులు విష్ణువును స్తుతించిన స్తోత్రమంతా ఒక కీర్తనలో చెప్పారు.

***సనకాదుల స్తుతి :***

*కీర్తన : ప॥ రామకృష్ణ గోవిందేతి నామసంప్రయోగే*
*అ॥ప॥ కామమిహస్నాతవ్యం సర్వోత్తమ ప్రయాగే*

*చరణం: దిగ్దేశ కాలానపేక్ష సిద్ధసర్వసులభే*
*సద్గురు కృపాసముద్ర సంగహేతులాభే*

*చరణం: రామనామగంగయా మిళిత కృష్ణనామ*
*యామునే గోవింద నామసరస్వతీ ప్రథితే -3*

---

1. *అమరసింహుడు, అమరకోశం, 3 : 157 : పుట-275*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : పుట-27*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ , 1 : 14 : పుట-28*

*చరణం: యోగి మానసపరమ హంసకులకలితే*
*వాగీశ విష్ణురుద్రాది వాగ్లహరీ లలితే*

*చరణం: సర్వలోకాలోకకామ సాంగఫలదానే*
*నిర్విశేషనిత్యసుఖ లాభసునిదానే*

*చరణం: ఋగ్యజుస్సామాది వేద శాఖిమూలవిలసితే*
*రాగలోభాది సంతాప శాంతికరచరితే*

*చరణం: స్నానసంధ్యా జపహోమ తర్పణానపేక్షితే*
*హానివృద్ధ్యాదిరహితా ఖండసుఖ ఫలదే*

*చరణం: స్నానం మానసికంతస్య స్మరణం వాచనికం*
*కీర్తనం కాయకంతస్య కీర్తనే సునర్తనమ్*

*చరణం: యాగయోగరాగభోగ త్యాగసంబంధం వినా*
*భక్తి విరక్తి విజ్ఞాన ద్వారా ముక్తిఫలదే*

*చరణం: బ్రహ్మ విద్యాలక్షణ నిరీక్షణ విచక్షణే*
*బాధిత ఘోరసంసార వారణ తత్కారణే*

*చరణం: సర్వపాపౌఘ తిమిర చండ సూర్యమండలే*
*సాధు నారాయణతీర్థ తీర్థరాజ విమలే -1*

1. రామ, కృష్ణ, గోవింద నామాలను ఉచ్చరించడం అనే ఉత్తమ ప్రయాగ తీర్థంలో మనం స్నానం చేయాలి.
2. ఆ ప్రయాగ దిక్కులు, దేశము, కాలము అనే వాటిని అతిక్రమించిన సిద్ధులకు సులభంగా లభించేది.
3. సద్గురు కృప అనెడి సముద్రమును చేరేది. ఇక్కడ గురుశిష్య సంబంధం ఆధ్యాత్మ విద్యలో అత్యంత ప్రాముఖ్యం కలది. రామ, కృష్ణ, గోవింద నామములను ఉచ్చరించి స్మరించి, దిక్కులు, దేశ కాలములను పరిగణించక సిద్ధులై భగవద్భక్తిలోనే కాలం గడిపేవారు. అనడం చేత ఒక రకంగా ఈ వర్ణన తన్ను, తన గురువును గురించి తీర్థుల వారు చెప్పినట్లు భావించవచ్చు. రామనామంతో కలసిన కృష్ణనామం గంగా యమునల సంగమం కాగా గోవిందనామం వాటితో కలవడం చేత ఆ మూడు ప్రయాగతీర్థంగా ఏర్పడ్డాయి. దీని వలన ఆ నామముల పవిత్రత ఊహించుకోవచ్చు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,1 : 14 : పుట-28*

4. యోగుల యొక్క మనస్సులే ఈ ప్రయాగ తీర్థంలో విహరించే హంసలు. బ్రహ్మ విష్ణు రుద్రాదుల వాక్కులే యిందలి ప్రవాహములు. ఇక్కడ త్రిమూర్తుల యొక్క వాక్కులు ప్రవాహ రూపంలో ఉన్నాయనడం ద్వారా కవి సృష్టిస్థితి లయ కారణమైన పరబ్రహ్మమును నదీ రూపంలో చెప్పినట్లు భావించాలి. అలా భావించకపోతే రామకృష్ణ గోవింద శబ్దాల ప్రభావాన్ని చెబుతూ బ్రహ్మరుద్రుల ప్రసక్తి తేవలసిన పనిలేదు. కేవలం విష్ణు ప్రసక్తి తెస్తే చాలు. కారణం ఆ మూడు నామాలు ఆయనవే కనుక. ఏమైనా విష్ణు నామాన్ని ప్రశంసిస్తూ విష్ణువు కూడా ఆ నామాలను ఉచ్చరించాడనటం కొంత వింతగా తోస్తుంది.

5. జీవుల యొక్క కామితములను తీర్చేది, కల్తీ లేని ఆనందాన్ని అందించేది ఈ నామత్రయం.

6. ఋగ్యజుస్సామాది వేదములకు మూలపురుషుడు అయిన విష్ణువును గూర్చి చెప్పిన నామాలు ఇవి. రాగద్వేషాలను, అరిషడ్వార్గాలను తొలగించి హృదయానికి ప్రశాంతతను కలుగజేసెడివి ఈ నామత్రయం.

7. స్నానాద్యనుష్ఠానములు అవసరం లేకుండానే హృదయపూర్వకమైన ప్రార్థనతో జపిస్తే యీ నామత్రయం ఫలిస్తుంది. హెచ్చుతగ్గులు లేని నిత్యసుఖాన్ని అందించేది యీ నామత్రయం.

8. ఈ నామములను మనస్సులో స్మరించుకొనుట మానసిక తపస్సు. భజనలతో కీర్తించడము వాచిక తపస్సు. కీర్తనానుగుణంగా నర్తించడం కాయక తపస్సు

*శ్లో॥ దేవద్విజగురు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్ ।*
*బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥ -1*

*శ్లో॥ అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।*
*స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే ॥ -2*

*శ్లో॥ మనః ప్రసాదస్సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః ।*
*భావసంశుద్ధిరిత్యేత త్తపోమానసముచ్యతే ॥ -3*

9. యాగయోగ రాజభోగత్యాగములేవియూ అవసరము లేకుండా కేవలము భక్తి, విరక్తి, జ్ఞానములతో అర్చిస్తే ముక్తినిచ్చేది యీ నామత్రయం.

10. ఈ నామత్రయారాధన బ్రహ్మవిద్యాభ్యాస సదృశమైనది మరియు ఘోర సంసార బాధలను తొలగించే మూలకారణమైనది.

---

*1. వ్యాసమహర్షి, భగవద్గీత, 17 : 14 : పుట-372*

*2. వ్యాసమహర్షి, భగవద్గీత, 17 : 15 : పుట-372, 373*

*3. వ్యాసమహర్షి, భగవద్గీత, 17 : 16 : పుట-374*

తీర్థుల వారు సనకాదుల ప్రార్థనగా చెప్పిన యీ స్తుతి పోతన భాగవతంలో కానీ, వ్యాసమూలంలో కానీ లేదు. ఇది స్వతంత్ర కల్పన. స్తోత్ర రూపంలో నామోచ్చారణ ప్రశస్తి తెలిపేది కావున ఈ స్వతంత్రత ఉచితమైనది. తీర్థుల వారి ప్రణాళికకు యిది అనురూపముగా ఉన్నది.

సనకాదుల స్తోత్రముచే భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు.

*కీర్తన : అశేషలోక కారణం అనాది మధ్యమవ్యయం*
*సశేష శయనోవిభు ర్విశేషతో విరాజతే*
*మహా ఫణీంద్రశయనో మహామునీంద్రసేవితో*
*మహాలక్ష్మీ మహీయుతో మహావిష్ణుర్విరాజతే ॥ -1*

ఈ కీర్తనలో తీర్థుల వారు భక్తి పారవశ్యంలో విష్ణువుకు వేసిన విశేషణములు పునరుక్తములయినాయి.

1. శేషశయనః 2. మహాఫణీంద్రశయనః ఇది ఆలంకారికముగా దోషము. అశేషలోక కారణుడు, అనాదిమధ్యుడు, అవ్యయుడు అయిన విష్ణువు, లక్ష్మీ, భూదేవులతో (మహాలక్ష్మీ మహీయుతో) ప్రత్యక్షమైనాడని తీర్థుల వారు చెప్పారు. ఇక్కడ భూమి బ్రహ్మ, ఇంద్రుడు, దేవగణములతో కలసి తన భారాన్ని తొలగించడానికి విష్ణువును ప్రార్థించడానికి వచ్చినది. మరి విష్ణువు ప్రక్కనున్న భూదేవి ఎవరు? అన్న ప్రశ్న ఉదయిస్తుంది.

అలాగే మహామునీంద్రసేవితః అనే విశేషణం కూడా ఇక్కడే ఉంది. ఈ మునీంద్రులు ప్రార్థించడానికి వచ్చినవారా? లేక విష్ణువుతో పాటు ప్రత్యక్షమైనవారా? అన్న సందేహం కలుగుతుంది.

అయితే విష్ణువు యీ బ్రహ్మాదులకు ప్రత్యక్షమవడానికి పూర్వమున్నూ, ఆ తర్వాత కాలంలో కూడా యీ విశేషణాలకు అర్హుడే కనక సామాన్యవర్ణన దృష్ట్యా తీర్థుల రచనను సమర్థించవచ్చు.

***భూదేవి స్తోత్రం శరణువేడుట :***

"రాక్షసగణము యొక్క భారాన్ని తొలగింపుము" అని భూదేవి విష్ణువును శరణు కోరుతుంది.

*కీర్తన : ప॥ శరణం భవకరుణామయి కురుదీనదయాళో*
*కరుణారస వరుణాలయ కరిరాజకృపాళో*

*అ॥ప॥ అధునాఖలు విధినామయి సుధియాకసురభరితం*
*మధుసూదన, మధుసూదన హరమామకదురితం*

*చరణం: వరనూపురధరసుందర కరశోభితవలయా*
*సురభూసుర భయవారక ధరణీధర కృపయా -2*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 15 : పుట-32*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 16 : పుట-33*

*త్వరయాహర భరమీశ్వర సురవర్యమదీయం*
*మధుసూదన మధుసూదన హరమామకదురితం*

*చరణం: ఘృణిమండల మణికుండల ఫణిమండల శయన*
*అణిమాదిసుగుణ భూషణ మణిమండప సదనా*
*వినతాసుత ఘనవాహన మునిమానసభవన*
*మధుసూదన మధుసూదన హరమామకదురితం*

*చరణం: అరిభీకర హలిసోదర పరిపూర్ణ సుఖాబ్దే*
*నరకాంతక నరపాలక పరిపాలితజలధే*
*హరిసేవక శివనారాయణ తీర్థపరాత్మన్*
*మధుసూదన మధుసూదన హరమామకదురితం* –1

ఓ యీశ్వరా ! త్వరగా నా భారమును హరించుము అనే అర్థంలో (త్వరయాహరభరమీశ్వర) ప్రయోగించిన ఈశ్వర శబ్దం తీర్థుల వారిని హరిహరాభేదమును విశ్వసించే వాడుగా తెలియజేస్తున్నది. ఇక్కడే అద్వైత తత్త్వము మనకు ప్రతిబింబిస్తుంది.

ఈ మొదటి చరణంలో ప్రయోగించిన ధరణీధర విశేషణం ఆలోచించదగినది. భూమిని ధరించినవాడు అని దీనికి అర్థం. ఈ శబ్దం వల్ల మిగిలిన లోకాలను కూడా ధరించుచున్నాడని గ్రహించుకోవాలి. లేదా వరాహావతార ఘట్టాన్ని కవి యిక్కడ గుర్తు చేసినాడని భావించుకోవాలి.

నా భయాన్ని తొలగించు అనడానికి బదులు నా పాపమును తొలగించు (హరమామకదురితం) అని భూమి కోరినట్లుగా తీర్థులు చెప్పారు. ఇక్కడ భూమి చేసిన పాపమేమిటి? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఆమె సాక్షాత్తుగా ఏ పాపము చేయలేదు. కానీ అసురసంతతిని భరించడం అనేది విధి ఆమెకు ఏర్పరచిన దుస్థితి. మానవులు తమకే కష్టమైనా వచ్చినప్పుడు యిది నే చేసిన పాపానికి ఫలితం అని తప్పు తమ మీదనే వేసుకొని ఊరట పొందటం సహజం. ఆ మానవీయ ధర్మమే ధరణి పలుకుల ద్వారా తీర్థుల వారు ప్రదర్శించారు. కావ్యపరంగా యిది స్వభావోక్తి (మానవనైజ చిత్రణ).

'హలిసోదర' అనే విశేషణం కాలవిరోధాన్ని సూచిస్తోంది. కృష్ణ బలరాములు యింకా భూమి మీద అవతరించకుండానే ధరణి విష్ణువును 'బలరాముని సోదరుడా!' అనడం ఉచితంగా కనబడదు.

అయితే భూమి కూడా దైవాంశ కలదే కాబట్టి భావ్యర్థాన్ని యీ విశేషణం ద్వారా సూచించిన దనుకోవచ్చును. కానీ మానవుడైన నారాయణతీర్థులు ఆ విశేషణాన్ని వాడటం ఉచితంగా లేదు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 16 : పుట–33*

అదే విధంగా బ్రహ్మాది దేవతలు శ్రీమన్నారాయణుని స్తుతించుచున్నారు అని చెబుతూ..

*"నాభికమలోదిత పద్మజాయ"* –1

నాభి కమలము నందు బ్రహ్మ కలిగినవాడు అని అర్థం. ఆ వెనువెంటనే కీర్తనలో..

*"నాభికమల జనిత విధిముఖాయ"* –2

నాభి కమలము నందు పుట్టించబడినటు వంటి బ్రహ్మాదులు కలవాడు అని అర్థం చెప్పారు.

నాభి కమలంలో బ్రహ్మ పుట్టినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. కానీ 'ముఖ' శబ్దం వల్ల ఇంకా కొందరు విష్ణు నాభి కమలంలో పుట్టినట్లుగా అర్థం వస్తోంది. ఈ విధమైన విరుద్ధ భావజాలం వెంట వెంటనే ప్రయోగించడం ఆలోచింపదగినది, యుక్తము కాదని భావించవచ్చు.

అదే విధముగా *'నిరుపమగోకులనీత నవనీతాయ"* – 3

కృష్ణుడు ఉద్భవించి ఎదుగుతున్న వయసులో జరిగిన నవనీత భక్షణం తీర్థుల వారి భక్త్యావేశం వలన ఆయన ఆలోచనలను ముంచెత్తిన కారణరీత్యా రచింపబడ్డ కాలవిరోధము.

దేవతలు అంజలి ఘటించి నమస్కరిస్తూ తమకు హితమైన వాక్యములు విన్నవించుకున్నారు.

*శ్లో॥ ఇతిస్తుత్వా జగన్నాథం కృతాంజలి పుటాస్సురాః ।*
*ముహుర్ముహుర్నమంతస్తమూచుశ్చాత్మహితం వచః ॥* –4

ఆ హితము యొక్క స్వరూపమును తీర్థుల వారు వివరించలేదు. నేను యదు వంశము నందు అవతరించి మీకు హితమును చేసెదను అని దేవతలకు భగవంతుడు ఆనతిచ్చాడు.

*శ్లో॥ భగవానపితానాహభక్తినమ్రానసౌసురాన్ ।*
*అవతీర్యయదోర్వం శేకరిష్యామి హితం తువః ॥* –5

ఇది కూడా వివరణమును అపేక్షించుచున్నది.

దేవతలు వాసుదేవుని ముఖము నుండి స్రవించిన వచన సుధాధారలను చెవులనెడి దోసిళ్ళతో త్రాగి విష్ణువు యొక్క ముఖచంద్రుని కాంతుల వలన తొలగిన శోకమోహములనే అంధకారము కలవారై అరచేతి వెలగపండు వలె తమ కార్యం ఫలించినదని సంతోషిస్తూ తమ తమ లోకములను చేరిరి.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 26 : పుట–36*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 17 : పుట–38*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 17 : పుట–38*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 27 : పుట–40*
5. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,1 : 28 : పుట–40*

గద్యము : ఇత్యేవం భగవతో వాసుదేవస్య వదన సుధానిధి గళితాం స్ఫుటతర పదరసమనోహరాం వచన సుధాధారాం సురభూసురబలాధారాం శ్రవణాంజలి పుటైః పాయం పాయం శనైః శనైః స్వస్వభవనాభిముఖాః తచ్చరణస్మరణ చంద్రికా పనోదిత శోకమోహానలాంధకారాః చతురాననాదయ స్సర్వేగీర్వాణాః కరతలకలిత కపిత్థోపమం స్వకార్యం మన్వానాస్సంపూర్ణ మనోరథాః స్వస్వభవనమా వివిశుః - 1

కావ్యఫక్కీలో సాగిన యీ వర్ణనలో విష్ణువు పలికిన పలుకులకు విశేషణంగా తీర్థులు "స్ఫుటతర పదరస మనోహరాం వచన సుధాధారాం" అనే పదములను వాడారు. ఈ విశేషణం కావ్యరచనా సంబంధి. తన రచనలో స్ఫుటతరములైన పదములు, రసపుష్టి ఉన్నట్లుగా మనకు ప్రకటన చేసినట్లు భావించాలి. శబ్దాలంకార దృష్ట్యా అంత్యానుప్రాసను ప్రదర్శించారు. (వచన సుధాధారాం - సురభూసుర బలధారాం) అర్థాలంకారపరంగా రూపకాన్ని అందంగా చూపించారు. (చరణ స్మరణ చంద్రికాపనోదిత శోకమోహానలాంధకారాః) లోకన్యాయపరంగా అరచేతిలోనికి వెలగపండు వచ్చినట్లు (కరకలిత కపిత్థోపమం స్వకార్యం మన్వానాః) అని ప్రదర్శించారు. ఇవన్నీ తీర్థుల వారి కావ్యకళా నైపుణ్యాన్ని తెలుపుతున్నాయి.

పోతనగారి భాగవతంలో కానీ, వ్యాస భాగవతంలో కానీ యీ ధరణ్యాదులు చేసిన స్తుతులు, ప్రార్థనలు కానరావు. వీరిరువురిది పురాణ పద్ధతి. తీర్థుల వారిది భక్తి పద్ధతి. రెండునూ సమంజసములే.

అన్నమాట ప్రకారం వసుదేవుడు తన మొదటి బిడ్డను కంసునికి యివ్వగా ఎనిమిదవ వాడు శత్రువు కనుక వీడు వధార్హుడు గాదు అని అతడిని తిరిగి యిచ్చివేసెను.

*శ్లో॥ దదౌ కంసాయ దేవక్యాశ్శిశుం ప్రధమజంనృపః ।*
*అష్టమం సరిపుం మత్వాదదౌ కంసః పునశ్శిశుమ్ ॥ - 2*

ఈ సందర్భంలో పోతనగారు తన ఆత్మీయ వచనముల ద్వారా వసుదేవుని సత్యసంధతను ఉత్కృష్టముగా వెల్లడి చేసెను.

*కందం॥ పలికిన పలుకులు దిరుగక, సొలయక వంచనము లేక సుతుల రిపునకుం*
*గలఁగక యిచ్చిన ధీరుం, డిల వసుదేవుండు దక్క నితరుఁడు గలఁడే? - 3*

వసుదేవుడు మోసం చెయ్యాలి అన్న తలంపు లేనివాడు. ఆడినమాట తప్పవలసి వస్తుందనే భయంతో శత్రువు చంపడానికి తన బిడ్డను యిస్తున్నాననే బెంగ లేకుండా తాత్సారం కాకుండా కన్నకొడుకును కంసునకు అప్పగించిన ధీరుడు వసుదేవుడు. ఇటువంటివాడు భూమిపైన మరొకడు ఉండడు అని పోతనగారి భావము. ఈ భావమే వ్యాసులవారి మూలంలో యిలా ఉన్నది.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 29 : పుట-40,41*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 30 : పుట-42*
3. *పోతన భాగవతం 10 : 47 : పుట-10*

*శ్లో॥ కిం దుస్సహం నుసాధూనాం విదుషాంకిమ పేక్షితమ్ ।*
*కిమకార్యం కదర్యాణాం దుస్త్యజంకిం ధృతాత్మనామ్ ॥ -1*

సత్యసంధులకు సాధువులకు దుస్సహమైన కార్యము ఏమీ ఉండదు. భగవంతుని తెలుసుకున్న వారికి ఏ విషయము నందు అపేక్ష ఉండదు. నిందితమైన స్వభావము గలవారికి చేయకూడని పని అంటూ ఏదీ ఉండదు. ఆత్మను భగవంతునికి సమర్పించినవాడు అన్నింటిని విడిచిపెట్టును అని భావము.

సర్వస్వమూ కోల్పోయినా సత్యవాక్యాన్ని పాలించాలి అనే నీతిని పోతనగారు చాటి తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకున్నారు. వామన చరిత్రలోని బలిచక్రవర్తి వాక్యాలు కూడా యీ విషయాన్నే బలపరుస్తున్నాయి.

*తేటగీతి॥సమరమున నుండి తిరుగక చచ్చుట కంటె, .................... ?*

*పలికి బొంకక నిజమున బరగుట కంటె, మానధనులకు భద్రంబు మఱియు గలదె । -2*

*ఆ॥వె॥ బ్రతుకవచ్చు గాక బహుబంధములనైన, వచ్చు గాక లేమి వచ్చుగాక*
*జీవధనములైన జెడు గాక పడుగాక, మాట తిరుగలేరు మానధనులు -3*

భర్తృహరి కూడా నీతి శతకంలో యిలా చెప్పాడు.

*నిందంతు నీతినిపుణాః యదివాస్తువన్తు*
*లక్ష్మీః సమావిశతు గచ్ఛతువా యథేష్టమ్*
*అద్యైవవామరణమస్తు యుగాన్త రేవా*
*న్యాయాత్పథః ప్రవిచలంతి పదం నధీరాః ” -4*

కంసుడు వసుదేవునికి కొడుకును తిరిగి యిచ్చివేసి పంపడం అతని దయా స్వభావం కన్నా సోదరిపై ఏ మూలనో ఉన్న అల్పప్రేమ కారణం కావచ్చును. దానిని మించి తనపై తనకున్న నమ్మకం, దర్పోద్ధతి యిక్కడ వ్యక్తం చేశాడు అనడం సమంజసం.

ప్రథమ సంతానాన్ని వధించకుండా కంసుడు వసుదేవుని పంపివేసిన విషయాన్ని నారదుడు తెలుసుకొని కంసుని వద్దకు పోయి వానికి విష్ణుదేషాన్ని పెంచడం కోసం యిలా పలుకుతాడు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 58 : పుట-24*

*2. పోతన భాగవతం, అష్టమ స్కంధం, 8 : 588 : పుట-287*

*3. పోతన భాగవతం, అష్టమ స్కంధం, 8 : 598 : పుట-289*

*4. భర్తృహరి, నీతి శతకం, 75 : పుట-84*

*సీ॥ ఒకనాఁడు నారదుండొయ్యన కంసుని యింటికిఁ జనుదెంచి యేకతమున*
*మందలోపలనున్న నందాదులును, వారి భార్యలుఁబుత్రులు బాంధవులును*
*దేవకి మొదలగు తెఱవలు వసుదేవుఁ డాదిగా గల సర్వయాదవులును*
*సురలు గాని, నిజంబు నరులు గారని చెప్పి 'కంసుండ! నీవు రక్కసుండవనియు*

*ఆ॥వె॥ దేవమయుఁడు చక్రిదేవకీ దేవికిఁ, బుత్రుఁడై జనించి భూతంబు*
*సెఱుపఁ బుట్టినట్టి చెనఁటి దైత్యులనెల్లఁ, జంపు ననుచుఁ జెప్పిచనియె దివికి ॥ -1*

రాజా! వ్రేపల్లెలోని యాదవులందరూ దేవతా సమూహమే కానీ మానవమాత్రులు కారు. భూమిని రక్షించడానికి, రాక్షస సంహారానికి సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువే దేవకీదేవి గర్భాన జన్మిస్తాడు.

జరిగిన వృత్తాంతమును తెలుసుకొని నారదుడు కంసుని వద్దకు వచ్చిన సందర్భాన్ని చెప్పే సమయంలో తీర్థుల వారు 'నిమిత్తజ్ఞః' అనే పదం వాడారు. శిశువుల మరణము యొక్క హేతువును తెలిసినవాడు అని దీనికి అర్థం. ఆ హేతువేమియో తీర్థుల వారు వివరింపలేదు.

*శ్లో॥ తద్వృత్తం నారదోజ్ఞాత్వా త్వరయాకంసమందిరమ్*
*సమాగతో నిమితజ్ఞశ్శిశూనాం నిధనం ప్రతి ॥ -2*

అయితే ఒక్కొక్క శిశువును చంపక ఉంచినచో కంసుని దయా స్వభావము పెరిగి సాధుభావము కలిగినచో లోక కంటకుడు కాకుండా సంచరిస్తూ తాత్కాలికంగా ధర్మపాలకుడే అవుతాడు. కాబట్టి వానిని సంహరింపవలసిన పని విష్ణువునకు ఉండదని దాని ద్వారా అతడు బ్రహ్మాదులకు యిచ్చిన అభయప్రదానం వ్యర్థమగునని కంసాదిలోక కంటకులను సంహరింపవలసిన పని విష్ణువునకు లేకపోగా భూభారం ఎప్పట్లాగే ఉండిపోతుందని నారదుడు తలంచి కంసునకు వానిలోని రాక్షస లక్షణములను వివరించి తద్వారా విష్ణు ద్వేషం కలిగించడం అవసరం అని యిలా చేశాడు అని వివరణ చెప్పుకోవచ్చును.

జీవుడు ఏదో ఒక కర్మ చేస్తూనే ఉంటాడు. ఏ పనీ లేకుండా ఎవడూ ఉండజాలడు.

"నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్" -3

అని గీతాకారుడు చెప్పినట్లు ఆ దృష్టితో చూచినపుడు కంసుడు అప్పుడప్పుడూ కొంత మంచితనాన్ని ప్రదర్శించినా మొత్తం మీద గత జన్మలో చేసిన రాక్షస కృత్యాల వాసనా బంధం వానికి మిగిలే ఉంటుంది. దానితో అతడు మంచికి మంచి ఫలితాలు, చెడుకు చెడు ఫలితాలు అనుభవిస్తూ జన్మ పరంపరని అలా

---

*1. పోతన భాగవతం, 10 : 52 : పుట-11*
*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 31 : పుట-42*
*3. వ్యాసమహర్షి, భగవద్గీత, 3 : 5 : పుట-98*

కొనసాగించుకుంటూ పోతూ ఉండటం వలన ఆ పరంపరకు అంతు లేకుండా పోతూ ఉంటుంది. భగవంతుని ప్రణాళికలో వానికి కర్మబంధాల నుండి మోక్షం కలగాలని జన్మరాహిత్యం ఏర్పడాలని ఉన్నది. ఆప్రకారం వానిలోని క్రూరత్వ లక్షణమే ఎక్కువ కావాలి. ఎందుకంటే అది వైర భక్తిగా మారి విష్ణువునకు మరికొంత సన్నిహితునిగా చేస్తుంది. పోతనగారే ఒకచోట 'కామోత్కంఠత గోపికల్' అని భక్తిలక్షణాలను వివరిస్తూ వైరభక్తిని గూర్చి కూడా చెప్పారు. దానిని బట్టి వైరభక్తియే సామాన్య భక్తుల భక్తి కంటే చప్పున భగవంతునితో అనుబంధాన్ని పెంచుతుంది. కంసుడు సాధులక్షణాలతో వ్యవహరించినచో ఆ ప్రక్కనే కొన్ని హింసా లక్షణాలు కూడా కలవాడై అనేక జన్మలెత్తే పరిస్థితి ఉంది. దానిని తొలగించాలంటే అతని లక్షణములను బట్టి వైరభక్తి పరాకాష్ఠకు చేరాలి. కనుక లోకకంటక లక్షణాలతో సాధువులను హింసించడం వంటి దుర్వృత్తులు పెరగాలి. నారదుడు వాని భవిష్యత్తును భగవంతుని ప్రణాళికకు అనుగుణంగా మరలించడం కోసం హింసా ప్రవృత్తికి ప్రేరణ యిచ్చి దేవకి గర్భాన పుట్టిన శిశువులందరినీ కంసుడు చంపడానికి దోహదపడ్డాడు.

నారదుడు యాదవులందరూ దేవతలని, కాలనేమి అనే రాక్షసుడవు నీవు అని, భూలోకమున అరాచకము సృష్టించు దైత్యసంహరణము కొరకు విష్ణువు దేవకీ పుత్రుడై జన్మిస్తాడని చెప్పినట్లును, ఆ మాటలపై కంసుడు దేవకీ వసుదేవులను, తల్లిదండ్రులను బంధించినట్లు పోతన భాగవతంలో ఉన్నది. దీనినే నారాయణ తీర్థుల వారు నిగూఢముగా చెప్పినట్లు భావించాలి.

ఇక్కడే యింకొక విశేషము కూడా ఉన్నది. ఆకాశవాణి పలుకులను విని కంసుడు దేవకీ వసుదేవులను కారాగృహంలో బంధించినట్లు తీర్థుల వారు చెప్పగా పోతనగారు మాత్రము నారదోపదేశము తరువాత వారిని బంధించినట్లు చెప్పుటకు కారణం మూలానుసారణమే.

*శ్లో॥ ఋషేర్వినిర్గమే కంసో యదూన్ మత్వాసురానితి ।*
*దేవక్యాగర్భ సంభూతం విష్ణుం చ స్వవధం ప్రతి॥ -1*

*శ్లో॥ దేవకీం వసుదేవంచ నిగృహ్యనిగడైర్గృహే*
*జాతం జాతమహన్ పుత్రం తయోరజనశంకయా ॥ -2*

ఎనిమిదవ వాడు కదా నన్ను చంపునను అవివేకముతో వీరిని ఉపేక్షించి నీవు చంపలేదు. అతనికి వీరు సహాయకులై తద్వారా నీకు శత్రువులవుతారు. కనుక వీరిని వధింపుము అని నారదుడు అంటాడు.

---

*1. శ్రీ మద్భాగవతం, 1 : 65 : పుట-26*
*2. శ్రీ మద్భాగవతం, 1 : 66 : పుట-26*

శ్లో॥ అష్టానామష్టమత్వేతు నవిశేషోఽస్తి కశ్చన ।
ఉపేక్షసే కథం మూఢ యత్కర్తవ్యం కురుష్వతత్ ॥ -1

నారాయణ తీర్థుల వారి తర్కశాస్త్ర పరిజ్ఞానానికి యీ శ్లోకం తార్కాణంగా నిలుస్తుంది. ఆకాశవాణి వాక్యాలను బట్టి దేవకి గర్భాన పుట్టే శిశువుల సంఖ్య ఎనిమిది. వారిలో ప్రతి ఒక్కడు ఎనమండుగురిలో ఒకడు అవుతాడు. కాబట్టి మొదటివాడు అష్టముడే. రెండవవాడు అష్టముడే. యిలా ఎనమండుగురు అష్టములే. అష్టమ గర్భము వలన కంసునకు మృత్యువు సంభవిస్తుంది అని ఆకాశవాణి అన్నది కాబట్టి వీనిలో ఏ అష్టముని వల్లనైననూ మృత్యువు సంభవించవచ్చు. కాబట్టి అందరినీ చంపివేయుము అని నారదుని ప్రేరణ. పోతన భాగవతంలో యీ విధమైన తార్కిక కథనము లేదు.

నారదుని ప్రేరణ చేత కంసుడు వెనువెంటనే దేవకీ దేవి ఆరుగురు బిడ్డలను వధించాడు. ఈ సందర్భములో పోతనగారు ఈ విధంగా చెప్పారు.

*ఆ॥వె॥ తల్లిఁదండ్రినైనఁ దమ్ములనన్నల, సఖులనైన బంధుజనులనైన*
*రాజ్యకాంక్షఁ జేసి రాజులు సంపుదు, రవనిఁ దఱచు జీవితార్థులగుచు ॥ -2*

రాజుల యొక్క యదార్థ స్వరూపాన్ని వ్యాసుల వారు మూలంలో యిలా వర్ణించారు.

*శ్లో॥ మాతరం పితరం భ్రాతౄన్ సర్వాంశ్చ సుహృదస్తథా ।*
*ఘ్నన్తిహ్యసుతృప్తో లుబ్ధా రాజానః ప్రాయశోభువి ॥ -3*

విష్ణుదేవుని తేజమైన యోగమాయ ఏడవదిగా ఆమె గర్భంలోనికి ప్రవేశించినది.

*కందం॥ తొడి తొడిఁగంసుఁడు దేవకి, కొడుకుల నార్వుర వధింప గురుశేషాఖ్యం*
*దొడవగు హరిరుచి యాసతి, కడుపున నేడవదియైన గర్భంబయ్యెన్ ॥ -4*

పోతనగారు ఇక్కడ కొంచెం వివరిస్తూ విష్ణువు తను నమ్మిన యాదవులకు కంస భయం లేకుండా (యోగమాయను పిలిచి) దేవకి గర్భాన శేషరూపంలో ఉన్న తన తేజస్సును రోహిణి కడుపున ప్రవేశపెట్టమని, యోగమాయతో చెప్పినట్లు, ఎనిమిదవ గర్భముగా తాను దేవకికి జన్మింతుననియు, నీవు నందుని యింట యశోద కడుపున ప్రవేశించమని చెప్పినట్లు చెప్పారు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 32 : పుట-43*

*2. పోతన భాగవతం, 10 : 55 : పుట-12*

*3. వ్యాస మహర్షి, శ్రీ మద్భాగవతం, 1 : 67 : పుట-26*

*4. పోతన భాగవతం, 10 : 57 : పుట-12*

తీర్థుల వారు మాత్రము యోగమాయ ఏడవ శిశువును నందుని భార్య అయిన రోహిణి గర్భము నందు ఉంచినట్లు చెప్పారు.

*శ్లో॥ ఏవముక్తో నారదేన షట్సుతానవధీత్ఖలః ।*
*సంకర్షణస్తు రోహిణ్యామానీతో యోగమాయయా ॥ - 1*

భగవంతుని ఆజ్ఞ లేకుండానే యోగమాయ రోహిణీ గర్భంలో శేషతేజస్సును ప్రవేశపెట్టినట్లు చెప్పడం అస్పష్టముగా ఉన్నది.

విష్ణువును గర్భమున ధరించుట చేత మిక్కిలి కాంతితో ప్రకాశించుచున్న దేవకిని చూసి కంసుడు భయసంశయాలను పొంది ఆమెను చంపుటెట్లు? ఇది మంచిదా కాదా అని తనలో చర్చించుకోవడాన్ని, పోతన ఆ సందర్భంలో కంసుని స్థితిని యిలా వర్ణించారు.

కంసుడు ఆ దశ యందు 'ఆడది, దీనురాలయిన చెల్లెలిని ఎలా చంపేది? చంపితే నా సంపద, యశస్సు, ఆయుష్షు, ధర్మం చెడిపోతాయి. అట్టివాడు జీవన్మృతుడుగా నిందింపబడతాడు. వానికి నరకం వస్తుంది. దుర్భావముతో బ్రతికే బ్రతుకు బ్రతుకు కాదు' అని క్రౌర్యాన్ని విడిచి ధైర్యగాంభీర్య శౌర్యాలు ప్రదర్శించి మౌనిగా మారిపోయాడు.

*కందం॥ వావి యెఱుంగని క్రూరుని, జీవన్మృతుఁడనుచు నిందసేయుదు, రతఁడుం*
*బోవును నరకమునకు దు, ర్భావముతో బ్రదుకు టొక్క బ్రదుకే తలఁపన్? -2*

దీనినే వ్యాసులవారు యిలా రచించారు.

*శ్లో॥ సఏషజీవన్ ఖలు సంపరేతో, వర్తేత యోఽత్యన్త నృశంసి తేన ।*
*దేహే మృతే తం మనుజాః శపన్తి, గన్తా తమోఽన్ధం తనుమానినో ధ్రువమ్ ॥ -3*

కథా సందర్భంలో లోకోపయోగకరములైన సూక్తులను వెలయింపజేయడంలో వ్యాసుడు, పోతనల యొక్క అభినివేశం ప్రశంసనీయం.

దేవకీ, వసుదేవులు దేవదేవుని స్తుతించిన సందర్భములో తీర్థుల వారి రచనలో అనేక విశేషాలు కనిపిస్తాయి.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 33 : పుట-43*
2. *పోతన భాగవతం, 10 : 81 : పుట-16*
3. *శ్రీ మద్భాగవతం, 2 : 22 : పుట-36*

*శ్లో॥ దేవక్యాశ్శిశు భావమేత్య భగవాన్ నారాయణః శ్రీపతిః*
*సర్వజ్ఞాన మహావిభూతి సహితస్సత్త్వార్థనైః కర్మభిః*
*ఆదిత్యేందు సహస్రకోటి సదృశా భాసాగృహం భాసయన్*
*పిత్రోః స్నేహ సుధా మహోదధి శశాంకోకయం హరిర్గీయతే ॥ -1*

పై శ్లోకంలో "సర్వజ్ఞాన మహావిభూతి సహితః" అన్న విశేషణం విష్ణువును జ్ఞానస్వరూపుడని, అణిమాది విభూతులను కలవాడని అర్థం సూచిస్తున్నది. సర్వజ్ఞాన విశేషణం 'ప్రజ్ఞానం బ్రహ్మ' -2

అన్న ఋగ్వేద సూక్తిని తెలియజేయుచున్నది.

'మహా విభూతి సహితః' అన్న విశేషణం ఐశ్వర్యాది ఆరు లక్షణములు గల భగవత్స్వరూప వర్ణన.

*శ్లో॥ ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః ।*
*జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీంగనా ॥ - 3*

*శ్లో॥ ఉత్పత్తిం చ వినాశం చ భూతానామాగతిం గతిమ్ ।*
*వేత్తి విద్యామవిద్యాంచ సవాచ్యో భగవానితి ॥ - 4*

అట్టి విష్ణువు సహస్రకోటి ఆదిత్యుల కాంతితో (కార) గృహాన్ని ప్రకాశింపజేస్తూ తల్లిదండ్రుల స్నేహమనే సముద్రానికి చంద్రుడిలాగా మారి వారి ముందు ప్రత్యక్షమయినాడు అని చెప్పడంలో తీర్థుల వారి కవితా కళా విన్యాసం కనబడుతుంది.

*కీర్తన : ప॥ మంగళాలయ మామవదేవ*
*అ॥ప॥ పంకజాసన భావిత భావ*

*చరణం: దేవకీ వసుదేవతనూజ దివ్యకిరీట దళిత భవబీజ*
*సర్వయోగి విచింత్య పదాబ్జ సంగతాఖిలసాధుసమాజ*

*చరణం: అపరిమితానంద బోధస్వరూప అతికరుణాకర కరధృతచాప*
*కపటదైత్యహర ఖండిత పాప కనకాంబరధర కలితకలాప*

*చరణం: మకరకుండల కేయూర విభూష మనసిజ శతకోటి మంజులవేష*
*వికచకమల సన్నిభ విపులాక్ష విమల హృదయ గోపాలకరక్ష -5*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 36 : పుట-48*
2. ఐతరేయోపనిషత్, 3 : 2 :పుట-112
3. *వ్యాసమహర్షి, అగ్నిపురాణం 379 : 11 : పుట-436*
4. *వ్యాసమహర్షి, అగ్నిపురాణం, 379 : 13 : పుట-436*
5. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 21 : పుట-49*

*చరణం: కలిత శ్రీకౌస్తుభ కమనీయ కంఠ కరుణా రసభర మిళిత వైకుంఠ*

*పరిపాలయ భువి భాగ్యవితరణ గురుభక్త నారాయణతీర్థ శరణ -1*

**కపట దైత్యహర :**

కపట సన్యాసి, కపట బ్రహ్మచారి లాంటి పదాల వంటిదే ఈ పదం అని తోస్తున్నది. ఆ పక్షాన బ్రహ్మచారి కానివాడు బ్రహ్మచారి వేషములో వస్తే కపట బ్రహ్మచారి అని, సన్యాసి కానివాడు సన్యాసి వేషంలో వస్తే కపట సన్యాసి అంటాము కదా. అదే విధంగా రాక్షసులు కాకపోయినా కపటంతో రాక్షసులలాగా కనబడేవారు కపట రాక్షసులు అవుతున్నారు. అప్పుడు వారు రాక్షసులు కానేకారని పైకి మాత్రము రాక్షసులుగా జీవిస్తున్నారని అర్థం వస్తున్నది. అప్పుడు రాక్షసులు కాని వారిని సంహరించే పని విష్ణువునకు ఉండదు. అప్పుడు కపట దైత్యహర పదం వ్యర్థమగుచున్నది. కనుక కపటము కల దైత్యులు అని చెప్పుకోవాలి.

కపటము కల దైత్యులు అనే అర్థంలో యిది మధ్యమలోప సమాసము. కపటి దైత్యులు అంటే అప్పుడు కర్మధారయ సమాసముగా గ్రహించవచ్చును.

అదే విధముగా 'విమల హృదయ గోపాలక రక్ష' అన్నప్పుడు గోపాలక రక్ష పదము కాలవిరోధమును చెప్పుచున్నది. అయితే గోశబ్దానికి గల యితర అర్థాలను బట్టి దీని సాధుత్వమును సాధించుకోవచ్చు.

శ్లో॥ *స్వర్గేషు పశువాగ్వజ్రదిజ్నేత్ర ఘృణిభూజలే*

*లక్ష్య దృష్ట్యా స్త్రియాంపుంసి గౌః ॥ - 2*

శ్లో॥ *స్వర్గేవజ్రేచ రశ్మౌచ బలివర్గేచ గౌఃపుమాన్*

*స్త్రీ బాణరోహిణీ దృగ్ దిగ్వాగ్ భూమిష్వప్సు భూమ్నిచ -3*

శ్లో॥ *గౌః స్వర్గేవృషభే రశ్మౌవజ్రే చంద్రమసి స్మృతః ।*

*అర్జునీ నేత్రదిగ్బాణ భూవాగ్వారిషు గౌర్మతా ॥ -4*

శ్లో॥ *గౌఃక్రతౌవృషభే చంద్రేవాగ్ భూదిక్ ధేనుషు స్త్రియాం ద్వయోస్తు*

*రశ్మి దృగ్బాణ స్వర్గ వజ్రాంబులోమసు ॥ - 5*

తీర్థుల వారు దేవకి గర్భాన ఉదయించిన భగవానుని బ్రహ్మాదులు స్తుతించిన కీర్తనలో ఏ విధమైన రక్షణనూ కోరి యుండలేదు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 21 : పుట-49*
2. *అమరసింహుడు, అమరకోశం, 3 : 181 : పుట-282*
3. *అమరసింహుడు, అమరకోశం, త్రికాండశేషము, 182 : పుట-282*
4. *విశ్వనిఘంటువు, గాంత ఏకవర్ణ, 1 : పుట-42*
5. *నానార్థ రత్నమాల, ఏకాక్షరకాండము, 28 : పుట-9*

*కీర్తన : జయ జయ శ్రీనివాస జయ జీ మూతాభ జయ జయ*

*అ॥ప॥ భయకారణ వినాశ భక్తమానస నివాస*

*చరణం: కమల దళనయన కనకమయ వసన*
*రమణీయ చంద్రానన రంజిత భువన*
*కమలావల్లభదీన కామిత ఫలనిదాన*
*కామకోటి సమ మోహన*
*మంజుల కంజవదన మహామోహమథన*
*మంగళ ఫలదాన మౌనీంద్ర బృందాధీన*

*చరణం: సుందర చరణార వింద మణినూపుర*
*మంజుల ముక్తాహార మందర ధర*
*కుందరదన సుర వందిత మనోహర*
*చంద్రికా సమస్మేర బాల*
*నీరదఘనలీల పారా వారవిహారపరి*
*పాలిత భూరాది లోకనికర*

*చరణం: విపుల పుండరీకాక్ష విశ్వసంత్రాణదక్ష*
*అపహృతాసురపక్ష ఆర్త సంరక్షక*
*తాపస జనరక్ష తారణా ధ్వరదీక్ష*
*ఆపదుద్ధార కటాక్ష*
*అశేష దుష్టశిక్ష నానానిగమలక్ష*
*నారాయణతీర్థ పక్ష శ్రీగోకుల సంరక్ష -1*

పై స్తుతి కీర్తనలో ఎక్కడా కంసుని బారి నుండి లోకమును రక్షింపుము తద్వారా మమ్ములను రక్షింపుము అని కానీ ఎక్కడా లేదు. అయితే

*"వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః నహి సందేహాదలక్షణమ్ । -2*

సముచిత వ్యాఖ్యతో అసలు తత్త్వాన్ని గ్రహించుకోవాలి. మనకు సందేహము కలిగినది కదా అని దానిని దోషయుక్తముగా భావింపరాదు అని పతంజలి భాష్యము.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,1 : 20 : పుట-45, 46*
2. *పరిభాషేందు శేఖరము, మొదటి పరిభాష, ద్వితీయాహ్నావము, లణ్సూత్ర భాష్యం, మాహేశ్వరసూత్రములు, పుట-1*

పై కీర్తన అను పల్లవిలో 'భయకారణ వినాశ' 'భక్త మానసనివాస' అన్న సంబోధనలను, వాక్యాలను బట్టి 'భక్తులమైన మా మనస్సులలోని భయమునకు కారణమైనటువంటి కంసుని నశింపజేసెడి భావంతో అవతరించినందులకు దేవతలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు' అని సమన్వయం చేసుకుంటే పై కొరత తీరిపోతుంది.

ఈ కీర్తనలో పునరుక్తములు

1. జీమూతాభ – బాలనీరదఘనలీల
2. కమలదళనయన – విపుల పుండరీకాక్ష
3. ఆర్త సంరక్షక – ఆపదుద్ధారక

అదే విధముగా బాలనీరద ఘనలీల అన్నచోట మేఘములలో బాలనీరదము, ప్రౌఢ నీరదములు, వృద్ద నీరదములు అను విభాగమును ఎవరూ చేయలేదు.

అయితే బాల శబ్దమును విడగొట్టి ఓ బాలస్వరూపుడా! ఓ నీరద ఘననీలుడా అని రెండు సంబోధనలుగా ఈ రచనను సమర్థించవచ్చును.

శ్రీ గోకుల సంరక్ష అను వాక్యంలో కాలవిరోధం కనబడుచున్నది. కృష్ణుడు పుట్టి పెరిగి గొల్లలతో కూడి గోవులను కాపాడినవాడు. పుట్టకుండానే ఎలా గోకుల రక్షకుడయ్యాడు? అన్న ప్రశ్న ఉదయిస్తుంది. అయితే గో శబ్దానికి వేదార్థము కూడా ఉంది కాబట్టి గోకులము అంటే వేదసమూహము అవుతుంది. కనుక వాటిని రక్షించినవాడు అని కూడా అర్థం చెప్పుకోవచ్చు.

తరువాత తనను మధురాపురము నుండి గోకులమునకు తీసుకొనిపోయి నందాలయము నందుంచమని అక్కడి యోగమాయను ఇక్కడకు తీసుకురమ్మని అలాగే రోహిణీ గర్భమున రామనామధేయంతో సంకర్షణుడు జన్మించి నాకు సహాయంగా ఉంటాడని నేను అసుర సంహారానికి ఉద్యమం బూని ఈ అవతారాన్ని ధరించానని చెబుతాడు. ఈ కీర్తన సమగ్రమైన కథాగమనంతో రమణీయంగా సాగినది.

ఇక్కడ బలరామునికి శృంగారాది నిలయం అని విశేషణం వేయడం అంత సముచితంగా తోచదు. గోపస్త్రీలతో శృంగారమును నెరపినవాడు నిజానికి శ్రీకృష్ణుడే కానీ బలరాముడు కాడు. అయితే శ్రీకృష్ణునితో పాటుగా వానికి సహాయకునిగా బలరాముడు వ్యవహరించబోతున్నాడని తీర్థుల వారు విష్ణువు నోట 'మత్సహాయం' అని చెప్పించినాడు కనుక కృష్ణునకు గల లక్షణములే బలరామునకు అన్వయించడం సమంజసమే. లేదా శృంగార శబ్దానికి భూషణార్థం చెప్పుకుంటే ఆయనతో పాటు యీయన కూడా సకలాలంకార భూషితుడే అనే అర్థం వస్తుంది లేదా శృంగార శబ్దానికి 'శృంగార శ్శుచిరుజ్వలః' –1

అని నిఘంటువు ప్రకారం శుచి (పవిత్రత) అనే అర్థం చెప్పుకున్నట్లయితే పవిత్రమూర్తి బలరాముడు అని తీర్థుల వారి ఉద్దేశ్యంగా గ్రహించవచ్చును.

---

*1. అమరసింహుడు, అమరకోశం, నాట్యవర్గం పుట–199*

తరువాత వసుదేవుడు పుట్టిన బిడ్డను నందుని యింటికి చేర్చుట. యశోద కన్న యోగ మాయను దేవకి చెంతకు తెచ్చుట జరిగినట్లు పోతన వర్ణించారు. తీర్థుల వారు సర్వాంతర్యామియైన శ్రీహరి లీలామానుష వేషము దాల్చి గోకులమును సుఖముగా నివసించసాగెను అని వర్ణించారు.

*శ్లో॥ ఇతి కథితవ తీశ్వరే తథైవ*
*ప్రణయవశా దకరోద్యదుప్రవీరః*
*సుఖమధి వసతిస్మ గోకులాఖ్యం*
*హరిరఖిలాంతర చిత్ప్రభోకపి మాయీ ॥ -1*

బిడ్డ ఏడుపును కంసుడు పరివారము ద్వారా తెలుసుకొని కారాగృహమునకు వచ్చి ఆ బిడ్డను చంపుటకు సిద్ధపడెను. దేవకి తన బిడ్డను చంపవద్దని కంసుని బ్రతిమాలుకొనుటను పోతనగారు ఆ సందర్భములో చక్కగా వర్ణించారు.

*ఉత్పలమాల :*

*అన్న ! శమింపుమన్న । తగదల్లుఁడు గాఁడిది మేనగోడ లౌ*
*మన్నన సేయుమన్న । వినుమానినిఁ జంపుట రాచపాడిగా*
*దన్న, సుకీర్తివై మనఁగ దన్న! మహాత్ములు వోవు త్రోవఁబో*
*వన్న । భవత్సహోదరిఁగదన్న, నినున్ శరణంబు వేఁడెదన్ -2*

ప్రతిమాట చివర 'అన్నా!' అని సంబోధించడం ద్వారా అతని హృదయం కరుగుతుందని పేరాశ.

ఈ సందర్భంలో తీర్థుల వారు కంసుని స్థితిని తెలుపుతూ ఒక చక్కటి గద్యం రచించారు.

గద్యం : సఖలు నరపతే రుగ్రసేన స్యాగ్రిమ సూనుః సమధిగతాసుర ప్రకృతికః కంసాసుర నామా అవినయ దుర్విభావ్య గర్వమదాంధకార పరిభూత వివేకదర్శనః పరిహృతకాలనేమి కళేబరోకప్యపరిహృత తద్వాసనా జాలపరివేష్టితః నిజ పరిజనైస్సత్వరమవబోధితస్సన్ అతిమందగతిరప్యమందగతిః దేవక్యాస్త్వష్టమోగర్భః కంసమృత్యురిత్యశరీరవాక్యం శ్రుతమనుసంధధానో వేపనో వసుదేవ మందిర మిందిరా సుందర మాజగామ ॥ -3

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 41 : పుట-58*

*2. పోతన భాగవతం, 10 : 150 : పుట-32*

*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 42 : పుట-59*

*ఈ గద్యంలో తీర్థుల వారు ...*

1. గర్వమదాంధకార పరిభూత వివేకదర్శనః
2. పరిహృత కాలనేమి కళేబరోకపి అపరిహృత తద్వాసనా జాలపరివేష్టితః
3. అతిమందగతిరపి అమందగతిః అనే విశేషణాలు వాడారు.

ఈ మూడు చేయి తిరిగిన కవి చేయగల వర్ణనానికి ఉదాహరణలు. ముఖ్యంగా రెండో విశేషణంలో కంసుడు తన పూర్వజన్మ మందలి కాలనేమి స్వరూపాన్ని కోల్పోయినా దాని వాసనలు మిగిలి క్రూరుడుగానే యీ జన్మలో సంచరిస్తున్నాడని తీర్థుల వారనడం చక్కని విశ్లేషణ.

మూడో విశేషణంలో మదగర్వంతో మందగమనం కల కంసుడే దేవకి బిడ్డను చంపడానికి అమంద (వేగ) గమనుడైనాడని చెప్పడం ఆలంకారికంగా సాగినది. ఈ అవస్థాభేద చిత్రణం అతి సుందరం. గమనపదం గానే కాకుండా బుద్ధిపరంగా కూడా ఈ రెండు శబ్దాలను విశ్లేషించుకోవచ్చు. ఎలాగంటే కంసుడు విష్ణుద్వేషం కలవాడవడం చేత బుద్ధి మందగించినవాడు. ఇప్పుడు చురుకుగా బుద్ధి పనిచేసి శిశుహంత కాబోతున్నాడు.

"సమధిగతాఖిత సాంగవేదే" -1

ఆమె షడంగములతో వేదములను అభ్యసించినది అనడం అంత సమంజసముగా లేదు. వేదశాస్త్రములకు పుట్టుక స్థానమైన ఆమె వాటిని (వేద స్వరూపిణి, భగవతి) మరల చదువుకున్నారని చెప్పడం ఆమెను తక్కువ చేసినట్లే.

*విద్యాస్సమస్తాః తవదేవి భేధాఃస్త్రియః సమస్తాః*

*సకలాజగత్సుత్వయైకయా పూరిత మంబయైతత్ కాతేస్తుతిః స్తవ్యపరాపరోక్తిః -2*

సంధ్యా వందనములో చివర ఉపస్థాన మంత్రముల తరువాత

"స్తుతోమయా వరదా వేదమాతా ప్రచోదయన్తీ పవనేద్విజాతా" -3

అని స్తుతిస్తాము. దీనిని బట్టి ఆమె వేద మాతృత్వము తెలుస్తుంది. ఆమె దేవతల చేత స్తుతింపబడుతున్నదై వైష్ణవి అను పేరుతో ముల్లోకముల యందు ఆరాధింపబడుతున్నది.

పోతన గారి గ్రంథంలో ఆ మాయాశక్తి మాయమైన తరువాత కంసుడు తనను తాను నిందించుకొని దేవకీ వసుదేవులను పిలిచి తనను క్షమించమని ప్రార్థించినట్లుగా ఉన్నది.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,* 1 : 24 : పుట-61, 62
2. *చండీసప్తశతి, 11 : 6 : పుట-110*
3. *కృష్ణ యజుర్వేదం, ఆరణ్యకం, నారాయణభాగం, 54 : 36 : పుట-197*

*ఉత్పలమాల :*

*"పాపుఁడ, బాలఘాతకుఁడ బంధు విరక్తుఁడ, దుష్టచిత్తుఁడన్*
*గోపనుఁడం జరన్మృతుడఁ, గ్రూరుఁడ, బ్రాహ్మణ హంతభంగి మీ*
*పాపలఁజంపితిన్ బయలిపల్కుల నమ్మితి సాధులార! నా*
*పాపములుగ్గడింపక కృపాపరులై కనరే శమింపరే !* –1

ఈ సందర్భములో పోతనగారు కంసుడు వేదాంతోపన్యాసము చెప్పినట్లుగా వ్రాశారు.

తమ తమ కర్మలే జీవులను వెనుక నుండి నడిపిస్తూ ఉంటాయి. కర్మను అనుసరించే జీవులకు దేహాలు ప్రాప్తిస్తాయి. ఎక్కడ నుండియో వస్తారు. ఒక చోట కలుసుకొని ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారు. ఈ రాకపోకలలో చిక్కులు పడుతూ ఒక చోట ఉన్నప్పుడు కలిగిన స్నేహాలను అక్కడ వదలి వెళ్ళిపోతారు. చంపేవాడు, చచ్చేవాడు ఎవడు? మీ బిడ్డలను నేను చంపలేదు. వారు నా చేత చంపబడిన వారు కారు.

*ఉత్పలమాల :*

*ఒక్కెడఁ బ్రాణులందఱునిజోచిత కర్మములోలిఁద్రిప్పఁగా*
*నొక్కొక మేనితోఁ బొడమి యొక్కొక త్రోవను రాకపోకలం*
*జిక్కులఁ బొందుచుండుదురు, చెల్మిని సంసృతితోడఁబాయరే*
*నెక్కడి హంత? మీ శిశువులెక్కడి హన్యులు! దూఱనేటికిన్ !* –2

కావున శత్రువులను తాను బాధపెట్టానని, శత్రువుల చేత తాను బాధపడ్డానని అమాయకుడైనవాడు అనుకుంటాడు. సత్యం తెలిసి ఆలోచిస్తే ఆత్మకు స్నేహం విరోధం అంటూ ఏవీ లేవు. శత్రుత్వం, స్నేహం అనే వాటి మధ్యనున్న సంబంధం కేవలం తాను చేసుకున్న కర్మల బంధమే సుమా అని వారికి విన్నవించి కంటనీరు పెట్టుకుని దేవకీ వసుదేవుల పాదాలు పట్టి వేడుకొని వారి సంకెళ్ళు ఊడదీయించాడు. వసుదేవుడు కూడా వానిని అనునయిస్తూ కొంత వేదాంతచర్చ చేస్తాడు. దేవకీ వసుదేవుల అనుమతి తీసుకొని కంసుడు తన యింటికి వెళ్ళిపోయాడు.

ఈ కథాభాగం తీర్థులవారు చెప్పలేదు. వేదాంతమునకు ప్రాధాన్యతనిచ్చు తీర్థులు దీనిని విస్మరించుట ఆలోచింపతగినది.

అయితే ఉత్తర కథలో కంసుని యొక్క పశ్చాత్తాపమంతయూ కపటమే అని అతడు మంత్రులతో సమాలోచనం చేసి తన రాజ్యంలోని బ్రాహ్మణాది సాధుజనులను హింసించడం వంటి చర్యల ద్వారా ప్రకటితమవుతుంది కాబట్టి అతని పశ్చాత్తాప వర్ణన వ్యర్థమని వదిలివేసినట్లు భావించాలి.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 158 : పుట–34*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 159 : పుట–35*

చివరగా తీర్థులవారు కంసుడు దురంతచింతాగ్రస్తుడై చేసేది లేక స్వీయసదనానికి వెళ్ళినట్లుగా చెప్పారు. ఆ చెప్పడంలో చక్కని ఆలంకారిక శైలి ప్రదర్శించారు.

*శ్లో॥ దురంతచింతాగ్రాహేణగ్రస్తో యంకంసకుంజరః ।*
*అలబ్ధ శరణోకస్వష్ఠ స్సదనం స్వీయమాగతః ” -1*

కంసుని 'కంసకుంజరుడు' అన్నారు. (కంసుడనెడి ఏనుగు) అతడు దురంతచింత అనెడి మొసలి చేత పీడింపబడ్డాడు అని చెప్పారు. ఇది గజేంద్రమోక్షం కథను దృష్టిలో ఉంచుకొని చేసిన వర్ణనగా కనిపించుచున్నది. ఆలంకారికంగా చక్కని రూపకాలంకారము భాసించినది.

పోతన భాగవతంలో కంసుడు దేవకీ వసుదేవుల నుండి అనుజ్ఞ పొంది స్వీయ గృహమును చేరి రాత్రి గడిపి మరునాడు ఉదయం మంత్రులకు మహామాయ వృత్తాంతం వినిపించగా వారు కంసుని మనస్సును హింసా ప్రవృత్తి వైపునకు మళ్ళించారు అని ఉన్నది. ఇక్కడ రాజనీతికి సంబంధించిన రెండు పద్యాలు ఉత్కృష్టమైనవి.

*కందం॥ నొచ్చిరి శాత్రవులనుచును, విచ్చలవిడిఁదిరుగవలదు వివిధాకృతులన్*
*మ్రుచ్చిలివత్తురువారలు, సచ్చినయందాఁక మఱవఁ జనదధిపునకున్ ॥ -2*

ఇది పోతన స్వతంత్రంగా చెప్పిన సూక్తిగా భావించాలి. దీని మూలం వ్యాస భాగవతంలో కనబడదు. మూలాతిశాయిగా యిట్టి కల్పనలను పోతన చేయడం చేతనే ఉత్తమ కవికోటికి ఎక్కినాడు.

*కందం॥ ఒత్తికొనుచు రానీఁజన, దెత్తిన రోగముల రిపుల నింద్రియములను*
*తృప్తిసమయములఁ జెఱుపక, మెత్తనగారాదు రాదు మీఁద జయింపన్ -3*

దీని మూలం వ్యాస భాగవతంలో యిలా ఉన్నది.

*యధామయోఽఙ్గే సముపేక్షితో నృభిర్నశక్యతే రూఢపదశ్చికిత్సితుమ్ ।*
*యధేన్ద్రియగ్రామ ఉపేక్షితస్తథా రిపుర్మహాన్ బద్ధబలోనచాల్యతే ॥ -4*

కంసానుచరులు సాధువులను బాధింపసాగిరి. ఆ సమయంలో శుకమహర్షి పలుకుల రూపంలో వ్యాస మహర్షి లోకమునకు హితవును ఉపదేశం చేసినాడు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 47 : పుట-64*
2. *పోతన భాగవతం, 10 : 166 : పుట-36*
3. *పోతన భాగవతం, 10 : 167 : పుట-36*
4. *వ్యాసమహర్షి, శ్రీ మద్భాగవతం, 4 : 38 : పుట-84*

*శ్లో॥ ఆయుః శ్రియం యశోధర్మంలోకానాశిష ఏవచ*
*హన్తిశ్రేయాంసి సర్వాణిపుంసోమహదతిక్రమః – 1*

సాధువులను బాధించినచో అది బాధించువాని ఆయువును, సంపదను, యశస్సును, ధర్మమును, స్వర్గాదిలోకములను, శుభములను, సర్వవిధ శ్రేయస్సులను వినాశం చేయును. దీనినే పోతనగారు ఇలా రచించారు.

*ఆ॥వె॥ వెదకి వెదకి దైత్యవీరులు సాధుల, నణcప వారి బలములడcగి పోయె,*
*యశము సిరియు ధర్మమాయువు భద్రంబు, నార్యహింససేయ నణcగుc గాదె । –2*

## శ్రీకృష్ణుని శైశవము :

గోకులంలో నందుని యింట బాలుడు జన్మింపగా నందుడు వేదవిదులను పిలిపించి పుణ్యాహవాచనము, జాతకర్మలను చేయించాడు. బ్రాహ్మణులకు గోదానములు చేసి ఉత్సవములు జరిపించాడు. ఆ బాలుడు దీర్ఘాయుష్మంతుడు అవుతాడని వారు దీవించారు. మంగళ వాయిద్యముల కోలాహలము మిన్నంటినది. యాదవులందరి యిండ్లలో ఉత్సవాలు జరుపుకున్నారు. గోబృందమంతా నూతన తేజంతో విరాజిల్లినది. వృషభాలు రంకెలు వేశాయి. ఆవుల పొదుగులలో పాలు నిండాయి. ఆయా విద్యలయందారి తేరిన వారికి నందుడు పుష్కలంగా ధనాదులను ఇచ్చాడు. యాదవులంతా వచ్చి సంతోషంతో కానుకలు చదివించారు. అందరూ వసంతాలు చల్లుకున్నారు. యశోదమ్మ కన్న చిన్ని పాపడిని చూడడానికి గోపికలు ఉత్సాహంగా బయలుదేరారు.

*ఆ॥వె॥ ఏమి నోము ఫలమొ యింత ప్రొద్దొక వార్త, వింటిమబలలార ! వీనులలర*
*మన యశోద చిన్నిమగవానిc గనెనcట, చూచివత్త మమ్మ సుదతులార ! –3*

పోతన పద్యములలోని పదములు, సమాసములు భావానుగుణముగాను, రసానుగుణముగాను కూర్పబడి యుండుట చేత పద్యగమనమునకు అపూర్వమైన రమణీయతను కూర్చుతున్నవి.

గోప యువతులను శృంగార భరితంగా పోతనగారు ఈ సందర్భంలో వర్ణించారు.

*కందం॥ జడగతులును బలుపిఱుcదులుc, బిడికెడు నడుములును వలుcదబిగి చనుcగవలున్*
*వెడcద నయనములు సిరిదడc, బడుమోములు భ్రమర చికుర భరములు నమరన్ ॥ –4*

---

*1. వ్యాసమహర్షి, శ్రీ మద్భాగవతం, 4 : 46 : పుట–87*

*2. పోతన భాగవతం, 10 : 172 : పుట–38*

*3. పోతన భాగవతం, 10 : 40 : పుట–184*

*4. పోతన భాగవతం, 10 : 186 : పుట–40*

ఉత్పలమాల :

*వేడుకతోడఁ గ్రొమ్ముడులు వీడఁగుచో పరిహార రేఖల*
*ల్లాడఁ గపోల పాలికల హాటక పత్రరుచుల్ వినోదనం*
*బాడఁ బటాంచలంబులసియాడఁగఁ జేరి యశోద యింటికిం*
*జేడియ లేఁగి చూచి రొగి జిష్ణుని విష్ణునిఁ జిన్ని కృష్ణునిన్ ॥ -1*

విశాలమైన పిరుదులు, పొంకమైన వక్షోజాలు సింహ మధ్యమలైన గోపికల నడకలను నెమ్మది చేస్తున్నాయి. అయినా పరుగెత్తుతున్న వేగంతో వారు నందుని యింటికి చేరుకొనే సరికి వారి జడ ముడులు విడిపోయి వక్షఃస్థలంపై నున్న హారాలు అల్లల్లాడిపోయాయి. అటువంటి గోపికలు నందుని యింటికి చేరి ఎంతో ఉత్సాహంతో చిన్నికృష్ణుని చూచారు.

శృంగార వర్ణన విషయంలో తనకు తాను పరిమితులు విధించుకున్న తీర్థుల వారు కూడా ఈ సందర్భములో తన నియమాన్ని సడలించి వల్లవ యువతుల సౌందర్యాన్ని వర్ణించారు.

కీర్తన : *వల్లవయువతి కదంబం ఆయాతి వరమరుణాధరబింబం*
*శృంగార విలసిత పృథులనితంబం విఖ్యాత వివిధ విలా*
*సవడంబం కరధృత దధిదుగ్ధ కమనీయ ఫలజాత*
*నిరుపమ సంతోష నీలకుంతల మిహ - 2*

వారంతా అరుణాధర బింబంతో, అందమైన విశాలమైన జఘనాలతో, విలాస వేషాలతో వచ్చారు.

ఒక ఊరి ప్రజలు ఆ ఊరి నేలే రాజుగారింట్లో పుత్ర జననాది విశేషాలు జరిగినపుడు సామాన్య వేషాలతో కాకుండా ఉన్నంతలో వైభవంగా వేషభూషణాదులతో ఆ ఉత్సవంలో పాల్గొనడం సహజమే కనుక తీర్థుల వారి యీ వర్ణన ఎబ్బెట్టుతనమేమీ కాదు.

రాజ దర్శనానికి రిక్తహస్తాలతో వెళ్ళడం సంప్రదాయం కాదు కాబట్టి వారంతా పాలు, పెరుగు, పళ్ళు కానుకలుగా తీసుకొని వెళ్ళినట్లుగా తీర్థుల వారు చెప్పడం ఆయన లోకజ్ఞతకు నిదర్శనం.

గోపికలందరూ కలసి ఆ బాలుని తలకు నూనె అంటి, శరీరానికి పసుపు పూసి శుభ్రంగా స్నానం చేయించారు. శరీరాదుల శుద్ధి ఎన్ని విధాలుగా ఉంటుందో వ్యాసమూలంలో యీ విధంగా ఉంది.

శ్లో॥ *కాలేన స్నాన శౌచాభ్యాం సంస్కారై స్తపసే జ్యయా ।*
*శుధ్యన్తి దానై స్సంతుష్ట్యా ద్రవ్యాణ్యాత్మాత్మ విద్యయా ॥ -3*

---

1. *పోతన భాగవతం, 10 : 187 : పుట-40*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 2 : పుట-67*
3. *వ్యాసమహర్షి, శ్రీ మద్భాగవతం, 5 : 4 : పుట-91*

ఇక్కడ కాలముచేత భూమ్యాదులను, స్నానము చేత దేహాదులను, శౌచము చేత మలినపదార్థములను, సంస్కారము చేత గర్భాదులను, తపస్సు చేత ఇంద్రియాదులను, యజ్ఞాదుల చేత బ్రాహ్మణాదులను, దానముల చేత ద్రవ్యాదులను, సంతుష్టిచే మనస్సును, ఆత్మవిద్యచే ఆత్మను ప్రాణులు శుద్ధి చేసుకోవాలి అని భావము. దీనిని పోతనగారు చెప్పలేదు.

'ఇదే నీకు శ్రీరామరక్ష' అని కొన్ని నీళ్ళు చుట్టూ త్రిప్పి చల్లారు. తొట్టెలో పడుకోబెట్టి దీవించారు. పాట పాడారు. ఈ జోలపాట మూలంలో లేదు.

*కందం॥ జోజో కమలదళేక్షణ !, జోజో మృగరాజ మధ్య ! జోజో కృష్ణా !*
*జోజో పల్లవ కరపద !, జోజో పూర్ణేందు వదన ! జోజో యనుచున్ ॥ –1*

స్త్రీత్వసులభమైన హావభావవిలాసములు, ముగ్ధగోపికల సహజ వాత్సల్యము యీ పద్యంలో ఉట్టిపడుతున్నాయి. స్త్రీల జోలపాటలలో చేర్చదగిన యీ పద్యము సుమధుర సుకుమార పదములతో చిన్న పాపలను గూడా జోకొట్టి నిద్రింపచేయునది. ఈ పద్యములోని ప్రతి అక్షరము మాతృప్రేమను వ్యక్తం చేస్తున్నాయి.

ఇక్కడ 'జోజో కృష్ణా!' అనే సంబోధన పోతనగారి భక్త్యావేశం చేత గోపికల పాటగా వచ్చినది. ఆ విధంగా కృష్ణ నామాన్ని వాడుకున్నారు. అప్పటికింకా గర్గాచార్యుడు బాలునికి పేరు పెట్టలేదు.

ఆ అందగాడు గోపికలు జో కొట్టుతూ ఉంటే నిద్రపోయినట్లు కన్నులు తెరవకుండా, కదలకుండా పడుకున్నాడు.

తీర్థుల వారి గ్రంథంలో గోకులవాసులందరిలో ముందుగా గోపికలు ఆ బాలుని చూడడానికి వచ్చారు. తెల్లవారగానే ఆ శుభవార్తను విన్న ఆ ఊరివారంతా నందుని గృహానికి వచ్చినట్లు ఉన్నది.

*శ్లో॥ ప్రభాతే గోకులేనందగేహే గోకులవాసినః ।*
*ఆవిర్భావం హరేః శృత్వావివిశుర్నంద మందిరమ్ ॥ –2*

తెలుగు వారింట వేడుకలు, వినోదాలు, పురుషుల కంటే స్త్రీలకే ముఖ్యమైనవి కాబట్టి ముందుగా స్త్రీల రాకను విశేషంగా చెప్పి పురుషుల రాకను సామాన్యంగా చెప్పడం సముచితమే. అయితే తీర్థుల వారు "ఆవిర్భావం హరేఃశృత్వా" (హరి యొక్క పుట్టుకను గూర్చి విని) అని చెప్పడం అంత సమంజసంగా లేదు. ఎందుకంటే ఆ పుట్టినవాడు హరి అని కవికి తెలుసు కానీ గొల్లలకు తెలియదు కదా! ఈ సందర్భములోనే తీర్థుల వారు నందనందనుడై విష్ణువు అవతరించగానే ప్రకృతి అంతా అతిసుందరంగా ఆహ్లాదకరంగా

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 190 : పుట–41*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 7 : పుట–66*

మారిపోయినట్లుగా చెప్పడం నిజమైన కవితా లక్షణం. ఇందులో వారు గోకులంలోని చందనమందారాది వృక్షాలన్నీ కుసుమ ఫల సంపదతో నిండినవనీ, దివ్య సుగంధాలు దిఙ్మండలంలో వెదజల్లినవనీ, పూదేనెలను గ్రోలి మత్తెక్కి ఝుంకారాలు చేస్తున్న తుమ్మెదలతో విరాజిల్లుచున్నవనీ, మాధవీ, జాజీ, మల్లికాదిలతలు భక్తితో వంగి భగవంతుడైన వాసుదేవునకు సాష్టాంగపడినట్లున్నవనీ, మంద పవనములచే రాలిన పుష్పములనే పూజా కుసుమములుగా సమర్పించినవనీ పరమప్రేమ రూపమైన భక్తిని ఈ విధముగా ఆ దేవుని యెడ ప్రదర్శించినవనీ, తమ ప్రార్థనలను విని క్షీరపయోధి నుండి వెలువడి భూమిపై అవతరించిన శ్రీనివాసునకు ఆ భూమాత గోరూపధారిణియై పెక్కు గోరూపాలను ధరించి ఆ క్షీరసాగరాన్నే తమ పయోధరాలుగా ధరించి అర్చించడానికి వచ్చినదా అన్నట్లుగాఉన్నదని తీర్థుల వారు వర్ణించడం కావ్యకళా పరాకాష్ఠ. చివరగా పక్షులు, మృగములు, నరనారీజనం తమ తమ సంపదలతో సుసంపన్నాలయినట్లుగా చెప్పారు.

గద్యం : అవతీర్ణే భగవతి గోకులభూమి భాగే తత్రత్య చందన మందార నాగ పున్నాగ చంపకాశోక పనస రసాల ప్రముఖాః కుసుమ ఫలసంపదో దివ్యసౌగంధ గంధిత దిఙ్మండలాః విగళితమాధ్వీఝరీ సంచరన్మత్తమధు వ్రత ఝుంకారాలంకార రమణీయ కుసుమ ఫలాభారా నతశాఖాభిః అవనీగతాభిః అత్యంత భక్తినమ్రాఇవ భగవతో వాసుదేవస్య సాష్టాంగలక్షణం ప్రణామం కుర్వాణాః తత్రత్యమాధవీ జాతే మల్లికాదిలతాః సంతత మంద పవన స్పందన విగళిత కుసుమభారైః అవతీర్ణస్య శ్రీభగవతో నారాయణస్య పరమప్రేమ లక్షణాం భక్తిమాతన్వంత్యః పుష్పాంజలిం సమర్పయంత్య ఇవ స్వకీయప్రార్థనయా సురభూసురకార్యార్థం క్షీరమహోధధిః గోకులమవతీర్ణస్య శ్రీనివాసస్య సంతోషాయాంతరానీతక్షీరసాగర పయోధరా ధరేయం అసంఖ్యాత గోరూపధరేతి సాధుభిరుత్ప్రేక్షితా గావః ఖగమృగనారీనరా దయః సర్వేచజనాః సంప్రాప్త స్వస్వసంపదోబభూవుః ॥ *-1*

గోపికలు ఆ శిశువునకు మంగళాశాసనము చేయదలచిన వారై యీ విధముగా పాడుతున్నారు.

*కీర్తన : ప॥ కలయ కల్యాణాని నారాయణ*

*అ॥ప॥ బలభద్రావరజాయ నారాయణ*

*చరణం: సరసిజ నయనాయ సకలలోక హితాయ*
*నరలోక సంభవాయ నారాయణ*
*శరదిందు వదనాయ శతమన్మథసమాయ*
*నిరవధిక గుణాయ నారాయణ -2*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,2 : 8 : పుట-68, 69*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,2 : 4 : పుట-73, 74*

*చరణం: నందగోపసుతాయ నగరాజధీరాయ*

*సుందర చరణాయ నారాయణ*

*ఇందిరా మందిరాయ ఈప్సిత ఫలదాయ*

*చందనాది గంధితాయ నారాయణ*

*చరణం: గురుతరకరుణాయ గోకులభూషణాయ*

*పరిజన పాలనాయ నారాయణ*

*నిరుపమ సుందరాయ నీలమేఘ నిభాయ*

*పరమ పురుషలక్షణాయ నారాయణ*

*చరణం: నవపల్లవకరాయ నవమణిభూషితాయ*

*కవిజన నాయకాయ నారాయణ*

*అవనీ వల్లభాయ ఆశ్రితవత్సలాయ*

*శివనారాయణతీర్థ సంసేవితాయ -1*

నారాయణునకు మంగళము అంటూ గోపికలు నారాయణ స్మరణ చేస్తారు. ముఖ్యంగా ఉత్సవ సమయములలో తెలుగు దేశంలో స్త్రీలు కార్యక్రమం చివర మంగళహారతులు పాడటం సంప్రదాయం. ఆ హారతులు అక్కడ ఉన్న శిశువునకో, దంపతులకో యితర వ్యక్తులకో కాకుండా ఒకానొక దేవతకు అంటే పురుషుడైతే శివుడు, విష్ణువు మొదలైన వారికి, స్త్రీలైతే లక్ష్మీ, పార్వతులు మొదలైన వారికి నీరాజనాలర్పిస్తూ పాడేవిగా ఉంటాయి. తీర్థుల వారీ సంప్రదాయాన్ని అక్షరశః ప్రతిబింబింపజేశారు.

ఈ విధంగా భగవంతునికే మంగళాచరణం చేయడం ద్వారా ఆ ఉత్సవంలో పాల్గొన్న ముఖ్యవ్యక్తులకు, అముఖ్య వ్యక్తులకు కూడా సమస్త శుభాలు కలగాలనీ, శుభకామన తెలుగువారి సొంతం. తీర్థుల వారు యిటువంటి సందర్భాలను తన ప్రణాళికకు అనుగుణంగా మార్చుకొని సంప్రదాయబద్ధతను నిరూపించుకున్నారు.

చివరలో తీర్థుల వారు యిలా అంటారు. ఈ ప్రకారంగా గోకులస్త్రీలు ఆ పుట్టిన బిడ్డ అశేష జగత్తులకు ఆదికర్త అయిన నారాయణుడని తెలుసుకొనలేక మాయామోహితులై మానుష శిశువేనని తలచి వానికి ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి కలగాలని, ఆ బాలుని కంటే నారాయణుడు వేరనే భావంతో ప్రార్థనలు చేశారని అనడం సమయోచితంగా ఉన్నది. పై వ్యాఖ్యకు యీ తీర్థుల వారి వాక్యములు సమర్థనీయముగా ఉన్నవి.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,2 : 4 : పుట-73, 74*

గద్యం : ఇత్యేవం గోకుల పురవరనార్యః వాసుదేవ మశేషజగతా మాదికర్త్తారం నారాయణమవతీర్ధ మజానంత్యః విష్ణు మాయా విమోహితాః మానుషశిశుమివ మత్వా తస్యాయురారోగ్యైశ్వర్యాభి వృద్ధయే కృతస్వస్త్యయనాః తతోకన్యమివనారాయణం ప్రార్థయామాసుః ప్రాగేవ వాసుదేవస్సంరక్షణాఖ్యో రౌహిణేయో గోపీభి స్సంవర్ధితస్తత్ర విహరతిస్మ ॥ -1

నందుడు కంసునకు ఏటేటా కట్టే కప్పం చెల్లించడానికి మధురకు వెళ్ళి వసుదేవుని కలుసుకున్నాడు. కుశల ప్రశ్నల అనంతరం వసుదేవుడు 'నీవే నా బిడ్డకు తండ్రివి. అతడు నీకు ఆనందం కలిగించుచున్నాడు కదా!' అని పలుకగా నందుడు 'నా బిడ్డడు నీ బిడ్డడే' అని అతనిని ఊరడించినాడు. గోకులమున ఉత్పాతములు తోచుచున్నవి కావున నీవు వెంటనే నీ ఇంటికి వెళ్ళి శాంతి పౌష్టిక క్రియలు జరిపించుమని వసుదేవుడు నందునకు వీడ్కోలు పలికినాడు. పోతనగారి గ్రంథంలో ఉన్న యీభాగము తీర్థుల వారి గ్రంథంలో కనిపించదు.

**పూతనా సంహారము :**

కంసుని ఆజ్ఞచే బాలఘాతిని అయిన పూతన నందుని పల్లెకు కామరూపంతో వచ్చి నందగృహములో బాలుని రోదనము విని సుందరీ వేషంతో నందుని యింట ప్రవేశించి ఊయలలోని బాలుని చూసి వాని చెంతకు చేరింది. లోకేశ్వరుడైన గోపాలబాలుడు ఆమె పాలిండ్ల యందు విషమును పూని వచ్చుట నెఱిగి ఏమీ ఎరుగని వాని వలె నిద్ర నటించుచున్నాడు. పూతన బాలుని దగ్గరకు వచ్చి నా చనుబాలు ద్రావుమనుచు ఒడిలోనికి తీసుకోబోతుంది.

*కందం॥ నా చనుఁబాలొక గ్రుక్కెఁడు, నో చిన్నికుమార ! త్రావుమొయ్యను పిదపన్*
*నీ చెలువ మెఱుఁగ వచ్చును, నా చెలువము సఫలమగును నళినదళాక్షా! -2*

ఒక తల్లి తన పాలచే తన బిడ్డడు ఆరోగ్యవంతుడుగా పెరగాలని కోరుకోవడం అనే మాతృలక్షణం ఇక్కడ బాగా వ్యక్తీకరించబడింది. 'నా చెలువము సఫలమగును' అని పూతన బాలకృష్ణునితో అనడంచేత 'నీకు పాలివ్వడం చేత నా జన్మసార్థకమవుతుందని' ఆమెకు తెలియకుండానే ఆ బాలుని శరణాగతి పొందినట్లు భావం వ్యక్తమవుతుంది. కృష్ణుని సంహరించాలన్న తన ఆశయం నేరవేరుతుందన్న భావం కూడా అన్యాపదేశంగా దీని వెనుక మనకు కనిపిస్తుంది. పోతనగారి కవితా నిర్మాణ చాతుర్యానికి ఇది చక్కటి ఉదాహరణ.

యశోదా, రోహిణులు పాలీయవచ్చిన మాయాసుందరిని బాలుని ముట్టవద్దని వారిస్తారు. ఆమె లెక్కసేయక కలికిపలుకులు పలికి ఆ బాలుని ఒడిలోనికి తీసుకొని పాలీయసాగింది. ఇక్కడ మూలంలో ఆ యిద్దరు మాతలు ఆ వచ్చిన ఆమె శరీరకాంతి చేత ధర్షింపబడి ఏమీ అనలేక చూస్తూ ఉండిపోయినట్లుగా వ్యాసులు వర్ణించారు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 11 : పుట-75*
2. *పోతన భాగవతం, 10 : 221 : పుట-47*

*శ్లో॥ తాంతీక్ష్ణ చిత్తామతివామచేష్టితాం*
*వీక్ష్యాన్తరాకోపపరిచ్ఛ దాసివత్ ।*
*వరస్త్రియం తత్ప్రభయా చ ధర్షితే*
*నిరీక్షమాణే జననీ హ్యతిష్ఠతామ్ ॥ -1*

ఒక తల్లి పాలీయగలిగిన స్థితిలో ఉన్నప్పుడు వేరొక తల్లి తన బిడ్డకు పాలు పట్టించాలని కోరుకొనదు. అన్యస్త్రీ క్షీరం వలన అనారోగ్యాది లక్షణాలు బిడ్డలకు ఏర్పడవచ్చు. కావున పోతనగారు వారిరువురూ పూతనను వారించినట్లు వ్రాయడం సమంజసమే.

బాలుడు పాలతో పాటు పూతన ప్రాణాలు సైతం త్రాగివేశాడని అది కళ్ళు తేలవేసి నేలపై కూలిందని పోతనగారు దృశ్య సాక్షాత్కారంగా వర్ణించారు.

*సీసం॥ మేల్కొన్న తెఱఁగున మెల్లన కనువిచ్చి క్రేఁగంటఁజూచుచుఁ గిదికి నీల్గి*
*యావులించుచుఁ జేతులాదరంబునఁ జూఁచి యొదిఁగిలి యాఁకొన్న యోజనూఁది*
*బిగి చన్నుఁగవఁగేలఁ బీడించి కబళించి గ్రుక్కగ్రుక్కకు గుటు్క గుటుకుమనుచు*
*నొక రెండు గ్రుక్కలనువిద ప్రాణంబులు సైతము మేనిలో సత్త్వమెల్లఁ*

*తే॥గీ॥ ద్రావెనదియును గుండెలు దల్లడిల్లఁ, జిమ్మఁదిరుగుచు నిలువకశిరము వ్రాల*
*నితరబాలుర క్రియవాఁడ వీవుగావు, చన్ను విడువుము విడువుము చాలు, ననుచు -2*

పై పద్యంలో బాలుడు పాలు త్రాగడం ఒక చిత్రంలో వలె స్పష్టంగా కనబడుతుంది. చావు దగ్గరపడిన ఆ రాక్షసి తన అసలైన భయంకర రూపంతో ఆర్తనాదం చేస్తూ ఇంద్రుని వజ్రాయుధపు దెబ్బకు రెక్కలు విరిగి నేలకూలిన పర్వతంలా దభేలున కూలిపోయింది.

*మత్తేభం :*

*అదరెంగొండలతోడ భూమి, గ్రహతారా నీకముల్మింటిపై*
*బెదరెన్, దిక్కులమాఱుమ్రోతలెసఁగెన్ భీతిల్లి లోకంబులుం*
*గదలంబాఱెను, వజ్రభిన్న గిరిరేఖం బూర్వదేహంబుతో*
*ద్రిదశధ్వంసిని గూలి కుయ్యిడిన తద్దీర్ఘోరుఘోషంబునన్ -3*

గోపికలు బాలుని రక్షకై ప్రార్థనలు చేసిన విధానం పోతనగారి గ్రంథంలో విపులంగా సాగినది.

---

1. *వ్యాసమహర్షి, శ్రీ మద్భాగవతం, 6వ అధ్యాయం, పుట-108*
2. *పోతన భాగవతం, 10 : 225 : పుట-48*
3. *పోతన భాగవతం, 10 : 227 : పుట-48*

ఈ ఘట్టంలో తీర్థుల వారు కంసప్రేరితురాలైన పూతన అనే శిశుఘాతిని వచ్చి ఆ పుట్టిన బాలునకు స్తన్యవిషాన్ని యివ్వబోతే పాలు త్రాగెడి మిషతో బాలుడు పూతనను చంపాడు. అనంతరం అది రాక్షస శరీరంతో భూమిపై కూలిపోయింది అని రెండు శ్లోకాలలో వర్ణించారు.

*శ్లో॥ కంసేన ప్రేరితాకాచిత్పూతనా శిశుఘాతినీ ।*
*కృష్ణం స్తనం ధయం మత్వా తస్మైస్తన్యవిషం దదౌ ॥* -1

*శ్లో॥ తద్భావం సర్వవిద్ జ్ఞాత్వా స్తన్యపానమిషేణ తాం*
*జఘాన సాకపత ద్భూమౌ దర్శయం త్యాసురీం తనుమ్ ॥* -2

పూతన వృత్తాంతాన్ని ఈ రెండు శ్లోకములలోనే ముగించడం చేత తీర్థుల వారు పోతన గారి సొగసులను తన గ్రంథంలోనికి తీసుకురాలేకపోయారు. అయితే కావ్యలక్షణాలన్నీ యక్షగాన ప్రక్రియకు సరిపడవు కాబట్టి వెంటనే గోపికలు, గోపాలురు బాలునికి మంగళాశాసనం చేశారు అని దానిని వివరించడం చేత కథాభాగాన్ని స్వీకరించకపోయినా అంతగా దోషము కాదు.

*కీర్తన : ప॥ మంగళాని తనోతు మధుసూదన స్సదా*
*గంగాధరోకపి తవసాపిగంగా*

*అ॥ప॥ శృంగారవారిధే శ్రీవత్సకౌస్తుభా*
*లంకార శిశుభావ భయవిభంగ*

*చరణం: అస్తుతే భద్రమిహ దుస్తరభవాంభోధి*
*విస్తర భయాపహార వస్తుసుఖద*
*కస్తూరికా తిలక విస్తీర్ణఫాల జగ*
*దస్తితా పాదక సదాస్తరహిత*

*చరణం: అక్షీణ సంపదిహ రక్షతుధరేయ మథ*
*శిక్షతు హరిస్తవవిపక్షనిచయం*
*దక్షిణామూర్తి రపి దాక్షిణ్యమావహతు*
*వీక్షతాంత్వాం సకలసాక్షీసదయం* -3

---

1. నారాయణ తీర్థులు, *శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 13 : పుట-77*
2. నారాయణ తీర్థులు, *శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 14 : పుట-77*
3. నారాయణ తీర్థులు, *శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 6 : పుట-78, 79*

*చరణం: దుర్గాణి వారయతుదుర్గా సరస్వతీ*

*భర్గోకపి భర్జయతుపాపవర్గం*

*సర్గాది సకలసంసర్గ సాధకమిహ*

*మార్గస్సదాకవతు తవాపవర్గం*

*చరణం: పరిపూర్ణ బోధరస పరిపంధిహర సరస*

*నిరవధిక సంపదం దిశతుభూమా*

*విరచిత మిదంతు శివనారాయణానంద*

*తీర్థేవ పరమపురుషార్థ ఫలినా* - 1

గోపికలు తమ మంగళాశాసనంలో విష్ణువు, శివుడు, గంగాదేవి బాలునికి మంగళం కలుగజేయాలని ఆకాంక్షిస్తారు. ఈ కీర్తనలో శృంగార వారిధే అనే సంబోధనలో ముద్దులొలికేవాడ అనే విశేషాన్ని మాత్రమే గ్రహించాలి. దుస్తరభవాం బోధివిస్తర అనే వాక్యంలో భవాంభోనిధిని దాటించువాడు అనడం వారి స్థాయికి తగిన సంబోధన కాదు. జగదస్తి పాతక, అస్తరహిత అనే సంబోధనలు కూడా వేదాంతపరమైనవే. అంత పెద్దమాటలు నిరక్షర కుక్షులైన ఆ గోపగోపికలకు తగనివే. ఇక తక్కిన సంబోధనలన్నీ ప్రకరణోచితంగా సాగినవే.

"సర్గాది సకల సంసర్గ సాధకమిహ మార్గస్సదాకవతు తవాపవర్గం" అనడంలో భగవంతుని పరంగా యీ పదాలు అన్వయిస్తాయి అనుకున్నా పామరుల నోట యీ తాత్త్విక భావం కల విశేషణాలు వెలువడటం ప్రకరణోచితం కాదనే చెప్పాలి. పరిపూర్ణ బోధరస అనే విశేషణం వేదాంత సంబంధి. బోధ = జ్ఞానం (ప్రజ్ఞానంబ్రహ్మ)

రస శబ్దం కూడా వేదాంతపరమైనది. పరమాత్మ స్వరూప బోధను కలిగించునది.

*"రసోవైసః రసం హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి*

*కోహ్యే వాన్యాత్ కః ప్రాణ్యాత్*

*యదేష ఆకాశ ఆనందోనస్యాత్"* -2

భూమా పదం కూడా ఇక్కడ వాడబడింది.

అయితే ఒక ప్రార్థన ప్రధానమైన కీర్తనను ఎక్కడో విని నేర్చుకున్న గోపికలు దానిని మంగళ హారతి పద్ధతిలో బాలుని ఎడల ప్రవర్తింపచేసి పాడుకున్నట్లుగా భావించినట్లయితే పై దోషాలన్నీ పోతాయి.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 6 :* పుట-*78, 79*
2. *తైత్తరీయోపనిషత్, బ్రహ్మానందవల్లీ, 7వ అనువాకం, పుట-126*

పోతనగారు పూతన, శకట, తృణావర్తుల సంహారమునకు తరువాత గర్గాచార్యుడు పేరు పెట్టాడని చెప్పారు. తీర్థుల వారు మాత్రము పూతనా సంహార ఘట్టానికి ముందే యీ వృత్తాంతాన్ని వివరించారు. పుట్టినబిడ్డకు వ్యవహారం నిమిత్తం పేరు పెట్టవలసిన అవసరం ఉంటుంది. కావున ఆ బిడ్డలకు పై ఘట్టాలకు ముందే బలరామకృష్ణులని గర్గుని ఆదేశానుసారముగా నందుడు నామకరణం చేయడం సమంజసము.

తీర్థులవారు శ్రీకృష్ణుని బాల్యక్రీడలను ద్వితీయ తరంగం 7వ కీర్తన మొదలుకొని 25వ గద్యం వరకు వివరించారు.

*కీర్తన : నందగేహినీ మందగామినీ*
*సుందరాననా యశోదా సురమోహినీ*
*నందితామరీ నీలకబరీమందం*
*మందమాయాతి మధురభాషిణీ*
*లోకనాయకం యోగితారకం*
*బాలకమథాయాతి భగవంతం కృష్ణం*
*అంబుజాననం అబ్జలోచనం*
*కంబువర్ణమపి శ్రీ రామనామానం -1*

ఇక్కడ యశోదాగమనం చెప్పబడింది. ఆమె సుందరానన, సురమోహిని, నీలకబరి. ఈ విశేషణాలు ప్రకరణానికి అవసరమైనటువంటి శృంగారపరంగా సాగినవి. నిత్యము ఆనందింపజేయబడిన అమరులు కలది అనే అర్థంలో నందితామర అనే విశేషణ తీర్థుల వారు వాడారు. దైవభక్తి పరాయణురాలు అని దీని తాత్పర్యం. ఇది ఆమె స్వభావాన్ని సూచిస్తున్నది. ఆమె మధుర భాషిణి అనడం ద్వారా కృష్ణుడు ఎంత అల్లరి చేసినా ఆమె కాఠిన్యం ప్రదర్శించలేదనే సూచన ఉన్నది. అట్టి యశోద రామకృష్ణుల దగ్గరకు వచ్చింది. ఆమె కృష్ణుని యీ విధంగా స్తుతిస్తున్నది.

*ద్విపద : సకల లోకాధార సచ్చిదాకార*
*ప్రకటితాగమజాల పద్మావిలోల*
*అగణిత గుణగ్రామ ఆత్మాభిరామ*
*మృగమదాంకిత ఫాలమిత్రానుకూల -2*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 7 : పుట-82*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 83, పుట-84*

*ఖగరాజవాహ నిర్గతభవమోహ*

*నగరాజవరధీర నానావిహార*

*వికచవారిజనేత్ర విస్ఫురద్గాత్ర*

*శకలితాసురజాల శాంత్యేకమాల*

*భగవన్ భయాపహార భక్తమందార*

*నిగమ శీర్షారామ నిత్యాప్తకామ*

*సకలసన్నుతగుణ సాధుసంత్రాణ*

*మకర ధ్వజాకార మంజులహార*

*కలిత కౌస్తుభశోభ కాలమేఘాభ*

*బలభద్రకృతఖేల బాలగోపాల*

*మదనగోపాలసన్ మానితశీల*

*ముదమేహిదేహిసుర మునిబృందవంద్య*

*సారసాక్షముకుంద సచ్చిదానంద*

*ధీరనారాయణ తీర్థసుగీత* -1

అన్నీ సంస్కృత సంబోధనలే. రచన మాత్రము తెలుగు ఛందస్సు అయిన ద్విపదలో సాగింది. ముద్రాపకులు స్పష్టంగా ద్విపద అని వ్రాసి స్తోత్రాన్ని చూపారు. ద్విపదకు 3 ఇంద్రగణములు, ఒక సూర్యగణము ఉంటాయి. 3వ గణం ఆద్యక్షరం యతి. రెండు పాదములు కలిపితే ఒక ద్విపద అవుతుంది. ప్రాస నియమం ఉంటుంది. అయితే ప్రాస నియమం లేకుండా ఏ పాదానికి ఆ పాదం విడిగా ఉండే ద్విపదలు కూడా ఉన్నాయి. ఉదా : మంజరీ ద్విపద. ఈ స్తుతిలో సకలలో।కాధార।సచ్చిదా।కార। మొదటి కకారానికి 3వ గణంలోని మొదటి సకారానికి యతిమైత్రి. సకలలోని క కారానికి ప్రకటిత అన్న దానిలోని క కారానికి ప్రాస మైత్రి. కాబట్టి ఈ స్తోత్రమంతా ద్విపద పద్యాలలో సాగినట్లు నిర్ణయించవచ్చు. ద్విపద ఛందస్సు తెలుగు వారిది. సంస్కృతములో యిది లేదు. తీర్థులు రచించిన గ్రంథము సంస్కృతము. దీనిలోనికి తెలుగు ఛందస్సు రావడం సందేహానికి తావిస్తుంది. ఇది దోషంగా కనబడుతుంది. అయితే గ్రంథానికి ప్రతులు వ్రాసుకొనే ఎవరో తమకు వచ్చిన నచ్చిన యీ స్తోత్రాన్ని దీనిలోనికి చొప్పించి ఉండవచ్చు అని భావించవచ్చు.

అయితే సూక్ష్మంగా పరిశీలిస్తే గేయానుకూలమైన దరువు ద్విపదఛందానికి సరిపడేటట్లున్నా ఒకటి రెండు చోట్ల ద్విపద పాదాలుగా లేనివి కూడా యిందులో ఉన్నాయి.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : పుట-83, 84*

భగవన్ భ। యాపహ। రభక్తమం। దార అనే పాదంలో గణభంగం ఏర్పడింది. ఈ పాదంలో 'ర' అనే అక్షరం అధికంగా కనబడుతున్నది. అయితే దానిని తొలగించినా అర్థానికి లోటు లేదు. ఈ అక్షరం పద్యలక్షణం ఎరుగని వారెవరో దరువు కోసం చేర్చినట్లుగా భావించవచ్చు. దీనిని బట్టి ఛందోభంగం లేదనే తేలుతుంది. అయితే యింకొక పాదంలో కూడా ఇలాగే జరిగింది.

ముదమేహి । దేహిసు । ర । మునిబృంద । వంద్య. ఇక్కడ 'ర। తొలగిస్తే అర్థం మారిపోతుంది. సురముని బృందముచే నమస్కరింపబడువాడా అనేదే సరిఅయిన సమన్వయం. కొందరు 'సు' శబ్దాన్ని ముని శబ్దానికి విశేషణంగా భావించవచ్చు కదా అంటారు. అది ఏదోవిధంగా సరిపెట్టుకొనే విధానం మాత్రమే కాబట్టి ఛందోభంగం జరిగినదనే చెప్పాలి. అప్పుడు స్తోత్రమంతా ద్విపద ఛందస్సులో నడవలేదని తేలుతోంది. ఈ దృష్ట్యా అసలు తెలుగు ఛందస్సే యిక్కడ లేదు కాబట్టి సంస్కృతములోనే సంస్కృతము యిమిడిపోతున్నది కాబట్టి గ్రంథమంతా సంస్కృతమే అని నిర్ణయించవచ్చు. అప్పుడు ద్విపద అని ముద్రాపకులు స్తోత్రము ముందు రచించడం సరికాదు అనుకోవాలి.

పోనీ కీర్తనలో భాగమా అందాము అంటే ఫలానా వారు ఫలానా రీతిగా స్తోత్రం చేయుచున్నారు అని ఉపోద్ఘాతం ఏమీ కనబడదు. ఈ ద్విపదకు ముందు అథయశోదాసుతమాహ అని మాత్రం కనబడుతున్నది. దీనికి సంఖ్యా నిర్దేశము కూడా లేదు. కాబట్టి సంఖ్య లేని దీనిని గ్రంథభాగంగా పరిగణించలేము. ఎవరో అజ్ఞాత వ్యక్తులు ఈ గ్రంథంలో ఈ స్తోత్రాన్ని చేర్చినట్లుగా భావించడం సమంజసము. 'స్థితస్యగతిశ్చింతనీయా' అను ఆర్యోక్తి ప్రకారము అది ఎవరైనా చేర్చినదైననూ కాకపోయినానూ దానిలో ఉన్న విశేషాలను చర్చించుకొనుట తప్పుకాదు.

కృష్ణుడు లోకాలనన్నింటినీ భరించుచున్న ఒక పాదము, ఒక హస్తాన్ని నేలమీద మోపి యశోదచే తీయబడిన క్రొత్త వెన్న హస్తము నందు పట్టుకొని 'నేనే సమస్త లోకాల యొక్క సారము అనుభవించేవాడను, నేనే పరమాత్మను సుమా!' అని లోకాలకు చాటుచున్నాడా అన్నట్లుగా నందగోపుని యింట విహరించుచున్నాడు.

*శ్లో॥ విన్యస్యైకం భువి భువన భృత్పాదమేకం చ హస్తం*
*మాత్రా చానుప్రణిహిత మథస్వాదుహైయ్య యజ్ఞవీనమ్*
*హస్తే గృహ్ణాన్ సకల జగతాం సారభోక్తాఽహమాత్మే*
*త్యా చక్షాణో విహరతి జగన్మోహనో నందసూనుః ॥ -1*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 21 : పుట-91*

ఇందలి ఉత్ప్రేక్ష తీర్థుల కవితా సౌందర్యానికి ప్రతీక. ఇది శబ్ద చిత్రణమా, వర్ణ చిత్రణమా అన్నట్లు కళాత్మకంగా సాగింది రచన.

బాలకృష్ణుని యశోద తన కుమారుని వలెనే లాలిస్తూ స్తుతించింది.

గద్యం : తథావిధమిహ గోపరమణీచిత్తమత్తమాతంగ మహనీయాలానభూతం శ్రీకృష్ణం నందగోపమహిషే స్వసుతమివ లాలయంతీదమాహ ॥ -1

'గోపరమణీ చిత్తమత్తమాతంగమహనీయాలాన భూతం' గోపికల చిత్తమనే మదపుటేనుగుకు కట్టుకొయ్య వంటి వాడు అనే అర్థంలో చక్కని రూపకాలంకారాన్ని కవి వాడాడు.

ఈ విధముగా యశోదలాలనలో ఆ నందబాలుడు పెరిగి పెద్దవాడవుతున్నాడు. గోపిక పలుకుల రూపంలో కృష్ణుని గూర్చి తీర్థుల వారు ఈ విధంగా చెప్పారు.

*కీర్తన : ప॥ కృష్ణం కలయసఖి సుందరం బాల*

*అ॥ప॥ కృష్ణం గతవిషయ తృష్ణం జగత్ప్రభ*
*విష్ణుం సురారిగణ జిష్ణుం సదా బాల*

*చరణం: నృత్యంత మిహముహు రత్యంత మపరిమిత*
*భృత్యానుకూలమఖిల సత్యంసదా - బాల*

*చరణం: ధీరం భవజలధిపారం సకలవేద*
*సారం సమస్తయోగి తారం సదా - బాల*

*చరణం: శృంగార రసభర సంగీత సాహిత్య*
*గంగాలహరీఖేల సంగంసదా - బాల*

*చరణం: రామేణ జగదభిరామేణ బలభద్ర*
*రామేణ సహావాప్త కామేన సదా - బాల*

*చరణం: రాధారుణాధర సుధాపం సచ్చిదానంద*
*రూపం జగత్త్రయ భూపం సదా - బాల*

*చరణం: దామోదర మఖిల కామాకరం ఘన*
*శ్యామాకృతి మసుర భీమం సదా - బాల*

*చరణం: అర్థం శిథిలీకృతా నర్థం శ్రీనారాయణ*
*తీర్థ పరమ పురుషార్థం సదా - బాల* - 2

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 22 : పుట-92*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 11 : పుట-97*

గోపిక బాలకృష్ణుని సుందరరూపం తక్కిన గోపికలకు వర్ణిస్తూ ఆయన గూర్చి ఇంకా విశేషణాలు చెబుతున్న ఈ కీర్తన అత్యంత మధుర శబ్దాలతో తాళలయయుక్తంగా సాగుతుంది. అంత్యానుప్రాస సర్వత్రా గోచరిస్తుంది.

ఉదా : 'కృష్ణం గత విషయ తృష్ణం, జగత్ప్రభవిష్ణుం, సురారిగణ జిష్ణుం' మొదలగునవి.

ఇక్కడ గత విషయ తృష్ణం అనేది ఆప్తకాముడు అనే దానికి మరొకరూపం. ఏ కోరికలు లేనివాడు అనే అర్థంలో అన్ని కోరికలు తీరినవాడు అని తాత్పర్యం.

జగత్ప్రభవిష్ణుం (అన్ని జగములను సృష్టించినవాడు) 'జన్మాద్యస్యయతః' అనే బ్రహ్మసూత్ర వాక్యానికి వ్యాఖ్య. సురారిగణజిష్ణుం, భవజలధిపారం, సకలవేదసారం అనేవి పురాణపరమైన విశేషణములు.

'శృంగారరసభర సంగీత సాహిత్యగంగాలహరీఖేలసంగం' అనే ముఖ్య విశేషణం సంగీత సాహిత్య శాస్త్రాలకు చెందింది. నారాయణ తీర్థుల వారికి రెండు అత్యంత ప్రియమైనవి. సంగీత సాహిత్యాలు తీర్థుల జీవితంలో పడుగుపేకల్లా అల్లుకుపోయినాయి. ఈ విధంగా తననే ఆయన ఆవిష్కరించుకున్నారు.

'శృంగార రసభర' అనడం చేత సాహిత్యంలో నవరసాలలో శృంగారం శ్రేష్ఠమైనదన్న భోజరాజ మతాన్ని యీయన కూడా సమర్థించారన్నమాట. ప్రపంచమంతా ప్రకృతి పురుషుల లీల కాబట్టి అనేక రూపాలలో శృంగారం పరిణమించి, ఆహ్లాదకారి అవుతున్నది. రాధాకృష్ణులు శృంగారమన్నా అదే. రాధ ప్రకృతి స్వరూపిణి, కృష్ణుడు పురుషుడు. 'రాధారుణాధర సుధాపం' అనే వాక్యం ద్వారా తీర్థుల వారు ఆ విషయాన్ని కూడా ఉద్ఘాటించారు. ఆ వెంటనే సచ్చిదానందరూపం అని చెప్పారు. రాధాకృష్ణులను కేవలం శృంగార మూర్తులుగా మాత్రమే తీసుకొని వికృత భావాలను పొందవద్దని ఆయన సచ్చిదానంద స్వరూపుడని సామాన్య జీవుల తుచ్ఛ శృంగారకేళికి ఆయన అతీతుడని తీర్థులవారు యిక్కడ మనకు హితోపదేశ రూపంలో వివరించారు. ప్రాణుల అనర్థములను తీసివేయువాడు అనే అర్థంలో 'శిథిలీకృత అనర్థం' అని గొప్ప విశేషణం చెప్పారు. అర్థము అనగా ప్రయోజనం. మానవుడు సాధించవలసిన ప్రయోజనం ఇహలోకంలో గల భోగ్య వస్తువులన్నింటినీ సేకరించుకొని వాటిని స్వేచ్ఛగా అనుభవించడం కానే కాదు. ఇవన్నీ నిజానికి అనర్థాలు. వీని నుండి తప్పించుకొని మోక్ష పురుషార్థాన్ని సాధించడమే అర్థం. దానికి భగవంతుని సహాయాన్ని కోరుకోవడం మన కర్తవ్యం. 'నాన్యః పంథా విద్యతే అయనాయ' –1

అన్న శ్రుతివాక్యం ఇదే సత్యాన్ని తెలుపుతున్నది. ఇలా మోక్షాన్ని ప్రసాదించేవాడు భగవంతుడు అని నారాయణ తీర్థులు ఈ విశేషణం ద్వారా జనులకు బోధ చేస్తున్నారు.

శ్రీకృష్ణుని అల్లరిచేష్టలు గోపికలు యశోదకు నివేదించడము : శ్రీకృష్ణుని అల్లరి పనులను గోపికలు యశోదకు నివేదించుకొనడాన్ని వ్యాసుల వారి శ్లోకం యీ విధంగా చెబుతున్నది.

---

*1. కృష్ణయజుర్వేదం, ఆర్యణ్యకం, తృతీయ ప్రశ్న, పుట–65*

*శ్లో॥ వత్సాన్ ముంచన్ క్వచిదసమయేక్రోశ సంజాతహాసః*
*స్తేయం స్వాద్వత్త్యధదధిపయః కల్పితైః స్తేయయోగైః ।*
*మర్కాన్ భోక్ష్యన్ విభజతి స చేన్నాత్తి భాణ్డం భిన్నత్తి*
*ద్రవ్యాలాభే స గృహకుపితో యాత్యుపక్రోశ్యతోకామ్ ॥ -1*

వ్యాసుల వారు నాలుగు శ్లోకములలో శ్రీకృష్ణుని అల్లరి చేష్టలను వివరించారు.

పోతనగారు ఈ కథాంశాన్ని 26 పద్యాలలో వివరించారు. పోతనగారు విజృంభించి మూలంలోని సంయమనం పాటించకుండా శ్రీకృష్ణుని అల్లరి చేష్టలను వివరించారు.

అని యీ విధంగా గోపికలు యశోదకు కృష్ణుని అల్లరి చేష్టలను గూర్చి తెలుపుతూ యిలా అన్నారు.

*కందం॥ ఓయమ్మ ! నీ కుమారుడు, మా యిండ్లను బాలుఁబెరుఁగు మననీఁడమ్మా !*
*పోయెద మెక్కడికైనను, మా యన్నల సురభులాన మంజులవాణీ ! -2*

సుకుమార భావ భరితములైన కఠిన హృదయాలను కూడా కరిగించగల యిటువంటి పద్యములు సర్వజన ప్రియమవడంలో కారణమైనాయి.

ఇటువంటి పద్యాలు తెలుగు భాషలోని తీయదనాన్ని, మెత్తందనాన్ని, తెలుగు జాతీయతను, తెలుగు నుడికారమును, సొంపును చక్కగా చాటుతున్నాయి. స్వతంత్రములైన యిటువంటి పద్యరత్నములు తెలుగు బాల బాలికలకు కంఠహారములై వారి జీవితములను అలంకరిస్తాయి.

ఈ సందర్భములో పోతన గారిపై ఎఱ్ఱన ప్రభావము అధికముగా కనబడుతుంది.

*కం॥ ఎక్కడ కేనియుఁ బోయెద, మిక్కష్టపుఁ చాటుపడఁగ నేమోర్వము నీ*
*చొక్కపుఁ గొడుకును నీవును, నొక్కతలయు నొక్కమూరినుండుఁడు నెమ్మిన్ -3*

ఇక్కడ 'మాయన్నల సురభులానమంజులవాణీ!' అన్న వాక్యం పండితులలో చర్చనీయాంశమైనది. 'మాయన్నుల సురభులు' అని దిద్దుకోవాలని కొందరు, ఉన్నది బాగానే ఉన్నది అని మరికొందరు వాదించుకున్నారు. ఇక్కడ 'అన్న' శబ్దం సోదరుడనే అర్థం యిస్తుందని చాలా మంది ఊహ. కానీ తెలుగు భాషలోని కొన్ని పదాల అర్థం విశ్లేషించుకుంటే అసలు తత్త్వం బోధపడుతుంది. నాన్న అనే పదం పితృ పర్యాయంగా వాడబడుతోంది. విభజించి చూస్తే నా అన్న (న) అనే రెండు పదాల సమ్మేళనం ఇది. అన్న శబ్దం ఎదుటి వ్యక్తిని మన వైపునకు ఆకర్షించుకొనే పిలుపు కోసం ఉపయోగపడుతుంది. ఓ అన్నా! అంటే పేరు తెలియని ఓ అజ్ఞాత వ్యక్తిని పిలవడం. నా అన్న అనేది మరికొంత దగ్గర వ్యక్తులను సంబోధించడం.

---

1. *వ్యాసమహర్షి, శ్రీ మద్భాగవతం, 8 : 29 : పుట-151*
2. *పోతన భాగవతం, 10 : 70 : పుట-329*
3. *ఎఱ్ఱన, హరివంశం, పూర్వభాగం, పుట-232, 134*

సంధిలో యిదే నా యన్న అయినది. ఏకవచనంలో నాయన్న, బహువచనంలో ఇదే మాయన్న అయింది. మా యన్నల సురభులాన అంటే మాకు సంబంధించిన వ్యక్తుల (బంధువుల) ఆవులపై ఒట్టు అని అర్థం వస్తుంది.

తెలుగునాట ఒకప్పుడు సంపద అంటే గోసంపదయే. మా ఆత్మీయుల గోసంపదపై ఒట్టు అని చెప్పడంలో నేను చెప్పే మాటలలో అసత్యం ఉన్నట్లయితే మా వారి సంపద అంతా నశిస్తుంది అని దృఢంగా ప్రతిజ్ఞ చేయడం. కాబట్టి ఇక్కడ అన్న శబ్దం సరి అయినదే అని నిర్ణయించవచ్చు.

పైన చెప్పుకున్నట్లుగా నాయన అనేది తెలుగునాట పితృవాచకంగా కూడా అవుతోంది కాబట్టి దానిలోని అన శబ్దానికి (మూలరూపమైన అన్న) ద్విత్వం చేర్చి మూలరూపమైన అన్నను గ్రహిస్తే నాయన్న అవుతుంది. బహువచనంలో అదే మాయన్న అవుతుంది. అప్పుడు మా యన్నల సురభులు అంటే మా తండ్రిగారి గోసంపద అనే అర్థం కూడా వస్తుంది. కాలక్రమేణ 'అన్న' శబ్దం పితృవాచకంగానే కాకుండా సోదర వాచకంగా కూడా వాడబడడం జరిగినది. పుట్టినింటి వారి శుభాన్ని కోరుకునేది కావడం వల్లనే వివాహంలో ఆడపడుచు కట్నం వంటి సంప్రదాయం, ఆ తరువాత సోదరుల యిండ్లలో జరిగే శుభకార్యాలలో చినమంగళ హారతిని సోదరీమణులు పట్టటం, వారికి హారతి పళ్ళెపు కట్నమును సోదరుడు ఇచ్చే సంప్రదాయం తెలుగు వారి సముదాచారం అయ్యింది.

ఒక అన్న శబ్దానికి సోదరార్థమే తీసుకుంటే తెలుగింటి ఆడపడుచులకు పుట్టింటివారు అత్తింటివారి కంటే ప్రేమాస్పదులు కనుక వారింట సర్వ సమృద్ధులు నిలవాలని వారి కామన అయి ఉంటుంది. కాబట్టి మాయన్నల సురభులాన అనే చోట మా పుట్టింటి వారి గోసంపదపై ఒట్టు అని చెప్పడం కూడా సందర్భోచితంగానే ఉంటుంది. 'అన్నుల సురభులు' అనే చోట యింత విశేషార్థం లేదు.

అల్లరి పనులను గూర్చి యశోదకు గోపికలు నివేదించే సందర్భంలో తీర్థుల వారు భక్త్యావేశంతో భగవత్సంబంధమైన ఉత్తమ లక్షణాలన్నీ యీ బాలకృష్ణునిలో ఉన్నట్లు వర్ణించడం కొంత ప్రకరణౌచిత్యానికి భంగంగా కనబడుతుంది.

"విశ్వాత్మా నిత్యసిద్ధ విపుల తరపరానందరసతృప్తోకపి స్వేచ్ఛయా పరిగృహీతమూర్తి మత్తయా గోరస పరితృప్తః" -1

అయితే అంతటి గొప్పవాడు కూడా సామాన్య బాలకుని వలె సంచరించాడనటం ఆయన లీలాభివర్ణనమే కాబట్టి సమర్థనీయమే.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 27 : పుట-103*

తీర్థుల వారు యమళార్జున భంజన కథను ముందుగా చెప్పి మృద్భక్షణ కథను తరువాత చెప్పారు. పోతనగారు వ్యాసానుసారముగా యీ వృత్తాంతాన్ని యిక్కడ చెప్పడం సమంజసమే. ఎందుకంటే గోపికల ఫిర్యాదు వెనువెంటనే గోపబాలురు కూడా కృష్ణుడు మన్ను తిన్న వృత్తాంతాన్ని చెప్పడం వెంటనే కృష్ణునిపై యశోద శిక్షాక్రమాన్ని అవలంబించడం సమంజసంగా ఉంటుంది.

*కీర్తన : వల్లవ యువతి కదంబం ఆయా తి*
*వరమరుణాధరబింబం*
*శృంగార విలసిత పృథులనితంబం*
*విఖ్యాత వివిధ విలాస విడంబం*
*కరధృత దధిదుగ్ధ కమనీయ ఫలజాతం*
*నిరుపమ సంతోష నీలకుంతలమిహ -1*

తీర్థుల వారు గోపికలను అధరబింబముల సౌందర్యము కలవారు (వరమరుణాధరబింబం), అందముగా కదలియాడే జఘన సౌభాగ్యము కలవారు (శృంగార విలసిత పృథులనితంబం), విలాసమైన నడకలు కలవారు (విఖ్యాత వివిధ విలాస విడంబం) అని వర్ణించారు. తీర్థుల వారి మనస్తత్వానికి యీ శృంగార పరమైన వర్ణన విరుద్ధమైనది. అయితే వల్లవ యువతి కదంబం వచ్చినట్లుగా కీర్తన ప్రారంభం అగుచున్నది కాబట్టి యువతుల వర్ణనానికి యీ విశేషణాలు అవసరమే అనుకోవాలి.

తరువాత కృష్ణుడు గోపబాలురతో దధ్యన్నము భుజించి వనంలో యిటు అటు సంచరిస్తూ కొండచిలువ రూపంలో ఉన్న అఘాసురుడు అనే వానిని చేరుకుంటాడు.

*శ్లో॥ అఘాసురముఖావిష్టాస్సవత్సాగోపబాలకాః ।*
*ప్రాప్తమోహాపనుత్యర్థం ప్రార్థయంతో జగుర్హరిమ్ ॥ -2*

వత్సములు, గోపబాలకులు అఘాసురుని నోట చిక్కుకున్నారు. వారంతా రక్షణ కోసం కృష్ణుని ప్రార్థించారు. ఇక్కడ తీర్థుల వారు అన్ని వేళలా అందరూ చదువుకోవడానికి వీలుగా ఉండే ప్రార్థనా శ్లోకాన్ని రచించడం విశేషం.

*శ్లో॥ పరమ కరుణయామాం పాలయత్వాం ప్రపన్నం*
*నిజ పరిజనకామం పూరయాచింత్యకీర్తే,*
*నిరవధిక కృపాబ్ధే నిర్మలానందమూర్తే*
*భయజలనిధిమగ్నం దీనముత్తారయేశ ॥ -3*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 2 : పుట-125*
*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,3 : 9 : పుట-138*
*3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 10 : పుట-138*

*కీర్తన :*   *ప॥ పరమకరుణయామాంపాలయ భక్తమనోరథం పూరయ*

*అ॥ప॥ పరిపంథిగణమిహ వారయ భవసాగరపతితం తారయ*

*చరణం: మధుకైటభాది విజయాదరమత్స్యకూర్మాదిరూపసాదర*
*అధికదయావలోక సుందర అపరిమితానందసాగర*

*చరణం: అఖిలాండకోటి పరిపాలక అనవద్యగోకులనాయక*
*అఘహరణదుష్టనివారక ఆశ్రితజనసముద్ధారక*

*చరణం: తరళమణిమకరకుండల తాండవనటనకృత మండల*
*సరస పరిపాలితాఖండల సాధుగోకులవరస్థండిల*

*చరణం: అవనిమండల భారఖండన ఆశ్రితజనహృదయమండన*
*ధ్రువవిభూతిదానవిచక్షణ శివనారాయణతీర్థరక్షణ   –1*

శ్లోక భావాన్నే విశదీకరిస్తూ మరికొన్ని విశేషణాలు చేర్చి రచించిన యీ కీర్తనలో కృష్ణుడు మహావిష్ణువు యొక్క అవతారముగా గోపబాలకులు వర్ణించుట జరిగింది. మధుకైటభాది విజయాదర, మత్స్యకూర్మాది రూపసాదర, అఖిలాండకోటి పరిపాలక, అవనిమండల భారఖండన అనే విశేషణాలు విద్యాగంధం లేని గోపకుల నోట వెలువడటం సమంజసముగా తోచదు అయితే అప్పటికే ఎన్నో లీలలు చూపి అసుర సంహారం చేసిన కృష్ణుడు సామాన్యుడు కాదని, అవతారమూర్తి అని తమ హృదయాలలో స్థిరపరచుకున్న గోపబాలకులు విద్యావంతులు కాకపోయినా మహావిష్ణువుగా గ్రహించి యిలా వర్ణించడం ఉచితమే అవుతుంది. 'అపరిమితానందసాగర' అనే విశేషణం 'ఆనందోబ్రహ్మేతివ్యజానాత్'   –2

అనే ఉపనిషద్వాక్యానికి వ్యాఖ్య. అఘహరణ, సరస పరిపాలితాఖండల, అవని మండల భారఖండన యివన్నీ పౌరాణిక విశేషణాలు.

తీర్థులవారు వత్సాపహరణ వృత్తాంతాన్ని యీ విధంగా వర్ణించారు. బ్రహ్మగోవత్సములను గోపాలురను తన మాయచే అదృశ్యం చేశాడు. కృష్ణుడు యిది విధి చేష్టితముగా ఎరిగి ఆ గోవత్సములు, గోపాలురును తానే అయి గోపికాస్త్రీలను సంతోషింపజేశాడు. తానొనర్చిన పనికి కృష్ణుడేమి చేయుచున్నాడో అని బ్రహ్మ చూడవచ్చాడు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 7 : పుట–139*
2. తైత్తరీయోపనిషత్తు, భృగువల్లీ, 6వ అనువాకం, పుట–168

*కీర్తన : ఆయాతి చతురాస్యో బ్రహ్మసదసి*
*గాయన్ గాయన్ ధ్యాయన్ ధ్యాయన్ విష్ణుం చేతసి*
*దండకమండలుధారీ దానవవైరీ*
*అండ బ్రహ్మాండ విధాతాఽఖిల జనయితా ॥ -1*

ఈ కీర్తనలో అండబ్రహ్మాండ విధాతా, అఖిల జనయిత అనే విశేషణాలు ఆయనయొక్క సృష్టిధర్మాన్ని తెలుపుతాయి. దానవవైరి అనే విశేషణం సమంజసముగా లేదు. అతని దృష్టిలో దానవులు, మానవులు, దేవతలు అందరూ ఒక్కటే. అతడే అందరినీ సృష్టించాడు కనుక. అయితే భూమి మొరపెట్టగా ఆమెతో వెళ్ళి కంసాదుల వల్ల ఏర్పడిన ఉపద్రవాలను తొలగించి భూభారాన్ని తప్పింపమని విష్ణువును ప్రార్థించిన వారిలో అతడే ముఖ్యుడు. కాబట్టి యీ విధంగా అతడు దానవవైరి కూడా అవుతున్నాడు అని వ్యాఖ్యానించుకుంటే ఆ విశేషణం తీర్థుల వారు వాడటం సమంజసమే అవుతుంది. ప్రథమ తరంగములో 8వ కీర్తనగా యీ బ్రహ్మగమనాన్నే యివే విశేషణాలతో తీర్థులవారు వర్ణించారు. కాబట్టి ఒక రకంగా పునరుక్తిదోషం వస్తుంది. అయితే ఒక్కొక్క సందర్భమునకు ఒక్కొక్క సన్నివేశం, వేరే వ్యక్తులు (పాత్రలు) ప్రవేశించినట్లుగా ఎన్ని మార్లు చెప్పిననూ అంతగా దోషంగా పరిగణించనవసరం లేదు. "స్థితస్య గతిశ్చింతనీయా" అను పండితుల మాట ఇక్కడ అనుసరింపతగినది.

ఈ సందర్భంలో తీర్థులవారు ఒక్క కృష్ణునే కాకుండా ఆయనతో పాటే అసుర సంహారానికి సహాయకుడిగా పుట్టిన బలరాముని కూడా స్తుతించడం అవసరమని చక్కగా ఆలోచించి బలరామకృష్ణులిరువురినీ స్తుతించారు.

*శ్లో॥ కర్పూరాభౌకువలయదళశ్యామలౌచాభిరామౌ*
*కల్యాణానాం సకలజగతామాశ్రయౌ గోపబాలౌ*
*భక్తత్రాణాధ్వరవిధౌ దీక్షితౌ మోక్షహేతూ*
*మాయాశక్త్యావిరచిత తనూ రామకృష్ణౌ స్మరామి -2*

బలరామకృష్ణులను మోక్షము కలుగుటకై స్తుతించుచున్నాను అని వారిరువురునూ నుతించి బ్రహ్మదేవుడు తన నివాసమగు సత్యలోకమునకేగెను.

రజితశైలము వలె కల బలరాముని, జలపూర్ణమైన మేఘము వలె ఉన్న శ్రీకృష్ణుని స్తుతిస్తూ ఆ గోపాలకులు ఆనంద కీర్తనం చేశారు. కృష్ణుడు బలరాముని విడిచి గోపాలకులతో యమునా హ్రదాన్ని చేరుకుని దానిలోనికి దూకుతాడు. కాళియుడు ఆ ధ్వనిని విని క్రోధంతో ఎర్రబడ్డ కన్నులు కలవాడై తన పడగలతో కృష్ణుని

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 8 : పుట-142*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 16 : పుట-149*

బంధిస్తాడు. గోపాలకులు ఆ దృశ్యాన్ని చూసి భయపడతారు. బలరాముడు అక్కడ చేరియున్న గోపికా నందాదుల ఎదుట సర్వులకు మిత్రుడును, సర్వాత్మకుడైన కృష్ణుని ప్రార్థిస్తాడు.

శ్లో॥ *పశ్యత్సునందాదిఘ గోపికాసు శ్రీకృష్ణ మేవాఖిల మిత్రభూతం ।*
*తుష్టావ రామస్సకలాత్మదర్శీ సర్వాత్మకం కృష్ణ మనన్యదృష్ట్యా ॥* –1

ఇక్కడ తీర్థుల వారు బలరామునకు 'సకలాత్మదర్శి' అనే విశేషణాన్ని వాడారు. కృష్ణుడు సర్వాత్మకుడైతే యితడు వానితో సమానంగా సకలాత్మలను దర్శించేవాడుగా వర్ణించడం ద్వారా తీర్థులు శ్రీకృష్ణునితో సమానమైన స్థాయిని బలరామునకు కూడా యిచ్చినాడని గ్రహించాలి.

శ్లో॥ *మత్స్యకూర్మోవరాహశ్చ నారసింహశ్చ వామనః ।*
*రామోరామశ్చ రామశ్చ బుద్ధః కల్కిరేవచ ॥* –2

అని చెప్పబడ్డ దశావతారాలలో మూడవ రామశబ్దానికి సార్థక్యాన్ని కలిగించి తీర్థుల వారు తన నిజమైన భక్త లక్షణాన్ని చాటుకున్నారు.

తీర్థుల వారు పోతనవలె కాక ధేనుకాసుర వధ వృత్తాంతాన్ని యీ కాళియ భంజన వృత్తాంతం తరువాత చెప్పారు. మూలకథ ప్రకారం ధేనుకాసురవధ చేసినవాడు బలరాముడు కాబట్టి శ్రీకృష్ణుడు చేసిన అసుర సంహారాలను వరుసగా ముందు చెప్పివేసి బలరామకృతమైన యీ వధను వేరుగా చెప్పడం ఉచితమనుకొని యిలా ప్రణాళిక మార్పు చేసినట్లుగా భావించవచ్చును. కానీ తీర్థుల వారు యీ వధను కూడా శ్రీకృష్ణుడే చేసినట్లుగా చెప్పారు.

శ్లో॥ *ఖరాసురవధంకృత్వా ఖగాధిపతివాహనః ।*
*నిరాయాసః పరానందో రమతే నందనందనః ॥* –3

చివరకు తీర్థుల వారు బలరామకృతమైన యీ వధను కూడా శ్రీకృష్ణకృతముగానే భావించి వారిరువురి అభేదాన్ని చాటారని భావించాలి. ఇలా ఖరాసురవధ చేసిన కృష్ణుని గూర్చి సంతోషంలో గోపబాలకులు స్తోత్రపాఠాలతో కాలం గడిపారు.

గద్యం : తమేవమసురకులకదళీవనోన్మూలనకేళికలాకుశల కలభమూర్తిధరం నందకుమారం సర్వేచగోపబాలాః సంపూర్ణ మనోరథాఇత్థం ప్రార్థయామాసుః ॥ – 4

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 7 : పుట–176*
2. చాటువు
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 13 : పుట–184*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 14 : పుట–184*

ఇక్కడ కవి కృష్ణుని గూర్చి చేసిన వర్ణన కావ్యానుగుణంగా కమనీయంగా సాగింది. కృష్ణుడు రాక్షసకులమనే కదళీవనాలను నిర్మూలనం చేసే కళ యందు కుశలత గల కలభమూర్తియట. ఇది చక్కని రూపకము. (అసురకుల కదళీవనోన్మూలనకేళికలా కుశలకలభమూర్తిధరం)

దావానలభక్షణ కథను తీర్థులవారు ఒక శ్లోకంలో చెప్పి ముగించారు.

*శ్లో॥ దృష్ట్వాదావానలం బాలాః కృష్ణకృష్ణేతి చుక్రుశుః*
*గృహీత్వాంజలినాకృష్ణో దావానలమభక్షయత్ ॥ - 1*

ఆ దావాగ్ని కృష్ణుని జఠరము నందు జీర్ణమైపోగా గోపాలకులు కృష్ణుని స్తుతించారు.

*శ్లో॥ శ్రీగోపాలకమేకమేవ పరమందైవం సదామానయే*
*శ్రీవత్సాంకితవక్షసంశ్రిత జనాధారం సమారాధయే*
*ఆమ్నాయాంతసరోజహంసమఖిలానందాత్మకం శాశ్వతం*
*కుక్షిస్థాఖిలలోకరక్షక మముంగీర్వాణగేయం ప్రభుమ్ ॥ -2*

ఇది నిత్యప్రార్థనలో భక్తులస్తోత్రముగా జపించుకొనుటకు వీలైన రీతిలో తీర్థులచే రచింపబడినది. తరువాత కృష్ణుడు గోపాలకులతో గోకులాన్ని చేరుకున్నట్లుగా చెప్పి చతుర్థ తరంగాన్ని తీర్థుల వారు ముగించారు.

పోతనగారు దావాగ్ని భక్షణవధ తరువాత గోపాలురతో కూడా బలరామకృష్ణులు భాండీరకవనం ప్రవేశించినట్లుగా చెప్పి కావ్యోచితంగా వర్ష శరదృతువులను సుందరంగా వర్ణించారు.

వచనం: ధేనువధ్రంబుకైవడి బయః కణమనోహరంబై, హర కరంబు భంగి బరిపూర్ణ సారంగ భాసురంబై సురగిరి చెలువున హరిశరాసనవిభీషణంబై, విభీషణ హృదయంబు పోలికం బ్రకటితహరిశబ్దవైభవంబై, భవపూజనంబు చందంబున నింద్రగోపాదివిభవజనకంబై జనకయాగంబుభాతి సీతా ప్రకరణాలంకృతంబై కృతయుగంబుసొంపున బహువర్షంబునై వర్షాగమంబు చెలువొందెనప్పుడు -3

ఇచ్చట ఉపమాలంకారం ప్రశంసనీయం.

*కందం॥ వర్షాకాలభుజంగుడు, హర్షముతో నిడిననవనఖాంకములనియు*
*తర్కింప భూమి సతిపై, గర్షక హలరేఖలమరె గహనాంతమునన్ ॥ -4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 24 : పుట-197*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 4 : 26 : పుట-198*
3. *పోతన భాగవతం, 10 : 756 : పుట-171*
4. *పోతన భాగవతం, 10 : 754 : పుట-170*

భూమి అనే కాంతకు వర్షాకాలమనే విటుడు నఖచిహ్నములు కూర్చినాడా అన్నట్లుగా భూమిపై నాగటిచాళ్ళు ప్రవేశించినవని భావము. ఇక్కడే వర్షాకాలుడనే ప్రియునితో సంగమించిన భూమికి వడలెల్ల పులకలతో నిండినవా అనునట్లు సస్యముల యొక్క మొలకలు అలరారినవి అని చెప్పడంలో కవి ఉత్ప్రేక్షను చక్కగా రూపకంతో ముడివేసినాడు.

ఆ వర్షాకాలంలో కృష్ణుడు విశ్వమోహనంగా వేణుగానం చేశాడు.

*సీసం॥ విశ్వమోహనమైన వేణునినాదంబు సరసగంభీరగర్జనముగాఁగ*
*మహనీయనిర్మలమందహాసద్యుతి లలితసౌదామనీలతికగాఁగఁ*
*దలచుట్టు బాగుగఁ దనరుఁ పింఛపుదండ శైలభేదనశరాసనముగాఁగ*
*గరుణాకటాక్షవీక్షణ సుధావర్షంబు సలిలధారా ప్రవర్షంబుగాఁగఁ*

*తే॥గీ॥ జాడనేతెంచు గోపాల జనమునీంద్ర, చాతకంబులదురవస్థసక్కఁజేసి*
*కృష్ణమేఘంబు బహుతరకీర్తినొప్పె, విమల బృందావనాకాశవీథియందు -1*

వేణుధ్వని గర్జనలాగా, మందహాసం విద్యుల్లతలాగా, నెమలి పింఛపుదండ ఇంద్రధనస్సులాగా, దయాదృష్టియే ధారావర్షంలాగా ఉన్న శ్రీకృష్ణుడనెడి మేఘం మునీంద్రులనే చాతకాలను బృందావనమనే ఆకాశంలో సంతోషింపజేసింది అని భావము.

శరత్కాల వర్ణనలో పోతనగారు ప్రదర్శించిన సామర్థ్యం వర్ణింపనలవికానిది.

వచనం: రాజరాజగృహంబుపగిది విలసితకుందపద్మ సౌభాగ్యంబై, భాగ్యహీనుకర్ణరేఖగతి, నశ్రుతనీలకంఠ శబ్దంబై శబ్దశాస్త్రవేదిహృదయంబు బాగున విశదప్రకాశాభిరామంబై, రామసంగ్రామంబుకైవడి బాణా సనాలంకృతంబై, కృతాంత హృదయంబు కరణినపంకంబై, పంకజాసనుగేహంబు సొంపున రాజహంస విరాజమానంబై, మానధనుని చరిత్ర సొబగున నకల్మషజీవనంబై, వననిధి పోలుపున సమ్మిళిత భూభృద్వాహినీ సంకులంబై, కులవధూరత్నంబు చెలువున నదృష్ట పయోధరంబై ధరణికిం దొడవగుచు శరత్కాలంబు వచ్చెనంత *-2*

ఆ సమయంలో శ్రీకృష్ణుడు వేణుగానాన్ని ఆలపించడాన్ని పోతనగారు కడురమ్యంగా వర్ణించారు.

---

*1. పోతన భాగవతం, 10 : 761 : పుట-173*

*2. పోతన భాగవతం, 10 : 765 : పుట-174*

*సీసం॥ కర్ణావతంసిత కర్ణికారప్రభ గండభాగద్యుతిఁ గడలుకొలుప*
*భువనమోహనమైన భ్రూవిలాసంబుతో వామభాగానతవదనమొప్ప*
*నపసవ్యకరమృదులాంగుళి చాతురి షడ్జధ్వనికి మర్మసరణిఁజూప*
*డాకాలిమీఁద నడ్డము సాఁచి నిల్పిన పదనఖద్యుతి భూమిఁబ్రబ్బికొనఁగ*

*తే॥గీ॥ మౌళిపింఛముఁ గంఠదామమును మెఱయ, విలసిత గ్రామముగ నొక్కవేణువందు*
*బ్రహ్మగాంధర్వగీతంబు పరఁగఁజేసెఁ, జతురనటమూర్తి గోపాలచక్రవర్తి −1*

ఆ వేణుగానానికి గోపికలు మదానావేశాన్ని పొందడం, అందరూ కలసి బృందావనానికి వెళ్ళడం ఈ వేణువెంత పుణ్యం చేసిందో శ్రీకృష్ణుని కెమ్మోవిసుధారసాన్ని ఆస్వాదిస్తోంది కదా! అని ఒక గోపిక అనడం మొదలైన భక్తి శృంగార భరితమైన భావనలు చేసుకుంటూ మదన పరతంత్రలైనట్లుగా పోతనగారు వర్ణించిన తీరు అద్భుతము.

*మత్తేభం :*

*ఒనరన్ వ్రేతలకించు కేనియును లేకుండంగ గోపాలకృ*
*ష్ణుని కెమ్మోవిసుధారసంబు గొనుచుం జోద్యంబుగామ్రోయుచుం*
*దన పర్వంబులు నేత్రపర్వములుగా దర్పించెఁ బూర్వంబునన్*
*వనితా! యెట్టి తపంబు సేసెనొకొ యీ వంశంబు వంశంబులోన్ ॥ −2*

హేమంత ఋతువర్ణనలో పోతనగారు ఎన్నో చమత్కార భరితములైన పద్యాలను చెప్పారు.

*కందం॥ ఈ హేమంతమురాకకు, శ్రీహరియొక్కింత వడఁకి చింతింపంగా*
*నోహో! వెఱవకు మని తా, మా హరికిని శ్రీకుచంబులభయంబిచ్చెన్ ॥ −3*

హేమంత ప్రభావానికి శ్రీహరి ఒణికిపోతూ వుండగా భయపడవద్దంటూ లక్ష్మి వక్షఃస్థలం ఆయనకు అభయమిచ్చిందట.

*శ్లో॥ శీతకాలేభవేదుష్ణం ఉష్ణకాలేచశీతలమ్ ।*
*కూపోదకం వటచ్ఛాయా తాంబూలం తరుణీకుచౌ ॥ −4*

అనే చాటు శ్లోకాన్ని పోతనగారిచ్చట స్మరించుకున్నారన్నమాట. పోతన భక్తుడే కాదు శృంగారి కూడా. అయినా శ్రీనాథుణ్ణి ఒక్కడినే తెలుగు కవులలో శృంగారిగా చెప్పుకోవడం ఆచారమైపోయింది పాపం.

---

1. *పోతన భాగవతం, 10 : 769 : పుట−176*
2. *పోతన భాగవతం, 10 : 779 : పుట−178*
3. *పోతన భాగవతం, 10 : 806 : పుట−184*
4. *మహీధర జగన్మోహనరావు, సూక్తిముక్తావళి, పుట−241*

త్రేతాగ్నులు మూడు చలికి భయపడిపోయి ఈశ్వరుని కంటిలోను, సముద్రంలోను, జనావాసాలలోను ఒదిగిపోయాయని యీయన చెప్పడం నిజమైన కావ్యమర్మజ్ఞతం.

*ఆ॥వె॥ శంభుకంటనొకటి జలరాశినొక్కటి, మఱియునొకటి మనుజ మందిరముల*
*నొదిగెఁగాక మెఱసియున్న మూఁడగ్నులు, చలికి నులికి భక్తి సలుపకున్నె? -1*

కృష్ణుడు దొంగ నడకలతో వచ్చి గోపికల వస్త్రాలను అపహరించారు. ఒక నీప (కడిమి) వృక్షాన్ని అధిరోహించాడు. గోపికలు మా వస్త్రాలను ఇచ్చివేయుమని కృష్ణుని ఎంతగానో వేడుకుంటారు.

*కందం॥ మామా వలువలు ముట్టకు, మామా ! కొనిపోకు పోకు మన్నింపుతగన్*
*మా మానమేల కొనియెదు ?, మా మానసహరణమేల ? మానుము కృష్ణా ! -2*

పోతన గారి యీ పద్యంలో సహజ శబ్దాలంకారయుక్త వర్ణనాశైలి కనబడుతుంది.

తీర్థుల వారు ఈ ఘట్టాన్ని తృతీయ తరంగంలో చెప్పారు. యజ్ఞపత్నుల యొక్క ఆగమనం తీర్థుల వారు యీ విధంగా వర్ణించారు.

*కీర్తన : యజ్ఞపత్నీబృందమధునాయాతి*
*యాగశాలామనింద్య కర్మవిధినా*
*విజ్ఞాన పూరితశుద్ధ మనసా సహ*
*విశ్వాసపూర్వక నమ్రశిరసా*
*దివ్యసుందరం భవ్యకంధరం*
*ధృతనవ్యపీతాంబర మద్భుతహారం*
*చారుకబరీభార భరితం*
*దివ్య చామీకరాభరణ గణభాసితమ్ ॥ - 3*

ఇక్కడ 'యజ్ఞపత్నీ' శబ్దాన్ని తీర్థుల వారు శాస్త్రబద్ధంగా నిబద్ధించారు.

'పత్యుర్నో యజ్ఞ సంయోగే' -4 అని పాణీయ సూత్రం.

యజ్ఞ సందర్భముగా యజ్ఞదీక్షితునకు సహకరించే సందర్భములో మాత్రమే యీ శబ్దం వర్తిస్తుంది.

---

1. *పోతన భాగవతం, 10 : 804 : పుట-183*
2. *పోతన భాగవతం, 10 : 820 : పుట-186*
3. *శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ, 3 : 12 : పుట-151*
4. *పాణిని, అష్టాధ్యాయి, 4 : 33 : పుట-145*

*కీర్తన : అరణిపాత్ర పాలాశకుశ భారంవహంతో*

*ధరణితలే సతతం ధావంతో యాజ్ఞకా ఆయాంతి - 1*

యజ్ఞ శబ్దం మీద 'ఠక్' (ఇక) ప్రత్యయం నిర్వహించువాడు అనే అర్థంలో రాగా 'యాజ్ఞిక' అవుతుంది.

ఆయాజ్ఞికులు పవిత్రప్రాణులు, పశులక్షణవేత్తలు, యజ్ఞకుశలులు అని తీర్థుల వారు చెప్పారు. యజ్ఞ సంప్రదాయమును తీర్థుల వారు బాగా ఎఱిగినవారని దీనిని బట్టి తెలుస్తోంది. వారు సవితృ మండలాం తర్గతుడైన యజ్ఞ పురుషుని ధ్యానం చేస్తున్నారట. యజ్ఞ సంప్రదాయంలో విష్ణువే పరమ పురుషుడు 'యజ్ఞోవై విష్ణుః' అని వేదం చెబుతున్నది. ఆ విష్ణువు సూర్యమండలాంతర్గతుడని చెప్పే వర్ణనము ఉన్నది.

*ధ్యేయ స్సదా సవితృమండల మధ్యవర్తీ*

*నారాయణః సరసిజాసన సన్నివిష్టః ।*

*కేయూరవాన్మకరకుండల వాన్కిరీటీ*

*హరీ హిరణ్మయవపుర్ధృత శంఖచక్రః ॥ -2*

ఆ యాజ్ఞికులు గహన కర్మసామాదులను గానం చేస్తున్నారట. ఇళ్ళలో యజ్ఞకార్యం చేయరాదని ఒక నియమం. కావుననే ఒక ప్రత్యేక ప్రదేశాన్ని ఎన్నుకొని గ్రామబహిర్భాగంలో యజ్ఞ కర్మను నిర్వహించడం నేటికీ ఆచారం. తీర్థుల వారి సంప్రదాయజ్ఞత యింత గాఢమైనది. యజ్ఞాలలో సామగానం చేయడం అతి ముఖ్యమైన సంప్రదాయం. దీనినే తీర్థులవారు యీ కీర్తనలో చెప్పారు.

*పవిత్ర పాణయోనిత్యం పశులక్షణవిదో*

*సవితృమండలాంతస్థంధ్యాయంతో యాజ్ఞికా ఆయాంతి*

*అహంపూర్వమహంపూర్వమితి యజ్ఞకుశలాః*

*గహనకర్మ సామాదీని గాయంతో యాజ్ఞికా ఆయాంతి -3*

ఈ సందర్భంలో ప్రయోగించిన యాజ్ఞీక శబ్దం శాస్త్రబద్ధమైనది.

*"యజ్ఞం చరతి యాజ్ఞీకః -4 సూత్రం "చరతి" అని పాణినీయ సూత్రం.*

యజ్ఞపత్నులు అనింద్యకర్మ విధితో, విజ్ఞానపూరిత శుద్ధ మనస్సుతో ఉన్నారని చెప్పడం ద్వారా యజ్ఞంలో పాలు పంచుకొనే స్త్రీల యొక్క పవిత్రత యీ విధంగా ఉండాలి అని తీర్థుల వారు నిర్దేశించారన్నమాట. యజ్ఞ ప్రదేశానికి సమీపమునందున్న వనానికి శ్రీకృష్ణుడు గోవులను మేపుకొనుచు గోపాలకులతో కలసి చేరుకున్నాడు.

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,3 : 11 : పుట-150
2. ఆదిపూడి వెంకట శివసాయిరామ్, శ్రీ ఆదిత్యారాధన, పుట-71
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 11 : పుట-150
4. పాణిని, అష్టాధ్యాయి 4 : 4 : పుట-8

గద్యం : ఏవం యజ్ఞపత్నీ సహిత యజమాన యాజ్ఞిక ప్రవర్తతే యజ్ఞకర్మణి సాక్షాద్యజ్ఞ స్వరూపీ భగవాన్ కందర్పదర్పమహా సర్ప గరుడాయమాన దివ్యమూర్తి ధరోగోపబాలలైస్సహ శనైశ్శనై సంచరన్నపి గోవత్సా తదుపవనదేశమాజగామ తత్రకదాచిద్వత్సపాలన సమయే బాలా ఊచుః *-1*

ఇక్కడ కృష్ణుని 'కందర్పదర్ప మహాసర్ప గరుడాయమాన దివ్యమూర్తి ధరః' అని విశేషించడం చేత శబ్దార్థాలంకారాలు రెండు సమపాళ్ళలో నర్తించాయి. మన్మథుని గర్వమనే సర్పానికి గరుత్మంతుని వంటివాడని యీ విశేషణానికి అర్థం.

శబ్దాలంకారం : వృత్త్యనుప్రాస

అర్థాలంకారం : రూపకం

గోపాలురంతా ఆకలితో ఉన్నాము. అన్నం కావాలి అని కృష్ణునితో మొరపెట్టుకున్నారు. కృష్ణుడు సమీపంలోనే యజ్ఞం జరుగుతున్నది. కావలసినంత తెచ్చుకోండని వారికి ఉపాయం చెప్పాడు. ఒకవేళ భర్తలు అంగీకరించకపోతే వారి పత్నులు మనకు అన్నం పెడతారని భరోసా యిచ్చాడు. ఆ ప్రకారంగానే ఒక గోపాలకుడు యజ్ఞశాలకు వెళ్ళి అన్నాన్ని యాచించాడు. యజమానులు పెట్టడానికి తిరస్కరించారు. ఆ గోపాలకుడు కృష్ణుని నిమిత్తంగా చూపి యజ్ఞపత్నులను అన్నం కొరకు యాచించాడు. ఆ విప్రకాంతలు కృష్ణుని పేరు వినగానే బహువిధములైన అన్నములను తీసుకొని కృష్ణుని వద్దకు పరుగెత్తారు. కృష్ణుడు వాటిని ఆరగించగా వారు సంతోషంతో కృష్ణుని స్తుతించారు. ఈ సందర్భములో ప్రసిద్ధమైన బాలగోపాల తరంగద్వయము ద్వారా తీర్థులు వారు ప్రార్థనావిధానాన్ని విపులంగా వర్ణించారు. వీటిలో తీర్థుల వారి భక్తి శృంగార ద్వయసమ్మేళనం సమ్యగ్రీతిలో సంపన్నమై భాసించింది. యజ్ఞపత్నులు శ్రీకృష్ణుని ముగ్ధమోహన సౌందర్యాన్ని తమకంతో సందర్శిస్తారు. ఆ పారవశ్యంలో వాని వేషధారణను, ఆకారవికారాలను తనివితీరా వర్ణిస్తారు. రెండవ వంక కృష్ణుడు సాక్షాత్తు యజ్ఞస్వరూపుడైన విష్ణువే అనే భావాన్ని దృఢపరచడానికి తీర్థుల వారు ఆ స్త్రీల నోట చక్కని విశేషణాలను పలికించారు.

*కీర్తన : బాలగోపాలకృష్ణ పాహి పాహి*

*అ॥ప॥ నీలమేఘ శరీర నిత్యానందం దేహి*

*1. కలభసుందర గమన కస్తూరి శోభితానన*
*నలిన దళాయతనయన నందనందన*
*మిళిత గోపవధూజన మీనాంక కోటిమోహన*
*దళిత సంసార బంధన దారుణవైరినాశన -2*

---

1. నారాయణ తీర్థులు, *శ్రీకృష్ణ లీలా తరంగిణీ*, 3 : 18 : పుట-152

2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 13 : పుట-155*

2. *యజ్ఞ యజ్ఞ సంరక్షణ యాదవ వంశాభరణ*
*యజ్ఞ ఫలవితరణ యతిజనశరణ*
*అజ్ఞాన ఘనసమీరణ అఖిలలోకకారణ*
*విజ్ఞాన దళితావరణ వేదాంత వాక్యప్రమాణ*

3. *వ్యత్యస్త పాదారవింద విశ్వవందిత ముకుంద*
*సత్యఖండ బోధానంద సద్గుణబృంద గోవింద*
*ప్రత్యస్తమితభేదకంద పాలితనందసునంద*
*నిత్యదనారాయణతీర్థ నిర్మలానంద గోవింద* – 1

పల్లవి, అనుపల్లవి, చరణాలన్నింటిలోను తెలుగు భాషకు సహజమైన ప్రాస నియమాన్ని పాటించారు.

*ఉదా : బాలగోపాలకృష్ణ నీలమేఘశరీర*
*కలభసుందర గమన – నళిన దళాయతనయన*

ఇలాగే కీర్తన అంతా సాగుతుంది.

ప్రాస విషయంలోనే కాదు యతి విషయంలో కూడా తీర్థుల వారు తన తెలుగుతనాన్ని చక్కగా నిరూపించుకున్నారు.

*ఉదా : బాల గోపాలకృష్ణ పాహి పాహి*
*నీల మేఘశరీర నిత్యానందం దేహి*
*కలభసుందరగమన కస్తూరి శోభితానన*

*కీర్తన : బాలగోపాల మాముద్ధర పరమకల్యాణ గుణాకర*
*నందనందన భక్తచందన మందస్మిత సుందరానన*

పై తరంగమునందలి మొదటి చరణమున

"ఇందిరామందిర భక్త – సుందర వదనారవింద
భృంగ, భక్తి మకరంద – నందిత గోపికా బృంద –2

అనునంతవరకు రచించిన పిమ్మట,

"తాంతాహతద్ధై, తాంతక్క" అను శబ్దమును రచించి, పై విషయము స్ఫురించనందున, మరునాడు దానిని పూర్తి చేయు తలంపుతో ఆనాడు విరమించిరట. కాని మరునాడు వారాపనికి కడంగుటకు పూర్వమే అది ఇట్లు పూర్తి చేయబడియుండెనట !

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 13 : పుట–155*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 14 : పుట–159*

*"తోధిమ్మి ణాంగిణ తోధిమ్మి రేతక్క*
*తోధిమ్మి ధిమికిట తోధిమ్మి రేతక్క*
*తొదిగిణాంగం గిణత్తోంగ*
*ధిర్గుడు దధిర్గుడు దత్తుంగ*
*తొదిగిణాం గత్తిరుత్తొంగ*
*ధిర్గుడు దధికి తకిట దధిగిణతోం* *-1*

దీనిని తీర్థుల వారు చూచి దీనినిట్లు పూర్తి కావించిన మహానుభావుడు శ్రీకృష్ణ పరమాత్మయేయని భావించి, సంతసించి శేషించిన చరణములను పూర్తి చేసిరట. *-2*

తీర్థుల వారు కాశీ యాత్ర నుండి తిరిగి వస్తూ గోదావరి జిల్లాలోని పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో నెలకొని యున్నటువంటి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని దర్శించి ఆ స్వామి వారిమీద ఈ కీర్తన రచించినట్లుగా ఒక జనశ్రుతి ఉన్నది. అందుకే నాల్గవ చరణంలో

'సిద్ధజన సిద్ధాంత సిద్ధగోపాలం' *-3*

అన్న వాక్యాన్ని ఈ స్వామిని గురించి చెప్పినదే అని ఆ ప్రాంతవాసులు ఇప్పటికీ చెబుతుంటారు. ఈ విధంగా నాట్యానుకూలమైన మృదంగ గమకాలను ఎన్నింటినో వివరంగా చూపారు.

శ్రీకృష్ణుని వర్ణించడం ద్వారా కవితాకళను, ఆ రూపాన్ని చిత్రించడం ద్వారా చిత్రకళను, ఆయన విన్యాసాలను వర్ణించడం ద్వారా శిల్పకళను, ఆయనగాన (మురళి) వైఖరులను ప్రార్థన చేసినవారి గాన విధానాన్ని వర్ణించడం ద్వారా సంగీతకళను, నర్తనరీతులను వర్ణించడం ద్వారా నాట్యకళను ప్రదర్శించిన తీర్థుల వారి కళాభిజ్ఞత అభిజ్ఞుల ప్రశంసలకు పాత్రముగా సాగింది. కవిత్వము, చిత్రకళ, శిల్పము, సంగీతము, నాట్యము యిలా లలితకళలైదింటికీ తీర్థుల వారి కవిత ఆకరముగా నిలచింది.

ఇలా స్తుతించి యజ్ఞపత్నులు కృష్ణుని ఆదేశము మేరకు తమ స్థానములకు చేరుకున్నారు. యజమానులు వారిని ప్రశంసించి స్వీకరించారు.

*శ్లో॥ యాజ్ఞికాస్తేకపితాః పత్నీః ప్రశస్యచపునః పునః*
*అంగీచక్రుర్భగవతో మాహాత్మ్యాద్గతకల్మషాః ॥ - 4*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,3 : 14 : పుట-159*
2. *పిల్లలమర్రి దేవనాగనిక, సంగ్రహ ఆంధ్రవిజ్ఞానకోశము, పుట-214*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 14 : పుట-159*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 27 : పుట-166*

తీర్థుల వారు గోపికా వస్త్రాపహరణానికి ముందుగా యీ కథను వర్ణించడం ఒక తల్లి బిడ్డకు అన్నం పెట్టిన వృత్తాంతం వంటిది. కాబట్టి యజ్ఞ పత్నులు భోజనం ఆరగింపచేయడం ముందుగా చెప్పి సహజంగా ప్రౌఢ వయస్సు క్రియ అయిన వస్త్రాపహరణ ఘట్టం తరువాత చెప్పడం ఉచితమని భావించి మూలాన్ని మార్పు చేశారని భావించవచ్చు.

పోతనగారు కేవలము కథగా చెప్పిన గోవర్థనోద్ధర ఘట్టాన్ని తీర్థుల వారు సమస్త వస్తువుల యందు నారాయణాంశ ఉన్నదని నిరూపిస్తూ చెప్పడం సముచితముగా ఉంది. కృష్ణుని మాటలను బట్టి బృందావన వాసులు గోవర్థనగిరికి పూజలు చేశారు. ఇంద్రుడు క్రుద్ధుడై ఘోరంగా నిరంతర వర్షాలను కురిపించాడు. కృష్ణుడు గోవర్థనగిరిని గొడుగుగా పట్టి వారిని కాపాడాడు. పోతనగారు యీ సందర్భములో రాళ్ళ వర్షం కురిపించాడని చెప్పగా తీర్థులవారు సాధారణవర్షమునే విశేషంగా కురిపించాడు ఇంద్రుడు అని చెప్పడం విశేషం.

"తస్యవాచకః ప్రణవః" *–1*

అన్న పతంజలి యోగసూత్రం కూడా ఇక్కడ అన్వయిస్తుంది. అలాగే 'మాఘవనంమదం అపనయసి' అని గోపికల పరంగా (ఇంద్రుని యొక్క మదాన్ని తొలగించినవాడు) కవి చెప్పిన దానిలోని 'మాఘవనం' అనే ప్రయోగం వ్యాకరణశాస్త్ర మర్యాదలకు అనుగుణముగా వాడబడినది. మఘవన్ అనే ఇంద్రవాచక పదం మీద సంబంధార్థమున 'అణ్' ప్రత్యయం చేయగా ఇది ఏర్పడుతుంది. "తస్యేదం" –2

తీర్థుల వారి వ్యాకరణశాస్త్ర పాండిత్యం దీని ద్వారా తెలుస్తున్నది. 'శ్రీకరకిసలయ లాలనలోల' అనేది శృంగారపరమైన వర్ణన. లక్ష్మి యొక్క కొనగోళ్ళ చేత నిత్యము లాలించబడువాడు అనునది దీని తాత్పర్యం. భక్తిలో శృంగారవర్ణన సముచితమా అని శంకించవచ్చు. అయితే భక్తి అనేది సగుణారాధన కాబట్టి ఆరాధింపబడే దైవ స్వరూపం పురుషుడైతే పత్నీసమేతంగా ఆయనను భావించడం ఆ ప్రకారంగానే వారి శృంగారకేళిని వర్ణించడం, స్త్రీ రూపమైతే పతితో కూడియున్నదిగా ఆమెను భావించి వారి శృంగారకేళి రూపం గురించి వర్ణించడం సహజంగానే జరిగిపోతుంది అని సమన్వయించుకుంటే ఇలాంటి వర్ణన దోషం కాదు. కావ్యకళాపరంగా కూడా శృంగార పోషణము కావ్యాలలో సమర్థనీయమే.

'పాటిత సురరిపుపాదపబృంద' అనునది ఆలంకారిక వర్ణన. చీల్చబడిన రాక్షసులనెడి వృక్షసమూహము కలవాడా అని దీని అర్థం. ఇంద్రుడు లజ్జాన్వితుడై మేఘసంఘాతాన్ని ఉపసంహరింపజేశాడు. కృష్ణుని స్తుతించి తన అపరాధాన్ని మన్నింపుమని కోరినాడు.

---

1. *పతంజలి, రాజయోగ గ్రంథం, 1 : 27 : పుట–141*
2. *పాణిని, అష్టాధ్యాయి, 4 : 3 : పుట–120*

శ్లో॥ శ్రీగోపాలకృపానిధే కరుణయా స్వామిన్ మయానుష్ఠితం
క్షంతవ్యం భవతాపరాధశతకం యద్యత్ క్షణే తత్తదా
ఆదిత్యాది సమస్తదేవ నివహో యస్యాజ్ఞయా వర్తతే
సత్వంసాత్వతపుంగవః శ్రుతిశిరోవాగ్గోపికావల్లభః ॥ -1

ఇక్కడ వాడబడిన విశేషణాలలో 'సాత్వత పుంగవః' అని కృష్ణుని పరంగా ఇంద్రుడు వర్ణించడం సందర్భోచితంగా ఉన్నది.

## సాత్వత శబ్ద నిర్వచనము :

శ్లో॥ నఖలుగోపికానందనోభవాన్
అఖిలదేహినామంతరాత్మదృక్
విఖనసార్థితో విశ్వగుప్తయే
సుఖఉదేయవాన్ సాత్వతాంకులే -2

బ్రహ్మదేవుని ప్రార్థనను అనుసరించి విశ్వగోపాలార్థమై స్వాత్వతకులమున జన్మించితివి.

## సాత్వత పుంగవ :

సాత్వత శబ్ద నిర్వచనము : శ్రీ మద్భాగవతమునకు సాత్వత సంహిత అని పేరు. భాగవతంలో యీ విషయం యిలా చెప్పబడింది.

"అనర్థోపశమం సాక్షాత్ భక్తియోగ మధోక్షజే ।
లోకస్యాజానతో విద్వాం శ్చక్రే సాత్వత సంహితామ్ ॥ -3

సాత్వతాం పతిః అని భాగవతంలో పెక్కు చోట్ల భగవంతుడు స్తుతింపబడ్డాడు.

భాగవత వ్యాఖ్యాతలలో ఒకరైన శ్రీధరులు సాత్వత శబ్దాన్ని యిలా వివరించారు.

'సత్' శబ్దానికి అర్థం భగవంతుడు. అతడు ఉపాస్య దేవతగా కలవారు. 'సత్వంతః'. (సత్ శబ్దం మీద మతుప్-వత్ ప్రత్యయం) అనగా భక్తులు అని అర్థం. 'సత్వత్' అనే మతుప్ ప్రత్యయాంత శబ్దం మీద స్వార్థంలో 'అణ్' ప్రత్యయం చేయగా 'సాత్వతః' అని ఏర్పడుతుంది. ఇది సాత్వత శబ్దం ఏర్పడిన విధానం.

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 17 : పుట-223, 224
2. వ్యాసమహర్షి, శ్రీమద్భాగవతం, 10 : 31 : పుట-529
3. ధూళిపాళ శ్రీరామమూర్తి, పోతనకృత శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము, పుట-454

సత్+త్వం = సత్వం (సత్ శబ్దంపై భావార్థక త్వ ప్రత్యయం) అనగా సత్వము స్వరూపంగా కలవాడు పరమేశ్వరుడు అగుచున్నాడు. ఇలా యీ శబ్దం పరమేశ్వర స్వరూప ప్రతిపాదకం. సత్వమనగా సత్వగుణం. అది మూర్తిగా కలవాడు (ఉపలబ్ధిస్థానముగా) భగవంతుడు. ఇలా సత్వ శబ్దం భగవత్పరంగా అన్వయిస్తుంది. -1

భాగవతము నందు అనేక స్థలాలలో యీ సాత్వత శబ్దం భాగవత శబ్దానికి సమానార్థకంగా వాడబడింది. ఈ ప్రకారంగా సాత్వత శబ్దము యొక్క ప్రయోగం యీ గ్రంథంలోనే అంతర్భావాన్ని పొందినది. భగవతః భక్తాః భాగవతాః ఈ వ్యుత్పత్తిని బట్టి భాగవతులు, సాత్వతులు ఒకే అర్థంలో వాడబడ్డారు. అనగా భక్తులే యీ రెండు శబ్దాల చేత వ్యవహరింపబడ్డారు.

భాగవతులన్నా, సాత్వతులన్నా ఒక్కరే అని ఫలితార్థం.

ఇదే సందర్భంలో ఇంద్రుని వెంట వచ్చిన కామధేనువు కూడా తన క్షీరధారలను కురిపించి కృష్ణుని స్తుతించినది.

*శ్లో॥ నందకుమారక మనఘం నౌమి పరానందఘనమఖిలవంద్యం*
*సుందరసరసిజ నేత్రం మందస్మిత సాంద్రచంద్రికా చంద్రమ్ ॥ -2*

'మందస్మిత సాంద్రచంద్రికాచంద్రం' అనేది ఇక్కడ కృష్ణుని పరంగా వేయబడిన విశేషణం. ఇందలి శబ్దాలంకారము, అర్థాలంకారములు రమణీయములు.

'ద్ర' అనే అక్షరముల యొక్క ఆవృత్తి వృత్యనుప్రాసము. చిరునవ్వు అనెడి వెన్నెలకు చంద్రుడైనవాడు అనేది రూపకాలంకారము.

"గోపరమణీనయనకుముదచంద్రవదన" -3 గోపికల యొక్క కన్నులనెడి కలువలను వికసింపచేయు చంద్రుని వంటి ముఖం కలవాడు అని అర్థం. ఇక్కడ రూపకాలంకారము భాసమానమైనది.

నీ గానానికి చెట్లు, మృగాలు, పక్షులు, గోవులు పరవశిస్తూ ఉండగా స్త్రీలు కరగకుండా ఎలా ఉంటారు? నీవు మమ్ములను ఆదరించనిచో మన్మథుని బారినపడి చనిపోవుట ఖాయం. ఇలా దీనాలాపాలాడిన గోపికలపై కరుణబూని కృష్ణుడు వారలతో రమిస్తాడు.

---

1. *ధూళిపాళ శ్రీరామమూర్తి, పోతనకృత శ్రీమదాంధ్ర మహాభాగవతానుశీలనము, పుట-454*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 19 : పుట-227*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 5 : 8 : పుట-228, 229*

మత్తేభం :

*కరుణాలోకములం బటాంచల కచాకర్షంబులన్మేఖలా*
*కరబాహుస్తనమర్శనంబుల నఖాంకవ్యాప్తులన్, నర్మవా*
*క్పరిరంభంబుల మంజులాధరసుధాపానంబులంగాంతలం*
*గరఁగించెన్ రతికేళిఁగృష్ణుఁడు గృపం గందర్పుఁబాలార్చుచున్ –1*

కృష్ణుడు గోపికలతో యమునాపురి ప్రదేశాలకు వెళ్తాడు. అక్కడ రాసక్రీడ జరుపుతాడు.

ఉత్పలమాల :

*పాయనిగేహశృంఖలలఁబాసి నిరంతర మత్పరత్వముం*
*జేయుచునున్న మీకుఁబ్రతిసేయయుగంబులనైన నేర; నన్*
*బాయక కొల్చుమానసము ప్రత్యుపకారముగాఁ దలంచి నా*
*పాయుటఁ దప్పుగాఁగొనక భామినులార ! కృపన్ శమింపరే ! –2*

## విరహ గోపికా :

తీర్థుల వారి గ్రంథంలో యీ గోపికా విరహఘట్టం రసవంతంగా సాగింది. శరత్కాలము ప్రారంభమైంది అని తెలుపుతూ తీర్థుల వారు యీ భాగాన్ని ప్రారంభించారు.

*శ్లో॥ శారదేవ శరదాగతాస్వయంతారకోదయ విశేషభాసురా*
*వారితేఘసలిలేఘ ధీమతాంస్మారితార్థమవభాసయం త్యసౌ ॥ –3*

శరదృతువు శారదవలె ప్రవేశించింది అని ఆయన చక్కని పోలిక చెప్పారు. ఆ శరత్కాలంలో శ్రీకృష్ణుడు బృందావనంలో విహరిస్తూ వేణుగానం ఆలపిస్తాడు. ఇక్కడ శ్రీకృష్ణునకు వేసిన విశేషణాలతో తీర్థుల వారి వర్ణనాశైలి సరసంగా సాగింది.

గద్యం : తత్రభగవతి శ్రీనివాసే పరిపాలితనిజదాసే సంతతానంద కళ్యాణగుణగణనవరత్నరత్నాకరే సరళ మురళీనాదముదంచిత వివిధగీత సముద్ఘోషమందగమనో ల్లాస వివిధ విలాస బహుతరకల్లోల జాలే.... భువనసుందరీ శ్రీకృష్ణే విహరతి తస్మిన్ వ్రజయువతి మనోనద్యః స్యందమానాః సమభివ్యక్త శారదవిమలీకృతవృత్తి విశేషాను భవరసాఢ్యాః తదైకరస్య మఖిలషంత్య స్త్వరమావివిశుః ఇత్థంచ తాసాంవచో విలాసాః ప్రాదుర్బభూవుః ॥ – 4

---

1. *పోతన భాగవతం, 10 : 1003 : పుట–227, 228*
2. *పోతన భాగవతం, 10 : 1080 : పుట–245*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 3 : పుట–233*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 4 : పుట–233*

ఇక్కడ కృష్ణుని సముద్రంగాను, ఆ గానానికి మురిసి ఆయన వద్ద చేరిన గోపికలను నదులుగాను చెప్పి చక్కని ఉపమాలంకారాన్ని నిరూపించారు.

గోపికలు గోవిందుని భజించుటకు రండని ఒకరినొకరు పిలుచుకున్నారు.

*శ్లో॥ భో భో వ్రజపురనార్యః శారదసమయం పరం శివం మత్వా*
*కృపయా తస్యభజామో గోవిందం ప్రాహురితి సదాన్యోన్యమ్ ॥ –1*

శరత్కాలాన్ని 'పంకేరుహపరాగవిభూతిధవళం' అని తీర్థులవారు విశేషిస్తారు. పద్మ పరాగముల యొక్క వ్యాప్తిచే స్వచ్ఛమైన శరత్కాలమని అర్థం. శరత్కాలంలో నదులు బురద విరిగి స్వచ్ఛమవుతాయి. తీర్థుల వారు 'పాపపంకశోషణ పటుతర రవికిరణం' అని వర్ణించారు. పోతనగారి వలెనే తీర్థులవారు కూడా శరత్సమయాన్ని వర్ణనాభరితంగా మనోహరంగా వర్ణించారు. పండితులందరూ ఆహ్లాదంతో శరత్కాలాన్ని వర్ణిస్తారు. 'పండిత మండల పరమాహ్లాదకరం' అనడం చేత తాను కూడా పండితుడనే అని సూచించుకోవడం గమనించాలి. 'ఈశోపమశారదసమయవిలసితం' అనే విశేషణం చేత ఈ శరత్కాలమంతా పరమేశ్వర సుందర స్వరూపానికి ప్రతిబింబంగా భాసిల్లి పరమేశ్వరుడు ప్రకృతిమయుడు అని నిరూపితం చేశారు.

*కీర్తన : శంకేశంకరం శారదసమయం*
*పంకేరుహపరాగవిభూతిధవళం*

*చరణం: పాపపంకశోషణపటుతర రవికిరణం*
*పరిహృతాపరిమిత ఘనావరణం*
*కపటకేతకకుసుమభార విరహిణం*
*కలితతారక గణస్ఫటికాక్షాభరణం*

*చరణం: పరమపురుష సురతిపతి కామవిదూరం*
*పండిత మండల పరమాహ్లాదకరం*
*వరహంసగతి విఘ్నపాటనచతురం*
*వాంఛిత సముదిత ఫలవిధాతారం*

*చరణం: నిర్మల రసపూర నిరుపమ గంగం*
*నిఖిల మానినీ జనమానవిభంగం*
*శర్మద శశిధర సరసోత్తమాంగం*
*సముదిత గోవింద కృతబహుసంగం –2*

---

*1. పోతన భాగవతం, 6 : 5 : పుట–237*

*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 2 : పుట–237, 238*

చరణం: ఇతిగోపవధూగీతమిదమతిలలితం
ఈశోపమశారదసమయవిలసితం
యతివర శివనారాయణతీర్థ ఫణితం
యాదవాబ్ధిజరత్న సమ్మిళితం -1

ఆ శరదృతువు గోపికలను కృష్ణలగ్న మానసులను చేసింది. ఒక గోపిక బృందావనమునకు పోదామని వేరొక గోపికను పురిగొల్పుతుంది.

శ్లో॥ కాపి గోపీపరం కాంతం కామచార ఫలోదయమ్ ।
గంతు కామేతరాం గోపీం త్వరయం తీదమాహతామ్ ॥ -2

ఈ సందర్భంలో 'కామచారఫలోదయం' అనే విశేషణం కృష్ణపరంగా వాడబడింది. స్వేచ్ఛావిహారమనే ఫలాన్ని కలుగజేసేవాడు అని దీని అర్థం. ఇంద్రియ సంబంధం లేని ఆత్మానందం పొందడానికి శ్రీకృష్ణుడే శరణ్యుడని గోపిక ద్వారా యిలా తీర్థులవారు చెప్పించారు.

గోపిక శ్రీకృష్ణునితో ఓ దయామయా ! నీవు సాక్షాత్తు నరసింహుడవు అని పరమానందంతో పలికినది.

కీర్తన : కరుణయావలోకయమాం శ్రీనృసింహ
అ॥ప॥ శూరాసురసంహార శోభనాద్రి శ్రీనృసింహ

చరణం: పరిపూర్ణదయారస పాథోధిబృంహణ
ప్రహ్లాద చంద్రోదయ శ్రీనృసింహ
నిరసితతామస నిర్విశేషమానస
గురుతరవీరశ్రీ గూఢసుగుణాలయ

చరణం: పాతక మహాటవీ పజ్విలకోపానల
భక్తచందనశీతల శ్రీనృసింహ
ఉత్తుంగసుకిరీట ఉన్నతకేయూర
మత్తచిత్తమాతంగ మర్దనమహాబల

చరణం: త్రైగుణ్యఫలాతీత తత్త్వఫలాత్మక
తాపజలధితారక శ్రీనృసింహ
శ్రీగురుకరుణయా శ్రితభక్తిసుధారస
శ్రీనారాయణతీర్థ శ్రేయోవిధాయక -3

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 2 : పుట-237, 238
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 7 : పుట-240
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 7 : పుట-254

'ప్రహ్లాద చంద్రోదయ' అనే విశేషణానికి రెండు అర్థాలున్నాయి. 1. ఆహ్లాదమును కలిగించు వెన్నెలను వెదజిమ్మువాడా! 2. ప్రహ్లాదుడను వానికి చంద్రుని వలె ఆహ్లాదమును కలిగించువాడా! ఇలా రెండర్థాలలో వాడటం కవితా చమత్కారం. 'మత్తచిత్తమాతంగమర్దన మహాబల' అనే దానికి మత్తిల్లిన మానవులనెడి మదపుటేనుగులను మర్దించే బలసంపన్నుడని అర్థం. ఇక్కడ హిరణ్యకశిపుని సంహార వృత్తాంతం వ్యంగ్యోక్తిగా సూచింపబడింది.

ఇక్కడ కవి వర్ణించిన రూపం కృష్ణాజిల్లా, నూజివీడు మండలం, ఆగిరిపల్లి గ్రామంలో వెలసి యున్న శ్రీ శోభనాద్రి నరసింహుడు. ఇలా కవి యొక్క ప్రాంతీయాభిమానం పలు కీర్తనలలో ప్రస్ఫుటమైంది.

మరొక గోపిక శ్రీకృష్ణునితో ఆదరపూర్వకముగా యుక్తియుక్తముగా పలికింది.

*కీర్తన : భూయో భూయో యాచేంజలినా*

*అ॥ప॥ భూమన్త్వయి మేదాస్యం దేహి*

*చరణం: నిమిషార్థమపి తవదర్శనవిధురా*
*నింద్యాహి తను రేషా*
*తామరసేక్షణ తవపాదకమలే*
*తనుతాం మమతనో రతులాం -1*

శ్రీ భూమస్వరూపుడా ! నీ దాస్యము నాకు అనుగ్రహింపుము. క్షణమాత్రమైననూ నిన్ను చూడక బ్రతుకజాలను. ఈ అరణ్యము కూడా.

*చరణం: కాంతం కాంతారమపి తవయోగే*
*కమలేక్షణమన్యే*
*కాంతారం గృహమపి తువియోగే*
*కరుణాతరుణీమయితవభవతు -2*

నీ సంబంధము కలిగినప్పుడు అడవి కూడా నాకు అందముగానే కనబడుతుంది. నీవు లేని గృహము నాకు కాంతారము వంటిది.

సంబోధనములోని భూమన్ శబ్దము నిరక్షరకుక్షి అయిన గోపిక నోటి వెంట వెలువడటం సముచితమా అనిపిస్తుంది. అయితే ఎన్నో మార్లు భక్తజనుల చేతను, మునిగణము చేతను స్తుతింపబడ్డ పరమాత్మ స్వరూపమును గూర్చి ఎన్నో సార్లు విన్న సంస్కారంతో ఆ గోపిక యిలా సంబోధించడం సముచితమే అవుతుంది అని అనుకుంటే సందేహము కలుగదు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 8 : పుట-256*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6: 8 : పుట-256, 257*

ఓ సఖీ ! మనమేమి చేయగలము? ఈ స్వామి ఏవో వక్రోక్తులు పలుకుతున్నాడు. ఏవేవో ఆటంకములు చెప్పుచున్నాడు. అరనిమిషం కూడా సహస్రయుగములుగా గడుచుచున్నది. రోజంతా ఇక్కడ పడిఉన్నా నాపై కరుణచూపుట లేదు. ఇల్లు, పతిపుత్రాదుల మీద వ్యామోహం వీడి యీయన వేణుగానం మీద మోహంతో యిక్కడకు వచ్చాను. ఈయన ఎట్లు దయ తలచునో కదా! అని మరొక గోపిక ప్రక్కనున్న చెలికత్తెతో మిక్కిలి ఆతురతతో అన్నది.

ఇలా అనేక విన్నపాలు చేసుకున్న గోపికలను కరుణించి కృష్ణుడు వారిని తనవారిగా స్వీకరించాడు. వారంతా ఆయనను పరివేష్టించి భోగభావంతో కాకుండా త్యాగభావంతో కొనియాడారు. గోపికా కృష్ణులతో రాజిల్లుచున్న బృందావనము తీర్థుల వారి అలంకారశోభతో మరింత శోభిల్లినది.

*శ్లో॥ మధ్యేకృష్ణం మరకతమణిచ్ఛాయమిచ్ఛావిహారం*
*కృత్వాగోప్యః కువలయదృశో నాయకం వేష్టయంత్యః*
*గాయంత్యస్తం సరసవచసాదాస్యభావం భజంత్యః*
*బృందారణ్యే మణయఇవతాః పద్మరాగా ఇవాసన్ ॥ -1*

గోపికలంతా అరణ్యంలో పుట్టిన పద్మరాగమణులా అన్నట్లుగా ఉన్నారనడంలో 'అభూతోపమ' అలంకారమయింది. అరణ్యంలో మణులు పుట్టుట అసంభవము కనుక ఫలోత్ప్రేక్ష కూడా భావించవచ్చు.

వేదములనే పద్మము నందలి ఆనందమనే మధువువలె ఒప్పుచున్న కృష్ణుని చూచి గోపికలనెడి తుమ్మెదలు ఆ మన్మథుని గ్రోలి ఆ మత్తులో గానం చేశారు.

*శ్లో॥ నిగమబృంద సరోరుహసంగతం*
*నిఖిలలోకమధుస్వసుఖాత్మకమ్*
*మధురిపుంప్రతిలభ్యచ వల్లవీ*
*మధుకరాస్సుకరం జగురిత్యలమ్ ॥ 2*

ఇలా చెప్పి తీర్థులు మరొక వ్యాసులే అయినారు. ఎందుకనగా వ్యాసులవారు భాగవతాదిన గ్రంథ ప్రశస్తి చేస్తూ...

*నిగమకల్పతరోర్గళితంఫలం*
*శుకముఖాదమృతద్రవసంయుతం*
*పిబతభాగవతం రసమాలయం*
*ముహారహో రసికాభువిభావుకాః - 3*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 16 : పుట-260, 261*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 17 : పుట-261*
3. వ్యాసభాగవతం, 6 : 80 : పుట-69

అనే అత్యుత్తమ శ్లోకాన్ని చెప్పారు. దానితో ఇది సమఉజ్జీగా ఉండడం విశేషం. ఇలా స్వీకరించిన కృష్ణుడు ఆ గోపికలతో రాసనృత్యం సాగించాడు.

*శ్లో॥ నర్తకీభిర్వనే కాభిః మండలేవిచరిష్ణుభిః ।*
*యత్రైకోనృత్యతినటః తద్వైహల్లీసకంవిదుః ॥ -1*

నాట్యకత్తెలు మండలాకారంగా తిరుగుతూ ఉండగా మధ్య ఒక నటుడు మాత్రమే ఉండి చేసే నాట్యం హల్లీసకం.

*పృథుం సువృత్తం మసృణం వితస్తికాయోన్నతం కౌవినిభన్యశంకుమ్ ।*
*ఆక్రమ్యపద్భ్యాం ఇతరేతరంతు హస్తైర్భమోకయంఖలురాసగోష్ఠీ ॥ -2*

పెద్దదై గుండ్రముగా ఉన్న భూమిపై 12 అంగుళాల ఎత్తుకు కాళ్ళు ముదుస్తూ ఒకరి అడుగులలో ఒకరు అడుగులు వేస్తూ నిటారుగా నిలబడి చేసే నాట్యం రాసలీల.

*శ్లో॥ నటైర్గృహీత కంఠానాం అన్యోన్యాత్తకరశ్రియామ్ ।*
*నర్తకీనాం భవేద్రాసః మండలీభూయనర్తనమ్ ॥ -3*

ఒక నటి ఒక నటుడు మండలాకారంగా ఏర్పడి నర్తకీమణుల కంఠములను నటులు పట్టుకొని ఉండగా నర్తకీమణులు ఒకరి చేయి ఒకరు పట్టుకొని చేసే నృత్యం రాసనృత్యం.

*శ్లో॥ అంగనామంగనా మంతరేమాధవో*
*మాధవం మాధవం చాన్తరేణాంగనా*
*ఇత్థమాకల్పితే మండలే మధ్యగః*
*సంజ్ఞగౌవేణునా దేవకీనందనః -4*

అని రాసక్రీడను లీలాశుకులు శ్రీకృష్ణ కర్ణామృతంలో అభివర్ణించారు.

ఆ శ్రీకృష్ణుడు వారి మధ్య నిలిచి వేణుగానామృతాన్ని వర్షిస్తూ ఉండగా గోపికలు గానం చేస్తూ ఆయన చుట్టూ నాట్యం చేశారు అని చెప్పి తీర్థుల వారు 6వ తరంగాన్ని ముగించారు.

---

1. *ధూళిపాళ సూర్యనారాయణమూర్తి, శ్రీకృష్ణ లీలారహస్యామృతము, పుట-186*
2. *ధూళిపాళ సూర్యనారాయణమూర్తి, శ్రీకృష్ణ లీలారహస్యామృతము, పుట-187*
3. *ధూళిపాళ సూర్యనారాయణమూర్తి, శ్రీకృష్ణ లీలారహస్యామృతము, పుట-187*
4. *లీలాశుకుడు, శ్రీకృష్ణ కర్ణామృతము, 2 : 35 : పుట-147*

# రాసక్రీడాభివర్ణనము

రాసక్రీడా దృశ్యమును ధూళిపాళ శ్రీరామమూర్తి గారు తాను రచించిన 'శ్రీమదాంధ్ర భాగవతానుశీలన' అను గ్రంథములో యీ విధంగా వర్ణించారు.

రాసక్రీడా దృశ్యము దేవతలు చూచి యానందించినట్టిది. పోతన భాగవతంలో 10పూ - 1081 నుండి 1097 వరకు రాసక్రీడా దృశ్యము వర్ణితము. 1081 పెద్ద గద్యము. ఈ గద్యము నందు ఉపమానుప్రాసాద్యలంకారములు దృశ్య సౌందర్యము నావిష్కరించుచు cబోతన గారి భావనావైశద్యమునకు నిదర్శకములుగా నున్నవి. బంధములు, తానకములు, పాదచారి పార్థివచారి వ్యోమచారి విశేషములు, కరభావములు, ముద్రాలంకారములు, జానుమండల భేదములు, దైవమండలములు, భ్రమణములు, కరణములు, వీక్షణములు, శిరోభావములు, నంగహారములు మొదలైన నృత్య విశేషముల లక్షణ పరిజ్ఞానము చేతc గాని రాసక్రీడా దృశ్య సౌందర్యము రూపుకట్టదు. ఈ వర్ణనము నందు cబోతనగారు తన నృత్యలక్షణ పరిజ్ఞానమును వెలయించెను. ఈ గద్యమంతయు నొకయెత్తు, దీని తరువాత వ్రాసిన పద్యమొక ఎత్తు.

*నడుములు వీcగియాడచిఱునవ్వులు నివ్వటిలంగహారముల్*
*నుడివడమేఖలల్ వదలcజూడ్కి మెఱుంగులు పర్వఘర్మముల్*
*పొడమcగురుల్ చలింప శ్రుతిభూషణముల్ మెఱయన్ సకృష్ణులై*
*పడcతుకలాడుచుం జెలcగి పాడిరి మేఘతటిల్లతాప్రభన్* -1

ఈ పద్యమునకు మూలమిది

*పాదన్యాసైర్భుజవిధుతిభిః వసత్మైర్భ్రూవిలాసైః ।*
*భజ్యన్మధ్యైశ్చలకుచతటైః కుండలైర్గండలోలైః ॥*
*స్విద్యన్ముఖ్యః కబరరశనాగ్రంథయః కృష్ణవధ్వోః ।*
*గాయంత్యస్తం తడితివతామేఘచక్రే విరేజుః ॥* -2

మూలము నందలి భుజవిధుతులు (భూవిలాసములు, చలకుచపటములు తెనుcగు సేతలో లుప్తములైనవి. వాని స్థానము నందు హారముల్ నుడివడుట, చూడ్కి మెఱుంగులు, పర్వుటసంగృహీతములైనవి. కాని వీగిcయాడ, నివ్వటిలంగ, వదల, పర్వ, జలింప, మెఱయన్ మొదలైన క్రియాపదములు రాస వైభవమును ప్రత్యక్షీకరించుచున్నవి. మూలము నందు విశేషణ ముఖమున నుక్తమగు భావము తెనుcగు సేత యందుc గ్రియాముఖమై విప్పారినది. సంస్కృతమున నట్లు చెప్పుట సొగసు, తెలుcగున నిట్లు సెప్పుట సొగసు.

---

1. *పోతన భాగవతం, 10 : 1084 : పుట-250, 251*
2. *వ్యాసభాగవతం, 33 : 8 : పుట-348*

సీసం॥ చెలువ యొక్క తెచెక్కుజెక్కుతో మోపిన విభుఁడు తాంబూల చర్వితమువెట్టె
నాడుచునొకలేమయలసినఁబ్రాణేశుఁ డున్నతదోః స్తంభమూఁతసేసెఁ
జెమరించి యొక భామ సేరినఁ గొనగోరఁ జతురుఁడు కుచఘర్మజలము వాపె
నలకంబులొక యింతికలిక చిత్రకరేఖ నంటినఁ బ్రియుఁడు పాయంగదువ్వెఁ

ఆ॥వె॥ బడఁతి యొకతె పాడిపాడి డస్సిన యధరామృతమున నాథుఁడాదరించె
హారమొక్క సతికి నంసావృతంబైనఁ గాంతుడురముఁ జేర్చి కౌఁగిలించె -1

ఈ పద్యమునకు మూలము ఈ శ్లోకము :

కస్యాశ్చిన్నాట్య విక్షిప్త కుండల త్విషమండితం ।
గండంగండే సందధత్యా అదాత్తాంబూల చర్వితమ్ ॥ -2

ఈ యొక్క శ్లోకమునకు సీసపద్యము నందలి తొలి చరణము తెనుఁగు సేత తక్కిన పద్యమంతయు ఁబోతనగారు స్వతంత్రముగా రచించినదే. మూలశ్లోకము నందు ధ్వన్యమానమగుచున్న పరమేశ్వరుని దివ్యశృంగార భావము పోతనగారు విశేషాధానము చేసి యుద్దీప్తము గావించినాఁడు. రాసక్రీడా గతమైన సంభోగ శృంగారమందు నను భావపౌష్కల్యముచే ఁబరిపుష్టమై ప్రతీయమానమగుచున్నది. శ్రీకృష్ణుని శృంగార చేష్టా రామణీయకము పరమసుకుమారముగా నీ పద్యమునందుంజిత్రితమైనది.

బృందావనమున వేణుగాన లోలుఁడైన శ్రీకృష్ణుని భువనమోహనమూర్తి చిత్రణము పోతనగారి భావకత్వమునకుఁ బరాకాష్ఠ.

బర్హాపీడం నటవరవపుః కర్ణయోః కర్ణికారం
బిభ్రద్వాసః కనకకపిశంవైజయంతీంచమాలాం
రంధ్రాన్వేణోరధరసుధయాపూరయన్ గోపవృందైః
బృందారణ్యం స్వపదరమణం ప్రావిశద్గీత కీర్తిః ॥ -3

శ్రవణోదంచిత కర్ణికారకములతో స్వర్ణాభచేలంబుతో
నవతంసాయితకేకి పింఛకముతో నంభోజ దామంబుతో
స్వవశుండై మధురాధరామృతముచే వంశంబుఁ బూరించుచున్
ఉవిదా ! మాధవుఁడాలవెంటవనమందొప్పారెడిం జూచితే ! -4

---

1. పోతన భాగవతం, 10 : 1095 : పుట-251, 252
2. వ్యాస భాగవతం, 10 : 33 : పుట-13
3. వ్యాస భాగవతం, 10 : 21 : పుట-5
4. పోతన భాగవతం, 10 : 771 : పుట-177

మూలము నందలి గోపబృందమునకు బదులు తెనుఁగున గోబృందము స్వీకృతమగుటయు, నలంకరణ సామాగ్రి'తో'నని తృతీయాంతములుగా నిబంధితమగుటయు, మూలశ్లోకమునందు జిత్రితమైన మూర్తి సౌందర్యమును దళతళలాడించుచున్నవి. పద్యమందలి రచనచేత స్వభావోక్త్యలంకారముద్దీపితమైనది. మూలము నందు శుకవర్ణితమైన యీ మూర్తిసౌందర్యమును గోప్యుదీరితమును గావించి విభావముఖమున భావోదయమును ధ్వనింపఁజేసి పోతన దృశ్యవైభవమును రమణీయతరము చేసినాఁడు. దీనికనుకూలముగా బ్రహ్మగాంధర్వలోలుఁడైన శ్రీకృష్ణమూర్తి దివ్యచిత్రణమును స్వతంత్రముగా ముందే చేసినాఁడు.

*సీ॥ కర్ణావతంసిత కర్ణికార ప్రభగండ భాగద్యుతిఁ గడలుకొలుప*
*భువనమోహనమైన భ్రూవిలాసంబుతో వామభాగానతవదనమొప్ప*
*నపసవ్యకరమృదులాంగుళీచాతురిషడ్జధ్వనికి మర్మసరణిఁ జూప*
*డాకలిమీఁద నడ్డము సాఁచినిల్పిన పదనఖద్యుతి భూమిఁ బ్రబ్బికొనఁగ*

*తే॥గీ॥ మౌళిపింఛము కంఠదామమును మెఱయ విలసిత గ్రామముగ నొక్క వేణువందు*
*బ్రహ్మగాంధర్వ గీతంబు పరఁగఁజేసె, జతురనటనమూర్తి గోపాలచక్రవర్తి –1*

పద్యమందలి స్వభావోక్తి యీ గోపాలచక్రవర్తి రూపసౌందర్యము నున్మీలితము గావించుచున్నది. ఈ గోపాల చక్రవర్తి బ్రహ్మ గాంధర్వ గీతమును వినుచు సృష్టి యంతయుఁ దన్మయమై సమాధ్యవస్థను జెందిన స్థితిని 'బోతనగా రిరువది యైదు పద్యములలో ఁజిత్రించినాఁడు. ఈ ఘట్టము నందు ఁబోతనగారు చూపిన మూలాతిరిక్త శిల్పవైభవమును పేఱ వ్యాఖ్యానించితిని. ఇచ్చట ప్రస్తుతమైనది రూపచిత్రణము. మురళి పూరించుచున్న గోపాలకృష్ణుఁడు తద్గానాకృష్టలై గుంపులు గుంపులుగా నరుదెంచు గోపయువతులు, కృష్ణుని మేఘమని భ్రమించి యాడు నెమళ్ళు, విమానములందు ఁబోవుచు మూర్ఛితలగుచున్న యమరాంగనలు, మేతలు మాని మేనులు మఱచి శ్రీకృష్ణుని వంక మెత్తగా ఁజూచుచున్న మృగకదంబములు పాలు త్రాగుచుఁ ద్రాగుచు మానియట్లే శ్రీకృష్ణుని వంకఁ జూచుచున్న బాలవత్సములు, నెమరువేయక మోరలెత్తికొని కన్నులప్పగించి చూచుచు నానందాశ్రవులోడ్చుచున్న గోవులు, వృక్షశాఖలపై శ్రీకృష్ణమూర్తి దివ్యదర్శన ధాన్యములచే ఁజొక్కుచున్న పక్షులు, వేణుగానమాకర్ణించి పొంగి సుళ్ళు దిరుగుచు శ్రీకృష్ణ పాదపద్మాలింగనము సేయుచున్న నదులు, ఆతపత్రమై పుష్పవృష్టి కురియు మేఘము, పుష్పఫలములర్పించు కిరాతస్త్రీలు మన కండ్ల యెదుటనొక దివ్యదర్శనమిచ్చి మైమఱపు ఘటించుచుందురు. ఈ గోపాలచక్రవర్తి వేణుగాన దృశ్య చిత్రణమందలి వైభవమంతయు నీక్రిందిపద్యము పట్టి యిచ్చుచున్నది. ఈ ఘట్టమునకంతకు నుపసంహారకముగా 'అస్పందనం గతిమతాం పులకస్తరూణా' మని మూలమునందున్న మాట. దానికిఁ బోతనగారు –

---

1. *పోతన భాగవతం, 10 : 769 : పుట–176*

*గిరులెల్ల జలములయ్యెం, దరులెల్లను బల్లవించె ధరణి గగన భూ*
*చరులెల్లను జొక్కిరి హరి, మురళీరవామృతముసోకి ముద్దియకంటే -1*

యని వ్రాసెను. మూలభావమును బోతనగారెంత చక్కగా విశేషించి పరిపూర్ణముగావించెనో యీ యుదాహరణము చెప్పును. దృశ్యగత సర్వాంశ సంగ్రహణమీపద్యమునందున్నది. రసపారవశ్యమున్నది. ఈ దృశ్యము నందు రూపసౌందర్యమున కుత్కర్షాధాయకము గోపికల తన్మయతావిష్కారము, గోపికా ముఖమున వర్ణితమగుటచే వారి మధుర శృంగార భావనచే నీ దృశ్యమంతయు నలంకృతమై వెలుఁ గొందుచున్నది. - 2

## రాసక్రీడా వర్ణనము

రాసక్రీడాభి వర్ణనమును గూర్చి శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి గారు తాను రచించిన 'పోతనకృత శ్రీమదాంధ్రమహాభాగవతానుశీలనము' అను గ్రంథములో యీ విధంగా వర్ణించారు.

మూలమున రాసక్రీడా జలక్రీడలు చాలా సంగ్రహముగా వర్ణితములైనవి. పోతనగారు వీనిని విస్తరించి వర్ణించినాఁడు. రాసక్రీడా వర్ణనము నందుఁ బోతన తన నాట్యశాస్త్ర పాండిత్యము నంతయు గ్రుమ్మరించినాఁడు. రాసబంధ భేదములు, తానకవిశేషములు, పాదచారి పార్థివచారి వ్యోమచారి భేదములు, కరభావములు, ముద్రాలంకారములు, జానుమండల దైవమండల భేదములు, భ్రమణకరణ వీక్షణ విశేషములు, శిరోభావములు, నంగహారములు, రేచములు మొదలగు ననేక నాట్యశాస్త్ర విశేషములను జేర్చి రాసమును రమణీయముగా వర్ణించినాఁడు. రాసక్రీడానంతరము చల్లని గాలిని వర్ణించి యీ ఘట్టమునకు 'గ్రొత్తయందమును దెచ్చినాఁడు.

జలక్రీడలను గూడ ననేక విశేషములను జేర్చి విస్తరించి వర్ణించినాఁడు. జలపక్షులను దోలుటలు, తుమ్మెదలను జోపుటలు, నీరు చిమ్ముటలు, సరాగములాడుటలు, సోలుటలు, ద్రుళ్ళుటలు, దాటుటలు, నిలువరించుటలు మొదలైన క్రీడా విశేషణములతో దృశ్యచిత్రణ సమర్థములైన యలంకారములతో నీ వర్ణనము హృదయావర్జకముగా నున్నది. *-3*

రాజేంద్రా ! నారాయణుని చరణారవింద పరాగముల ధ్యానయోగ సామర్థ్యం చేత సనక సనందనాదులైన యోగీశ్వరులు కర్మబంధాలు వీడి ఎట్టి కట్టుబాటులు లేక ఇచ్చకొద్దీ మెలుగుతుంటారని చెబుతూ ఉంటారు. అటువంటప్పుడు క్రీడార్థమై శుద్ధసత్త్వమయ శరీరం స్వీకరించిన ఆ దివ్యమంగళ విగ్రహుడు ఎలా నడుచుకుంటే నేమి? ఏమి చేసినప్పటికీ ఆయనకు బంధాలు లేవు అని భావము.

---

*1. పోతన భాగవతం, 10 : 794 : పుట-182*

*2. ధూళిపాళ శ్రీరామమూర్తి, శ్రీ మదాంధ్ర భాగవతానుశీలన, పుట-276*

*3. ధూళిపాళ శ్రీరామమూర్తి, శ్రీ మదాంధ్ర భాగవతానుశీలన, పుట-300*

ఇలా చెప్పి పోతన చివర శుకుని మాటలుగా యిలా అంటారు.

*ఆ॥వె॥ గోపజనములందు గోపికలందును, సకల జంతులందు సంచరించు*

*నా మహాత్మునకుఁ బరాంగనలెవ్వరు ?, సర్వమయుఁడు లీలసలిపెఁ గాక ?* –1

గోపాలకులలో, గోపికలలో, తక్కిన జీవరాశులలో ఎవ్వడు అంతరాత్మయై వ్యవహరిస్తున్నాడో ఆ మహనీయుడికి పరాంగనలెవ్వరు? క్రీడార్థమవతరించిన ఆ సర్వవ్యాపి. ఇలా క్రీడించినాడే కానీ ఇందులో దోషం లేదు అని భావము.

తీర్థుల వారు రాసక్రీడాభివర్ణనానికి ఒక తరంగం పూర్తిగా అంకితం చేశారు. అనేక జన్మలలో ఆ గోపికలు తీవ్ర తపస్సు చేయగా యీ జన్మలో వారిని తరింపచేయడం కోసం అవతరించినదే శ్రీకృష్ణావతారం.

*శ్లో॥ అనేక జన్మసాహస్రతపసా పరితోషితః ।*

*ఆవిర్భూత స్సభగవాన్ తాసుగోపీషుజన్మని ॥* –2

మందారాది తరుబృందములతో నిండిన బృందావనంలో విహరిస్తూ కాళిందీనది వాలుకలపై వేణుగానం చేస్తున్న శ్రీకృష్ణుని దగ్గరకు వల్లవీజనం ప్రేమతో రాగా వారిని చూసి ఆకాశంలో అప్సర స్త్రీలు ఆశ్చర్యపడ్డారు. కృష్ణుడు ఆత్మతత్త్వాన్ని ఉపదేశింపగోరి గోపికలతో సంభాషణకు ఉపక్రమించాడు.

గద్యం : మదనమూర్తిర్వాసుదేవో గోపీభిస్సహరాసక్రీడామహోత్సవారంభ సంభ్రమచేతాః గోపీభిః సార్థమాత్మతత్త్వముపదిశన్నిదమాహ *–3*

## రాధిక – రాధ

నారాయణతీర్థుల వారు రచించిన "శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ" గ్రంథమును ఉయ్యూరు సంస్థాన ప్రభువులు 'శ్రీ రాజా వేంకటాద్ర్యప్పారావు బహద్దర్' గారు ఆంధ్రీకరించగా దానికి పీఠికానాటికను వ్రాసిన శ్రీమతి వేంకట రమాదేవి గారు బ్రహ్మ, సావిత్రి, గాయత్రి, సరస్వతుల సంభాషణా రూపంలో రాధికా రాధల యొక్క జన్మ వేరనియు, వారిరువురు ఒకరు కాదనియు వచించారు. –4

---

1. *పోతన భాగవతం, 10 : 1109 : పుట–256*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 4 : పుట–266*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 7 : 5 : పుట–266*
4. శ్రీమతి వేంకట రమాదేవి, *శ్రీకృష్ణ లీలా తరంగిణీ,* పీఠికానాటిక, పుట–2

## బ్రహ్మ సావిత్రితో పలికిన పలుకులు :

ఇతర పురాణములందు శ్రీ రాధాదేవి పవిత్ర చరిత్ర వేదవ్యాసులు వివరముగా వర్ణించియే యుండిరి. ఆమె ఆది గోపికయగుట చేతను, ఆధ్యాత్మిక విచారణమే అందు ప్రధాన విషయమగుట చేతను, శ్రీమద్భాగవతమున గోపీకథా కథనమే శ్రీరాధాదేవి యొక్క అవతార సూచనగా నెంచి, వేదవ్యాసులు అందును గూర్చిన ప్రత్యేక ప్రశంస మానిరేమో !

## బ్రహ్మ గాయత్రితో పలికిన పలుకులు :

గోలోకాధిదేవియు, శ్రీకృష్ణానపాయినియునౌ శ్రీ రాధాదేవి, భూలోకమున గోకులమున, వృషభాను కళావతులకు పుత్రికగా నవతరించి, శ్రీకృష్ణావతార మహనీయ కార్యక్రమమున తన భాగము నెఱవేర్చి యుండుట మీరెఱుగుదురు.

## బ్రహ్మ సరస్వతితో పలికిన పలుకులు :

బృందావననందగోపునికి పిత్రీయ సోదరియు, సుచంద్రకీర్తిదేవులకు పుత్రికయు, గోపీనాయికయు, రాపాణుడను గోపీనాయకుని భార్యయునగు రాధికయను మఱియొకతె – వృషభానుపుత్రికయైన రాధాదేవి కంటే వయసున పెద్దది – తత్కాలమున గోకులముననుండుటయు మీకు తెలియును కదా.

ఈ రాధికా రాధలకు వయసురీత్యా తారతమ్యము ఉన్ననూ, పోలికకు మాత్రమే ఏకరీతిగా ఉండుటచే (సావిత్రి : వయసున పెద్ద పిన్నలయ్యు రాధికా రాధలు పోలికకు ఏకరీతిగ నుండువారని తమచే వింటిమి) తరువాత పురాణములలోను, జనులలోను ఈ రాధికా రాధలు ఒక్క వ్యక్తియే అన్న అపోహ సంభవించుటకు కారణమై ఉండవచ్చును. దానిని అనుసరించే తన పెంపుడు తండ్రి అయిన నందునికి పిత్రీయ సోదరియు, తనకు మేనత్తయు అగు రాధను శ్రీకృష్ణుడు ప్రియురాలిగా గ్రహించెనను ప్రవాదమునకు పూర్తిగా ప్రచారము కలిగినది.

ఈపై తారతమ్యమును బట్టి నారాయణతీర్థుల వారు వర్ణించినది వృషభాను, కళావతుల పుత్రిక అయిన రాధను మాత్రమే అని గ్రహించవచ్చును. –1

## అక్రూరుడు :

బలరామకృష్ణులను తీసుకురమ్మని కంసుడు అక్రూరునికి ఆజ్ఞాపించాడు. అక్రూరుడు 'రాజా! మీ ఆజ్ఞను తప్పక నెరవేరుస్తాను. ఇదంతా ఒక దైవ సంకల్పము వలె తోచుచున్నది' అని పలికి అంగీకరించాడు.

అక్రూరుడు కృష్ణుని దండకంతో స్తుతించినట్లుగా పోతన గ్రంథంలో ఉంది.

---

1. శ్రీమతి వేంకట రమాదేవి, *శ్రీకృష్ణలీలాతరఙ్గిణీ, పీఠికానాటిక, పుట–2,3*

దండకం : మహారూప ! నీ రూపముల్ వెగ్గలం బుగ్గడింపన్, లయాంభోధిలో మీనుమేవన్ విరోధిన్ నిరోధించి మున్వేధకున్ వేదరాశిం బ్రసాదింపవే ? త్రుంపవే కైటభ శ్రీమధుంజక్రివై మొత్తవే ! యెత్తవేమందరాగంబు రాగంబుతోఁ గూర్మలీలాపరిష్పందివై పందివై మేదినిన్ మీఁదికింద్రోచి దోషాచరుంగొమ్ములన్ నెమ్ములన్ జిమ్ముచున్ గ్రువ్వవే త్రవ్వవే ఘోరవైరిన్ నృసింహుండ వై, దండివై దండివైరోచనింజూచి యాచింపవే? పెంపవే మేను బ్రహ్మాండమున్నిండఁ, బాఱుండవై రాజకోటిన్ విపాటిం పవే, రాజవై రాజబింబాస్యకై దుర్మదారిన్ విదారింపవే, నొంపవే క్రూరులన్ వాసుదేవాది రూపంబులన్, శుద్ధబుద్ధుండవై వైరిదారాంతరంగంబులన్నంత రంగంబులుంగాగరంగింపవే ? పెంపు దీపింపవే ? కల్కిమూర్తింబ్రవర్తించి నిన్నెన్న నే నెవ్వఁడన్, నన్ను మాయావిపన్నున్ విషణ్ణుం బ్రసన్నుండవై ఖిన్నతంబాపి మన్నింపవే ! పన్నగాధీశతల్పా ! కృపాకల్ప ! వందారుకల్పా ! నమస్తే నమస్తే నమస్తే నమః ॥ *-1*

చివరిలో విష్ణువు ధరించిన దశావతారాలను వర్ణించడం సాహిత్యపరంగా అంత సబబుగా తోచదు. ఎందుకనంగా రాబోవు బుద్ధ కల్కి అవతారములను కూడా కలిపి చెప్పడం జరిగింది. అప్పటికి ఆ రెండు అవతారాలను విష్ణువు ధరించడం జరుగలేదు కదా. అయితే పోతనగారు తానెరిగిన పురాణ విజ్ఞానాన్ని మనసులో పెట్టుకొని భక్త్యావేశంతో విష్ణువు యొక్క 10 అవతారాలను కలిపి రచించాడని సరిపెట్టుకోవాలి. పైగా 'శుద్ధ బుద్ధుండవై వైరి దారాంతరంగంబులన్ అంతరంగంబులుంగా గరంగింపవే' అని ప్రార్థించడం కూడా ఔచిత్యంగా తోచదు. బుద్ధావతారంలో బుద్ధునకు వైరులే లేనప్పుడు వైరి దారలు ఎలా ఉంటారు. వారి అంతరంగాలను కరగించడం ఏమిటి? అనే సంశయం కూడా ఇక్కడ కలుగుతుంది.

అయితే ఇక్కడ వైరులంటే అంతఃశ్శత్రువులైన కామక్రోధాదులు అనుకోవాలి. 'దార' అనే శబ్దానికి విదారణము అనే అర్థం చెప్పుకోవాలి. అంతశ్శత్రువులను జయించడమే వైరి దారాంతరంగము. నీ అంతరంగమున అలాంటి అంతరంగం జనాలందరకు కలగాలని సంకల్పించి వారిని ఉద్ధరింపగలవని ఆకాంక్షించడమే ఇక్కడ వాక్యానికి తాత్పర్యంగా గ్రహిస్తే కొంతవరకు సమన్వయపడుతుంది. 'ఏమైనా ఈ బుద్ధ కల్కి ప్రసక్తి పోతనగారు తేవడం అంత సముచితంగా కనబడదు. కల్కి విషయము సమర్థింపుటకు కుదరదు'.

శ్లో॥ *మహారాజ శ్రీమన్జగతి మహిమాతే విజయతే*
*తథాకుర్వేకహం త్వంవదసితుమహారాజతనయ*
*అమోఘం తద్వీర్యంబలమపి చలోకేసువిదితం*
*విధేస్సంకల్పః కింఫలయతి నజానేత్వయిపరమ్* *-2*

---

1. *పోతన భాగవతం, 10 : 1234 : పుట-286*
2. *నారాయణతీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 7 : పుట-392*

భోజప్రబంధములో ఒక చోట కాళిదాసు భోజరాజును సంబోధిస్తూ చెప్పిన శ్లోకానికి ఇది అనుకరణముగా కనబడుతుంది.

*మహారాజశ్రీమజ్జగతియశసాతే ధవళితే*
*పయః పారావారం పరమ పురుషోయం మృగయతే*
*కపర్దీ కైలాసం కరివరమభౌమం కులిశభృ*
*త్కళానాథం రాహుః కమల భవనో హంసమధునా -1*

ఆ అక్రూరుడు భక్తిపరవశుడై ఆ కృష్ణుని పాదపద్మములు తన హృదయకమలము నందు నిలిపి, ఓ కృష్ణా! అని పిలుస్తూ గానం చేశాడు. ఎన్నో సంబోధనలతో స్వామిని స్తుతించిన అక్రూరుని ఈ కీర్తనలో యతిప్రాసల తెలుగుదనాన్ని చక్కగా ప్రదర్శించారు తీర్థులు.

*ఉదా : సకలలోకనాయక సాధుజనతారక*
*మకరకేతుజనక మాయాధారక*
*వికటారివిదారక వేదసముద్ధారక*
*వికృత భయవారక విపులసుఖదాయక -2*

మొదటి దాని యందు యతి, 1,2 పాదాలలో యతిప్రాసలు రెండునూ కనబడతాయి.

కీర్తన : నందగోపబాలకృష్ణ నందయాఖిలం

అ॥ప॥ శ్రీచందన కుంకుమ తులసీ చాంపేయాదిసుగంధితాంగ

*చరణం: అజయ్య రమణీయలోక ఆగమబృందమానక*
*భజదార్తినివారక భద్రదాయక*
*అజితలోకనాయక ఆదిత్యాదిశాసక*
*విజితాసురనాయక విశ్వమంగళదాయక*

ఇక్కడ అంత్యానుప్రాస స్పష్టము.

*చరణం: గోపాంగనామండల గోగోప పరిపాల*
*తాపసజనలోల తారకాగమమూల*
*శ్రీపతేకనంతలీల శృంగారకృపాలవాల*
*శ్రీవత్సచిహ్నాదిమూలకారణమూర్తీ -3*

---

1. *బల్లాలుడు, భోజప్రబంధం, పుట-82*
2. *శ్రీకృష్ణలీలాతరఙ్గిణీ, 9 : 4 : పుట-400*
3. *శ్రీకృష్ణలీలాతరఙ్గిణీ, 9 : 5 : పుట-403*

ఇక్కడ కూడా యతిప్రాసల నియమం చక్కగా పాటింపబడింది.

పోతనగారికి అర్వాచీనుడు కాబట్టి తీర్థుల వారికి కూడా పోతనగారి శైలి పట్టువడింది కాబోలు.

## మధురలో పురకాంతలు :

అక్రూరుడు సాయంకాలానికి కృష్ణ భగవానులతో మధురానగరం చేరుకున్నాడు. నందాదులు పురోపవనంలో విడిది చేశారు. అక్రూరుడు మా యింటికి రండని కృష్ణుని ప్రార్థించాడు. కంసమర్దనం తరువాత వస్తామని కృష్ణుడు అభయం ఇచ్చాడు. అక్రూరుడు మరునాటి మధ్యాహ్నానికి బలరామకృష్ణులను కంసుని కడకు తీసుకువెళతాడు. దారిలో కృష్ణుని చూచి పురకాంతలు సంతోషంతో ఒకరినొకరు పిలుచుకుంటూ ఆయన దర్శనానికి వస్తారు. ఆయన లీలలను తనివితీరా వర్ణించుకుంటారు.

*సీసం : వీఁడటే రక్కసి విగతజీవఁగఁ జన్నుఁబాలు ద్రావినమేటి బాలకుండు !*
*వీఁడటే నందుని వెలఁదికి జగమెల్ల ముఖమందుఁ జూపిన ముద్దులాఁడు !*
*వీఁడటే మందలో వెన్నలు దొంగిలిదర్పించి మెక్కినదాఁపరీఁడు !*
*వీఁడటే యలయించి వ్రేతలమానంబు సూఱలాడిన లోకసుందరుండు !*

*తే॥గీ॥ వీఁడులేకున్నపురమటవీ స్థలంబు, వీనిఁబొందని జన్మంబు విగతఫలము*
*వీనిఁబలుకని వచనంబు విహగరుతము, వీనిఁజూడని చూడ్కులు వృథలు వృథలు -1*

తిక్కన భారతంలో కూడా ఉద్యోగపర్వంలో ఇటువంటి పద్యమే కనబడుతుంది. రాయబారిగా హస్తినాపురానికి వచ్చిన శ్రీకృష్ణుని పౌరకాంతలు సౌధాగ్రాల మీద నుండి సందర్శించే సందర్భంలో తిక్కన సోమయాజి ఒక సీసపద్యం వ్రాశారు.

*సీసం॥ ప్రాణంబుతోఁగూడ రక్కసి చన్నులపాలు ద్రావినప్రౌఢబాలుఁ డితఁడె!*
*వ్రేల్మిడి చాణూరువిఱిచిలోకములమెచ్చించిన యా జగజ్జెట్టియితఁడె !*
*దుర్వృత్తుఁడగు కంసుఁదునిమి యాతనితండ్రిఁ బట్టంబుగట్టిన ప్రభువితండె !*
*సత్యభామయుఁబారి జాతంబుపైఁ గల కోర్కిదీర్చిన రసికుండితండె !*

*ఆ॥వె॥ వెన్నలును గోపికా చిత్తవృత్తములును, నరసి మ్రుచ్చిలనేర్చిన హరియితండె !*
*శ్రుతిశిరోభాగములఁదనసుభగ చరణ సరసి, జామోదమును గూర్చు చతురుఁడితఁడె !! -2*

దీనిని బట్టి తిక్కన గారిని పోతన అనుసరించినట్లు కనబడుతుంది.

---

1. *పోతన భాగవతం, 10 : 1250 : పుట-291*
2. *తిక్కన భారతం, ఉద్యోగ పర్వం, 3 : 175 : పుట-379*

బలరామకృష్ణులు మధురానగరంలో ప్రవేశించి సుదాముని ఆతిథ్యము స్వీకరించారు. తనకు వరం అనుగ్రహించిన కృష్ణునితో సుదాముడు ఈ విధంగా పలికాడు. సర్వమానవ సేవయే మాధవసేవగా భావించిన పోతన 'భూతదయ' కూడా తన జీవిత ధ్యేయములలో ముఖ్యమైనట్లు తలచి సుదాముని పలుకుల రూపంలో లోకానికి తెలియజేశాడు.

*కం॥ నీ పాద కమల సేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యము నితాం*
*తాపార భూతదయయును, తాపస మందార ! నాకు దయసేయఁగదే !* -1

కృష్ణుడు కుబ్జను సర్వాంగ సౌందర్యవతిగా చేశాడు.

కుబ్జ ఆనంద పారవశ్యంతో కృష్ణుణ్ణే చూస్తూ తనను తాను మరచిపోతుంది.

*శ్లో॥ సర్వాంగ సౌందర్య సుధాపగా యా*
*మపారసంసార విశోధికాయమ్*
*కంసద్విషస్తస్య సుఖంచరంతీ*
*కుబ్జామనోవృత్తిరతన్నివృత్తా* -2

శ్రీకృష్ణుని సౌందర్యమనెడి సుధానది సంసారపంకాన్ని కడిగివేసేది. అట్టి సౌందర్యనది యందు మునిగి ఆ కుబ్జ యొక్క మనస్సు బయటకు రాలేదు అని యిక్కడ రూపకాలంకారము కుదురుకున్నది.

కృష్ణుడు ఆమె మాటలకు సంతోషించి తన కరస్పర్శతో ఆమెను అమరసుందరివలె తీర్చిదిద్దాడు.

**పోతనగారు చేసిన వర్ణనలు :**

సూర్యస్తమయ వర్ణనము : పోతనగారు సూర్యాస్తమయాన్ని చక్కగా వర్ణించారు.

*మత్తేభం :*

*గగనారణ్య చరాంధకారగజముంగాలాహ్వయవ్యాధుఁడ*
*చ్చుగఁబట్టన్‌గమకించిమచ్చిడుటకై చూతాంకురశ్రేణిచే*
*నొగిఁగల్పించిన కందుకంబనఁగ సూర్యుండంతవీక్షింపఁగాఁ*
*దగెమందప్రభతోడ పశ్చిమమహాధాత్రీ ధరేంద్రంబునన్ ॥* -3

కాలమనే కిరాతకుడు ఆకాశమనే అరణ్యంలో చీకటి అనే ఏనుగును పట్టడానికై పూనుకొని మచ్చు పెట్టుటకు తయారుచేసిన మామిడిచిగుళ్ళ కందుకమా అన్నట్లుగా మార్తాండుడు మందగించిన కాంతితో పడమటి పర్వతం మీద చూడముచ్చట గొలిపాడు.

---

1. *పోతన భాగవతం, 10 : 1270 : పుట-294*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 9 : పుట-443*
3. *పోతన భాగవతం, 10 : 1288 : పుట-297*

*కందం॥ ఎల్లదిశలు నిండిన శ్రీ, వల్లభుగుణమహిమ బ్రహ్మవాసించుటకై*
*చల్లిన మృగమదమనఁగా, వెల్లివిరిసెఁదమము గగనవీథుల నెల్లన్ ॥ -1*

అన్ని దిక్కులందు వ్యాపించిన లక్ష్మీనాథుని మహిమను పరిమళింపజేయుటకై బ్రహ్మదేవుడు చల్లిన కస్తూరి కాబోలు అన్నట్లు ఆకాశవీథులన్నిటిలో చీకట్లు ముసురుకున్నాయి అని భావము.

**చంద్రోదయము :**

*సీసం॥ ప్రాచీదిశాంగనా ఫాలతలంబున దీపించు సిందూర తిలకమనఁగ*
*దర్పించి విరహుల ధైర్యవల్లులఁద్రెంప దర్పకుండెత్తిన దాత్రమనఁగ*
*నలిగి కాలకిరాతుఁడంధకారమృగంబు ఖండింపమెఱయించు ఖడ్గమనఁగ*
*గగనతమాలవృక్షము తూర్పుకొమ్మను లలితమైమెఱయు పల్లవమనంగఁ*

*ఆ॥వె॥ దొగలు సంతసిల్ల దొంగలు భీతిల్లఁ, గడలి మిన్ను ముట్టి కడలుకొనఁగఁ*
*బొడిచె శాతకరుఁడు భూరిచకోరక, ప్రీతికరుఁడు జారభీతికరుఁడు -2*

చకోర పక్షులకు ప్రీతిని, విటకాంద్రకు భీతిని కలిగిస్తూ చంద్రుడుదయించాడు. అతడు తూర్పు దిక్కనే తొయ్యలి ముఖంపై దీపించే కుంకుమబొట్టు అన్నట్లుగానూ, వియోగుల ధైర్యమనే తీగలను త్రెంచడానికి గర్వంతో మన్మథుడెత్తిన కొడవలి అన్నట్లుగాను, కాలుడు అనే బోయచీకటి అనే మృగాన్ని ఛేదించుటకు జళిపించే కరవాలం అన్నట్లుగాను ఆకసమనే కానుగుచెట్టు యొక్క తూర్పు కొమ్మలో మెరిసే మెత్తని చిగురాకు అన్నట్లుగాను ఉన్నాడు. అతణ్ణి చూచి కలువలు వికసించాయి. దొంగలు భయపడ్డారు. అంభోరాశి తరగలెత్తి అంబరమంటింది.

**సూర్యోదయము :**

*సీసం॥ పౌలోమిదనబాలుపాన్పుపైఁగనుపట్టఁ బన్నిన పవడంపు బంతియనఁగ*
*నాయురర్థముల వ్యయంబులొత్తిలిచాటు కాలజాంఘికుచేతిఘంటయనఁగ*
*ఘనజంతుజీవితకాలరాసులవిధి కొలువనెత్తిన హేమకుంభమనఁగఁ*
*బశ్చిమదిక్కాంత పరఁగఁగైసేయుచో ముందట నిడుకొన్నముకురమనఁగఁ*

*తే॥గీ॥ గోకతాపోపశమ దివ్యఘుటికయనఁగఁ, బద్మినీకాంతనోముల ఫలమనంగ*
*మూఁడు మూర్తుల సారంపుముద్ద యనఁగ, మిహిరమండల ముదయాద్రిమీఁదనొప్పె -3*

---

*1. పోతన భాగవతం, 10 : 129 : పుట-298*

*2. పోతన భాగవతం, 10 : 1296 : పుట-299*

*3. పోతన భాగవతం, 10 : 1341 : పుట-310*

సూర్యబింబం తూర్పుకొండపై ఉదయించింది. అది శచీదేవి తన పిల్లవాని పానుపు మీద కనిపించేటట్టు చిలుకల పందిరికి అమర్చిన పగడాల బంతియా అన్నట్లుంది. ఆయుష్షనే ధనం వ్యయమైపోతున్నది అని గట్టిగా చాటుతున్న కాలమనే వార్తాహరుని చేతిలోని గంటయా అన్నట్లుంది. బ్రహ్మదేవుడు ప్రాణుల జీవితకాలమనే ధాన్యరాసులను కొలవడానికి ఎత్తిన బంగారు కుంచమా అన్నట్లుంది. పడమటి దిక్కు అనే అంగన అలంకరించుకునేటప్పుడు ముందుంచుకొన్న అద్దమా అన్నట్లుంది. జక్కవల పరితాపం మాన్పే దివ్యమైన మందుగుళికయా అన్నట్లుంది. పద్మిని అనే నాయిక వ్రతఫలమా అన్నట్లుంది. ముమ్మూర్తుల వెలుగు ముద్దయా అన్నట్లుంది అని భావము.

కువలయాపీడ వర్ణనలో ముక్తపదగ్రస్తం అలంకారమైనది.

వచనం : "లోభికరంబునుంబోలెదానసలిలధారా విరహితంబై, విరహి తలంపునుంబోలె నిరంతర చిత్తజాత విగ్రహంబై, గ్రహణకాలంబు నుంబోలెఁబరాధీనఖరకరంబై, ఖరకరోదయంబునుంబోలె భిన్నపుష్కరంబై, పుష్కరవైరి విలసంబునుంబోలె నభాసిత పద్మకంబై యున్న సమయంబున *-1*

## చాణూరమల్లులు :

చాణూరుడు కృష్ణునితో ప్రగల్భాలు పలుకుతాడు.

*సీసం॥ చలమున ననుడాసి జలరాశిఁజొరరాదు, నిగిడిగోత్రము దండనిలువరాదు*
*కేడించి కుంభిని క్రిందకిఁ బోరాదు; మనుజసింహుఁడనని మలయరాదు;*
*చేరిన బడవైతుఁ జెయిసాఁపగారాదు; బెరసి నా ముందటఁ బెరుఁగరాదు*
*భూనాథహింసకుఁ బోరాదు నను మీఱి; శోధింతుఁ గానలఁజొరఁగ రాదు*

*ఆ॥వె॥ ప్రబలమూర్తి ననుచు భాసిల్లఁగా రాదు ధరఁబ్రబుద్ధుఁడనని తలఁపరాదు*
*కల్కితనము చూపి గర్వింపఁగా రాదు తరముగాదు కృష్ణ ! తలఁగు తలఁగు -2*

ఇక్కడ పోతన మునుపటి అవతారాలతో పాటు రాబోయే బుద్ధ కల్కి అవతారాలకు కూడా కలిపి ఆయా అవతారాలలో నీవు చూపిన లీలలు నా ముందు చెల్లవు సుమా! అని అన్నట్లుగా రాయడం ఔచిత్య భంగంగా కనబడుతుంది.

అయితే బుద్ధావతార ప్రసక్తిలో ప్రబుద్ధుడనని తలుపరాదు అనే పదం వాడి తెలుగునాట ప్రసిద్ధమైన ప్రబుద్ధశబ్దాన్ని శ్లేషలో బంధించడం వలన బుద్ధావతార ప్రసక్తి మాటుపడుచున్నది. అలాగే కల్కితనము అనుచోట గడుసరితనము అనే అర్థం వచ్చేటట్లుగా కల్క్యంశ ప్రశస్తిని మాటుపరిచాడు. ఈ చమత్కారం వల్ల దోషం నిర్దోషమైనది.

---

*1. పోతన భాగవతం, 10 : 1319 : పుట-304*

*2. పోతన భాగవతం, 10 : 1341 : పుట-310*

అలాగే ఆ చాణూరుడి నోట ఇది వైకుంఠము కాదు. మధురాపురము ఇది సంసారరహితుల సభ కాదు. కంసుని సభ. ఇది నారద వీణాధ్వని కాదు. నా బాహునాదము. ఇది ప్రియురాంద్రతో ప్రణయ విగ్రహం కాదు, మల్లురతో నిగ్రహం అని యీ రీతిగా పలికించడం (విజ్ఞానదూరుడైన మల్లుని నోట వచ్చినట్లు చెప్పడం) పోతనగారి వర్ణనావేశమునకు పరాకాష్ఠగా తోచుచున్నది.

*సీసం॥ మహిమతోనుండంగ మధురాపురముగాని పొలుపార వైకుంఠపురముగాదు*
*గర్వంబుతోనుండఁగంసుని సభగాని సంసారరహితులసభయుఁగాదు*
*ప్రకటించి వినఁగ నా బాహునాదము గాని నారదువీణాస్వనంబుగాదు*
*చదురులాడఁగ మల్లజననిగ్రహము గాని రమతోడిప్రణయ విగ్రహము గాదు*

*తే॥గీ॥ వెలసి తిరుగంగ వేదాంతవీథి గాదు, మొఱఁగిపో మునిమనముల మూలగాదు*
*సాఁగినడవంగ భక్తులజాడగాదు, శౌరి! నాప్రోలనీవెందుఁజనియెదింక? -1*

అయితే కంసుని అనుచరుడై అక్కడ సభలో జరిగే నిరంతర చర్చలు, ఇంతకు ముందు నారదుని ద్వారా విష్ణువు కృష్ణునిగా పుట్టినట్లు వ్యాప్తమైన కథలు అనేకసార్లు వినియున్న సంస్కారంతో ఆ వచ్చినవాడు విష్ణుడే యీ రూపంలో ఎదుట నిలబడినాడని తలంచుచు ఆ చాణూరుడు వర్ణించడం సమంజసముగానే గ్రహించాలి.

## ధనుర్భంగము :

కృష్ణుడు యాగశాల యందు ఉంచి పూజింపబడుచున్న ధనస్సును విరిచి బలరామసహితముగ కంససభలో ప్రవేశించాడు. అప్పుడు హరిని దేవతలు వినుతించారు.

*కీర్తన : అవలోకయత శ్రీగోవిందం భోభో భూమావవలోకయత*

*అ॥ప॥ నవజలధరశ్యామం నందితబలరామం*

*చరణం: భువనసుందరాకారం భూరికరుణాకరం*
*అవనీభార సురారి విదారం*
*నవముక్తామణిహారం నానావిధవిహారం*
*ధ్రువపదవిధాతారం దూరితసంసారభారం*

*చరణం: మల్లచాణూరమథనం మత్తమాతంగనిధనం*
*ఫుల్లపంకజదళ సన్నిభనయనం*
*వల్లవాంగనామదనం వాసుదేవాభిధానం*
*కల్లోలమాలిశయనం కంసేభకేసరిణం -2*

---

1. *పోతన భాగవతం, 10 : 1343 : పుట-311*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 6 : పుట-447*

*చరణం: ఏకాంతదైవతం యాదవాబ్ధి సముదితం*
*శ్రీకాకుళనగరీ శ్రీభూమిసహితం*
*నాకవల్లభగీతం నారాయణతీర్థరచితం*
*వికటమోహరహితం విజయగోపాలమసితం -1*

ఈ కీర్తనలో కృష్ణునకు 'శ్రీకాకుళనగరీ శ్రీభూమిసహితం' అనే విశేషణాన్ని తీర్థులు వాడారు. ఆంధ్రదేశం, కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలంలోని శ్రీకాకుళ క్షేత్రంలోని విష్ణువును ఇక్కడ స్మరించారన్నమాట. ఆయన యీ ప్రాంతంవాడు అనడానికి యీ విశేషణం కూడా ఒక అవకాశమును కల్పించుచున్నది. కవులు అనంతర కాలంలో ఏ దేశంలో ఏ రాజుల కొలువులో కీర్తులు పొందినా జన్మస్థానాన్ని మరచిపోలేరు కదా !

కంసుడు రంగంలోనికి దూకి కృష్ణుని సంహరించడానికి ఉద్యుక్తుడవుతాడు. కృష్ణుడు వానిని సంహరిస్తాడు. ఆ దృశ్యం చూచి దేవతలు కృష్ణుని స్తుతించారు.

*కీర్తన : ప॥ పాహి పాహిమాం పరమకృపాళో*
*దేహిమేత్వయి దేవసుభక్తిం*

*చరణం: అసురసంహార శ్రీవిజయగోపాల*
*అమరసంరక్షణ విజయగోపాల*
*వసుదేవతనయ శ్రీవిజయగోపాల*
*వాసుదేవాదినుత విజయగోపాల*

*చరణం: సంగీతలోల విజయగోపాల*
*సద్గుణశీల శ్రీ విజయగోపాల*
*శృంగారరసపూర విజయగోపాల*
*శ్రితజనపాల శ్రీ విజయగోపాల*

*చరణం: ధీరగుణాధార విజయగోపాల*
*ధేనుకాదిహరణ విజయగోపాల*
*నారదమునిగేయ విజయగోపాల*
*నారాయణతీర్థ విజయగోపాల -2*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 6 : పుట-447*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 7 : పుట-450, 451*

ప్రతి వర్ణన వాక్యంలోను విజయగోపాల ముద్ర వచ్చేటట్లుగా యీ రచన సాగింది. తీర్థుల వారు యీ విధంగా 'విజయగోపాల' శబ్దాన్ని అనేక కీర్తనలలో ప్రత్యేకంగా నిక్షేపించడం వలన ఈయన ఏ గురువు వద్దనో 'విజయగోపాల' మంత్రాన్ని స్వీకరించి జపించినట్లుగా ఊహించడానికి వీలున్నది.

## ముచకుందస్తుతి :

తనకు దర్శనమిచ్చిన కృష్ణుని గూర్చి ముచకుందుడు స్తోత్రం చేసినాడు.

*కీర్తన : వేదాద్రిశిఖర నరసింహమాకలయామి*
*విమలవిద్యుజ్జ్వలితజిహ్వాం*
*వేదాంతవేద్య విమలానంద విజ్ఞాన*
*విదళిత దురంత భవమోహంత్వాంనౌమి*

*చరణం: పరభావభావనాదృఢబంధహరమఖిల*
*సురవైరిదళనఖరనఖరం*
*పరిపూర్ణ కరుణాసుధాసమాహ్లాదిత*
*ప్రహ్లాద భయహరముదారంత్వాంనౌమి*

*చరణం: ఘోరసంసారతారకతారకాధిపతి*
*తరణిమండలకోటిభాసం*
*క్షీరగంభీరవారిధి మథనసంజాత*
*వరలక్ష్మీ కౌస్తుభోల్లాసంత్వాంనౌమి*

*చరణం: జగదండ శతకోటి జననీ కళత్ర మిహ*
*జన్మమరణాది భయవిదూరం*
*నిగమమయ ఖగవర్యవరయానసంచార*
*నియతలీలామయశరీరం త్వాంనౌమి*

*చరణం: మణిమయకిరీట మణిమకరకుండలకాన్తి*
*మథితదిగ్దశ తిమిరభారం*
*అణిమాదిభూతిదమనన్యశరణార్థినాం*
*ఆధారమఖిల సుఖసారం త్వాంనౌమి*

*చరణం: నిరవద్య గుణరత్న నిర్మలాంతః కరణ*
*వరణీయవరదాననిపుణం*
*ధీరశివనారాయణానంద తీర్థయతి*
*గూఢ పరమార్థమతికరుణంత్వాంనౌమి -1*

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 10 : 8 : పుట-475, 476*

వేదాద్రి నరసింహుని స్వరూపునిగా ముచకుందుడు కృష్ణుని స్తుతించినట్లుగా సాగిన యీ కీర్తనలో అన్ని చరణాల చివర త్వాంనౌమి అనే మకుటం నిబంధింపబడినది. శంకరాచార్యుల వారి 'లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబం' అనే శ్లోకాలకు దీటుగా ఈ కీర్తన నడవడం గుర్తిస్తాము. భవసాగరము నుండి తప్పించమని ముచుకుందుడు కృష్ణుని ప్రార్థించాడు. కృష్ణుడు ముచుకుందునిపై కృపావర్షాన్ని కురిపించి మధురకు తిరిగి వెళ్ళాడు.

వేదాద్రి నరసింహుడు కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలంలో ఉన్నాడు. వేదాద్రి తీర్థుల అత్తగారి ఊరు.

## రుక్మిణీ కల్యాణం :

రుక్మిణి సందేశము తీసుకువెళ్లిన అగ్నిద్యోతనుడు కృష్ణుని ఎదుట ఆమె యొక్క సౌందర్యాన్ని వర్ణిస్తున్న ఈ పద్యంలో చక్కటి యమకం కళ్ళకు కట్టినది. ఈ పద్యం పోతనగారి యొక్క అక్షర శిల్పమునకు దర్పణం వంటిది.

*సీసం : పల్లవ వైభవాస్పదములు పదములు గనకరంభా తిరస్కారులూరు*
*లరుణ ప్రభామనోహరములు గరములు గంబు సౌందర్య మంగళము గళము*
*మహిత భావాభావమధ్యంబు మధ్యంబు చక్షురుత్పవదాయి చన్నుదోయి*
*పరిహసి తార్థేందు పటలంబు నిటలంబు జితమత్తమధుకరశ్రేణివేణి*

*ఆ॥వె॥ భావజాశుగముల ప్రాపులు చూపులా, కుసుమశరుని వింటికొమలు బొమలు*
*చిత్తతోషణములు చెలువ భాషణములు, జలజనయన ముఖము చంద్ర సఖము -1*

రుక్మిణి అమ్మవారిని ప్రార్థించి ముకుందుని రాకకై ప్రతీక్షిస్తూ తిరుగు ప్రయాణం కడుతుంది. బంధుపరివారం మధ్య నుండి యీవలకు వచ్చిన ఆమె దేవదానవులు సంరంభంతో సముద్రమథనం చేయగా అందుండి వెలువడిన ఇందిరాదేవివలె ఉన్నదని పోతనగారు యీ సందర్భంలో వర్ణించారు.

వచనం: దేవదానవ సంఘాత కరతల సవ్యాపసవ్య సమాకృష్యమాణపన్నగేంద్ర పాశ పరివలయిత పర్యాయ పరిభ్రాంత మందరాచల మంథానమథ్యమానఘూర్ణిత ఘుమఘుమాయితమహార్ణవ మధ్యంబున నుండి చనుదెంచు నిందిరాసుందరీ వైభవంబున, -2

లక్ష్మీదేవి యొక్కఅవతారమే ఈమె అని కవి ఇక్కడ ఉపమాలంకారయుక్తముగా చక్కగా సూచించారు.

ఆమె చూపులు మన్మథుని బాణాలలాగా రాజవీరుల హృదయాలను ఛేదిస్తున్నాయనడం ద్వారా పోతనగారు ప్రబంధ కవులకు చక్కని మార్గదర్శనం చేశాడు.

వచనం : "*జెఱకువిలుతుండొఱవెఱికి వాఁడియిడి జళిపించిన ధగద్ధగా యమానంబులగు*

---

1. *పోతన భాగవతం, 10 : 1713 : పుట-397*

2. *పోతన భాగవతం, 10 : 1747 : పుట-406*

*బాణంబులపగిది, సురుచిరవిలోకన నికరంబులు రాజవీరుల హృదయంబులు భేదింప,* -1

అక్కడ చేరిన రాజులందరినీ రుక్మిణి కడకంటి చూపులతో చూస్తుండగా ఒక చోట కృష్ణుడు అగుపడినాదు.

*మత్తేభం :*

*కనియెన్ రుక్మిణి చంద్రమండల ముఖుం గంఠీరవేంద్రావల*
*గ్నునవాంభోజదళాక్షుఁ జారుతరవక్షున్ మేఘసంకాశదే*
*హునగారాతి గజేంద్రహస్తనిభబాహుం జక్రిఁబీతాంబరున్*
*ఘనభూషాన్వితుఁగంబుకంఠు విజయోత్కంఠున్ జగన్మోహనున్* -2

విశేషణ బాహుళ్యంతో వ్యక్తి వర్ణన చేయడంలో పోతనగారి యొక్క నైపుణ్యం అనన్యసాధ్యం. క్రియాపదంతో ప్రారంభించి రచన చేయడం ఒక సుందరశైలి.

అంత మంది రాజులు చూస్తూ ఉండగా నక్కలను తిరస్కరించే సింహంలాగా కృష్ణుడు రుక్మిణిని తన రథం మీద ఎక్కించుకొని శంఖాన్ని పూరిస్తూ బలభద్రసహితుడై ద్వారకానగరమార్గమును పట్టి వెళ్ళాడు.

వచనం : "మందగమనంబున గంధసింధురంబులీలం జనుదెంచి ఫేరవంబుల నడిమి భాగంబు గొని చను కంఠీరవంబు కైవడి నిఖిలభూపాల గణంబుల గణింపక తృణీకరించి రాజకన్యకం దెచ్చి హరితన రథంబుమీఁద నిడికొని భూనభోంతరాళంబులు నిండ శంఖంబు పూరించుచూ బలభద్రుండు తోడనడువ; యాదవవాహినీ పరివృతుండై ద్వారకానగరమార్గంబు వట్టిచనియె; *-3*

ఈ వచనశైలి పద్యశైలికంటే సుందరగమనముతో విరాజిల్లుతోంది. ఆ రాజులంతా తమ కన్నుల ఎదురుగా జరిగిన యీ హఠాత్పరిణామానికి క్రోధాశ్చర్యాలు వహించి కృష్ణుని పైకి సామూహికంగా దండయాత్ర చేస్తారు. రుక్మిణి ఆడులేడివలె భయంతో బెదురుచూపులు చూస్తు ఉండగా కృష్ణుడామెకు ధైర్యం చెబుతాడు. యాదవ సైనికులు ఆ రాజవర్గాన్ని ఎదిరించి యుద్ధం చేస్తారు.

వచనం : "విదళితమత్తమాతంగంబును, విచ్ఛిన్నతురంగంబును.... విఖండితవాహవారణ రథారోహణ మస్తకంబును, విశకలిత వక్షోమధ్య కర్ణకంఠ కపోలహస్తంబును, .. విస్మృత వీరాలాపంబును, .... విద్యమానరక్తప్రవాహంబును... విజృంభమాణ ఫేరవకాకకంకాదిసంకులంబును, ... నప్పుడు *-4*

---

1. *పోతన భాగవతం, 10 : 1747 : పుట-406*
2. *పోతన భాగవతం, 10 : 1750 : పుట-408*
3. *పోతన భాగవతం, 10 : 1751 : పుట-408*
4. *పోతన భాగవతం, 10 : 1757 : పుట-410*

ఈ వర్ణనలో యుద్ధ సన్నివేశమును విశేషిస్తూ ప్రతిపదము మొదట 'వి' అనే అక్షరాన్ని సంధించి ఒక క్రొత్త శైలికి పోతనగారు ఒరవడి పెట్టినారు. ఆలంకారికముగా దీనికి శ్రుత్యనుప్రాసము అని పేరు.

జరాసంధుడు మొదలైన మాగధ ముఖ్యులందరూ వడలిన ముఖంతో తమ ఎదుట దుఃఖిస్తున్న శిశుపాలుని చూశారు. ఆ శిశుపాలుడు పెళ్ళాన్ని పోగొట్టుకున్న వాడి వలె ఏడుస్తూ వేడి నిట్టూర్పులు విడుస్తూ ఉన్నాడు.

*"ఆలిఁ గోల్పడినవాని క్రియన్ గడువెచ్చనూర్పుచున్"* –1

ఈ ఉపమానం సహజసుందరంగా సందర్భోచితంగా ఉండి, పోతనగారి 'సహజకవి' లక్షణానికి అద్దం పట్టింది. పరిహాసగర్భితోపమానము యిది.

మాగధులంతా శిశుపాలుని శత్రువుల చేతిలో పడకుండా బ్రతికే ఉన్నావు కదా అంటూ ఓదార్చారు.

*ఆ॥వె॥ బ్రతుకవచ్చు నొడలఁ బ్రాణంబులుండిన, బ్రతుకు గలిగెనేని భార్యగలదు*
*బ్రతికితీవు; భార్య పట్టుదైవమెఱుంగు, వగవవలదు చైద్య ! వలదు వలదు* –2

ఒక సంఘంలోని పెద్దలు అతి సాహసంతో ప్రమాదభరితమైన పనికి పూనుకున్న పిన్నవారిని వారించే విధానం యీ రచనలో కన్నులకు కట్టించారు పోతన.

రుక్మి రథమెక్కి కృష్ణుని నిందిస్తూ ఆయన వెంట పడతాడు. ఆయనపై బాణప్రయోగం చేస్తాడు.

*సీసం॥ మా సరివాఁడవా మాపాపఁగొనిపోవ ? నేపాటిగలవాఁడ? వేది వంశ?*
*మెందు జన్మించితి? వెక్కడఁబెరిఁగితి? వెయ్యది నడవడి? యెవ్వఁడెఱుఁగు ?*
*మానహీనుఁడవీవు? మర్యాద లెఱుఁగవు; మాయఁగైకొని కాని మలయరావు;*
*నిజరూపమున శత్రునివహంబుపైఁబోవు; వసుధేశుఁడవుగావు వావిలేదు*

*ఆ॥వె॥ కొమ్మనిమ్ము; నీవు గుణరహితుండవు, విడువు; విడువవేని విలయకాల*
*శిఖిశిఖాసమాన శితశిలీముఖముల, గర్వమెల్లఁగొందుఁగలహమందు* –3

పోతనగారు రచించిన యీ పద్యంలో వ్యాజస్తుతి అలంకారం నిక్షేపింపబడినది.

కాసుల పురుషోత్తమ కవి కూడా తను రచించిన ఆంధ్రనాయక శతకమును వ్యాజస్తుతి అలంకారముతో తీర్చిదిద్దాడు. పోతనగారి ప్రభావం ఇక్కడ సుస్పష్టంగా కనిపిస్తుంది.

---

1. *పోతన భాగవతం, 10 : 1758 : పుట–411*
2. *పోతన భాగవతం, 10 : 1760 : పుట–411*
3. *పోతన భాగవతం, 10 : 1766 : పుట–413*

*సీసం॥ పురుషాకృతిగ నిన్ను గుఱుతుబట్టగరాదు స్త్రీమూర్తి వనుచును జెప్పరాదు*
*పరగనపుంసక భావమెన్నగరాదు రూపంబుగల్గుటెఱుంగరాదు*
*గుణవంతుడవటంచు గణుతింపగారాదు మర్యాదదెలియనేమతికిరాదు*
*కులజుడవనుచు నిక్కువము జెప్పగరాదు స్థలమెక్కడనో కాని తెలియరాదు*
*వస్తునిర్దేశమొనరింపవశము గాని నిన్ను వర్ణింపరాదయానిశ్చయముగ*
*చిత్రచిత్రప్రభావ, దాక్షిణ్యభావ, హతవిమతజీవశ్రీకాకుళాంధ్రదేవ !   -1*

కృష్ణుడు రుక్మిపై బాణప్రయోగం చేసి వాని నైచ్యాన్ని భంగపరిచి ఖడ్గంతో వాని శిరస్సును ఖండించడానికి సిద్ధపడతాడు. ఇక్కడ కవి కృష్ణుని మీదకు వచ్చిన 'రుక్మి'ని అగ్నిలో పడబోయే శలభంతో పోలుస్తాడు.

వచనం: దవానలంబుపైఁబడు మిడుతచందంబునంగదిసిన   *-2*

అప్పుడు రుక్మిణి కృష్ణుని కాళ్ళు పట్టుకొని తన అన్నను క్షమించి విడిచిపెట్టమని వేడుకుంటుంది.

*మత్తకోకిల :*

*కల్లలేదని విన్నవించుటగాదు వల్లభ ! యీతనిన్*
*బ్రల్లదుండెగఁ జూచితేనియు భాగ్యవంతులమైతి మే*
*మల్లుఁడయ్యె ముకుందుఁడీశ్వరుఁడంచు మోదితులైన మా*
*తల్లిదండ్రులు పుత్రశోకముఁ దాల్చి చిక్కుదురీశ్వరా !   -3*

*మత్తేభం :*

*అని డగ్గుత్తికతో మహాభయముతో నాకంపితాంగంబుతో*
*వినతశ్రాంతముఖంబుతో శ్రుతిచలద్వేణీకలాపంబుతోఁ*
*గనుదోయిన్‌జడిగొన్న బాష్పములతోఁగన్యాలలామంబు ద్రొ*
*క్కిన రుక్మిందెగవ్రేయఁబోక మగిడెన్ గృష్ణుండు రోచిష్ణుఁడై   -4*

వినయోక్తులతో సాగిన యీ విన్నపములో సామాన్యులు తమ కంటే ఉన్నతులైన వారిని ప్రార్థించే విధానం యిలా ఉండాలి సుమా ! అని పోతనగారు మనకందరకూ ఉపదేశించినట్లుగా భావించాలి.

కృష్ణుడు ఆమె మాటలపై బావా రమ్మని రుక్మిని చేరదీసి వాని మీసము, తలను గొరికి పంపించివేస్తాడు.

---

1. కాసుల పురుషోత్తమ కవి, ఆంధ్రనాయక శతకము, *48 :* పుట*-52*
2. పోతన భాగవతం, *10 : 1767 :* పుట*-413*
3. పోతన భాగవతం, *10 : 1769 :* పుట*-414*
4. పోతన భాగవతం, *10 : 1770 :* పుట*-414*

బలభద్రుడు కృష్ణుని మృదువుగా మందలిస్తాడు. రుక్మిణిని సముచితంగా ఓదారుస్తాడు. పద్మముఖీ! రుక్మిణీ! అజ్ఞానం వల్ల కలిగే దుఃఖాన్ని విజ్ఞానమనే చూపుతో విడిచిపెట్టు నీవు మతిమంతురాలవు. అజ్ఞానుల మాదిరి శోకించడం నీకు తగదు అంటూ వేదాంతోపన్యాసం చేస్తాడు.

*కందం॥ అజ్ఞానజమగుశోకము, విజ్ఞానవిలోకనమునవిడువుము నీకుం*

*బ్రజ్ఞావతికిందగునే, యజ్ఞానుల భంగివగవ నంభోజముఖీ ! -1*

ఇక్కడ బలభద్రుడు ఒక క్లిష్ట సమస్య ఏర్పడినప్పుడు సంఘములోని పెద్దలు ఎలా అన్ని వర్గముల వారిని సమన్వయపరుస్తారో ఆ విధానముతో సమర్థించాడని విశదీకరించాడు కవి.

కృష్ణుడు రుక్మిణీదేవిని ద్వారకానగరానికి కొనిపోయి వివాహం చేసుకొన్నాడు.

*శార్దూలం :*

*ధ్రువకీర్తిన్ హరిపెండ్లియాడె నిజచేతోహారిణిన్ మానవై*

*భవగాంభీర్య విహారిణిన్ నిఖిల సంపత్కారిణిన్ సాధు బాం*

*ధవసత్కారిణిఁ బుణ్యచారిణిఁ మహాదారిద్ర్య సంహారిణిన్*

*సువిభూషాంబర ధారిణిన్ గుణవతీచూడామణిన్ రుక్మిణిన్ -2*

ఇందలి అంత్యానుప్రాసవైభవం ప్రశంసింపతగినది.

'భీష్ముడు' అను రాజు విరాజిల్లుతున్నాడు అంటూ తీర్థుల వారు ద్వాదశ తరంగం ప్రారంభించారు.

*కీర్తన : ధీమానిహశ్రీమానయం భీమపరాక్రమాన్వితః*

*భూమౌవిఖ్యాతమాహాత్మ్యో భీష్మోరాజావిరాజతే -3*

రాజు పేరు భాగవతంలో 'భీష్మకుడు' కాగా తీర్థుల వారు భీష్ముడు అని రచించారు. బాలః-బాలకః అనురీతిగా 'క' ప్రత్యయం స్వార్థంలో వాడటం కనబడుతుంది. కానీ 'భీష్మకః' అను పేరుతో సహజముగానున్న 'క'కారం తొలగించి వ్రాయడం అంత సముచితంగా లేదు. అయితే 'నామైకదేశేనామగ్రహణం' అనే శాస్త్ర పరిభాషను బట్టి 'క' ప్రత్యయం లేకపోయినా కేవల భీష్మ శబ్దం చేతనే భీష్మక నామాన్ని పరిగ్రహించవచ్చునని అనుకున్నచో పై దోషము లేదు.

చతుర్థాదనజాదౌచలోపః పూర్వపదస్య చ ।

అప్రత్యయే తద్ధైవేష్టః ఉవర్ణాల్ల ఇలస్యచ ॥ -4

---

1. *పోతన భాగవతం, 10 : 1780 : పుట-417*
2. *పోతన భాగవతం, 10 : 1784 : పుట-418*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణలీలాతరంగిణీ, 12 : 1 : పుట-486*
4. *భట్టోజీ దీక్షితులు, సిద్ధాంతకౌముది, పుట-370*

"రాజాదాఊర్ధ్వం ద్వితీయా దచః" - 1

అను దానికి వార్తిక శ్లోకము. దీనిని బట్టి

దేవదత్తః - దత్తః - దేవః

సత్యభామా - భామా - సత్యా

ఈ విధముగా పేరులోని కొంత భాగము మొత్తం పేరుకు గ్రాహకము.

మనోహరములైన కేయూరములను, కుండలమును సూర్యునివలె ప్రకాశించుచున్న కిరీటమును ధరించి, శ్రేష్ఠములగు ఆయుధములను పూని భీష్మకుమారుడైన రుక్మి తండ్రి కడకు వచ్చెను.

*కీర్తన : రుక్మీరుక్మిణ్యవరజో రుచిరాంగదకుండలీ*
*తిగ్మాంశుసమకిరీటీ దివ్యాయుధః సమాయాతి - 2*

తీర్థులవారు రుక్మి రుక్మిణికి తమ్ముడు అని చెప్పడం వింతగా ఉన్నది. (రుక్మిణ్యవరజః) ఈ మార్పు వలన కథకు వచ్చిన ప్రయోజనము ఏమీ లేదు. ఇంటికి పెద్దవాడైతేనే తండ్రికి కూడా సలహాలు చెబుతూ అవసరమైతే తండ్రిని ధిక్కరించి కూడా కార్యసరళిని నిర్ణయించే అధికారం కలవాడవుతాడు. కడగొట్టువాడైతే అట్టి అవకాశం ఉండదు కదా! కాబట్టి ఇక్కడ పోతనగారి వలెనే భీష్మకుని సంతానంలో పెద్దవాడుగా రుక్మిని చెప్పడం సముచితం. కొందరు ఇక్కడ 'రుక్మిణ్యవరజః' అను శబ్దానికి రుక్మిణి అవరజగా కలవాడు (చెల్లెలు) అను బహువ్రీహిని గ్రహించి అర్థం చెప్పారు. అప్పుడు పై దోషం తొలగిపోతుంది.

భీష్ముడు కుమార్తె రుక్మిణికి వివాహం చేయకోరి కులవృద్ధులతోను, మంత్రులతోను ఆలోచించి వాసుదేవుని రుక్మిణికి భర్తగా నిర్ణయించాడు. రుక్మికి మాత్రం శిశుపాలుడంటే ప్రీతి. కనుకనే తండ్రి యొక్క ఉద్దేశ్యాన్ని తిరస్కరించాడు. కృష్ణుడు చోరశిఖామణి. పరతంత్రుడు, మన కులం కంటే తక్కువ కులంవాడు అని వాదించాడు. రాజు పుత్రస్నేహవశుడై రుక్మిమాటలకే అంగీకారం తెలిపాడు.

తరువాత రుక్మిణి తన చెలికత్తెలతో గూడి శ్రీకృష్ణునే మదిలో ధ్యానించుచూ క్రీడాగృహమునకు వచ్చినది అంటూ తీర్థుల వారు రుక్మిణిని పరిచయం చేయడం కథకు మిక్కిలి ఉపయోగపడే విశేషణం. దానిచే ఆమె యొక్క లక్ష్మ్యంశ వ్యంగ్యరీతిలో చెప్పబడినట్లుగా భావించాలి. విష్ణువునకు లక్ష్మి అనపాయిని కదా. ఇక్కడ శ్రీ శబ్దం చేత కూడా అదే అర్థం వస్తుంది.

---

1. *పాణిని, అష్టాధ్యాయి, 5వ అధ్యాయం, 3వ పాదం 83వ వార్తికం, పుట-369*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 2 : పుట-487*

*కీర్తన : ఆయాతి శ్రీరుక్మిణీశనైరిహ గేయాయోషిద్భిరధునా*
*కృష్ణమేవ చింతయంతీ సదాహృదివృష్ణివంశసింధుచంద్రమ్*
*సౌందర్యనిందితామరీ నిరంతర చారుతరనీలకబరీ*
*తన్వీస్వతనుభానునా పరాజిత తపనకిరణా తరుణీ -1*

ఆమె సౌందర్యం చేత నిందింపబడిన అమరస్త్రీలు కలది (సౌందర్యనిందితామరీ) అని తీర్థులవారు ఆమె సౌందర్యాన్ని వర్ణించారు. ఇక్కడ నిందించుట అనే మాట అంత ఉచితం కాదు. అయితే లక్షణార్థాన్ని స్వీకరించి ఆమె సౌందర్యం అమరస్త్రీల సౌందర్యానికి మించి ఉన్నదని స్వీకరిస్తే దోషం ఉండదు. దీనినే గౌణవృత్తి అంటారు. అక్కడే 'స్వతనుభానునాపరాజిత తపనకిరణా' (తన శరీరకాంతిచే ఓడింపబడ్డ సూర్యకాంతి గలది) అని వర్ణించడం సముచితముగా ఉన్నది (పరాజితశబ్దము సముచితము)

బలరాముడు రేవతిని వివాహమాడినాడు. యుక్తవయస్కుడైన శ్రీకృష్ణునకు వివాహం చేయవలసిన సమయం వచ్చినది అని ద్వారకా పౌరులందరూ అనుకుంటున్నారు. ఒకనాడు రుక్మిణి చెలికత్తెలతో ఆటపాటలు సాగిస్తున్న సమయంలో ఒక దూతిక వచ్చి ఈ విధంగా పలికింది. "బంధువులందరూ నిన్ను కృష్ణునికి ఇచ్చి వివాహం చేయవలయునని నిశ్చయించారు. కానీ రుక్మి మాత్రం నిన్ను శిశుపాలునకు ఇచ్చి వివాహం చేయవలయునని దృఢసంకల్పంతో ఉన్నాడు. మీ తండ్రి రుక్మి మీద గౌరవముతో శిశుపాలునే అల్లునిగా చేసుకునేటందుకు నిశ్చయించినాడు" అని భీష్మని మందిరంలో జరిగిన సమాచారం చేరవేసింది.

రుక్మిణి గోవిందుని మనస్సులో నిలుపుకొని తన మనస్సును గూర్చి సంబోధిస్తూ తన కాంక్షను తెలుపుకుంటుంది.

*శ్లో॥ రేరేచేతః శ్రుణువిమలహృత్పుండరీకాంతరస్థే*
*యస్మిన్ మాయావిలసితజగత్కోటయస్సంతిభూమ్ని*
*గోపాలంతం భజనిగమవిద్యావిలాసానుపాలం*
*భూపాలంతం పరిహర పునర్జన్మబంధైకమూలమ్ -2*

ఓ మనసా ! హృత్పుండరీక మధ్యస్థుడు, మాయాప్రభావముచే సృష్టింపబడ్డ జగత్తులు కల భూమ స్వరూపుడు, నిగమ విద్యాపాలకుడు, జన్మబంధ నిర్మూలకుడు అయిన గోపాలును భజింపుమని అర్థిస్తుంది.

ఇక్కడ రుక్మిణి కృష్ణుని భర్తగా కోరిన విషయం చెప్పవలసి యుండగా వేదాంత ధోరణితో ఆయనను యిలా వర్ణించడం సముచితంగా తోచదు. అయితే యీ ప్రార్థన అంతా కృష్ణుని విష్ణుతత్త్వాన్ని ప్రతిపాదించేదిగా ఉండటం చేత అంతటి మహానుభావుని వరించి తీరవలసినదే అన్న భావం తనకు ఏర్పడడానికి ఆధారంగా స్వీకరించినదని భావిస్తే యీ దోషం ఉండదు.

---

*1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 3 : పుట-488*
*2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 12 : పుట-493*

*కీర్తన : ప॥ రేరేమానసగోపాలం భజదూరేపరిహర భూపాలం* -1

రుక్మిణి శ్రీకృష్ణుని భజింపుమని మనసును వేడుకుంటుంది. ఇక్కడ 'రేరేమానస గోపాలంభజ' అను దాని వెంటనే 'దూరే పరిహర భూపాలం' అనడం సమంజసముగా యున్నది. ఎందుకనగా భూపాలుడైన తన తండ్రిని పరిహరించి అయినా గోపాలునే భజింపుమని అనడం రుక్మిణీపాత్రపరంగా అవసరం. ఇతర భూపాలునెవనిని వరించవద్దని చెప్పినట్లుగానైనా అనుకోవచ్చు.

కృష్ణుడు వైరాగ్యస్వరూపుడని చెప్పడానికి తీర్థులవారు వేసిన విశేషణం 'వేదశమితవివిధ విషయాకారం'*(1)* గూడార్థము కలది. 'ఐశ్వర్యస్య సమగ్రస్య' అను సూక్తి ప్రకారం వైరాగ్యం కూడా భగవంతుని యొక్క లక్షణమే. కానీ రుక్మిణీ నోట కృష్ణుడు వైరాగ్య స్వరూపుడు అని అనిపించడం ఆమె వాంఛితానికే వ్యతిరేకంగా కనబడుతుంది. తీర్థుల వారు తన వైరాగ్య లక్షణాన్నే కృష్ణునకు ఆపాదించినట్లుగా కథావగతిని బట్టి తోచుచున్నది.

అలాగే 'అగణిత గుణమణివాగీశం' -2

అనే చోట కూడా గూఢంగా కృష్ణుడు అనేక సద్గుణములకు బ్రహ్మవంటి వాడని చెప్పబడినది. అసంఖ్యాకములైన కళ్యాణగుణములను ప్రతిపాదించు వాక్కులకు (వేదములకు) ఈశ్వరుడైనవాడు అని విశ్లేషించుకుంటే ఆ గూఢత తొలగిపోతుంది.

నీ పాదకమలముల యందు నేను ఆడు తుమ్మెదను అగుదును. నాకు క్షేమమును కలిగింపుమని విన్నవించుకుంటుంది. నేను మరెవ్వరినీ పతిగా స్వీకరింపను అని కూడా రుక్మిణి కృష్ణునితో పలుకుతుంది.

*శ్లో॥ నాన్యంవృణే పతిమశేషగురోరనంతాత్*
*త్వత్తస్సమస్తగుణదామభిరాత్మతుల్యాత్*
*క్షేమంసదైవ గురుదేవశిఖామణే త్వాం*
*యాచే త్వదంఘ్రికమలే ప్రణతాస్మినిత్యమ్ ॥* -3

*కీర్తన: ప॥ క్షేమం కురుసతతం గోపాల మమక్షేమం కురుసతతం*
*అ॥ప॥ కామం తవపాదకమలే భ్రమరీభవతు శ్రీ*
*మన్మమమానసం మధుసూదన* -4

---

1. *శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ, 12 : 5 : పుట-494, 495*
2. *శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ, 12 : 5 : పుట-494*
3. *శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ, 12 : 20 : పుట-508*
4. *శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ, 12 : 8 : పుట-509*

*చరణం: అక్షీణకరుణానిధే ఆనందఘన ప్రక్షీణదోషతతే*

*శిక్షితా సురగణ రక్షిత నిజజన*

*కుక్షిస్థితానేక కోటిలోకావన*

*చరణం: ప్రహ్లాద భయవిదూర పరమయోగిపావన భువనాధార*

*మోహరహితచిత్త మౌనిమానసహంస*

*సాహసహతవైరి సంఘమహోద్ధర*

*చరణం: అజిత విజయగోపాల అనంతలీల అద్భుత పదకమల*

*విజయద్వారకాపురీ విమలకమలాలోల*

*నిజనారాయణతీర్థ నిత్యానందబాల* *–1*

ఈ కీర్తనలో కూడా విజయగోపాలక ముద్ర ఉండటం గమనిస్తాము. 'ప్రహ్లాద భయవిదూర' అన్న విశేషణంలో ప్రహ్లాదుని యొక్క భయాన్ని నరసింహావతారంలో ఎలా పోగొట్టావో యీ అవతారంలో నా భయాన్ని కూడా అలా పోగొట్టమని వ్యంగ్యరీతిగా కోరినట్లు భావించాలి.

రుక్మిణి శ్రీకృష్ణుని కోసం విరహావస్థను పొందినది. ఆమె విరహంతో మన్మథుని నిందిస్తుంది.

*శ్లో॥ హేసూనాస్త్ర సముల్లసద్విరహిణీ సంహారదోషాదిహ*

*ప్రాప్తోకసిత్వ మనంగతాం తవశరాః పంచత్వమాపుర్ధ్రువమ్*

*చాపస్తే ధరణీంగతః స్మరనదీగామీ త్వదీయధ్వజః*

*త్వేవం కృచ్ఛ్రతయాపి మన్మథవధూహింసాగుణం నోజ్ఝసి* *–2*

ఓ సూనాస్త్రుడా ! విరహిణులైన స్త్రీలను ఎంతమందినో వధించుట వల్లనే నీవు ఆ స్త్రీ హత్యాదోషం వల్ల అనంగుడవైతివి. నీ బాణాలు పంచత్వాన్ని పొందాయి. (పంచత్వమును పొందుట అనగా నశించిపోవుట, ఐదుగా విభజింపబడుట అని రెండు అర్థములు) నీ ధనస్సు నేలపాలైనది. (పువ్వులు నేలరాలుట సహజము) నీ ధ్వజము నీటిపాలైనది. (అతడు మీనధ్వజుడు కావున చేపలు జలములో నుండుట సహజము) అయినప్పటికీ నీవు నేడు కూడా స్త్రీలను వధించుట మానకున్నావు. ఈ రీతిగా తీర్థులు వర్ణించడం ఆయన ప్రబంధవర్ణన రీతికి పరమోదాహరణం.

తరువాత ఆమె చంద్రుని కూడా దూషిస్తుంది. ఓ చంద్రా! విష్ణువు కమలాప్తుడు కాగా నీవు కమలారివి. అతడు అకళంకుడు. నీవు సకళంకుడవు. అతడు సౌమ్యుడు. నీవు ఉగ్రమౌళివి. (ఉగ్రులలో శ్రేష్ఠుదవనియు,

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 8 : పుట–509*

2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 23 : పుట–512*

ఉగ్రుని (శివుని) శిరస్సు నందు ఉన్నవాడవని శ్లేష.)

*శ్లో॥ అకళంకః కమలాప్త స్సౌమ్యశ్శౌరిర్భవాంస్తు సకళంకః*
*కమలారి రుగ్రమౌళిః కథమిందో తవాప్యహో విధునామ* -1

ఓ చంద్రా! ఇట్టి నీకు విష్ణువునకు ఒప్పెడి 'విధు' నామము ఎట్లు తగును? అని యిందలి చమత్కారము. ఇది కూడా ప్రబంధ పక్కికలో నడిచిన వర్ణనా సరళి. ఇలా విరహాన్ని అనుభవిస్తూ ఉన్న దశలో కృష్ణుని వద్ద నుండి బ్రాహ్మణుడు తిరిగి వచ్చి ఆయన లేఖను రుక్మిణికి అందజేస్తాడు. పోతనగారి భాగవతంలో పై లేఖ వృత్తాంతం కానీ, రుక్మిణీ విరహ వృత్తాంతం కానీ లేవు. ఈ విషయంలో పోతనగారి కంటే తీర్థుల వారి రచనయే ఉత్కృష్టతరముగా సాగింది.

పురాణయుగములో లేఖ సంప్రదాయము లేనట్లే భావించాలి. కావుననే పోతనగారు ఆ జోలికి పోలేదు. మధ్య యుగములలో ఆ సంప్రదాయము ప్రారంభింపబడి వృద్ధి పొందినట్లుగా తోచుచున్నది. అది తీర్థుల నాటికి పరిణామము చెందినట్లుగా భావించాలి. అంతేకాక నాట్య సంప్రదాయములో ప్రదర్శన అనుకూలముగా యీ లేఖ సంప్రదాయం ఉండుట సముచితముగా ఉండును. శాకుంతల నాటకములో శకుంతల దుష్యంతునకు ప్రేమలేఖ వ్రాయడం అనే ఘట్టం ఉన్నది. దీనిని బట్టి నాట్య సంప్రదాయములో ప్రాచీన కాలము నుండియే అమలులో ఉన్న లేఖా వృత్తాంతమునే తీర్థుల వారు గ్రహించి సందర్భ శుద్ధిని పాటించారు. అయితే లేఖ నడుమ కీర్తనలకు చోటు ఉంచుట అంత సబబుగా తోచదు. ఇది కూడా నాట్య సంప్రదాయమనుకున్నచో ఆ దోషము పరిగణింపవలసిన పని ఉండదు. పోతన మూలానుసరణముగా లేఖ వృత్తాంతము జోలికి పోలేదు. అనంతరం స్వయంవర సభలో దూతిక రుక్మిణికి ఆయా రాజులను చూపి వర్ణిస్తుంది.

రుక్మిణి చర్వితచర్వణముగా యీ రాజులను నాకు చూపి వర్ణించడం ఎందుకు? నా ప్రియుడైన కృష్ణుని చూపుము అనగా దూతిక కృష్ణుని చూపెను.

*కీర్తన :*

*రుక్మిణి : చర్విత చరణే నాలం చక్రిణం దర్శయ బాలే*
*సారసకమల సంకాశాక్షం శారదచంద్రసన్నిభాస్యం*

*దూతే : సుందరం పశ్యసుందరి నందయశోదానందనం*
*నందనందన మాకలయ నారాయణతీర్థయతిగీతం* -2

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 24 : పుట-512
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 10 : పుట-520

కృష్ణునకు విశేషణంగా సారకమల సంకాశాక్షం, శారదచంద్ర సన్నిభాస్యం, చక్రిణం దర్శయ అని రుక్మిణి చేత పలికించారు. ఈ రెండును కృష్ణుని యొక్క సౌందర్య వర్ణనకు సంబంధించిన విశేషణాలు. ఇక్కడ వేదాంత సంబంధమైన విశేషణాలు వాడకుండా సందర్భోచితమైన సౌందర్య విశేషణాలు మాత్రమే వాడి తీర్థుల వారు రసపోషణ గావించారు. అందునా కళ్ళను వర్ణించేదొకటి, ముఖాన్ని వర్ణించేదొకటి అవడం గమనించాలి. కన్నులను బట్టియే ఎదుటి వాని అభిప్రాయం తెలుస్తుంది. ముఖం ఆకృతికి అద్దం లాంటిది.

ఇలా రాజసభావర్ణన, రాజుల వర్ణన, నాయిక ఒక్కొక్కరిని కాదంటూ ముందుకు వెళ్ళడం అనే సన్నివేశం కాళిదాసరఘువంశంలోను, హర్షుని నైషధంలోను కనబడుతుంది. వ్యాస భాగవతంలో కానీ, పోతన అనువాదంలో కానీ లేని యీ అంశాన్ని తీర్థుల వారు చెప్పడంలో ఒక ఔచిత్యము మరియు ఒక అనౌచిత్యము ఉన్నది.

ఔచిత్యము : కావ్యరచనాపరంగా రక్తి కట్టించే సన్నివేశమిది.

అనౌచిత్యము : గౌరీశ్వరుల పూజ చేసి రుక్మిణి తిరిగి అంతఃపురానికి వచ్చిన సన్నివేశం, ఆపై స్వయంవర సభా నిర్వహణ శ్రీకృష్ణుడు ఆమెను అపహరించి తీసుకొనిపోవుటకు తగినది కాదు. తీర్థుల వారు మొదటిదానికే ప్రాధాన్యతనిచ్చినట్లుగా కనబడుతున్నది.

కృష్ణుడు ద్వారకానగరానికి రాగానే వసుదేవాదులును, అంతఃపురకాంతలు సంతోషిస్తారు. సర్వాలంకృతమైన వివాహవేదికపై మంగళద్రవ్యాలతో వసుదేవాదులు, గర్గాది పురోహితులు చేరుకుంటారు. రుక్మిణీ కృష్ణుల వివాహ ప్రారంభాన్ని సూచిస్తూ మంగళాష్టకాలు చదువుతారు.

*శ్లో॥ సత్యజ్ఞానసుఖస్వరూపమమలం సర్వోత్తమంనిత్యదృక్*
*ప్రత్యక్తత్వమచింత్యశక్తి విలసద్విశ్వం పరబ్రహ్మయత్*
*లోకానుగ్రహ విగ్రహస్యజగతాంనాథస్య తస్యామరాః*
*రుక్మిణ్యాస్సతతం వివాహసమయే కుర్వంతుతే మంగళం -1*
సులగ్నే సావధాన

*శ్లో॥ గంగాద్యాః స్సరితోగ్రహాశ్చ శుభదాగంధర్వ విద్యాధరా*
*దిక్పాలా ఋషయశ్చ దేవమునయోదేవ్యశ్చగౌర్యాదయః*
*శ్రీవత్సాంకిత వక్షసస్సుమనసామగ్రేసరస్య ప్రభోః*
*రుక్మిణ్యాస్సతతం వివాహసమయే కుర్వంతుతే మంగళమ్ -2*
సులగ్నే సావధాన

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 39 : పుట-528*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 40 : పుట-529*

శ్లో॥ యోగోపీనయనోత్పలై రనుపమైరారాధితోగోకులే
గోభిర్గోపసుతై రనేకమునిభిర్హృత్పద్మకోశాంతరే
మాయామానుషవిగ్రహస్య మరుతస్తే వాలఖిల్యాదయో
రుక్మిణ్యాస్సతతం వివాహసమయే కుర్వంతుతే మంగళమ్
సులగ్నే సావధాన -1

శ్లో॥ బ్రహ్మావిష్ణురుమాపతిశ్రుతిచయోవాణీ రమోమాయుతా
ఆదిత్యావసవోగణాధిపముఖా రుద్రాశ్చభద్రప్రదాః
కాలాంభోధర దివ్యకాంతి విలసత్కాయస్యమాయావినో
రుక్మిణ్యాస్సతతం వివాహసమయే కుర్వంతుతే మంగళమ్
సులగ్నే సావధాన -2

శ్లో॥ వంశీనాదవినోద నందితసునందాద్యోకనవద్యోమహాన్
నందాద్యై రభిపూజితఃపరమయాభక్త్యాముహుర్లాలితః
యఃపూర్వంకమలేక్షణస్యకమలానాథస్యతస్యామరాః
రుక్మిణ్యాస్సతతంవివాహసమయే కుర్వంతుతే మంగళమ్
సులగ్నే సావధాన -3

శ్లో॥ విద్యుత్పుంజ నిభాంబరస్యవిలసద్గ్రైవేయకస్యప్రభోః
ముక్తాహారమహార్హకౌస్తుభమణిగ్రీవస్యకృష్ణాత్మనః
పూర్ణేందుప్రతిమాననస్యసుతరాంపూర్ణస్యభక్త్యామరాః
రుక్మిణ్యాస్సతతంవివాహసమయే కుర్వంతుతే మంగళమ్
సులగ్నే సావధాన -4

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 41 : పుట-529,530
2. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 42 : పుట-530
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 43 : పుట-531
4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 44 : పుట-532

శ్లో॥ మీనాంకాధికసుందరస్సురవధూదృక్చాతకాంభోధరో
గోపీమండలమండనాంచిత తనుర్యస్సుందరః పూరుషః
తస్యాఖండసుఖాత్మకస్య విదుషామేకాత్మకస్యప్రభోః
రుక్మిణ్యాస్సతతంవివాహసమయే కుర్వంతుతే మంగళమ్
సులగ్నే సావధాన -1

శ్లో॥ యేసత్యం ప్రవదంతిసర్వభువనే యాధర్మశీలాఃస్త్రియః
పాతివ్రత్యపరాయణాస్సురభయోమందారముఖ్యద్రుమాః
తేసర్వేయదునాయకస్యమహతస్సర్వాత్మకస్యప్రభోః
రుక్మిణ్యాస్సతతంవివాహసమయే కుర్వంతుతే మంగళమ్
సులగ్నే సావధాన -2

శ్లో॥ గర్గాద్యైర్మునిభిస్సదామితమహాశీర్వాదవర్మాంచితో
దేవైర్వ్యోమ్నివిమానమధ్యకలితైర్దత్తప్రసూనాంజలిః
సంతుష్టామరసమ్యగాచరిత భేరీనాదసంతుష్టవాన్
రుక్మిణ్యాస్సతతంవివాహసమయే కుర్యాత్సదా మంగళమ్
సులగ్నే సావధాన -3

తీర్థులవారు ఇక్కడ తొమ్మిది మంగళశ్లోకములు రచించారు. ఇది ఒక లోపముగా కనబడుతుంది. అయితే తొమ్మిది పూర్ణసంఖ్య కాబట్టి పూర్ణపురుషుని (శ్రీకృష్ణుడు పరిపూర్ణావతారి) వివాహమునకు నవసంఖ్యయే సముచితమని తీర్థులవారు భావించి తొమ్మిది శ్లోకాలు రచించినట్లుగా భావించాలి.

ఈ లగ్నాష్టక సంప్రదాయము ఆంధ్రదేశమునకు ప్రత్యేకమైనదిగా కనబడును. ఇతర ప్రాంతములవారు ముహూర్త సమయమున లగ్నాష్టక పఠనం చేయడం కనబడదు. తమిళదేశము వారి సంప్రదాయమును మనవారు కూడా గైకొనినారేమో ?

రుక్మిణీ కృష్ణులు ఒండొరులు తలలపై తలంబ్రాలు పోసుకున్నారు.

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 45 : పుట-533*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 46 : పుట-533*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 47 : పుట-534*

శ్లో॥ భైష్మ్యాఃపాణిసరోరుహాంజలిగతారక్తాస్తుముక్తాఃస్థితాః
యాముక్తాగళితాస్సురాగవిమలాః కృష్ణోత్తమాజ్ఞాశ్రయాః
యాతాస్తస్యయదూద్వహస్యపరమంసామ్యంవిశుద్ధాత్మనః
తాఃకుర్వంత్వభితశ్శుభానిసతతం శ్రీకృష్ణ వైవాహికాః -1

ఈ శ్లోకాన్ని ప్రసిద్ధి చెందిన 'జానక్యాఃకమలామలాంజలి పుటేయాఃపద్మరాగాయితాః' అన్న శ్లోకానికి దీటుగా తీర్థులవారు రచించడం విశేషం. అద్వైతమతస్థాపకుడు శంకరాచార్యుల వారికి ఇది అనుసరణగా కనిపిస్తుంది.

'జానక్యాఃకమలామలాంజలి పుటేయాః పద్మరాగాయితాః
న్యస్తారాఘవమస్తకేచ విలసత్కుంద ప్రసూనాయితాః
స్రస్తాశ్యామలకాయకాంతి కలితాఃయా యింద్రనీలాయితాః
ముక్తాస్తాశ్శుభదాభవంతు భవతాశ్రీరామవైవాహికాః -2

రుక్మిణీదేవితో వివాహానంతరం శ్రీకృష్ణుడు క్రమముగా జాంబవతి, భామా, సత్యా, భద్రా, లక్షణా, కాళింది, మిత్రవిందలను వివాహం చేసుకున్నాడు.

శ్లో॥ భైష్మీజాంబవతీ భామా సత్యాభద్రాచ లక్షణా
కాళిందీమిత్రవిందా చ మహిష్యోష్టాకభవన్ హరేః -3

ఈ విధంగా అష్టభార్యలతో కలసి ద్వారకానగరంలో రాజసౌధంలో సహస్రస్తంభ మంటపంలో రత్నసింహాసనారూఢుడై కొలువున్న శ్రీకృష్ణుని దేవతలు స్తుతించారు.

శ్లో॥ ద్వారకానగరే మధ్యేసహస్రస్తంభమంటపే
రత్నసింహాసనారూఢం సకళత్రం జగుస్సురాః ॥ - 4

కీర్తన : ప॥ ఆలోకయే రుక్మిణీ కళ్యాణగోపాలం

అ॥ప॥ నీలమేఘనిభాకారం బాలార్కసమానచేలం
నీలాంబరానుజం గోపాలంనీలాలకాంతం -5

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,12 : 48 : పుట-540
2. శంకరాచార్యులు, శ్రీరామ కర్ణామృతం, 1 : 82 : పుట-42
3. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,, 12 : 54 : పుట-550
4. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 55 : పుట-550
5. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 16 : పుట-551, 552

*చరణం:* ద్వారకాపురమంటపే ద్వాదశాదిత్యసన్నిభే
భూరిరత్నసింహాసనే భూసురఘనే
వీరాసనే సమాసీనం వికసితాంబుజాననం
ధీరయోగిసేవ్యమానం దేవకీ వసుదేవసూనం

*చరణం:* శంఖదుంధుభినాదితే శతగంధర్వాదిగీతే
పుంఖానుపుంఖనిగమ బుధజనావృతే
పంకజేక్షణరంభాది పటునటనవినోదితే
కుంకుమకేసరవర్షితే కోమలాకారచరితే

*చరణం:* దివ్యకిరీటకుండలదీప్త పీతాంబరధరం
నవ్యముక్తామణిహారం నానావిహారం
అవ్యయభూతి విస్తారం అమరనారీ సురాధారం
భవ్యకౌస్తుభకంధరం భక్తమానససంచారం

*చరణం:* అష్టమహిషీసమేతం అమరనారీసుసేవితం
తుష్టపుష్టజనావృతం తుంబురుగీతం
ఇష్టజనసమాశ్రితం ఈశ్వరమపరాజితం
దృష్టసర్వలోకజాతం దేవరాజాదివినుతం

*చరణం:* హేమముక్తామణిఛత్రం హీరరత్నకటిసూత్రం
చామరవ్యజనావృతం శరదిందువక్త్రం
కామకోటిసమగాత్రం కనకాంగదాదివిచిత్రం
శ్యామసుందరం పవిత్రం శరణాగతోద్ధారగోత్రం

*చరణం:* చంద్రాననభైష్మీభామా జాంబవతీసత్యామిత్ర
విందాభద్రాలక్షణాకాళిందీ నాయకం
నందనందనమాశ్రిత బృందబృందారకవంద్యం
నందితనారాయణతీర్థనందదమానందకందం -1

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 16 : పుట-551, 552

ఇక్కడ స్తంభ మంటప ప్రసక్తి ఇటీవల వెలిసిన దేవాలయ నిర్మాణ సంప్రదాయమునకు చెందినది. శ్రీకృష్ణుని కాలము నాటికి యిది లేదు. తీర్థుల వారు తననాటి యీ సంప్రదాయమును మరచిపోకుండా గ్రంథస్థం చేయడం విశేషం. నేటికినీ దేవాలయములలో దేవతా కళ్యాణం యీ మండపాలలోనే జరిపించడం ఆచారంగా కొనసాగుతోంది.

శ్రీకృష్ణుడనెడు మేఘం నుండి స్రవించిన దయ అనెడు అమృతధార నారాయణతీర్థుడను పర్వతముపై పడెను. అక్కడ నుండి శ్రీకృష్ణ విలాసవర్ణనమను రూపముతో అది (అమృతధార) ఒక నదియై లోకములనెల్ల ఆనందింపచేయుచూ విష్ణుభక్తులనెడు క్షేత్రములపై ప్రవహించుచున్నది. ఆ నది, ఆశ్రయించిన వారల కల్మషములను అపహరించుగాక.

శ్లో॥ *శ్రీగోపాలఘనాదపారకరుణాపీయూషధారాస్సృతా*
*యా నారాయణతీర్థభూధరపరిక్షిప్తాసమస్తాతదా*
*సంభూయాచ్యుత భక్తభూమిషువహం త్యానందయంతి జగత్*
*ప్రావిత్ర్యం వితనోతుకృష్ణవిలసల్లీలాతరంగిణ్యసౌ ॥ -1*

నారాయణతీర్థుల వారు ఈ 'శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ' గ్రంథము యొక్క మాహాత్మ్యం యీ విధంగా తెలుపుచున్నారు.

ఈ శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ గ్రంథమును భక్తిచేత పాడేవారిలో, వినేవారిలో కోరికలు కలవారికి కోరికలు యిచ్చును. మోక్షాపేక్ష కలవారికి మోక్షమును ఇచ్చును.

శ్లో॥ కామదాకామినామేషా ముముక్షూణాంచమోక్షదా
*శృణ్వతాం గాయతాం భక్త్యా కృష్ణలీలా తరంగిణీ -2*

శ్లో॥ *స్వామిన్ సర్వజగన్నివాస రచితాండోలాం సురేంద్రాదిభిః*
*వజ్రస్తంభవిచిత్రరత్నఖచిత స్వర్ణస్థలేమంటపే*
*ఆరుహ్యామరవర్యగీతమునిభిర్ధ్యేయాత్మమూర్తే హరే*
*లావణ్యామృతవారిధే విహారసత్కీర్తింసువిస్తారయ -3*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 55 : పుట-555*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 56 : పుట-556*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 58 : పుట-557*

కీర్తన : ప॥ జయమంగళం నిత్యశుభమంగళం

చరణం: మంగళం రుక్మిణీ రమణాయ శ్రీమతే
మంగళం రమణీయ మూర్తయేతే
మంగళం శ్రీవత్సభూషాయశార్జ్ణే
మంగళం నందగోపాత్మజాయ

చరణం: పూతనాకంసాది పుణ్యజనహారిణే
పురుహూతముఖదేవహితకరాయ
సూతాయవిజయస్యసుందరముఖాబ్జాయ
శీతకిరణాభిజనలభూషణాయ

చరణం: కాళీయమౌళిమణిరజింత పదాబ్జాయ
కాలాంబుద శ్యామదివ్యతనవే
కారుణ్యరసవర్షినయనారవిందాయ
కళ్యాణగుణరత్నవారినిధయే

చరణం: నవనీతచోరాయ నందాది గోపగో
రక్షిణే గోపికా వల్లభాయ
నారదమునీంద్రనుత నామధేయాయతే
నారాయణానందతీర్థగురవే -1

---

1. నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 12 : 17 : పుట-557, 558

పోతన తీర్థుల రచనలలోని కవితాంశాలను సంక్షిప్తంగా పరిశీలించాను. అయితే ఇద్దరిలోను కనింపించే సమాన కవితా ధర్మం భక్తి ప్రతిపాదనే, భక్తి ప్రతిపాదనకే ఇరువురూ ప్రాధాన్యం ఇచ్చారు.

అయితే వీరి రచనలలో కవితాంశాలు లేవని అర్థంకాదు. ఇద్దరి రచనలలోని కవితాంశాలను పైన సోదాహరణంగా చర్చించాను.

మొత్తం మీద పరిశీలిస్తే పోతన, తీర్థులు, కవిత్వ పటాటోప ప్రదర్శనకంటే భక్తి భావ ప్రకటనకే ప్రాధాన్యం ఇచ్చారు. అయితే వారి కవితా సాహిత్యంలో గల కవితా గుణాలన్నీ అలవోకగా ఆశువుగా వచ్చినవే కానీ వారు తెచ్చిపెట్టుకున్నవి కావు. అయినా వీరి రచనలలో కవితాంశాలు అందరినీ అలరించేవిగా ఉండటం విశేషం. వీరి పదప్రయోగం, ఆలంకారికత పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

గాన యోగ్యత వారి కవిత్వంలోని మరొక ప్రత్యేక ఆకర్షణ, పోతన పద్యాలుగానీ, తీర్థుల తరంగాలు కానీ శ్రావ్యంగా గానం చేయడానికి ఎంతో అనుకూలంగా ఉంటాయి. ఈ కారణంగా పండిత ప్రకాండులనే కాక సామాన్యుణ్ణి సైతం పోతన పద్యాలు, తీర్థుల తరంగాలు ఎంతగానో ఆకర్షించాయి. నిరక్షరాస్యులైన సామాన్యులు కూడా తమకు తోచిన విధంగా పోతన పద్యాలను చదువుకోవడానికి, తీర్థుల తరంగాలు పాడుకోవడానికి ఆసక్తిని కనబరచడం విశేషం.

కామదా కామినామేషా ముముక్షూణాంచ మోక్షదా ।

శృణ్వతాం గాయతాం భక్త్యా కృష్ణలీలాతరంగిణీ ॥



# సద్గురు శివనారాయణ తీర్థ యతీంద్రులు

# ప్రజా బాహుళ్యంలో...
# పోతన పద్యాలు, తీర్థుల తరంగాలు

పోతన భాగవతం ప్రజలలో చొచ్చుకుపోవడానికి ఆయన భాగవతంలో చేసిన వర్ణనలు, పాత్రపోషణ, రస పోషణ, భాష, భక్తిభావము మొదలైన అంశాలు ముఖ్యమైనవిగా భావించవచ్చును.

## 1. వర్ణనలు :

పోతన తన భాగవత రచనలో పద్య గద్యాలలో పెక్కు వర్ణనలు కావించి యున్నాడు. అవి విశదములు, సమగ్రములు అయి పాఠకుల మనో నేత్రాలలో సాక్షాత్కారం చేయుచున్నాయి. శ్రీకృష్ణుని చిలిపి చేష్టలనుపరికించిన పోతనగారి వర్ణనా పాటవం వ్యక్తమవుతుంది.

*సీసం : కలకంఠి! మావాడగరితల మెల్లనీట్టి రాఁగలఁడని పాలపెరుఁగు*
*లిండ్లలోపలనిడియే మెల్లఁదనత్రోవఁ జూచుచోనెప్పుడు సొచ్చినాఁడో?*
*తలుపుల ముద్రలుఁ దాళంబులును బెట్టి యున్నచందంబునన్నవరయ*
*నొకయింటిలోనాడు నొకయింటిలోఁబాడు నొకయింటిలో నవ్వు, నొకటఁదిట్టు*

*ఆ॥వె॥ నొకటవెక్కిరించు నొక్కొకచో మృగ, పక్షిఘోషణములు పరఁగఁజేయు*
*నిట్లుసేసి వెనుకనెక్కడఁబోవునో?, కానరాఁడు రిత్తకడవలుండు -1*

మూసిన తలుపులు మూసినట్లే ఉన్నాయి. చల్లకుండలు పగిలిపోయాయి. ఉట్టి వెన్న మాయమయింది. ఒక ఇంట్లో నాట్యం, మరొక ఇంట్లో పాటలు, ఒక చోట నవ్వు మరొకచోట తిట్టు, ఆ ఇంట్లో నుండి వెక్కిరింపులు, ఈ ఇంట్లో నుండి జంతువుల అరుపులు, పక్షి కూతలు యశోదమ్మా! ఏమని చెప్పేది, ఎప్పుడు ఎక్కడ ఉంటాడో తెలియదు. తలుపులు తీస్తే ఖాళీ కుండలు ప్రత్యక్షం. ఈ విధమైన వర్ణణ పోతనగారికి తక్క అన్యులకు అసాధ్యం.

దశమస్కంధంలో గో, గోపక, గొల్లభామల గుణచర్యాదులను వర్ణించుట పట్ల అతడు గొల్ల పల్లెల జీవితమును ఎంతో సహజ రమ్యముగా వర్ణించి యున్నాడు. గోపికా వస్త్రాపహరణమునకు ముందు వర్ష, శరత్, హేమంత ఋతువుల వర్ణన ఆ ఘట్టమునకు ఎంతో శోభను చేకూర్చుచున్నది. అలాగే కంసహరణకు బలరామసహితుడై కృష్ణుడు మధురానగరానికి వెళ్ళిన సందర్భంలో సూర్యాస్తమయ, చంద్రోదయ, సూర్యోదయవర్ణనలు ఆలంకారికంగాను, కవి సమయానుగుణంగాను, సహజంగాను ఉండి ఆ ఘట్టానికి అందాన్ని చేకూరుస్తున్నాయి. అలాగే దశమ స్కంధంలోని రాసక్రీడాభివర్ణనము దీర్ఘవచనంలో ఉన్నప్పటికీ

---

*1. పోతన భాగవతం, 10 : 327 : పుట-70*

మనోహరంగాను, ఇంపుగాను ఉంటుంది. ఈ వచనములు ఆయన ప్రపంచ పరిశీలనమును, భావనా పాటవమును, పాండిత్య ప్రకర్షను ప్రకటిస్తున్నాయి.

## 2. పాత్ర పోషణ :

పోతన భాగవతము సామాన్య ప్రజలలోకి చొచ్చుకొని పోవడానికి ఆయన ప్రదర్శించిన పాత్రపోషణ, కౌశలము కూడా ముఖ్య కారణము. ప్రహ్లాదుడు, అంబరీషుడు, ధ్రువుడు మున్నగు మహాభక్తుల గుణ స్వరూపములను పోతన చిత్రించిన విధానము అత్యంత శ్లాఘాపాత్రముగా ఉంది. దశమస్కంధములో గోపికల భక్తిమయ శృంగారమును అతి రమణీయంగా వర్ణించిన విధము పాఠకుల మనస్సును ఆకట్టుకుంది.

ఉ॥ *నీవు యశోదబిడ్డఁడవె? నీరజనేత్ర సమస్తజంతుచే*
*తోవిదితాత్మవీశుఁడవుతొల్లి విరించిదలంచిలోకర*
*క్షావిధ మాచరింపుమని సన్నుతి సేయఁగ సత్కులంబునన్*
*భూవలయంబుఁగావనిటుపుట్టితిగాదె మనోహరాకృతిన్ -1*

ఓ పద్మనేత్రా! అఖిల దేహధారుల బుద్ధికి సాక్షిరూపంలో అంతరాత్మగా ఉన్నావు. పరమేశ్వరా నీవు బ్రహ్మదేవుని ప్రార్థనను ఆలకించి భూభారహరణం కోసం యదువంశంలో యశోదకుమారుడవయ్యావు.

ఉ॥ *గోవులవెంటఁ ద్రిమ్మరుచుఁగొల్చినవారల పాపసంఘముల్*
*ద్రోవఁగఁజాలిశ్రీఁదనరి దుష్టభుజంగఫణాలతాగ్రసం*
*భావితమైన నీచరణపద్మము చన్నులమీఁదమోపి త*
*ద్భావజ పుష్పభల్లభవబాధహరింపు వరింపుమాధవా ! -2*

నీవు లక్ష్మీవల్లభుడవు. నీవు మమ్ము స్వీకరించుము. నీ పాదపద్మము ఆవుల వెంట సంచరిస్తుంది. పాపాన్ని పటాపంచలు చేస్తుంది. సిరిచేత సేవింపబడుతుంది. కాళియుని పడగలపై నాట్యం చేసింది. దానిని మా స్తనద్వయంపై పెట్టుము. దాని వలన మాకు మన్మథ శరపరంపర తొలగిపోతుంది అని గోపికలు కృష్ణుని వేడుకున్నారు.

అలాగే మిగిలిన ఘట్టాలలో కూడా హిరణ్యకశిపుడు, కంసుడు వంటి వారి దౌర్జన్యాలను, దుర్వాసుడు, శిశుపాలుగు మున్నగువారి దురహంకారాన్ని వర్ణించిన ఘట్టాలు హృద్యంగాను, ఉపదేశాత్మకంగాను ఉంటాయనడంలో సందేహం లేదు. కుచేలుని సాధుత్వాన్ని, నిర్లిప్తతను, దేవకీ వసుదేవులు, నంద యశోదల వాత్సల్యాన్ని, బలిచక్రవర్తి వీరవదాన్యతను, సత్రాజిత్తు ధనలోభాన్ని, రుక్మి మూర్ఖత్వాన్ని, జాంబవంతుని

---

1. *పోతన భాగవతం, 10 : 1040 : పుట-236*
2. *పోతన భాగవతం, 10 : 1042 : పుట-237*

భక్తిని వర్ణించిన తీరు శ్లాఘనీయము. ఇంతే కాకుండా అవి పాఠకుల హృదయాలను హత్తుకునేటట్లుగా ఉన్నాయి. భాగవతాన్ని శ్రద్ధతో చదివే వారి మనస్సులలో ఆయా మంచి చెడు గుణ స్వరూపాలు తొలగిపోకుండా సుస్థిరంగా నిలిచి ఉంటాయి. ఇలా ఉండడానికి కారణం పోతన ఆయా పాత్రల చిత్రీకరణలో చూపిన అపార నైపుణ్యమే.

## 3. రస పోషణ :

భాగవతంలో ఏ ఘట్టాలు చదివినా పాఠకులు ఆనంద తన్మయత్వాన్ని పొంది రసాస్వాదన పొందుతారనడంలో అతిశయోక్తి కానరాదు. భాగవతం మొత్తంలో దశమస్కంధానికి ఒక ప్రత్యేకత ఉంది. ఎందుకనా శ్రీకృష్ణుడు గోపికా వృత్తాంతంలో పోతనగారు శృంగారాన్ని భక్తితో మేళవించి తెలుగు వాఙ్మయంలో మరెక్కడా కనిపించని చక్కని రస వాతావరణాన్ని కల్పించాడు. స్థూలదృష్టికి శ్రీకృష్ణుని యెడ గోపికలు చూపిన భావము లౌకికమైన శృంగారం వలె కనిపిస్తాయి. కానీ సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలిస్తే అది తుచ్ఛమైన లౌకిక కామం కాక మోక్షరతితో కూడిన ఉజ్జ్వల శృంగారంగా గోచరిస్తుంది. పోతన సహజంగా సాత్త్విక గుణ సంపన్నుడైనా రసపోషణ పట్ల విజృంభించి ఏ రసాన్నైనా పొంగి పొరలేటట్లు వర్ణించడంలో ఆయనకు ఆయనే సాటి. రుక్మిణీ కళ్యాణఘట్టంలో అనురాగంతో కూడిన ఆదర్శ శృంగారం వర్ణింపబడింది.

*సీసం॥ లోపలిసౌధంబులోన వర్తింపంగఁదేవచ్చునే నిన్నుఁ దెత్తునే నిఁ*
*గావలివారలఁగల బంధువులఁజంపికానితేరాదని కమలనయన*
*భావించితేని నుపాయంబు సెప్పెద నాలింపుకులదేవయాత్రఁజేసి*
*నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్కఁ బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతు*

*తే॥గీ॥ నెలమి మావారు పంపుదురేనునట్లు పురము వెలువడి యేతెంచి భూతనాథు*
*సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు వచ్చికొనిపొమ్ము నన్ను నవార్యచరిత –1*

*ఓ కృష్ణా ! కన్యాంతఃపురములో ఉన్న నన్ను ఎలా వెంటబెట్టుకొని వెళ్ళేది అన్న శంక నీకు వద్దు. అంతః పుర రక్షకులను, బంధుజనాలను చంపనవసరం లేని ఒక చక్కటి ఉపాయం నీకు చెబుతాను. నేను మా యింటి ఇలవేల్పు మంగళగౌరికి మ్రొక్కులు చెల్లించడానికి ఊరి వెలుపల దుర్గ గుడికి వస్తాను. ఎవరు అడ్డుపడినా జయించగలిగిన నీవు నన్ను నిరాటంకంగా తీసుకొని పొమ్ము అని రుక్మిణి భావము.*

అలాగే యుద్ధ రంగంలో ధనస్సు పట్టుకొని సత్యభామ యుద్ధం చేయు సందర్భంలో వీరశృంగారములను ఒకటిగా చేసి అతిలోక రమణీయంగా చేసిన వర్ణనలు పాఠకలోకాన్ని ఆకట్టుకొంటున్నాయి. కృష్ణుడు రుక్మిణి సోదరుడైన రుక్మిని అవమానపరిచే ఘట్టంలో హాస్య భీభత్సరసాలుంటే, భీష్మాదులు శ్రీకృష్ణుని

---

*1. పోతన భాగవతం, 10 : 1709 : పుట–396*

స్తుతించే సందర్భంలో శాంతరసం చక్కగా పోషింపబడింది. ఈ విధంగా పోతన భాగవతంలో ఆయా ఘట్టాలలో ఆయన చూపిన అపార రసకౌశలము పఠితలకు బ్రహ్మానంద సహోదరమై రసానందమును ప్రసాదించింది.

## 4. వ్యంగ్య రచన :

భాగవతంలో కృష్ణుని గుణగణాలు మహిమలు వర్ణించిన పోతనకు దురహంకారచిత్తులైన కంసశిశుపాలాది విరోధులు శ్రీకృష్ణుని చేసిన నిందలను కూడా వర్ణించవలసి వచ్చింది. అటువంటి సందర్భాలలో సహజ పండితుడైన పోతనగారు వ్యంగ్యరచనతో ఆ పాత్రల నిందావాక్యాలను రచించారు. ఈ విధంగా తాను చెప్పదలచుకున్న అంశాన్ని తనకు తన పాఠకలోకానికి కూడా హృదయానికి ఏ మాత్రం గాయపరచకుండా ఉండేటట్లు జాగ్రత్తపడ్డాడు. అటువంటి ఘట్టాలలో స్తుతినిందలను రెండింటినీ కూడా సమాంతరంగా పోషిస్తూ దుర్జనులైన వారి పక్షాన నింద, భక్తుడైన తన పక్షంలో స్తుతి ప్రతిబింబించేటట్లు రాయడం ఆయనకే సాధ్యమయ్యింది.

అంతే కాకుండా ఆయా ఘట్టాలను రచించడంలో పోతనగారు చూపిన నేర్పు అనితర సాధ్యమై పఠితలను ఆనందసాగరంలో మునకలు వేయిస్తుంది.

దశమ స్కంధంలో రథంపై వచ్చిన అక్రూరుణ్ణి చూసి కృష్ణుడు ఇలా అంటాడు.

*కందం॥ జలములు చేరువనున్నవి, తలపోయఁగ నీవు పోయి తడవయ్యె! నదీ*
*జలముల నభమునధరణిం, గలుగని చోద్యములు నీకుఁగానంబడెనే? -1*

నీళ్ళు దగ్గరలోనే ఉన్నాయి. స్నానం చేయడానికి ఆలస్యమయ్యిందేమిటి? ఆకాశం భూమి మీద కనబడనటువంటిది నీళ్ళల్లో ఏమైనా కనబడిందా! అని కృష్ణుని భావము.

అక్రూరుడు దానికి సమాధానమిస్తూ

*కందం॥ నీలోన లేచి చోద్యము, లేలోకములందుఁజెప్పు; రీశ్వరనీటన్*
*నేలన్ నింగినినున్నవె? నీలోఁజోద్యంబు లెల్లనెగడె మహాత్మా ! -2*

సమస్త చరాచరం నీలోనే ఉన్నది. ఇక ప్రత్యేకంగా నీరు, భూమి, ఆకాశంలో కనబడడానికి ఏముంటాయి? అన్న అక్రూరుని భావములో వ్యంగ్యం ద్యోతకమవుతుంది.

ఈ సన్నివేశం వ్యంగ్య వైఖరితో కూడి అత్యంత రమణీయమై ఉంటుంది.

---

*1. పోతన భాగవతం, 10 : 1237 : పుట-288*

*2. పోతన భాగవతం, 10 : 1238 : పుట-288*

## పోతన భావము :

సంస్కృతంలో వ్యాసమహర్షి వెల్లడించిన భావాలనే పోతన వన్నెలు చిన్నెలు పెట్టి తెలుగులో వ్యక్తం చేశాడు. అయినా కొన్ని చోట్ల స్వతంత్ర భావాలను కూడా ప్రకటించాడు. అనువాద విధానంలో ఆయా ఘట్టాలలో ఆయన వ్యక్తం చేసిన భావములు ప్రౌఢములు, ఉదాత్తములు, ఔచిత్య శోభితములు అయి ఆయన అపూర్వ ప్రతిభాశక్తిని వెల్లడి చేయుచున్నాయి.

*శా॥ "ఏలా బ్రహ్మపదంబు? వేదములకున్ వీక్షింపఁగా రానివి*
*న్నీలోకంబున నీవనాంతరమునందీమందలోఁ గృష్ణయం*
*చాలాపాదిసమస్త భావములు నీయందే సమర్పించు నీ*
*వ్రేలందొక్కని పాదరేణువులుపై వేష్టించినంజాలదే ? -1*

ఓ కృష్ణా ! నీ గురించి చెప్పిన వేదాలు నిన్ను దర్శించలేవు. అయితే గోపకులు నిన్ను సహచరునిగా పొందగలిగారు. వారు తమ భావాలన్నీ నీ యందే సమర్పించుకున్నారు. వీరిలో ఒక్కరి పాదరేణువు నా శిరస్సుపై ధరింపగలిగితే చాలు. ఈ బ్రహ్మపదవి ఎందుకయ్యా! అని బ్రహ్మ పలికాడు.

*మ॥ నిను హింసించిన పూతనాదులకు మున్నీమేటి సంకేతమి*
*చ్చిన నీకుంబురదారపుత్రగృహగోస్త్రీప్రాణదేహాదులె*
*ల్లనువంచింపకయిచ్చు గోపకులకున్ లక్షింపనేమిచ్చెదో !*
*యని సందేహము దోఁచుచున్నది ప్రపన్నానేక రక్షామణీ ! -2*

ఓ కృష్ణా, నిన్ను చంపదలచిన పూతనాదులకు మోక్షాన్ని ప్రసాదించావు. నీ యందే సర్వము సమర్పించుకున్న గోపకులకు మోక్షం కన్నా ఇంకా ఎక్కువైనది ఏమిస్తావో? అన్న సందేహం బ్రహ్మ వ్యక్తం చేశాడు.

ఈ విధంగా మొదలైన పద్యములు అతని భావప్రౌఢికి తార్కాణములు. గోపికాగీతలు, భ్రమరగీతలు మొదలగు ఘట్టములలోని పద్యములన్నీ అర్థగంభీరములై చదివిన కొలది చవులూరించును.

## పోతన ఆత్మీయత :

భాగవతంలో భగవంతుని యొక్క ఏకవింశత్యవతారముల చరిత్ర చెప్పబడి ప్రసక్తానుప్రసక్తంగా భగవంతుని భక్తితో గొలిచి యాతని కరుణా కటాక్షములకు పాత్రులైన భక్తుల చరిత్రలు కూడా చెప్పబడ్డాయి. ఈ స్వభావాన్ని బట్టి యిది పరాశ్రయ కవిత్వమనిపించును. కానీ పోతన కూడా మహాభక్తుడవడం చేత అందు వర్ణింపబడిన భక్తులతో తనకభేదాధ్యవసాయము కల్పించుకొని తద్వారా తన భావములను కూడా వ్యక్తం చేశాడు. దీని చేతనే అతని ఆత్మీయత పెక్కు చోట్ల కనిపించుచుండును. దశమ స్కంధములో భక్తి

---

1. *పోతన భాగవతం, 10 : 572 : పుట-127*
2. *పోతన భాగవతం, 10 : 573 : పుట-127*

పరాకాష్ఠ పొందిన గోపికల వృత్తాంతము ప్రధానంగా వర్ణితమై ఉండుటచే అందు ప్రతి ఘట్టములోను గోప గోపీజనము రూపంలో పోతనయే మనకు సాక్షాత్కరించుచున్నాడు.

*సీసం॥ నీ పాదకమలంబునెమ్మిదగ్గఱc గాని తరలిపోవంగc బాదములురావు;*
*నీకర్ణాబ్జంబులు నెఱినంటితివcగాని తక్కినపనికి హస్తములుసొరవు;*
*నీవాగమృతధారనిండcగ్రోలcగcగాని చెవులన్యభాషలు సేరివినవు;*
*నీ సుందరాకృతి నియతిc జూడcగcగాని చూడవన్యంబులcజూడ్కికవలు;*

*ఆ॥వె॥ నిన్నెకాని పలుకనేరవు మాజిహ్వ లొల్లననుచుc బలుకనోడ నీవు*
*మా మనంబులెల్ల మరపించి దొంగిలి తేమిసేయువారమింకc? గృష్ణ ! -1*

మా కాళ్ళు, చేతులు, చెవులు, కన్నులు, నాలుకలు నీవు తప్ప అన్యములను కోరవు. నీవు మాత్రం మా మనసులను మురిపించి అపహరించావు. నీవు మమ్మల్ని ఒల్లనని పలకడానికి జంకడం లేదు. ఇక మేము ఏమీ చేయలేమని గోపికల భావము. తానే గోపిక అయిన పోతన తన భావాన్నే గోపికల మాటల రూపంలో ఆత్మీయ వచనాల ద్వారా పలికించాడు.

ఇంత ఆత్మీయతతో కూడినది కనుకనే దశమ స్కంధము గీతికాప్రాయమై పాఠకులకు పరమానందం కలిగించుచున్నది.

## భాగవతము - భక్తి :

మానవులకు మోక్షప్రాప్తి సాధనాలుగా భక్తి, జ్ఞాన, కర్మ మార్గములను పూర్వులు నిర్దేశించారు. వీటిలో పండిత పామర, స్త్రీ పురుష భేదము లేక అందరికీ అనుసరణీయమైనది భక్తి మార్గమొకటే. భాగవతం జ్ఞాన, కర్మ మార్గాల కంటే భక్తిమార్గానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. ఇందులో వెల్లడించిన భక్తుల చరిత్రలన్నీ భక్తి ప్రాధాన్యమును చక్కగా వెల్లడించినాయి. భాగవతం దశమ స్కంధమంతా ఒక ఎత్తు. తక్కిన స్కంధములన్నియూ ఒక ఎత్తు. గోపికలు దీనిలో భగవంతుడైన కృష్ణుని ఆత్మేశ్వరునిగా భావించి అనిర్వాచ్యమైన నిర్మల భక్తిని ప్రకటించారు. అదే మధురభక్తి.

*శా॥ నామోసంబున కెద్దిమేర ? వినవే నా పూర్వజన్మంబులన్*
*లేమా! నోములనోcచుచోనకట! కాళిందీతటిన్ వేణువై*
*భూమింబుట్టెదనంచుcగోరcదగదే? బోధిల్లియట్లైన నీ*
*బామందిప్పుడు మాధవాధరసుధాపానంబుగల్గుంగదే ? -2*

---

*1. పోతన భాగవతం, 10 : 990 : పుట-224*

*2. పోతన భాగవతం, 10 : 782 : పుట-179*

మాధవుని అధరామృతం ఆశిస్తున్న గోపిక తనను తాను విధివంచితురాలనని నిందించుకున్నది. గత జన్మలో నోములు నోచేటప్పుడు యమునానదీ తీరంలో వెదురుమొక్కగా పుట్టాలని కోరుకోలేకపోయాననే బాధ వ్యక్తం చేసింది గోపిక.

ఈ విధమైన పద్యములలో కనబడే గోపికాభావములచేత ఇందలి భక్తి శృంగారమిశ్రితమై ఉండుటే కాక స్త్రీ పురుష సంబంధమై ఉండుట చేత సామాన్యులకిది తుచ్ఛమైన కామముగానే గోచరించుచుండును. భక్తుడు పురుషుడై మధురభక్తి ప్రదర్శించినప్పుడు అందలి స్వరూపమెక్కువ నిర్మలముగా భాసించును. చైతన్యాదుల నిరతిశయమైన భక్తి అట్టిదే. మధురభావముతో కూడిన భక్తి శరీర సంయోగమాత్రతర్పితమగు తుచ్ఛకామమునకు సంబంధించినది కాదు. అది మోక్ష కామమునకు సంబంధించినది. బ్రహ్మాభావనతో తుల్యమని చెప్పదగిన ఈ మోక్ష సంబంధి శృంగారమే శక్తి శృంగారము లేక మధురభక్తి అని చెప్పబడుచున్నది. దశమ స్కంధంలో వర్ణితమైన గోపికా కృష్ణుల శృంగారము అట్టి దివ్య శృంగారమే కానీ స్త్రీ పురుష సంయోగమునకు సంబంధించిన లౌకిక శృంగారము కాదు.

కృష్ణుని పాదముల మాహాత్మ్యము భావించిన క్రమము చూసిన గోపికల భక్తి నైర్మల్యము విశదమగును.

*సీసం॥ ఈ చరణంబులే యిందు నిభానన ! సనకాది మునియోగ సరణినొప్పు;*
*నీ పాదతలములే యెలనాఁగ! శ్రుతిశిరఃసీమంతవీధులఁజెన్నుమిగులు;*
*నీ పాదాబ్జంబులేయిభకులోత్తమయాన ! పాలేటి రాచూలిపట్టుఁగొమ్మ;*
*లీ సుందరాంఘ్రులే యిందీవరేక్షణ; ముక్తికాంతా మనోమోహనంబు;*

*ఆ॥వె॥ లీయడుగుల రజమెయింతి! బ్రహ్మేశాది దివిజవరులు మౌళిదిశలఁదాల్తు*
*రనుచుఁగొందఱబల లబ్జాక్షుఁడేగిన క్రమముఁగనియు నతనిఁగానరైరి* -1

సనకాదుల ధ్యానమార్గమున వెలుగొందేవి, వేదములనెడి భామినుల పాపటపై భాసిల్లేవి, లక్ష్మీదేవికి ఆధారభూతమైనవి, మోక్షకాంత మనసును మోహింపజేసేవి, బ్రహ్మరుద్రాదులు ఔదల ధరించేవి శ్రీకృష్ణుని పాదపద్మములు. వాటిని గోపికలు గుర్తించలేకపోయారని భావము.

కృష్ణుని పాదముల సౌందర్యము వారు తాత్త్విక దృష్టితోనే కానీ ఐహిక దృష్టితో చూడలేదని యిందలి విశేషము చెప్పుచున్నది. పరస్పర విరుద్ధములైన భక్తి శృంగారములను మేళవించి ఉచితంగా పరిపోషించుట ప్రతిభైక సాధ్యమైన పని. దశమ స్కంధములో పోతనగారు యీ కార్యాన్ని అనితర సాధ్యముగా నిర్వహించి భాగవతంలోని మిగిలిన స్కంధలకు దానిని హారముగా చేసినాడు.

---

*1. పోతన భాగవతం, 10 : 1030 : పుట-234*

భాగవతం పట్ల ఆంధ్రులకు ఏ కారణము చేతనో ధర్మభావనతో సరిసమానముగా నర్మభావము అల్లుకున్నది. రుక్మిణీ కళ్యాణములు ఉల్లాసముతో ఊరూరా జరుగుచుండును. భామా కలాపము వీధి నాటకమైనది. రుక్మిణీదేవి తెలుగుసీమకు పెద్దకోడలు. అట్లే సత్యభామ చిన్న ఆడబిడ్డ. అందువలననే ఆమె పేరు దేశంలో చనవునకు, చక్కదనానికి, సుతిమెత్తని సుద్దిగా సుమాళించినది. సత్యభామ ఉన్నచో చీకటింట దీపము అక్కరలేదుట. సత్యభామ సౌందర్యమును, స్వాభిమానమును జోడించి నాచనసోమన పద్యం రాస్తే పోతనగారు ఆమె వీర శృంగార ప్రతిమను ప్రదర్శించాడు.

*అరిఁజూచున్ హరిఁజూచు సూచకములై యందంద మందారకే*
*సరమాలా మకరందబిందు సలిలస్యందంబులందంబులై*
*తొంఁగన్ పయ్యెద కొంగొకింత తొలఁగన్ తోడ్తో శరాసారమున్*
*దరహాసామృత పూరమున్ కురియుచున్ దన్వంగి హేలారతిన్ -1*

*పరుఁజూచున్ వరుఁజూచు నొంపనలరింపన్, రోషరాగోదయా*
*విరతభ్రూకుటి మందహాసములతో, వీరంబు శృంగారమున్*
*జరగన్, కన్నులకెంపు సొంపు పరగన్ చండాస్త్రసందోహమున్*
*సరసాలోక సమూహమున్ నెఱపుచున్ చంద్రాస్య హేలాగతిన్ -2*

పోతన భక్త్యావేశంతో సొంత భావములను క్రుమ్మరించారు. ఆంధ్రభాగవతమునకు అనన్య సాధ్యమైన ఒక విశిష్టత చేకూర్చినది భక్తి. ఆ మహాకవి వాణికి జయము.

*గుడులు కట్టించె కంచర్ల గోపరాజు*
*రాగములు కూర్చె కాకర్ల త్యాగరాజు*
*పుణ్యకృతి చెప్పె బమ్మెర పోతరాజు*
*రాజులీ మువ్వురును భక్తి రాజ్యమునకు -3*

రాజభోగాలు ఆశించకుండా అహంకారాన్ని విడిచి భగవద్భక్తి సామ్రాజ్యంలో మునకలు వేశారు పోతన. ఆయన రాజు కాని రాజు, రాజ్యం లేని రాజు అనడంలో అతిశయోక్తి ఉండదు. గోపరాజు రాముడికి గుళ్ళు కట్టిస్తే పోతరాజు తెలుగు గుండెల్లో కృష్ణుడికి గుళ్ళు కట్టించాడు. పోతన భాగవతం అప్పుడే తీసిన వెన్నలా ఉంటుంది. ఆంధ్రదేశంలో ఏ యింట్లో చూసినా పోతనగారి పద్యాలు ఆయా సందర్భాలలో తొంగి చూస్తాయి.

---

1. *నాచన సోమన, ఉత్తర హరివంశము, 1 : 162 : పుట-30*
2. *పోతన భాగవతం, దశమస్కంధం, ఉత్తర భాగం, 178 : పుట-36, 37*
3. *కరుణశ్రీ, భాగవత వైజయింతిక పుట-1*

"అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మచాలఁ బెద్దమ్మ" -1

"చేతులారంగ శివునిఁ బూజింపడేఁని నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని" -2

"నీకున్ మ్రొక్కెదఁద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ" ! -3

"ఒక సూర్యుండు సమస్త జీవులకుఁ దానొక్కొక్కడై తోఁచుపోలిక" -4

"మందార మకరంద మాధుర్యమునఁదేలు మధుపంబు వోవునే మదనములకు ?" -5

"కమలాక్షునర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వజిహ్వ" -6

"ఇందుఁగలఁడందులేఁడని సందేహము వలదు" -7

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై" -8

"రావే యీశ్వర ! కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా!" -9

"అల వైకుంఠపురంబులో నగరిలో" -10

"సిరికింజెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపడు" -11

"కారే రాజులు ? రాజ్యముల్ గలుగవే ? గర్వోన్నతిం బొందరే ? వారేరీ" -12

"కలయో ! వైష్ణవ మాయయో !" -13

---

1. పోతన భాగవతం, 1 : 10 : పుట-4
2. పోతన భాగవతం, 1 : 14 : పుట-6
3. పోతన భాగవతం, 1 : 200 : పుట-63
4. పోతన భాగవతం, 1 : 226 : పుట-71
5. పోతన భాగవతం, 7 : 150 : పుట-42
6. పోతన భాగవతం, 7 : 169 : పుట-47
7. పోతన భాగవతం, 7 : 275 : పుట-77
8. పోతన భాగవతం, 8 : 73 : పుట-171, 172
9. పోతన భాగవతం, 8 : 90 : పుట-176
10. పోతన భాగవతం, 8 : 95 : పుట-177
11. పోతన భాగవతం, 8 : 96 : పుట-177
12. పోతన భాగవతం, 8 : 590 : పుట-287

13.. పోతన భాగవతం, 10 : 342 : పుట-72

*"వీరెవ్వరు ? శ్రీకృష్ణులు గారా ?, యెన్నఁడును వెన్నఁగానరఁట కదా" -1*

*"నల్లనివాఁడు పద్మనయనంబులవాడు కృపారసంబుపైఁజల్లెడివాఁడు" -2*

*"నీ పాదకమలసేవయు నీ పాదార్చకులతోడి నెయ్యము" -3*

*"ఘనుఁడా భూసురుఁడేగెనో ? నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో ? " -4*

ఇలా పోతనగారు తెలుగువారి ఉచ్ఛ్వాస నిస్వాసాలలో, నిత్య జీవితాలలో మనసు, మాట, పాట, ఆచార వ్యవహారాలు, నుడికారం. ఒక్కటేమిటి ప్రతి కదలికలోను మలయమారుతంలా కలసిపోయారు. ప్రతి గుండె తానే అయినారు.

ఆయన పురాకృత సుకృతం అంత గొప్పది కనుకనే ఆంధ్రదేశంలోని ప్రతి పల్లెసీమలలోను ఆయన కవిత్వం వీనులవిందై కనువిందు చేస్తోంది.

ఆయన రచించిన భాగవతం ఏ పుట త్రిప్పినా మూటగట్టిన అద్భుతమైన పదబంధాలు తీర్చిదిద్ది కనిపిస్తాయి.

ఇలా పోతన ప్రతి పద్యంలోను ఆయా పాత్రలే మనకు దృశ్యగోచరమవుతాయి. పోతనగారు ఆయా పాత్రలలో పరకాయ ప్రవేశం చేయడం చేతనే నేల నాలుగు చెరగులా ఆయన కవిత్వం పరవళ్ళు త్రొక్కింది.

"మధుమయఫణితీనాం మార్గదర్శీ మహర్షిః" -5

అన్న సుకవి సూక్తికి పోతనగారు అక్షరాలా అర్హుడు. ఆంధ్ర సారస్వత క్షేత్రాలలో ఆయన జల్లిన కవితా బీజాలు బంగారు పంటలనే పండించింది. కనుకనే ఆయన కర్షక కవి, కవి కర్షకుడు.

"విద్యావతాం భాగవతే పరీక్షా" -6

అని కొమ్ములు తిరిగిన మహాపండితులకు కూడా కొరకరాని కొయ్యగా మారిన శ్రీమద్భాగవతం పోతనగారి చేతిలో బాలరసాలసాలమై ఆబాలగోపాలానికి ఆనందం పంచింది.

---

*1. పోతన భాగవతం, 10 : 374 : పుట-78*

*2. పోతన భాగవతం, 10 : 1011 : పుట-229*

*3. పోతన భాగవతం, 10 : 1270 : పుట-294*

*4. పోతన భాగవతం, 10 : 1727 : పుట-401*

*5. భోజుడు, చంపూ రామాయణం శ్లోకం 13, పుట-14*

*6. పోతన భాగవతం, 2వ సంపుటం, ప్రవేశిక (i)*

పోతనగారు తెలుగుదేశంలో భక్తి కల్పలతికకు మొగ్గలు తొడిగి పూవులు పూయించారు. భక్తి ప్రధానమైన మధురమైన శతకములు తెలుగులోనికి వచ్చింది పోతనగారి ఆంధ్ర భాగవతావతారమునకు తరువాతనే.

పోతనగారు భాగవతం రచించి 500 సంవత్సరములు దాటినా నాటి నుండి నేటి వరకు ప్రసిద్ధి చెందిన గ్రంథములలో ఆంధ్ర ప్రజానీకంలో ఆబాలగోపాలాన్ని అత్యధికంగా ఆకర్షించినది భాగవతమే. పల్లెల్లోనే కాకుండా పట్టణాలలో కూడా భాగవతంలోని పద్యాలు ప్రజలకు కంఠస్థాలైనాయి. పండితులు, పామరులు, బాలవృద్ధులు, స్త్రీ పురుషులు వారు వీరు అని కాకుండా అశేష ప్రజల హృదయాలలో నిలిచిపోయిన గ్రంథం భాగవతం. కేవలం పద్యాలే కాకుండా ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షణం, రుక్మిణీ కళ్యాణం వంటి ఘట్టాలే కంఠోపాఠములు. ఈ రోజున కూడా గజేంద్రమోక్షణ పద్యాలు నిత్యం చదివేవారున్నారు. భాగవతంలో భీష్మస్తవము, అక్రూరదండకము, గోపికాగీతలు, భ్రమరగీతలు నేటికీ పారాయణం చేయబడుతున్నాయి. అంతే కాకుండా విజయనగర సామ్రాజ్యాధీశులైన కర్ణాటక రాజులు తెలుగు భాగవత ఘట్టాలను పఠించేవారు.

"విద్యానగరమందు వీరనృసింహరాయలవారు బ్రాహ్మీముహూర్తాన లేచి ఆరాధ్యుల నామావళులున్నూ, సంకీర్తనలున్నూ, పాండవగీతలు, భ్రమరగీతలు, గజేంద్రమోక్షం, భారత సావిత్రి, గంగావతరణమున్నూ, భారతం, భాగవతం, ముచికుందస్తుతి, అక్రూరస్తుతియున్నూ... పఠించి విని" *-1*

ఈ విధంగా సార్వజనీనత్వము, సార్వకాలికత్వము, సార్వదేవికత్వము సంపూర్ణంగా మూర్తీభవించిన తెలుగు కృతి భాగవతం.

తెలుగు భాషలో భాగవతానికి యింత వ్యాప్తి కలగడానికి కారణం ఆయన భక్తి విశేషము మరియు అనితర సాధ్యకవితా మహత్త్వమే కారణం. పోతనగారు "సర్వం విష్ణుమయం జగత్" అన్న సూక్తిని అనుసరించినవాడు కాబట్టే నిర్లిప్తుడై పరమేశ్వర భక్తి భావనతో జీవితం గడిపేవాడు. తాను దారిద్ర్యావస్థలో ఉన్నా ధారుణీపతులను తృణీకరించాడు. తన స్థిరమైన భక్తి చేత భగవస్సాక్షాత్కారం పొందాడు.

కావుననే భాగవతం మహిమ అద్వితీయమైనది. పాషాణ హృదయాలనైనా దానిలోని పద్యాలు ద్రవింపచేస్తాయి. కసాయివాడు భక్తునిగా మారతాడు.

పోతన భాగవత రచనా విశిష్టతను గూర్చి ఆచార్య చిట్రాజు గోవిందరాజు –

"భాగవతాన్ని త్యాగరాజు ప్రతిరోజూ పారాయణ చేసేవాడని పెద్దలంటారు. ఆ భాగవత ప్రతి నేటికీ తాళపత్ర రూపంలో తిరువయ్యూరులో భద్రపరిచి ఉన్నారంటారు. భాగవత ప్రభావం ఆంధ్రదేశాన్ని దాటింది. శివాజీ మహాగురువు సమర్ధ రామదాసస్వామి ఆయన దాసబోధ గ్రంథంలో పోతన భక్తి ప్రపత్తిని ప్రశంసించి యున్నాడు. తమిళకవి సుబ్రహ్మణ్యభారతి "సిలకవియరశర్" అనే వ్యాసంలో భక్త పోతనను ప్రశంసించి

---

*1. విశ్వనాథుని స్థానాపతి, రాయవాచకం, పుట-2*

యున్నాడు. అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుకు ఐదవ యేట భాగవతం తోడనే అక్షరాభ్యాసమయిందట. కాబట్టి పోతన శ్రీమదాంధ్రభాగవతం తెలుగు తల్లికి వెట్టిన కలికితురాయి వంటిది." -1

అని భాగవతానశీలనము అనే గ్రంథంలో తాను రచించిన వ్యాసంలో వ్రాశారు.

మహర్షుల లాగా మహాకవులు కూడా దేశకాలజాత్యాదులతో విభాజ్యులు కారు. అమృతములు, అఖిల లోక కళ్యాణములు అయిన వారి రచనలు అటువంటివే. ఆంధ్ర వాఙ్మయంలో పోతన అటువంటి మహాపురుష, మహాకవి. ఆయన రచించిన భాగవత పురాణం అజరామరమైన కృతి. కనుకనే నేడు సాహితీ విమర్శకులు, చారిత్రకులు, కవులు, గాయకులు, సహృదయులు పోతనకు భక్త్యంజలులు సమర్పిస్తూనే ఉన్నారు.

జానపద సాహిత్యంలో కూడా భాగవతం మిక్కిలి విశిష్టతను సంతరించుకుంది. ముఖ్యంగా స్త్రీలు గృహ జీవితానికి కట్టుబడి ఉన్నా ఇహపరసాధకమైన భగవంతుని లీలలను గానం చేస్తూ గృహకృత్యాలను నిర్వహిస్తున్నారు. వీటిలో స్త్రీల పాటలు ముఖ్యమైనవి. రామాయణ, భారత, భాగవతములకు సంబంధించిన గాథలను స్త్రీలు భక్తి తన్మయులై గానం చేస్తున్నారు. భాగవతంలో ముఖ్యమైనది శ్రీకృష్ణావతార ఘట్టం. కృష్ణుడు బాల్యంలో చేసిన కొంటె చేష్టలు విపులంగా వివరింపబడటం చేత భాగవతంలో కృష్ణకథ అత్యంత ప్రశస్తిని పొందింది. స్త్రీలు తమ పసిబిడ్డలను ఆడిస్తూ, ఊయలలో ఊపుతూ శ్రీకృష్ణ లీలలనే గానం చేస్తారు. తల్లి అయిన ప్రతి స్త్రీ శ్రీకృష్ణ లీలలను గానం చేస్తూ తన్మయులవుతారు. దీనికి కారణం కృష్ణుని కొంటె పనులు, చిలిపి చేష్టలు వారిని ఆకర్షించడమే.

స్త్రీలు తమ నిత్యజీవితంలోని అనేక మధురమైన ఘట్టాలను భగవంతునిపరంగా అన్వయించుకుంటూ వాని వలన ఉద్దీప్తిని పొందుతున్నారు. తక్కిన వారికి కూడా భగవంతుని పట్ల అనురక్తిని కలిగిస్తున్నారు.

రుక్మిణీదేవి సారె, లక్ష్మీదేవి సొగసులాట, రుక్మిణీ సమర్త, రుక్మిణీదేవి వేవిళ్ళు, రుక్మిణీదేవి సీమంతము, సత్యభామ సరసము, రుక్మిణీదేవి ముచ్చట్లు మొదలగు వాటికి భాగవతంతో ఏ విధమైన సంబంధము లేకపోయినా స్త్రీల మనస్తత్వమునకు ప్రాతినిధ్యం వహించినవి. ఇవే కాకుండా భాగవతంలో ఉషాస్వప్నము వంటి అభ్యాసములే కాకుండా శ్రీకృష్ణజననం, బాల్యలీలలు, కృష్ణచల్దులు, గుమ్మడుపాట గోపికా గీతలు, భ్రమరగీతలు, చిలుకరాయబారం, రుక్మిణీకళ్యాణం, రుక్మిణీదేవి విజయం మొదలగు గాథలు స్త్రీల పాటల రూపంలో ప్రచారం పొందాయి.

కనిపెంచిన ప్రతి తల్లి కూడా తన చిన్నారి బిడ్డను శ్రీకృష్ణునిగా భావించి లాలిస్తూ శ్రీకృష్ణ జననాన్ని నోరారా పాడుకుంటారు.

---

*1. చిట్రాజు గోవిందరాజు, భాగవతానుశీలనము, పుట-415*

*కస్తూరి రంగరంగా నాయన్నకావేటిరంగరంగా*
*శ్రీరంగరంగరంగా నినుబాసి యెటునే మరచుమందు*
*కంసుని సంహరింప సద్గురుడు అవతారమెత్తినప్పుడు*
*దేవకీ గర్భముననను విష్ణువు కృష్ణుడై జన్మించెను*
*వసుదేవ పుత్రుడమ్మా యీ బాలవైకుంఠవాసుడమ్మా*
*నవనీత చోరుడమ్మా యీ బిడ్డ నందగోపాలుడమ్మా*
*సీతాకళత్రుడమ్మా యీ బిడ్డ శ్రీరామాచంద్రుడమ్మా*
*శిరసునాచింతామణి నా తండ్రి నాలుకను నక్షత్రము*
*వరుసగా భుజములందు శిశువునకు శంఖచక్రములు గలవు*
*వీపునా వింజామర నా తండ్రి బొడ్డునకు పారిజాతం*
*అరికాళ్ళ తామరలు నా తండ్రి కమరియున్నవి బాగుగా -1*

ఇదే విధంగా పెండ్లి పాటలు, బూజంబంతి పాటలు, పూజ పాటలు మొదలగు వాటియందు శ్రీకృష్ణుని ప్రాధాన్యం ఎన్నతగింది. ఈ విధంగా స్త్రీల పాటలలో భాగవతంలోని కృష్ణావతార గాథ అనేక మార్పు చేర్పులకు లోనైంది. విడదీయరాని బంధమైనది.

గత 1000 సంవత్సరాలుగా తెలుగులో అపారమైన సాహిత్యం ఆవిర్భవించింది. అయితే ఇంత విసృత సాహిత్యంలో పోతన భాగవత పద్యాలకు తెలుగునాట ఒక ప్రత్యేకత ఉండటం విశేషం. 3, 4 పోతన పద్యాలైనా రాని తెలుగు నిరక్షరాస్యుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. ఒకనాటి ఆంధ్రదేశంలో పెద్దలు తమ పిల్లలకు శతక పద్యాలతో పాటు పోతన భాగవత పద్యాలను కూడా నేర్పటం విధిగా కొనసాగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పోతన పద్యాలకు ఉన్న ఆదరణ అంతాఇంతా కాదు. తెలుగు వారిలో ఒక నమ్మకం గాఢంగా నాటుకొని ఉంది. వివాహం కాని ఆడపిల్లల చేత రుక్మిణీ కళ్యాణం చదివిస్తే వారికి వివాహం అవుతుందని తెలుగువారి నమ్మకం. ఈ విధంగా రుక్మిణీ కళ్యాణాన్ని ఒకప్పుడు ఆడపిల్లల చేత విధిగా చదివించారు. భాగవతం వివిధ భక్తి కథల సమాహారం. ఈ కారణంగా ఏకథకు ఆకథ వ్యస్తంగా చదువుకునే సౌలభ్యం ఉంది. ఉదాహరణకు : గజేంద్రమోక్షణం, ప్రహ్లాద చరిత్ర, రుక్మిణీ కళ్యాణం, అంబరీషోపాఖ్యానం ఇత్యాదులు. ఈ కథా భాగాలను ప్రచురణ కర్తలు విడివిడిగా చిన్నచిన్న పుస్తకాల రూపంలో ప్రజలకు అందించారు. ఇందువలన పోతన పద్యాలు ప్రజలకు మరింత చేరువ కాగలిగాయి.

---

*1. కొర్లపాటి శ్రీరామమూర్తి, పోతన సాహిత్యగోష్ఠి, పుట-147*

హరికథలలో కూడా పోతన పద్యాలలో పాడటం అందరికీ తెలిసిన విషయమే. అంతేకాక గజేంద్రమోక్షణం కథలను పోతన పద్యాలతోనే కొనసాగిస్తుండటం కూడా మనకు విదితమే. ఈ విధంగా పోతన గారి పద్యాలు ప్రజా బాహుళ్యంలోనికి ప్రసరించడం జరిగింది. మల్లాది సూరిబాబుగారు పోతన భాగవతం 1200 పద్యాలను గానంచేసి సి.డి.ల రూపంలో విడుదలచేయడానికి పూనుకున్నారు. ఇది ఒక బృహత్ కార్యంగా కొనసాగిస్తున్నట్లు ఈ కార్యక్రమ నిర్వహణ ద్వారా తమ జన్మ సార్థకమైనట్లు సూరిబాబు ఆనందంగా వివరించారు. -1

సహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మగారు కూడా కొన్ని భాగవత పద్యాలను చదివి సి.డి.గా విడుదల చేశారు.

భక్త ప్రహ్లాద – "చదివించిరి నను గురువులు", "మందార మకరంద మాధుర్యమునఁదేలు",

"ఎల్లశరీర ధారులకు", పంచాబ్దంబులవాడు "కలడంబోధి....ఇందుగలడందులేదను సందేహము వలదు" ముంచితి వార్ధులన్ ఇత్యాది పోతన పద్యాలను సందర్భోచితంగా విరివిగా ఉపయోగించారు. అదేవిధంగా చెంచులక్ష్మి చిత్రంలోను పోతన పద్యాలు మనకు కనబడుతాయి.

"చదివించిరి నను గురువులు"

"కంజాక్షునకు కాని కాయంబు కాయమే"

"పటుతర నీతిశాస్త్ర"

"మందార మకరంద మాధుర్యమున దేలు"

"ఇందుగలడందు లేడని సందేహము వలదు"

"ఢింభక సర్వస్థలముల"

శ్రీకృష్ణపాండవీయంలో రుక్మిణీ కళ్యాణ ఘట్టం మొత్తం పోతన భాగవత పద్యాలతోనే చిత్రీకరించబడింది, రెండు పర్యాయములు వెండి తెరకెక్కిన భక్తపోతన చిత్రాలలో పోతన పద్యాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. సముద్రాల, పింగళి, మల్లాది వంటి సమర్థులైన రచయితలు ఉండికూడా ఆయా చిత్రాలలో పోతన పద్యాలనే యథాతథంగా ఉపయోగించడాన్ని బట్టి ఆ పద్యాలకున్న సాహిత్య గౌరవం, ఆపద్యాల పట్ల ప్రజలకున్న అభిమానం ఎంతటిదో మనకు అర్థమవుతుంది. ప్రస్తుత సమాజపు పోకడను వ్యంగ్యంగా విమర్శిస్తూ కొందరు "లా" వొక్కింతయు లేదు అని అనడం కూడా పరిపాటయిపోయింది. ఒకనాటి ప్రాథమిక పాఠశాలలో "ఎవ్వనిచే జనించు" అన్న పద్యం ప్రతిరోజు ప్రార్థనా పద్యంగా ఉండేది. ఈ విధంగా పోతన భాగవత పద్యాలు ప్రజాబాహుళ్యంలోనికి చొచ్చుకొని వెళ్ళాయి.

---

*1. మల్లాది సూరిబాబు, ముఖాముఖి, విజయవాడ తేది : 26-6-2014*

# ప్రజా బాహుళ్యంలో...
# తీర్థుల వారి "శ్రీకృష్ణ లీలాతరఙ్గిణి"

16వ శతాబ్దంలో ఆంధ్రదేశం మొదలు గంగామైదానం వరకు తన భక్తి తరంగాలతో వర్ణాశ్రమ భేదం లేకుండా పండిత పామరులను కృష్ణనామ జపంలో ఓలలాడించిన భక్తాగ్రేసరులు శివనారాయణతీర్థ యతీంద్రులు. ఆయన కృష్ణలీలా తరంగాలలో మునకలు వేయని భక్తకోటి లేదు అనడంలో అతిశయోక్తి లేదు. భక్తి పారవశ్యంతో తరంగాలను పాడి ఆత్మానందానుభూతిని పొందిన భక్త శిఖామణుల పురిటిగడ్డ ఆంధ్రదేశం. తీర్థుల వారి ప్రభావం చేతనే ఇప్పటికీ కొన్ని నిమ్నజాతుల వారు నామాలు పెట్టుకొని భక్తి పారవశ్యంతో తరంగగానం చేయడం ప్రకాశంజిల్లాలోని శింగరకొండ, రాచపూడి, నాగులుప్పలపాడు, బ్రాహ్మణ నిడమానూరు ప్రాంతాలలో కనిపిస్తుంది.

ఈ తరంగాలకు ఇంత ప్రాచుర్యం కలగడానికి కారణం ప్రతి తరంగమూ ఆయా రాగాలలో తాళభేదాలతో పాడినా వినసొంపుగా ఉండటమే. తరంగ గానంలో నిష్ణాతులైన నాగరాజ సుబ్బారావు గారు (ఒంగోలు) అంగ, హస్తవిన్యాసాలు, జతులు వేస్తూ ఒకే తరంగానికి మూడు రోజులు నాట్యం చేస్తూ ఉంటే భక్తులు మైమరచి అలాగే చూస్తూ ఉండిపోయే వారుట. తరంగంలోని మాధుర్యం అలాంటిది. దీనికి తీర్థుల వారి భక్తివిశేషమే కారణం. జానపదులలో అక్షరజ్ఞానం లేనివాళ్ళు కూడా సంస్కృత భాషలో ఉన్న తరంగాలను మెచ్చుకుంటున్నారు, పాడుకుంటున్నారు, ఆనందిస్తున్నారు అంటే దానికి మొదటి కారణం భక్తి. రెండవది ఆయన తరంగాలలో గొప్ప లక్షణం ఏమిటంటే త్యాగరాజ కీర్తనలలాగా శాస్త్రీయసంగీతంలో కూడా పాడవచ్చు. రాగయుక్తంగా, తాళయుక్తంగా, అభినయించవచ్చు. మామూలు భజన సంప్రదాయంలో కూడా పాడుకోవచ్చు. ఈ విధంగా ఎవరి అనుకూలాన్ని బట్టి వాళ్ళు పాడుకోవచ్చు. ఈ ప్రధాన కారణాల మూలంగా ఇతర వాగ్గేయకారులెవ్వరికీ కూడా ప్రజలలోకి వెళ్ళనంతగా తరంగాలు సంస్కృత భాషలో ఉన్నప్పటికీ కూడా, అతడికి ఆ భాష అర్థం కాకపోయినా చొచ్చుకొనిపోయాయి.

భారతీయ సాహిత్యంలో వేదం యొక్క స్థానం చాలా ఉన్నతమైనది. వేదం అందరికోసం. అందరి హితం కోసం భగవంతుని ఆజ్ఞారూపంగా వెలువడింది. వేదాలలో ఉన్న విషయాన్ని నియమంగా అందరూ అధ్యయనం చేయవలసి ఉంటుంది. అలా అందరూ చేయలేరు కాబట్టి వేదంలో ఉన్న విషయం అందరికీ తెలియజెయ్యాలనే ఉద్దేశ్యంతో వేదవ్యాసమహర్షి దయతో వేదంలో ఉన్న విషయాన్ని పురాణంగా మనకు అందించాడు. పురాణాలన్నింటిలోనూ చిట్టచివరి పురాణం శ్రీమద్భాగవతం. ఆ విషయం భాగవతం ఆరంభంలో మనకు స్పష్టంగా తెలుస్తుంది. సమస్త వేదసారం, సమస్త పురాణసారం, గాయత్రీ మహామంత్ర భాష్యం, భారతార్థమైనటు వంటి భాగవతాన్ని ఆంధ్రుల అదృష్టమా అన్నట్లుగా పోతనమాత్యుడు తెలుగులో

మనకు అందించాడు. పోతనగారి భాగవతం లోకప్రియతను సంతరించుకున్నట్లుగా మరే ఇతర భారతీయ భాషలలో వెలువడిన భాగవతాలు ప్రజా బాహుళ్యంలో అంత ప్రసిద్ధిని పొందలేకపోయాయి. ఉదా: కేరళలో నారాయణీయానికి చాలా ప్రాచుర్యం ఉంది. కానీ అది సంస్కృతంలో ఉంది. పోతనగారు సంస్కృతంలో ఉన్న భాగవతాన్ని తెనుగు చేసి మనకు అందించాడు. ఆబాలగోపాలాన్ని అలరించాడు. మన ముందు తరాలకు కూడా కొందరికి పోతనగారి పద్యాలు రావు అంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఎందుకంటే చదువుకున్నవారికి, చదువుకోని వారికి ప్రతి ఒక్కరికి ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షం, రుక్మిణీ కళ్యాణం వంటివి ఘట్టాలకు ఘట్టాలే ఇప్పుడు చెప్పగలుగుతున్నారు.

ఇలా ప్రజాదరణ పొందిన పోతనగారి భాగవతంలోని దశమస్కంధ పూర్వభాగాన్ని మాత్రమే తీసుకొని తరువాతవాడైన తీర్థుల వారు శ్రీకృష్ణజననం మొదలు రుక్మిణీ కళ్యాణం వరకు యక్షగాన రూపంలో శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ గ్రంథాన్ని రచించారు.

ఆయా భజన బృందాల వారు ఏకాదశీ భజన గోష్ఠులు, సప్తాహాలలో తరంగాలను గానం చేస్తూ ఇవి సంస్కృతంలో రచింపబడ్డా అక్షరం పొల్లుపోకుండా పారవశ్యంతో పాడటం తీర్థుల వారి తరంగాలలోని భక్తి విశేషమే కారణం కాని మరొకటి కాదు.

వేద పనసలకు ఉన్నటువంటి శబ్దగంభీరత నారాయణతీర్థుల వారి తరంగాలకు ఉంది. ఈ గ్రంథం జయదేవుని గీత గోవిందంలోని అష్టపదులు, త్యాగరాజ కీర్తనల కన్నా తాళప్రస్తారంలో మేటిప్రకియ. కనుకనే వాటిని భక్తితో గానం చేసి ఎంతో మంది పునీతులైయ్యారు.

తరంగాలకు ఆయువు పట్టు గతి తప్పని లయ. కనుకనే యిది నారికేళపాకం. మృదంగం మీద నాటు, మీటు, చాటు శృతిలయ బద్ధంగా ఉంటేనే వాటి సమ్మిళిత ధ్వని తరంగాలే శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తాయి. శృతిలయల వల్లనే అనంత విశ్వంలోని గ్రహసముదాయం గమనం చేస్తున్నాయన్నది మహర్షులు కనుగొన్న సత్యం.

మృదంగం కుడిమూతను పరమశివుని జ్ఞాననేత్రంగాను, మూతపైన ఉండే పై వలయాకారం ఆ జ్ఞాన నేత్రం పైరెప్పగాను, రెండో వలయం అంటే మూత మధ్యలో ఉండే తెల్లని వృత్తాకారం తెల్లని గ్రుడ్డుగాను, మూత మధ్యలో ఉబ్బెతుగా ఉండే నల్లటికరిణ జ్ఞాననేత్రం నల్లని గ్రుడ్డుగాను శాస్త్రం వివరించింది. వీటి నుండి వెలువడే నాదస్పష్టతయే నాటు, మీటు, చాటు. ఇంతటి ప్రాచీనమైన మృదంగ వాయిద్యంపై భరతశాస్త్రానికి అనుగుణంగా 101 తాళప్రక్రియలలో ఆనాటి తరంగ విద్వాంసులు గానం చేస్తుంటే తన్మయత్వంతో శ్రోతలు లీనమైపోయేవారు. ఆ ప్రేరణతోనే అనేకులు తరంగాలను నేర్చుకొని గానం చేస్తూ కృష్ణభక్తి తత్పరులై తరువాత తరాల వారికి ఆదర్శప్రాయులయ్యారు. చరిత్రలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారు.

సంగీత సారాన్ని చిరుప్రాయంలోనే గ్రహించిన తీర్థుల వారు నాట్యశాస్త్రంలోను అపారమైన ప్రావీణ్యం సంపాదించారు. దాని ఫలితమే ఈనాడు యక్షగాన రూపంలో మన ముందున్న శ్రీకృష్ణ లీలా తరఙ్గిణీ గ్రంథం. గీతగోవిందకారుడు జయదేవ మహాకవి, తీర్థులవారు వీరిరువురిని 'సంపూర్ణ వాగ్గేయకారులు'గా విద్వాంసులు గుర్తించారు. దీనికి కారణం రెండింటిలోనూ ఉన్న కృష్ణభక్తి రసాయనమే. అదే విధంగా తీర్థులవారు అద్వైత రచనలో శంకర భగవత్పాదుల తర్వాత స్థానాన్ని ఆక్రమించారని చెప్పవచ్చును. ఇంతటి భక్తి విశిష్టత కలిగిన గ్రంథం కనుకనే ఒకప్పటి పాకనాటి సీమగా పిలువబడే నేటి ప్రకాశం జిల్లాలోని అనేక వంశాల వారు శ్రీకృష్ణ లీలా చరితామృతమైన కృష్ణలీలా తరంగాలను శ్రీకృష్ణుని యందు అచంచలమైన భక్తి విశ్వాసాలతో ఏకాహ, సప్తాహ, దశాహ, లక్ష్మీనారాయణుల కళ్యాణాలలో విశేషంగా పాడుకుంటున్నారు.

ఈ తరంగ గానశైలి చాలా విశిష్టమైనది; క్లిష్టమైనది కూడా. రాగం తాళం యీ ప్రక్రియకు చాలా అవసరం. శివనారాయణ తీర్థుల కృష్ణలీలా తరంగాలకు విశేష ఖ్యాతి తెచ్చిన వారిలో కూచిపూడి భాగవతుల కృషి ఎనలేనిది. కూచిపూడి భాగవతులకు తీర్థులకు గల సంబంధం భగవంతుని భక్తునికి గల సంబంధం మరియు గురుశిష్య సంబంధం.

భావరాగ తాళరసఝురి అయిన ఈ శ్రీకృష్ణలీలా తరంగిణిలో స్నాతులు కాని వారు లేరు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నిర్వహించే కూచిపూడి నాట్య సిలబస్‌లో తరంగాలు ముఖ్యంగా ఉన్నాయంటే నారాయణ తీర్థుల వారి రచనే దానికి కారణం మరియొకటి కూచిపూడి భాగవతులు దాని కొరకు చేసిన కృషి కూడా.

కృష్ణ భక్తి తరంగాలు, వాటిలో నిజమైన మధురతత్త్వాన్ని అనేక బరువైన తాళప్రక్రియల ద్వారా నృత్యసహితంగా వాడవాడలా భక్తుల హృదయాలలో చొచ్చుకుపోయే విధంగా చేయడంలో కూచిపూడి భాగవతులు కృతకృత్యులయ్యారు.

"బాలగోపాల కృష్ణ పాహి పాహి" తరంగాన్ని కూచిపూడి నృత్యకారులు విశేషంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. నర్తకునిగా నిరూపించుకోవాలి అంటే 'నీలమేఘశరీర నిత్యానందందేహి' అంటూ ఈ తరంగాన్ని నర్తించవలసిందే. 'వ్యత్యస్త పాదారవింద' అంటూ మన ముందు చిన్నికృష్ణుని దర్శింపచేయడంలో కూచిపూడి వారు ఘనత వహించారు. అదే విధంగా పండరీ, కోలాట భజన బృందాల వారు ఈ తరంగాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్ళడటంలో మిక్కిలి నేర్పును ప్రదర్శించారు. యీ విధంగా తరంగాలు ఆచంద్రతారార్కం నిలిచిపోయేవిధంగా చేయడంలో వీరి కృషి అనన్య సామాన్యం. కూచిపూడి భాగవతులు బాగా ప్రచారంలోకి తీసుకువచ్చిన తరంగాలు కొన్నింటిని యీ దిగువ ఉదహరిస్తున్నాను.

*జయజయస్వామిన్ జయజయ -1*

*జయజయ రమానాథ -2*

*శరణం భవకరుణామయి కురుదీనదయాళో -3*

*మంగళాలయ మామవదేవ -4*

*జయజయదుర్గే జితవైరివర్గే -5*

*కృష్ణం కలయసఖి సుందరం -6*

*కలయ యశోదే తవబాలం -7*

*గోవింద ఘటయ పరమానంద మమృతమిహ -8*

*ఆలోకయే శ్రీబాలకృష్ణం -9*

*బాలగోపాలకృష్ణ పాహి పాహి -10*

*బాలగోపాల కృష్ణ మాముద్ధర -11*

*పూరయమమకామం గోపాల -12*

*విజయగోపాలతే మంగళం -13*

*వీక్షేకదా దేవదేవం -14*

---

1. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 1 : పుట-2*
2. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 4 : పుట-12*
3. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 16 : పుట-33, 34*
4. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 21 : పుట-49*
5. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 1 : 24 : పుట-61, 62*
6. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 :11 : పుట-97*
7. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 12 : పుట-101*
8. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 2 : 17 : పుట-120, 121*
9. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 4 : పుట-126, 127*
10. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,3 : 13 : పుట-155*
11. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 3 : 14 : పుట-158*
12. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 6 : 6 : పుట-252*
13. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ, 9 : 9 : పుట-419*
14. *నారాయణ తీర్థులు, శ్రీకృష్ణ లీలా తరంగిణీ,12 : 4 : పుట-491*

*బ్రూహి ముకుందేతి -1*

*జయజయవైష్ణవి దుర్గే -2*

*మదనగోపాలతే మంగళం -3*

*శివశివ భవభవ శరణం -4*

ఈ విధంగా కూచిపూడి భాగవతుల నృత్యకౌశలంతో ఈ తరంగాలు వన్నెకెక్కినాయి. సుప్రసిద్ధ కూచిపూడి నాట్యకారులు పద్మశ్రీ వేదాంతం సత్యనారయణ శర్మ గారిని కలిసినప్పుడు పై విషయాన్ని ఎంతో ఆర్తితో నాకు వివరించారు. -5

ఆంధ్రదేశంలోని ఆకాశవాణి కేంద్రాలన్ని భక్తిరంజని కార్యక్రమంలో నారాయణ తీర్థుల తరంగాలను గత కొన్ని దశాబ్దాలుగా ప్రసారం చేస్తూనే ఉన్నాయి. అంతే కాక ఆకాశవాణిలో ప్రసారమైన తరంగాలను ఆకాశవాణీ వారు సి.డి.ల రూపంలోకూడా వెలువరించారు. ఇదే విధంగా పుంభావ సరస్వతిగా సంభావింపబడుతున్న మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారుకూడా కొన్ని తరంగాలను గానంచేసి సి.డి.ల రూపంలో విడుదల చేశారు. మరొక సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు శ్రీ కె.జె. ఏసుదాసు కూడా కృష్ణలీలా-తరంగిణి పేరుతో నారాయణ తీర్థుల తరంగాలను గానంచేసి సి.డి.ల రూపంలో విడుదల చేశారు.

ఈ సందర్భంలో నారాయణ తీర్థుల తరంగ విషయకంగా మల్లాది సూరిబాబు గారి కృషి ప్రత్యేకించి పేర్కొనవలసి ఉంది. నారాయణ తీర్థుల తరంగాలను స్వరంతో (నొటేషన్) ఒక గ్రంథాన్ని వెలువరించారు. అంతేకాక వారి కుమారులైన మల్లాది శ్రీరామ ప్రసాద్, మల్లాది రవికుమార్ (మల్లాది సోదరులు) తీర్థుల తరంగాలను వివిధ సంగీత సభలలో గానంచేయడంతో పాటు 4 సి.డి.లను కూడా విడుదల చేశారు. ఈ సి.డి.లలో 50కి పైగా తరంగాలు ఉన్నాయి. శ్రీ మల్లాది సూరిబాబు “తరంగ బోధన” శీర్షికతో తరంగాలను ఎలా పాడాలో వివరిస్తూ ఒక సి.డి.ని విడుదల చేశారు. ఈ సి.డి. తరంగాలను నేర్చుకోదలచిన వారికి ఎంతగానో ఉపకరిస్తుందనడంలో సందేహంలేదు.

---

1. *ప్రక్షిప్త తరంగము, పుట-565*
2. *ప్రక్షిప్త తరంగము, పుట-565, 566*
3. *ప్రక్షిప్త తరంగము, పుట-567*
4. *ప్రక్షిప్త తరంగము, పుట-568*
5. *వేదాంతం సత్యనారాయణ శర్మ, కూచిపూడి, తేది 3-3-2012*

మూడు సి.డి.లు ఇప్పటికే ప్రజాబాహుళ్యంలోకి వెళ్ళి ప్రజలలో సంగీత సౌరభాన్ని వెదజల్లుతూ, భక్తి భావాన్ని ప్రేరేపింప చేస్తున్నాయి. ఎందరో తరంగగానం చేస్తున్నప్పటికి తరంగ గాయకులుగా మల్లాది సోదరులకు ప్రత్యేక గుర్తింపు లభించడం విశేషం. కేవలం ఆంధ్రదేశంలోనే కాక ఇతర రాష్ట్రాలలోను, విదేశాలలోను వీరు తరంగగానాన్ని ప్రత్యేక దృష్టితో కొనసాగిస్తున్నారు.

నేను మల్లాది వారి కృషిని తెలుసుకొనటానికి వారిని కలిసినప్పుడు పై విషయాలన్నీ వివరిస్తూ సంభాషణను ఇలా కొనసాగించారు "నేను మా పిల్లల సంగీత సాధనను తరంగాలతోనే ప్రారంభించాను, తరంగాలలోని పల్లవి, చరణాలు పదేపదే పునరావృత్తం కావడంచేత సంగీత సాధనకు తరంగాలు ఎంతో అనువుగా ఉంటాయి. అంతేకాక లయజ్ఞానం కూడా బాగా పెంపొందే అవకాశం ఉంది." -1

ఈ సందర్భములో ప్రస్తావించవలసిన విషయం మరొకటి ఉంది. కూచిపూడి యక్షగానాలలోను, ఇతర పేరొందిన నాటకాలలోను నారద పాత్రధారి "శరణం భవ", "పూరయ మమ కామం" కీర్తనలను విరివిగా పాడేవారు. చింతామణి పాత్రలో ప్రముఖురాలైన శ్రీమతి లతాలక్ష్మి నటనాపరంగా ఆయా సందర్భాలలో అనేక తరంగాలు గానం చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

చలనచిత్ర రంగంలో కూడా ఈయన తరంగాలను వాడుకున్న సందర్భాలున్నాయి.

*శరణం భవకరుణామయి కురుదీనదయాళో* - *అనురాగం*

*బాలగోపాలకృష్ణ పాహి పాహి* - *దొంగరాముడు*

*ఆలోకయే శ్రీబాలకృష్ణం* - *శ్రుతిలయలు*

*కృష్ణం కలయసఖి సుందరం* - *పెళ్ళిపుస్తకం*

ఈ విధంగా యావదాంధ్రదేశంలోనే కాకుండా తమిళ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో కూడా నారాయణతీర్థుల వారి తరంగాలు ప్రచారంలో ఉన్నాయి. అన్ని వర్గాల వారి భజన, హరికథ, నాట్య, చెక్కభజన, గొబ్బిళ్ళ పాటలలో స్త్రీ పురుష కంఠాలలో ఈ తరంగాలు చోటు చేసుకుంటున్నాయి అంటే తీర్థుల వారి ప్రతిభే కారణం.

శ్లో॥ *జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః ।*
*నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్ ॥*

---

*1. మల్లాది సూరిబాబు, ముఖాముఖి, విజయవాడ తేది : 26-6-2014*

## అనుబంధం - 1



కృష్ణ లీలా తరఙ్గిణీ ప్రాశస్త్యం తెలుపుతున్న
బ్రహ్మశ్రీ వేదాంతం సత్యనారాయణశర్మ గారితో పరిశోధకుడు

## ముఖాముఖీ :
## పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణశర్మగారు, కూచిపూడి తేది : 3-3-2012

వేదాంతం సత్యనారాయణ శర్మగారు సుప్రసిద్ధ కూచిపూడి నాట్యాచార్యులు. కూచిపూడి నాట్యపురోభివృద్ధికి వీరు చేసిన కృషి ప్రశంసార్హం. సత్యభామ, ఉషా మొదలగు స్త్రీ పాత్రలు ధరించి తమ అద్వితీయ నాట్య ప్రతిభను ప్రదర్శించారు. శర్మగారు విదేశాలలో కూడా నాట్య పదర్శనలు ఇచ్చి మంచి కీర్తిని గడించడంతోపాటు కూచిపూడి నాట్యానికి కూడా మంచి గుర్తింపును గౌరవాన్ని ప్రపంచస్థాయిలో సాధించారు. ఈ కారణంగా భారతీయ కళల పట్ల ప్రధానంగా కూచిపూడి నాట్యం పట్ల విదేశీయులకు కూడా గౌరవాభిమానాలు ఏర్పడ్డాయి. నేను నా పరిశోధనకు సంబంధించి విషయసేకరణకు వారిని కూచిపూడిలో 3-3-2012 తేదీన కలిశాను.

**పరిశోధకుడు :** మీరు కూచిపూడి నాట్యంలో అపారమైన అనుభవాన్ని గడించారు. అయితే కూచిపూడి నాట్యంలో నారాయణ తీర్థుల తరంగాలకు మంచి ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలుగులో అపారమైన కీర్తనా సంపద ఉండగా తీర్థుల తరంగాలకు అంత ప్రాధాన్యం ఇవ్వడంలో అంతర్యం ఏమిటి?

**సత్యనారాయణగారు :** మీ ప్రశ్న చాలా సముచితంగా ఉంది. అన్నమాచార్య, త్యాగరాజు, క్షేత్రయ్య,

సారంగపాణి మొదలైన వారు అపారమైన సంపదను మనకు అందించారు. అయితే నారాయణ తీర్థుల తరంగాలకు పైన పేర్కొన్న వారి కీర్తనలకు కొంత వైవిధ్యం ఉంది. నారాయణ తీర్థుల తరంగాలు లయ ప్రధానంగా సాగుతాయి. అలా అని మిగతావారి రచనలలో లయలేదని కాదు. కానీ తీర్థులు లయకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు. తమ తరంగాలలో నాట్యం కూడా ప్రధానంగా లయత్మకంగా సాగుతుంది. కాబట్టి వీటిని కూచిపూడి నాట్యంలో స్వీకరిచడం జరిగింది. అంతేకాక తీర్థుల తరంగాలు ఏ ఒక్క తాళానికో పరిమితం కాకుండా ఏతాళంలోనైనా పాడుకోవడానికి అనువుగా ఉంటాయి. ఇది కూడా ఒక కారణం.

**పరిశోధకుడు :** మీరు తరంగాలకు అభినయం చేస్తున్నప్పుడు ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుంది?

**సత్యనారాయణగారు :** కూచిపూడి సంప్రదాయంలో సోలో ఐటమ్స్‌గా స్వరజతి, తరంగం, తిల్లానా మొదలగు వాటిని అభినయిస్తూ ఉంటాము. అయితే తరంగాల విషయానికి వస్తే నారాయణ తీర్థుల తరంగ రచనలో మనకు కనిపించే ప్రత్యేకత ఒకటి ఉంది. తరంగాలలో ప్రాస, అనుప్రాస, అంత్యప్రాసలతో కూడిన తరంగాలు ఉన్నాయి. ఆ తరంగాలను అభినయిస్తూ ఉన్నప్పుడు అభినయం కంటికి, తరంగ సాహిత్యం చెవులకు ఇంపును కలిగించి ప్రేక్షకుడు ఉత్సాహంతో కూడిన ఆనందానుభూతిని అనుభవిస్తూ ఉంటాడు. ఇది నేను స్వానుభవంతో తెలుసుకున్న విషయం. ఈ కారణంగానే మేము ఉషాపరిణయం, ప్రహ్లాద చరిత్ర వంటి కూచిపూడి యక్షగానాలలో నారద పాత్రధారి చేత తరంగ గానం చేయిస్తూ ఉంటాము. ఈ విధానం బహుళ ప్రజాదరణ పొందింది. కనుకనే తీర్థుల తరంగాలు ప్రజా బాహుళ్యంలోనికి అందునా సామాన్య ప్రజానీకం దగ్గరకు ఎంతో చేరువకాగలిగాయి.

ఈ విధంగా కూచిపూడి నాట్య సంప్రదాయంలో తరంగ ప్రదర్శనకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ఈ విధమైన ప్రజాదరణ మా కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించింది.



ముఖాముఖి : శ్రీ మల్లాది సూరిబాబు, విజయవాడ తేదీ 26-7-2014

మల్లాది సూరిబాబు గారిది సంగీత కుటుంబం కర్ణాటక శాస్త్రీయ సంప్రదాయానికి వీరిది పుట్టినిల్లు. వీరికి ఎప్పుడు ఫోన్ చేసినా ముందుగా తంబుర శ్రుతి వినిపిస్తుంది. సూరిబాబు గారికి వారి కుమారులు మల్లాది శ్రీరాం ప్రసాద్, రవికుమార్ (మల్లాది సోదరులు) లకు అంతర్జాతీయ స్థాయిలో గొప్ప కర్ణాటక సంగీత విద్వాంసులుగా మంచి గుర్తింపు ఉంది. విదేశాలలో కచేరీలు చేసి పాశ్చాత్యులను కూడా ఆనందింప చేయగలగడం మల్లాది సోదరులకు వెన్నతోపెట్టిన విద్య. సూరిబాబు గారి కుటుంబసభ్యులందరూ సంగీత విద్వాంసులు కావడం విశేషం. మల్లాది సూరిబాబు గారు నారాయణ తీర్థుల తరంగాలకు నొటేషన్స్ (స్వరాలు) సమకూర్చి పుస్తక రూపంలో వెలువరించారు. అంతేకాక తరంగ బోధన శీర్షికతో తరంగాలు నేర్చుకోనేవారి కనుగుణంగా ఒక సి.డి. వెలువరించారు. ఇది తరంగాల పట్ల ఆసక్తి కలవారికి ఎంతగానో ఉపకరిస్తుంది. సూరిబాబు గారి కుమారులు మల్లాది సోదరులుగా సుప్రసిద్ధులైన శ్రీరాంప్రసాద్, రవికుమార్ దాదాపు 50కి పైగా తరంగాలను గానంచేసి 4 సి.డి.లుగా సంగీతాభిమానులకు అందజేశారు. ఈ సందర్భంలో ప్రస్తావించవలసిన ముఖ్యవిషయం ఏమిటంటే తరంగాలకు ఎంతో ప్రాధాన్యమిచ్చి గానంచేస్తున్న సూరిబాబు గారు పోతన భాగవతంలోని 1200 పద్యాలను గానంచేసి సి.డి.లుగా వెలువరించారు. అటుతరంగానికి ఇటు పోతన భాగవత పద్యపఠనానికి సమప్రాధాన్యమిచ్చిన సూరిబాబుగారి కృషి అభినందనీయం. పరిశోధన విషయకంగా నేను 26-7-2014 తేదీన విజయవాడ వారి స్వగృహంలో కలిసి వారితో ముచ్చటించాను.

| | |
|---|---|
| పరిశోధకుడు : | సూరిబాబు గారూ! మీరు త్యాగయ్య, అన్నమాచార్య, రామదాసు మొదలైన వాగ్గేయ కారుల రచనలన్నీ సమర్థవంతంగా గానంచేసి అందరి మన్ననలను పాత్రులయ్యారు. అయితే నారాయణ తీర్థుల తరంగాల పట్ల మీరు ప్రత్యేక దృష్టితో కృషిచేయగలగడంలో గల ఆంతర్యం ఏమిటి? |
| సూరిబాబుగారు : | మీరు చెప్పింది నిజమే. కానీ నాకు తరంగాల పట్ల ప్రత్యేకమైన అభిమానం ఉంది. మా పిల్లల సంగీత సాధనను నేను తరంగాలతోనే ప్రారంభించాను. |
| పరిశోధకుడు : | తరంగ గానానికి గల విశిష్టత ఏమిటి? |
| సూరిబాబుగారు : | నారాయణ తీర్థుల తరంగాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. ఆయన ఉపయోగించింది సరళ సంస్కృతం. తరంగం సాధారణ దృష్టితో చదువుతున్నప్పుడే దానిలో లయ మనకు కనిపిస్తుంది. ఇంకా గానం చేసినప్పుడు ఆలయ ప్రస్ఫుటంగా శ్రోతలకు వినిపించి ఆహ్లాద పరుస్తుంది. అంతేకాక తీర్థుల రచనా శైలి ప్రధానంగా పదబంధాలు సంస్కృతం తెలియకపోయినా వినడానికి ఎంతో ఇంపుగా ఉంటాయి. మరొక ముఖ్య విషయం ఏమిటంటే ఇతర వాగ్గేయ కారుల రచనలు కూడా ఉదాహరణకు త్యాగరాజ కీర్తనలు తీసుకుంటే ఆ కీర్తనకు ఏ తాళం నిర్దేశింపబడిందో ఆ తాళంలోనే ఆకీర్తనను గానం చేయాలి. తీర్థుల తరంగాల విషయంలో అలాకాదు. ఏ తాళంలోనైనా తరంగాన్ని గానం చేయవచ్చు. ఇది గాయకునికి ఎంతో సౌలభ్యకరంగా ఉంటుంది. గాయకుని సామర్థ్యానికి గీటురాయి కూడా. |



**ముఖాముఖి : కస్తూరి సత్యనారాయణ వరప్రసాద్,**
**సద్గురు నారాయణ తీర్థ మందిరం, కాజ ది. 28-8-2014**

శ్రీ కస్తూరి సత్యనారాయణ వరప్రసాద్ గారు శ్రీమతి అన్నపూర్ణ, స్వామి శేఖరశర్మ దంపతులకు రేపల్లె తాలూకా ఇసుకపల్లి అగ్రహారంలో 27-12-1948 తేదీన జన్మించారు.

1960 నుండి సంగీత సాధన ప్రారంభించారు. పోతన, నారాయణ తీర్థుల జీవిత చరిత్రలను ఆయన హరికథలుగా చెబుతున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ పక్షాన గత 3 దశాబ్దాల నుండి ఉపన్యాసాలు, హరికథలు, తరంగ గానం మొదలైన తాత్త్విక కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. నేపాల్‌లో కూడా ఈయన తరంగాలు గానంచేసి అక్కడి వారిని ఆనందింపచేశారు. ప్రత్యేకించి అప్పటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు నుడి కూడా ప్రశంసలు పొందారు. ప్రస్తుతం కాజ గ్రామలోని నారాయణ తీర్థుల మందిరంలో ప్రతిఫలాపేక్ష లేకుండా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. తమ శేష జీవితాన్ని అక్కడే గడపాలని కోరుకుంటున్నారు.

పరిశోధకుడు : మీరు గత 3 దశాబ్దాలుగా నారాయణ తీర్థుల తరంగాలను, పోతన చరిత్రను గానంచేస్తున్నారు కదా! ఈ రెంటికీ ఎందుకు ప్రాధాన్యం ఇచ్చారు?

ప్రసాద్‌గారు : నేను రామదాసు, రుక్మిణీ కళ్యాణం మొదలైన ఇతర కథలను కూడా గానం చేస్తున్నాను. అయితే మీరన్నట్లు పై రెంటికి మాత్రం ప్రాధాన్యం ఇచ్చినమాట

యదార్థం. అందుకు కారణం వారిద్దరి అవ్యాజమైన భక్తి ప్రపత్తులే. నాకెందుకో చిన్నతనం నుండి పోతన పద్యాల పట్ల, తీర్థుల తరంగాల పట్ల ప్రత్యేకాసక్తి. దానితో వాటిపట్ల మక్కువ కూడా కలిగింది.

అంతేకాక "బాలగోపాల మాముద్ధర" తరంగాన్ని ఉధృతంగా గానం చేస్తున్న సమయంలో మా చిన్న కుమారుడు పుట్టినట్లు సమాచరం అదింది. అందుకే అతడికి బాలకృష్ణగా నామకరణం చేశాను.

పరిశోధకుడు : మీరు పోతన చరిత్రను హరికథగా చెప్పినప్పుడ, తరంగాలు గానం చేస్తున్నప్పుడు లభించిన స్పందన ఎలా ఉంది?

ప్రసాద్‌గారు : శ్రోతల నుండి మంచి స్పందన లభించేది. ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో తరంగాలను విని స్పందించిన వారి సంఖ్య ఎంతో ఎక్కువ. నాకు తెలంగాణా ప్రాంతంలో మంచి ఆదరణ లభించింది. మాజీ ప్రధాని పి.వి. నరసింహరావుగారి స్వగ్రామమైన వంగరలో (కరీంనగర్‌జిల్లా) తరంగగానం చేయండం, ప్రతిగా పి.వి. నన్ను ప్రశంసించడం జరిగింది.

పరిశోధకుడు : మీ భవిష్యత్ కార్యక్రమాలు ఏమిటి?

ప్రసాద్‌గారు : నాకు కుటుంబ పరంగా ఏ విధమైన బరువు బాధ్యతలు లేవు. ప్రశాంత జీవనం గుడుపుతున్నాను. శేష జీవితాన్ని తరంగ గానంతోను, హరికథా కాలక్షేపాలతోను గడపడమే ఆశయంగా పెట్టుకున్నాను. ప్రధానంగా తరంగాలను, పోతన పద్యాలను ప్రజలలోకి తీసుకువెళ్ళడమే నా జీవిత లక్ష్యం.

ఒకప్పుడు గ్రామ ప్రాంతాలలో కూడా పోతన పద్యాలకు, తీర్థుల తరంగాలకు మంచి ఆదరణ ఉండేది. క్రమంగా ఆ ఆదరణ తగ్గిపోయింది. అందుకు కారణాలు అనేకం. అయితే మళ్ళీ తరంగాల పట్ల, భాగవత పద్యాలపట్ల ప్రజాదరణ పెరగడానికి నా వంతు కృషిని కొనసాగించాలన్నది. నా సంకల్పం.




స్వర్గీయ మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు గారిచే ప్రారంభోత్సవం చేయబడిన
పోతన మందిరం




పోతన మందిరం లోపల శ్రీసీతారాముల విగ్రహములు మరియు పోతన గారి విగ్రహం



పోతన గారు నిత్యము దర్శించుకున్న బమ్మెర గ్రామములోని శ్రీ రామాలయం
ఇన్‌సెట్‌లో విగ్రహాలు



పోతన తండ్రి కేతనగారిచే నిర్మించబడిన బమ్మెర గ్రామములోని శివాలయం
ఇన్ సెట్‌లో శివలింగం.




బమ్మెర గ్రామములో పోతన మందిరం వద్దగల సీతారాముల పాదుకలు



పోతన నిర్యాణానంతరం దహన సంస్కారములు గావించిన ప్రదేశము




సద్గురు శ్రీ నారాయణతీర్థ ధ్యాన మందిరము, కాజ



ధ్యాన మందిరంలో గల శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహం



నారాయణ తీర్థుల జన్మస్థలం గుంటూరుజిల్లా, మంగళగిరి మండలం, కాజ గ్రామం
నారాయణ తీర్థ మందిరంలో గల తీర్థుల వారి చిత్రపటం



సద్గురు శివ నారాయణ తీర్థులు నిర్యాణము పొందిన చెన్నై రాష్ట్రం, తంజావూరుకు 16 కిలోమీటర్ల దూరంలోగల తిరుపుందుర్తి గ్రామములోని ఆలయం.

# ఆధార గ్రంథాలు

| క్రమ సంఖ్య | గ్రంథం | కవి | ప్రచురణ | కాలం |
|---|---|---|---|---|
| 1. | అమరకోశము | అమరసింహుడు | వావిళ్ళ రామశాస్త్రులు & సన్స్ | 1949 |
| 2. | అగ్ని పురాణం | వేదవ్యాస మహర్షి | శ్రీ వేంకటేశ్వర ఆర్ష భారతీ ట్రస్ట్ | |
| 3. | అభిజ్ఞాన శాకుంతలం | కాళిదాసు | నిర్ణయ సాగర ప్రెస్ | 1947 |
| 4. | అష్టాధ్యాయి | పాణిని మహర్షి | క్షేమరాజ్ శ్రీకృష్ణ దాసశ్రేష్ఠి | 1959 |
| 5. | ఆంధ్ర భాగవత విమర్శ | శ్రీప్రసాదరాయకులపతి | తి.తి.దేవస్థానములు | 1966 |
| 6. | ఆత్మబోధ | శంకరాచార్యులు | పరిమి విశ్వనాథం | 2012 |
| 7. | ఆంధ్రనాయక శతకము | శ్రీ కాసుల పురుషోత్తమకవి | నవోదయ బుక్‌హౌస్ | 2007 |
| 8. | ఈశాదిదశోపనిషదః | | మోతీలాల్ బనారసీదాస్ | 1964 |
| 9. | ఈశావాస్యోపనిషతు | | శ్రీ రామకృష్ణ మఠం | 2006 |
| 10. | ఉత్తర హరివంశము | శ్రీ నాచన సోమన | వఝుల వెంకట సుబ్రహ్మణ్య శర్మ | 1996 |
| 11. | ఉపనిషత్ కల్పతరువు | | ప్రార్థన గానప్రచారసంఘం | 2001 |
| 12. | ఉమాసహస్రం | వాశిష్ట గణపతి ముని | శ్రీరమణాశ్రమము | 2006 |
| 13. | ఐతరేయోపనిషత్తు | | శుక బ్రహ్మాశ్రమం | 2008 |
| 14. | కఠోపనిషత్ | | మోతీలాల్ బనారసీదాస్ | |
| 15. | కావ్యాలంకార సంగ్రహం | భట్టుమూర్తి | ఎమ్. శేషాచలం & కో | 1969 |
| 16. | కుమార సంభవమ్ | కాళిదాసు | వావిళ్ళ రామశాస్త్రులు & సన్స్ | 1940 |
| 17. | కృష్ణ యజుర్వేదం | | గోమఠం శ్రీనివాస జోషి | |
| 18. | కైవల్యోపనిషత్ | | చిన్మయారణ్యం పబ్లికేషన్స్ ట్రస్ట్ | 2007 |
| 19. | చతుర్వేదసంహిత | లోకమలహరి సిద్ధాంతాచార్యులు | వైదిక సాహిత్య ప్రచారసమితి | 2006 |
| 20. | చంపూ రామాయణం | భోజుడు | కందుకూరి సూర్యనారాయణ మూర్తి | 2009 |
| 21. | ఛాందోగ్యోపనిషత్ | | సీతారామ ఆదిశంకర ట్రస్ట్ | 2002 |
| 22. | తైత్తరీయోపనిషత్ | | రామకృష్ణమఠం | 2010 |
| 23. | నానార్థ రత్నమాల | నిరుగప దండనాథుడు | వావిళ్ళ రామశాస్త్రులు & సన్స్ | 1916 |
| 24. | నీతి శతకం | భర్తృహరి | రామా & కో | 1986 |
| 25. | పరిభాషేందు శేఖరము | నాగేశ్వర భట్టు | చౌకాంబా ప్రెస్ | |

| క్రమ సంఖ్య | గ్రంథం | కవి | ప్రచురణ | కాలం |
|---|---|---|---|---|
| 26. | పద్మ మహాపురాణము | వ్యాస మహర్షి | శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతీ ట్రస్ట్ | 1996 |
| 27. | పోతన సాహిత్యగోష్ఠి | ఆంధ్రా యూనివర్శిటీ ప్రెస్ | ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి | 1983 |
| 28. | భక్తిరసామృత సింధుః | రూపగోస్వామి | గౌడీయ మఠం | 1985 |
| 29. | భక్త పోతన మహాభాగవత రచన | శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి | శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి | 1977 |
| 30. | భాగవతం | పోతన | తి.తి.దేవస్థానములు | 2004 |
| 31. | భాగవతం, 2వ సంపుటం | పోతన | తి.తి.దేవస్థానములు | 2004 |
| 32. | భాగవతం, 3వ సంపుటం | పోతన | తి.తి.దేవస్థానములు | 2004 |
| 33. | భారత వైజయంతిక (వ్యాస సముచ్ఛయము) | కరుణశ్రీ | ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ | 1983 |
| 34. | భాగవతానుశీలనము | జి.డి.నాయుడు, అభినందన సమితి | ఆచార్య జక్కంపూడి మునిరత్నం | 2011 |
| 35. | బ్రహ్మసూత్ర దర్శనం | శ్రీనోరి శ్రీనాథ వేంకట సోమయాజులు | రామకృష్ణ పబ్లికేషన్స్ | 1989 |
| 36. | బృహదారణ్యకోపనిషత్ | | మోతీలాల్ బనారసీదాస్ | |
| 37. | భోజ ప్రబంధం | శ్రీ బల్లాలుడు | ది నిర్ణయసాగర ప్రెస్ | 1867 |
| 38. | మాండూక్యోపనిషత్ | | రామకృష్ణ మఠం | 2009 |
| 39. | మహా భారతం – వ్యాస భగవానుడు | మాడభూషి జ్యోతి కుమారి (ప్రతివాది భయంకరం) | మాడభూషి (ప్రతివాది భయంకరం) | 2007 |
| 40. | యాజుష స్మార్త మంత్ర పాఠనము | చల్లా లక్ష్మీనారసింహ శాస్త్రి | శ్రీ లక్ష్మీనరసింహా ప్రెస్ | 1998 |
| 41. | రాయవాచకం | కాశీవిశ్వనాథ నాయనయ్యవారి స్థానాపతి | ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ | 1982 |
| 42. | రాజయోగము | పతంజలి | స్వామి అనన్యానంద | 1982 |
| 43. | విజ్ఞాన సర్వస్వం | తెలుగు భాషా సమితి | 1961 | |
| 44. | విష్ణు సహస్రనామ స్తోత్రం | శంకరభాష్య సహితము | సాధన గ్రంథమండలి | 1974 |
| 45. | వివేక చూడామణి | ఆదిశంకరాచార్యులు | శ్రీరామకృష్ణ మఠం | 1986 |
| 46. | విశ్వకోశము | మహేశ్వర సూరి | వావిళ్ళ రామశాస్త్రులు & సన్స్ | 1931 |
| 47. | వీరభద్ర విజయం | పోతన | వావిళ్ళ రామశాస్త్రులు & సన్స్ | 1970 |
| 48. | శబ్దరత్నాకరము | బహుజనపల్లి సీతారామాచార్యులు | చెన్నపట్టణపు దేశభాషా గ్రంథకరణ సభ | 1912 |

| క్రమ సంఖ్య | గ్రంథం | కవి | ప్రచురణ | కాలం |
|---|---|---|---|---|
| 49. | శ్వేతాశ్వతరోపనిషత్ | | రామకృష్ణమఠం | 2009 |
| 50. | శ్రీకృష్ణ లీలా రహస్యామృతము | శ్రీ ధూళిపాళ సూర్యనారాయణమూర్తి | ప్రశాంతి ప్రింటర్స్ & పబ్లిషర్ | 1996 |
| 51. | శ్రీకృష్ణ లీలా తరంగిణీ | నారాయణ తీర్థులు | కొండపల్లి వీరవెంకయ్య & సన్స్ | 1948 |
| 52. | శ్రీమద్భారతం | వేదవ్యాస మహర్షి | రామశాస్త్రులు & సన్స్ | |
| 53. | శ్రీరామకర్ణామృతం | శంకరాచార్యులు | కొండపల్లి వీరవెంకయ్య | 1929 |
| 54. | శ్రీ మద్భాగవతం | వ్యాసమహర్షి | గీతాప్రెస్ | 2006 |
| 55. | శ్రీమహాభాగవతం | పోతన | ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ | 1983 |
| 56. | శ్రీ రుక్మిణీ కళ్యాణం | పోతన | శ్రీ పావని సేవాసమితి | 2006 |
| 57. | శ్రీ ఆదిత్యారాధన | డా॥ ఆదిపూడి వెంకట శివసాయిరాం | మోహన్ పబ్లికేషన్స్ | 2008 |
| 58. | శ్రీ నారదభక్తి సూత్రములు | వ్యాసమహర్షి | లక్ష్మీ ప్రెస్ | 1957 |
| 59. | శ్రీ కృష్ణ కర్ణామృతము | లీలాశుకుడు | సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్ | 2008 |
| 60. | శ్రీగర్గ సంహిత | గర్గాచార్యుడు | గీతాప్రెస్ | |
| 61. | శ్రీ మదాంధ్ర మహాభాగవతానుశీలనము | శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి | శ్రీ ధూళిపాళ శ్రీరామమూర్తి | |
| 62. | సంగ్రహ ఆంధ్రవిజ్ఞాన కోశము | శ్రీ పిల్లలమర్రి దేవనాగనిక | సంగ్రహ ఆంధ్రవిజ్ఞాన కోశసమితి | 1966 |
| 63. | సాంఖ్యప్రవచన భాష్యం | విజ్ఞానభిక్షు | ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్ | 1856 |
| 64. | సిద్ధాంత కౌముదీ | భట్టోజీ దీక్షితులు | భీమరాజ్ శ్రీకృష్ణదాస్ | 1959 |
| 65. | సింహాసనద్వాత్రింశిక | కొరవి గోపరాజు | ఆంధ్రసాహిత్యపరిషత్ | 1933 |
| 66. | హరివంశము | శ్రీ ఎఱ్ఱాప్రెగడ | వావిళ్ళ రామశాస్త్రులు & సన్స్ | 1967 |
| 67. | గోపాలతాపిన్యుపనిషత్తు | | ప్రార్ధనాగాన ప్రచార సంఘం | 2004 |
| 68. | శ్రీమదాంధ్ర మహాభారతం ఉద్యోగ పర్వం | తిక్కన | తి.తి.దేవస్థానములు | |
| 69. | శ్రీమద్భాగవత మహాపురాణం 1వ భాగం | వ్యాసమహర్షి | గీతాప్రెస్ | 1975 |
| 70. | శ్రీమద్భాగవత మహాపురాణం 2వ భాగం | వ్యాసమహర్షి | గీతాప్రెస్ | 1976 |
| 71. | **A Bridge Edition of Works of Vivekananda** | ***Smamy Ananyananda*** | ***Advaita Ashrama Mayavati*** | ***1985*** |